శ్రీ మదాంధ్ర వచన

# కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత

1



ఎమెస్కో
ఆర్షభారతి

అక్షర వాచస్పతి

## డాక్టర్ దాశరథి రంగాచార్య

14512

ఓం

శ్రీమదాంధ్రవచన

# కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత

ఎమెస్కో
ఆర్షభారతి
॥అందరికీ వేదవిజ్ఞానము॥

అక్షర వాచస్పతి

డాక్టర్ దాశరథి రంగాచార్య

శ్రీమదాంధ్రవచన కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత
అక్షరవాచస్పతి
డా॥ దాశరథి రంగాచార్యులు

294.112
రంగా - కృష్ణ

ప్రథమ ముద్రణ :
విక్రమనామ సంవత్సర ఉగాది

ప్రచురణకర్తలు :
ఎమెస్కో ఆర్షభారతి
ఏలూరు రోడ్డు, విజయవాడ
ఫోన్స్ 0866-577498, 575281

7447
Cat -1600

ప్రింటర్స్ :
వాసు ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ, ఫోన్ 438324

కంపోజింగ్
పల్లవి గ్రాఫిక్స్
హైదరాబాద్, ఫోన్ 3222335

9 సంపుటముల మూల్యము : రూ.2950/-
U.S. $ 100

పంపిణీ దారులు :
శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో
విజయవాడ, విశాఖపట్నం, కడప

స్టూడెంట్స్ బుక్ సెంటర్
ఖమ్మం

ఎస్ వి బుక్ లింక్స్
నెల్లూరు.

...గ్రంథాలయ సంస్థ
A C.No. 94512
...హైదరాబాద్-500032

# అంకితం

సకల కార్యాలూ భగవదనుగ్రహం వల్లనే జరుగుతాయి. వేద అనువాదం అనే అసామాన్య కార్యాన్ని జగన్నాథుడు నావంటి సామాన్యునితో చేయించాడు.

శ్రీమదాంధ్ర కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహితమును జగన్నాథపురిలో వేంచేసి ఉన్న బలభద్ర, సుభద్ర, కృష్ణపరమాత్మకు పత్రం, పుష్పం, ఫలం తోయంగా, శరణాగత ప్రపన్నుడనై అంకితం సమర్పించుకుంటున్నాను.

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం జనార్దనా ।
యత్కృతంతు మయాదేవా పరిపూర్ణం తదస్తుతే ॥
ఉపచారాపదేశేన కృతానహరహన్మయా ।
అపచారానిమాన్ సర్వాన్ క్షమస్వ పురుషోత్తమ ॥

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।
గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు ।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః

డాక్టర్ దాశరథి రంగాచార్య

మారేడుపల్లి,
సికిందరాబాదు.
కల్యాది 5100 ప్రమాధి పుష్య పూర్ణిమ
21-1-2000.

# కృష్ణపక్షం

వాగర్థా వివ సంపృక్తౌ, వాగర్థ ప్రతిపత్తయే ।
జగతః పితరౌవందే, పార్వతీ పరమేశ్వరౌ ॥

ఇది ప్రార్థన. అర్థన అంటే అడగడం, కోరడం. ప్రార్థన చక్కగా, శుచిగా, శుభ్రంగా, పవిత్రంగా అర్థించడం. ఈ అర్థించడం ఎవరిని? ఉన్నవాణ్ణి - ఇవ్వగలవాణ్ణి. ఉన్నవాడు. ఇవ్వగలవాడు ఎవడు? సృష్టి, స్థితి, లయ కర్త పరాత్పరుడు. అంతా అతనిదే. ఈశా వాస్యమిదంసర్వం. అతడు చరాచర జగత్తుకు తల్లీ - తండ్రీ - 'త్వమేవ మాతాచ పితాత్వమేవ' బిడ్డ తల్లి రొమ్మును తంతుంది. ముఖం రక్కుతుంది. తల్లి కోపగించుకోదు. కొట్టదు. మురిసిపోతుంది. ముద్దాడు తుంది. అమృతం వంటి చనుబాలిస్తుంది. తనయ / తనయుడు లక్ష తప్పులు చేయును గాత. 'నాన్నా!' అంటే తండ్రి కరిగి పోతాడు. ఉన్నది సొంతం దోచి ఇస్తాడు.

భగవానుడు ఈశ్వరుడు. సమస్తమూ అతనిదే! అతడు కరుణామయుడు - కరుణా సముద్రుడు - బిడ్డ ఆర్తనాదం వింటాడు. ఉరుకుతాడు.

గజేంద్రుడు మొసలి వాతపడ్డాడు. సకల ప్రయత్నాలు చేశాడు. ఓడాడు. "నీవే తప్ప నితః పరంబెరుగ మన్నింపం దగున్ దీనునిన్ / రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా" అని మొత్తుకున్నాడు.

అప్పుడు స్వామి ఎలా ఉన్నాడు. 'రమావినోది' అయి ఉన్నాడు. లక్ష్మీ దేవితో సరస సల్లాపాలలో ఉన్నాడు. విన్నాడు:- "విప్పాల నాగేంద్రము 'పాహి పాహి' యన గుయ్యాలించి సంరంభియై"

**సిరికింజెప్పడు  శంఖ చక్ర యుగముంజేదోయి సంధింపడే**
**పరివారంబును జీరడభ్రగపతిం బన్నింప దాకర్ణికాం**
**తర ధమ్మిల్లము జక్కనొత్తడు వివాద ప్రోద్ధత శ్రీ కుచో**
**పరి చేలాంచల మైన వీడడు గజప్రాణావ నోత్సాహియై**

స్వామి గజప్రాణం రక్షించాలనే ఆవేశంలో బయలు దేరాడు! ఎలా?

లక్ష్మికి చెప్పడు. రెండు చేతుల్లో శంఖచక్రాలు ధరించడు. భృత్యులను పిలవడు. గరుడుని కోసం చూడడు. చెవుల మీద పడిన జుట్టును సవరించడు. లక్ష్మీదేవి చన్నుల మీద చెంగునైనా వదలడు.

ఈ పద్యాన్ని గురించి ఒక కథ ఉంది. భక్త శిఖామణి పోతనామాత్యునికి ఈ పద్యం సందిగ్ధం అయింది. గంటం తాళ పత్రాలు వదిలాడు. నదీతీరానికి వెళ్తానని భార్యతో చెప్పాడు. వెళ్లాడు. అటువెళ్లాడో లేదో మరలి వచ్చాడు. గంటం అందుకున్నాడు. పద్యం పూర్తి చేశాడు. భార్యతో అన్నం పెట్టించుకున్నాడు. భోం చేశాడు. వెళ్లాడు. అప్పుడు పోతన పద్యం స్ఫురించిందని వచ్చాడు. భార్య చకితురాలయింది. 'ఇప్పుడే కదా పద్యం పూరించి, భోం చేసి వెళ్లారు' అన్నది. పోతన గబగబా పద్యం చదివాడు. అతనికి కన్నీరు మున్నీరయింది.

'ఎంత అదృష్టవంతురాలవే! ఆ వచ్చిన వాడు రాముడు. నీకు దర్శనం ఇచ్చాడు! నీ చేత భోజనం చేశాడు!! నేనెంత పాపాత్ముణ్ణి!!! నాకు దర్శనం సహితం ఇవ్వలేదు' అని తల బాదుకొని ఏడ్చాడు.

"సిరికింజెప్పడు..........." అంత మహత్తరం అయిన పద్యం!!!

శ్రీనాథ మహా కవి పోతనకు బావ. అతడు ఈ పద్యం విన్నాడు. ఆ శ్రీహరి వట్టి చేతుల్తో గజేంద్రుని ఎలా రక్షిస్తాడు! బావా అని ఎగతాళి చేశాడు!

శ్రీనాథుడు, పోతన భోజనాలు చేస్తున్నారు. పెరుగన్నం లో ఉన్నారు. బావిలో ఏదో పడిన చప్పుడు. శ్రీనాథుని కూతురు బావిలో పడ్డదని వార్త. శ్రీనాథుడు పెరుగన్నం చేత్తో బావి దగ్గరకు పరిగెత్తాడు. 'బావా! తాడూ బొంగరం లేకుండా ఎలా కూతురును రక్షిస్తావ' ని పోతన పరిహాసం చేశాడు. అప్పుడుగాని శ్రీనాథునికి తండ్రి యాతన - "సిరికింజెప్పడు....." పద్యం అర్థం కాలేదు.

బావిలో పడ్డది బండ. శ్రీనాథుని కూతురుకాదు.

"సిరికిం జెప్పడు......" గురించి ఇంత కథ. అది అంత గొప్ప పద్యం. ఆపద్యం ఆపన్న ప్రసన్నులను గురించి జగత్పిత శ్రీమన్నారాయణుని ఆవేదన, ఆతురత, ఆత్రం వ్యక్త పరుస్తుంది.

ఉన్నవాడు, ఇవ్వగలవాడూ పరాత్పరుడే. కావున భగవానుని ప్రార్థించి ఏ కార్యమైనా ప్రారంభించాలి.

ఏకార్యం ప్రారంభించడానికైనా, సాగించడానికైనా, పూర్తి చేయడానికైనా ఏకాగ్రత అవసరం. మనసు మరొక చోట ఉన్నవాడు కార్యం సాధించ జాలడు. అతడు విఫలుడు అవుతాడు. క్రుంగుతాడు. కూల్తాడు. కార్యారంభంలో ప్రార్థన ఏకాగ్రత ప్రసాదిస్తుంది. ఏకాగ్రతతో కార్యం సఫలం అవుతుంది. జీవితం విజయవంతం అవుతుంది.

"వాగర్థావివ......" శ్లోకం 'కవికుల గురువు' 'సకల కవికుల శిరోరత్నం' కాళిదాస మహాకవిది. **ఆకసం వంటిది ఆకాశమే - సూర్యుని వంటివాడు సూర్యుడే. కాళిదాసు వంటివాడు కాళిదాసే! 'ఉపమా కాళిదాసస్య' కాళిదాసుదే ఉపమాలంకారం. అతనికి ఉపమానంలేదు! అంతటి కవీశ్వరుడాతడు.**

కాళిదాసు 'రఘువంశం' 'కుమారసంభవం' 'మేఘసందేశం' 'ఋతుసంహారం' కావ్యాలు సృష్టించాడు. 'మాళవికాగ్నిమిత్రం' 'అభిజ్ఞాన శాకుంతలం' 'విక్రమోర్వశీయం' అనే నాటకాలను రచించాడు.

'అభిజ్ఞాన శాకుంతలం' అతిలోక సుందరి. "కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు శకుంతలా, తత్రాపి చతుర్థోంకః తత్రశ్లోక చతుష్టయం"

కావ్యాలలో నాటకం రమ్యం. నాటకాల్లో శంకుంతల. అందులో నాలుగవఅంకం. అందులో నాలుగుశ్లోకాలు!

ఆ నాలుగు శ్లోకాలూ వివరించాలనే ఆతురత ఉంది. కండూతి ఉంది. కాని ఇది సందర్భంకాదు.

గోయత్ అనే జర్మన్ విద్వాంసుడు శాకుంతలం చదివి గంతులు వేశాట్ట! శాకుంతలం చదివి, ఆనందించడానికే సంస్కృతం నేర్చినవారున్నారు. అంత అందం కాకున్నా అది అన్ని భాషాల్లోనూ ఉంది. మీకు చదవాలనిపించవచ్చు. కాని మీకు దొరకదు. మనం సాంస్కృతిక బానిసలం. మనకు అమెరికా ఇంగ్లీషు పుస్తకాలు తప్ప దొరకవు! ఆ పుస్తకాలే హస్తభూషణం!

శాంతారాం నలుపు తెలుపులో గత శతాబ్దపు నాలుగవ దశకంలో శకుంతల పిక్చర్ తీశాడు హిందీలో. మళ్లీ ఏడవదశాబ్దంలో అనుకుంటా "స్త్రీ" అని కలర్ పిక్చర్ తీశాడు. అదీ శాకుంతలమే. అద్భుతంగా తీశాడు. శాంతారాంకు భారత సంప్రదాయం ప్రాణం. అతని పిక్చర్లన్నీ భారత సంప్రదాయ ప్రదర్శనలే!

మా బాల్యంలో ఆంధ్ర, సంస్కృత గ్రంధాలు తప్ప ఇంగ్లీషు పుస్తకం ఉంటుందనే ఎరగం. ఇంగ్లీషు వాడు అర్ధశతాబ్దంలో సంస్కృతం - భారత సంస్కృతిని మాయం చేయడంలో నూటికి వేయి పాళ్లు విజయం సాధించాడు! మనను వెధవాయలను చేశాడు!! మనం వెధవలమనీ ఎరక్కుండా చేశాడు!!!

కవికుల గురువు కాళిదాసుకు వాల్మీకి మహర్షి ఆరాధ్యుడు. కాళిదాసుకు తెలియకుండానే రామాయణంలోని అనేకానేక శ్లోకాలు కాళిదాసు కావ్యాల్లో చేరాయి. కాళిదాసు రఘువంశం రచన ప్రారంభించాడు. రఘువంశం - రాముని వంశ చరిత్ర. కాళిదాసు భయపడుతున్నాడు!

**మందః కవియశః ప్రార్థీ, గమిష్యా మ్యుపహాస్యతామ్ ।**

**ప్రాంశు లబ్ధే ఫలే లోభా, దుద్బాహురివ వామనః ॥**

నేను మందబుద్ధిని. వాల్మీకి అంతటి కీర్తి ఆశిస్తున్నాను. నేను నవ్వుల పాలవుతున్నాను.

అందుకు కాళిదాసు 'ఉపమ' ను ఆస్వాదించండి. మీ ముందు బొమ్మ నిలుస్తుంది.

అది పొడవు చెట్టు. దానికి పళ్లున్నాయి. పొడుగు వానికి మాత్రమే అందుతాయి. పొట్టివాడు చేతులెత్తి ఎగురుతున్నాడు! నవ్వుల పాలుకాడా?

పొడవు చెట్టు రామాయణం. ఆజానుబాహువు వాల్మీకి. వాడి ఫలములు యశస్సు. వాటిని వాల్మీకి అవలీలగా అందుకో గలడు. వాల్మీకి ముందు కాళిదాసు వామనుడు. పొట్టివాడు. అతడు ఆ ఫలాలు అందుకోవాలను కుంటున్నాడు! చేతులెత్తి ఎగరుతున్నాడు!

ఇది వాల్మీకి ముందు కాళిదాసు వినయ విధేయత.

**వాగర్థావివ సంపృక్తౌ, వాగర్థ ప్రతిపత్తయే!**
**జగతః పితరౌ వందే, పార్వతీ పరమేశ్వరౌ!!**

తాత్పర్యం ఆనందించండి.

పార్వతీ పరమేశ్వరులు ఆది దంపతులు. వారే జగత్తుకు పితరులు - తలిదండ్రులు. వారి దాంపత్యం ఎలాంటిది? మాట, అర్థం కలసిపోయినంతటిది. ప్రతిమాటకూ అర్థం ఉంటుంది. ప్రతి అర్థానికి ఒకమాట ఉంటుంది. ఈ రెండూ పాలు, తేనె లా కలసే ఉంటాయి. విడదీయరాదు. శివస్వామి అర్ధనారీశ్వరుడు. తనమేననే పార్వతిని ధరించాడు !

వాగర్థావివ సంపృక్తులైన జగతః పితరులగు పార్వతీ పరమేశ్వరులను - రఘువంశ కావ్యాదిలో - ప్రార్థిస్తున్నాను. ఏం కావాలని ప్రార్థిస్తున్నాడు? తన ప్రతిమాటా అర్థవంతం కావాలని. వాక్యం అర్థవంతం అవుతే గాని కావ్యం కాదు. "వాక్యం రసాత్మకం కావ్యం"

కాళిదాసు పలు చోట్ల వాల్మీకిని అనుసరించాడని చెప్పాం. ఈ సందర్భాన్ని పరిశీలిద్దాం:-

వాల్మీకి సహితం - కాళిదాసు వలెనే - రామాయణం రచించడానికి వెనకాడాడు. అప్పుడు బ్రహ్మ అంటున్నాడు:-

"నతే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి
కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్"

కావ్యంలో ఎక్కడా నీవు చెప్పింది అబద్ధం కాదు. పుణ్యం, శ్లోకబద్ధం, మనోహరం అయిన రామాయణం రచించు.

వాల్మీకికి బ్రహ్మ 'అబద్ధం కాని వాక్యం' వరం ఇచ్చాడు. కాళిదాసు అదేవరం 'వాగర్థప్రతిపత్తయే' అర్థిస్తున్నాడు.

రామాయణంలో సీత తనకూ, రామునికి గల అనన్య సంబంధాన్ని ప్రవచిస్తున్నది:-

"అనన్యా రాఘవేణాహం - భాస్కరేణ ప్రభాయధా"

నేనూ, రాముడు సూర్యుడు - కాంతివలె అనన్యులం.

"వాగర్థావివ........." మీద "అనన్యా........." ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

## వేదం

గోభి ర్విప్రైశ్చ వేదైశ్చ సతీభి స్సత్యవాదిభిః
అలుబ్ధై ర్దానశీలైశ్చ సప్తభిర్ధార్యతే మహీ ॥

గోవులు, విప్రులు, వేదాలు, పతివ్రతలు, సత్యవచనులు, లుబ్ధులు కానివారు, దానశీలురు ఈ ఏడుగురి వల్లనే భూమి నిలిచి ఉంది.

'భూమి వ్రేలాడు తున్నది' అని యజుర్వేదం ప్రవచించింది. భూమి నిరాధారంగా నిలిచి ఉంది. గాలిలో తేలియాడు తున్నది. రాలకున్నది. నిలిచి ఉన్నది. అట్లా ఎట్లా ఉన్నది! "శ్రీమహా విష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య" శ్రీమహా విష్ణువు ఆజ్ఞాపించాడు. భూగోళం ఆకాశంలో, గాలిలో, ఏ ఆధారం లేకుండా నిలిచి ఉంది! ఇది భౌతికం.

ఈ భూమండలం మీదనే సకల ప్రాణిజాలం నివసిస్తున్నది. అగ్ని, వరుణ, వాయు దేవుల సహితంగా నరుడు మహీతలం మీదనే నివసిస్తున్నాడు. వేదం వారికోసం ఒక సమాజం, ఒక జీవన విధానం ఏర్పరిచింది. ఇవి నిరంతరం సాగాలంటే 'ధర్మం' అవసరం. ధర్మం కొనసాగాలంటే ఏడింటి అవసరాన్ని శ్లోకం వివరించింది.

## 1. గోవులు

గోవునకు వేదం ఎంతో ప్రాముఖ్యత నిచ్చింది. గోవును పవిత్రంగా భావించింది. గోవును దేవత అన్నది. అంతేగాని గోవధ నిషేధించలేదు. యజ్ఞ యాగాదుల్లో గోవును బలి ఇచ్చిన నిదర్శనాలున్నాయి. నాడు మాంసమే ఆహారం. నిషేధమేల? **నేటి గోవధ నిషేధం కేవలం రాజకీయ వివాదం!**

'గోవు' 'అశ్వం' కూడ ఆ నాటి ఆహారం అయినాయి. ఆకలికి తాళలేక విశ్వామిత్ర మహర్షి  కుక్క మాంసం తిన్నాడు. ఇవాళ్టికీ మాంసాహారం తప్పేం కాదు.

మానవుడు సుఖజీవనం సాగించడానికి భారతదేశంలో జరిగినంత నిరంతర పరిశోధన, పరిశ్రమ మరొక చోట జరగలేదు. ఆహారం విషయంలో జరిగిన పరిశోధనల్లో శాకాహారం శ్రేష్ఠం అని తేలింది. జైన, బౌద్ధ సిద్ధాంతాలు జీవకారుణ్యం బోధించాయి. అప్పుడు మాంసాహారం అధమం అయింది. **నేటి మన ఆహారంలోని వ్యంజనాలు ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయి. పాశ్చాత్యులు పరిశోధనలు చేసి వాటి ప్రాముఖ్యాన్ని ఇప్పుడు గుర్తించడానికి ఇంకా ప్రయత్నిస్తున్నారు! పరిశోధనలు ఎందుకు మనం కలకాలంగా వాడుతున్నాం కదా! అంటే పరిశోధన ఒక వ్యాపారం! ఇవ్వాళ అవునన్న పరిశోధనే రేపు కాదంటుంది! ఏది సత్యం?**

ఇవాళ భారతదేశం శాకాహారం మీద విశ్వాసం ఉన్న దేశం. పాశ్చాత్యులు ఇప్పుడు శాకాహారపు విశిష్టతను గుర్తిస్తున్నారు! కాని ఇంకా గొడ్డుమాంసం Beef  పంది మాంసం Pork తిని బ్రతుకున్నారు. **ఈ తెలుపు రంగు మేధావులు యజ్ఞంలో పశుబలి 'ఆర్యుల ఆటవిక జీవనం' అంటున్నారు. వేదం 5000 సంవత్సరాలదని పాశ్చాత్య విద్వాంసులు అంగీకరిస్తున్నారు. 5000 సంవత్సరాల క్రితపు పశుబలి ఆటవికం అయితే పొట్ట నింపుకోవడానికి రోజూ లక్షల పశువులను హత మారుస్తున్న జాతి ఆటవికం కంటే అధ్వాన్నం కదా! వేయేళ్ల చరిత్ర గల ఆధునిక యురొపు 400 ఏళ్ల చరిత్ర గల అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు పదుల వేల ఏళ్ల నాగరకతను ఏర్పరచిన వేదాన్ని ఆటవిక జీవనం అంటున్నాయండీ! ఇది గ్రుడ్లు వచ్చి తల్లిని వెక్కిరించడం లాంటిది. ఇది అధికారమదం. సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం అస్తమించింది! మిగతావీ అస్తమించాలి!! ఇది ప్రకృతి శాసనం. తప్పదు. ఇంతలో ఈ మిడిసి పాటేల?**

"కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే

వారేరీ సిరి మూట గట్టుకొని పోవంజాలిరే భూమిపై" ఇది నిత్య సత్యం.

ఆవు పాలను గురించి వేదం బహుధా ప్రశంసించింది. ఏనాడైనా పాడి ఆహారానికి తప్పనిసరి. ఎంతో ఆధునికం అనుకుంటున్న ఈ కాలంలోనూ పాడి తప్పని సరి. పాడికి గోవు అవసరం. పాడి జీవనాధారం.

భారత వ్యవసాయానికి ఈ నాటికీ పశువే పట్టుగొమ్మ.

యజ్ఞానికి నేయి అవసరం. ఆహారానికి సహితం ఘృతం తప్పని సరి. "ఘృతంవినా భోజనమప్రశస్తం"

ఇన్నింటి వల్ల గోవు సామాజిక జీవితానికి అవసరం అని అర్థం అయింది.

## 2. విప్రులు

నేను భారతం రాస్తూ 'విప్రులు' అంటే మేధావులు అన్నాను. ధర్మరాజు అడవులకు వెళ్తుంటాడు. అతని వెంట విప్రులు తప్ప అన్యులు వెళ్లరు? రాజ్యం చేతులు మారినపుడల్లా వేటు పడేది మేధావుల మీదనే! అది ఈ నాటికీ సత్యమే! నేను వంది, మాగధ మేధావులను గురించి చెప్పడం లేదు. వారు ఎవరినైనా స్తుతిస్తారు. "సులభాః పురుషా రాజన్ సతతం ప్రియ వాదినః" **నిత్యం స్తుతించే వారు కొల్లలు! సత్యం చెప్పేవారు అరుదు!! ఏ ప్రభుత్వమూ 'సత్యం' సహించదు. దానికి పొగడ్తలు కావాలి! ధర్మరాజు పోషించిన మేధావులను దుర్యోధనుడు సహించడు. అందుకే వారు ధర్మరాజు వెంటవెళ్లారు. ఓట్ల వ్యాపారంలో అధికారం ఆర్జించిన వారూ అంతే!**

వేద వ్యాఖ్యలో సాయణాచార్యులు కూడ విప్రులను 'విద్వాంసులు' - 'పండితులు' అన్నారు

విప్రులు - బ్రాహ్మణులు. అనంతర కాలంలో 'కులం' అయింది. కులం కావడం తప్పని సరి. వృత్తులు వంశపరంపరగా వచ్చాయి. అందువల్ల కొందరు 'మేధావులు' కాని వారూ విప్రులు అవుతారు. కాలక్రమాన ప్రతి సంస్థా స్వప్రయోజన పరుల చేతుల్లో పడుతుంది. అప్పడవి **ఆత్మను కోల్పోయిన నిర్జీవ ప్రతిమలు అవుతాయి! విచిత్రం ఏమంటే సమాజం ఈ నిర్జీవ ప్రతిమలనే గుర్తిస్తుంది! ఇవ్వాళటి కులాలు అన్నీ అర్థం కోల్పోయిన ఆర్భాటాలే! పూర్వం కులాలున్నాయి. నేటి కుల రాజకీయాల్లేవు. ఓట్ల చదరంగంలో కులం 'పావు' అవుతున్నది.**

"ప్రజల పేరుమీద ప్రభుతలు సాగును
ప్రజలె సర్వమంచు ప్రళయ ఘోష
ప్రజలు పావులయ్యె ప్రభువుల 'చెస్సు' లో
విశ్వజనుల వాణి వినరరంగ" అన్నాను 1960 లో.

విప్రులు - మేధావులు, విద్వాంసులు సమాజానికి వెన్నెముక వంటివారు. వారి నిత్య పరిశ్రమ వల్లనే సామాజిక ప్రగతి సాధ్యం. మేధావి నిర్భయంగా తన అభిప్రాయం వెల్లడించ గల వాతావరణం ఉండాలని 'వేదం' ఆ నాడు గుర్తించింది. సత్యానికి జరామరణాలుండవు. ఏ సమాజానికైన మేధావుల స్వేచ్ఛ అవసరం. "గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం, బ్రాహ్మణాస్సంతు నిర్భయాః" ఇవి వేదం చేసిన నినాదాలు.

మధ్యయుగాల్లో క్రైస్తవ మతాచార్యులు ప్రభుత్వాలను నడిపించారు. అత్యాచారాలు చేశారు స్వర్గాన్ని వీధిలో వేలంవేసి విక్రయించారు. ప్రగతికి అడ్డుగోడలు కట్టారు. తమను వ్యతిరేకించిన వాళ్లందరినీ శిక్షించారు. వారి దౌర్జన్యాలు సహించ లేక క్రైస్తవుల్లో ఒక వర్గం తిరుగుబాటు చేసింది. మతాన్ని రాజకీయం నుంచి విడగొట్టారు. వారు 'ప్రొటెస్టెంట్లు' అయినారు.

**భారతచరిత్ర వ్రాసిన వారు క్రైస్తవులు. భారత బ్రాహ్మణులను వారు మధ్య యుగపు క్రైస్తవ మతాచార్యులు అనుకున్నారు. బ్రాహ్మణులను మతపు గుత్తాధికారులుగా వర్ణించారు. బ్రాహ్మణులు క్రైస్తవమతాచార్యుల వంటి అత్యాచారాలు చేశారని చెప్పి ప్రజలను నమ్మించారు.**

వాస్తవం అందుకు పూర్తిగా విరుద్ధం. భారత ఇతిహాసం సాంస్కృతిక ఇతిహాసం. దాన్ని రాజకీయం చేయడమే ద్రోహం. కులమతాలపేర భారత సమాజాన్ని ఛిన్నాభిన్నం చేయాలనే కుట్రతో ఆంగ్లపాలకులు భారత చరిత్రను వంచించారు. మేధావులతో వప్పించారు. **స్వాతంత్ర్యం వచ్చి అర్ధశతాబ్దం దాటినా పాఠ్యాంశాల్లో, విశ్వవిద్యాలయాలలో అదే విషచరిత్ర బోధింప బడుతున్నది!**

క్రైస్తవ సామ్రాజ్యంలో రాజనీతి నుంచి మతాన్ని విడదీయడానికి తిరుగుబాటు అవసరం అయింది. సనాతన కాలంనుండీ భారత సమాజంలో ధర్మం వేరుగానూ రాజకీయం వేరుగానూ వర్ధిల్లాయి.

**ధర్మం సమాజాన్ని నిర్మించింది. జీవితాన్ని ఏర్పరచింది. భారత రాజులు కేవలం పాలించారు.** They have just adminstered **భారత ప్రభువులు ఏనాడూ శాసించలేదు! ధర్మానికీ, రాజకీయానికీ స్పర్ధ వచ్చినప్పుడు ధర్మానిదే పైచేయి అయింది. రాజకీయం ధర్మం ముందు లొంగింది.**

రాముడు ధర్మంకోసం రాజ్యం వదులుకున్నాడు.

విశ్వామిత్రుడు ధర్మబలం సాధించ దలచాడు. రాజ్యం వదులుకున్నాడు.

ఇలాంటి ఉదాహరణలు అనేకం. బ్రాహ్మణం ధర్మం అనుకుంటే రాజకీయం క్షాత్రం అయింది. "బ్రాహ్మణో ముఖమాసీత్ - బాహూ రాజన్యః కృతః." క్షాత్రం, బ్రాహ్మణం పోటీలు పడలేదు. ఒకదాని సరసన ఒకటి వర్ధిల్లాయి. ఒకరి హద్దులను ఒకరు అతిక్రమించలేదు.

**చాణక్యుడు తన బుద్ధి బలంతో భారత సామ్రాజ్యం స్థాపించాడు. చంద్రగుప్తునికి రాజ్యం ఇచ్చాడు. తాను సన్యసించాడు.**

**విద్యారణ్యులు విజయనగర సామ్రాజ్యం స్థాపించారు. తాను పదవి కోరలేదు. హరిహర బుక్కరాయలకు పట్టం కట్టాడు.**

ఇది భారత సంప్రదాయం. ఇంగ్లీషు వానికి ఇది తెలియక కాదు. మనను శాశ్వతంగా సాంస్కృతిక బానిసలను చేయటానికి పన్నిన కుట్ర అది. భారతీయ మేధావులు అది గుర్తించాలి. **ప్రభుత్వాలు జడపదార్థాలు. అవి కదలవు. వాటికి పదవి తప్ప సంస్కృతి అర్థంకాదు!**

సమాజానికి మెదడు మేధావి. అతని ఆవశ్యకత తెలియ పరచింది శ్లోకం.

## 3. వేదం

సమాజానికి సర్వస్వం వేదం. పురుష ఏ వేదగ్ం సర్వం యద్భూతం యచ్చభవ్యం. సర్వమూ వేదమే - జరిగిందీ - జరుగనున్నదీ వేదమే. వర్తమానం ఉండదు. అది క్షణంలో భూతకాలం అవుతుంది. మరుక్షణంలో భవిష్యత్తు అవుతుంది!

"ప్రత్యక్షే ణానుమిత్యా వా యస్తూపాయో న లభ్యతే
ఏతం విదన్తి వేదేన తస్మా ద్వేదస్య వేదతా "

ప్రత్యక్షము, అనుమానంతో ఉపాయం దొరకదు. అప్పుడు వేదం ఉపాయం చూపుతుంది. అదే వేదపు వేదత్వం.

ప్రత్యక్షం, అనుమానం రెండు ప్రమాణాలు - కొలతలు. ప్రత్యక్షం అంటే కంటికి కనిపించేది. అగ్ని మన ముందు మండు తున్నది. ఇది ప్రత్యక్ష ప్రమాణం. అగ్ని కంటికి కనిపించడం లేదు. దూరంగా పొగ కనిపిస్తున్నది. కాబట్టి అక్కడ అగ్ని ఉన్నదని అనుమానం. ఇది అనుమాన ప్రమాణం. ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాల వలన అవగతం కాలేదు. అప్పుడు వేదం అవగతం చేయిస్తుంది. అర్థం చేయించడమే వేదపు వేదత్వం.

తర్కానికి మూడు ప్రమాణాలు 1. ప్రత్యక్షం 2. అనుమానం 3. శాబ్దం అంటే వేదం, ఉపనిషత్తు, పురాణాది శబ్దరూపాలు.

శ్రుతి స్సనాతనీ సాధ్వీ సర్వమానోత్తమోత్తమా ।
అతీన్ద్రి యార్థ విజ్ఞానే మానం స్శ్రుతి రేవహి
శ్రుత్యేక గమ్యే సూక్ష్మార్థే సతర్కః కిం కరిష్యతి ।
మానాను గ్రాహకస్తర్కో నస్వతంత్రః కదాచన

వేదం సనాతనం, సాధ్వి. కొలమానాల్లో ఉత్తమం. ఇంద్రియాలకు అందని విజ్ఞానానికి వేదమే కొలమానం. వేదానికి మాత్రమే గోచరమయ్యే సూక్ష్మార్థం ఉంటుంది. దానికి తర్కం ఎలా ఉపకరిస్తుంది? తర్కం ఇతర ప్రమాణాల మీద ఆధారపడింది. తర్కం స్వయంగా ప్రమాణం కాదుకదా!

"శాస్త్రయోనిత్వాత్" వేదం శాస్త్రం మాత్రం కాదు. సకల శాస్త్రాలకూ జన్మనిచ్చింది. అన్నీ వేదం నుంచే ఆవిర్భవించాయి.

వేదం వల్లనే జీవితం నిలిచి ఉంది.

## 4. పతివ్రతలు

సతి పరమ శివుని ప్రథమ భార్య. ఆమె దక్షయజ్ఞంలో దహనం అయ్యింది. అందుకే సహగమనానికి 'సతి' అని పేరు వచ్చింది.

సతి అంటే పతివ్రత. పతిని నమ్ముకున్న స్త్రీ పతివ్రత. సమాజం అధిక భాగం సంతానం మీద ఆధారపడి ఉంది. సంతానమే సమాజపు నిరంతర జీవనం. సంతానం తల్లి మీద స్త్రీ మీద ఆధారపడి ఉంది. కావున స్త్రీయే సమాజం. **స్త్రీ ఎంత సౌశీల్యవతి అవుతే సమాజం అంత సుశీలం అవుతుంది. ఇంటికి వచ్చిన కోడలును వేదం 'సామ్రాజ్ఞీభవ' అంటుంది. తన కుటుంబానికి ఆమె మహారాణి.**

AIDS నుంచి రక్షణకు ఒక పురుషుడు ఒక స్త్రీ అనే నినాదం ప్రచారం చేస్తున్నారు. ఇది లైంగిక సంబంధం వరకే పరిమితం అంటున్నారు!

త్రేతాయుగం లోనే వాల్మీకి మహర్షి ఏకపత్నీత్వాన్ని ఆవిష్కరించాడు. శ్రీమద్రామాయణం ద్వారా ప్రచారం చేశారు. **ఏకపతిత్వం, పత్నీత్వం ఒక్క లైంగిక సంబంధానికే కాదు. సకల మానసిక మానవ సంబంధాలకు అవసరం. బహు భార్యత్వం, లైంగిక స్వేచ్ఛ ప్రమాదకరం అని హెచ్చరించారు. బహుభార్యల కారణంగా దశరథుడు, రావణుడు నశించారు. వాలి స్త్రీ లోలుడై నశించాడు.**

రామునిది ఒకే పత్ని, ఒకే మాట, ఒకే బాణం!

సీతారాములది ఆదర్శ దాంపత్యం, "అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యధా" అంటుంది సీత. సీతారాములు అన్యులు కారు - అనన్యులు. రామాయణంలో వారు సుఖించిన జాడలేదు. అయినా అందరూ సీతారాముల వంటి దాంపత్యాన్నే కోరుకుంటారు.

స్త్రీకైనా పురుషునికైనా అనుకూల దాంపత్యం ఒక వరం. కలసి ఉన్న దంపతులు కష్టాలను లెక్కచేయరు. **ఆనందం సంపదలో లేదు! అనన్యత్వంలో ఉంది!! సుఖ దుఃఖాలు సాపేక్షములు. కలసి నవ్వడంలో ఎంత ఆనందం ఉందో - కలసి ఏడవడంలోనూ అంత ఆనందం ఉంది!**

అద్వైతం సుఖదుఃఖయో, రనుగతం సర్వా స్వవస్థాసు య
ద్విశ్రామో హృదయస్య యత్ర, జరసా యస్మిన్న హార్యోరసః
కాలే నావరణాత్యయా త్పరిణతే యత్స్నేహ సారేస్థితం
భద్రం తత్ర సుమానుషస్య కధమప్యే కం హి తత్ప్రార్ధ్యతే.
భవభూతి ఉత్తరరామచరిత నాటకం 1-32

అనుకూలదాంపత్యం వివరిస్తున్నాడు:-

సుఖ, దుఃఖాలకు అద్వైతం అంటే ఒకళ్లవలెనే అనుభవించడం. అన్ని దశల్లోనూ కలసిసాగడం. హృదయానికి విశ్రాంతి, మనశ్శాంతి. వార్ధక్యం వచ్చినా అదే వలపు, అదే ప్రేమ. కాలం నడుస్తుంటే ప్రేమ పండుతుంది. స్నేహం స్థిరంగా ఉంటుంది. ఆ జీవితం భద్రతమం. అలాంటి దాంపత్యం ఆశించని వాడు ఎవడు?

ఏవం వర్ష సహస్రాణాం శతం వాఽహం త్వయాసహ
వ్యతిక్రమం నవేత్స్యామి స్వర్గోపి నహి మే మతః
వనవాసం గురించి సీత రామునితో అంటున్నది:-

అలా అడవుల్లో నీతో కూడి వందల, వేల సంవత్సరాలుఉంటాను. స్వర్గం కూడా నాకు అక్కరలేదు. నీవు లేక ఉండలేను.

నాకు పన్నెండేళ్లు, కమలకు ఏడేళ్లున్నప్పుడు 1939లో మాకు పెళ్లి అయింది. మాకష్టాలను నా ఆత్మకధ 'జీవనయానం' లో వివరించాను. ఆ గ్రంధాన్ని కష్టాల్లో /కల్లోలాల్లో/కన్నీళ్లలో/ కలసిసాగుతున్న కమలకు అంకితం ఇచ్చాను.

హిందూ వివాహం తప్ప అన్య మతాల వివాహాలు కాంట్రాక్టులు మాత్రమే. హిందూ వివాహం పవిత్ర బంధం. దాన్ని మృత్యువు సహితం విడదీయలేదు. అది ఏడేడు జన్మల బంధం. నూరేళ్ల పంట!

ఎంతటి సమాజంలో నైనా కుటుంబానిదే అగ్రస్థానం. కుటుంబమే సమాజానికి మూల కారణం. వేదం సుఖమయ, శాంతిమయ కుటుంబానికి బాటలు పరచింది. ఒక్క స్త్రీమాత్రమే కాదు సంసార రథానికి స్త్రీపురుషులు రెండు చక్రాలు.

అనుకూల దాంపత్యం సమాజానికి మూల స్తంభం.

**5. సత్యవాది**

సత్యమేవేశ్వరో లోకే సత్యే ధర్మం ప్రతిష్ఠితం.

ఈ లోకంలో సత్యమే భగవంతుడు. సత్యం మీదనే ధర్మం ఆధారపడి ఉంది.

సత్యం అంటే నిజం చెప్పడం మాత్రమే కాదు. కాని సమాజ జీవితం చాల వరకు నిజం మీదనే ఆధారపడి ఉంది. ప్రభుత్వ, న్యాయ యంత్రాంగం సొంతం నిజం చెప్పించడానికే ఏర్పడింది దురదృష్టం ఏమంటే ఈ యంత్రాంగం సొంతం అబద్ధం మీదనే ఆధారపడిఉంది! కార్య నిర్వహణ నిజం చెప్పదు. న్యాయం నిజం చెప్పదు. శాసనం నిజం చెప్పదు. వీరు నిజం చెప్పించడానికి ఏర్పడ్డారు!

ఒక హత్య జరిగింది. ఒక దోపిడీ జరిగింది. ఒక ఎన్నిక జరిగింది. ఒక న్యాయ విచారణ జరిగింది. వీటి అన్నింటిలో అబద్ధాల సాక్ష్యాలే! ఎవడూ నిజం చెప్పడు. ఈ సమాజం అసత్యాల మీద ఆధారపడి ఉంది.

మన రాజ్యాంగమే అబద్ధంగా ఉంది!

రాజ్యాంగంలో భారత్ Sovereign Democratic Republic - Socialist Secular అని ఉంది.

మనం ఎంత వరకూ సావరిన్, ఎంతవరకు సెక్యులర్, ఎంతవరకు సోషలిస్టో గ్రహించండి.

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు చేసే వాగ్దానాల్లో ఇసుమంత నిజం లేదు.

నిజం చెప్పమనండి ఈ వ్యవస్థ పేక మేడలా కూలుకుంది.

నిజానికి ఈ సమాజంలో విలువ లేదు. ఒకహంతకుడు హత్య చేశాననీ, ఒక దొంగ దొంగిలించానని నిజం చెప్పినా న్యాయ వ్యవస్థ అంగీకరించదు. అతడు సాక్ష్యాధారాలతో నిరూపించాలి!

**ఒక ఆదర్శ సమాజాన్ని అవలోకిద్దాం. అందరూ నిజం చెప్తారను కొండి. ఈ వ్యవస్థ సాంతం వృథా అవుతుంది. వ్యర్థం అవుతుంది. పోలీసు వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు పని ఉండదు. రాజకీయులూ నిజం చెపుతారు! నిజాయితీ గల వారే ఎన్నిక అవుతారు! ఇది ఆదర్శం! ఒక స్వప్నం!!**

**ఒక్క 'నిజం' అనే పదం ఈ వ్యవస్థలో చేరితే ఎంత నిజాయితీ, నిష్కల్మషము, స్వచ్ఛము, మానవీయ మైన సమాజం వెలుగొందుతుంది?**

అయితే అంతా అబద్ధం చెపుతున్నారా? అట్లయితే నిత్య జీవితం సాగేనా? సరుకులు కొనేప్పుడు అమ్మేప్పుడు కేవలం నిజం మీద ఆధారపడుతున్నారు. కాగితం పత్రం లేకుండా మాట మీద కోట్ల వ్యాపారం జరుగుతున్నది. చెక్కులు, రశీదులు, హుండీలు కోట్ల కొలదివి అద్వాన్సుగా ఇస్తున్నాం. ఎక్కడో తప్ప అబద్ధం మోసం జరగడం లేదు.

చిన్న వ్యాపారులతో, కూరగాయలు, పాలవాడు, ఆటోవానితో బేరం కుదిరించు కుంటున్నాం ఉభయ పక్షాలూ మాటకు కట్టుబడుతున్నాయి.

**సామాన్యుడు సాధారణంగా అబద్ధం ఆడడం లేదు. అందు వలనే జీవితం సాగిపోతున్నది.**

జీవితం ఎలా సాగుతున్నది? సత్య వాదుల వలన!

### 6. అలుబ్ధుడు

లుబ్ధులు పీనాసివారు. అలుబ్ధులు పీనాసులు కానివారు.

ఇది ద్రవ్యం - వ్యయానికి సంబంధించిన విషయం. ధనం ద్రవ్యం అవుతుంది. ద్రవ్యానిది ద్రవ స్వభావం. ద్రవ్యానికి స్థిరత్వం లేదు. నిలకడ లేదు. ఒకచోట ఉండదు. మారుతుంటుంది. దాన్ని కదలకుండా కట్టిపెట్టే వారు లుబ్ధులు అంటే వారు ద్రవ్య ప్రకృతికి విరుద్ధం అయిన పని చేస్తున్నారు. ధనం చెలామణిలో ఉండాలి. అందువల్ల అది ప్రజకు ఉపకరిస్తుంది. ఉత్పత్తి దారుడు మరింత ఉత్పత్తి చేయడానికి ఉపకరిస్తుంది ఉత్పత్తి వల్ల సంపద పెరుగుతుంది. వినియోగ దారులు పెరుగుతారు. దాచి పెట్టడం వల్ల ఇవన్నీ నిలిచి పోతాయి.

'చీమలు పెట్టిన పుట్టలు
పాముల కెరయైనయట్లు పామరుడుదగన్
హేమంబు కూడబెట్టిన
భూమీశుల పాలజేరు భువిలో సుమతీ'.

లుబ్ధులు గడ్డి వామునకు కాపు ఉన్న కుక్క వంటివారు. ఆ కుక్క తాను తినదు. ఇతరులను తిననీయదు. Drunkards and Gamblers are better than hoarders అంటారు బ్రటెండ్ రసెల్. తాగుబోతు, జూదరి తనకు నష్టం కలిగించుకుంటున్నాడు. సమాజానికి నష్టం కలిగించడం లేదు! కాని సొమ్ము దాచి పెట్టే వాడు సమాజానికి నష్టం కలిగిస్తున్నాడు!

అలుబ్ధుడు డబ్బు దాచడు. తనకోసమే తన వారి కోసమే కర్చు చేస్తాడు. దానధర్మాలు చేస్తాడని కాదు. ఏదోరకంగా కర్చుచేస్తాడు.

పెట్టుబడి పెట్టడం - బ్యాంకుల్లో దాచడం కూడా సమాజానికి ఉపకరిస్తుంది. సంపద, వినిమయం పెరుగుతుంది. అది కళ్యాణ కారకం అవుతుంది.

అట్లా లుబ్ధుడు సమాజానికి అపకారం చేస్తున్నాడు. అలుబ్ధుడు అపకారం చేయకున్నాడు. అందువల్ల జీవన గమనానికి ఉపయోగపడుతున్నాడు.

## 7. దానశీలురు

ఈశావాస్య.మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।

త్యే త్యక్తేన భుంజీధా మాగ్నధః కశ్చచిద్ధనం ॥ ఈశోపనిషత్తు - 1

ఈ జగత్తులోని చరాచరమంతా ఈశ్వరమే. అతడు త్యజించిందే అనుభవించాలి. అన్యుల ధనానికి ఆశించకు.

ఈ శ్లోకం సమస్త విశ్వాన్ని దర్శింపచేస్తున్నది. ఈ రెండు పాదాలను - అంతే అన్య శాస్త్రాలు కాదు - ఆచరిస్తే లోకం నాకం అవుతుంది.

ఈ లోకంలోని ధనద్రవ్యాలు - ఆస్తి పాస్తులు - పదవులు అధికారాలు - రాజ్యం రాచరికం అంతా భగవానునిదే. అతడే దీనినంతటినీ సృష్టించాడు. ఇవి ఎవరివీ కావు. ఈశ్వరునివి. ఈశ్వరుడు కరుణామయుడు. దయదలచాడు. ఒక్కొక్కటి ఒక్కొక్కరికి ఇచ్చాడు. రక్షించమన్నాడు. అవి తనవి. తన పక్షాన ధర్మకర్తృత్వం నిర్వహించమన్నాడు. అతడు కర్త కాడు ధర్మకర్త మాత్రమే!

ధర్మ - అర్థ - కామములు పురుషార్థాలు. ఇవి సామాజికములు. మోక్షం తురీయ పురుషార్థం. ఇది వ్యక్తి గతం. దీనికి ఇతరులతో ప్రమేయం లేదు. ఇతరులకు భాగస్వామ్యం లేదు.

అర్థ కామములు లౌకికములు. ఈ రెండూ ధర్మంతో కూడినపుడు న్యాయపువి అవుతాయి. 'రాజానుమతో ధర్మం' రాజు అనుమతించిందే ధర్మం. ఆయాకాలాల్లో రాచరికం విధించిన నియమాలకు లోబడి ఆర్జించింది న్యాయ అర్థం అవుతుంది. అలాంటిదే కామం. కామం అంటే స్త్రీ విషయికం మాత్రం కాదు. కోరిక కామం అవుతుంది. అది ధర్మాన్ని అనుసరించేప్పుడే న్యాయమైన కోరిక అవుతుంది.

ప్రకృతి స్వభావం ఇవ్వడం. ఒక్క గింజ వేయండి. చెట్టు ఎంతో ఇస్తుంది. ఇస్తూనే ఉంటుంది. ఇది దానత్వం. ఇది వృక్షపు దానశీలత్వం.

దానం దైవ స్వరూపం. ఈశ్వరుడు ఒకనికి ధనం ఇచ్చాడు. కొంతమంది నిర్ధనులను సృష్టించాడు. సంపన్నుని ధనం స్వంత వినియోగానికి కాదు. ఇతర దీనుల, దరిద్రుల, అనాథల, అన్నార్తులకు ఇవ్వడానికి. ఆ సంపన్నుని ధనం ఇలాంటి వారందరికీ చెందాల్సి ఉంది. అలా పెట్టక తానే అనుభవించిన వాడు దొంగతనం చేసిన వాడవుతాడు.

దానశీలునికి ఆత్మానందం కలుగుతుంది. ఆకలి గొన్నవానికి అన్నం పెట్టండి. ముందు కూర్చుని వడ్డించండి. అతడు తింటున్నప్పుడు, తిని తేన్చినపుడు దాతకు కలిగే ఆనందం చేసిన దానాన్ని మించుతుంది. పురాణ పురుషులగు దానశీలురకు నమస్కరింతాం.

**బలిచక్రవర్తి**

ప్రహ్లాదుని మనుమడు బలి. అతడు సమస్త విశ్వాన్ని జయించాడు. అతడు నర్మదా నదికి ఉత్తరాన అశ్వమేధం చేస్తున్నాడు. అతని గురువు శుక్రాచార్యులు. అతడు యజ్ఞం చేయిస్తున్నాడు

ఆ యజ్ఞానికి వామనమూర్తి వచ్చాడు. అతడు సూర్యుని వలె ప్రకాశిస్తున్నాడు. అతని ప్రకాశానికి బలి, శుక్రుడు నిస్తేజులైనారు. వామనుడు బలి దగ్గరకు వచ్చాడు. బ్రాహ్మణ కుమారా! నీవు అడుగు పెట్టినావు. ఈ యజ్ఞం పావనం అయింది. నేను పావనుడను అయినాను. నీకు కావలసింది అడుగు. కాదనక లేదనక ఇస్తాను:-

"వర చేలంబులొ, మాడలో, ఫలములో, వన్యంబులో, గోవులో
హరులో, రత్నములో, రధంబులొ, విమృష్టాన్నంబులో, కన్యలో
కరులో, కాంచనమో, నికేతనములో, గ్రామంబులో, భూములో
ధరణీఖండము కాక యేమడిగెదో ధ్త్రాతీ సురేంద్రోత్తమా"

వామనమూర్తి యాచిస్తున్నాడు!

"అడిగినది లేదనక ఇచ్చుదాతలలో నీవు మేటివి. అందుకే నిన్ను యాచిస్తున్నాను. నిన్ను ఎక్కువ అడుగను. నా అడుగులతో మూడడుగుల నేల ఇవ్వు. చాలు"

"నీ కోరిక మూడడుగుల నేలయే అయితే తీసికో" అని దానం ఇవ్వడానికి జలపాత్రను అందుకున్నాడు.

శుక్రుడు ఎత్తిన బలి చేయి పట్టుకున్నాడు. "ఇతడు సాధారణుడు కాడు. నిన్ను ధ్వంసం చేయడానికి వచ్చాడు. అతడు ఒక అడుగుతో భూమండలాన్నీ, మరొక అడుగుతో ఆకాశాన్ని కొలుస్తాడు. మూడో అడుగు ఎక్కడ పెట్టాలి? అని అడుగుతాడు. ఏమిస్తావు. ఇస్తానన్నావు నిజమే. ఇది ప్రాణరక్షణ. ఇచట సత్యం పనికి రాదు. అబద్ధం ఆడు. ఇవ్వనను" అన్నాడు.

"గురుదేవా! నేను ప్రహ్లాదుని మనుమణ్ణి. ఇస్తానన్నాను. ఇవ్వననడం మోసం కాదా! **అసత్యం కంటే అధర్మం లేదు. భూమి అన్నింటినీ భరిస్తుంది. అసత్యం భరించలేదు. నరకం, దారిద్ర్యం, దుఃఖం, రాజ్య నాశనానికి భీతిల్లను. ఇత్తునని ఇవ్వకమోసం చేయ జాలను. అసత్యాన్ని మించిన అపరాధం, పాపం మరొకటి లేదు"** అని బలి వామనునికి మూడడుగుల నేల దానం చేశాడు. బలి భార్య వింధ్యావతి బంగారు చెంబుతో నీరు పోసింది. బలి స్వయంగా వామనుని కాళ్లు కడిగి నెత్తిన చల్లుకున్నాడు.

ఆకసం నుంచి ఇదంతా చూస్తున్న దేవతలు చకితులైనారు. ఆశ్చర్యపడ్డారు. బలి వారికి శత్రువే. అయినా అతని కీర్తిగానం చేశారు:-

కమలనాభు నెరిగి కాలంబు దేశంబు
నెరిగి శుక్రు మాట లెరిగి నాశ
మెరిగి పాత్ర మనుచు నిచ్చెదానము బలి
మహి వదాన్యు డొరుడు మరియు గలడె!

వామనుడు ఒక అడుగుతో భూమిని, మరొక అడుగుతో ఆకాశాన్నీ కొలిచాడు. మూడవ అడుగు ఎక్కడ పెట్టవలెను? అని అడిగాడు.

బలి అంటున్నాడు:-

"ప్రభూ! నా మాట అసత్యం చేయాలను కున్నావు. కాని నా మాట సత్యమని ప్రతిపాదిస్తాను. రెండడుగులు ఇచ్చినాను. మూడవ అడుగు నాతల మీద పెట్టుము" అన్నాడు.

వామనుడు బలి తల మీద పవిత్ర పాదము పెట్టినాడు. "బలిరాజా! నీవు సుతల లోకానికి సబాంధవంగా వెళ్లుము. ఆ లోకమున నేను నీకు ద్వారపాలకుడనై ఉంటాను" అన్నాడు.

**బలి దానగుణం శ్రీమన్నారాయణ మూర్తినే అతనికి ద్వార పాలకుణ్ణి చేసింది.**

"య ఇదం దేవదేవస్య హరే రద్భుత కర్మణః

అవతారాను చరితం శృణ్వన్ యాతి పరాం గతిం"

హరి దేవదేవుడు. అద్భుత కర్మణుడు. ఇది అతని అవతార కథ. దీనిని విన్న వారికి పరమ పదం లభిస్తుంది.

## శిబి చక్రవర్తి

శిబి సత్యవంతుడు. కీర్తిశాలి. ధర్మాత్ముడు. దానశీలుడు.

ఒకనాటి మాట. అతడు ఆరుబయట కూర్చున్నాడు. ఒకడేగ పావురాన్ని తరుముతున్నది. పావురం భయపడుతున్నది. వణకుతున్నది. దానికి శిబి కనిపించాడు. పావురం శిబి చాటున దాగింది.

డేగ పావురం వెనుక వచ్చింది. శిబిని చూచింది. అతని ముందు వాలింది. అన్నది:-

"మహారాజా! పావురం నా ఆహారం. దాన్ని నేను తరిమి తెచ్చాను. నా ఆహారానికి నీవు విఘ్నం కలిగిస్తున్నావు. సకల భూతాలు ఆహారం వల్లనే జీవిస్తున్నాయి. నాకు పావురం ఇవ్వు. నాకు ఆకలిగా ఉంది. నాప్రాణాలు పోతాయి. అందుకు నీవే కారణం అవుతావు. నీవు ధర్మజ్ఞుడవు. పావురం ఇవ్వు. నా ప్రాణాలు కాపాడు"

శిబి అంటున్నాడు:-

డేగా! పావురం నన్ను ఆశ్రయించింది. దాని మీద కోపం విడువు. నీకు అనేక జంతువుల మాంసం పెట్టిస్తాను.

మహారాజా! పావురాన్ని రక్షించు. పావురపు తూకమంత నీ మాంసం కోసిపెట్టు. అప్పుడు నీ దాతృత్వం వెల్లడి అవుతుంది.

శిబి అందుకు అంగీకరించాడు. త్రాసు తెప్పించాడు. తనమాంసం కోస్తున్నాడు. త్రాసులో పెడ్తున్నాడు. ఎంతకూ పావురానికి సరిపోవడం లేదు. శిబి స్వయంగా త్రాసులో కూర్చున్నాడు. అప్పుడు మరో పళ్లెంలోని పావురం ఎగిరింది.

డేగా, పావురం ఇంద్రాగ్నులుగా మారాయి. "నీ ధైర్యశౌర్యాది గుణంబు లనన్య సాధారణంబులు గావున నీ కీర్తి నిత్యంబై శబ్దబ్రహ్మగలయంత కాలంబును వర్తిల్లుచు నుండెడుమ" ని శిబికి వరంబిచ్చి యింద్రాగ్నులు చనిరి.

ఇంతకు మించిన త్యాగం అరుదు. దధీచి తనదేహాన్నే దానం చేశాడు. ఇది మానవతకు పరాకాష్ఠ. దైవత్వానికి అతి దగ్గరిది. మానవుని దైవత్వపు అంచులకు చేర్చుటకు శిబి కథ అవతరించింది.

## రంతిదేవుడు

రంతిదేవుడు రాజు, మహాదాత. దానము చేయడంలో అతనికి అతడే సాటి. తన సంపదను తాను అనుభవించలేదు. ఆపన్నులకు, పేదలకు దానం చేశాడు. పేదవాడై నాడు. కుటుంబ సహితంగా 48 రోజులు ఆహారం లేకుండా గడిపాడు. 49వ రోజు ఉదయం కొంత పాయసం, నేయి, నీరు లభించింది. సపరివారంగా భుజించడానికి కూర్చున్నాడు.

అప్పుడు ఆకలి గొన్న బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. 'ఆకలి - అన్నం' అని ఆర్తనాదం చేశాడు. సకల ప్రాణులందు భగవంతుని దర్శించువాడు రంతిదేవుడు. వచ్చిన వానిని భగవంతుడుగా భావించాడు. ఉన్న దానిలో బ్రాహ్మణునికి భోజనం పెట్టాడు. అతడు తృప్తిగా వెళ్లిపోయాడు.

మిగిలిన దానిని భుజించడానికి కూర్చున్నారు.

అప్పుడు ఆకలిగొన్న ఒక శూద్రుడు వచ్చాడు. 'ఆకలి - అన్నం' అని ఆర్తనాదం చేశాడు రంతిదేవుడు సకల ప్రాణులందు భగవంతుని దర్శించువాడు. వచ్చిన వానిని భగవంతునిగా భావించాడు. మిగిలిన దానిని శూద్రునికి భోజనం పెట్టాడు. అతడు తృప్తిగా వెళ్లిపోయాడు.

మిగిలిన దానిని భుజించుటకు కూర్చున్నారు.

అప్పుడు కుక్కలను పట్టుకొని మరొకడు వచ్చాడు. 'ఆకలి - అన్నం' అని ఆర్తనాదం చేశాడు. రంతిదేవుడు సకల ప్రాణులందు భగవంతుని దర్శించువాడు. వచ్చిన వానిని భగవంతునిగా భావించాడు. మిగిలినది అతనికి అందించాడు. అతడు తృప్తిగా వెళ్లిపోయాడు.

మిగిలింది నీరు మాత్రం. అదీ ఒకనికి సరిపోయేంత లేదు. నీరు త్రాగడానికే సపరివారంగా కూర్చున్నారు.

అప్పుడు ఆకలిగొన్న ఒక చండాలుడు వచ్చాడు. 'ఆకలి - దాహం' అని ఆర్తనాదం చేశాడు. రంతిదేవుడు సకల ప్రాణులందు భగవంతుని దర్శించువాడు. వచ్చిన వాణ్ణి భగవంతునిగా భావించాడు. 'అన్నములేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న' అని ఇచ్చాడు. అతడు తృప్తిగా వెళ్లిపోయాడు.

అప్పుడు రంతిదేవుడు ప్రార్థిస్తున్నాడు:-

**"భగవాన్! నాకు సకల ఐశ్వర్యాలు అక్కరలేదు. నేను నిన్ను మోక్షం కూడ అర్థించను. నేను కోరునది ఒక్కటే కోరిక. సకల ప్రాణుల దుఃఖము నాయందే చేరవలెను. సమస్త ప్రాణులు సుఖించవలెను."**

ఆ వచ్చిన అతిధులు దేవతలు. రంతిదేవుని ముందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రత్యక్షమైనారు.

వారల నేమియు నడుగక

నారాయణ భక్తి తన మనంబున వెలుగన్

ధీరుండాతడు మాయా

పారజ్ఞుండగుచు బరమ పదముంబొందెన్.

రంతిదేవుడు మహాత్ముడు. కర్మయోగి. కోరికలను జయించిన వాడు. నిష్కామి.

**రంతిదేవునకు వందల, వేల వందనములు. అతడు తనను జయించాడు. ఆశలను జయించాడు. మానవత్వాన్ని అధిగమించాడు - అతీతుడైనాడు. నిష్కామి అయినాడు. దైవత్వానికి దరిచేరాడు. కాదు. దాటిపోయాడు. ఇంద్రాది దేవతలకు కోరికలు, ఈర్ష్యాద్వేషాలున్నాయి. రంతిదేవుడు వాటినీ దాటాడు. అతడు 'పరమపదముంబొందెన్' అన్నాడు పోతనామాత్యుడు.**

నాకు రంతిదేవుడంటే అత్యంత అభిమానం. భక్తి. నేను "ఆకాశవాణి" కి 'రంతిదేవుడు' అనే నాటిక వ్రాశాను. అది చాల కాలం క్రితం ప్రసారమైంది.

## వేదం - వ్యక్తం

**"యుగాన్తేఽన్తర్హితా న్వేదాన్ సేతిహాసా న్మహర్షయః**
**లేభిరే పూర్వమను జ్ఞాతా స్స్వయంభువా"**

యుగాంతం అవుతుంది. వేదాలు మాయం అవుతాయి. అప్పుడు బ్రహ్మ మహర్షులకు అనుమతిస్తాడు. మహర్షులు ఇతిహాస సహితములైన వేదాలను మరల అందుకున్నారు.

మానవ జీవితం లోని ప్రతి అంశం గురించి భారత మేధావులు, ఋషులు, మునులు, విద్వాంసులు చేసినంత అధ్యయనం, పరిశోధన, పరిశ్రమ, కృషి మరెవ్వరూ చేయలేదు. ఇది సత్యం - ఇది నిశ్చయం.

ఋషి అంటే గడ్డం పెంచుకొని, ముక్కు మూసుకొని, కొండ కోనల్లో తపస్సు చేసుకునే వారనే భ్రాంతి భారత స్వప్రయోజన పరులు మనకు కలిగించారు. అది ప్రమాదకరం అయిన భ్రమ. అయితే దాన్ని తొలగించడం అంత సులభం కాదు.

ఋషి మానవాభ్యుదయం కోసం సంసారాన్ని వదిలాడు. అన్యం ఎరుగడు. పరిశోధనయే లక్ష్యం. ప్రాపంచిక విషయాలు ఎరుగడు. అంతటి దీక్ష అతనిది. అదే తపస్సు. అతనిని ఎవరూ నియమించలేదు. జీతభత్యాలు ఇవ్వలేదు. స్వచ్ఛందంగా పరిశోధనకు పూనుకున్నాడు. అతను కోరిందేమీ లేదు. కేవలం మానవాభ్యుదయం మానవ కళ్యాణం! మానవ జీవితం సుఖమయం - శాంతియుతం కావాలి. ఇదీ లక్ష్యం **ఇవ్వాళ్టి మన ఈ మాత్రపు జీవితానికి మహర్షుల కృషి, తపస్సే కారణం!**

పాశ్చాత్య భాషలో సైంటిస్టు జీతగాడు, లేదా బేహరి. అయినా పాశ్యాత్యుల చరిత్ర ఎంతటిది? యూరొపుది వేయేళ్లు. అమెరికాది నాలుగు వందల ఏళ్లు! **ఈలోగా వారు చేసిన, చేస్తున్న, చేయనున్న రీసెర్చి, వ్యాపారం. మానవజాతి వినాశానికి మాత్రం ఉపయోగపడుతున్నది. ఇది భస్మాసుర హస్తం. వారినే నాశనం చేస్తుంది! కాలాన్ని కట్టిపెట్టిన రావణాదుల గతి ఏమైందో భారత ఇతిహాసం చాటి చెపుతున్నది.** వాల్మీకి రామాయణ సుందర కాండలో లంకను ఎంతో సుందరంగా వర్ణించాడు. అది నేటి పాశ్చాత్య వ్యామోహ జీవితానికి సరిగ్గా సరిపోతుంది!

కాలాన్ని గురించి భారతదేశంలో జరిగినంత పరిశ్రమ మరెక్కడా జరగలేదు. దీన్ని "మూఢనమ్మకం" అని ఆంగ్లేయులు భారత మేధావులను వప్పించారు. అదే చదువు చెప్పారు వారు మనను గ్రుడ్డి వారినీ, చెవిటివారినీ చేశారు! **ఇప్పుడు మనం సత్యం విననొల్లం - చూడనొల్లం.**

మనకు ఆత్మగౌరవం - ఆత్మ విశ్వాసం నశించింది. ఇవ్వాళ మనం అన్ని బానిసత్వాలు, డబ్బు పెట్టి కొనుక్కుంటున్నాం. ఈ వ్యవస్థ విషాన్ని అమృతం అని అమ్మి లాభాలు ఆర్జించగలదు! చావునే బ్రతుకని నిరూపించగలదు!

భారతీయులకు కాలం అనాది. అనంతం. అందరికీ అంతే! కాని అన్యులు మూర్ఖులు!! నమ్మనొల్లరు. కాలం అనంతం అయినా మన శాస్త్రజ్ఞులు శాస్త్రీయంగా గుణించి లెక్కలు కట్టారు. పంచాంగం మీద చూడండి సృష్టి ఆది నుంచి లెక్క కనిపిస్తుంది. ప్రమాధి నామ సంవత్సరానికి 99-2000లకు సృష్టి మొదలై 194 కోట్ల 58 లక్షల, 85,100 సంవత్సరాలయింది.

సృష్టి మొదలయిం తరువాత 432 కోట్ల సంవత్సరాలకు ప్రళయం వస్తుంది. అప్పుడు సమస్తం జలమయం అవుతుంది. ఆ జలమయ జగత్తు 432 కోట్ల మానవ సంవత్సరాలుంటుంది. అప్పుడు విష్ణువు - శ్రీమన్నారాయణుడు. మఱ్ఱి ఆకు మీద శయనించేంత వాడవుతాడు. వటపత్రశాయి అవుతాడు. అప్పుడు ఆ స్వామి ఒక్కడే మఱ్ఱి ఆకు మీద తేలియాడుతుంటాడు.

మళ్లీ సృష్టి ప్రారంభం కావాలి. అప్పుడు స్వామి శేషశయనుడు అవుతాడు. అతని బొడ్లో నుండి తామరపూవు వెలుస్తుంది. దానిమీద చతుర్ముఖ బ్రహ్మ ప్రభవిస్తాడు. విష్ణుదేవుడు బ్రహ్మకు "అనేకావై వేదాః" అనేకములైన వేదాలను ఉపదేశిస్తాడు.

432 కోట్ల సంవత్సరాలు వేదాలు నశించలేదు. సృష్టితో పాటు అంతర్హితాలయినాయి. అప్పుడు ఋషులు బ్రహ్మ వలన అనుమతించబడ్డారు. ఆ మహర్షులు ఆ విధంగా వేదాన్ని దర్శించారు. కావున ఋషి వేదానికి ద్రష్ట దర్శించినవాడు- స్మర్తి గుర్తించుకున్నవాడు మాత్రమే! కర్త మాత్రం కాడు.

"నతావద్వ్యాసో వేద కర్తా, తస్య విభాగమాత్ర కారిత్వాత్, నాపి చతుర్ముఖః, ఈశ్వరేణ చతుర్ముఖాయ వేద ప్రదానాత్, నాపి జగదీశ్వరః, తస్య వేదాభివ్యంజకత్వాత్" మత్స్య పురాణం.

వేద వ్యాసుడు వేదకర్త కాడు. అతడు వేద విభజన మాత్రం చేశాడు. చతుర్ముఖుడు వేదకర్త కాడు. అతనికి ఈశ్వరుడు ప్రసాదించాడు. జగదీశ్వరుడు వేదకర్త కాడు. అతడు కేవలం వ్యక్తపరిచాడు.

వేదానికి కర్త లేడు. వేదం అపౌరుషేయం.

## వేదం - నామములు

వేదానికి 1. శ్రుతి, 2. అమ్నాయము, 3. ఛందస్సు, 4. స్వాధ్యాయము అని పేర్లు

1. **శ్రుతి :** వేదాన్ని మహర్షులు విన్నారు. విన్నందున శ్రుతి. పాశ్చాత్యులు శ్రుతికి అపార్థం కలిగించారు. వ్రాత, లిపి అక్షరం వేదకాలంలో లేదని వారి దుర్మతం. అందువల్ల విని నేర్చుకున్నారని వారి కువ్యాఖ్యానం. వేదం ఛందోబద్ధం - సస్వరం - సమస్త సృష్టినీ ఇముడ్చుకున్నది. అప్పటికి అక్షరం లేదన్నది మూర్ఖత్వం!

"ఫూల్‌కిపత్తీసే కట్ సక్తాహై హీరేకా జిగర్

మర్దెనాదాంప్రర్ కలామెనర్మొనాజుక్ బేఅసర్" ఇక్బాల్

పూవు రేకుతో వజ్రపు గుండెను కోయవచ్చు

మూర్ఖుని ముందు సుతిమెత్తని మాట వ్యర్థం.

2. **ఆమ్నాయం :** వేదం ఉపదేశం వలన లభించింది. సస్వర వేదం ఉపదేశం వల్ల మాత్రమే సాధ్యం. సంప్రదాయ ప్రకారం లభించింది. ఇన్ని వేల సంవత్సరాల నుండి తరం నుంచి మరో తరానికి సంక్రమించింది. Veda remains received by an unbroken chain of generations, travelling like a great wave, through the living substance of mind'' John Seemee

నిరంతరం అధ్యయనం చేయబడేది ఆమ్నాయం. అవిచ్ఛిన్నంగా సాగుతున్నది ఆమ్నాయం.

ఖుర్ - ఆన్ - ఖురాన్ కు అర్థం కూడా ఎక్కువగా చదవబడేది - నిరంతరం చదువబడేది అని.

3. **ఛందస్సు :** ఛందో బద్ధం అయిందని మాత్రం కాదు. ఆదేశించేది - నియమించేది అని అర్థం. మానవ జాతికి నియమబద్ధం అయిన జీవితం నేర్పినందున ఛందస్సు.

4. **స్వాధ్యాయన :** వేదం సంప్రదాయంగా వచ్చింది, ఉపదేశించవలసింది. ఈ రెండు గురుముఖతః జరిగేవి. అంతటితో అధ్యయనం ఆగిపోదు. వేద విద్యార్థి తాను స్వయంగా వేదాన్ని అధ్యయనం, పరిశోధన చేయాలి. అంతకు ముందు తెలియని అర్థాలు, వాస్తవాలు వెలికితీయాలి. ఇది స్వాధ్యాయం అవుతుంది.

**"తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్"** ఇది నారదుని గురించి శ్రీమద్రామాయణంలోని తొలి శ్లోకార్థం. వాల్మీకి ప్రోక్తం.

వాల్మీకి నిరంతరం స్వాధ్యాయం చేసేవాడు. అందుకే **"రామకథాం పుణ్యాం శ్లోక బద్ధాం మనోరమామ్"** సృష్టించకలిగాడు.

**వందే వాల్మీకి కోకిలం**

## ఋషి - దివ్య దృష్టి

ఋషి అతీంద్రియ దర్శి. జ్ఞానేంద్రియములకు అతీతముగా చూడగలవాడు. "నానృషిః కురుతే కావ్యం" అతీంద్రియ దృష్టి లేనివాడు కవి, రచయిత కాలేడు. రవి గాంచనిచో కవిగాంచును. సూర్య భగవానుడు సర్వసాక్షి. అయినా అతడు చూడని దానిని ఋషి - కవి చూడగలడు.

దివ్యదృష్టి దివికి సంబంధించినది. దివ్యదృష్టి దేవతా సంబంధం - జ్ఞాన సంబంధం. జ్ఞానానికి అందనిది లేదు. జ్ఞానం సర్వమును దర్శించగలది. జ్ఞానం భూతభవిష్యత్తులను దర్శించగలదు.

**మానవ సమాజాన్ని గురించి భారత ఋషులు అధ్యయనం చేసినంతగా ప్రపంచంలోని ఏ సామాజిక శాస్త్రవేత్త అధ్యయనం చేయలేదు. మానవుని సుఖదుఃఖాలను గురించి భారత ఋషులు, తత్త్వవేత్తలు, ఆచార్యులు ఎంతగానో పరితపించారు. దుఃఖనివారణకు ఎంతో కృషి చేశారు.**

భవిష్యత్తును గురించి ఋషులు చెప్పిన దానికి ఇంటర్నెట్ యుగంలో మనం ఆశ్చర్యపోకుండా ఉండలేం! వేదవ్యాస మహర్షి మానవాళి కోసం తన జీవితాన్ని కర్పూరంగా వెలిగించాడు. ద్వాపర యుగాంతంలో రానున్న కలియుగాన్ని గురించి అతని భవిష్యద్దర్శనం అద్భుతం - నిరుపమానం శ్రీమహాభాగవతం ద్వాదశ స్కంధంలో కలియుగాన్ని గురించి చెప్పబడింది. దాని సంగ్రహ స్వరూపం .

"కలికాలమున దినదినమునకు ధర్మము, సత్యము, శౌచము, క్షమ, దయ, ఆయువు, స్మృతి లోపించు చుండును. ధనమున్న వాడే కులీనుడు, ఆచారవంతుడు, గుణవంతుడు, బలవంతుడు, ధర్మపరుడు, న్యాయపరుడు, సర్వ నియంతయగును. **(నేడు ధనమున్న అమెరికా సర్వ నియంత అయింది.)**. పెండ్లిండ్లలో కులము, శీలము, యోగ్యత చూడరు. వరునకు కన్య - కన్యకు వరుడు నచ్చిన వివాహములగును. నిజాయితీ లోపించును. మోసము చేయగలవాడు, అబద్ధము లాడగలవాడు. వ్యవహార దక్షుడగును. బ్రాహ్మణుని బ్రాహ్మణత్వము బ్రహ్మ జ్ఞానము వలన కాక జందెము వలన వ్యక్తమగును. బ్రహ్మచారులు గాని, సన్యాసులు కాని ఆశ్రమ ధర్మములు పాటించరు. వేసిన వేషముతో తృప్తి చెందెదరు. వాగినవాడు పండితుడు, అసాధుత్వమే సాధుత్వము, అసౌజన్యమే సౌజన్యము. స్వీకారమే వివాహము అగును. దూరమున ఉన్న బురదగుంట తీర్థము, వెంట్రుకలు పెంచుట లావణ్యము, కడుపు నింపుకొనుట పురుషార్థము, కుటుంబ పోషణే ఘన కార్యము, యశస్సు కోరుటే ధర్మ సేవనములగును"

ఒక పరి పరికించండి. ఋషులు ఆనాడు చెప్పింది ఎంతటి యథార్థమైందో!

వారి దివ్యదృష్టికి ఆశ్చర్యపోవడం కన్నా ఏం చేయగలం?

"కలౌ వేంకట నాయకః" కలియుగంలో వేంకటేశ్వర స్వామియే భగవానుడు అని ఏనాడు చెప్పారో? ఈ నాడు అది మన కంటికి కనిపిస్తున్నది! ఎంతటి సత్యవాక్కు ఆ ఋషులది!! ఎంతటి తపోధనులు వారు!!!

"సంఘేశక్తిః కలౌయుగే " కలియుగంలో సంఘటిత శక్తిదే కాలం అన్నాడు. ఇవ్వాళ మనం సంఘ శక్తిని గమనిస్తున్నాం. దేశాలే సంఘటితం అవుతున్నాయి. యూరోపియన్ యూనియన్ అందుకు నిదర్శనం. సైనిక శక్తులు సంఘటితం అవుతున్నాయి. NATO వంటివి అందుకు నిదర్శనాలు. కార్మిక సంఘాలు, కులసంఘాలు, మత సంఘాలే రాజ్యాలు పాలిస్తున్నాయి!

**ఆనాటి ఋషిది ఎంత దివ్య దర్శిత్వం? కొనియాడదానికి పదాలు దొరకడం లేదు! ఆలోచనకు అందడం లేదు!!!**

## వేదమేకం చతుర్విధం

వ్యాస భగవానుడు మానవ సమాజ శ్రేయోభిలాషి. అతడు రానున్న కలియుగాన్ని దర్శించాడు. నాటి అశాంత మానవుని దర్శించాడు. అతని అజ్ఞతను దర్శించాడు. స్వప్రయోజనత్వాన్నీ, స్వార్థాన్ని, కాలుష్యాన్ని దర్శించాడు.

వ్యాస భగవానుడు "అనంతావై వేదాః" అనంత వేదాలను దర్శించాడు. వేదాల విశాలతను, కలియుగపు సంకుచిత నరుణ్ణి చూశాడు. అతనికి జాలి కలిగింది. కలియుగ మానవులకు ఉపకారం చేయాలనుకున్నాడు. ఉపకారమే అతని జీవితం!

ఏవం చకార భగవాన్ వ్యాసః కృపణవత్సలః

వ్యవధాత్యజ్ఞ సంతత్యై వేదమేకం చతుర్విధం

వ్యాసభగవానుడు కృపావాత్సల్యములు గలవాడు. రానున్న కాలంలో జనానికి తీరిక ఉండదనీ, వాళ్ళు అజ్ఞానులనీ గ్రహించాడు. అట్లా గ్రహించి ఒకటిగా ఉన్న వేదాన్ని నాలుగుగా విభజించాడు.

1. ఋగ్వేదసంహిత : ఈ సంహిత దేవతల గుణ గణములను స్తుతిస్తుంది. ఇందులో 10,589 కవితలున్నాయి.

**2. శుక్లయజుర్వేద సంహిత :** ఈ సంహిత యజ్ఞ యాగాది క్రతువులను నిర్దేశిస్తుంది. ఇందులో 1975 పద్య, గద్యాలున్నాయి.

**కృష్ణయజుర్వేద సంహిత :** ఈ సంహిత సహితం యజ్ఞయాగాది క్రతువులను నిర్దేశిస్తూ బ్రాహ్మణ సహితమై ఉంది. ఇందులో 19200 పదాలున్నాయి.

**3. సామవేదసంహిత :** ఈ సంహిత దేవతలను ప్రసన్నులను చేసే గాన విధిని వివరిస్తుంది. ఇందులో 1,875 గేయాలున్నాయి.

**4. అధర్వవేద సంహిత :** ఈ సంహితలో బ్రహ్మజ్ఞానం సహితంగా అనేకానేక లౌకిక విషయాల వివరణ లభిస్తుంది. ఇందులో 5977 గద్య పద్యాలున్నాయి.

## రెండు యజుర్వేదాలు

యజుర్వేదం యజ్ఞయాగాది క్రతువులను నిర్దేశిస్తుంది. అందువల్ల యజుర్వేదమే ఎక్కువ ఉపయోగంలో ఉంది. మిగతా మూడు వేదాల కన్నా ఎక్కువమందికి తెలిసింది. యజుర్వేదం రెండుగా ఉండడానికి కారణం మహీధర భాష్యం వివరించింది.

వేదవ్యాసుడు వేదాలను ఋగ్యజుస్సామాధర్వ వేదాలుగా విభజించాడు. వాటిని క్రమ ప్రకారం తన శిష్యులు పైల, వైశంపాయన, జైమిని, సుమంతులకు ఉపదేశించాడు. వారు తమ శిష్యులకు ఉపదేశించారు.

వైశంపాయనుడు యజుర్వేదాన్ని యాజ్ఞవల్క్యాదులకు ఉపదేశించాడు. ఒకప్పుడు వైశంపాయనునికి కోపం వచ్చింది. యాజ్ఞవల్క్యుని ఆశ్రమం నుంచి వెళ్లగొట్టాడు. యాజ్ఞవల్క్యుడు యోగబలంతో తాను నేర్చిన యజుర్వేదాన్ని వాంతి చేశాడు. వైశంపాయనుని ఆదేశం ప్రకారం అతని ఇతర శిష్యులు తిత్తిరి పక్షులై వాంతిలో ఉన్న విద్యను స్వీకరించారు. "తాని యజూంషి బుద్ధిమాలిన్యాత్కృష్ణాని జాతాని" ఆ యజుస్సులు బుద్ధిమలినములు. అందువలన కృష్ణ యజుస్సులు అయినవి.

యాజ్ఞవల్క్యుడు గ్రంధాలు విడిచి వెళ్లి ఉంటాడు. అతడు యోగవిద్య తెలిసినవాడు. నేర్చిన విద్య మరచిపోయి వదలి ఉంటాడు. వైశంపాయనుడు యజుర్వేదం ఒక్క యాజ్ఞవల్క్యునికి మాత్రమే ఉపదేశించలేదు. ఇతర శిష్యులు ఉన్నారు. యాజ్ఞవల్క్యుడు విశేషంగా నేర్చి ఉండవచ్చు. యాజ్ఞవల్క్యుడు విశేషంగా నేర్చినదాన్ని గురువు అన్య శిష్యులకు ఉపదేశించి ఉండవచ్చు. వారిలో తిత్తిరి మహర్షి గ్రహించింది కృష్ణ యజుర్వేదం అయింది.

"బుద్ధిమాలిన్యాత్కృష్ణాని జాతాని" బుద్ధిమాలిన్యము వలన 'కృష్ణములు' అయినవి అన్నది సరికాదు. దీనికి బుద్ధిమాలిన్యము అంటదు. ఇది వ్యాసుని నుంచి వైశంపాయనునికి వచ్చింది ఇదే శుద్ధయజుర్వేదం. దీనినే తిత్తిరి మహర్షి చెప్పాడు.

శుక్ల కృష్ణ యజుర్వేదాలు సమానములు. వీనిలో ఏదీ మిన్న కాదు. శుక్ల యజుర్వేదీయులు కృష్ణ యజుర్వేదాన్ని తక్కువగా చూస్తారు. కొందరు కృష్ణ యజుర్వేదాన్ని బ్రాహ్మణంగా పరిగణిస్తారు. దాన్నివేదంగా అంగీకరించరు. స్థూలంగా శుక్ల యజుర్వేదం ఉత్తరాది వారికీ కృష్ణ యజుర్వేదం దక్షిణాది వారికీ వర్తిస్తుంది. వస్తుతః ఉత్తరాది వారికి అహంకారం ఎక్కువ! దాక్షిణాత్యులను తమతో సమంగా - నేటికి - గుర్తించరు! ఉత్తర భారతం వారు తెల్లవారు. వారి యజుర్వేదం శుక్ల యజుర్వేదం. దక్షిణ భారతం వారు నల్లనివారు వారి యజుర్వేదం కృష్ణ యజుర్వేదం అయింది.

ఈ శుక్ల, కృష్ణములు చంద్రుని శుక్ల, కృష్ణ పక్షాల వలన వచ్చినవి. చంద్రుని శుక్ల, కృష్ణ పక్షాలను గమనింతాం

**కాలమానం**

మనం ఈనాడు ప్రమాణంగా **భావించే ఇంగ్లీషు - గ్రిగేరియన్ - కేలండరుకు శాస్త్రీయ ఆధారం లేదు!** సంవత్సరానికి ఆధారమైన భూభ్రమణం మాత్రమే వారికి తెలుసు. నెలలకు ఆధారం లేదు. ఒకప్పుడు వీరి నెలలు 40,35 రోజులుండేవి. జూలియస్ సీజర్ పేర జూలై నెల ఆగస్టస్ పేరు మీద ఆగస్టు నెల ఏర్పడ్డాయి. ఇప్పటికీ ఒక నెలకు 31, ఒకటి 30, ఒకటి 28 ఎందుకవుతుందో తెలియదు. ఇదండీ శాస్త్రీయ కేలండర్! దీన్ని మనం గ్రుడ్డిగా అనుసరిస్తున్నాం!! భారతీయులు తమ సంస్కృతికి గ్రుడ్డివారేకదా!

వేదంలో భూమి గుండ్రంగా ఉందని వాచ్యంగా చెప్పబడలేదు. భూగోళం మీద ఆధారపడిన శాస్త్రం వారికి తెలుసు. భూమి గుండ్రంగా ఉంది. అది తన చుట్టూ తాను తిరగడానికి 60 గడియలు లేక 24 గంటలు పడుతుంది. భూమి తిరుగుతున్నప్పుడు సూర్యునికి ఎదురుగా ఉన్న భాగానికి పగలవుతుంది. చాటుగా ఉన్న భాగానికి రాత్రి అవుతుంది.

వేదానికి రాత్రింబవళ్లు తెలుసు. పగలు, రాత్రి ఆచరించవలసిన వానిని వేదం నిర్దేశిస్తుంది.

గ్రిగేరియన్ కేలండర్ నెలకు ఆధారం లేదు. వేదంలో పక్షానికి చంద్రుని కాంతి - వెన్నెల ఆధారం. భూమి నిరాధారంగా వ్రేలాడుతున్నదని వేదం వివరించింది. అలాగే చంద్రుడు స్వయం ప్రకాశకుడు కాడు. అతనికి సూర్యుని వలన కాంతి లభిస్తున్నది అని చెప్పింది.

భూమి తన చుట్టు తాను తిరుగుతున్నది. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడు. అలా తిరిగేటప్పుడు సూర్యుని కాంతి చంద్రుని మీద పడుతుంది. అదే వెన్నెల అవుతుంది. వెన్నెల పక్షం రోజులు పెరుగుతూ పూర్ణిమ అవుతుంది. పక్షం అంటే సరిగ్గా పదిహేను రోజులు కాదు. చాంద్రమాసపు నెలలో సగం. తదుపరి పక్షం రోజులు తరుగుతూ అమావాస్య అవుతుంది.

సాయంకాలం తరువాత పెరిగే వెన్నెలను శుక్ల పక్షం అంటాం. శుక్ల పాడ్యమి నుండి వెన్నెల రోజుకు రెండు గడియలు పెరుగుతుంటుంది. అలా తొలి 15 రోజులు రెండు గడియల చొప్పున 15 × 2 = 30 గడియలు పూర్ణిమ రాత్రి సాంతం వెన్నెల ఉంటుంది. కృష్ణ పాడ్యమి నుంచి వెన్నెల రోజుకు రెండు గంటలు తగ్గుతుంటుంది. అంటే పాడ్యమి నాడు రెండు గడియలు తప్ప రాత్రంతా వెన్నెల ఉంటుంది. ఆవిధంగా తరుగుతూ పక్షానికి వెన్నెల పూర్తిగా లేని అమావాస్య వస్తుంది.

**లెక్క వేస్తే వెన్నెల గడియలు రెండు పక్షాలలోనూ ఒకంతే ఉంటాయి. కాబట్టి శుక్ల, కృష్ణాలు రెండూ సమానములే. ఆధిక్యత దేనికీ లేదు. అలాగే శుక్ల, కృష్ణ యజుర్వేదాలు సమానములే! రంగును బట్టి ఒకటి హెచ్చు, ఒకటి తగ్గు కాదు.**

వాస్తవానికి బ్రహ్మ నుంచి, వేద వ్యాసుని నుంచి, వైశంపాయనుని నుంచి క్రమానుగతంగా తిత్తిరి ఋషి నుంచి వచ్చిందే నిజమైన యజుర్వేదం.

యాజ్ఞవల్క్యుడు అలిగి వెళ్లాడు. ఋషికి కోపం త్యాజ్యం! గురువైన వైశంపాయనుని సాధించదలచాడు!! సూర్యుని నుండి యజుర్వేద ఉపదేశం పొందాడు. ఇది బ్రహ్మ నుంచి వచ్చింది కాదు. అట్లనగా కృష్ణ యజుర్వేదం కన్న తక్కువే కదా?

**వేదాలలో ఒకదాన్ని తక్కువ, మరొకదాన్ని ఎక్కువ చేయడం నా అభిమతం కాదు. రంగును బట్టి ఒక యజుర్వేదం తక్కువ అనేవారి కోసం తర్కం మాత్రమే!**

నా అభిప్రాయం ఏమంటే ఉత్తరాది వారు దక్షిణాది వారికి యజుర్వేదం ఇవ్వలేదు. దక్షిణాది వారు తమ యజుర్వేదం ఏర్పరచుకున్నారు. దానిని ఉత్తరాది వారు కృష్ణ యుజుర్వేదం అన్నారు!

**కృష్ణం అంటే నలుపు. నలుపు తెలుపు కన్న తక్కువేమీ కాదు. రాముడు నల్లన. కృష్ణుడు నల్లన, సీత శ్యామ, నల్లన. ద్రౌపది కృష్ణ - నల్లన. కాళిదాసు శకుంతల నల్లన. వీరందరూ భారతీయులందరికీ ఆరాధ్యులే.**

వాదన కోసం మాత్రం కృష్ణ యజుర్వేదం రాముని వంటిది! కృష్ణునివంటిది! సీతవంటిది! ద్రౌపది వంటిది! శకుంతల వంటిది! వీరు లేని భారత ఇతిహాసం లేదు. చరిత్ర లేదు. సంప్రదాయం లేదు. అసలు భారత దేశం లేదు.

కాలమానంలో మాసముల విషయం తెలుసుకున్నాం. చైత్రాది పన్నెండు మాసాల పేర్లు వేదంలో చెప్పబడినాయి. పక్షం కనిష్ఠ కాలమానంగా కనిపిస్తుంది. రెండు పక్షాలు ఒక మాసం అవుతుంది. వేదంలో వారాల జాడ కనిపించలేదు.

గ్రిగేరియన్ కేలండర్‌లో నెలకు వట్టి అంచనా తప్ప శాస్త్రీయ ఆధారం లేదు. వేదపు నెలకు చంద్రుని నడక, నక్షత్రాలు శాస్త్రీయ ఆధారాలు! **దయచేసి గమనించండి మన కాలమానానికి శాస్త్రీయ ఆధారం ఉందండీ! ఇప్పటికైనా నమ్మండి! మన కాలమానాన్ని చాటండి!**

వేదం రుతువులను గురించి అనేక చోట్ల చెప్పింది.

1. వసంత ఋతువు త్రివృత్ స్తోమము.
2. గ్రీష్మ ఋతువు పంచదశ స్తోమము.
3. వర్ష ఋతువు సప్తదశ స్తోమము.
4. శరద్ ఋతువు ఏకవింశత్స్తోమము.
5. హేమంత ఋతువు త్రిణవ స్తోమము.
6. శిశిర ఋతువు త్రయస్త్రింశస్తోమము.

భూమి తన చుట్టూ తాను తిరుగుతుంటుంది. అందువల్ల రాత్రింబవళ్లు ఏర్పడుతున్నాయి. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది. ఒకసారి సూర్యుని చుట్టూ భూమి తిరగడానికి 365 రోజుల 6 గంటలు పడుతుంది. అది భగవన్నిర్ణయం. ఈ 6 **గంటలను ఏ కాలమానమూ సరిగా పూరించలేకపోతున్నది! మానవుడు అంతటి బలహీనుడు!**

తెలుగు వారిది చాంద్రమానం. నెలలు చంద్రుణ్ణి బట్టి లెక్కిస్తాం. ఏ నెలా సరిగ్గా 30 రోజులు ఉండదు. మొత్తం మీద సంవత్సరానికి గల రోజులను పూరించడానికి అధికమాసం వస్తుంది. అధిక మాసం కూడా సైంటిఫిక్. ఆ నెలలో పూర్ణిమ, అమావాస్య వస్తాయి. అధిక మాసం వచ్చిన సంవత్సరానికి 365 రోజుల 6 గంటలు సరిపోతుంది. మళ్లీ తరగడం మొదలవుతుంది. ఈ అధికమాసం వల్లనే ఋతువులు సరిగ్గా ఆ నెలల్లోనే వస్తాయి. చైత్ర, వైశాఖాలు వసంతం. జ్యేష్ఠ, ఆషాఢాలు గ్రీష్మం, శ్రావణ, భాద్రపదాలు వర్షం, అశ్వీజ, కార్తీకాలు శరత్తు, మార్గశిర, పుష్యాలు హేమంతం, మాఘ ఫాల్గుణాలు శిశిరం.

మనకు సంవత్సరాది చెట్లు, ప్రకృతి చిగిర్చే వసంత కాలంలో వస్తుంది.

గ్రిగేరియన్ - ఇంగ్లీషు - న్యూఇయర్ చెట్లు, ప్రకృతి ముడుచుకుని చలికి వణికే హేమంతంలో వస్తుంది!

ఏది శాస్త్రీయమో - సైంటిఫిక్ అగునో ఆలోచించండి!

ముసల్మానులది కూడ చాంద్రమానమే. 'గోవధసేయు తురకలకు దైవంబవు' అన్నాడు అల్లసాని పెద్దన మనుచరిత్రములో ముస్లిం దేశాల పతాకాలన్నింటిలో చంద్రుడు నక్షతం ఉంటుంది. అయితే ముసల్మానులకు సూర్యుని వలన కలిగే సంవత్సరం లెక్క తెలియదు. అందువలన వారికి అధిక మాసం లేదు. చాంద్రమానం ప్రకారం 365 రోజుల 6 గంటలకు వచ్చే తరుగు 1400 ఏళ్లుగా కొనసాగుతున్నది. ఫలితం ఋతువులకు నెలల నిర్దిష్టత లేదు. రమ్జాన్ నెల ఎప్పుడూ ఒకే రుతువులో రాదు. గమనించండి.

తెలుగువారిది చాంద్రమానం. అంటే కాలపు లెక్క చంద్రుని అనుసరించి జరుగుతుంది.

భారత దేశంలో మరి కొన్ని ప్రదేశాలలో సౌరమానం - సూర్యుని లెక్క, బార్హస్పత్యమానం - బృహస్పతి లెక్క అమల్లో ఉన్నాయి. దేనికైనా సంవత్సరం సూర్యుని లెక్కయే.

ఇంత శ్రమించి పశాస్త్రీయమైన కాలమానాన్ని వేదం నిర్ణయించింది. మనం దాన్ని ఎరుగకున్నాం! ఇప్పడైనా మన కాలమానానికి గర్వించండి!

ఇంకా చెప్పాల్సింది చాలా ఉంది. ఇక్కడ అవసరం కాదు. సమయ సందర్భాలు కావు.

## వేదం - బ్రాహ్మణం

బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు వేదానికి అనుబంధాలు. అవి వేదానికి చివరివి. అందువలన వేదాంతములు అయినవి. ఒకవాదం ప్రకారం వేదాంతం జ్ఞాన ప్రధానం. వేదం కర్మ ప్రధానం. కాని ఆధునిక వేద వ్యాఖ్యాతలు వేదంలోనే జ్ఞానం ఉందంటున్నారు. కొన్నింటికి కర్మ పరమైన, జ్ఞానపరమైన అర్థాలు చూపుతున్నారు. ఈ వాద, ప్రతివాదాలు ఆగవు. సాగుతూనే ఉంటాయి. ఆధునిక గ్రంథాల విషయంలోనే వాద ప్రతివాదాలు ఆగడం లేదు!

పాశ్చాత్యులు వేదాలకు బహుదేవతాక, హింస, కర్మ దోషాలు ఆరోపించి దూషిస్తున్నారు. వారి దూషణలను మన్నించి వేదానికి ఆ దోషాలు లేవని నిరూపించడానికి ఆధునిక వ్యాఖ్యాతలు ప్రయత్నిస్తున్నారు. అర్థాలూ, అంతరార్థాలు తీస్తున్నారు!

నావరకు నాకు పాశ్చాత్యులు చూపినవి దోషాలుగా కనిపించవు. అవి గుణాలు అవుతాయి. పాశ్చాత్యులు వాళ్ల మతాల దృక్కోణంతో చూచినపుడు వారికి అవి దోషాలుగా కనిపిస్తాయి. మనం వారి దృక్కోణానికి బానిసలం అగుట ఏల? తెల్ల దొరల సంతృప్తి కోసం మన సంప్రదాయాన్ని వదులుకోనేల? భారత సంస్కృతికి- నాగరికతకు, ధర్మానికి, తాత్వికతకు మహోన్నత వ్యక్తిత్వం ఉంది. అది కాలపు జరా, జీర్ణాలను జయించి నిత్య నూతనంగా నిలిచి ఉంది. ఆ మహా మనీషి ఒకరి ముందు మోకరిల్లనేల?

వేద కర్మలు కామ్యకర్మలని నా అభిప్రాయం. ప్రస్తుతం ప్రపంచంలో ఎన్ని మతాలున్నాయో వాటన్నింటివి కామ్య కర్మలే! ఆదర్శానికి తప్ప అందరి కర్మలూ కామ్యములే! నిష్కామకర్మ ఆదర్శప్రాయం. ఆచరణ ఉండదని కాదు - అరుదు. అన్వేషించాలి.

వేదాంతం జ్ఞాన ప్రధానం కావచ్చు. జ్ఞానం సొంతం నిష్కామం కాదు. అయితే వేదాంతానికి వైరాగ్యం అనే అర్థం మాత్రం సమంజసం కాదు. జ్ఞానం జీవితం బాగుపరుచుకోవడానికే వదులుకోవడానికి కాదు!

బ్రాహ్మణం వేదంలో భాగం అగును అనీ కాదు అనీ వాదనలున్నాయి. మంత్ర బ్రాహ్మణయోః వేద నామధేయమ్" అని ఆపస్తంబమహర్షి. సంహిత + బ్రాహ్మణమునకు వేదం అని పేరు అంటున్నాడు.

"మంత్ర బ్రాహ్మణ మిత్యాహుః" అని బోధాయన మహర్షి ఆపస్తంబ మహర్షిని బలపరుస్తున్నారు.

"అనంతావై వేదాః" అని శ్రుతి. అట్లయిన వేదాలకు నాలుగు అని పరిమితి ఏల? "శేషే బ్రాహ్మణసంజ్ఞా" అని కల్పసూత్రం. అట్లయినా పరిమితమే! వేదం అపరిమితంకదా!

వేదం కర్మ - బ్రహ్మ ప్రతిపాదకం. ద్రవ్య దేవతా ప్రాతిపదికం మంత్ర భాగం - సంహిత. బ్రాహ్మణము విధి అర్థవాదాది రూపకం.

యజుర్వేదం యాగస్వరూపాన్ని నిరూపిస్తున్నది. కర్మ స్వరూపం తెలిపేది యజుర్వేదం. కావుననే దానికి కర్మకాండ విషయంలో అధిక ప్రాధాన్యత.

కర్మ కేవలం మంత్రం కాదు. విధి విధానానికి సహితం ప్రాధాన్యత ఉంది. కావున బ్రాహ్మణం లేని యజుర్వేద కర్మ ఉండదు. అందుననుసరించియే యజుర్వేదాలు రెండు అయినవి.

శుక్లయజుర్వేదం మంత్ర భాగం మాత్రమే - సంహిత మాత్రమే. ఇందులో బ్రాహ్మణం లేదు.

కృష్ణయజుర్వేదం మంత్ర బ్రాహ్మణాత్మకం. ఇందు మంత్రం విధి విధానం వివరంగా చెప్పబడింది.

కృష్ణయజుర్వేదపు పూర్తి పేరు 'కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత' తిత్తిరి మహర్షిచే దర్శించబడి ప్రచారం పొందినందున దీనికి ఆ పేరు వచ్చింది. మంత్ర బ్రాహ్మణ సహితం అయినందున విశాలమూ, విస్తృతమూ, బృహద్గ్రంథం అయింది.

తైత్తిరీయ సంహితలో ఏడు కాండములు లేక అష్టకములు. నలుబది నాలుగు ప్రపాఠకములు లేక ప్రశ్నలు. ఆరువందల ఏబది ఒక్క అనువాకములు, రెండువేల ఒక వంద పంచాశత్తులు. పందొమ్మిదివేల రెండువందల పదములు. రెండు లక్షల ఏబది మూడువేల ఎనిమిది వందల అరువది ఎనిమిది అక్షరాలున్నాయి.

సరియైన గ్రంథాలు లభించనందున, అన్య కారణాల వలన నేను నాలుగు కాండములు మాత్రం అనువదించ గలిగాను. నేను వచనానువాదం చేసిన కృష్ణ యజుర్వేద సంహిత పంచవేదాల్లోనూ ఇది ఒక్కటే సశేషంగా మిగిలిపోయింది. ఈశ్వరేచ్ఛ అనలేను. దీన్ని నా లోపంగానే అంగీకరిస్తున్నాను. **ఈ 'విశ్వ' విశ్వాంతరాళాల్లో - కేవలం పరాత్పరునకు తప్ప - పరిపూర్ణత్వం లేదు. అందుకే బహుశః కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత అనువాదం పూర్తి కాలేదు. అందుకు క్షంతవ్యుణ్ణి.**

శుక్ల యజుర్వేదపు పూర్తి పేరును గురించి ఆ గ్రంథ పీఠికలో వివరించాను. అయినా సౌలభ్యం కొరకు ఉటంకిస్తాను.

"వాజసనిప్రుతుడు యాజ్ఞవల్క్యుడు. కావున 'వాజసనేయి' అయింది. మధ్యందిన మహర్షికి లభించినందున 'మాధ్యందిన' అయింది. ఆ విధంగా అది వాజసనేయి మాధ్యందిన శుక్ల యజుర్వేద సంహిత అయింది. ఈ సంహితలో నలుబది అధ్యాయాలు, పందొమ్మిది వందల డెబ్బది అయిదు పద్య గద్యాలున్నాయి.

ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది. వేదం తొలుత విష్ణువు నుంచి బ్రహ్మకు అందింది. శుక్ల, కృష్ణ యజుర్వేదాల పేర్లలో వారులేరు. వేదాన్ని విభజించినవాడు వేద వ్యాసుడు. అతని పేరు లేదు. వాజసనేయి, తిత్తిరి మహర్షులకు యజుర్వేదం ఉపదేశించినవాడు వైశంపాయనుడు అతని పేరు లేదు!

మిగత మూడు వేదాల పేర్లకు ముందు ఋషుల పేర్లు లేవు!

ఋగ్వేద మంత్రాలకు ఋక్కులని పేరు. అవి ఛందోబద్ధములు. వృత్త బద్ధములు. గాయత్రి, అనుష్టుప్ మున్నగు ఛందస్సు గలవి.

సామవేదమునందలి మంత్రములు సామములు. అవి గీత సహితములు.

యజుర్వేద మంత్రములకు యజుస్సులని పేరు. ఇది వృత్త, గీత వర్జితములు. అక్షర మాత్ర సంఖ్య గలవి యజుస్సులు. వర్ణానుపూర్విమై, స్వరజీవము గల యజుస్సులు రసవత్తరములు కర్ణ పేయములు.

యజుర్వేద మంత్రాలను - ఒక్కొక్కచో తప్ప గద్యం లేక వచనం అనవచ్చు. వచనం సహితం స్వరయుక్తమైనపుడు సుందరము, మధురము, కర్ణామృతమూ అవుతుంది.

వచన సాహిత్యాన్ని భారతదేశానికి మేమే దిగుమతి చేశామంటున్నారు ఆంగ్లేయులు. జ్ఞానమో - అజ్ఞానమో ప్రగతిశీలురం అనిపించుకునే మేధావులు దానిని త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నారు! మన సంపన్న, సమృద్ధ, సనాతన సాహిత్యాన్ని బూజు పట్టింది అని ఆ మైకంలో తిట్టి పోస్తున్నారు. వేదాల్లోనే సుందర వచనం ఉందని వారు గ్రహించాలి. తనను, తన దేశాన్ని, **తన సంస్కృతినీ విశ్వసించని, గౌరవించని వారికి భవిష్యత్తు అంధకార బంధురం - బానిస బంధం!**

ముస్లిముల పవిత్ర గ్రంథం అయిన ఖుర్-ఆన్ షరీఫ్ వచనంలో ఉంది. దాన్ని సస్వరంగా చదువుతారు. వినసొంపుగా ఉంటుంది.

**విధి నిషేధాలు**

కృష్ణ యజుర్వేదం విధి నిషేధాలను ఎంతో వివరంగా ప్రవచించింది.

1. **"ధ్రువాం వై రిచ్యమానాం యజ్ఞోఽరిచ్యతే యజ్ఞం యజమానో యజమానం ప్రజా ధ్రువామాప్యాయమానాం యజ్ఞోఽన్వాప్యతే యజ్ఞం యజమానో యజమానం ప్రజా"**

ఇది ఎంతో సుందరం. ఎంతో చెప్పవలసిఉంది. సమయ సందర్భం కాదు నిగ్రహించుకుంటున్నాను!

యజ్ఞ సమయంలో ఆజ్య పాత్ర శూన్యంగా ఉండరాదు. అది అసంపూర్ణ యజ్ఞం అవుతుంది అందువల్ల యజమాని ఫల శూన్యుడు అవుతున్నాడు. యజమాని వలన అతని సంతానం అన్న శూన్యమవుతున్నది.

యజ్ఞ సమయంలో ఆజ్య పాత్ర నిండుగా ఉండాలి. అప్పుడు యజ్ఞం సంపూర్ణం అవుతుంది అందువలన యజమానికి యజ్ఞఫలం లభిస్తుంది. యజమాని వలన యజమాని సంతానానికి అన్న సమృద్ధి కలుగుతున్నది.

2. "సర్వేణవై యజ్ఞేన దేవాస్సువర్గం లోకమాయ న్పాక యజ్ఞేన మనుర్రశామ్య త్సేడా మనుము పావర్తత తాం దేవాసురా వ్యహ్వావయన్త ప్రతీచీం దేవాః పరాచీ మసురా స్సా దేవా నుపావర్తత పశవోవై తద్దేవా నవృణత పశవోఽసురా నహుజ"

దేవతలు యజ్ఞము వల్లనే స్వర్గమునకు చేరారు. మనువు పాక యజ్ఞం చేశాడు. విశమించాడు. ఇడా దేవత మనువును చేరింది.

ఇడా దేవతను దేవతలు అసురులు ఆహ్వానించారు. దేవతలు ప్రతీచీ పద్ధతిని "ఇడోపహూతా" అని ఆహ్వానించారు. పశురూప ఇడా దేవత దేవతలను చేరింది.

అసురులు పరాచీ పద్ధతిని అనుసరించారు. "ఉపహూతేడా" అని ఇడా దేవతను ఆహ్వానించారు. పశురూప ఇడా దేవత అసురులను విడిచి పోయింది.

వేదం సాంతం సుందరం - సుస్వరం - సుదర్శనమే! ఎంతకని చెప్పడం. వేదం పంచ భూతాలను - పర్యావరణాన్ని ఎలా కాపాడిందో పరికింతాం :-

"దేవీ రాపో అపాంనపాద్య ఊర్మిర్హవిష్య ఇన్ద్రియావాన్మదిన్తమస్తం వో మాఽవక్రమిష మచ్ఛిన్నం తన్తుం పృథివ్యా అనుగీషం"

జలములందలి అగ్నీ! జలములారా! మీరు హవిస్సునకు యోగ్యులు. మా ఇంద్రియములకు శక్తి నిచ్చువారు. దాహము తీర్చి ఆనందము కలిగించేవారు. మీరు నదీరూపమున ఉన్నారు. మిమ్ము పాదంతో తాకను, మట్టిగడ్డలు వేసి, వాటి మీద కాలు పెట్టి దాటుతాను!

**కాలుతాకకుండా మనం నదులను శుభ్రంగా- శుద్ధంగా- ఆరోగ్యకరంగా - పవిత్రంగా - పాపనాశకంగా వేల సంవత్సరాలుగా పరిరక్షించుకున్నాం.**

**ఈ రాక్షస యాంత్రిక రక్కసి నాగరికత దశాబ్దాల్లో పవిత్ర గంగానదిని సహితం కలుషితం చేసి గంగా జలాన్ని విషతుల్యం - కాదు విషం చేసింది!**

**వేదం - చదవటం :-**

వేదం కథ, నవల, టీ.వీ. సీరియల్, సినిమా కాదు. రామాయణ, భారత, భాగవతాదుల్లో చదివించే కథ, పాత్రలు, సన్నివేశాలూ, సందేశాలూ ఉంటాయి. ఇవి తేనె కలిసిన మందు లాంటివి. తీయగా ఉంటూ గుణం కలిగిఉంటాయి. కాబట్టి వినోదం కోసం కూడా చదవచ్చు.

కృష్ణ యజుర్వేదంలో అక్కడక్కడా కథలూ, గాథలూ కనిపిస్తాయి. కాని తైత్తిరీయ సంహిత - కథా ప్రధానం మాత్రం కాదు. వజ్రాన్ని వెదకడానికీ, ముత్యాలనూ వెలికి తీయడానికీ శ్రమ అవసరం.

నిజ జీవితంలో సుఖమూ, కష్టమూ ఉంటాయి. అవాంతరాలూ, అడ్డంకులూ వస్తాయి. వాటిని ఎదిరించి గట్టెక్కిన వాడు సాధిస్తాడు. విజయం ఆనందాన్ని కలిగిస్తుంది. భరించలేక ఆత్మహత్య చేసుకున్న వానికి పాపం దక్కుతుంది.

హేతువాదం, మార్క్సిజం, నాస్తికం సహితంగా అన్నింటికీ విశ్వాసం వెన్నెముక! వాస్తవంగా హేతువాదానికి హేతువుకన్న విశ్వాసం పట్టుకొమ్మ

వేదం పవిత్రం - పావనం - పరిశుద్ధం. దీనిని విశ్వాసంతో, నిష్కల్మషంగా, ప్రసన్నచిత్తంతో అధ్యయనం చేయాలి. నీరు కావాలంటే నేలను త్రవ్వాలి. శ్రమించండి. ఫలితం దక్కుతుంది.

ఇంట్లో దేవతల పటాలు పెట్టుకుంటాం. అర్థమైకాదు. నమస్కరించడానికే! ఫలితం దక్కకపోదు.

వేదం మానవ జాతికి భగవానుడు ప్రసాదించిన తొలి ప్రసాదం. దాన్ని ఇంట్లో పెట్టుకొండి. నమస్కరిస్తుండండి. ఫలితం దక్కకపోదు!

**ఉద్యమం**

నేను ఉద్యమకారుణ్ణి. నాది ఉద్యమం. వేదం ఏ కొందరి స్వంత సొత్తు కాదు. వేదం సమస్త మానవాళిది. వేదం అందరికీ అందాలని ఉద్యమించాను. భగవానుడు ప్రసన్నుడైనాడు కరుణించాడు. స్వామి కరుణాకటాక్షం వల్ల ఒక్కణ్ణే నాలుగు వేదాల ఆంధ్ర వచనానువాదం చేయగలిగాను.

నా ఉద్యమానికి ఊపుగా "అందరికీ వేద విజ్ఞానము" నినాదంతో ఎమెస్కో ఆర్ష భారతి ఉద్యమించింది. అందరికీ వేదం అందడమే ధ్యేయంగా ఎమెస్కో వారు వేదాలను తొమ్మిది సంపుటాల్లో ప్రచురిస్తున్నారు. వారికి నేనూ, సకల ఆంధ్ర జాతీ కృతజ్ఞులం.

ఎమెస్కోవారికి వేదాశీస్సులు.

"సమహం ప్రజయా సంమయా ప్రజా సమహగ్ం
రాయస్పోషేణ సం మయా రాయస్పోష"

నేను సంతానంతో కూడియుందునుగాక. సంతానము నాతో కూడి యుండును గాక. నేను ధన సమృద్ధితో కూడి యుందునుగాక. ధన సమృద్ధి నాతో కూడి యుండును గాత.

యస్య నిఃశ్వసితం వేదా యోవేదేభ్యోఽఖిలం జగత్ ।
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థ మహేశ్వరమ్ ॥

# శ్రీమదాంధ్ర కృష్ణ యజుర్వేదీయతైత్తిరీయ సంహిత

## ప్రథమ కాండము

### మొదటి ప్రపాఠకము

#### మొదటి అనువాకము

(యజమాని దర్శయాగము చేయకోరును. అప్పుడు అతని అధ్వర్యు అమావాస్య ఉదయమున అన్వాధానము చేయవలెను. వత్సాపాకరణార్థిమంత్రములు ఉచ్చరించవలెను. మోదుగు కొమ్మను నరుకవలెను)

**1.2.** పలాశమా! దేవతలకు అన్నము కొరకు నిన్ను నరుకుచున్నాను. వారికి బలము నిచ్చు రసము కొరకు నిన్ను సరిచేయుచున్నాను.

**3.** దూడలారా! మీరు గడ్డి మేయవలసి ఉన్నది. మీ తల్లులను విడువండి. అరణ్యమునకు చేరండి. సాయంకాలము అగును. అప్పుడు యజమాని ఇంటికి తిరిగిరండి.

(అధ్వర్యు ఆల దూడలను మోదుగు కొమ్మతో అదిలించి తోలవలెను.)

**4.** గోవులారా! ఇష్టి అను కర్మ అతిశ్రేష్ఠము. దాని నిమిత్తము దేవతలు మిమ్ము గడ్డిమేయుటకు అడివికి తోలుదురు గాత.

(అధ్వర్యు దూడల వలె గోవులను అదిలించవలెను.)

**5.** గోవులారా! మీరు ఇంద్రునకు దధిరూప భాగము ఇవ్వవలసి ఉన్నది. చక్కగా గడ్డిమేయండి. వర్ధిల్లండి. మీరు రసవతులు. దుగ్ధవతులు. సంతానవతులు. క్రిమిదోష రహితలు. రోగరహితలు. మిమ్ము దొంగలు అపహరించకుందురుగాక. క్రూర జంతువులు హింసించకుండునుగాక.

**6.** గోవులారా! రుద్రుడు క్రూరుడు. అతని ఆయుధము మిమ్ము బాధించకుండవలెను.

**7.** గోవులారా! మీరు యజమాని వద్ద స్థిరముగా ఉండండి. సంతాన పరంపరలచే వర్ధిల్లండి.

**8.** పలాశమా! నీవు యజమాని గోవులను రక్షింపుము.

(అధ్వర్యుడు మోదుగు కొమ్మను అగ్నిశాల మీద వేయవలెను.)

## రెండవ అనువాకము

(ఈ అనువాకమున బర్హిరాహరణము చెప్పబడుచున్నది.)

**1.** గార్హపత్యాగ్నీ! నీవు ఈ యజ్ఞమునకు 'ఘోషత్' అను ధనమవు అగుచున్నావు.

**2.** నీకు గల శత్రువులును - రాక్షసులును నశింతురు గాత.

**3.** ప్రాచీన విద్వాంసులు తూర్పు దిక్కునుండి దర్భలను తెచ్చినారు. అశ్వపు పక్కటెముక జ్ఞాన స్వరూప. ప్రజాపతి నిర్మిత. అన్నముచే పదును పెట్టబడినది. యజ్ఞవేది మీద పరచవలసిన దర్భలు తెచ్చుటకు అశ్వపు పక్కఎముక తూర్పునకు పోవుచున్నది.

(అధ్వర్యుడు తూర్పునకు - దర్భలు తెచ్చుటకు వెళ్లవలెను.)

**4.** దర్భపుంజమా! దేవతల కొరకు మిమ్ము తీసికొనుచున్నాను. వర్షము వలన మీరు మరల పెరుగగలరు.

**5.** దర్భా! నీవు దేవతలకు ప్రియమైన దానవు. నిన్ను నిలువుగా చీల్చినను - అడ్డముగా త్రుంచినను నిన్ను బాధించుటకు మాత్రము కాదు.

(దేవతల కొరకు అనుట.)

**6.** దర్భా! నీ గనుపు నశింపనివ్వను. మరల పెంచెదను.

(అధ్వర్యు కత్తిని దర్భకు తాకించవలెను.)

**7.** దర్భా! నేను నిన్ను హింసించక కోయుదును."అచ్ఛేత్తాతేమారిషమ్".

(అధ్వర్యు దర్భను కోయును.)

**8.** దర్భా! నీవు ఎన్నో శాఖలుగ అంకురించుము.

(అధ్వర్యు గనుపును తాకును.)

**9.** **వయం సహస్రవల్శాః విరుహేమ.** మేము వేల శాఖలుగ విస్తరిల్లుదుము గాత.

(అధ్వర్యు తన వక్షమును తాకవలెను.)

**10.** తృణకాష్ఠాదుల ఆధారభూతమగు భూమీ! ఈ కోసిన దర్భలకు నీ సంపర్కము కలుగనీయకుము.

(అని మరల మొలకెత్తకుండునట్లు ఎత్తుపదేశమున పెట్టవలెను.)

**11.** దర్భలారా! మిమ్ము త్రాటిచే కట్టుచున్నాను.

**12.** రజ్జువా! నీవు భూమికి మొలత్రాటివి. 'అదిత్యైరస్నాసి'.

**13.** దర్భలను త్రాటిచే కట్టుట ఇంద్రాణికి ఇష్టముగనే జరిగినది.

**14.** త్రాటిచే కట్టబడిన దర్భలారా! పూషదేవత మిమ్ము ముడివేయుచున్నాడు.

(త్రాటిని ముడివేయవలెను.)

**15.** దర్భలారా! మిమ్ము కట్టిన ఈ ముడి ఎంతో కాలము నిలువ కుండును గాత.

**16.** దర్భల మోపా! నిన్ను ఇంద్రుని బాహువులచే ఎత్తుచున్నాను.

(ఎత్తవలెను.)

**17.** దర్భలమోపా! నిన్ను బృహస్పతి తలపై ధరించుచున్నాను.

(తలపై పెట్టుకొనవలెను.)

**18.** "ఉర్వంతరిక్షమ్విహి" మీరు విశాల ఆకాశమున సంచరించండి.

(దర్భలమోపుతో అధ్వర్యుడు యజ్ఞవాటికకు చేరవలెను.)

**19.** దేవం గమమసి. దర్భలారా! మీరు దేవతలను చేరుచున్నారు.

దర్భలమోపును అగ్నిశాల మీద వేయవలెను.

## మూడవ అనువాకము

(ఇందు అమావాస్యనాటి రాత్రి చేయవలసిన విధానము చెప్పబడినది.)

**1.** పాత్రద్వయమా! ఇది దేవతా సంబంధపుది. ఇది దేవయజన కర్మ. దీని కొరకు మీరు పరిశుద్ధులగుడు.

(అధ్వర్యు పాత్రల మీద నీరు చల్లవలెను.)

**2.** పాలకుండా! నీలో ఆకాశము ఉన్నది. అందు వాయు సంచారమునకు అవకాశము ఉన్నది. కావున నీవు అంతరిక్షమవు అగుచున్నావు.

నీవు ద్యులోకము నుండి వచ్చిన వర్షజలము వలనను, భూలోకపు మట్టి వలనను పుట్టినావు. అందువలన నీవు ద్యావాపృథ్వీరూపమవు.

నీవు పుష్కలముగ పాలను అందించి లోకములను పోషించు వర్షరూపము దాల్చుచున్నావు.

దృహంస్వ మాహ్వాః. గట్టిగా ఉండుము. పగలకుము.

**3.** శాఖాపవిత్రమా! ఈ పాత్రలో వందల, వేల పాలచుక్కలు పడుచున్నవి నీవు వాటిని అన్నింటిని శుభము చేయుచున్నావు. వడగట్టుచున్నావు.

(1. మూడు దర్భలను చేర్చి ముడి వేసినది శాఖా పవిత్రము. 2. అధ్వర్యుడు శాఖా పవిత్రమును పాత్రలో వేయవలెను.)

**4.** పాలపాత్రయందలి చిన్న, పెద్ద చుక్కలన్నియు చక్కగా కాగవలయును. వీనిచే ద్యావా పృథ్వుల కొరకు హోమము చేయబడవలెను. హోమము కొరకే కదా ఈ పాలు పితుకబడినవి

(పాలను అభిమంత్రించవలెను )

**5.** ఇప్పుడు మూడు ఆవుల పాలు పితికినాము. వీనిలో ఒకగోవు భూమి సమము. రెండవది అంతరిక్షసమము. మూడవది ద్యులోకసమము.

మూడును చిరాయువు గలవి - సర్వవ్యాప్తులు - సర్వకర్మలు గలవి అని కూడ చెప్పవచ్చును

**ఆలోచనామృతము**

**1.** ఆంగ్లేయులు ఈ దేశమును రెండు వందల సంవత్సరములు మాత్రమే పాలించినారు ఏదేశమునకైనను రాజకీయ బానిసత్వము - ఏదో ఒక రూపమున - తప్పదు. దీనికి మినహాయింపులు లేవు

ఆంగ్లేయులు రాజకీయ ప్రభుత్వము మాత్రము చేసి మిన్నకుండలేదు వారు మన సంస్కృతిని వెక్కిరించినారు. కువ్యాఖ్యానములు చేసినారు. మనము అనాగరకులము - మన ఆచారములు రాక్షసములు అని భారతీయులతోనే అనిపించినారు. మన విద్వాంసులను, మేధావులను అంత బానిసలను చేసినారు!

ఇది ఆంగ్లేయులకు కొత్తకాదు. అమెరికా ఆస్ట్రేలియా వంటి దేశాలలోని ఆదిమ వాసులను వారిని సంస్కృతీ సంప్రదాయాలను మచ్చుకు మిగలకుండ హతమార్చినారు!

ఆంగ్లేయులు రాజకీయాధిపత్యం మాత్రమే విడిచి ఈ దేశమునుంచి నిర్గమించినారు రాజకీయ స్వాతంత్ర్యము వచ్చిన తరువాత మనము పాశ్చాత్య నాగరకతకు మరింత బానిసలము అయినాము!

**2.** వేదము మహోన్నతము. సనాతనము. పురాతనము. దీనికి సమమయినది ప్రపంచ సాహిత్యమున - జీవితమున లేదనుట వాస్తవ సత్యమగును. ఇది కటుసత్యము. అయినను పాశ్చాత్యులకు ఒప్పుకొనక తప్పుటలేదు.

వేదము ఆర్యుల ఆటవికజీవిత చిత్రణమనియు, ఇది లిపిలేనినాడు అవతరించినదనియు- లిపి వచ్చిన తరువాత వ్రాయబడినదనియు పాశ్చాత్యుల సంకుచిత వాదము. ఇది వారి తెలివి లేమిని సూచించుచున్నది!

i. సంస్కృతము వంటి భాషను అవతరింప చేసిన సమాజము ఎంతటి ఉన్నత నాగరికత కలిగియుండవలెను! ఆ సమాజమున ఎంతటి సుఖశాంతులు ఉండవలెను! ఇంతటి భాషను సాధించుట నేటి మొత్తము పాశ్చాత్య నాగరకతకు సాధ్యపడలేదు. వారిభాషల లిపి వారి స్వంతము కానేకాదు. అట్లయిన వేదము ఆటవిక నాగరికతా చిత్రమనుట ఒక జాతి సంస్కృతిని తెలిసికొనజాలక పరిహసించుట కాదా!

ii. వేదము లందలి ఛందస్సు ఏర్పడుటకు ఎంతటి మేధావంత సమాజము కావలెను? ఎంతటి పరిశోధనలు అవసరమై ఉండును? ఇది ఆటవిక సమాజమునకు సాధ్యమగునా?

iii. మానవ జీవితమునకు సకల చరాచర ప్రకృతి అవసరమును వేదము గుర్తించినది. వేదము సకల భూతములను మానవునితో సమానముగ పరిగణించినది. చేతనాచేతన జగత్తు మానవునకు మిత్రమని నిరూపించినది. ఈ మైత్రి లేనినాడు మానవ జీవితము అల్లకల్లోలమగునని వక్కాణించినది అది నేడు నిక్కమైనది!

నేడు మానవుని మనుగడ పేరిట - మనిషి దురాశకొరకు - సమస్త ప్రకృతి సంపదను కొల్లగొట్టియు ధ్వంసము చేసియు మానవ జీవితమును దుర్భరము చేసినాము. ఇప్పుడు మాటకు మాత్రము ప్రకృతిని రక్షించవలెననెడి పాశ్చాత్య నాగరకత వాస్తవముగా అందుకు తగిన చర్యలు తీసికొనుట లేదు! ఇది భస్మాసుర హస్తము!

ఈ దుర్దశ సాంతము వేదపు ఉపదేశమును - సందేశమును ధిక్కరించుట వలన వచ్చినదే. నేటికిని తామేదో కనుగొన్నామని గొప్పలు చెప్పువారేకాని ఇది వేదమున చెప్పబడినదని గుర్తించరు కదా!

iv. ఈ మూడు అనువాకములందు మానవుడు ప్రకృతిని ఎంత ప్రేమించినాడో - ఎంత పూజించినాడో - ఎంత ఆదరించినాడో తెలిసికున్న మనసు పులకరించును. కొమ్మని కొట్టుటకు, దర్భను కోయుటకు, పాలు పితుకుటకు, ఎంతటి ఉన్నత ఆశయముల మంత్రములు చెప్పబడినవి వాటిని వేదము ఎంత ప్రేమించినది. గడ్డిని నిన్ను హింసించను అనుటకు. ఎంతటి మానవత, ఎంతటి సంస్కారము, ఎంతటి ఔన్నత్యము కావలెను!

దీనిని ఆటవిక నాగరకత అన్న వారిని ఏమన వలెను? వేదము ద్వేషించ లేదు!

## నాలుగవ అనువాకము

(హవిర్నిర్వాపణము చెప్పుచున్నాడు.)

**1.** హస్తములారా! మిమ్ము దేవతల కార్యములకు వినియోగించ గలుగుచున్నాను.

(చేతులు కడుగుకొనవలెను.)

**2.** శూర్పమా! నిన్ను యజ్ఞము కొరకు తీసికొనుచున్నాను.

**3.** రాక్షసులు నశింతురు గాత. శత్రువులు నశింతురు గాత.

(శూర్పమును పెగకు చూపవలెను.)

**4.** అగ్నీ! నీవు దుష్టులను నశింపచేయువాడవు. మాపాపములను నశింపచేయుము. మమ్ము హింసించు వారిని నశింపచేయుము. మేము నశింపచేయగోరిన శత్రువును నశింపచేయుము.

(బండికాడియొక్క రంధ్రమును తాకవలెను.)

**5.** శకటమా! నీవు దేవతా సంబంధివి. పరిశుద్ధవు. ధ్యానయోగ్యవు. అందరకు ఇష్టమైన దానవు. హవిస్సును మోయుదానవు. ఇప్పుడు దేవతలను ఆహ్వానించుదానవు అగుచున్నావు.

(1. ఇది పురోడాశమునకు ఉపయోగించు ధాన్యము తెచ్చుబండి. 2. అధ్వర్యు బండికాడి ఉత్తరనొగను తాకి జపించవలెను.)

**6.** శకటమా! నీవు ధాన్యము మోయవలసి ఉన్నది. క్రుంగకుము. హవిస్సువహించవలసి ఉన్నది. గట్టిపడుము. విరుగకుము.

**7.** ధాన్యమా! నిన్ను జగన్మిత్రుడగు సూర్యుని నేత్రమున చూచుచున్నాను. నిన్ను హింసించను. భయపడకుము.

(అధ్వర్యుడు ధాన్యమును చూడవలెను.)

**8.** ద్వారమా! వాయువు తగులవలసి ఉన్నది. విశాలమవగుము.

(అధ్వర్యుడు ధాన్యపు గోతపు ముడి విప్పును.)

**9.** ధాన్యమా! నేను సవిత అనుజ్ఞ యందు ఉన్న వాడను. అశ్వినుల బాహువుల తోడను - పూష హస్తముల తోను అగ్నికి ఇష్టమగునట్లు నిన్ను ఉంచుచున్నాను.

(ధాన్యమును శూర్పమున - చేటలో - పోయవలెను.)

**10.** ధాన్యమా! నిన్ను అగ్నిషోమ దేవత కొరకు చేటలో పోయుచున్నాను.

(9 వ మంత్రము దర్శయాగమునకు. ఇది పౌర్ణమాస యాగమునకు.)

**11.** ఇది - ఈ ధాన్యము - దేవతలకు చెందునుగాక.

**12.** మేము దేవతలతో కూడియున్నాము. ఈ ధాన్యము మాకు చెందును.

(అధ్వర్యుడు ధాన్యమును తాకవలెను.)

**13.** హవిస్సా! వర్ధిల్లుటకు అభిమంత్రించుచున్నాను. ఇది దేవతలకు సమర్పించుటకే అగును.

**14.** యాగ్రపదేశమును వీక్షించుచున్నాను.

**15.** వైశ్వానర జ్యోతిని దర్శించుచున్నాను.

(అధ్వర్యుడు ఆహవనీయాగ్నిని చూచును.)

**16.** ఇహ పరలోకములందున్న మా గృహములు గట్టిగా ఉండవలెను.

**17.** ధాన్యరూపహవిస్సా! నీవు విశాల ఆకాశమున వర్తిల్లుము.

(అధ్వర్యు చేటలో ధాన్యము తీసికొనును.)

**18.** ధాన్యరూపహవిస్సా! నిన్ను భూమిమీద ఉంచుచున్నాను.

(అధ్వర్యు ధాన్యమును గార్హపత్య అగ్ని వద్ద పెట్టవలెను.)

**20.** అగ్నీ! హవ్యం రక్షస్వ. హవ్యమును రక్షింపుము.

**అయిదవ అనువాకము**

(ధాన్యపు పొట్టును పోగొట్టుట చెప్పబడినది.)

**1.** జలమా! అచ్ఛిద్రపవిత్రమున జగదాధారుడైన సూర్యుని కిరణములు నిన్ను పవిత్రము చేయును గాత.

(అగ్నిహోత్రహవణి అను పాత్రయందలి జలమున అధ్వర్యుడు దర్భచే చేయబడిన పవిత్రమును ముంచి, మూడు మారులు కదిలించి పవిత్రము చేయవలెను.)

**2.** జలములారా! దర్భలు శుద్ధిచేయునవి. మీరు అట్టి దర్భలనే శుద్ధిచేయువారు. మీరు ఈ యజ్ఞమును నిర్విఘ్నముగ పూర్తిచేయించండి. మీరు ప్రవాహరూపులు. మానవులను మించిన వేగమున ప్రవహించువారు. ఈ యజ్ఞకర్తకు స్వర్గము కలిగించండి. పూర్వము ఇంద్రుడు వృత్రవధకు మీ సాయము కోరియున్నాడు. అట్టి జలములారా! ప్రోక్షితులు కండి.

(ఇంద్రుడు వృత్రుని వధించదలచినాడు. ప్రజాపతిని ప్రార్థించినాడు. వజ్రాయుధమును నీటతడిపి వృత్రుని సంహరించమన్నాడు ప్రజాపతి. ఇంద్రుడు అట్లే వృత్రుని సంహరించినాడు. అందువలన ఇంద్రుడు నీటి సాయము అర్థించినట్లయినది.) (అధ్వర్యుడు వ్రీహులను ప్రోక్షించవలెను.)

**3.** ధాన్యమా! మిమ్ము అగ్నిదేవత ఇష్టపడునట్లు ప్రోక్షించుచున్నాను.

(ధాన్యమును ప్రోక్షించును - నీరుచల్లును.)

**4.** ధాన్యమా! మిమ్ము అగ్నిషోమ దేవతకు ఇష్టమగునట్లు ప్రోక్షించుచున్నాను.

(ప్రోక్షించును.)

**5.** పాత్రలారా! మీరు దేవయాగము కొరకును, దేవసంబంధ కర్మ నిమిత్తమును పరిశుద్ధులు కండి.

(అధ్వర్యు పాత్రలను మూడుమారులు ప్రోక్షించును.)

**6.** కృష్ణాజినమున సూక్ష్మముగ ఉండు రాక్షసులును శత్రువులును నశింతురుగాక.

(జింక చర్మమును మూడు సార్లు దులుపవలెను.)

**7.** కృష్ణాజినమా! నీవు భూమికి చర్మరూపమవు. భూమి ఆ విషయము తెలిసికొనును గాత.

(గార్హపత్యాగ్నికి ఉత్తర భాగమున పరచవలెను.)

**8.** ఉలూఖలమా! నీవు వనస్పతి సంబంధివి. ధాన్యము దంచుటకు ఆధారమవు. కృష్ణాజినము నిన్ను తన దానినిగా గుర్తించును గాత.

(రోటిని కృష్ణాజినముపై పెట్టును.)

**9.** ధాన్యమా! నీవు అగ్నికి శరీరమవు. మాట వెలువడుటకు కారణమవు. కావున నిన్ను దేవతలు ఆరగించుటకు తీసికొనుచున్నాను.

(ధాన్యమును రోటిలో పోయును.)

**10.** రోకలీ! నీవు చెట్టునుండి పుట్టినావు. అయినను రాతివలె గట్టిగా ఉన్నావు. ఇది దేవతల కొరకైన ధాన్యము. దీనిని పొట్టుపోవునట్లు దంచుము.

(దంచవలెను.)

**11.** పాషాణమా! యజ్ఞకర్త మధుర రసహవిస్సును తెచ్చుచున్నాడు. ఈ విషయము దేవతలకు తెలియపరచుము. మేము దృషత్, ఉపలముల ధ్వనిచేత శత్రుమూకలను గెలుతుము.

(ఒక రాతిపై మరొకరాతితో కొట్టవలెను.)

**12.** శూర్పమా! వర్షమున పెరిగిన వెదురున పుట్టిన దానవు. అందువలన వర్షమున వర్ధిల్లిన దానవే యగుదువు.

(ధాన్యమును చేటలో చెరిగి శుభ్రము చేయవలెను. చేటను ముందునగాని, ఉత్తర దిక్కునగాని ఉంచవలెను.)

**13.** ధాన్యమా! వర్షమున పెరిగిన వెదురున పుట్టిన చేట నిన్ను వర్షమున పెరిగిన దానిగా తెలిసికొనును గాత.

**14.** రాక్షసులు దూరము చేయబడినారు. శత్రువులు దూరము చేయబడినారు.

(ధాన్యపు పొట్టు మున్నగు వానిని పోగొట్టుట అని అర్థము.)

**15.** పొట్టూ! నీవు రాక్షసుల భాగమవు.

(పొట్టును గిన్నెలో వేసి వేరుగా ఉంచవలెను.)

**16.** తండులములారా! వాయువు మిమ్ము నూకలు మున్నగునవి లేకుండునట్లు బాగుచేయును గాత.

(బియ్యమును శుభ్రము చేయవలెను.)

**17.** బియ్యమా! చెరుగునపుడు చేటనుండి మీరు అటునిటు పడుదురు. అట్టి మిమ్ము హిరణ్యపాణియగు సవితా దేవత స్వీకరించును గాత.

(చేటలోని బియ్యమును పాత్రలో పోయును )

**ఆరవ అనువాకము**

(ఇది వ్రీహ్యో వహనము చెప్పునది.)

**1.** కృష్ణాజినము నందు సూక్ష్మముగా ఉండు రాక్షసులు శత్రువులు నశింతురు గాత

**2.** కృష్ణాజినమా! నీవు భూమికి చర్మరూపమవు. అట్లని భూమి తెలిసికొనును గాత.

**3.** శమ్యా! నీవు స్వర్గమును ధరించినదానవు. కృష్ణాజినము భూమికి చర్మరూపము. అది నిన్ను తన దానిగా తెలిసికొనును గాత.

(జింక చర్మము మీద శమ్యను ఉంచవలెను.)

**4.** దృషత్ పాషాణమా! నీవు పర్వత సంబంధివి. నీకు నూరుట తెలియును స్వర్గమును ధరించిన శమ్య నిన్ను తనదానిసిగా తెలియును గాత.

(శమ్యపై రాతిని పెట్టవలెను.)

5. ఉపలా! నీవు పర్వత సంబంధివి. నూరుట తెలిసిన దానవు. దృషత్తు నిన్ను తనదానినిగా తెలిసికొనును గాత.

(1. ఉపల రుబ్బురాయి అగును. 2.రాతిపై రుబ్బురాతిని ఉంచును.)

6. నేను సవితా దేవుని అనుజ్ఞ యందు ఉన్నవాడను. అశ్వినుల బాహువులతోను, పూష హస్తములతోను నిన్ను దృషత్తుపై ఉంచుచున్నాను. నీవు పిండి చేయదగినదానవు. దేవతలను సంతోష పరచుము. "ధినుహిదేవాన్"

(బియ్యమును దృషత్తుపై ఉంచును )

7. బియ్యమా! నిన్ను ప్రాణము కొరకు నూరుచున్నాను.

(బియ్యమును తూర్పువైపు నూరవలెను.)

8. బియ్యమా! నిన్ను అపానము కొరకు నూరుచున్నాను.

(బియ్యమును పడమటివైపు నూరవలెను.)

9. బియ్యమా! నిన్ను వ్యానము కొరకు నూరుచున్నాను.

(మధ్యన నూరవలెను.)

10. యజమానికి దీర్ఘాయువు కొరకు కర్మహేతువగు ఉపలను పట్టుకొనుచున్నాను

(నూరిన పిండిని తూర్పువైపునకు త్రోయవలెను.)

11. అటునిటుపడు బియ్యపు గింజలను హిరణ్యపాణియగు సవిత స్వీకరించును గాత "దేవో వ స్సవితా హిరణ్యపాణిః ప్రతిగృహ్ణాతు"

(పిండిని కృష్ణాజినమున ఉంచవలెను.)

### ఏడవ అనువాకము

(పురోడాశమునుంచు పాత్రలను కాల్చు విధము చెప్పుచున్నాడు.)

1. ఉపవేషమా! నీవు నిప్పు కణికలను పట్టుకొను సాధనమవు. మంత్రపూతమగు పురోడాశమును దేవతలకు అందించుము.

(1. మోదుగు కొమ్మ విరిచి పట్టుకారువలె చేసినది ఉపవేషము. 2. అధ్వర్యుడు ఉపవేషము అందుకొనవలెను.)

2. గార్హపత్యాగ్నీ! వండినదానిని కాక ఇతరమును తిను అగ్నిని పారద్రోలుము.

**3.** మాంసము భక్షించు అగ్నిని నిషేధించుము.

(నిప్పు కణికను బయట వేయవలెను)

**4.** దేవయానమునకు అనుకూలమగు అగ్నిని ఆవహింపుము.

(రెండవ నిప్పు కణికను దక్షిణభాగమున ఉంచవలెను.)

**5.** రాక్షసులు, శత్రువులు తగల బడుదురు గాత.

(కపాలము - మూకుడు - నందు నిప్పుకణిక వేయును.)

**6.** కపాలమా! నీవు దృఢమైన దానవు. భూమిని గట్టిపరచుము. యజమాని ఆయువును సంతానమును గట్టి పరచుము. బంధువులను అతనికి స్వాధీనులను చేయుము.

(దక్షిణ భాగపు నిప్పుపై మూకుడు పెట్టవలెను)

**7.** కపాలమా! నీవు ధరించుదానవు. అంతరిక్షమును దృఢపరచుము. ప్రాణమును దృఢపరచుము అపానమును దృఢపరచుము. ఈయజమాని బంధువులను అతనికి అనుకూలురను చేయుము

(మొదటి కపాలమునకు తూర్పున రెండవ కపాలమును ఉంచవలెను)

**8.** కపాలమా! నీవు ధరించుదానవు. అంతరిక్షమును దృడపరచుము. ప్రాణమును దృఢపరచుము అపానమును దృఢపరచుము. ఈ యజమాని బంధువులను అతనికి అనుకూలురను చేయుము.

(రెండవ కపాలమునకు తూర్పున మూడవ కపాలమును ఉంచవలెను)

**9.** కపాలమా! నీవు ధరించగలదానవు. దిక్కులను దృఢపరచుము. యజమాని సంతానమును దృఢపరచుము. యజమాని బంధువులను అతనికి స్వాధీనులను చేయుము

(ఏడవ కపాలమును ఉంచవలెను)

**10.** ఎనిమిదవ కపాలమా! నీవు వర్ధిల్లిన రూపము కలదానవు. ఈయజమానికి ధనమునిమ్ము సంతానము నిమ్ము. ఇతని బంధువులను ఇతనికి స్వాధీనులను చేయుము.

**11.** కపాలములారా! మీరు భృగువుల యొక్కయు అంగిరసుల యొక్కయు తపోగ్నిచే తపింపబడుడు.

**12.** అధ్వర్యులు కపాలములను అగ్నియందు ఉంచినారు. యజ్ఞసమాప్తి తరువాత ఇంద్రవాయు దేవతలు వానిని అగ్ని నుండి బయటకు తీయుదురు గాత.

## ఎనిమిదవ అనువాకము

(పురోడాశము చేయుటకు పిండిని తడుపుట చెప్పబడినది.)

1. పిండీ! నిన్ను పాత్రయందు ఉంచుచున్నాను.

(పిండిని పాత్రయందుంచవలెను.)

2. ప్రణీత ఉదకములారా! మీరు 'మదన్తి' ఉదకములలో కలపండి. ఉదకములారా! మీరు సస్యధన వర్ధకులు మధురములైనవారు. పశు అభివృద్ధికారకులు. ఇది పిష్టము. రుచికరము. ఓషధి. మీరు దీనితో కలిసిపొండి.

3. పిష్టరూప ఓషధులారా! పూర్వము మీరు ఉదకము అందు పుట్టిన వారే! కావున ఉదకములతో కలవండి.

4. పిండిముద్దా! యజమానికి సంతానము కలుగుటకు నిన్ను మర్దించుచున్నాను.

(పిండిని పిసుక వలెను.)

5. పిష్టమా! అగ్నిదేవత కొరకు నిన్ను తాకుచున్నాను.

(పిండిని తాకవలెను.)

6. పిష్టమా! నిన్ను అగ్నిషోమదేవత కొరకు తాకుచున్నాను.

7. పురోడాశమా! మఖస్యశిరోఽసి - యజ్ఞపు తలవు.

8. పురోడాశమా! కాలిన పెంక మీద ప్రకాశించుచున్నావు. విశ్వాయుః అసి. అనంత ఆయువువు అగుచున్నావు.

9. పురోడాశమా! నీవు గొప్పదానవై వర్ధిల్లుము. నీ యజమాని గొప్పవాడై వర్ధిల్లును గాత.

(పెంక మీది పురోడాశము అరచేతి పరిమాణపు బిళ్ళలను చేయవలెను.)

10. పురోడాశమా! నీవు మృదువగు పొరగలదానవు అగుము.

11. రాక్షసులు, శత్రువులు దూరమగుదురు గాత.

(దర్భను కాల్చి పురోడాశము చుట్టు మూడు మారులు త్రిప్పవలెను.)

12. పురోడాశమా! సవితా దేవత నిన్ను 'నాకము' అను అగ్ని యందు పక్వము చేయును గాత.

(పురోడాశమును నిప్పుల మీద కాల్చవలెను.)

13. పురోడాశమా! నీ శరీరము ఎక్కువ కాలకుండును గాత. గార్హపత్యాగ్నీ! నీవు పురోడాశ హవిస్సును రక్షింపుము.

14. పురోడాశమా! నీవు మంత్రములతో మిళితమగుము.

15. ఏకాయతాయ స్వాహా.

16. ద్వితాయ స్వాహా.

17. త్రితాయ స్వాహా.

(గార్హపత్యాగ్ని యందు హోమము చేయవలెను)

**తొమ్మిదవ అనువాకము**

(ఇందు పురోడాశము నుంచు వేదికరణము చెప్పబడినది.)

1. స్ఫ్యా! నిన్ను తీసి కొనుచున్నాను.

(కర్రతో చేసిన మట్టిని త్రవ్వు ఉపకరణము "స్ఫ్య".)

2. స్ఫ్యా! ఇంద్రుని కుడిచేత వందల ఆయుధములు ఉన్నవి. అవి వేల శత్రువులను వధించును. నీవు ఇంద్రుని కుడిచేతి వంటిదానవు. జ్వాలలు కలిగించు వాయువు వంటిదానవు.

3. భూమీ! నీవు దేవయాగ ఆశ్రయమవు. నీయొక్క ఓషధుల వ్రేళ్లను బాధించను. "మాహింసిషమ్".

4. భూమి మీది దుమ్మును తొలగించుట వలన 'అరరు' రాక్షసుడు దూరమయినాడు.

5. గడ్డితో కూడిన ధూళీ! ఉత్కర ప్రదేశమునకు పొమ్ము.

(1. ఉత్కరము - మట్టి, చెత్త వేయుచోటు. 2. గడ్డిని ధూళిని ఉత్కరమునకు తీసికొని వెళ్లవలెను.)

6. యజ్ఞవేదీ! నీ కొరకు మేఘము వర్షించును గాత.

(అధ్వర్యుడు యజ్ఞవేదిని చూడవలెను.)

7. సవితాదేవా! మమ్ము ద్వేషించువారిని - మేము ద్వేషించువారిని ఎంతో దూరప్రాంతమున వేలపాశముల చేత బంధించుము. వారిని విడువకుము.

(చెత్తను ఉత్కర ప్రదేశమున వేయవలెను.)

8. భూమీ! నీవు దేవయాగ ఆశ్రయమవు. అరరు రాక్షసుడు అపహతుడు అయినాడు.

రెండవసారి ధూళిని తొలగించవలెను.

9. గడ్డితో కూడిన ధూళీ! ఉత్కర ప్రదేశమునకు పొమ్ము.

(ఉత్కరమునకు కొనిపోవలెను.)

10. యజ్ఞవేదీ! నీ కొరకు మేఘము వర్షించును గాత.

(అధ్వర్యు రెండవసారి యజ్ఞవేదిని చూడవలెను.)

11. సవితాదేవా! మమ్ము ద్వేషించువారిని, మేము ద్వేషించువారిని ఎంతో దూరప్రాంతమున వేలకొలది పాశముల చేత కట్టి వేయుము. విడువకుము.

12. అరరుడు దేవయాగమునకు అనర్హుడు. అతడు అపహతుడైనాడు.

13. 9వ మంత్రము. (మూడవసారి ధూళిని తొలగించవలెను.)

14. 10వ మంత్రము (మూడవసారి వేదిని చూడవలెను.)

15. 11వ మంత్రము (మూడవసారి ధూళిని తొలగించవలెను.)

16. ఉత్కర ప్రదేశమా! అరరు నీకు సంబంధించిన రాక్షసుడు. అతనికి స్వర్గము కలుగకుండునుగాక.

17. యజ్ఞవేదీ! వసువులు గాయత్రీ ఛందమున దక్షిణ భాగమున నిన్ను స్వీకరింతురు గాత

18. రుద్రులు త్రిష్టుప్ ఛందమున పశ్చిమ భాగమున నిన్ను స్వీకరింతురుగాక.

19. ఆదిత్యులు జగతిచంధమున ఉత్తర భాగమున నిన్ను స్వీకరింతురు గాత.

20. సవితా దేవత ప్రేరణ కలిగించుచున్నాడు. అధ్వర్యులు వేదికి అవసరమగు ప్రదేశమును త్రవ్వుచున్నారు.

(అధ్వర్యుడు వేది తూర్పున త్రవ్వవలెను.)

21. యజ్ఞవేదీ! నీవు ఋతమసి - సత్యమవు. -

22. ఋతసదనమసి - సత్యస్థానమవు.

23. ఋతశ్రీరసి - సత్యధనవు.

(ఈ మూడు మంత్రములచే వేది యొక్క దక్షిణ, పశ్చిమ, ఉత్తర భాగములను ఏర్పరచవలెను.)

24. వేదీ! వివిధ మంత్రములు ఉచ్చరించు ఋత్విజులు కలదానవు. అరరుడు అపహతుడైనాడు. నీవు దేవతల, పితృదేవతల హవిస్సులను ధరించుచున్నావు. కావున గొప్పదానవు అయినావు. పురోడాశ ధనవతివి అయినావు.

(వేదిని స్పృచే శుభము చేయవలెను.)

25. పూర్వపు వారలగు వృద్ధయజమానులు హవిస్సులు సమర్పించినారు. వేదిరూపమగు భూమిని రాక్షసుల నుండి రక్షించినారు. చంద్రుని యందు అమృత కిరణములు స్థాపించినారు. ఇప్పటి యజమానులు బుద్ధిమంతులు. అప్పటి విషయములను గుర్తుంచుకున్నారు. వేదిని ఆశ్రయించినారు. యాగము చేయుచున్నారు.

## పదవ అనువాకము

(ఆజ్యాది హవిస్సులను గ్రహించు విధానము చెప్పబడినది)

1. స్రుక్కు మున్నగు వాని యందు దాగి ఉన్న రాక్షసులు దహించ బడుదురుగాక. శత్రువులు దహించబడుదురు గాత.

(స్రుక్కు మున్నగు వానిని గార్హపత్యాగ్నికి చూపి వెచ్చచేయవలెను.)

2. స్రుక్కుమున్నగు హోమ సాధనము లారా! మిమ్ము చక్కగా వెచ్చచేయుచున్నాను

(రెండవ మారు వెచ్చచేయవలెను.)

3. స్రువమా! నీవు గోస్థానమును నశింపచేయని దానవు. శత్రువును నశింపచేయుదానవు అన్నము కలుగజేయుదానవు. నిన్ను శుభ్రము చేయుచున్నాను.

(స్రువమును దర్భలచే తుడువవలెను.)

4. జుహువా! యజమాని వాక్కును, ప్రాణమును నశింపచేయకుము. నిన్ను శుభ్రము చేయుచున్నాను.

(తుడువవలెను.)

5. ఉపభృతమా! యజమాని కనులను, చెవులను నశింపచేయకుము. నిన్ను శుభ్రము చేయుచున్నాను.

(తుడువవలెను.)

6. ధ్రువమా! యజమాని భార్యను, సంతానమును నశింపచేయకుము. నీవు అన్నము కలిగించుదానవు. శత్రువును తిరస్కరించుదానవు. నిన్ను శుభ్రము చేయుచున్నాను.

(తుడువవలెను.)

7. యజమాని భార్య అగ్నిని సేవించుచున్నది. మంచి మనసు కలిగిఉన్నది. సంతానమును, సువాసినిత్వమును, చక్కని రూపమును కోరుచున్నది. ఆమెనడుముకు త్రాడు కట్టుచున్నాను.

(అధ్వర్యుడు త్రాడు కట్టవలెను.)

8. అగ్నే! నేను మంచి సంతానము కలదానను. మంచి భర్త కలదానను. నీవు శత్రునాశకుడవు. శత్రువులు నిన్ను తిరస్కరింప జాలరు. అట్టి నిన్ను నేను సేవించుచున్నాను.

9. సుఖావహముగ సవిత బంధించిన వరుణ పాశమును విప్పుచున్నాను. భార్యకు స్థానమును - పుణ్యఫలమును అగు ఉత్తమ లోకమునందు భర్తసహితముగా సుఖముగ ఉండునట్లు చేయుచున్నాను.

(త్రాడిని విప్పివేయును)

10. అగ్నే! నాకు ఆయువు, సంతానము, పశువులు కలిగినట్లే నేను నాభర్తను మరల మరల కలిసి కొనుచున్నాను. నా శరీరమునందు జీవము చిరకాలము నిలిచి ఉండును గాత

(యజమాన పత్ని నడుమునుండి విప్పిన త్రాడును తనకొంగునందు ప్రదక్షిణముగా ధరించవలెను)

11. ఆజ్యమా! నీవు ఆవు పాలనుండి వెడలిన దానవు. ఓషధుల స్వరూపమవు. వాజరూపవు. యాగము కొరకు నిన్ను పాత్రయందు ఉంచుచున్నాను.

(అధ్వర్యుడు పాత్రలో నేయిపోయవలెను.)

12. ఆజ్యమా! నీవు ఆవుపాలనుండి వెడలినావు. ఓషధుల స్వరూపమవు. సంతానము కొరకు నిన్ను సౌమ్య దృష్టితో చూచుచున్నాను.

(యజమాని భార్య ఆజ్యమును చూడవలెను.)

13. తేజోఽసి - నీవు తేజస్సువు.

14. తేజోఽను ప్రేహి - తేజమును పొందుము.

15. నీ తేజస్సును అగ్ని అధిగమించకుండును గాత.

16. ఘృతమా! నీవు అగ్నికి జిహ్వవు. దేవతల సుఖకారకమవు. కావున దేవతల పతి స్థానమందును, ప్రతి మంత్రము నందును ఉపయోగపడుము.

(స్రువే గీతగీసి అందు నేతి గిన్నెనుంచవలెను.)

17. శుక్రమసి - దీప్తి కలదానవు.

18. జ్యోతిరసి - జ్యోతివై ఉన్నావు.

19. తేజోఽసి - తేజస్సువై ఉన్నావు.

20. "దేవో వస్సవితో త్పునా త్వచ్ఛిద్రేణ పవిత్రేణవసోసూర్యస్య రశ్మిభిః"

(అర్థమునకు 5.1. చూడగలరు. ప్రోక్షణీపాత్ర యందలి ఉదకమును పవిత్రముచేత శుద్ధిచేయవలెను)

21. స్వధితమా! నీవు మహోదయమునిచ్చు నిన్ను దేవతల సమిత్తువు - స్తోత్రస్థానములందు మరల మరలమునకు ప్రోక్షించుచున్నాను

((ఘృతమును చేతి ముంచుచువలెను))

22. ఆజ్యమా! నీవు జ్యోతిస్సావిత్రవు. ఉత్పవనము ప్రాణ జ్యోతిస్సావిత్రవు నిన్ను స్వస్థానమునకు మరల మరలమునకు పవిత్రముచే చేసికొనుచున్నాను

((ఆజ్యమును ఉత్పవనము చేయవలెను))

23. కాంతి హరించునట్టి ఆజ్యమా! నిన్ను దేవతల నిమిత్తము స్వర్గ స్థానములందు - మరల మరలమునకు పవిత్రములచే కాంతి హరించునట్టి ప్రాక్‌పాత్ర ముందు చేసికొనుచున్నాను

((ఆజ్యమును ప్రాక్ పాత్ర ముందు పోయవలెను))

**పరిసేచన ప్రోక్షణము**

(ఇధ్మబర్హిస్సులకు పాత్రాదులను ప్రోక్షించుట)

1. ఇధ్మమా! నీవు వజ్రపదానవు. మమ్ములను కావుము. నిన్ను అగ్ని కొరకు ప్రోక్షించుచున్నాను

(ఇధ్మము మీద మూడు మారులు నీరు చల్లవలెను.)

2. వేదిదేశమా! నీవు బర్హిస్సును ఉంచుటకు ఆధార ప్రదేశమవు. నిన్ను ప్రోక్షించుచున్నాను

(వేదిని మూడుమారులు ప్రోక్షించవలెను.)

3. దర్భా! నీవు వేదియందు పరచబడిన దానవు. స్రుక్కు, మున్నగు హోమ సాధనములు ఉంచుటకు నిన్ను ప్రోక్షించుచున్నాను.

(ప్రోక్షించవలెను.)

4. దర్భలారా! మిమ్ము స్వర్గలోక, అంతరిక్షలోక, భూలోకము కొరకు ప్రోక్షించుచున్నాను.

(ప్రోక్షించవలెను.)

5. ఉదకమా! నీవు పితృదేవతల అన్నమువు. దర్భల మీద చల్లబడినావు. దర్భయందు పితృదేవతల కొరకు రసరూపమవగుము.

(ప్రోక్షించగా మిగిలిన నీటిని నేలమీద పోయవలెను.)

6. ప్రస్తరమా! నీవు విష్ణువునకు స్తూపమవు.

7. దర్భలారా! మీరు ఉన్నివలె మెత్తనివారు. దేవతలకు సుఖము కలిగించువారు. మిమ్ము వేదిమీద పరచుచున్నాను.

(పరచవలెను.)

8. మధ్యమపరిధీ! నీవు విశ్వావసు గంధర్వ రూపమవు. యజమానిని సర్వహింసలనుండి రక్షించుదానవు. అన్నరూపవు. స్తుతించవలసినదానవు.

(మోదుగు పుల్లను అగ్నికి తూర్పున వేయవలెను.)

9. దక్షిణపరిధీ! నీవు ఇంద్రుని బాహువు వంటి దానవు. యజమానిని దక్షిణ దిక్కున రక్షింపుము. అన్నరూపవు. స్తుత్యవు.

(మోదుగు పుల్లను దక్షిణమున వేయవలెను.)

10. ఉత్తరపరిధీ! మిత్రావరుణులు నిన్ను ఉత్తరమున ఉంచుదురు గాత. నీవు నిత్యధర్మమున యజమానిని రక్షింపుము. నీవు అన్నరూపవు. స్తుత్యవు.

(సమిధను ఉత్తర దిక్కున ఉంచవలెను.)

11. ఆహవనీయాగ్నీ! తూర్పున సూర్యుడు నిన్ను సమస్త హింసల నుండి రక్షించును గాత.

(అగ్నిని అభిమంత్రించవలెను.)

12. అగ్నీ! నీవు విద్వాంసుడవు. సమృద్ధహోమవంతుడవు. ప్రకాశించువాడవు. ఘనుడవు. నిన్ను యాగము కొరకు మండించుచున్నాను.

(సమిధను పై నుంచి వేయవలెను.)

13. విధృతులారా! మీరు ప్రజలకు నియంతలు.

(1. వేదియందు పరచు దర్భలజత విధృతి. 2. వేది మీద విధృతిని పరచవలెను.)

14. ప్రస్తరమా! విధృతి వసు, రుద్ర, ఆదిత్యులకు స్థానమగును. నీవు విధృతి యందు నిలువుము.

15. నీ పేరు జుహువు అగును. ప్రియనామమున ఘృతాచి, నేయి నిండినదానవు అగుచున్నావు. నీకు ప్రియమగు విధృతి యందు నిలువుము.

నీ పేరు ఉపభృతము అగును. ప్రియనామమున ఘృతాచివి అగుచున్నావు. నీకు ప్రియమగు విధృతి యందు నిలువుము.

నీ పేరు ధ్రువ పాత్రము. ప్రియనామమున ఘృతాచివి అగుచున్నావు. నీకు ప్రియమగు విధృతి యందుండుము.

**16.** విష్ణువా! జుహువు మున్నగునవి పుణ్యస్థానమగు ప్రస్తరము నందు ఉంచబడినవి. నీవు యజ్ఞమును, యజమానిని, అధ్వర్యుడనగు నన్ను రక్షింపుము.

(పాత్రలను అభిమంత్రించవలెను.)

**పన్నెండవ అనువాకము**

(ఆఘార హోమము చెప్పబడు చున్నది.)

**1.** అగ్నీ! నీవు యాగ నిర్వాహకుడవు. భువన కారణమవు. వర్ధిల్లుము. ఇదిగో నీకు నమస్కారము

**2.** జుహువా! దేవయాగము జరుగుచున్నది. అగ్ని నిన్ను పిలుచుచున్నాడు. **ఏహి** - రమ్ము

(జుహు పాత్రను అందుకొనవలెను.)

**3.** ఉపభృతమా! సవితా దేవత నిన్ను దేవయజనమునకు పిలుచుచున్నాడు. **ఏహి.**

(ఉపభృత్తును అందుకొనవలెను.)

**4.** అగ్ని, విష్ణు దేవతలారా! నేను ఆఘార హోమము చేయుటకు సాగినాను. కాలు తాకనీయక మీ ఉభయుల మధ్య నుండి వెళ్లుదును. మీరు విడిగా ఉండండి. నాకు వెళ్లుచోటు ఇవ్వండి.

(కుడి పాదమున ప్రస్తరమును దాటవలెను.)

**5.** భూమీ! నీవు యజ్ఞమునకు స్థానమవు. నీ స్థాన బలముననే ఇంద్రుడు అసురవధాది వీర కృత్యములను చేయ కలిగినాడు.

(అధ్వర్యుడు ఆహవనీయాగ్నికి దక్షిణ భాగమున నిలువవలెను.)

**6.** ఆఘార హోమము నైరుతిన మొదలగును. ఈశాన్యమున సమాప్తమగును. ఇది ఎడతెగనిది వంకర ఎరుగనిది. ఇంద్రుడు దేవతగా గలది. యజ్ఞపతి యజ్ఞమునకు **స్వాహా.**

**7.** అగ్ని, ఆఘార హోమమున తేజోవంతుడై వెలుగొందుచున్నాడు.

(జుహువును పైకి తీసికొనవలెను.)

**8.** **పాహిమాఽగ్నే దుశ్చరితా దామా సుచరితే భజ.** అగ్నీ! నన్ను దుశ్చరితము నుండి కాపాడుము. సుచరితునిగా చేయుము.

(జుహువు, ఉపభృత్తులను తాకకుండ వెళ్లుచు జపించవలెను.)

9. ఆఘార హవిశ్శేషమా! నీవు యజ్ఞమునకు శీర్షమవు. ధ్రువపాత్రయందలి ఆజ్యరూప తేజస్సుతో కలిసికొనుము. జ్యోతిషాజ్యోతిరజ్యామ్.

**పదమూడవ అనువాకము**

(స్రుగ్వ్యూహనాది మంత్రములు చెప్పబడుచున్నవి.)

1. జుహువు అన్నహేతువు. నేను దానిని ఎత్తిపట్టుకొనుచున్నాను. అందువలన ఇంద్రుడు నన్ను పైకి కొనిపోవును.

(జుహువును ఎత్తిపట్టవలెను.)

ఉపభృత్తును క్రిందుగ ఉంచినాను. ఇంద్రుడు నా శత్రువులను నికృష్టులను చేసినాడు.

(ఉపభృత్తును క్రిందుగ ఉంచవలెను )

నేను జుహువును పైకెత్తియు, ఉపభృత్తమున క్రిందుగ ఉంచినాను. అప్పుడు బ్రహ్మాది దేవతలు నాకు ఉత్కర్ష కలిగించినారు. నా శత్రువులకు అపకర్ష కలిగించినారు.

(జుహువును తూర్పునకు కదిలించవలెను.)

ఇంద్రాగ్నులు నా శత్రువులను స్థాన భ్రష్టులను చేయుదురు గాత.

(ఉపభృత్తును ఎడమచేత వెలుపల ఉంచవలెను.)

2. మధ్యమ పరిధీ! నిన్ను వసువుల కొరకు తుడుచుచున్నాను.

దక్షిణ పరిధీ! నిన్ను రుద్రుల కొరకు తుడుచుచున్నాను.

ఉత్తర పరిధీ! నిన్ను ఆదిత్యుల కొరకు తుడుచుచున్నాను.

3. ఘృతమున తడిసిన దక్షిణాగ్రమును పక్షులు నాకి పైకి ఎగురును గాక. భార్యను, సంతానమును రక్షింతురు గాత.

(జుహువును దర్భలతో తుడవవలెను.)

4. జలములు ఓషధులు వర్ధిల్లును గాత. దర్భలారా! మీరు వాయు ప్రేరిత వర్ష బిందువుల వలన పుట్టినవారు. మీరు స్వర్గమునకు చేరండి. మాకు వర్షము కలిగించండి.

(పలాశ శాఖను, ప్రస్తరమును అగ్నియందు వేయవలెను.)

5. అగ్నీ! నీవు ఆయువును రక్షించువాడవు. నా ఆయువును రక్షించుము. నేత్రములను రక్షించువాడవు. నా నేత్రములను రక్షించుము.

(ఆహవనీయాగ్నిని అభిమంత్రించవలెను.)

**6.** ధ్రువాఽసి **భూమీ!** నీవు స్థిరత్వము కలదానవు.

(వేది మధ్యమును తాకవలెను.)

**7.** ప్రకాశమాన అగ్నీ! నీవు స్తోత్ర సాధ్యుడవు. నీయందు పశ్చిమ పరిధిని వేయుచున్నాను అది నీకు ఇష్టమగును గాత.

దక్షిణ, ఉత్తర పరిధులారా! మీరు యజ్ఞ ఫల రూపమగు అన్నమును పొందండి.

(మూడు పరిధులను అగ్నిలో వేయవలెను.)

**8.** విశ్వే దేవతలారా! మీరు సంస్రావాజ్య భాగమును కోరువారు. మీలో కొందరు ప్రస్తరముష్టిలో ఉన్నవారు. కొందరు వేది యందు పరచిన దర్భలందు ఉన్నవారు. ఈ యజ్ఞమున మా స్తుతులను గ్రహించండి. సంతుష్టులు కండి.

(సంస్రావాజ్యము హవ్య శేషమగును.)

**9.** జుహూ ప్రభృతులారా! మిమ్ము అవినాశ్యమగు అగ్ని శకట స్థానమున - యజమాని సుఖము కొరకు - స్థాపించు చున్నాను. మీరు సుఖవంతులు కండు. నాకు సుఖములు కలిగించండి. యజమాని దంపతులను రక్షించండి.

(జుహూప్రభృతులను ధాన్యశకటము ఉంచిన స్థలమున వేయవలెను.)

**10.** అగ్నీ! స్వర్గవాసులు నా అపరాధములు గ్రహించకుండునట్లు చేయుము. నన్ను విఘ్నముల నుండి **పాహి.** దుష్ట ప్రవర్తననుండి **పాహి.** దుష్ట భోజనము నుండి **పాహి.** నిషిద్ధాచరణమునుండి **పాహి.** మా అన్నమునందు విషము లేకుండ చేయుము.

అగ్నీ! నీవు అహింస్యుడవు. ఉష్ణశరీరవి. మాకు సుఖప్రదుడవగుము. - **స్వాహా.**

**11.** దేవతలారా! మీరు మార్గములు తెలిసినవారు. వచ్చిన మార్గముననే తిరిగివెళ్లండి.

మనస్సునకు పతియగువాడా! దేవతలందు మా యజ్ఞమును ప్రతిష్ఠింపుము. **స్వాహా.** వాయువునకు **స్వాహా.**

(వాయు దేవతచే మొదలయిన యజ్ఞము వాయుదేవతచే సమాప్తమైనట్లు బర్హిస్సును అగ్నిలో వేయవలెను.)

దర్శపూర్ణ మాస యాగ మంత్రములు సమాప్తము.

## పదనాలుగవ అనువాకము

**1.** ఇంద్రాగ్నులారా! మీరు పురోడాశవంతులు. యజ్ఞ నిర్వహణకు అన్నము, ధనము ఇచ్చువారు మీకు సంతోషము కలిగించుటకును - మాకు అన్న లాభమునకును హువే - ఆహ్వానించుచున్నాము

**2.** ఇంద్రాగ్నులారా! ఈ లోకమున అల్లుడు దౌహిత్ర సంతానమును ఇచ్చుచున్నాడు. బావమరిది మేన సంతానమును ఇచ్చుచున్నాడు. మీరు వారిని మించిన బహు సంతానప్రదులని వినియున్నాను కావున సోమరస సదృశ పురోడాశమును అర్పించుచున్నాను. మిమ్ము సంతుష్టులను చేయుచున్నాను

**3.** ఇంద్రాగ్నులారా! ప్రజలనపహరించు రాజులున్న తొంబది పట్టణములు ఉన్నవి. వానిని ఒకే దెబ్బకు కొట్టి పడేయండి.

**4.** ఇంద్రాగ్నులారా! మీరు వృత్రుని సంహరించిన వారు. మా స్తోత్రములు దోషరహితములు నూతనములు. అన్నము వలన కల్పితము. మీరు వానిని స్వీకరించండి. మంచి యజ్ఞములకు అర్హులగు మిమ్ము ఆహ్వానించుచున్నాను.

మీరు యజమానికి అన్నము ప్రసాదించండి.

**5.** పథప్రభువా! సూర్యదేవా! అన్నము లభించు కర్మ కొరకు - రథమును వలె - నిన్ను యాచించుచున్నాము.

**6.** పూష దేవత ఫల ప్రదాత. నేను ఫలము కోరువాడను. నేను పూషను స్తుతించుచున్నాను అతడు దుఃఖ వినాశకములును - చంద్రుని వంటి ఆహ్లాదకములగు - ఓషధులను మాకు ప్రసాదించును గాత.

**7.** భూమి వలన మాకు గోవులు, అశ్వములు, మమ్ము పోషించు అన్నాదికములు లభించుచున్నవి. క్షేత్రపతి ఇట్టివానిచే మాకు సుఖములు కలిగించును గాత.

**8.** క్షేత్రపతీ! గోవు మధురములగు దుగ్ధములనిచ్చును. అట్లే నీవు మాకు మధురములును మరల మరల లభించునవియు, నేయి వంటి పవిత్రములగు పదార్థములను కలుగుచేయుము "ఋతస్య నః పతయో మృడయంతు" సత్యసనాథులు మమ్ము రక్షింతురు గాత.

**9.** అగ్నీ! ధనమునార్జించుటకు మమ్ము సన్మార్గమున నడిపించుము. నీవు సమస్త మార్గములు తెలిసినవాడవు. మమ్ము పాపమార్గమునుండి రక్షించుము. నిన్ను బహువిధములుగా నమస్కరించుచున్నాను.

**10.** మాకు శక్తి ఉన్నంతలో కర్మలను ఆచరించ తలపెట్టినాము. అవి నిరాటంకముగ కొనసాగుటకు దేవతల మార్గమున వచ్చినాము.

అగ్ని కర్మలు తెలిసినవాడు. అతడు - మాకొరకు - యాగము చేయును ఆహ్వానించును ఋతువులను అనుసరించి కర్మములు కల్పించును

**11.** ప్రాయణీయ హవిస్సు అగ్నికి ఘనమగును గాత. బర్రెకు మేతపెట్టిన ఎక్కువ పాలిచ్చును అట్లే అగ్నీ! మా హవిస్సులను అందుకొనుము మాకు ఫలితము ప్రసాదించుము అందువలన మాకు ధనము, అన్నము మరింత లభించును గాత

**12.** అగ్నీ! మాకొరకు నవ్యుడవై అవతరించుము. మమ్ము పాపములనుండి దాటించుము మాకు శుభములు, సుఖములు కలిగించుము. మాకు భూమి విశాలమగును గాత మా పుత్రులు దౌహిత్రులకు శుభప్రదుడవు అగుము

**13.** అగ్నీ! నీవు మానవుల వ్రతపాలకుడవు అగుచున్నావు దేవతవు అగుచున్నావు యజ్ఞములందు స్తుతించ బడువాడవు అగుచున్నావు.

**14.** దేవతలారా! మీరు విద్వాంసులు మీకు సంబంధించిన యజ్ఞయాగాదులు మాకు తెలియకున్నవి. మేము సక్రమముగా నిర్వర్తించలేకున్నాము విద్వాంసుడగు అగ్ని ఆ లోపమును పూరించును గాత ఋతువులను అనుసరించి దేవతల క్రతువులు జరిపించును గాత

**శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత యందలి**
**మొదటి కాండమున మొదటి ప్రపాఠకము**
**సమాప్తము**

**బహులా న ఉర్వీభవ తోకాయ తనయాయ శంయోః**

**9.** రథమా! నిత్యాగ్ని నుండి సోమయాగమునకు పయనింపుము. బృహస్పతి నీకు అగ్రగామి అగును గాత. పయనము ముగిసినంత భూమండలమునందలి శ్రేష్ఠస్థానమున నిలువుము.

రథాభిమానివగు సూర్యదేవా! శత్రువులగు రాక్షసాదులను యజ్ఞభూమికి దూరముగా ఉంచుము.

**10.** ఇది పూర్వము దేవతలు సేవించిన ప్రదేశము. మేము ఇచటికి చేరుకున్నాము. ఇచట ఋగ్యజుస్సామ మంత్రములచే సోమయాగము పూర్తి చేయుదుము. అట్లు చేసి ధన సమృద్ధి అన్న సమృద్ధి గలవారమై సుఖింతుము.

**నాలుగవ అనువాకము**

(సోమము కొనుట చెప్పబడుచున్నది.)

**1.** కాంతివంత హిరణ్యమా! జుహువు నీకు దేహమగును. ఆజ్యము వర్చస్సు అగును. కావున నీవు జుహువును కలిసికొనుము. ఆజ్యరూపకాంతిని పొందుము.

(బంగారమును దారముతో కట్టి నేతి గిన్నెలో వేయవలెను.)

**2.** వాగ్దేవతా రూపకమగు సోమక్రయణీ! నీవు వేగవంతవు. మనసుచే నిబద్ధింపబడుదానవు యజ్ఞమునకు ప్రియమవు. సత్య ప్రేరణ కలదానవు. నీ ప్రేరణ వలన మంత్రములు చదువు వాక్కును నిబద్ధింతును - **స్వాహా**.

**3.** హిరణ్యమా! నీవు **శుక్రమసి** - దీప్తి కలదానవు. **అమృతం అసి**

ఆజ్యమా! విశ్వేదేవతలకు హవిస్సువు అగుచున్నావు.

(యజమాని ఆజ్యమును చూడవలెను.)

**4.** సూర్యదేవా! ఏతశములను గుర్రముల మీద సాగుచున్నావు. అగ్నిదేవా! నీవు తేజస్సున ప్రకాశించున్నావు. సూర్యుని వలన కంటిని - అగ్ని వలన కంటి పాపను పొందినాను.

**5.** వాగ్రూప సోమక్రయణీ! నీవు చిత్తమవు. మనసువు. బుద్ధివి. దక్షిణవు. యజ్ఞ సంబంధివి క్షతియవు. అదితివి. సోమము విక్రయించువాని కొరకు తూర్పునకు వెళ్ళుము. తదుపరి మాకు ఎదురుగా రమ్ము.

సోమక్రయణీ! హితము కూర్చు దేవత నీ కాలును కట్టివేయును గాత. పూష నిన్ను భయము నుండి రక్షించును గాత. ఇంద్రుడు యాగాధ్యక్షుడు. అతని కొరకు నిన్ను తల్లి అనుమతించును గాత. **పితా అనుమన్యతామ్. సగర్భ్యః** - తోబుట్టువులు - **అనుమన్యతామ్. సయూధ్యఃసఖా అనుమన్యతామ్.**

సోమక్రయణీ! ఇంద్రుని కొరకు సోమదేవుని గూర్చి వెళ్లుము. రుద్రుడు నిన్ను సూర్య మార్గము నుంచి మరలించును గాత.

**స్వస్తి సోమ సఖా పునరేహిరయ్యా.** నీకు శుభము కలుగును గాత. సోమ సఖుడవగుము ధనముతో తిరిగిరమ్ము.

సోమము కొనుటకు బంగారము అవసరము. అంతటితో చాలదు. బేరమునకు మాట అవసరము. కావున సోమక్రయణి స్వర్ణమగును. వాక్కు అగును. గోధనము కూడా అగును.

**అయిదవ అనువాకము**

(సోమక్రయిణి గోవును సోమలత అమ్ముచోటునకు తీసికొని వెళ్లుట చెప్పబడుచున్నది)

**1.** సోమక్రయిణీ! నీవు వసువవు అగుచున్నావు. నీవు **రుద్రాసి. అదిత్యాసి. శుక్రాసి** - ప్రకాశమవు అగుచున్నావు. **చన్ద్రాఽసి** (గోవు అడుగున అడుగు వేయుచు యజమాని 6అడుగులు వేయవలెను.)

**2.** నిన్ను బృహస్పతి సుఖ ప్రదేశమున ప్రవేశపెట్టును గాత. వసువులు, రుద్రులు నిన్ను గుర్తింతురు గాత.

(ఏడవ అడుగు గుర్తును దోసిలిచే గ్రహించవలెను.)

**3.** సోమక్రయిణి యొక్క పాదము పృధివికి శిరస్సు - దేవతల యజనస్థానము - ఘృతపతియు అగును. ఆజ్యమా నిన్ను ఆ పాదపు గుర్తున ప్రవహింపచేయుచున్నాను - **స్వాహా.**

**4.** రాక్షసులు, శత్రువులు నశింతురు గాత. ఇదిగో రాక్షసుల తలలు నరుకుచున్నాను. మేము ద్వేషించువారి, మమ్ము ద్వేషించువారి తలలు ఉత్తరించుచున్నాను.

(జింక కొమ్ముతో గోవు అడుగు గుర్తును పెకిలించవలెను.)

**5.** అధ్వర్యుని వద్ద ధనము ఉండును గాత. యజమాని వద్ద ధనము ఉండును గాత యజమాన పత్ని వద్ద ధనము ఉండును గాత.

(నేతితో తడిసిన ఏడవ అడుగు ధూళిని స్థాలి యందుంచి అధ్వర్యుడు యజమాని దంపతులకు ఇవ్వవలెను.)

**6.** సోమక్రయిణీ దేవీ! నీవు ఊర్వశీ సహితవై నా భార్యను చక్కగా చూడుము.

(యజమాని తన భార్యను సోమక్రయణికి చూపవలెను.)

7. త్వష్ట ప్రజాపతి అనుగ్రహము కలదానను అయినాను. రేతస్సు కలదానను అయినాను నా భర్త రేతస్సును ధరించినాను. వీరుడగు పుత్రుని పొందగలను.

(భార్య యజమానిని చూడవలెను.)

8. నేను ధనసమృద్ధి కల దానను అగుచున్నాను.

(సోమక్రయణిని చూడవలెను.)

**ఆరవ అనువాకము**

(కొలతల సోమక్రయము చెప్పబడుచున్నది )

1. సోమలతా! నీ అంశము మరొక అంశమును కలియును గాక. ఒక కణుపుతో మరొక కణుపు కలియును గాత. నీ సుగంధము యజమాని కోరికలను రక్షించును గాత నీ యొక్క రసము దేవతలను సంతోష పెట్టును గాత. నీవు కొలుచుటకు సాధ్యము కానిదానవు. బంగారమే నిన్ను కొనగలదు.

(అధ్వర్యు హిరణ్య పాణిచే సోమలతను తాకవలెను.)

2. సూర్యుని కాంతి పైలోకములందు ఉండును. ఊహకు అందని రీతి ప్రకాశించును ద్యావాపృధ్వులు భానుని హస్తములు. అతడు వానిచే ప్రేరణ కలిగించును. అతడు యాగములందు ఉండును. ఫలితము కలుగునంత వరకు ప్రోత్సహించు చుండును.

సూర్యుడు రత్నములనిచ్చువాడు. సర్వ దర్శనీయుడు. అందరు అతనిని ధ్యానించుచుందురు అట్టి సవితృదేవతను నేను ప్రార్థించుచున్నాను. అతడు హిరణ్యపాణియై నావద్దకు రావలెను సోమమును కొలత వేయవలెను.

3. కొలువగా మిగిలిన సోమలతా! ప్రజల కొరకు నిన్ను కూర్చుచున్నాను. ప్రాణము కొరకు నిన్ను కట్టుచున్నాను. వ్యానము కొరకు నిన్ను విప్పుచున్నాను. నీవు జనులను అనుసరించి జీవించుము జనులు నిన్ను అనుసరించి జీవింతురు గాత.

(కొలువగా మిగిలిన సోమమును అధ్వర్యుడు మూట కట్టవలెను. మరల విడదీయవలెను )

**ఏడవ అనువాకము**

(సోమము కొనుట చెప్పబడుచున్నది.)

1. సోమము బలకరము. అధికరసయుతము. ఇంద్రియములకు బలము కలిగించునది. పాపనాశిని తేజోవంతము. సుఖకరము. నాశరహితము.

సోమమును అమ్మువాడా! నీకు హిరణ్యము నిచ్చి సోమము కొనుచున్నాను.

హిరణ్యము సహితము తేజోవంతము. సుఖకరము. నాశరహితము. **అమృతమ్ అమృతేన క్రీణామి** - అమృతమగు సోమమును అమృతమగు హిరణ్యమున కొనుచున్నాను. కావున హిరణ్యమిచ్చి సోమము కొనుట న్యాయమగును.

నీకు కేవలము హిరణ్యమేకాదు. ఎడాది దూడగల ఆవును కూడ ఇచ్చుచున్నాను కావున ఈ హిరణ్యము నీకు అదనపు లాభము అగును.

(సోమ విక్రేతకు హిరణ్యమును ఇచ్చి సోమము తీసికొనవలెను ) (**విలువలు సమములైనపుడే క్రయ విక్రయాదులని నాడే గ్రహించబడినదని తెలియవలెను** )

**2.** బంగారము మావద్దనే ఉండవలెను

(సోమ విక్రేత కిచ్చిన బంగారము తీసికొనవలెను.) (అది అదనపు లాభము కదా!)

**3.** మేకా! నీవు పుణ్యములకు దేహమవు. ప్రజాపతికి శరీరమవు. నీవు బహుసంతానమును పోషించు చున్నావు. అట్టి నీ చివరి సంతానమును ఇచ్చి సోమమును కరీదు చేయుచున్నాను. నేను నీకు బంధువును. నీ యొక్క సంతాన ధనము నావద్ద ఉండును గాత.

**4.** తెల్లని ఉన్ని దారము జ్యోతిస్స్వరూప. అది నావద్ద ఉండవలసినది.

(తెల్లని ఉన్ని దారము యజమానికి ఇవ్వవలెను.)

**5.** నల్లని ఊలు దారము సోమ విక్రేత వద్ద ఉండవలెను.

(నల్లని దారము సోమవిక్రేతకు ఈయవలెను )

**6.** సోమమా! నన్ను మంచి మిత్రునిగా భావించుము నాకు మిత్రుడవగుము నావద్దకు రమ్ము. యజమాని కుడితొడపై కూర్చుండుము.

(సోమ విక్రేత నుండి సోమము తీసికొని దానిని యజమాని కుడి తొడపై ఉంచవలెను )

**7.** స్వానభ్రాజాఙ్ఘారే బమ్భారే హస్తసుహస్తకృశానులారా! ఈ గోవులు మున్నగునవి సోమము కొను ధనములు. మీరు వానిని రక్షించండి. వానిని బాధించకండి.

(స్వాన భ్రాజాదులు సప్తసూర్యమండలములు.)

**ఎనిమిదవ అనువాకము**

(సోమము శకటముపై ఎక్కించుట చెప్పబడినది.)

**1.** నేను యజమానిని. సోమము ఆయువు నిచ్చునది. రోగాది ఉపద్రవములు లేకుండ చేయునది. మేఘము మరియు ఓషధుల సారస్వరూపమైనది. దీనిని దేవతలకు లక్ష్యముగా చేసికున్నాను సోమసహితుడనై లేచుచున్నాను.

(యజమాని సోమమునందుకొని లేవవలెను.)

2. సోమమా! నీవు విశాల అంతరిక్షమును అనుసరించి సాగుము.

3. కృష్ణాజినము భూమికి స్థానమగును. సోమము దానిని అందుకొనును గాత.

సోమము ద్యులోకమును నిలిపి ఉంచినది. ఆకాశ పరిమాణమును - భూమి బరువును కొలిచినది. సోమ దేవత మహిమ కలవాడు. ప్రకాశించువాడు అతడు సమస్త లోకములందు వ్యాపించినాడు.

4. వరుణ నామక సోముడు వృక్షములను పెంచినాడు. అంతరిక్షమును విస్తార పరచినాడు అశ్వములకు వేగము కూర్చినాడు గోవులందు పాలు చేర్చినాడు. మనసులందు సంకల్పము కలిగించినాడు. మానవులందు జఠరాగ్నిని నెలకొల్పినాడు. ద్యులోకమున సూర్యుని నిలిపినాడు పర్వతములందు సోమలతను కల్పించినాడు.

5. కిరణములు జగత్తులను చూడదలచినవి. సూర్యుని పైలోకములకు కొనిపోవుచున్నవి.

(కృష్ణాజినమును సోమముపై కప్పవలెను.)

6. ఎద్దులారా! మీరు బరువులు మోయువారు. బండిని లాగువారు. బాధించనివారు. కృషి చేయువారు. మీరు ఇటురండు.

(ఎద్దులను సోమశకటము వద్దకు తేవలెను.)

7. శమ్యా! నీవు ఎద్దును నియంత్రించుదానవు. యోక్త్రమా! నీవు ఎద్దును కాడికి తగిలించి ఉంచుదానవు. పగ్గము బండికి తగిలించబడినది.

(బండికి ఎద్దును కట్టవలెను. 1. శమ్య - కాడి రంధ్రమున వేయు చిర. 2. యోక్త్రము - ఎద్దుకు కట్టు పగ్గము.)

## తొమ్మిదవ అనువాకము

(సోమ శకటమును యజ్ఞ శాలకు తోలుట.)

1. భూతపతి సోమమా! నీవు ప్రాచీనవంశ హవిర్ధానాది స్థలములకు సాగుము. మార్గమందు దొంగల నాయకుడుకాని, అతని అనుచరులు కాని నిన్ను చూడకుందురు గాత. తోడేళ్లు నీ జాడ తెలియకుండును గాత. విశ్వావసు గంధర్వుడు నిన్ను దొంగిలించుటకు చూడకుండును గాత.

సోమమా! నీవు యజమాని యజ్ఞశాలకు త్వరత్వరగా చేరుము. దేవసదృశులగు అధ్వర్యాదులు నీవు నిలుచుటకు స్థలము శుభ్రపరచినారు.

మేము శత్రుంజయము, ధన ప్రాప్యము, శ్రేయోదాయకము, పాపరహితమగు అనుష్ఠానమార్గమును అవలంబించినాము.

(బండిని యజ్ఞశాలకు తోలవలెను.)

**2.** సూర్యుడు సకల జగములను ఆవరించినవాడు. సర్వజ్ఞుడు మిత్ర స్వభావి. అతనికి నమస్కరించుచున్నాము.

ఋత్విజులారా! సూర్యుడు మహాదేవత. అతనిని సత్య స్వరూప కర్మమున సేవించండి. సూర్యుడు దూరమున కనిపించువాడు. దేవతగా ఆవిర్భవించినవాడు. పగటికి సంకేతమైనవాడు ద్యులోకమునకు బిడ్డవలె ప్రీతిపాత్రుడు. అతనిని స్తుతించండి.

(యజమాని సోమశకటమును ఆహ్వానించవలెను)

**3.** **వరుణస్య స్కమ్భనమసి వరుణస్యస్కమ్భసర్జన మస్యున్ముక్తో వరుణస్యపాశః**

(8వ అనువాకపు 7వ మంత్రమున కట్టుట చెప్పబడినది. ఇది విడుచుట శమ్యా యోక్త్రములను విడదీయవలెను.)

## పదవ అనువాకము

(సోమము అతిథి రూపముగ వచ్చినది. దాని సత్కారమునకు అతిథ్యేష్టి చెప్పబడుచున్నది)

**1.** హవిస్సా! అగ్నికి ఆతిథ్యమవగుచున్నావు. **త్వావిష్ణవే నిర్వపామి** - నిన్ను విష్ణువునకు సమర్పించుచున్నాను. సోమమునకు ఆతిథ్యమవగుచున్నావు. **త్వా విష్ణవే నిర్వపామి.** అతిధికి ఆతిధ్యమవగుచున్నావు. **త్వావిష్ణవే నిర్వపామి.** ధనములనిచ్చు అగ్నికి ఆతిధ్యమవగుచున్నావు **త్వావిష్ణవే నిర్వపామి.** సోమమును తెచ్చిన శ్యేనమునకు ఆతిధ్యమవగుచున్నావు **త్వావిష్ణవే నిర్వపామి.**

**2.** సోమమా! ప్రాతస్సవనాదులు నీకు సంబంధించినవి. వాటి యందు హోమము చేయబడుచున్నది. నీవు ఆ హోమములను అన్నింటిని స్వీకరింపుము నీవు గృహములను వర్ధిల్ల చేయుదానవు. నీ అనుగ్రహమున మాపుత్ర పౌత్రాదులు వీరులు అగుచున్నారు. నీవు ఆ వీరులను పాలించు దానవు. ప్రాచీన వంశమను యజ్ఞశాలకు చేరుము

(యజమాని సోమమును యజ్ఞశాలకు చేర్చవలెను)

**3.** కృష్ణాజినమా! నీవు భూమికి స్థానమవగు చున్నావు. భూమియొక్క స్థానమున పరచుకొనుము

**4.** సోమమా! నీవు వరుణ పాశమును విడిపించుదానవు. యజ్ఞవ్రతమును అవలంబించినదానవు వరుణ సంబంధివి. అందువలన మాకు వరుణాదుల సఖ్యము లభించును. మేము కర్మ భ్రష్టులము కాకుందుము గాత.

(సోమముపై వస్త్రము కప్పవలెను.)

**5.** ప్రాణము కొరకు '**త్వాగృహ్ణామి**' - నిన్ను తీసికొనుచున్నాను. మనస్సు కొరకు **త్వాగృహ్ణామి.** జఠరాగ్ని కొరకు **త్వాగృహ్ణామి.** శక్తి స్వరూపము కొరకు **త్వాగృహ్ణామి.** శక్తి, ఓజిష్ఠముల కొరకు త్వాగృహ్ణామి.

**6.** తనూన ప్ర్రాజ్యమా! నిన్ను పూర్వము తిరస్కరించినవారు లేరు. నీవు ఎవరి చేతను తిరస్కరించబడని దేవతలకు సారమవు. అన్యోన్య విరోధముల నుండి మమ్ము రక్షించుచున్నావు. విరోధమునకు నీవు కారణము కాకున్నావు.

(ఋత్విజులు ఆజ్యమును స్పృశించవలెను.)

**7.** దీక్షాపతి నా దీక్షను గుర్తించును గాత. తపస్తతి నా దీక్షను గుర్తించును గాత నేను శపథమును పొందినాను.

తనూనప్ర్రాజ్యమా! నన్ను సన్మార్గమున నడిపించుము.

**పదకొండవ అనువాకము**

(రాక్షస విజయ నిమిత్త మంత్రములు చెప్పబడుచున్నవి.)

**1.** సోమమా! నీవు దేవతా స్వరూపవు. నీ యొక్క సూక్ష్మావయవము శుష్కించు చున్నది నశించుచున్నది. అది సోధనమును ఎరిగిన ఇంద్రుని కొరకు వర్ధిల్లును గాత. నీవు సహితము ఇంద్రుని కొరకు వర్ధిల్లుము. ఋత్విజులకు ధనలాభము కలిగించుము. నీ అనుగ్రహమున నేను అభిషవ తంత్రమును పొందగలవాడను.

**2.** ద్యావాపృథ్వులారా! మేము యజ్ఞము చేయుచున్న వారలము. మాకు యజ్ఞమును, ధనమును, అన్నమును, ఐశ్వర్యాదులను కలుగచేయండి.

**దివే నమః పృథివ్యై నమః**

**3.** అగ్నీ! నీవు సర్వ వ్రతములకు అధిపతివి. నేను వ్రతములను ఆచరించుచున్నాను. నా మనసు నీకే అర్పితమైనది. నీవు వ్రతమును రక్షించుచున్నావు కదా! అందువలన నీ మనసు నాయందు చేరినది. అట్లగుట వలన మనము ఉభయులము వ్రతులమే అయినాము. **నౌవ్రతాని సహప్రవర్తన్తామ్.** మన వ్రతములు జతగా జరుగును గాత.

(యజమానికి అవాంత దీక్షనీయవలెను.)

**4.** అగ్నీ! నీ శరీరము రుద్ర సంబంధము. అది మమ్ము రక్షించును గాత. **తస్యాస్తే స్వాహా.** నీ శరీరమునకు **స్వాహా.** `

(యజమానిచే అవాంత దీక్షను అనుష్ఠింపచేయవలెను.)

**5.** అగ్నీ! నీవు లోహ నిర్మితుడవు. వృద్ధతముడవు. తాకుటకు అసాధ్యుడవు. అట్టి నీవలన ఉగ్రవాక్కును త్వేష వాక్కును నశింపచేసినాను. **స్వాహా.**

అగ్నీ! నీవు రజత నిర్మితుడవు. వృద్ధతముడవు. తాకుటకు అసాధ్యుడవు. అట్టి నీవలన ఉగ్రవాక్కును, త్వేషవాక్కును నశింపచేసినాను. **స్వాహా.**

అగ్నీ! నీవు హిరణ్య నిర్మితుడవు. వృద్ధతముడవు. తాకుటకు అసాధ్యుడవు. అట్టి నీవలన ఉగ్రవాక్కును, త్వేష వాక్కును నశింపచేసినాను **స్వాహా.**

(ఉగ్రవాక్కు ఐహికము. త్వేషవాక్కు ఆముష్మికము ఈ ఆహుతిని ఉపసత్తు అందురు ఇవి ఉపసదములు.)

## పన్నెండవ అనువాకము

(11వ అనువాకమున మూడు ఉపసదములు చెప్పబడినవి. వానిలో రెండవ ఉపసద్దినమునందు 32 అడుగుల వేదికకు పూర్వభాగమున ఉత్తరవేది నిర్మించుట చెప్పబడుచున్నది.)

**1.** ఉత్తరవేదీ! నాకు అగ్ని రూప ధనమును అందించుము. జ్వాలా రూప అగ్ని తేజస్సును అందించుము. నేను అగ్నిని ఆరాధించువాడను. నన్ను రక్షింపుము. **అవతాన్మావ్యధితమ్** - అగ్ని జ్వలింపడేమోనని వ్యధచెందుచున్న నన్ను రక్షింపుము.

**2.** ఉత్తరవేది యందున్న అగ్నీ! నీవు నభోనామ్నవు. అంగిరస నామకుడవు. నీవు చాత్వాలమందలి మెత్తని మట్టి యందున్నావు. ఆయుష్ప్రదమగు నభోనామమున **ఏహి** - విచ్చేయుము. నీనభోనామమును తిరస్కరించగలవారు లేరు. యజ్ఞ సంబంధివగు నిన్ను పిలుచుచున్నాను. ఉత్తర వేది యందు ఆ ధానము చేయుచున్నాను.

(ఉత్తరవేది యందలి ధూళిని తొలిగించవలెను.)

**3.** రెండవ మంత్రమును మరి రెండు సార్లు చదివి ధూళిని తొలగించవలెను. మంత్రము లేకుండ నాలుగవ సారి తీసివేయవలెను.

**4.** ఉత్తరవేదీ! నీవు సింహివి. కీర్తనీయవు.

(అధ్వర్యుడు ఇసుక కలుపవలెను.)

**5.** ఉత్తరవేదీ! **ఉరు ప్రథస్వ** - గొప్పగా విస్తరిల్లుము. యజమాని నిన్ను మరింత విస్తరింపచేయును గాత. నీవు గట్టిదానవు. దేవతల కొరకు పరిశుద్ధవగుము. వారి కొరకు ప్రకాశించుము.

6. ఉత్తరవేదీ! **ఇంద్రఘోషః వసుభిః పురస్తాత్** - తూర్పు దిశన - **పాతు**- రక్షించును గాత.
**మనోజవాః త్వాపితృభిః దక్షిణతః పాతు.**
**ప్రచేతాః త్వారుద్రై పశ్చాత్** - పశ్చిమ దిశన - **పాతు.**
**విశ్వకర్మాత్వా ఆదిత్యైః ఉత్తరతః పాతు.**

7. ఉత్తరవేదీ! నీవు సింహివి. శత్రుసంహారకవు **స్వాహా!**
సింహివి. చక్కని సంతానమును, భృత్యులను ఇచ్చుదానవు **స్వాహా.**
సింహివి. పశువులు మున్నగు ధనములు ఇచ్చుదానవు. **స్వాహా.**
సింహివి. ఐశ్వర్య, ప్రతిష్ఠ ప్రదాయినివి. **స్వాహా.**
దేవతలను అర్థించు యజమానికి **స్వాహా.**

8. జుహూ! **త్వాభూతేభ్యః ఉద్వృష్ణామి** - పైకి లేపుచున్నాను.

9. మధ్యమపరిధే! **త్వమ్ విశ్వాయురసి. పృధివీమ్ దృంహ** - దృఢపరచుము.
దక్షిణపరిధే! **ధృవక్షితిరసి** - స్థిరమైనదానవు. అంతరిక్షం దృంహ.
ఉత్తరపరిధే! **అసి అచ్యుతక్షిత్** - నశింపని నివాసము కలదానవు. దివందృంహ.

10. **'అగ్నేర్భస్మాసి పురీషమసి'** సమిధలారా! మీరు అగ్నికి ప్రకాశమగుచున్నారు. పూరకములు అగుచున్నారు.

(మిగిలిన సమిధలను వేదియందు ఉంచవలెను.)

## పదమూడవ అనువాకము

(హవిర్ధానము - హవిస్సులు ఉంచు శకటమును గూర్చి చెప్పబడుచున్నది.)

1. యజమాని విద్వాంసుడు. ఘనుడు. విప్రుడు. ఇతని హోతలు విప్రులు. వారు యజమాని మనసును నియంత్రించుచున్నారు.

సవితా దేవత సృష్టి ఎంతో గొప్పది. మార్గములను తెలిపిన అతడొక్కడే సర్వమును కలిగించుచున్నాడు.

(అధ్వర్యుడు గార్హపత్యాగ్నియందు ఆజ్యమును హోమము చేయవలెను.)

2. అక్షదేవా! గృహములందు మంచి మాటలవాడవు అగుము. శుభములు గూర్చు పలుకులు పలుకుము.

అక్షదేవతలారా! యజమాని దేవతలను గూర్చి యజ్ఞము చేయుచున్నాడని దేవతలకు చాటండి.

(అధ్వర్యుడు అనుమంత్రణ చేయవలెను.)

**3.** మాకు కలుగు పుత్రుడు అందరకు జీవనాధారుడు, వీరుడు. అందరను వశపరచుకొనగలవాడు కావలెను. అతడు కర్మల యందు అలసట ఎరుగనివాడు కావలెను.

**4.** విష్ణువు విశ్వమును మూడుగా విభజించినాడు. అతడు ఒక అడుగు భూమి మీద, మరొకటి అంతరిక్షమున, మూడవది భూలోకమున పెట్టినాడు. ఈ విష్ణువు యొక్క పాదరేణువులందు సకల ప్రపంచము అంతర్భూతమై ఉన్నది.

మంచి పాలిచ్చు ఆవులు - మంచి ఆహారములు గల ద్యావాపృథ్వులు - మానవాళి కొరకును, వారి యశస్సు కొరకును ఉపయోగపడును గాత.

విష్ణువు సమస్త జగములను విభజించి స్థాపించినాడు కదా! ఆ విష్ణువే లోకములన్నింటిని స్వతేజమున పోషించుచున్నాడు.

(అధ్వర్యుడు హవిర్ధానమునకు అభిముఖముగా యజ్ఞము చేయవలెను.)

**5.** హవిర్ధానములారా! మీరు ఈ యజ్ఞమును బాధలు లేకుండ చేయండి. యజ్ఞమును పైలోకమున ఉన్న దేవతలకు అందించండి. అసురులకు అందనీయకండి.

**6.** శకటములారా! మీరు ఉత్తరవేది యొక్క పశ్చిమ భాగమున మొదటి మూడడుగులు విడువండి. మిగిలిన ప్రదేశమున విహరించండి.

**7.** విష్ణువా! నీవు స్వర్గము నుండి గాని, భూమి నుండి గాని, అంతరిక్షము నుండి గాని చేతులందు ధనము నింపుకొని రమ్ము. ఆ చేతులతోనే మాకు రత్నాదులను అందించుము.

విష్ణువు పృథివీ సంబంధమగు పరమాణువులను నిర్మించినాడు. స్వర్గము నేలకూలకుండ నిలిపిఉంచినాడు. మూడు లోకములందు మూడు అడుగులు పెట్టినాడు. విష్ణోర్నుకం వీర్యాణి ప్రవోచం - ఆ విష్ణువు యొక్క ఘనకార్యములను ప్రవచించుచున్నాను.

**8.** దర్భమాలే! **త్వంవిష్ణోః లలాటం అసి**

**9.** **విష్ణోః పృష్ఠమ్ అసి** - వెన్ను - వీపు

**10.** పైన కప్పిన చర్మములారా! మీరు విష్ణువునకు దవడలు అగుచున్నారు.

**11.** రజ్జువా! విష్ణువునకు బంధనము అగుచున్నావు.

**12.** గ్రంథీ! నీవు విష్ణువునకు ధ్రువమవు అగుచున్నావు. హవిర్ధాన మంటపమా! నీవు విష్ణు సంబంధివి. నిన్ను తాకుచున్నాను.

## పదునాలుగవ అనువాకము

(సామిధేనీ, యాజ్య, పురోనువాక్య మంత్రములు చెప్పబడుచున్నవి. సమిధలచే చేయునది సామిధేని. అప్పటికి జనించిన శత్రువులను సంహరించునది పురోనువాక్యమగును. పుట్టబోవు శత్రువును సంహరించునది యాజ్య అగును.)

**1.** సామిధేనీ ఋక్కు : - అగ్నీ! మృగమును పట్టుటకు పరచిన పాశము వంటి బలమును ఇమ్ము. ఆ బలమున మేము రాక్షసులను నివారించగలము. మంత్ర సహితుడైన రాజు ఏనుగు మీద వలె రాక్షసుల మీదికి ఉరుకుము. శత్రుసేనను వెంబడించి హింసించుము. పారిపోవు సేనలను తరుముము. మిగిలిన సేనను బాణములచే గ్రుచ్చుము.

(1 - 15 వరకు సామిధేని ఋక్కులు.)

**2.** అగ్నీ! నీ విస్ఫులింగములు భ్రమణ శీలములు. అవి సర్వత్ర రాలుచున్నవి. నీవు మరింత జ్వలింపుము. ఆ మంటలతో అసురులను తాకుము. నీవు హుత హవిస్సులతో కూడినవాడవు నీ విస్ఫులింగములు మీద పడునవి. కాల్చునవి. వానిని మహోజ్వాలలను సృష్టించుము. రాక్షసులను హింసించుము.

**3.** అగ్నీ! రాక్షసులు చిత్రవధ చేయువారు. మాకు శత్రువులు. వారు దగ్గర ఉందురు. దూరమున ఉందురు. వారిని కట్టి పడవేయుటకు త్వరత్వరగా పాశములను కలిగించుము. నిన్ను హింసించగలవాడు లేడు. నీవు మమ్ము పాలించుము. బాధించునట్టి ఎంతటి రక్కసియు నీ వద్దకు చేరకుండును గాత.

**4.** అగ్నీ! జాగృతుడవగుము. లెమ్ము. సర్వత్ర శత్రువుల మీద పడుము. నీ ఆయుధములు పదునైనవి. నీవు శత్రువును మిగులనీకుము. పూర్తిగా దహించుము. సమిధాన అగ్నీ! మా మీద పగబూనిన వానిని పడగొట్టుము. ఎండిన కట్టెను వలె భస్మము చేయుము.

**5.** అగ్నీ! నీవు పైకి ఎగయుము. దైవిక శక్తులను ఆవిష్కరించుము. రాక్షసుల శక్తులను క్షీణింపచేయుము. దెబ్బ తిన్న, దెబ్బ తినని శత్రువుల నందరను హతమార్చుము.

**6.** యవ్వనాగ్నీ! నీవు నీ ఇంట ఉందువు. సర్వత్ర వ్యాపించి ఉందువు. యజమాని నీకు హవిస్సులు అర్పించుచున్నాడు. అతనికి నీ మంచి మనసు తెలియును. నీవు ధనములకు స్వామివి యజమానికి గృహము, యశస్సు నిత్యము కలిగించు చుండుము.

**7.** అగ్నీ! నీకు యజమాని స్వగృహమున - జీవిత పర్యంతము నిత్య హవిస్సులు సమర్పించుచున్నాడు. మంత్రములచే నిన్ను సంతోషపెట్టుచున్నాడు. అందువలన యజమాని సౌభాగ్యవంతుడు, మంచి దాత కావలెను. అతని యాగములన్నియు సుదినములవి కావలెను

**8.** అగ్నీ! నీవు అనుగ్రహబుద్ధివి. నిన్ను నేను పూజించుచున్నాను. ఈ వాక్కు అర్వాచీనము. స్తుతిరూపము. దీనిని నీ కొరకు మరల మరల ఉచ్చరించుచున్నాను. ఇది నీ మనసునకు పట్టును గాత. మమ్ము అనుగ్రహింపుము. మేము మంచి రథములు, గుఱ్ఱములు కలిగి నిన్ను సేవింతుము. నీవు నిత్యము మాకు సామర్థ్యము కలిగించుము.

**9.** అగ్నీ! ఈ లోకమున తన మేలు కోరువాడు రాత్రింబవళ్ళు నిన్నే సేవించుచున్నాడు. మేము సన్మనస్కులమై నిన్ను పూజించుచున్నాము. మమ్ము అనుగ్రహింపుము. మేము ధనికులము అగుదుము. నిన్ను సేవింతుము.

**10.** యజమాని హవి రూప ధనముతో నిన్ను చేరుచున్నాడు. నీవు అతనిని రక్షించుచున్నావు. అతడు చక్కని గుఱ్ఱములు కలవాడు - హిరణ్యము కలవాడు అగుచున్నాడు.

**11.** అగ్నీ! నిన్ను చుట్టమును చేసికున్నాను. అంతే. నా మాటలచే అసురల తేజస్సును అడుగంటించినాను. నా తండ్రి గోతముని వంటి ఉపాధ్యాయుడు. అతని ద్వారా నాకు నీ చుట్టరికము కలిగించుము.

అగ్నీ! నీవు దేవతల ఆహ్వాతవు. యువతముడవు. యాగనిష్పాదకుడవు. మా అధ్యయనముల అర్థము తెలిసినవాడవు అగుచున్నావు.

**12.** అగ్నీ! నీ కిరణములు ఉత్తమములు. మిథ్యారహితములు. మూర్ఛారహితములు. దురిత తమో నివారకములు. సుఖసేవ్యలు. అప్రమత్తలు. బాధించనివి. శ్రమ ఎరుగనివి. పాలించునవి. ఒకేసారి సర్వత్ర ప్రసరించునవి. అట్టి నీ కిరణములు ఈ యాగస్థానమున ఉండవలెను. రక్షించవలెను.

**13.** అగ్నీ! నీ కిరణములు మంచిగా పాలించునవి. అవి 'మమత' యను స్త్రీ యొక్క అంధ సంతానమును చూచినవి. వారి అంధత్వము పోగొట్టినవి - రక్షించినవి.

అగ్నీ! నీవు సర్వజ్ఞుడవు. చక్కని పనుల నీ కిరణములను రక్షించినావు. శత్రు రాక్షసులు ఆ కిరణములను పరాభవించదలచినారు. పరాభవించజాలరైరి!

**14.** అగ్నీ! మేము నీసహితులమై యజ్ఞము చేయుచున్నాము. నీవు మాకు రక్షకుడవు అగుచున్నావు. నీ ప్రేరణ వలననే మేము అన్నము తినుచున్నాము. సత్య సంరక్షక అగ్నీ! మాకు ఇహ, పరములనొసంగుము.

అగ్నీ! నీ భక్తులను కించపరచవు. వారి వ్రతములను పూర్తి చేయించుము.

**15.** అగ్నీ! సామిధేని ఋక్కుల చేత నిన్ను సేవించుచున్నాము. "**అయాతే అగ్నే! సమిధా విధేమ**" మా స్తుతులను గ్రహించుము. రాక్షసులను దహించుము. నీ తేజస్సు ఉపకారకమగును. శత్రువుల ద్రోహమునుండియు వారి నిందల నుండియు - అనుష్ఠాన లోపము నుండియు మమ్ము కాపాడుము.

**16.** పురోనువాక్యము - అగ్ని రాక్షస సంహారకుడు. అన్నవంతుడు. అట్టి అగ్నిని అభిముఖముగా ప్రజ్వలింపచేయుచున్నాను.

అగ్ని జగములకు మిత్రుడు, విశాలుడు, రక్షకుడు, అతనిని సేవించుచున్నాను.

అగ్ని యజ్ఞములందు తీక్ష్ణముగా జ్వలింపచేయబడువాడు. అతడు హింసకుల నుండి మమ్ము రేయింబవళ్ళు రక్షించును గాత.

**17.** యాజ్య - ఈ అగ్ని తేజస్సు ఎంతటిది! ఎంత ప్రకాశించుచున్నాడు!! అగ్ని యొక్క రెండు జ్వాలలు అమితముగా మండుచున్నవి!!! అవి అసుర సంబంధములను, అతిక్రమింపనలవి కాని మాయలను ధ్వంసము చేయుటకు సాగినవి.

**18.** యాజ్య - అవి అగ్ని కిరణములు. వాడియైన ఆయుధములు. పురోడాశముచే ధ్వని చేయునవి. అవి రాక్షసులను సంహరించుటకు ద్యులోకమునందు సహితము ప్రసరించును గాత. ఈ అగ్ని జ్వాలలు మమ్ము సంతోషపరచుటకే శత్రువులను నశింపచేయుచున్నవి. అందువలననే అసుర బాధలు మమ్ము తాకకున్నవి. **"భామానవరన్తే పరిబాధో అదేవీః"**

**శ్రీమదాంధ్రవచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత**
**మొదటి కాండమునందలి రెండవ ప్రపాఠకము సమాప్తము.**

యస్తేస్తన: శశయో యోమయో భూర్యోరత్నధా వసువిద్యా: సుదత్ర: ।
యేనవిశ్వాపుష్యసి వీర్యాణి సరస్వతి తమిహదాతవోఽక: ఉర్వ్యన్తరిక్షమన్వేమి ॥

## మూడవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

(ఈ ప్రపాఠకమున అగ్నిషోమీయ పశువు ప్రతిపాదించబడినది)

(ఈ అనువాకమున మిగిలిన మండప నిర్మాణాదులు చెప్పబడుచున్నవి.)

1. అభ్రీ! నేను సవిత అనుజ్ఞ యందు ఉన్నవాడను అశ్వినుల బాహువులతోను - పూష హస్తములతో నిన్ను పట్టుకొనుచున్నాను.

(అభ్రి అనగా త్రవ్వుగోల - అధ్వర్యుడు అభ్రిని పట్టుకొన వలెను)

2. నీవు అభ్రివి. మాకు శత్రువవు కావు.

(1. అవటమున అభ్రితో గీతలు గీయవలెను 2. పితృదేవతల లోకమునకు సంకేతము అవటము)

3. పరిలిఖితగ్ం రక్ష: పరిలిఖితా అరాతయ ఇదమాహగ్ం రక్షసోగ్రీవా అపి కృన్తామి యోఽస్మాన్ద్వేష్టి యంచ వయం ద్విష్మ ఇదమస్యగ్రీవా అపికృన్తామి.

అర్థమునకు 1 - 2 - 5 చూడండి.

4. అభ్రీ త్వాదివేప్రోక్షామి. నిన్ను ద్యులోకము కొరకు ప్రోక్షించుచున్నాను. త్వా అంతరిక్షాయ ప్రోక్షామి. త్వా పృథివ్యైప్రోక్షామి.

(అధ్వర్యుడు అభ్రియొక్క అగ్ర, మధ్య, మూల భాగములను ప్రోక్షించవలెను)

5. పితృదేవతలు ఉండు 'అవట' స్థానము పరిశుద్ధమగును గాత.

(అధ్వర్యుడు అవటమున నీరు పోయవలెను.)

6. ధాన్యమా! యవోఽసి - నీవు వేరుచేయుదానవు. మమ్ము ద్వేషించు రాక్షసులను శత్రువులను మానుండి వేరుచేయుము.

(అవటమున ధాన్యము చల్లవలెను.)

7. బర్హిస్సా! నీవు పితరులకు స్థానమవు అగుచున్నావు.

(దర్భల కట్టను ఊడదీసి అవటమున పరచవలెను.)

**8.** మేడి కొమ్మా! స్వర్గలోకపు ఉపరి ప్రదేశమున నిలువుము. అంతరిక్షమును పూరింపుము. భూమిని గట్టిపరచుము.

(మేడికొమ్మ పైకెత్తి పట్టుకొనవలెను.)

**9.** మేడికొమ్మా! నిన్ను మిత్రా వరుణులు పట్టుకున్నారు. అందువలన నీవు దృఢపడినావు. మారుతుల పుత్రుడు 'ద్యుతానుడు' నిన్ను అవటమున ఉంచునుగాక.

(మేడికొమ్మను అవటప్రదేశమున ఉంచవలెను.)

**10.** మేడికొమ్మా! నీవు బ్రాహ్మణ్యమును ఇచ్చుదానవు. క్షత్రియత్వమును ఇచ్చుదానవు. మంచిసంతానమును ఇచ్చుదానవు. ధనసమృద్ధి కలిగించు దానవు. నిన్ను భూమియందు ఆరోపించుచున్నాను.

(మేడికొమ్మను పాతి మట్టితో పూడ్చవలెను.)

**11.** దండమా! నీవు బ్రాహ్మణ్యమును దృంహ - దృఢపరచుము. క్షత్రమ్ దృంహ. ప్రజామ్ దృంహ. ధనసమృద్ధిని దృంహ.

(దండముతో మట్టిపై కొట్టవలెను.)

**12.** ద్యావాపృథివీ రూపలైన మేడికొమ్మ అగ్ర, మూలములారా! ఘృతమున సంతృప్తులగుడు.

(మేడికొమ్మ మీద నేయి పోయవలెను.)

**13.** ఔదుంబరీ! నీవు సమస్త జనులకు నీడవు. ఇంద్రునకు స్థానమవు అగుచున్నావు.

**14.** ఇంద్రా! నీవు స్తుత్యుడవు. దీర్ఘాయువవు. మా స్తుతులు వర్ధిల్లునవి. అవి నిన్ను చుట్టు కొనును గాత. మా సేవలు నీకు ఇష్టమగును గాత.

**15.** రజ్జువా! ఇంద్రునకు బంధనమగుచున్నావు. గ్రంథీ! ఇంద్రునకు ధ్రువమవగుచున్నావు. ఇంద్రదేవతాకమవు. ఇంద్రునకు ప్రియమగును గాత.

## రెండవ అనువాకము

(గర్తముల నిర్మాణము చెప్పబడుచున్నది.)

**1.** ఉపరవములు విష్ణుదేవతాకములు. నేను వానిని త్రవ్వుచున్నాను. ఈ ఉపరవములు రాక్షస నాశకములు. వలగ నాశకములు.

(1. ఉపరవములు - గుంతలు. 2 వలగములు - విరోధినాశనమునకు ఎముకలు, వెంట్రుకలు, కాలిదుమ్ము పాతబట్టలో కట్టి పాతినవి.)

2. మాతో సముడు కాని - అసముడు కాని పాతిపెట్టిన వలగమును పెల్లగించుచున్నాను. మాకు శత్రువు - సమానుడైనను, అసమానుడైనను - యజమాని అడుగు క్రిందపడి ఉండునట్లు చేయుదును. గాయత్రీ ఛందమున వలగము బాధింపబడును గాత

(గుంతనుండి దుమ్ము తీయవలెను.)

3. యజమాని అడుగుచున్నాడు: -

ఈ ఉపరవములందు ఏమి ఉన్నది?

అధ్వర్యుడు చెప్పుచున్నాడు :

**భద్రమస్తి,** భద్రము కలదు.

యజమాని అనుచున్నాడు :

ఆ క్షేమము మన ఉభయులకు కలుగునుగాక.

4. ఉపరవమా! నీవు అభ్యంతర శత్రువును వధించుదానవు. వివిధరీతుల ప్రకాశించుదానవు అగుచున్నావు.

ఉపరవమా! బాహ్యాశత్రువును వధించు దానవు, చక్కగా ప్రకాశించుదానవు అగుచున్నావు

ఉపరవమా! ఇతర శత్రువును వధించు దానవు, స్వయం ప్రకాశవు అగుచున్నావు.

ఉపరవమా! అన్ని దేశములందలి శత్రువులను వధించుదానవు, సర్వప్రకాశవు అగుచున్నావు.

5. విష్ణుదేవతాకములైన రాక్షసులను నశింప చేయువానిని, వలగములను ప్రోక్షించుచున్నాను వైష్ణవ రక్షోహణములను వలగములను నీటితో తడుపుచున్నాను.

ధాన్యమా! నీవు వేరుచేయుదానవు. మమ్ము ద్వేషించు శత్రువులను - రాక్షసులను మానుండి వేరుచేయుము.

వైష్ణవ రక్షోహణ వలగముల ఉపరవములందు దర్భలు పరచుచున్నాను.

వైష్ణవ రక్షోహణ వలగముల ఉపరవములందు హోమము చేయుచున్నాను.

6. వైష్ణవ రక్షోహణ, వలగముల మీద రెండు ఫలకములను ఉంచుచున్నాను.

వైష్ణవ రక్షోహణ, వలగముల ఫలకములను తడిచేతితో తుడుచుచున్నాను.

వైష్ణవ రక్షోహణ, వలగముల ఫలకములను పరచుచున్నాను.

వైష్ణవ రక్షోహణ, వలగముల ఫలకములను తాకుచున్నాను.

(ఆ విధముగా అధ్వర్యుడు చేయవలెను.)

7. పాషాణమా! నీవు గొప్పదానవు. పెద్దపెద్ద రాళ్ళు అవయవములుగా గల దానవు. ఇంద్రుని కొరకు మహారావము చేయుము.

## మూడవ అనువాకము

(అగ్నీధ్రీయ సదస్సు మున్నగు స్థానములందలి 'ధిష్ణియము' ల గురించి చెప్పబడుచున్నది. 'ధిష్ణియ' అగ్నిస్థానమగును.)

1. అగ్నీధ్రీయమా! నీవు వివిధరూపములు కలవాడవు.

హోత్రీయమా! నీవు హవ్యవాహనుడవు.

మైత్రావరుణీయమా! నీవు మిత్రావరుణ స్వరూపవు.

బ్రాహ్మణాచ్ఛంసీ! విశ్వేదేవ 'తుథ' దేవతాస్వరూపవు.

పోతృస్థాని! నీవు మహా విద్వాంసుడవు.

నేష్టృస్థానీయమా! నీవు సోమరక్షకమగు అంఘారి నామదేవతవు. బంభారినామదేవతవు.

అచ్ఛావాకమా! అవస్యు, దువస్యులనెడి వాయు స్వరూపమవు.

మార్జాలీయమా! నీవు శోధకుడవు, మార్జనస్థానభూతుడవు.

ఆహవనీయమా! నీవు ప్రకాశించువాడవు. కృశించినను సమృద్ధినొందించువాడవు.

ఆస్థానమా! నీవు పరిషదమునందు పవిత్రుడవు.

చాత్వాలమా! శ్రేష్ఠగమనమున అంతరవకాశము కలవాడవు.

పశుశ్రపణమా! నీవు రాక్షసాదులతో కలియక హవిస్సును పక్వము చేయువాడవు.

ఔదుంబరీ! నీవు దక్కని నివాసము కలిగి స్వర్గమును ప్రకాశింపచేయువాడవు.

బ్రాహ్మసదనమా! నీవు బ్రహ్మజ్యోతిస్థానమవు, స్వర్గతుల్యస్థానమవు.

నూతన గార్హపత్యమా! అజ, ఏకపాద దేవతా స్వరూపుడవు.

పరిత్యాజ్య గార్హపత్యమా! నీవు అహిర్బుధ్న్య దేవతా స్వరూపుడవు.

అగ్నీ! నీవు అగ్నీధ్రీయాది పదహారు స్థానములందు ఉన్నవాడవు. ఉగ్రమగు సైన్యము కలిగి మమ్ము రక్షింపుము. నాకోరికలు తీర్చుము. నన్ను బాధింపకుము.

(ఇవి 16 అగ్నిస్థానములు. వీటికి పదహారుగురు ఋత్విజులుందురు. 1. బ్రహ్మ 2. ఉద్గాత. 3. హోత. 4. అధ్వర్యు. 5. బ్రాహ్మణాచ్ఛంసి. 6. ప్రస్తోత. 7. మైత్రావరుణ. 8. ప్రతిప్రస్థాత. 9. పోత. 10. ప్రతిహర్త 11. అచ్ఛావాకుడు. 12. నేష్ట. 13. అగ్నీధ్రుడు. 14. సుబ్రహ్మణ్యుడు. 15. గ్రావస్తుత్. 16. ఉద్గాత.)

## నాలుగవ అనువాకము

(వైసర్జన హోమము చెప్పబడుచున్నది)

1. సోమమా! నీవు రాక్షసులకు, శత్రువులకు, శత్రువులు ప్రేరణ కలిగించిన వారికి నియంతవు అగుచున్నావు. మమ్ము వారు బాధించని చోట ఉంచినావు. పాలించుచున్నావు కావున నీవే మాకు బలమవు - **స్వాహా.**

సోమమా! నీవు మా విషయమున ప్రీతికలదానవు. రాక్షసులకు అగుపించకుండుటకు అల్పాకారివు అగుచున్నావు. నేతి చుక్కను త్రాగుము - **స్వాహా.**

అగ్ని మాకు శ్రేయస్సులు కలిగించును గాక. శత్రువులను చీల్చును గాక. ముందుకు ఉరుకును గాక. అగ్ని సంతుష్టుడగును గాక. శత్రువును జయించును గాక అన్నము కొరకు జరుగు యుద్ధములందు అగ్ని జయించును గాక

ఆహవనీయాగ్నీ! నీవు సర్వవ్యాపివి. మా శత్రువుల మీద నీ జ్వాలా ప్రతాపము చూపుము మా కొరకు గృహ ధనాదులను ఆర్జించుము. నీవు ఘృతమున వర్ధిల్లువాడవు. హోమపు నేతిని త్రాగుము. యజ్ఞకర్తను ఎంతో వృద్ధి పొందింపుము.

(అధ్వర్యుడు స్రువపు ఘృతమున నాలుగు మారులు శాలాముఖీయమునందు వైసర్జన హోమము చేయవలెను.)

2. సోమమునకు హవిర్ధాన మార్గము తెలియును. అది - దేవతల స్థానమగు - హవిర్ధాన స్థలమునకు పోవుచున్నది. అందుకు హవిర్ధాన స్థలము అలంకరించబడినది. అందు గ్రహ, చమసాది హవిస్సులు ఉంచబడినవి. అందువలన అది యజ్ఞకారణమైనది.

3. కృష్ణాజినమా! నీవు భూమికి స్థానమవు. సోమమా - భూమికి స్థానమగు - కృష్ణాజినమున ఆసీనవగుము.

(అధ్వర్యుడు హవిర్ధాన మంటపపు దక్షిణదిశన కృష్ణాజినము పరచి దాని మీద సోమమును ఉంచవలెను.)

4. పవిత్రదేవా! ఇది దేవతల సోమము. దీనిని ఇంతవరకు యజమాని కాపాడినాడు. ఇకముందు నీవు కాపాడుము. నిన్ను ఎంతటివాడును బాధింపకుండును గాక.

(అధ్వర్యుడు సోమమును దేవతలకు అర్పించవలెను .)

5. సోమమా! నీవు దేవతవు. మీ దేవతలందు చేరుచున్నావు. నేను మానవుడను. నాకు సంతానము, సమృద్ధి కలుగుచున్నది.

(అధ్వర్యుడు సోమము ముందు నిలువవలెను.)

6. **నమోదేవేభ్యః** (అధ్వర్యు తూర్పునకు నమస్కరించవలెను.)

**స్వధాపితృభ్యః** (దక్షిణమునకు నమస్కరించవలెను.)

**ఇదమహం నిర్వరుణ్యా పాశాత్** - దీనిని వరుణ పాశము నుండి విడిపించుచున్నాను. (దక్షిణము నుండి మరలును.)

**సువరభి విఖ్యేషమ్** - స్వర్గరూప సర్వయాగ ప్రదేశమును చూచుచున్నాను (యాగప్రదేశమును చూడవలెను.)

**వైశ్వానరంజ్యోతిః** (ఆహవనీయాగ్నిని చూడవలెను.)

7. అగ్నీ! నీవు వ్రతపతివి. వ్రతమును అవలంబించినపుడు నాదేహము నీయందు చేరినది. అది నీయందే నిలిచి ఉన్నది కదా! మనము ఉభయులము దీక్షవహించినాము. మన దేహములు యధాపూర్వముగ ఉండును గాత.

(దీక్షవిరమించినపుడు యజమాని తన దేహమును యధాపూర్వపుస్థితికి తెచ్చుచున్నాడు.)

**అయిదవ అనువాకము**

(పశ్వంగ యూపచ్ఛేదనము చెప్పబడుచున్నది.)

**1.** యూపార్హ వృక్షమా! నిన్ను, ఇతర యూపార్హ వృక్షములను తీసికొనుచున్నాను. యూపార్హ ములు కాని చెట్లను తీసికొనలేదు. చెడు లక్షణములు లేని నిన్నే అందుకున్నాను. విష్ణురూపవగు నిన్ను దేవయాగము కొరకు తీసికొనుచున్నాను.

(1. యజమాని యూప్యవృక్షమును తాకవలెను. 2. మోదుగు, మేడి మున్నగు చెట్లు మాత్రమే యూపమునకు పనికి వచ్చునవి - యూప్యములు. మిగిలినవి అయూప్యములు.)

2. పలాశమా! సవిత నిన్ను మధుర ఘృతమున తడుపును గాత. ఓషధులారా! ఈ వృక్షమును కాపాడండి. స్వధితీ! ఈవృక్షమును బాధించకుము.

(1. అధ్వర్యు నేతి స్రువమున చెట్టు మొదలును తడుపవలెను. 2. స్వధితి అను గొడ్డలి వంటి పనిముట్టుచే చెట్టును కొట్టవలెను.)

3. కొట్టిన చెట్టా! నీపై భాగమున ద్యులోకమును చీల్చకుము మధ్యభాగమున అంతరిక్షమును బాధించకుము నేలతో పాటు కలిసి ఉండుము.

4. వనస్పతే! శతవల్శోవిరోహ - వేయి మొక్కలుగా మొలుచుము.

5. మేము వేలశాఖలై వర్ధిల్లుదుము

6. ఛేదించబడిన వృక్షమా! స్వధితి చక్కని పదనుగలది నిన్ను మొదటి నుండి కొట్టినది నీకు యూపభామము కలిగించినది అది నీకు మహాభాగ్యము కదా!

7. యూపమా! నీవు సువీరుడవు కొట్టబడినను బాధలేని దానవగుము యజమానికి ధనములను అందించుము

## ఆరవ అనువాకము

(యూపస్థాపనము చెప్పబడుచున్నది)

1. యూపమా! నిన్ను పృధివి అంతరిక్షము ద్యులోకము కొరకు ప్రోక్షించుచున్నాను

(1. ప్రోక్షించి ఆమూలాగ్రము కడుగ వలెను - 2. అగ్రభాగమున కడియము వేయవలెను)

2. **శుద్ధన్తాం లోకః పితృషదనో**

**యవోఽసి యవయాస్మద్విషః యవయరాతీః**

**పితౄణామ్ సదనమసి**

(అర్థమునకు 1 - 3 - 1 - 5, 6 7 చూడండి)

3. యూపప్రధమ శకలమా! నీవు మంచి యూపలక్షణములు కలదానవు యూపనేతలందు అగ్రణివి వీలో వనస్పతి రూప యూపలక్షణము విలిచి ఉన్నది. వీవు అది గుర్తింపుము.

4. చషాలమా! సవిత నిన్ను మధుర ఘృతమున తడుపును గాత

(నేతితో తడుపవలెను)

5. నిన్ను ఫలించుటకు విడుచుచున్నాను యూపాగ్రమున చేర్చుచున్నాను

(1 చషాలమును నేతితో తడుపవలెను. 2 యూపాగ్రమున తగిలించవలెను)

6. యూపమా! నీవు స్వర్గమును పడనీయకుము - స్తంభింప చేయుము ఆకాశమును నింపుము. మూలభాగమున భూమిని గట్టిపరచుము

(యూపమును అవటమున స్థాపించవలెను)

**7.** విష్ణువా! నీవు యూపాభిమానివి నీస్థానమునకు చేరిన వారు అధిక కాంతివంతులు అగుచున్నారు అపాయములు లేని వారలు అగుచున్నారు మేము ఆ స్థానమునకు చేరవలెనని కోరుచున్నాము

విష్ణువు ఘనముగా కీర్తించబడువాడు అతని స్థానము - ఎక్కడో కాదు - ఇవటనే ప్రకాశించుచున్నది ఆ స్థానము నొందుటకు కర్మచేయవలసి ఉన్నది ఆ కర్మ కొరకు ఈ యూపము అవటమున నిలుమను గాత

(యూపపు ఒక అంచును ఆహవనీయాగ్ని వద్దకు చేర్చవలెను)

**8.** జనులారా! విష్ణువు యొక్క కార్యములను చూడండి అతడు కర్మలందు వ్రతలములను కూర్చినాడు అతడు **ఇంద్రస్యసఖా** - ఇంద్రునకు మిత్రుడు

**9.** విష్ణుపదము పరమము అది ఆకసము నందు చక్షువు వలె వ్యాపించి ఉన్నది అట్టి పరమపదమును విద్వాంసులగు వారు ఎల్లప్పుడు దర్శించుచున్నారు - **సదా పశ్యన్తి సూరయః.**

**10.** బ్రాహ్మణ్యమును క్షత్రియత్వమును సంతానమును ధనసమృద్ధిని కలిగించు నిన్ను పాతుచున్నాను

(1 యూపమును తుడువలెను 2 దండముతో యూపమును కొట్టవలెను)

**11.** యూపమా! నిన్ను త్రాటిచే చుట్టినాము మరుద్గణాది దేవతలు నీ చుట్టు చేరుదురు గాత యజమానికి ధనసమృద్ధియు పుత్రభృత్యాదులు కలుగవలెను

(యూపమునకు ప్రదక్షిణ పూర్వకముగా త్రాటిని చుట్టవలెను)

**12.** స్వరువా! నిన్ను యూపమునకు చుట్టిన త్రాటి అంచున దాచుచున్నాను

(యూపమును కొట్టినపుడు మొదటి ముక్క ప్రథమ శకలము అగును రెండవ ధ్దానికి 'స్వరువు అని పేరు చివరి నాలుగు అంగుళములందు రంధ్రము ఎర్పరచిన భాగము "చషాలము')

**ఏడవ అనువాకము**

(యూపమున పశువును కట్టు ఉపాకరణము - సంస్కారము - చెప్పబడుచున్నది)

**1.** బర్హిస్సా! పశులక్షణమైన దేవతల అన్నము కొరకు నిన్ను తీసికొనుచున్నాను

జువ్వికొమ్మా! నీవు ఉపాకరణమునకు సాగుచున్నావు

ఉపాక్రియమాణమయ పశుసంబంధ - హృదయాదులు - అగ్ని షోమాది దేవతలను దేవతా సంబంధులను యాగనిర్వాహకులగు హవ్యకాములను చేరుచున్నవి

బృహస్పతీ! పశువుయొక్క గుండె మున్నగు వానిని పాలించుము
యజ్ఞపశువా! నీ హవ్యములు రుచికరములు అగును గాత
త్వష్టా! పశు పదార్థములను రసవంతము చేయుము
పాడిపశువులారా! యజమాని గృహమున విహరించండి

**2.** శకలమా! నీవు అగ్గిని పుట్టించుదానవగుచున్నావు
దర్భలారా! మీరు వృష్టికలిగించు వారలగుచున్నారు
క్రింది అరణీ! నీవు ఊర్వశివంటిదానవు
పై అరణీ! నీవు పురూరవుడవు

అరణిద్వయమా! మిమ్ము ఘృతమున తడుపుచున్నాము మీరు వృష్టి కలిగించండి మీరు ఆయువు వంటివారు **ఆయురసి.**

**3.** గాయత్రీ ఛందమున పుట్టుము త్రిష్టుప్ ఛందమున ప్రభవించుము జగతీఛందమున అవతరించుము

(అధ్వర్యుడు అరణిని మథించవలెను)

**4.** మథిత ఆహవనీయాగ్నులారా! మీరు మాకు సుమనస్కులు కండి సమానస్థానులు కండి పాపరహిత చిత్తులుకండి యజ్ఞమును యజ్ఞ కర్తను బాధించకండి

అగ్నులారా! మాకొరకు శాంతి వహించండి

ఋషి పుత్రుడు అత్యంత ప్రకాశమానుడగు మథితాగ్ని ఆహవనీయాగ్ని యందు చేరినాడు - సంచరించుచున్నాడు మథితాగ్నీ! నీకు స్వాహా అనుచున్నాను మంత్రపూర్వకముగ హోమము చేయుచున్నాను

**మాదేవానాం మిథుయాక భాగధేయమ్** - దేవతల భాగదేయమును మిధ్య కానివ్వకుము

**ఎనిమిదవ అనువాకము**

(పశువధ చెప్పబడుచున్నది)

**1.** రజ్జువా! నేను సవితా దేవుని అనుజ్ఞయందున్నవాడను అశ్వినుల బాహువులతోను పూషహస్తములతోను నిన్ను అందుకొనుచున్నాను

పశువా! నీవు హవిరూపమవు దేవతల యజ్ఞము సిద్ధించుటకుగాను నిన్ను త్రాటితో కట్టుచున్నాను అందువలన నీకు దేవత్వము సిద్ధించినది కావున మనిషి చేసిన తాడనాదులను పట్టించుకొనకుము

(పశువును త్రాటితో కట్టవలెను)

2. యజ్ఞపశువా! నీటితోను దర్భలతోను నిన్ను ప్రోక్షించుచున్నాను నీవు నీరు త్రాగుము జలములారా! మీరు దేవతా సంబంధులు ఈ పశువు సహజముగ రుచి కలదగును దానిని మీరు మరింత రుచిగల దానిని చేయండి.

(1. పశువును ప్రోక్షించవలెను 2 నీరు త్రాగించవలెను )

3. యజ్ఞపశువా! నీ ప్రాణములు గాలిలో కలియును గాత నీ అవయవములు యజ్ఞపరములు అగును గాత యజమానికి ఆశీస్సులు కలుగును గాత

(జుహూవు నందలి నేతితో పశువు తల, మూపు, పిరుదులను తడుపవలెను )

4. స్వరు స్వధితులారా! మీరు నేతితో తడవండి పశువును 'త్రాయేధామ్' - రక్షించండి

5. సంపన్నములగు పశువుయొక్క అవయవములారా! మీరు యజమానుని సంతోషపెట్టండి మీరు హవిరూపమున యజ్ఞమును ఆవహించండి

(అధ్వర్యు, యజమాని పశువును వధించవలెను.)

6. ఈ పశువును అంటియుండిన గాలితోను ప్రాణముతోను హవిస్సుకూడును గాత ఈ పశువుయొక్క ప్రాణాదులు దీనికి రానున్న దేవతా శరీరమున చేరును గాత

7. దర్భా! ఈ పశువుయొక్క అవయవములు నేలమీద పడకుండునట్లు చేయుము

(1. దర్భలను పరచవలెను 2. అగ్నీధ్రుడు అగ్నిప్రదేశమున అంగారమును ముట్టించవలెను )

8. సూర్యరశ్మీ నీకు నమస్కారము

(యజమాన పత్ని సూర్యునకు ఎదురుగా నిలిచి నమస్కరించవలెను )

9. యజమాన పత్నీ! నీవు శత్రు రహితవు అగుము. ఆజ్యధారను అనుసరించుము. సంతానము ధనసమృద్ధి కలదానవగుము

జలమా! నీవు దేవతా స్వరూపవు నీవు పవిత్రవు మమ్ము పవిత్రులను చేయుదానవు దేవతలను యాగ ప్రదేశమునకు చేర్చుము నీతో కూడినందున మేము పరిశుద్ధులము అగుదుము నిన్ను చుట్టుకొనియుందుము

(యజమానపత్ని ఉత్కర చాత్వాలముల మధ్య జలమును తాకవలెను )

## తొమ్మిదవ అనువాకము

(వపను తీయుట చెప్పబడుచున్నది)

1. యజ్ఞపశువా! నీ ఇంద్రియములు నిన్ను విడిచినవి. నీ ప్రాణములు నిన్ను విడిచినవి ఆ దుఃఖమును వదలుము. నీవు ధరింపనున్న దేవతా శరీరమునందు సుఖముగా వర్ధిల్లుము మేము నిన్ను కట్టినాము ముఖాదులను నిరోధించినాము ఇప్పుడు హృదయాది ఛేదనము చేయ బోవుచున్నాము. అవన్నియు శాంతించును గాత

నిన్ను ప్రోక్షించిన ఉదకములు శాంతించునుగాక. పరచబడిన దర్భలు శాంతించునుగాక చనిపోయినపుడు నీ భారము వహించిన భూమి శాంతించునుగాక సాక్షులైన అహోరాత్రులు శాంతించునుగాక

2. ఓషధీ! పశువును రక్షింపుము స్వధితీ! పశువును హింసించకుము

(అధ్వర్యుడు నాభి దక్షిణభాగమును అడ్డముగా కోయవలెను)

3. నెత్తుట తడిసిన దర్భా! నీవు రాక్షసుల భాగమవు మమ్ము ద్వేషించు రాక్షసులకు మేము ద్వేషించు శత్రువులకు మహా దుఃఖము కలుగచేయుచున్నాను

(అధ్వర్యుడు దర్భను రక్తమున తడిపి దక్షిణమున వేసి కుడికాలితో తొక్కవలెను)

4. వపా! దేవతలకు హవిస్సు కొరకు నిన్ను పశు శరీరము నుండి వెలుపలికి తీయుచున్నాను వపాశ్రవణులారా! మీరు ద్యావాపృథ్వుల వంటివారు. వపను కప్పివేయుడు

(1. వపను వండు రెండు పనిముట్లు వపాశ్రవణులు 2. అధ్వర్యుడు వపను వపాశ్రవణుల పై ఉంచవలెను.)

5. ఈ వప అచ్ఛిన్నము. ఇది యజమానికి మంచి సంతానమును, సంపదను కలుగచేయును గాత

6. వపా! నీవు విశాల అంతరిక్షమున ప్రవేశించి సాగిపొమ్ము

(అధ్వర్యుడు శూలద్వయమును తీసికొని ఆహవనీయ స్థలమునకు చేరవలెను)

7. వాయువా! ఆజ్య బిందువులను విడగొట్టుము

(నిప్పు కణికలపై వపను కాల్చవలెను)

8. వపాశ్రవణులారా! వప ఆహుతి యగునపుడు మీరు ఊర్ధ్వనభోనామక మరుత్పుతుని చేరండి.

(వపాశ్రవణులను ఆహవనీయాగ్ని యందు వేయవలెను)



94512

## పదవ అనువాకము

(వపాహోమము చెప్పబడుచున్నది.)

**1.** వృషదాజ్యము పశువు మనసునకు బదులైనది. అది దేవతల మనసులందు చేరును గాత ఈ వృషదాజ్యము ప్రాణమునకు ప్రత్యామ్నాయము. అది దేవతల ప్రాణములందు చేరును గాత హవిస్సుగానున్న నిన్ను దేవతలకు - ప్రియమగు ఘృతమువలె - సమర్పించుచున్నాను - స్వాహా.

(1. పెరుగు కలిపిన నేయి వృషదాజ్యము. 2. అధ్వర్యుడు గుండెను వృషదాజ్యముచే అభిఘరించవలెను )

**2.** ఇంద్రదేవతాక మగు ప్రాణము పశువు యొక్క అంగాంగము లందు చక్కగా నిలుచును గాత అపానము సహితము అంగాంగములందు చేరును గాత.

త్వష్టా! భూరియగు ఈ పశువు అవయవములు ఛిన్నా భిన్నములు కాకుండునుగాక

అవయవములారా! మీది విలక్షణ రూపమగును. అయినను హవిరూపమున సమాన లక్షణములవారు కండు.

పశువా! నీవు దేవతలలో చేరుచున్నావు అందుకు నీమిత్రులు, తల్లిదండ్రులు ఆమోదింతురు గాక.

(అధ్వర్యుడు గుండె మున్నగు హవిస్సులను ముట్టవలెను.)

**3.** వపా! నీవు ఆశ్రయణీయవు అగుచున్నావు. ఆహవనీయాగ్ని నిన్ను ఆశ్రయించునుగాక జలములు నిన్ను చేరును గాత నిన్ను వాయుగతి కొరకు కప్పుచున్నాను సూర్యుని గమనము కొరకు కప్పుచున్నాను జలసంబంధ ఓషధులు మొలుచుట కొరకు కప్పుచున్నాను.

(అధ్వర్యుడు పాత్రలోని వపను ఎముకచే కలియబెట్టవలెను )

**4.** నేయిత్రాగు దేవతలారా! నేయి త్రాగండి. వపత్రాగు దేవతలారా! వపను త్రాగండి

పశువా! నీవు ఆకాశవాసులకు హవివి అగుచున్నావు. అంతరిక్షాయ స్వాహా. ప్రాగ్దిశకు స్వాహా. దక్షిణదిశకు స్వాహా పశ్చిమదిశకు స్వాహా. ఉత్తరదిశకు స్వాహా సర్వదిశలకు స్వాహా.

నమోదిగ్భ్యః - సకల దిక్కులకు నమస్తే

(ప్రతి ప్రస్థాత వపను దేవతల దిక్కులకు హోమము చేసి నమస్కరించవలెను )

## పదకొండవ అనువాకము

(ఉపయట్ హోమము చెప్పబడుచున్నది)

**1.** హవ్యమా! సముద్రం గచ్ఛ-వెళ్ళుము - స్వాహా అన్తరిక్షంగచ్ఛ స్వాహా. దేవం సవితారం గచ్ఛ స్వాహా. అహోరాత్రీ గచ్ఛ స్వాహా. మిత్రావరుణౌ గచ్ఛ స్వాహా. సోమంగచ్ఛ స్వాహా. యజ్ఞం గచ్ఛ స్వాహా. ఛన్దాంసి గచ్ఛ స్వాహా. ద్యావాపృథివీ గచ్ఛ స్వాహా. నభోదివ్యం గచ్ఛ స్వాహా. అగ్నిం వైశ్వానరం గచ్ఛ స్వాహా.

హవిర్లేపమా! నిన్ను ఉదకమూలములైన ఓషధుల కొరకు మార్జనము చేయుచున్నాను

సముద్రాది దేవతలారా! నాకు ఆనందకరమగు మనస్సును ఇవ్వండి మీ అనుగ్రహమున నాకు ఉత్తమ దేహము కాంతివంతమగు రూపము, పుత్ర పౌత్రులు లభించగలరు

**2.** హృదయశూలమా! నీవు దుఃఖరూపము కలదానవు మమ్ము ద్వేషించు వారిని మేము ద్వేషించు వారిని దుఃఖముల పాల్జేయుము

వరుణరాజా! నీవు శోకము కలిగించు స్థానములను - ద్వేషము కలిగించు స్థానములను విడువుము

ఉదకములారా! గోవులారా! వరుణదేవా! మాకోర్కెలు తీర్చమని మిమ్ము బాధించుచున్నాము ఆ పాపముల నుండి మమ్ము విముక్తులను చేయండి

(హృదయశూలమును తొలగించవలెను)

### అగ్నిషోమీయ పశువు సమాప్తము

## పన్నెండవ అనువాకము

(వసతీవరీ జలములను గ్రహించుట చెప్పుచున్నాడు)

**1.** వసతీవరీ జలములు హవిస్సు కలవి అగునుగాక ఇంద్రుడు హవిష్మంతుడు అగును గాత యాగము హవిష్మంతమై సర్వత్ర ప్రవర్తిల్లును గాత **సూర్యః హవిష్మాన్ అస్తు.**

**2.** వసతీ వరులారా! మిమ్ము నశించనట్టి అగ్ని గృహమున స్థాపించుచున్నాను

ఉదకములారా! మీరు సుఖించువారు ప్రాణులకు సుఖము కలిగించువారు మమ్ము సుఖములందు నిలుపండి మీరు ఇంద్రాగ్నులకు భాగస్వాములు అగుచున్నారు మిత్రావరుణులకు భాగస్వాములు అగుచున్నారు విశ్వేదేవతలకు భాగస్వాములు అగుచున్నారు యజ్ఞేజాగృత యజ్ఞమునందు అప్రమత్తులై ఉండండి

## పదమూడవ అనువాకము

(అభిషోతవ్య సోమమును బండినుంచి దించుట)

1. సోమమా! నిన్ను మనసుగల-మనుషుల కొరకు - మనసునగల పితృదేవతల కొరకు - ద్యులోకవాసదేవతల కొరకు - సూర్యుని కొరకు గృహ్ణామి - తీసికొనుచున్నాను. నీవు ఈ యజ్ఞమును మహోన్నతమును చేయుము

ఈ సోమమును ద్యులోకమందు - దేవతలయందు - స్తోత్రరూప ఆహ్వానములందు స్థాపించుము

సోమప్రభువా! రమ్ము బండిదిగుము భయపడకుము. కంపించకుము. మేము నిన్ను బాధించము నీవు దేవతలను చేరుకొనుము నిన్ను దేవతలు చేరుకొందురు గాత

2. సమిధాగ్ని నా ఆహ్వానమును వినును గాత విద్యావంతులు దేవతారూపులగు జలములారా! మీరు కూడ వినండి గ్రావాణములారా! మీరు సోమాభిషవమునకు విచ్చేసి ఉన్నారు మీరు విద్వాంసులు కండి యజ్ఞమంత్రములు వినండి

**శృణోతు దేవస్సవితా హవంమే** - సవితా దేవత నా ఆహ్వానమును ఆలకించవలెను

(అధ్వర్యుడు హోమము చేయవలెను)

3. జలదేవతలారా! అపాంనపాతాగ్నీ! దేవతలను గురించిన హోమములందు మీ తరంగములను చేర్చండి జలతరంగము సోమమునకు హితకరము త్రాగినంత బలమును పెంచును - సంతసము కలిగించును దీప్తి మంతము దేవతలు సోమపానము చేయువారు కదా! అందువలన మీరు వారికి భాగధేయులై-ఉన్నారు- మీకు **స్వాహా.**

(నాలుగు మారులు ఆజ్యహోమము చేయవలెను)

4. ఆజ్యమా! నీవు జలమునకు ఇష్టము కాకున్నావు. నిన్ను తొలగించుచున్నాను.

(దర్భచే ఉదకముపై హోమము చేసిన నేతిని తొలగించవలెను)

5. జలములారా! సముద్రమువలె మీరు అక్షీణులై ఉండుటకు ఎత్తుచున్నాను

(వసతీవరిని మైత్రావరుణచమసమున తీసికొనవలెను)

6. అగ్నీ! నీవు యుద్ధములందు ఎవనిని రక్షించుచున్నావో ఎవనినుండి హవిస్సులు అందుకొనుటకు వెళ్లుచున్నావో - అతడు శాశ్వతములగు ధనములు అన్నములు కలవాడగుచున్నాడు

## పదునాలుగవ అనువాకము

(యాజ్యా పురోనువాకము ప్రపారకాంతమున చెప్పబడుచున్నవి)

1. పురోనువాక్య - అగ్నీ! నీవు భయంకరుడవు శత్రువును నిరసించువాడవు హవ్యవాహనుడవు మరుత్తులకు బలమవు మరుత్తులతో కూడుము మరుత్తుల సైన్యమును నియంత్రించుము నీ అశ్వములు వాయువేగములు నీవు వాని మీద స్వారి చేయుచున్నావు నీవు పోషకుడవు యజమానులను పోషించుచున్నావు.

2. యాజ్య అగ్ని యజ్ఞముల స్వామి అరిభయంకరుడు హోత భూలోక ద్యులోకములందు కర్మఫలమును ప్రసాదించువాడు హిరణ్యరూపుడు

ఋత్విజులారా! శత్రువు బారిన పడకమున్నే - మరణము దరిచేరకమున్నే అగ్నిని ఆశ్రయించండి

3. పురోనువాక్య అగ్నిహోత యాగకర్త యువకుడు కవి అగ్ని స్థానవాసి సత్యవంతుడు మానవులను పోషించువాడు జరరాగ్ని

వేదికి దగ్గరలోని సుగంధస్థానమునందు అగ్ని ఆసీనుడై ఉన్నాడు

4. యాజ్య. మేము నేడు దేవతలకు హవిస్సులు అర్పించినాము అగ్ని వానిని మరింత రుచిగల వానిగా చేసినాడు అగ్ని యజ్ఞజిహ్వుడు అగ్ని మాకు లభించినాడు పరిమళుడగు అగ్ని మా ఆయువును రక్షించవలెను మా దరికి చేరవలెను

5. పురోనువాక్య అగ్ని ఆకసపు ఉరుమువలె గర్జించును కాలుచున్న వాటిని ఆర్పుచు - పుష్పలతా గుల్మాదులను కలిగించుచు అగ్ని ఉరుమును గాత అగ్ని పుట్టినంతనే దీపించినాడు జగములను వ్యక్తము చేసినాడు ద్యావాపృథ్వుల మధ్య సూర్యుడై ప్రకాశించుచున్నాడు

6. యాజ్య అగ్నీ! నీవు ఘనుడవు దేవతల ఆహ్వాతవు రాత్రింబవళ్లు యజ్ఞహవిస్సులను ఎర్పరచుచున్నావు. నీ అనుగ్రహము లేనపుడు లోకములు - కాలిన పదార్థములవలె - నిస్సారములగును నీ అనుగ్రహము కలిగినంత సకలలోకములు సౌభాగ్యవంతములగును

7. పురోనువాక్య అగ్నీ! నీ అవయవములు సారవంతములు ఈ భూలోకము నందున్న ప్రజలకు ఎన్నో కోరికలు ఉన్నవి అవి తీరుటకు ప్రజలు నీ వ్రతము చేయుచున్నారు

8. యాజ్య అగ్నీ! నీ రక్షణలందు మేము **కామమ్** - కోరికలను **అశ్యామ** - పొందుచున్నాము ధనికఅగ్నీ! సువీరలరయిన - సుపుత్రులను ధనమును **అశ్యామ. వాజయన్తః** - అన్నములను కోరునట్టి మేము **వాజమ్ అభ్యశ్యామ.**

జరారహిత అగ్నీ! నీ అనుగ్రహమున అక్షయకీర్తిని పొందుచున్నాము

9. పురోనువాక్య అగ్నీ! నీవు దుఃఖము కలిగించువాడవు ఋత్విజులు భరించువాడవు ఆహుతులందు వసించువాడవు

అగ్నీ! నీవు శ్రేష్ఠమును దీప్తివంతము అందరు ఆశించునదియు నగు ధనమును తీసికొనిరమ్ము

10. యాజ్య అగ్ని శోధించువాడు ఆహవనీయ గార్హపత్యాది నామములు కలవాడు యవిష్ఠాది విశేషములు కలవాడు హవిస్సులు ఆరగించుచు యజమాని గృహమున ఉండువాడు

అగ్ని ప్రకాశమానుడు ఫలప్రదుడు వెలుగులున్న చోట ఉండువాడు జరారహితులగు దేవతలచే స్తుతించబడునాడు వైరులకు దుఃఖము కలిగించుచున్నాడు

11. పురోనువాక్య శ్రేష్ఠుడగు అగ్ని నీకు సంపూర్ణ ఆయువు కలిగించును గాత అపమృత్యువును నివారించును గాత వ్యాధులను నశింపచేయును గాత

12. యాజ్య అగ్నీ! నీవు హవిస్సులను సేవించువాడవు ఘృతమే ప్రతీకగా కలవాడవు ఘృతమే జన్మకారణమైనవాడవు నీవు ఈ యజమానికి ఆయువును ప్రసాదించుము నీవు రుచియైన నిర్మలమైన ఆజ్యమును సేవించుము తండ్రి కొడుకును రక్షించినట్లు - ఈ యజమానిని కాపాడుము

13. పురోనువాక్యఅగ్నీ! నీవు ఎందరో యజమానులు కలవాడవు. పుట్టుకతోనే జ్ఞానివి నిత్యము యజమాని ఇంటికి వెళ్లువాడవు నీ కొరకు - **సుష్టుతిమ్ జనామి** - మంచి స్తోత్రమును కల్పించుచున్నాను

14. యాజ్య అగ్ని తొలుత ద్యులోకమున సూర్యరూపమున అవతరించినాడు తదుపరి మర్త్యలోకమున అగ్నిగా ఆవిర్భవించినాడు మూడవసారి సముద్రమున బడబానల రూపమున అవతరించినాడు అన్ని దిశలందును అగ్ని యజమానుల యందు అనుగ్రహము కలిగి ఉండును

యజమానీ! అట్టి అగ్నిని ఇంధనమున దీపింపచేయుము స్వాయత్త చిత్తుడవై జరాపర్యంతము సేవించుము

15. పురోనువాక్యము అగ్నీ! నీవు పావకుడవు శుచివి వందనీయుడవు ఆజ్యాదుల ఆహుతులచే ఎంతో ప్రకాశించుచున్నావు

16. యాజ్య అగ్ని దర్శనీయుడు కిరణ్మయుడు అజేయుడు ప్రాణములకు ఆశ్రయమైనవాడు అతడు ఆ అగ్ని - మహాతేజస్సున ప్రజ్వరిల్లుచున్నాడు ద్యులోకము నందలి దేవతలు సురేతస్కులగుచు అగ్నిని ఆవిర్భవింపచేసినారు అందువలన ఈ అగ్ని హవిస్సుల వలన అమృతుడైనాడు

**17.** పురోనువాక్యము అగ్ని ద్యులోకమున తేజోవంతుడై ఉన్నాడు యజమానిని రక్షించువాడు అగుచున్నాడు అగ్ని మాతాపితరుల బీజమందు ప్రవేశించుచున్నాడు స్వాధీనచిత్తుడు - దోషరహితుడు తరుణవయస్కుని పుట్టించుచున్నాడు. పాపములను నశింపచేయుచున్నాడు.

**18.** యాజ్య అగ్నీ! నీది అత్యంత తేజోవంతమనసు నీవు దానిచే యజమానిని రక్షించినావు సంతానవంతుడు సమర్థుడు మానవ శ్రేష్ఠుడగు యజమానికి ధనము కలిగించుము నీ అధీనపు వారలమై మేము ధనవంతులము స్తుతివంతులము అగుదుము గాత

**19.** పురోనువాక్యము అగ్నీ! మాకు అన్నములు కలిగించుటకు శత్రుసేనలను చిత్తుచేసినావు మాకీర్తిని కాదను శత్రువు ధనమును మాకు అందించుము

**20.** యాజ్య అగ్నీ! నీవు బలశాలివి పరసేనను తిరస్కరించునంతటి ధనమును కొనిరమ్ము నీవు సత్యమవు అద్భుతుడవు నీవేకదా అన్నదాతవు!

**21.** పురోనువాక్యము అగ్ని యాగమునందు వృషభమును వంధ్యగోవును హవిస్సుగా గ్రహించువాడు సోమసహితస్తోత్రయుక్తుడు అన్నము కలిగించువాడు 'స్తోమైర్విధేమాగ్నయే' అగ్నిని స్తోత్రములతో భజింతుము

**22.** యాజ్య అగ్నీ! పుత్రుని వంటినీవు వాగ్దేవతా స్వరూపుడవు నీవు అన్నకోశమునందు జఠరాగ్ని రూపమున ఉన్నావు అట్లున్న వాడవై మాకొరకు అన్నమును నివాసమును ఏర్పరచినావు

అగ్నీ! నీవు రసప్రదుడవు మాకు రసమును ప్రసాదించుము రాజువలె జయించుము హింస ఎరుగని యజమాని అంతఃకరణమున వసించుము

**23.** పురోనువాక్యఅగ్నీ! మాకు ఆయువును కలిగించుము పాలు అన్నము మా ముందుకు పంపుము ఉపద్రవములను దూరమందుననే బాధించుము దరిచేరనీయకుము

**24.** యాజ్య అగ్నీ! నీవు మంచి పనులవాడవు మాయందు బ్రహ్మవర్చస్సును సామర్థ్యమును పెంపొందించుము నా యందు ధనమును పుష్టిని చేర్చుము

**25.** పురోనువాక్యము అగ్నీ! నీవు పావకుడవు ప్రకాశకుడవు నీవాక్కు మధురము - దీప్తిమంతము దానితో దేవతలను ఆవహింపుము యాగమును సాగించుము

**26.** యాజ్య అగ్నీ! నీవు పావకుడవు దీప్తుడవు మాకొరకు దేవతలను ఈ యజ్ఞమునకు రప్పింపుము ఈ యజ్ఞపు హవిస్సులను దేవతలకు అందించుము

**27.** పురోనువాక్యము అగ్ని దాహక, పావక, పరిశుద్ధాచరణ కలవాడు. విప్రుడు కవి శుచి ఆహుతులు అందుకొని మరింత కాంతివంతుడై వెలుగుచున్నాడు

**28.** యాజ్య. అగ్నీ! నీకాంతులు నిర్మలములు అవి వెలుగుచున్నవి. పైకి ఎగయుచున్నవి నిన్ను భజించువారు జ్యోతిర్మూర్తులయిన దేవతాస్వరూపులు అగుచున్నారు

శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ
తైత్తిరీయ సంహిత మొదటి కాండమునందలి
మూడవ ప్రపాఠకము సమాప్తము.

యస్తేస్తన: శశయో యోమయో భూర్యోరత్నధా వసువిద్యా: సుదత్ర:
యేనవిశ్వాపుష్యసి వీర్యాణి సరస్వతి తమిహదాతవో౨క: ఉర్వ స్తరిక్షమన్వేమి॥

## నాలుగవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

(నాలుగవ ప్రపాఠకమున గ్రహములు చెప్పబడినవి)

(ఈ అనువాకమున సోమాభిషవము చెప్పబడినది)

1. అభిషవశిలా! నీవు యజ్ఞనిష్పాదకమవు దృఢమైనదానవు నిన్ను అందుకొనుచున్నాను ఈ యజ్ఞము దేవతల నిమిత్తమైనది నీవు దీనిని ఘనముగా జరిపించుము నీవు వజ్రాయుధము వంటిదానవు శ్రేష్ఠమైన దానవు నీచేతనే సోమమును అభిషవింతును సోమమును మధురము చేయుదును. పాలవలె రసోపేతము చేయుదును వర్ణప్రదమును చేయుదును

(మంచి రాతిని తీసికొని అభిమంత్రించవలెను)

2. సోమమా! ఇంద్రుడు మేఘ విదారయిత వృత్రహంత పాపనాశకుడు ఆదిత్యవంతుడు విశ్వేదేవతావంతుడు. అట్టి ఇంద్రుని కొరకు నిన్ను దంచుచున్నాను

3. ఉదకములారా! మీరు త్వరపడువారు వృత్రహంతలు అన్న సముపార్జకులు సోమపాలకులు మీరు ఈ యజ్ఞమును దేవతలకు చేర్చండి అనుజ్ఞాతలై సోమమును సేవించండి అనుజ్ఞాతయయిన సోమము మిమ్ము సేవించును గాత

(దంచిన సోమమును చమసము నందలి పదార్థములతో కలుపవలెను)

4. సోమమా! దివియందు ఒకజ్యోతి ఉన్నది భూమిమీద ఒకజ్యోతి ఉన్నది అంతరిక్షమున ఒక మహాజ్యోతి ఉన్నది ఆ మూడు జ్యోతులనుండి తెచ్చి ఈ యజమానికి ధనమును గొప్ప స్థానమును కల్పించుము ఈ యజమాని గొప్పవాడని ఇంద్రునకు ఒకమాట చెప్పుము

(సోమమును అభిమంత్రించవలెను)

5. చర్మఫలకములారా! మీయందు సోమము నుంచి రాతితో దంచుచున్నాను మీరు గట్టిగా ఉండండి. మరల మరల దంచినపుడు పగలకండి గట్టిగా ఉండండి సోమరసము జారిపోకుండ నిలుపండి. **ఊర్జం మేదధాతా** - మాకు సోమరసమును అందించండి **మాహింపిషమ్** - మిమ్ము బాధింపము. **మాహింస్టిష్టమ్** మమ్ము బాధించకండి

(1 చర్మఫలకమును తాకవలెను 2 ఒకతోలుముక్క మీద నలిగిన సోమమునుంచి దాని మీద మరొక తోలుముక్క వేసి దంచి సోమరసము తీయుదురు 3. ఇది తోలు తిత్తికావచ్చును )

**6.** నీవు ధిక్కరించజాలని నామము కలదానవు అప్రమత్తవు **తస్మైతేసోమాయ స్వాహా** - అట్టి నీ సోమమునకు **స్వాహా.**

## రెండవ అనువాకము

(ఉపాంశు గ్రహమును చెప్పుచున్నాడు )

**1.** సోమమా! నీవు అన్న ప్రదాతవు దేవతలు పాలకులు కదా! వారికొరకు మంత్రమున పరిశుద్ధవగుము నీవు రసరూపవు వర్షించగలదానవు అరణ్యమందు సూర్యకిరణములచే పవిత్రమైన దానవు ఇప్పుడు వృష్టినిచ్చు నీ అంశువుల తోనే నీవు పవిత్రవగుము

**దేవో దేవానాం పవిత్రమసి.** నీవే దేవతవు అట్లయి దేవతల పవిత్రకారణమవు అగుచున్నావు నీవు దేవతల భాగధేయవు. దేవతల కొరకే నిన్ను గ్రహించుచున్నాను

(సోమలత అభిషవమైనంత 'ప్రతిప్రస్థాత 'ఉపాంశు పాత్రలోనికి తీసికొనవలెను అందు రెండు సోమలతల చివరలను ముంచవలెను అధ్వర్యుడు ఆ పాత్రను దోసిలిలో ఉంచుకొనవలెను )

**2.** ఉపాంశు గ్రహమా! నాకు మధురాన్నములు ప్రసాదించుము దేవతలు మానవులు సకల లోకముల ఇంద్రియముల నిమిత్తము నిన్ను స్వీకరించుచున్నాను

(1 గ్రహము అనగా పాత్ర ఉపాంశ పాత్ర నామము 2 అధ్వర్యుడు ఉపాంశు పాత్రను చేతికి తీసికొనవలెను )

**3.** ఉపాంశుగ్రహమా! నీవు మనసున వ్యాపింపుము విశాల అంతరిక్షమును అనుసరించుము స్వాహా

**సుభవసూర్యాయస్వాహా. మరీచేభ్యః స్వాహా. దేవేభ్యో మార్జ్మి.** దేవతల కొరకు పూయుచున్నాను

**4.** ఉపాంశుగ్రహమా! ఖరపు దక్షిణ భాగము నీకు స్థానమగును ప్రాణము కొరకని నిన్ను ఖరమున స్థాపించుచున్నాను

(1 ఖరము - హవిర్ధాన మంటపము ముందు గింజలు నాటిన చోటు 2 ఉపాంశు పాత్రయందలి సోమమును ఆగ్రయణమను పళ్లెమున పోయవలెను ఉపాంశుపాత్ర యందు సోమలత కొనలను వేసి ఖరమున ఉంచవలెను )

## మూడవ అనువాకము

( 3 నుండి 36 అనువాకముల వరకు గ్రహములు చెప్పబడినవి )

1. సోమరసమా! ఇది అంతర్యామ పాత్ర ఇది చెక్కతో చేయబడినది నిన్ను ఈ పాత్రలోనికి తీసికొనుచున్నాను

ఇంద్రా! అంతర్యామమును శత్రువు కంటపడనీకుము - కాపాడుము మాకు మంచి అన్నములనిమ్ము సోమమును రక్షింపుము ధనమును రక్షింపుము నీ అనుగ్రహమున ద్యావాపృథ్వులను అంతర్యామమున ఉంచుచున్నాను విశాల అంతరిక్షమును అంతర్యామమున ఉంచుచున్నాను

ఇంద్రా! నిన్ను చిన్నా పెద్ద దేవతలు సేవింతురు వారిని అంతర్యామమున సంతోష పెట్టుము

2. స్వాంకృతోఽసి మధుమతీర్న ఇషస్కృధి విశ్వేభ్యస్త్వేన్ద్రియేభ్యోదేవేభ్యః పార్థివేభ్యో
3. మనస్త్వా ష్టూర్వన్తరిక్షమన్విహి స్వాహా త్వా సుభవస్సూర్యాయ దేవేభ్యస్త్వా మరీచపేభ్య
4. ఏషతేయోని రపానాయ త్వా.

(అర్థమునకు 2వ అనువాకపు 2 3 4 మంత్రములు చూడండి 2 ఉపాంశువను చోట అంతర్యామముగా దూర్చవలెను 3 4 వమంత్రము ప్రాణము బదులు అపానమని మార్చవలెను )

## నాలుగవ అనువాకము

1. వాయుదేవా! రమ్ము ఈపాత్రను అలంకరించుము నీవు స్వచ్ఛసోమరసపాయివి విచ్చేయుము మావద్దకు విచ్చేయుము నీవు విశ్వవ్యాపకుడవు నీ అశ్వములు అసంఖ్యాకములు నీ వద్ద ఉన్న సోమము హర్షదాయకము నీవు సోమమును ప్రప్రథమముగా త్రాగ సంకల్పించినవాడవు అందుకే నేను నీ దరికి చేరుచున్నాను

సోమమా! నిన్ను పృథ్వీరూపమగు దారుపాత్రలో తీసికొనుచున్నాను నిన్ను వాయువు కొరకు తీసికొనుచున్నాను - దారుపాత్రలో

ఇంద్రవాయువులారా! సోమరసము సిద్ధమైనది సోమరసము మిమ్ము రమ్మనుచున్నది సోమకారణముగా మీరు మావద్దకు రండు.

సోమమా! నిన్ను ఇంద్రవాయువుల కొరకు పృథ్వీరూపమగు దారుపాత్ర యందు గ్రహించుచున్నాను

పాత్రా! ఖరము నీకు స్థానమగుచున్నది ఇంద్ర వాయువులు సమానప్రీతిగలవారు వారికొరకు నిన్ను ఖరస్థానమున ఉంచుచున్నాను

(పాత్రను శుద్ధిచేసి ఖరప్రదేశమందు ఒకవైపున ఉంచవలెను)

### అయిదవ అనువాకము

మిత్రావరుణులారా! మీరు సత్యసంవర్ధకులు సోమరసము సిద్ధమై ఉన్నది ఈ యజ్ఞమునకు మిమ్ము ఆహ్వానించుచున్నాము వినండి

సోమరసమా! నిన్ను - భూమి భాగమగు - దారుపాత్రచే మిత్రావరుణుల కొరకు గ్రహించుచున్నాను

పాత్రమా! ఖరప్రదేశము నీకు స్థానమగును మిత్రావరుణుల కొరకని నిన్ను ఈ ఖర స్థానమున ఉంచుచున్నాను

(మిత్రావరుణుల పాత్రయందు సోమరసము పోయవలెను అందుపాలు కలుపవలెను ఆ పాత్రను ఖరప్రదేశమున ఉంచవలెను)

### ఆరవ అనువాకము

అశ్వినులారా! మీవాక్కు పరుషరహితము ప్రియము అట్టి మీ వాక్కుచే ఈ యజ్ఞమును నిర్వహించండి

సోమరసమా! నిన్ను దారుపాత్రచే అశ్వినుల కొరకు గ్రహించుచున్నాను

పాత్రా! ఖరప్రదేశము నీకు స్థానమగును అశ్వినుల కొరకని నిన్ను ఈ ఖరస్థానమున స్థాపించుచున్నాను

(అశ్వినుల పాత్రలో సోమరసము పోసి ఖరప్రదేశమున ఉంచవలెను)

### ఏడవ అనువాకము

అశ్వినులారా! ఇది ప్రాతః కాలము అన్యయజమానులను విడువండి ఈ యజమాని వద్దకు - సోమపానమునకు - విచ్చేయండి

సోమరసమా! నిన్ను దారుపాత్రయందు అశ్వినుల కొరకు గ్రహించుచున్నాను

పాత్రా! ఖరప్రదేశము నీకు స్థానమగును అశ్వినుల కొరకు మధుపూరితమగు నిన్ను ఖరస్థానమున ఉంచుచున్నాను

(అశ్వినుల పాత్రను ఖరప్రదేశమున పెట్టవలెను)

## ఎనిమిదవ అనువాకము

ఈ ఇంద్రుడు ఇష్టుడు. వెలుగులు చుట్టియున్న వాడు. అతడు మేఘపు ఉదరములందలి జలములను మట్టిగల భూమి మీద కురిపించుచున్నాడు జలములు సూర్యునితో కలసినపుడు - ఋత్విజులు ఈ ఇంద్రుని మంత్రములచే - శిశువును వలె లాలించున్నారు

శుక్రపాత్రా! దారు నిర్మితమైన నీయందు - శుక్రపూతుడైన శండుని కొరకు - సోమరసము గ్రహించుచున్నాను ఖరప్రదేశము నీకు స్థానమగును యజమాని బలమును కాపాడుము

## తొమ్మిదవ అనువాకము

ఇంద్రా' నిన్ను పూర్వపు భృగువులు స్తుతించినారు పితరులు స్తుతించినారు. పూర్వపు, ప్రస్తుత యజ్ఞకర్తలు స్తుతించినారు నేను నిన్ను అట్లే స్తుతించుచున్నాను నీవు దేవతలందు పెద్దవు యజ్ఞకర్తలకు స్వర్గము నిచ్చుట తెలిసిన వాడవు యజమాని వలన జరిగిన ఆలస్యాదులను మన్నించగల వాడవు.

ఈ యజమాని యజ్ఞము విషయమున ఆతురుడు అనుష్ఠానములందు ఇతర యజమానులకు మించినవాడు ఈ యజమానిని కూడి సోమపానము చేయుము స్తుతులు ఆలకించుము వర్ధిల్లుము.

మంథిపాత్రమా! దారు నిర్మితమైన నీయందు - శుక్రపూతుడగు మర్కుని కొరకు - సోమరసమును గ్రహించుచున్నాను ఈ ఖరప్రదేశము నీకు స్థానమగును **ప్రజాఃపాహి** - యజమాని సంతానమును రక్షించుము

(మంథి అనుపాత్రలో సక్తువులను వండి ఖరప్రదేశమున స్థాపించవలెను )

## పదవ అనువాకము

దేవతలారా! మీరు దివియందు పదకొండుగురు ఉన్నారు భూమిమీద పదకొండుగురు ఉన్నారు స్వమహిమచే ఉదకమును దాల్చిన అంతరిక్షమున పదకొండుగురు ఉన్నారు **తేదేవా యజ్ఞమిమం జుహధ్వం.** అట్టి దేవతలందరు ఈ యజ్ఞమును అనుభవింతురు గాత

పాత్రమా! నీవు ఆగ్రయణ నామధేయమవు నీవు శ్రేష్ఠత్వము పొందినదానవు యజ్ఞమును సంబరపెట్టుము యజ్ఞకర్తను సంబరపెట్టుము విష్ణువు నిన్ను రక్షించును గాత విష్ణు రక్షితవగు నీవు యజమాని సంతానమునకు సామర్థ్యము కలిగించి కాపాడుము ఈ ఖర ప్రదేశము నీకు స్థానమగును సమస్త దేవతల కొరకు నిన్ను ఈ ఖర స్థానమున స్థాపించుచున్నాను

(ఆగ్రయణ పాత్ర యందు సోమము పోసి దానిని ఖర ప్రదేశమున స్థాపించవలెను )

## పదకొండవ అనువాకము

దేవతలు మొత్తము మీద ముప్పది ముగ్గురు. వారు శత్రు నాశకులు. శత్రు స్త్రీలను ఏడిపించువారు.

ఆ దేవతలందరు కొందరు స్వర్గమందున్నారు. కొందరు భూలోకమున ఉన్నారు. మిగిలిన పదకొండుగురు నీరు నిండిన అంతరిక్షమున ఉన్నారు. వారందరు తృతీయ సవనము నందలి అభిషుత సోమమును సేవింతురు గాత.

**"ఉపయామ గృహీతోఽస్యాగ్రయణోఽసి స్వాగ్రాయణో జిన్వ యజ్ఞం జిన్వ యజ్ఞపతి మభిసవనాపాహి విష్ణు స్త్వాంపాతు విశం త్వం పాహి ఇన్ద్రియేణైష తేయోని ర్విశ్వేభ్య స్త్వా దేవేభ్యః**

(1. అర్థమునకు పదవ అనువాకము రెండవ పరిచ్ఛేదము చదవండి. 2. ఆగ్రయణ పాత్ర యందు సోమము పోసి, దానిని ఖర ప్రదేశమున స్థాపించవలెను.)

## పన్నెండవ అనువాకము

ఇంద్రుడు బృహత్సామ ప్రియుడు. సోమాన్నము కలవాడు. సామ ఉక్థముల అభిలాషి. సోమమా! నిన్ను ఉపయామగ్రహమున - ఇంద్రుని కొరకు - గ్రహించుచున్నాను.

ఇంద్రా! నీకు సోమరసము ప్రియతమము కదా. నిన్ను అట్టి సోమపానమునకు ఆహ్వానించుచున్నాను.

ఉపయామగ్రహమా! నిన్ను విష్ణువు కొరకు గ్రహించుచున్నాను. ఈ ఖర దేశము నీకు స్థానమగును. ఉక్థ, సామ ప్రియుడగు ఇంద్రుని కొరకు నిన్ను ఈ ఖర స్థానమున స్థాపించుచున్నాను.

(సోమ రసమును 'ఉక్థ్య' మను పాత్రలోనికి తీసికొని, ఆ పాత్రను ఖర ప్రదేశమున పెట్టవలెను.)

## పదమూడవ అనువాకము

వైశ్వానరాగ్ని - దివికి ముఖము వంటి సూర్యుని వలె తేజరిల్లుచున్నాడు. అతడు భూమి మీద విరామము ఎరుగడు. యజ్ఞకర్తలను అనుగ్రహించువాడు. యజ్ఞకర్తల సత్కార అర్హుడు. అట్టి వైశ్వానరాగ్నిని స్తుతించుచున్నాము.

దేవతలు అటువంటి అగ్ని ముఖమున ఆహుతులు అర్పించుటకు చమసరూప సోమపాత్రలను - వాయువు మున్నగు స్థానములను ఏర్పరచినారు.

సోమమా! నిన్ను ఉపయామ స్థాలియందు - వైశ్వానరాగ్ని కొరకు - గ్రహించుచున్నాను.

ధ్రువ గ్రహమా! నీవు స్థిర నివాసము గలదానవు. ఆదిత్యాది పళ్లెరములందు గట్టిదానవు. **అచ్యుతానామ్ అచ్యుతక్షిత్తమః** - నశించని వాని యందు నశించనే నశించనిదానవు. ఈ ఖర స్థానము నీకు తావైయున్నది. వైశ్వానరాగ్ని కొరకు నిన్ను ఈ ఖర స్థానమునకు చేర్చుచున్నాను.

(సోమము నిండిన ధ్రువ గ్రహమును 'ఖర'మున ఏర్పరచవలెను.)

## పదునాలుగవ అనువాకము

ఉపయామమున ఉన్న సోమమా! నీవు చైత్రమవు. వైశాఖమవు. జ్యేష్ఠమవు. ఆషాఢమవు. శ్రావణమవు. భాద్రపదమవు. ఆశ్వీయుజమవు. కార్తీకమవు. మార్గశిర్షమవు. పుష్యమవు. మాఘమవు. ఫాల్గుణమవు. అధిక మాసమవు. శూన్యమాసమవు. నిన్ను అహస్పత్య దేవత కొరకు గ్రహించుచున్నాను.

(సోమమును ఋతుగ్రహమను పాత్రయందు నింపవలెను.)

## పదిహేనవ అనువాకము

సోమము స్తోత్రయుతము. దేవతలు అభిలషించునది. అభిషతము. ఇంద్రాగ్నులారా! రండి. మీ సోమ భాగమును స్వీకరించండి.

సోమమా! నీవు దారు పాత్రయందు - ఇంద్రాగ్నుల నిమిత్తము - గ్రహించబడుచున్నావు.

పాత్రమా! ఖరము నీ స్థానము అగును. ఇంద్రాగ్నుల కొరకు నిన్ను ఖర స్థానమున స్థాపించుచున్నాను.

(సోమము నిండిన ఋతుగ్రహపాత్రను ఖర స్థానమున ఉంచవలెను.)

## పదహారవ అనువాకము

విశ్వేదేవతలారా! మీరు రక్షకులు. మానవ పోషకులు. సోమము సమర్పించిన యజమానులకు మునుపు ఫలములను ఇచ్చినవారు. మీరు విచ్చేయండి.

సోమమా! నీవు దారు పాత్రయందు - విశ్వేదేవతల కొరకు - గ్రహించబడినావు.

పాత్రమా! ఖరము నీ యొక్క స్థానమగును. విశ్వే దేవతల కొరకు నిన్ను ఖర స్థానమున స్థాపించుచున్నాను.

(సోమ పాత్రను ఖర ప్రదేశమున ఉంచవలెను.)

## పదిహేడవ అనువాకము

ఇంద్రుడు మరుత్తులతో కూడినవాడు. వృష్టి కలిగించువాడు. కోరికలు తీర్చువాడు. ప్రబల శత్రువులు ఉన్నవాడు. అరిభయంకరుడు. స్వర్గవాసి. దుష్టశిక్షకుడు. బల్లపదుడు. ఆ ఇంద్రుని ఈ యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాము.

సోమమా! నిన్ను దారుపాత్రయందు - ఇంద్రుని కొరకు - గ్రహించుచున్నాను.

పాత్రమా! ఖరము నీకు స్థానమగును. మరుత్తులతో కూడిన ఇంద్రుని కొరకు - నిన్ను ఖరమున స్థాపించుచున్నాను.

(సోమపాత్రను ఖరప్రదేశమున పెట్టవలెను.)

## పద్ధెనిమిదవ అనువాకము

మరుద్గణయుక్త ఇంద్రా! నీవు పూర్వపు శర్యాతి యజ్ఞమున అభిషుత సోమపానము చేసినావు. అట్లే ఈ యజ్ఞమునందును సోమమును స్వీకరించుము. యజమానులను నీవు అనుమతించినావు. వారు విద్వాంసులై నీకు పరిచర్యలు చేయుచున్నారు.

సోమమా! నీవు ఉపయామగ్రహమున మరుద్వృత ఇంద్రుని కొరకు గ్రహించబడినావు

పాత్రమా! నీ స్థానమగు ఖరమున మరుద్వంతుడగు ఇంద్రుని కొరకు నిన్ను స్థాపించుచున్నాను

(అధ్వర్యుడు తృతీయ మరుద్వతీయ సోమమును పాత్రయందు తీసికొని ఖరస్థానమున ఉంచవలెను.)

## పందొమ్మిదవ అనువాకము

ఇంద్రా! నీవు మరుద్వంతుడవు. జలము వర్షించువాడవు. ఆటలాడినట్లు యజ్ఞమునందలి పురోడాశమును అనుసరించుము. సోమరసమును సేవింపుము. ఆహ్లాదమునకు ఆరగించిన సోమమును ఉదరమున నింపుము. నీవు స్వర్గస్థాపయిట్టువు - సోమస్థాపయిట్టువు.

సోమమా! నిన్ను ఉపయామగ్రహమున - మరుద్వంతుడగు ఇంద్రుని కొరకు - గ్రహించినాను

పాత్రమా! నీస్థానమగు ఖరమున - మరుద్వంత ఇంద్రుని నిమిత్తము - నిన్ను స్థాపించుచున్నాను.

(సోమపాత్రను ఖరప్రదేశమున ఉంచవలెను.)

## ఇరువదవ అనువాకము

వర్షుకాభ్రము వంటి ఘనుడైన ఇంద్రుడు - బాలుని వంటి యజమాని స్తోత్రములచే వర్ధిల్లును గాత.

సోమమా! నిన్ను ఉపయామ పాత్రయందు - ఇంద్రుని కొరకు - గ్రహించుచున్నాను.

పాత్రమా! నీస్థానమగు ఖరమున ఇంద్రుని కొరకు నిన్ను స్థాపించుచున్నాను.

(మహేంద్ర దేవతాక సోమరసమును శుక్రగ్రహములోనికి తీసికొని ఖరప్రదేశమున ఉంచవలెను.)

## ఇరువది ఒకటవ అనువాకము

రాజు, మంత్రులు తమసేవకులకు అభీష్టములు కలుగచేయుదురు. అట్లే ఈ మహాన్ ఇంద్రుడు మానవులకు అభీష్ట వరదుడు అగుచున్నాడు. ఇతడు సోమయాగముల వృద్ధి కలవాడు అపారబలవంతుడు.

మనము ఇంద్రుని అనుగ్రహమున వర్ధిల్లినట్లు - అతడు మన హవిస్సులచే వర్ధిల్లును యజ్ఞకర్తల అనుష్ఠానము వలన ఇంద్రునకు సామర్థ్యము, కీర్తి, బలములు ఎంతో వృద్ధి చెందుచున్నవి.

సోమమా! నిన్ను ఉపయామమున మహేంద్రుని కొరకు గ్రహించుచున్నాను.

పాత్రమా! నిన్ను నీస్థానమగు ఖరమున మహేంద్రుని కొరకు స్థాపించుచున్నాను.

## ఇరువది రెండవ అనువాకము

1. ఇంద్రా! నీవు హింసకుడవుకావు. హవిస్సులర్పించు యజమాని వద్దకేగి ఫలములిచ్చువాడవు నీకు అర్పించవలసిన హవిస్సులు యజమాని మరల నీకే అర్పించుచున్నాడు.

సోమమా! నిన్ను ఉపయామమున ఆదిత్యుని కొరకు గ్రహించుచున్నాను.

(సోమమును ఆదిత్య పాత్రలోనికి తీసికొనవలెను.)

2. ఇంద్రా! నీవు ప్రమాదము కలిగించువాడవుకావు. యజమాని యొక్క ఈజన్మను, రానున్న జన్మను పాలించువాడవు.

ఆదిత్యా! ఇది మూడవ సవనము. ఇది నీకు సంబంధించినది. దధి ఇంద్రియాభివృద్ధి హేతువు. అమృతము వంటిది. ద్యులోక సమము. అట్టి పెరుగు ఈ సవనము నందలి హవిర్ధానమందు ఎదురుగా ఉన్నది.

(సోమరసమును ఆదిత్యపాత్రలోనికి తీసికొనవలెను.)

3. యజ్ఞపురుషుడు దేవతల సుఖములు తెలిసికొనుచున్నాడు.

ఆదిత్యులారా! మాకు సుఖములు కలిగించండి. మీ అనుగ్రహబుద్ధి మాయందు నిలువవలెను. మీరు మా పాపములను నశింపచేయువారలు. మేము చేయు పరిచర్యలను గ్రహించండి

4. ఆదిత్యదేవా! నీవు విశిష్టనివాసము కలవాడవు. ఇది నీవు సేవించదగిన సోమము. దీనిని సేవించుము. సంతృప్తుడవగుము. మమ్ము సంతృప్తులను చేయుము.

5. సోమమా! దధి దివ్యవృష్టి కారణము. దానితో నిన్ను కలుపుచున్నాను.

(సోమమున పెరుగు కలుపవలెను.)

### ఇరువది మూడవ అనువాకము

సవితా! నేడు మాకు కర్మఫలము నిమ్ము. రేపు కూడ ఇమ్ము. నిత్యము ఇచ్చుచునే ఉండుము. భూరిస్వర్గము పొందగోరుచున్నాము. మమ్ము అందుకు తగిన కర్మానుష్ఠాన పరులను చేయుము.

సోమమా! నిన్ను ఉపయామపాత్రయందు సవిత కొరకు అందుకొనుచున్నాను.

(సోమరసము సూర్యదేవతా గ్రహములోనికి తీసికొనవలెను.)

### ఇరువది నాలుగవ అనువాకము

సవితా! మమ్ము అనుగ్రహింపుము. శుభస్వరూపుడవగుము. మా ఇంటిని కాపాడుము నీ అనుగ్రహము బాధారహితము. పాలనా సమర్థము. నీ పలుకు హితకరము. రమణీయము. ప్రియము నీవు మమ్ము పాపాత్ములను చేయకుము. నిందించకుము.

(సూర్యపాత్రయందు సోమము గ్రహించవలెను )

### ఇరువది అయిదవ అనువాకము

సవితా! నీవు హిరణ్యపాణివి. మమ్ము రక్షించుమని నిన్ను ఆహ్వానించుచున్నాము. సవిత దేవతల నివాసములు ఎరిగినవాడు.

సోమమా! నిన్ను ఉపయామ గ్రహమున సవిత కొరకు గ్రహించుచున్నాను.

### ఇరువది ఆరవ అనువాకము

విశ్వేదేవతల పాత్రమా! నీవు సుఖములు కలదానవు. చక్కని స్థానము కలదానవు. నీ ప్రదేశమగు ఖరస్థానమున నిన్ను విశ్వేదేవతల కొరకు స్థాపించుచున్నాను.

(విశ్వేదేవపాత్రలోనికి సోమమును తీసికొని ఖరప్రదేశమున ఉంచవలెను.)

### ఇరువది ఏడవ అనువాకము

సోమము అభిషుతము. వీర్యవంతము. పత్నీవంత అగ్నీ! నీవు ఈ సోమమును త్వష్టసహితుడవై సేవించుము. **స్వాహా.**

సోమమా! నిన్ను పత్నీ దేవతాక పాత్రమున గ్రహించుచున్నాను.

(సోమరసమున హోమము చేయవలెను.)

**ఇరువది ఎనిమిదవ అనువాకము**

సోమమా! నీవు హరితవర్ణవు. ఇంద్ర దేవతాకమవు. గుర్రములు కట్టిన రథము కలదానవు ధ్వజమును భరించుదానవు. అన్నమునకు ప్రేరణ కలిగించుదానవు.

సోమదేవా! నీవు యజస్సు, స్తుతస్తోమములు కలదానవు. ఇంద్రదేవతాకమగు నీ సోమపానము అందుకొనుచున్నాను.

ధాన్యాః! మీరు హర్యశ్వములుగను, హరి శబ్దార్థులుగను ఉంటున్నారు.

**ఇంద్రాయస్వాహా.**

(లాజలను సోమముతో కలిపి హోమము చేయవలెను )

**ఇరువది తొమ్మిదవ అనువాకము**

అగ్నీ! నీవు భక్తుల ఆయువుల పెంచుచున్నావు. మాకు అన్నము, బలము కలుగచేయుము శత్రుసేనను దూరమునందుండగనే బాధించుము.

సోమమా! నిన్ను ఉపయామగ్రహమున తేజోవంతుడగు అగ్ని కొరకు అందుకొనుచున్నాను.

పాత్రమా! నీస్థానమగు ఖరదేశమున తేజోవంతుడగు అగ్ని కొరకు నిన్ను స్థాపించుచున్నాను.

**ముప్పదవ అనువాకము**

ఇంద్రా! సోమము త్రాగుము. దాని బలమున లెమ్ము. దవడలు కదలించుము.

సోమమా! నిన్ను ఉపయామమున ఇంద్రుని కొరకు గ్రహించుచున్నాను.

గ్రహమా! నీ స్థానమగు ఖరమున ఇంద్రుని నిమిత్తము నిన్ను స్థాపించుచున్నాను.

**ముప్పది ఒకటవ అనువాకము**

సూర్యుడా! నీవు చీకట్లను తరుమువాడవు. విశ్వదర్శనీయుడవు. అంతట వెలుగు కలిగించువాడవు. విశ్వమును కాంతివంతము చేయునట్లు వెలుగొందువాడవు.

సోమమా! నిన్ను ఉపయామమున సూర్యుని కొరకు గ్రహించుచున్నాను.

గ్రహమా! నీ స్థానమగు ఖరమున సూర్యుని కొరకు నిన్ను స్థాపించుచున్నాను.

**ముప్పది రెండవ అనువాకము**

సోమమా! నీవు ఎంతో సంతసము కలదానవు. అన్ని రక్షణలు కలదానవగుము. వర్ధిల్లుము. మాకు ఖ్యాతి కలిగించుము.

### ముప్పది మూడవ అనువాకము

ఉషస్సు ఉదయ మూలము అగుచున్నది. ఆమెను అందరి కన్న ముందు చూచినవారు ఉషానుగ్రహపాత్రులు అగుచున్నారు. రాత్రుల చివరలందు చూచువారిని కూడ ఆమె అనుగ్రహించుచున్నది

### ముప్పది నాలుగవ అనువాకము

సమిధా! జ్యోతిష్మతీమ్ - కొద్దికాంతిగల త్వా - నిన్ను సాదయామి అగ్నికి అర్పించుచున్నాను

జ్యోతిష్కృతమ్ - కొంచెము ఎక్కువ కాంతిగల త్వా సాదయామి అగ్నౌ.

జ్యోతిర్విదమ్ - అధిక కాంతిగల త్వా సాదయామి అగ్నౌ

జ్వలన్తీమ్ త్వా సాదయామి అగ్నౌ

మల్మలాభవన్తీమ్ - తగులబడుచున్న త్వా సాదయామి అగ్నౌ.

దీప్యమానామ్ త్వా సాదయామి అగ్నౌ

రోచమానామ్ త్వా సాదయామి అగ్నౌ

అజస్రామ్ - అధిక కాంతిగల త్వా సాదయామి అగ్నౌ

బృహజ్జ్యోతిషమ్ - ఎదుగుకాంతి గల త్వా సాదయామి అగ్నౌ

బోధయన్తీమ్ - వ్యాపించుకాంతిగల త్వా సాదయామి అగ్నౌ

జాగ్రతీమ్ - ప్రకాశస్వభావము గల త్వా సాదయామి అగ్నౌ

### ముప్పది ఏడవ అనువాకము

ఇంద్రా! నీ అశ్వములు మంత్రముల చేత రథమునకు తగిలినవి. రథమును అధిరోహింపుము.

సోమము అభిషుతమగుచున్నది. ఆ శిలల శ్రావ్యధ్వని ఇంద్రుని మనసును సోమము వైపు మరలించును గాత.

సోమమా! నిన్ను ఇంద్రుని కొరకు ఉపయామమున గ్రహించుచున్నాను.

షోడశి గ్రహమా! నీ స్థానమగు ఖరమున ఇంద్రుని కొరకు నిన్ను స్థాపించుచున్నాను.

(షోడశి పాత్రమున సోమము నింపి ఖరప్రదేశమున ఉంచవలెను.)

## ముప్పది ఎనిమిదవ అనువాకము

ఋషుల మంత్రస్తుతులను - మానవుల యజ్ఞాదులను ఇంద్రుడు అందుకొనుచున్నాడు. అట్లయి అతడు మహా బలవంతుడైనాడు. అతనిని ఎదిరించగలవారు లేక పోయినారు.

**ఉపయామగృహీతో౽సీన్ద్రాయత్వాషోడశిన ఏషతే యోని రిన్ద్రాయ త్వా షోడశినే**

(అర్థమునకు పూర్వమంత్రపు 3,4 పరిచ్ఛేదములు.)

## ముప్పది తొమ్మిదవ అనువాకము

ఇంద్రా! నీవు అందరను మించిన బలవంతుడవు. రమ్ము. సోమము అభిషుతమై ఉన్నది. సూర్యకిరణములు జలమును పీల్చును. సూర్యుని ఆవరించును. అట్లే ఇంద్రియశక్తి ఇంద్రుని ఆవరించును గాత.

**"ఉపయామగ్రహీతో౽సీన్ద్రాయ త్వా షోడశిన ఏషతే యోనిరిన్ద్రాయ త్వా షోడశినే"**

## నలుబదవ అనువాకము

ఇంద్రా! ఈ భూమండలము సకల ప్రాణులకు అభిముఖముగా ఉన్నది. అది నిన్ను ఉపరి స్థానమున నిలుపును గాత.

భూమీ! అస్మైస్యోనా సుషదాభవ - ఈ ఇంద్రునకు సుఖప్రదవు, మంగళనివాసమవు అగుము. యజమానికి విశాల సుఖములను కలిగించుము.

**"ఉపయామగ్రహీతో౽సీన్ద్రాయత్వాషోడశిన ఏషతే యోనిరిన్ద్రాయ త్వాషోడశినే"**

## నలుబది ఒకటవ అనువాకము

**మహాగ్ం ఇన్ద్రో వజ్రబాహు షోడశీ శర్మయచ్ఛత.** మహేంద్రుడు వజ్రబాహువు. పదహారు శస్త్రస్తోత్రములవాడు. అతడు సుఖములను ఇచ్చును గాత.

**స్వస్తినో మఘవా కరోతు హన్తు పాప్మానం యో అస్మాన్ద్వేష్టి**

మఘవుడు మాకు శుభములు కలిగించును గాక. మమ్ము ద్వేషించు పాపములను హతమార్చునుగాక.

**ఉపయామ గ్రహీతో ౽సీన్ద్రాయత్వా షోడశిన ఏషతే యోని రిన్ద్రాయత్వా షోడశినే.**

## నలుబది రెండవ అనువాకము

ఇంద్రా! నీవు వృత్రహంతవు. శూరుడవు. ప్రీతియుక్తుడవు. మరుత్సహితుడవు. విద్వాంసుడవు. నీవు యజమాని నిష్ఠను ఎరుంగుము. సోమపానము చేయుము. మమ్ము చంప దలచిన శత్రువును చంపుము. ఇతర శత్రువులను దూరము చేయుము. మమ్ము సర్వత్ర నిర్భయులను చేయుము.

**"ఉపయామ గ్రహీతో౽సీన్ద్రాయ త్వాషోడశిన ఏషతే యోని రిన్ద్రాయత్వా షోడశినే"**

## నలుబది మూడవ అనువాకము

(37 నుండి 42 వరకు గల అనువాకము ఆరణ్యకములు. వానిని తొలగించిన ఇది 37 వ అనువాకము అగును.)

(ఈ అనువాకమునందు దక్షిణ చెప్పబడుచున్నది.)

**1.** సూర్యుడు అగ్ని వంటి వాడు. అతడు జగములను చూచును. అందుకని అతని కిరణములు పైన వ్యాపించి ఉన్నవి.

**2.** అతడు చిత్రవర్ణుడు. మిత్రుడు, వరుణుడు, అగ్నికి నేత్రమైనవాడు. అతడు కిరణ సేనాయుతుడై ఉదయించుచున్నాడు. అతడు సూర్యుడు. సకల స్థావర జంగమాత్మక లోకములకు ఆత్మవంటివాడు. అతడు ముల్లోకములందు వ్యాపించి ఉన్నాడు.

(దక్షిణగా ఈయదగిన హిరణ్యమును మూటకట్టి గార్హపత్యాగ్నియందు హోమము చేయవలెను.)

**3.** అగ్నీ! ధనము కొరకు మమ్ము సన్మార్గమున నడిపించుము. స్వామీ! నీవు సకల మార్గములు తెలిసిన వాడవు. మానుండి పాపములను దూరము చేయుము. నీకు మంచి స్తుతులచే గొప్పగా నమస్కరించుచున్నాము.

(అగ్నీధ్రుని వద్దకు వచ్చి దాక్షిణ హోమము చేయవలెను.)

**4.** హిరణ్యమా! ఆకసము వైపుసాగుము. స్వర్గమును చేరుము.

(హిరణ్యమును హోమ కుండమునుండి బయటకు తీయవలెను )

**5.** దక్షిణ హిరణ్యమా! నీవు తొలుత హోమము చేయబడినావు. మరల తీయబడినావు. దక్షిణ వేదియందున్న నీవు ఎంతో కమనీయముగ ఉన్నావు.

(బంగారమును తీసికొనవలెను.)

**6.** దక్షిణహిరణ్యమా! స్వర్గమునందున్న వాడును, సర్వజ్ఞుడును అగు తుథదేవత మిమ్ము విభజించును గాత.

(ఋత్విజులకు ఇచ్చు బంగారు భాగములను విభజించవలెను )

**7.** అగ్నీ! నీవు సమృద్ధికి కారణమవు అగుదువు. సోమయాగమునందు ఈ ద్రవ్యము లభించినది.

యజ్ఞపురుషుడు సన్మార్గగామి. అతడే నడిపించుచున్న సువర్ణాదులారా! సత్యమార్గమున పయనించండి.

(ఇది దక్షిణలిచ్చు మంత్రము. 2. దక్షిణగా ఇచ్చినది సదుపయోగము కావలెననుట.)

**8.** నేను యజమానిని. అత్రిగోత్రమున పుట్టిన బ్రాహ్మణునకు హిరణ్యము ఇచ్చెదను. అతనిని సంతోషపెట్టెదను.

దక్షిణ అందుకొను బ్రాహ్మణుడు వేదార్థవేత్త వేదార్థవిదుని పుత్రుడు - పితృశిక్షణ కలవాడు - పతివ్రత పుత్రుడు - దక్షిణకు అర్హుడు అయి ఉండవలెను.

**9.** యజమానీ! **సువః విపశ్య** - స్వర్గమును చక్కగా చూడుము. **అంతరిక్షమ్ విపశ్య. సదస్యైః యతస్వ** - సభవారిని అనుసరించుము.

(యజమాని సభను చూడవలెను.)

**10.** దక్షిణ హిరణ్యాదులారా! మేము మిమ్ము ఇచ్చుచున్నాము. మీరు దేవస్వరూపులు కండి. ఋత్విజులందు చేరండి.

గోవులారా! మీరు మధుర క్షీరవతులు కండి. పరలోకమందు యజమానిగ రూపాంతర మొందండి. మమ్ము విడువకండి. దేవయాన మార్గమున వెళ్లండి. అచట పుణ్యాత్ముల స్థానములందు ఆసీనులు కండి.

**తన్న పృగంస్కృతమ్.** ఆ స్థానము మాకొరకు అలంకరించబడినది.

## నలుబది నాలుగవ అనువాకము

**1.** దాతయగు బ్రహ్మయు, సవితయు, నిధిపతియగు ప్రజాపతియు, అగ్నియు, త్వష్టయు, విష్ణువును మా హవిస్సులను అందుకుందురుగాక. ఈ ఆరుగురు దేవతలు యజమాని సంతానముతో ఆడుకొనుచు, యజమానికి ధనసమృద్ధి కలిగింతురుగాక

(తొమ్మిది మారులు ఈ తొమ్మిది మంత్రములతో ఆహుతులు అర్పించవలెను.)

**2.** ఇంద్రా! నీ మనసు కరుణామయము. మాకు గోవులను ప్రసాదించుము. మమ్ము హోత్రాది విద్వాంసులతో కలుపుము. మాతో దేవతల కర్మలు చేయించుము. యజ్ఞ సంబంధులగు దేవతల అనుగ్రహము కలిగించుము.

**3.** మేము దేవతల అనుగ్రహము కలవారలము అయినాము. అట్లయి బలము, క్షీరాదులు, శోభన శరీరము, శ్రద్ధగల మనసు గలవారలమైనాము. త్వష్ట ఈయజ్ఞమును స్వీకరించునుగాక. కోరిన ధనమును ప్రసాదించును గాత. మాదేహములను శుద్ధము చేయునుగాక. పాపములను దూరము చేయును గాత.

**4.** అగ్నీ! ఈనాడు - ఈ యాగస్థలమున - ఈ యజ్ఞము జరుగుచుండగా నిన్ను హోతగా వరించినాము. నీవు యజ్ఞమును సమృద్ధముగా నిర్వర్తించినావు. యజ్ఞమును ఎరిగినావు. విఘ్నశాంతి చేసినావు. ఇక మా శ్రద్ధను గ్రహించుము. మాయజ్ఞమును స్వీకరించుము

**5.** దేవతలారా! మీరు మమ్ము కరుణించినారు. వచ్చినారు. ఆసీనులయినారు. పురోడాశములు ఆరగించినారు. సోమపానము చేసినారు. వెళ్లినారు. మీ ఆసనములు మాకు దక్కినవి. **అస్మేధత్త వసవో వసూని** - దేవతలారా! మాకు సంపదలు కలుగ చేయండి.

**6.** అగ్నీ! నీవు దేవతలను ఆహ్వానించినావు. వారు హవిష్యాములు. విచ్చేసినారు. వారిని ఆసీనులను చేయుము.

దేవతలారా! మీరు రథముల మీద వచ్చినారు. హవిస్సును వహించుచున్నారు. పోషించుచున్నారు. మీరు ఆదిత్యుని నుండి రండి. స్వర్గము నుండి రండి.

**7.** యజ్ఞమా! యజ్ఞార్థము యజ్ఞస్వరూపుడగు విష్ణువును చేరుము. యజ్ఞఫలమును ఇచ్చుటకు యజ్ఞపతిని చేరుము. నీవు యోని భూతమగు కర్మను చేరుము. **స్వాహా.**

**8.** అగ్నీ! నీవు యజ్ఞస్వామివి. ఈ యజ్ఞము స్తోత్రసహితము ఋత్విజ సహితము - **స్వాహా.**

**9.** దేవతలారా! మీకు వచ్చిన మార్గము తెలియును. యజ్ఞము ముగిసినంత ఆమార్గముననే తిరిగి వెళ్లండి.

మనస్పతివగు దేవరా! మాయజ్ఞమును హవిర్భోక్తలగు దేవతలకు అందించుము. **స్వాహా.** వాగ్దేవతకు అందించుము - **స్వాహా.** తదుపరి క్రియా ప్రవర్తకుడగు దేవతకు అందించుము.

### నలుబది అయిదవ అనువాకము

(అవభృథము చెప్పబడినది.)

**1.** వరుణరాజు సూర్యుని కొరకు నిరాధార అంతరిక్షమున విశాల మార్గమును ఏర్పరచినాడు. మాకు సహితము అడుగు - మోపుటకు దారి కల్పించును గాత. నిందకుడు, బాధించు శత్రువు సహితము మాకు దారి ఇచ్చునుగాక.

(యజమానాదులు వేదినుండి బయలుదేరవలెను.)

**2.** వరుణరాజా! నీవద్ద వందలవేల ఉపద్రవ నివారకులు ఉన్నారు. నీ బుద్ధి ఆదరయుక్తము. సర్వకాలీనము. అనుగ్రహయుతము. ఆ బుద్ధియందు మమ్ము చేర్చికొనుము. మా శత్రువులను బాధించుము. యజ్ఞవిఘాతి రాక్షసిని పారద్రోలుము. మమ్ము పాపవిముక్తులను చేయుము.

**3.** **అభిష్ఠితో వరుణస్య పాశో** - వరుణపాశము వదలినది.

(యజమానాదులు వేదినుండి సాగవలెను )

**4.** అగ్నిముఖము జలములందు చేరినది. అపాంనపాతాగ్నీ! ఇంటింట అసురులు చేయు విఘ్నములను మాన్పుము. యజ్ఞములను రక్షించుము. జ్వలన సాధనమగు ఆజ్యమును అందుకొనుము. నీనాలుక ఆజ్యమును అందుకొనుటకు ఆరాటపడును గాత.

**5.** జుహూవా! నీ హృదయము సాగరమంతటి నీట చేరును గాత. ఋజీష రూపములగు ఓషధులు, జలములు నీయందు చేరును గాత.

యజ్ఞపతీ! నీ యొక్క యజ్ఞ హవిస్సులచే దేవతలను సంతృప్తులను చేసినాము. సూక్తవాక నమోవాక ఫలమును నీకు కలిగించినాము.

(యజమానాదులు స్రుచమును నీట వేయవలెను )

**6.** అవభృధాత్మక వరుణరాజా! నీవు రాక్షస నివృత్తికి మహారావము చేయుచున్నావు. నీవు నిగూఢముగ సంచరించువాడవు మేము దేవతలకును, ఋత్విజులకును అపరాధములు చేసి ఉండవచ్చును. వానిని దేవతలతోను, ఋత్విజులతోను మన్నింపచేయుము. మహా హింసల నుండి మమ్ము **పాహి.**

**7.** **సుమిత్రావ ఆప ఓషధయః** జలములు, ఓషధులు మాకు మంచి మిత్రులు కావలెను. మమ్ము ద్వేషించు వారికిని - మేము ద్వేషించువారికిని జలములు, ఓషధులు దుష్టమిత్రులు కావలెను.

(దోసిలితో నీరు తీసుకొని పడమటి దిక్కున విడువ వలెను.)

**8.** జలములారా! వరుణరాజు మీ గర్భములందు ఉన్నవాడు. కావున మిమ్ము సంతోషపెట్టుటకు వరుణ దేవునకు హవిస్సులు అర్పించినాము. అతనికి పుష్టియు తుష్టియు కలిగించినాము. వరుణుడు మా అనుష్ఠానమును గురించి దేవతలకు తెలియపరచును గాత.

**9.** వరుణపాశము విడిపోయినది. వరుణపాశము నశించినది.

(యజమాని నీట చేరవలెను )

**10.** సమిధా! నీవు అభ్యుదయ కారణమవు. కాంతి సాధనమవు. మేము వర్ధిల్లినాము. మాకు కాంతి కలుగచేయుము.

నేను జలములందు అవభృధమును ఆచరించినాను. ఫలములు కలవాడను అయినాను. క్షీరాది సమృద్ధి కలవాడను అయినాను. వచ్చినాను. నాకు బలములను ఇమ్ము

(యజమాని ఆహవనీయాగ్ని యందు సమిధ వేసి అగ్ని వద్ద ఉండవలెను.)

**సోమయాగము సమాప్తము**

**నలుబది ఆరవ అనువాకము**

(యాజ్యాపురోనువాకములు)

**1.** అగ్నీ! నేను మర్త్యుడను. మంచి మనసున్నవాడను. నిన్ను అమర్త్యునిగా ఎరిగినాను ఆహ్వానించుచున్నాను. మాకు పుత్ర పౌత్రులనిమ్ము. కీర్తి కలిగింపుము. **అగ్నే అమృతత్వ మశ్యామ్.** అగ్నీ! మేము అమృతత్వమును అందుకొందుము. (ఇది పురోనువాక్యము.)

**2.** జాతవేద అగ్నీ! నీవు మంచి కర్మల యజమానులకు ఉన్నత స్థానములు కల్పించుచున్నావు అందువలన వారు అశ్వవంతులు, పుత్రవంతులు, వీరవంతులు, గోమంతులు, ధనవంతులు అగుచున్నారు. (ఇది యాజ్య.)

**3.** బలపుత్ర ఇంద్రా! సుఖముల నిచ్చు స్తుతులన్నియు నీయందే ఉన్నవి. ఒక్కటి సహితము నిన్ను అతిక్రమించుట లేదు. (ఇది పురోనువాక్య)

**4.** ఇది సోమయాగము. ఇందలి శస్త్రము - శస్త్రము నందలి సోమము ఇంద్రుని ఆనందపరచినవి. ఈ యజమాని, యజమానులందు నేర్పరి. ఇతడు కొడుకు వంటివాడు. ఇంద్రుడు తండ్రి వంటి వాడు ఇంద్రుడు శత్రు సంహారకుడు కదా! అందువలన కొడుకు తండ్రిని - కాపాడమని పిలిచినట్లు - యజమాని ఇంద్రుని కేక వేయుచున్నాడు. (ఇది యాజ్య.)

**5.** జాతవేదాగ్నీ! నీవు తేజస్సున ఎంతో వెలుగుచున్నావు. నీవు యజ్ఞ స్థానమునందలి రాక్షసులను సంహరించువాడవు. దేహమునందలి అంతర వ్యాధులను అంతమొందించువాడవు. మాకు బలము కలిగించుము. (ఇది పురోనువాక్య.)

**6.** 45 - 10 చూడండి.

**7.** జాతవేదాగ్నీ! నీవు లోకస్థితి కారకుడవు. ధనపతివి. తేజోధనుడవు. కావున మమ్ము సహితము నీ అనుగ్రహ బుద్ధియందు ఉంచుకొనుము. (యాజ్య.)

**8.** ప్రకాశమాన అగ్నీ! ధనములందు శ్రేష్ఠ ధనములకు నీవు అధిపతివి. కావున నిన్ను అన్ని యజ్ఞములందు సంతోష పెట్టుచున్నాను. మేము అన్నము కోరువారలము. నీ దయ వలన అన్నము పొందుచున్నాము. శత్రుసేనలను ఛేదించగలవారలమగుదుము. (పురోనువాక్య )

**9.** అగ్నీ! నీవు అన్నమును అధికముగ ఇచ్చువాడవు. నీవు స్తోత్రములచే స్తుతించబడుచున్నావు యజ్ఞకర్తలు నిన్ను వర్ధిల్ల చేయుచున్నారు. మాకు మంచి బలము నొసగుము. (యాజ్య )

**10.** అగ్ని మాకు పరిచారకులను ప్రసాదించును గాత. శత్రువులను దునుమాడుచు అగ్రగామి అగును గాత. శత్రువులను హింసించి జయించును గాత. మేము అన్నదానము చేయుటకు ఇతరుల అన్నము అందించును గాత. (యాజ్య.)

**11.** తొలి అగ్ని మలి అగ్నితో కలిసి మండిపోవుచున్నాడు. అగ్ని విద్వాంసుడు. గృహములకు యజమాని వంటివాడు. ధగ ధగ మండుచు పడుచువాడై ఉన్నాడు. అతడు హవ్యవాహనుడు. జుహువు నోటివాడు.

**12.** తొలి అగ్నీ! నీవు తరువాతి అగ్నితో కలిసినావు. జాజ్జ్వల్యమానముగ ప్రకాశించుచున్నావు అగ్నీ నీవు విప్రులకు విప్రుడవు, మిత్రులకు మిత్రుడవు అగుచున్నావు.

**13.** ఉదగ్నే శుచయస్తవ విజ్యోతిషా - అగ్నీ! నీ కాంతులు పరిశుద్ధములు. అవి పైపైకి ఎగయుచున్నవి.

శ్రీమదాంధ్రవచన కృష్ణయజుర్వేదీయ

తైత్తిరీయ సంహిత మొదటి కాండము పందలి

నాలుగవ ప్రపాఠకము సమాప్తము.

యస్తేస్తనః శశయో యోమయో భూర్యోరత్నధా వసువిద్యాః సుదత్రః ॥
యేనవిశ్వాపుష్యసి వీర్యాణి సరస్వతి తమిహదాతవోఽకః ఉర్వ్యన్తరిక్షమన్వేమి ॥

## అయిదవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

(1 - 4 అనువాకములందు పునరాధేయము చెప్పబడినది.)

**1.** పూర్వము దేవతలు అసురులు యుద్ధము చేసినారు. అందు దేవతలు జయించినారు. వారినుండి ధనమును గుంజుకున్నారు.

రాక్షసులు మరల జయింతురేమో అనుకున్నారు దేవతలు. ఆ డబ్బు అప్పుడు పనికి వచ్చునని అగ్ని దగ్గర దాచినారు.

అగ్ని ఆ ధనమును తనది చేసికొనదలచినాడు. ఆ ధనముతో పారిపోయినాడు.

అదృష్టవశమున దేవతలు మరల గెలిచినారు. గెలిచిన వారు అగ్ని వద్ద ఉన్న ధనము సాధించ దలచినారు. అగ్నిని వెన్నంటినారు. ఆ ధనమును బలవంతముగా లాగుకొనదలచినారు. అప్పుడు సోఽరోదీద్యదరోదీత్తద్రుద్రస్య రుద్రత్వం - అగ్ని పెద్దగా ఏడ్చినాడు. అందువలన రుద్రత్వము - ఏడ్పు - ఏర్పడినది.

అగ్ని అట్లు ఏడ్చుట వలన కన్నీరు కారినది. ఆ కన్నీరు - రజతగ్ం హిరణ్యమభవత్ - వెండి యను ధనము అయినది. అందువలన యజ్ఞములందు రజతము అదక్షిణ్యము - ఇవ్వదగనిది - అయినది.

యజ్ఞములందు కన్నీట పుట్టిన రజతమును దక్షిణగా ఇచ్చిన యజమాని ఇంట సంవత్సరము లోపల ఏడుపులు వినిపించును.

తస్మాద్బర్హిషిన దేయగ్ం - అందువలన - వెండిని - యజ్ఞములందు దానము చేయకూడదు.

**2.** "నేను ముందు యజ్ఞహవిస్సునందు అసాధారణ భాగస్వామిని అగుదును. అప్పుడు మీకు ఈ ధనమును ఇత్తును" అని అగ్ని దేవతలతో అన్నాడు.

అప్పుడు దేవతలు అగ్నికి "పునరాధేయము" అను హవిర్భాగమును ఇచ్చినారు. 'ఇది స్వర్గమునందు బలము కలిగించు' నని అగ్నితో అన్నారు.

అగ్ని అందుకు సంతృప్తుడు అయినాడు. 'అస్మద్దేవతాకమైన పునరాధేయము చేసి అగ్నినాధానము చేసిన వాడు సమృద్ధి కలవాడు అగును' అని అగ్ని వక్కాణించినాడు.

**3.** పూష ఆ అగ్నిని ఆధానము చేసినాడు. అందువలన అతనికి పశుసమృద్ధి కలిగినది అట్లగుట చేత పశువులు పూషదేవతాకము లయినవి.

త్వష్ట ఆ అగ్నిని ఆధానము చేసినాడు. అందువలన త్వష్టకు పశుసమృద్ధి కలిగినది అట్లగుట చేత పశువులు త్వష్టదేవతాకములు అయినవి.

మనువు ఆ అగ్నిని ఆధానము చేసినాడు. అందువలన మనువునకు ప్రజాసమృద్ధి కలిగినది. అట్లగుట వలన ప్రజలు మానవులు అయినారు.

బ్రహ్మ ఆ అగ్నిని ఆధానము చేసినాడు. అందువలన ధాతకు ప్రజాసమృద్ధి కలిగినది. **సంవత్సరోవైధాతా** - ధాత సంవత్సరమగుచున్నాడు. **తస్మాత్సంవత్సరం ప్రజాః పశవోఽను ప్రజాయన్తే** - అందువలన ప్రతి సంవత్సరము ప్రజలు, పశువులు ఎక్కువగా పుట్టుచున్నవి.

**4.** పునరాధానము చేయబడిన అగ్నియొక్క సమృద్ధిని తెలిసికొన్నవాడు నిశ్చయముగా సమృద్ధుడు అగుచున్నాడు.

**5.** అగ్నికి పూషాది దేవతలతో గల సంబంధము తెలిసి కొన్నవాడు బంధువులు కలవాడగుచున్నాడు.

**6.** అగ్నిని మొదట ఆధానము చేసినారు. అప్పుడు అగ్ని అధిక భాగదేయము కోరినాడు. అట్లు కోరినవాడై యజమాని ప్రజకు, సంతానమునకు ఉపద్రవము కలిగించినాడు.

కావున మొదట ఆధానము చేసిన అగ్నిని ఉద్వాసన చేయవలెను. మరల అగ్నిని ఆధానము చేయవలెను. అగ్ని - ఆ విధముగా చేసిన యజమానికి - సమృద్ధి కలిగించును

**అథోశాన్తిరేవాస్యైషా** - ఇదియే ఈ అగ్నికి శాంతి యగును.

**7.** నక్షత్రములందు పునర్వసు పునరాధేయాగ్నికి సంబంధించిన దగును. ఆ విధముగా చేసినట్లయిన యజమాని నక్షత్రాభిమాని యందు ఆధానము చేసినట్లగును. అందువలన యజమానికి బ్రహ్మవర్చస్సు కలుగును.

**8.** దర్భలచే పునరాధానము చేసిన సారము చెడదు. పుల్లలచే పునారాధానము చేసిన సారము చెడిపోవును.

**9.** దర్భలచే పునరాధానము చేసినట్లయిన దర్భలకు కారణమగు జలములు, ఓషధుల నుండి అగ్నిని సముపార్జించినట్లగును. యజమాని స్వక్రమముగా పునరాధానము చేసినవాడగును.

**10.** పురోడాశము అయిదుపాత్రలందు ఉంచవలెను. ఆ విధముగా చేసిన అయిదు ఋతువులనుండియే అగ్నిని సముపార్జించినట్లును - ఆధానము చేసినట్లును అగును. -

(ఒక వ్రతమును గురించిన వృత్తాంతము - వ్రతము వలన కలుగు నిశ్చితఫలము - దోషాచరణ వలన కలుగు ఉపద్రవము చెప్పుట ఇదియే మొదలుగా కనిపించుచున్నది.)

### రెండవ అనువాకము

**1.** అగ్నిని ఉద్వాసన చేసిన యజమాని తన యజ్ఞమును, పశువులను నాశనము చేసికొనిన వాడు అగుచున్నాడు.

పురోడాశము అయిదు పాత్రలందు సంస్కరించబడుచున్నది. అందువలన యజ్ఞము పాంక్తము పశువులు పాంక్తములు. కావున యజమాని - అగ్నిని ఉద్వాసనచేయని వాడు - పశువులను యజ్ఞములను పొందుచున్నాడు.

(పంక్తి ఒక ఛందస్సు.)

**2.** అగ్ని దేవతలందు వీరుడు. కావున యజమాని అగ్నిని ఉద్వాసన చేయరాదు. అట్లు చేసిన యజమాని అగ్నిహంత అగుచున్నాడు. పూర్వము సత్యనిష్ఠులగు విప్రులు అగ్నిహంత యజమాని వద్ద అన్నము తినుట మానుకున్నారు.

యాజ్యాను వాక్యములు అయిదు. 2 చేతులు + 2 కాళ్లు + 1 తల వలన మానవుడు అయిదింటివాడు.

కావున దేవతలందు అగ్రగణ్యుడగు అగ్నిని వేరుచేసినచో పునరాధానము చేయవలెను.

**3.** అగ్ని శతాక్షరుడు. మానవుడు నూరేండ్లు జీవించువాడు. శతేంద్రియుడు. శతాయుష్యము శతేంద్రియములందు ప్రతిష్ఠించబడుచున్నది.

**4.** యజమాని పునరాధానము చేయును. కోరికలు తీరవు. సమృద్ధి కలుగదు. అప్పుడు సర్వము అగ్నిదేవతాకమైన యజమానికి సమృద్ధికలుగును.

**5.** అగ్నిని ఉద్వాసన చేసిన యజమాని మాట ఇంటి వరకే అగుచున్నది. వాక్కును అనుసరించి అతనికి పరాభవము కలుగుచున్నది.

**6.** విభక్తి విధానమును అనుష్ఠించి పునరాధానము చేయవలెను. అట్లుచేసిన యజమాని చక్కగా చేసినవాడు అగుచున్నాడు.

మంత్రోచ్చారణము మెల్లగా చేయుచు యాగము చేసినవాడు శ్రేష్ఠమగు ధనమును ఆర్జించి దాచుకున్నవాడు అగుచున్నాడు. స్విష్టకృతమను అగ్నిని ఉచ్చైస్స్వరమున మంత్రోచ్చారణ చేసి యాగము చేసిన వాడు శ్రేష్ఠధనమును ఆర్జించి ప్రసిద్ధిని పొందుచున్నాడు.

కావున విభక్తి విధమున ప్రయాజ మంత్రముల చేత వషట్కార పూర్వకముగ యాగము చేయవలెను. ఆ విధమున చేసినవాడు **ఆయతనాదేవనైతి** - స్వగృహమునుండి తొలగిపోడు.

**7.** **యజమానోవై పురోడాశః పశవ ఏతే ఆహుతీ** - యజమానియే పురోడాశము. పశువులే ఆహుతులు. పురోడాశము లన్నింట ఈ ఆహుతులను హోమము చేయవలెను. ఆ విధముగా ఆచరించిన యజమానిని పశువులు వరించుచున్నవి.

**8.** ప్రథమాధానమునందు 'సర్పరాజ్ఞీ' అను ఆధానమంత్రములు చెప్పబడినవి. 'సికత' 'ఉష' ఇత్యాది సప్తమృద్విశేషములు ఉపయోగించబడినవి. కావున పునరాధానము నందు వానిని ఉపయోగించనక్కరలేదని పూర్వపక్షము.

**9.** ప్రథమాధానము నందు ఆధానమంత్రములు చెప్పబడినను - సంభారద్రవ్యములు ఉపయోగించబడినను పునరాధానమునందు సహితము మంత్రోచ్చారణ, సంభారద్రవ్యముల ఉపయోగము చేయవలెనని సిద్ధాంతము.

**10.** పునరాధేయ సమృద్ధికిగాను 1. విరిగిన తరువాత బాగుచేసిన రథమును 2. చిరిగిన తరువాత కుట్టిన బట్టను - 3. చిక్కిన తరువాత బలిపించిన వృషభమును దక్షిణగా ఇవ్వవలెను.

**11.** సప్తతే అగ్నే మున్నగు మంత్రములు చదువుచు పునరాధేయ దేవతయగు అగ్నికి హోమము చేయవలెను. ఆ విధముగా చేయుటవలన అగ్నియొక్క ఏ అంగము విస్మృతమైనదో ఆ ప్రదేశము నుండియే సాంగమగు అగ్నిని పొందినట్లగును.

**12.** దేవతలందు వీరుడు అగ్ని. అటువంటి అగ్నిని ఉద్వాసన చేసినవాడు అగ్నిహంతకుడు అగుచున్నాడు. అతనిని వరుణుడు అప్పు తీసికొన్న వానిని వలె బాధించును. ఆ దోషనివారణకుగాను అగ్ని, వరుణుల హోమము చేయవలెను. 11 పాత్రలందు పురోడాశమును సంస్కరించి హోమము చేయవలెను. ఆ విధముగా వరుణుని సంతృప్తి చెందించినట్లగును. యజమాని బాధలు పొందడు.

## మూడవ అనువాకము

(ఆధాన మంత్రములు చెప్పబడినవి.)

**1.** గార్హపత్య ప్రదేశమా! నీవు బాహుళ్యమున పృథ్వివి అగుచున్నావు. శ్రేష్ఠత్వమున ద్యులోకమవు అగుచున్నావు. మహత్త్వమున అంతరిక్షమవు అగుచున్నావు.

భూదేవీ! నీ ఉత్సంగమున అన్నము భుజించు అగ్నిని - యజమాని అన్నము కొరకును ఆధానము చేయుచున్నాను.

**2.** ఆదిత్యరూపమున ఈ గార్హపత్యాగ్ని శ్వేతవర్ణుడు అయినాడు. జగములందు వ్యాపించినాడు తదుపరి ఆదిత్యుడగు అతనికి భూమి తల్లియైనది. స్వర్గము తండ్రియైనాడు.

**3.** ఆదిత్యరూప గార్హపత్యాగ్ని ముప్పది ముహూర్తరూప తేజస్సులచే ప్రకాశించుచున్నాడు స్తుతివాక్కు పక్షివలె ఎగిరి ఆకాశము నందలి ఆదిత్యుని ఆశ్రయించినది.

గార్హపత్యాగ్నీ! నీ విషయమున నైనను మేము ప్రతికూలముగా ప్రవర్తించి యుండిన మన్నించుము. జ్వాలారూపమున ప్రకాశింపుము.

**4.** **అస్య ప్రాణా దపాన త్యన్తశ్చరతిరోచనా.** అతని కాంతి ఉచ్ఛ్వాసమై ఉదయించుచున్నది నిశ్వాసమై అంతరించుచున్నది. అట్లు ద్యావాపృథ్వుల మధ్య సంచరించు చున్నది

ఆదిత్యుడు యజ్ఞము చేయువారల కొరకు దివిని వెలిగింపచేయుచున్నాడు.

(రాత్రింబవళ్లను ఉత్ఛ్వాస నిశ్వాసలనుట అద్భుతము!.)

**5.** నేను కోపమునకు వశవర్తిని అయినాను. కోపమున అగ్నీ! నిన్ను సాగనంపినాను. అది గతము. నామీద నీ కృప కలిగినది. మరల నిన్ను ప్రజ్వలింప చేయుచున్నాను.

**6.** ఆహవనీయాగ్నీ! నాకు కోపము కలిగినది కదా! అట్లయి నిన్ను ఉద్వాసన చేసినాను కదా! అప్పుడు నీవు భూమిలోనికి పోయినావు. నీ తేజస్సును వసువులు, ఆదిత్యులు, విశ్వేదేవతలు పరిగ్రహింతురు గాత.

**7.** అగ్ని తేజోవంతుడు అగును గాత. హోమము చేయబడిన ఆజ్యమును అందుకొనును గాత. చెడిన యజ్ఞమును బాగుచేయును గాత. బృహస్పతి ఈ యజ్ఞమును విస్తరించును గాత ఈ యజ్ఞము సమస్త దేవతలకు సంతృప్తికరము అగును గాత.

**8.** అగ్నీ! నీయొక్క సమిధలు ఏడు. నీ నాలుకలు ఏడు. మంత్రములు ఏడు. స్థానములు ఏడు. హోతలు ఏడుగురు. నీ యాగములు ఏడు. అట్టి నీవు ఆహవనీయాది సప్త స్థానములను ఘృతమున నింపుము.

(యజమాని హోమము చేయవలెను.)

**9.** అగ్నీ! నీవు నాచే ఉద్వాసితుడవు అయినావు. క్షీరాదులతో మరల రమ్ము. ఆయువుతో మరల రమ్ము. అన్నము తీసికొని మరల మరల రమ్ము. సమస్త దోషముల నుండి మమ్ము రక్షించుము.

**10.** అగ్నీ! నీవు ధనమందుకొని మరలి రమ్ము. వర్షధారలచేత మరలిరమ్ము. తృణ, ధాన్య, లతా, పాదపముల పైభాగములను తడుపుచు రమ్ము.

**11.** లేక, సలేక, సులేక నామముగల **తే ఆదిత్యాః**. మీ ఆదిత్యులు **జుషాణాః** - ప్రీతులై **వః** - మాయొక్క **ఆజ్యమ్** - నేతిని, **వియన్తు** - త్రాగుదురు గాత.

**కేతస్సకేత సుకేతస్తేన ఆదిత్యా ఆజ్యం జుషాణా వియన్తు**

**వివస్వాగ్ం అదితిర్దేవ జూతిస్తేన ఆదిత్యా ఆజ్యం జుషణా వియన్తు**

## నాలుగవ అనువాకము

(మంత్రములు వ్యాఖ్యానించ బడుచున్నవి.)

**1.** 'భూమిర్భూమ్నా!' అను మంత్రమునకు 'అన్నలాభము కోరి ఆధానము చేయుచున్నాను' అని అర్థము'.

(గత అనువాకము తొలి మంత్రము '**భూమిర్భూమ్నా ద్యౌర్వరిణా ఉన్తరిక్షం మహిత్వా**' అనునది.)

**2.** సర్పములు ముసలివి అయినవి. అవి జరను పోగొట్టదలచినవి. ఆలోచించినవి. కద్రువ పుత్రుడు కసర్ణీరుడు. 'భూమిర్భూమ్నా' మున్నగు మంత్రముల వలన ముసలి తనము పోవునని తెలిసికొన్నాడు. అప్పుడు సర్పములు ఆ మంత్ర బలమున వార్ధక్యమును విడిచినవి. మరల కోమల శరీరములను పొందినవి.

భూమి సర్పములకు రాణియగును. అందు వలన భూమికి సంబంధించిన ఋక్కులచే గార్హపత్యాగ్నిని పునరాధానము చేయవలెను. ఆ విధముగా చేసినచో యజమాని అగ్నిని నవీనునిగను, జరారహితునిగను చేసినట్లగును.

**3.** భూమికి అన్నసిద్ధి లేకుండెను. అప్పుడు భూమి ఈ మంత్రమును తెలిసికొన్నది. ఆ మంత్ర బలమున భూమికి అన్నసిద్ధి కలిగినది. కావున అన్నసిద్ధికి సర్వముల రాణియయిన భూమికి సంబంధించిన ఋక్కులచే అగ్నిని ఆధానము చేయవలెను. అప్పుడు ఆ భూమియందే అగ్నిని ప్రతిష్ఠించి ఆధానము చేసినట్లగును.

**4.** యత్త్వాకుద్ధః అనుమంత్రము. అలిగిన బాలుని లాలనచేసినట్లు - అగ్నిని కప్పిపుచ్చినట్లగును.

**5.** 'పునస్త్వోద్దీపయామి' అనుమంత్రమున సాగనంపిన అగ్నిని మరల జ్వలింప చేసినట్లు చెప్పబడినది.

**6.** 'యత్తేమన్యు' అను మంత్రము యజమాని కోపముచే ఉద్వాసన చేసిన అగ్నిని అదిత్యాదులు స్వీకరించినారని చెప్పినది.

**7.** అగ్నిని ఉద్వాసవ చేసినచో యజ్ఞము భంగము అగును. ఆ దోషనివారణకు బృహస్పతి ఋక్కులతో ప్రార్థించవలెను. అందువలన యజ్ఞమును బ్రహ్మతో సంధానము చేసినట్లగును.

**8.** 'విచ్ఛిన్నం యజ్ఞం' అను మంత్రము నందలి 'సందధాతు' అను క్రియాపదము అవిచ్ఛిత్తిని చెప్పుచున్నది.

**9.** 'విశ్వేదేవా' మున్నగు మంత్రములు యజ్ఞము విచ్ఛిన్నము కాకుండ చేయుచున్నవి ఆ విషయము విశ్వేదేవతలు - దేవతలకు చెప్పుచున్నారు.

**10.** 'సప్తతే అగ్నే' అను మంత్రము సమిధలు ఏడు అని నిర్దుష్టముగ విధించినవి. అగ్నికి ఇష్టము సప్తసంఖ్యాకములని చెప్పబడినది. అట్లు ప్రార్థించిన యజమానికి అగ్ని శరీరము లభించును

**11.** 'పునరూర్జా నివర్తస్వ' అను మంత్రములచే యజమాని పురోడాశ ఆహుతులను హోమము చేయవలెను. అందువలన యజమాని క్షీరాది రసములు కలవాడును, ధనవంతుడును అగుచున్నాడు

**12.** దేవతలు ఆధాన పునరాధానములు చేసి స్వర్గమునకు వెళ్లినారు. అచట వారికి దాహము అయినది. స్వర్గమున సమృద్ధిలేదని దేవతలు గ్రహించినారు. భూలోకమునకు తిరిగి వచ్చినారు. 'లేకస్స లేక' మంత్రములచే ఆహుతులు ఇచ్చినారు. స్వర్గమునకు చేరి సమృద్ధిని పొందినారు.

కావున యజమాని పునరాధేయానంతరము అగ్నిని ఆధానము చేసి 'లేకస్స లేక' మంత్రముల ఆహుతులను హోమము చేయవలెను. అందువలన యజమానికి దేవతలకు లభించిన సమృద్ధి లభించును.

**అయిదవ అనువాకము**

(5 - 10 అనువాకము అగ్ని ప్రార్థన చెప్పుచున్నవి.)

**1.** మేము యజ్ఞము చేయుచున్నాము. మామాటలు దూరము నుండి అగ్ని వినుచున్నాడు. అట్టి అగ్నిని గూర్చియే మంత్రములు చదువుచున్నాము.

(యజమాని ఆహవనీయ అగ్ని ఎదుట నిలిచి ఆరు ఆహుతుల వరకు ప్రార్థన చేయవలెను)

**2.** ఋత్విజులు సంకోచము లేని వారు. అగ్నియొక్క ప్రాచీన కాంతి నుంచి క్షీరదమ్ము, బహుధన ప్రదము, కర్మ ప్రవర్తకమునగు జ్యోతిస్సును దుదుహ్రే - పితుకుచున్నారు.

**3.** ఈ అగ్ని ఆదిత్యరూపమున ఉన్నవాడు. ద్యులోకమునకు శిరము వంటివాడు. వేడికలిగించుట వలన భూలోక పాలకుడు అగుచున్నాడు. స్థావర జంగమముల ఉదక కార్యములకై జరరాగ్ని రూపమున వానిలో నిలిచినాడు. వానికి ఆనందము కలిగించుచున్నాడు.

**4.** ఆప్నవాన, భృగు ఋషులు వారి ఆశ్రమములందు అగ్నిని ప్రకాశింపచేసినారు. అది విచిత్రమును, వ్యాప్తి గల అగ్ని. దానిని వారు ప్రజల అభ్యుదయమునకు ఏర్పరచినారు. ఆ అగ్నిని మేము ఈ యజ్ఞమున ప్రజ్వలింపచేయుచున్నాము. అగ్నినే ప్రధానముగా మనసులందు భావించుచున్నాము.

ఈ అగ్ని యజ్ఞములందు దేవతలను ఆహ్వానించుచున్నాడు. మానవులను మించి యాగము చేయుచున్నాడు. యాగములందు స్తుతించబడుచున్నాడు.

**5.** ఇంద్రాగ్నులారా! మీరు పురోడాశమను అన్నము కలవారు. మిమ్ము సంతోషపెట్టుటకు ఆహ్వానించుచున్నాము. హోమము చేయుటకు మిమ్ము ఆహ్వానించుచున్నాను. మాకు ధనమును, అన్నమును ఇమ్మని మిమ్ము ఆహ్వానించుచున్నాము.

**6.** అగ్నీ! ఆహవనీయ ప్రదేశము నీకు స్థానము అగును. ఇది అన్ని ఋతువులందు హోమములు నిర్వర్తింప చేయును. అది నీ స్థానము అని గ్రహించుము. ఈ ఆహవనీయ స్థానమును అధిష్టించుము. మాకు ధనవృద్ధి కలిగించుము.

**7.** అగ్నీ! మా ఆయువులను రోగరహితము చేయుము. మాకు క్షీరాదులను, అన్నములను కలిగించుము. శత్రుసేనను దూరముగనే ఉంచుము. ఆ సేనను హింసించుము.

**8.** అగ్నీ! నీవు సత్కర్మలవాడవు. నాకు పుష్టిని దనమును కలిగించుము. మాయందలి బ్రహ్మవర్చస్సును, సామర్థ్యమును పెంచుము.

**9.** పావకా! నీ జ్వాలాజిహ్వలు ప్రకాశించునవి తృప్తి కలిగించునవి అవి దేవతలను ఆహ్వానించును అగ్నీ! నీవు యజనము చేయించుము

**10.** పావకా! నీవు ప్రకాశించువాడవు ప్రసిద్ధుడవు ఈ యజ్ఞమునకు దేవతల నాహ్వానింపుము ఈ యజ్ఞహవిస్సును వారలకు అందించుము

**11.** అగ్ని పవిత్ర వ్రతములవాడు విప్రుడు శుద్ధుడు. విద్వాంసుడయిన పరిశుద్ధుడు అట్టి పరిశుద్ధాగ్నిని మేము ఆహ్వానించుచున్నాము అతడు ప్రకాశించుచున్నాడు

**12.** అగ్నీ! నీకిరణములు ప్రకాశించుచున్నవి పైపైకి వ్యాపించుచున్నవి నిన్ను పూజించువారు నీ తేజస్సును అందుకొనుచున్నారు

**13.** అగ్నీ! నీవు ఆయువును ఇచ్చువాడవు తేజస్సును ఇచ్చువాడవు నాకు ఆయువును తేజస్సును ప్రసాదించుము నీవు **తనూపాః** - తనువును రక్షించువాడవు **మే తనుమ్ పాహి.** నాదేహము నందున్న లోపమును సరిచేయుము

**14.** రాత్రీ! నీ సమాప్తి నాకు క్షేమము అగును గాత

**15.** అగ్నీ! నీవు అన్న కర్తవు కీర్తి ప్రదుడవు విరోధి నాశినివి నీకు మేము సమిధలు అర్పించుచున్నాము అందు వలన మేము అన్నవంతులము, కీర్తి వంతులము సంతానవంతులము అగుచున్నాము అట్లయి - **శతగ్ం హిమాద్యుమన్తస్సమిధీమహి** - నూరుహేమంతములు దీప్తి మంతులమై ప్రసిద్ధులము కాగలము

**16.** అగ్నీ! నీవు సూర్యుని వర్చస్సును చేరుచున్నావు ఋషుల స్తుతులను చేరుచున్నావు నీకు ప్రియమగు ఆహవనీయ స్థానమును చేరుకొనుచున్నావు

**త్వమగ్నే సూర్యవర్చా అసి సం మా ఆయుషా వర్చసా ప్రజయా సృజ** - అగ్నీ! నీవు సూర్య తేజస్కుడవు నాకు ఆయువు వర్చస్సు, సంతానము కలిగించుము

**ఆరవ అనువాకము**

**1.** నేను మానవ సంతానమును ధేనుసంతానమును చూచుచున్నాను నా ఇంట వారందరు ఉండవలెను

(యజమాని ఇంటిని చూడవలెను)

**2.** పశువులారా! మీక్షీరములు ఉదక రూపములు అవి బలకరములు రుచికరములు నేను మీ క్షీరాదులను సేవించుచున్నాను

(యజమాని పశుశాలను చూడవలెను)

**3.** పశువులారా! మీరు ఈ భూలోకమున ఉండండి మా ఇంట ఉండండి ఇచ్చోటనే ఆడండి ఇచటి నుండి తొలగి పోకండి నా కొరకు మీరు సంతాన పరంపరాభివృద్ధినొందండి

(ఆహవనీయ గార్హపత్యాగ్ని మధ్యన యజమాని ఉండవలెను)

**4.** వత్సమా! నీవు మీ అమ్మ వద్ద ఉన్నావు తల్లిపాలు కుడుచుటకు ఇటుపక్కకు అటుపక్కకు ఉరుకులు పెట్టుచున్నావు అట్లగుట చేసి నీవు బహురూపములుగ కనిపించుచున్నావు నీవు నీ తల్లి పాలకు కారణమవు నేను పశుస్వామిని నాకు ధనసమృద్ధి కలిగించుటకు నా వద్దకు రమ్ము నీవు అనేక రెట్లయి పెరుగునట్లు నిన్ను పోషింతును క్షీరాదిరూపమగు ధనము మావద్ద ఉండును గాత

(యజమాని దూడను తాకవలెను)

**5.** అగ్నీ! మేము నిత్యము ఉదయము సాయంకాలము మనస్ఫూర్తిగా నీకు నమస్కరించుచున్నాము నిన్ను అందుకొను చున్నాము

**6.** అగ్నీ! నీవు యజ్ఞస్వామట్టువు గోపాలకుడవు సత్యప్రకాశివి మాఇంట హవిస్సులచే వృద్ధి నొందుచున్న వాడవు నిన్ను ఆరాధించుచున్నాను

**7.** అగ్నీ! కొడుకునకు తండ్రివలె మాకు సులభసాధ్యుడవగుము మా క్షేమమునకు గాను మాకు దగ్గరి వాడవగును

**8.** అగ్నీ! మాకు మిక్కిలి సన్నిహితుడవు అగుము మాకు రక్షకుడవు అగుము శుభంకరుడవగుము మా గృహమందు నిత్యము మాకు దగ్గరగా ఉండుము

(5 - 8 గార్హపత్యాగ్ని ఆరాధన అగును)

**9.** అగ్నీ! నీవు ఎంతో పవిత్రుడవు ఎంతో ప్రకాశించు వాడవు మేము నీకు మిత్రులము అగుదుము కావున మా దరి చేరుము

**10.** అగ్ని ధనవంతుడు వసు రుద్రాదులచే ఆదరించబడువాడు అగ్నీ! మాకు అభిముఖుడవు అగుము ప్రజ్వరిల్లుము మాకు ధనములనిమ్ము

**11.** నా ఇంటనున్న పశువురారా! పాలు ధనవృద్ధిని నేను మీనుండి ఆశించుచున్నాను మీ యందు క్షీర ధనసమృద్ధికి మీరు నన్ను ఆశించండి

గోవులారా! మీరు మధుర ఘృతమును ఇచ్చువారుకండి మీరు సహస్ర సంఖ్యాకముగా వృద్ధిచెందునట్లు మిమ్ము నేను పోషింతును మీ సంపదలు నన్ను చేరును గాత

**12.** **తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి**

**ధియో యోనః ప్రచోదయాత్**

సవితా దేవత మా బుద్ధులకు ప్రేరణ కలిగించు చున్నాడు. అట్టి సవితాదేవత తేజస్సును మేము ఉపాసించుచున్నాము.

**13.** అగ్నీ! నీవు బృహత్కర్మకు స్వామివి ఉశిజకుమారుని కర్మ ప్రవర్తక ఋషినిగా చేసినావు నన్ను సహితము సోమయాగమునకు ఉపదేష్టనుగా చేయుము

**14.** సంపన్న అగ్నీ! నీవు ఎన్నడును హింసకుడవు కావు హవిర్దానము చేయు యజమాని దగ్గరనే ఉంటున్నావు ఇంద్రుని వంటి అగ్నీ! దేవతవగు నీ దానమును మేము అందుకొనుచున్నాము

**15.** అగ్నీ! నీవు బలశాలివి వరదుడవు. విప్రుడవు శత్రునిబర్హణుడవు అట్టి నిన్ను మేము ప్రతినిత్యము సేవించుచున్నాము

**16.** అగ్నీ! నీవు గృహస్వామివి నీ అనుగ్రహమున నేను నూరు హేమంతముల వరకు సుగృహపతిని అగుదును గాక.

నేను గృహపతిని. నిన్ను సేవించుచున్నాను అందువలవ నీవు నూరు హేమంతముల వరకు సుగృహపతివి అగుదువు గాత

నేను పుట్టనున్న సంతానమునకు బ్రహ్మవర్చస్సు ఆయురారోగ్యములు ఐశ్వర్యాభివృద్ధి కలిగించుమని నీ ఆశీస్సులు కోరుచున్నాను పుట్టి ఉన్న సంతానమునకు సహితము అట్టి ఆశీస్సులనే కోరుచున్నాను

**ఏడవ అనువాకము**

(5 వ అనువాకమంత్రములకు వ్యాఖ్య)

**1.** సామ రహితముగ చేయునది యజ్ఞము కాదు 'ఉపప్రయన్త' ఇత్యాది మంత్రములు అగ్నిహోత్ర యాగమందు స్తోమ సంబంధములగును

**2.** 'ఉపప్రయన్త' అను మంత్రమునందలి 'ఉప' అను పదమునకు అర్థము ఇట్లుండును

ప్రజలు పశువులు భూలోకమునందే ఉన్నారు కావున యజమానికి పశువులు ప్రజలు ఈలోకముననే లభించుచున్నారు

(ఇది ఒకటవ మంత్రము)

**3.** **'అస్యప్రత్నా'** అను 2 వ మంత్రమునందలి 'ప్రత్న' శబ్దము స్వర్గమును సూచించుచున్నది కావున యజమాని స్వర్గమునకు చేరును అని అర్థము.

**4.** **'అగ్నిర్మూర్ధా'** అను మంత్రము నందలి 'మూర్ధన్' అను పదము శ్రేష్ఠత్వమును సూచించుచున్నది 3 వ మంత్రమునందలి ఈ పదము వలన యజమాని తనతో సములైన వారిలో శ్రేష్ఠుడనియు - అతడు దివినుండి భువికి దిగి వచ్చినాడనియు అర్థము అగుచున్నది.

**5.** **'అయమిహ'** అను నాలుగవ మంత్రమునందలి పదము యజమానిని అగ్ని ప్రముఖునిగా చేయుచున్నాడని చెప్పుచున్నది

**6.** **'ఉభావాఇంద్రాగ్నే'** అను 5 వ మంత్రము వలన యజమాని బలమును తేజస్సును పొందుచున్నాడని అర్థము

**7.** **'అయంతేయోనిః'** అను 6 వ మంత్రము వలన పశువులే ధనమనియు - యజమాని పశురూప ధనమును పొందుచున్నాడనియు వ్యాఖ్య

**8.** **'ఉపప్రయన్తః'** అను తొలిమంత్రము నుండి అగ్న ఆయూంషి' అను ఆరవ మంత్రము వరకు 'పూర్వషట్కము' అనిపేరు 'ఉదగ్నే' అను 12 వ మంత్రము వరకు గలవానికి 'ఉత్తర షట్కము' అనిపేరు

పూర్వషట్కమున అగ్నిని ఉపస్థానము చేసిన యజమానికి ఆరురుతువులందు ప్రతిష్ఠ కలుగును ఉత్తర షట్కమునందు కూడ అగ్నిని ఉపస్థానము చేసినచో పన్నెండు మాసములు - సంవత్సర - పర్యంతము ప్రతిష్ఠ పొందును.

**9.** మానవుడు అశ్వములను గోవులను పొందుచున్నాడు అట్లే కాలక్రమమున వార్ధక్యము పొందును ఆధానము చేయబడిన అగ్నియు వార్ధక్యము నందుచున్నాడు కావున యజ్ఞకర్త సంవత్సరము ముగిసినంత అగ్నిని ఋక్కులచే ప్రార్థించి నూతనుని జరారహితుని చేయవలెను

**10.** పేదవాడు ధనికుని చేరును కానుకలు ఇచ్చును నమస్కరించును తనకు కావలసినవి కోరును

యజమాని అగ్నికి నమస్కరించుట కూడ అట్టిదియే ప్రార్థించి యాచించిన యజమానికి అగ్ని దహనాది ఉపద్రవములు కలిగించడు ధనాదికములను ప్రసాదించును. కావున అగ్ని యజమానుల సంబంధము అనుగ్రాహ్య అనుగ్రాహకము

**11.** నా సంతానమునకు, నా పశువులకు, నాకు కలిగిన దోషలోపములను పూరించుమని **'అగ్నేయేమేతవ్యా'** అను పదమూడవ మంత్రము ప్రవచించుచున్నది.

**12.** రాత్రీ! నీ ముగింపు క్షేమ కరముగుగు గాత. అని 14 వ మంత్రము చెప్పుచున్నది పూర్వము బ్రాహ్మణులు రాత్రి గడుచువరకు భయపడుచుండిరి.

**13.** మానవునకు 5 కర్మేంద్రియములు + 5 జ్ఞానేంద్రియములు - మొత్తము పది ఇంద్రియములు ఉండును. ప్రతి ఇంద్రియమున 10 నాడుల చొప్పున 10 × 10 = 100 నాడులు అగును. మానవుని ఆయుః పరిమాణము కూడ వందసంవత్సరములగును కావున 15 వ మంత్రమున **"శతహిమాః"** అని చెప్పబడినది

**14.** **"ఇన్థానా స్త్వా శతగ్ం హిమాః"** మున్నగు మంత్రములచే అగ్న్యుపస్థానము సమిధాదానము చేయవలయును ఈ ఋక్కు అంతర్జ్వాలగల ఇనుప ప్రతిమ వంటిది ఒక్కొక్క దెబ్బచే వందల నరులను సంహరించిన అసురులను దేవతలు ఈ ఋక్కుచే సంహరించినారు యజమాని ఈ ఋక్కున సమిధాధానము చేయవలెను అప్పుడు ఈ ఋక్కు వజ్రమగును యజమాని శత్రువును వధించగలవాడగును

**15.** అగ్నీ! నీవు సూర్య తేజము కలవాడవు నిన్ను ప్రార్థించి నేను ఆతేజమును పొందగలను అనునదే **'సంత్వమగ్నే'** కు అర్థము.

**16.** **'త్వమగ్నేసూర్యవర్చాఅసి'** అను 16 వ మంత్రము వలన అగ్నిని ఆయువు తేజస్సు సంతానము కోరినట్లయినది

## ఎనిమిదవ అనువాకము

(ఆరవ అనువాకమంత్రములకు వ్యాఖ్య)

**1.** 'సంపశ్యామి' అను మొదటి పదమునకు అన్ని గ్రామ్యపశువులను యజమాని పొందును గాత అని అర్థము

**2.** అర్థమునకు రెండవ మంత్రము చూడండి

**3.** క్షీరాది రసరూపధనము గల పశువులు తన గృహమునందే ఉండవలెననియు - వానికి స్థిరజీవనము కలుగవలెననియు - అవి వదిలి పోరాదనియు యజమాని ప్రార్థన

**4.** ఇటుకలను పరచి జ్వలింపచేసిన అగ్ని ఒకటి ఇది 'ఇష్టకచిత్' అగును రెండవది పశువునుండి జ్వలింపచేసినది ఇది 'పశుచిత్' అగును 'సగ్ంహితాసి' మంత్రములు చదువుచు దూడను తాకిన యజమాని వత్సమును ఉపధానము చేసి 'పశుచిత్' చేసిన వాడగును

**5.** ఆహవనీయాగ్నిని సేవించిన యజమాని భూలోకమును విడిచి - స్వర్గమును చేరుచున్నాడు గార్హపత్యమును సేవించినవాడు భూలోకమునందే ప్రతిష్ఠ కలవాడగును కావున ఆహవనీయమునందు తత్పరమైన గార్హపత్యమును సేవించవలెను అట్లయిన సిద్ధికలుగును

**6.** గాయత్రీఛందముగల **'అగ్నేత్వంనో అంతమః'** అను ఋక్కులచే ప్రార్థించవలెను గాయత్రి తేజో స్వరూపము అది యజమానిని తేజోవంతుని చేయును

**7.** గార్హపత్యాగ్ని వలన వీరులు ఉద్భవింతురు ఈ విషయము గ్రహించి గార్హపత్యాగ్నిని సేవించిన యజమానికి వీరులగు పుత్రులు కలుగుదురు

**8.** ఇంటి పశువులారా! క్షీరాది రససంపదను నేను మీ నుండి ఆశించుచున్నాను మీరు నానుండి క్షీరాదులు కలుగు పోషణను ఆశించుచున్నారు

**9.** చక్కని ప్రేరణ కలిగించమని **'తత్సవితుర్వరేణ్యమ్'** చెప్పుచున్నది

**'సోమానగ్ం స్వరణమ్'** యజమాని సోమభాగఫలమును పొందుచున్నాడని వచించుచున్నది

**'కృణుహిబ్రహ్మవర్చసే'** అనునది యజమానికి బ్రహ్మవర్చస్సు కలుగుచున్నదని చెప్పబడినది

**10.** రాత్రులు చోర వృశ్చికాది భయబాధలతో కూడినవి 'కదాచనస్తరీ అను మంత్రార్థము తెలిసి సేవించిన యజమానికి రాత్రులు సుఖములగును

**11.** అగ్నికి నలువైపుల వేసిన సమిధల పరిధి నిత్యనూతనమై ఉండవలెనని **'పరిత్వాగ్నే'** ప్రవచించుచున్నది

**12.** **'అగ్నేగృహపతే'** యజుస్సును అనుసరించినది - అగ్ని విషయిక స్తోత్రమగునని వచించినది

**13.** **'శతగ్ంహిమాః'** అను మంత్రము అగ్నిని వందఏళ్లు జ్వలింపచేయుదును అనుటను వివరించినది

**14.** పుత్రుని పేరుచెప్పి అతనికి అన్నాది సుఖములు కలుగవలెనని ప్రార్థించవలెను తన కుమారునకు - పేరు చెప్పి - జ్యోతిష్మంతమగు దీవెనలు కోరుచున్నాను అనవలెను అట్లు ప్రార్థించిన ఆ పుత్రుడు తేజస్సు బ్రహ్మవర్చస్సు కలవాడు అగును

పుట్టబోవు పుత్రుని కొరకు జ్యోతిష్మంతమగు ఆశీస్సులు కోరుచున్నాను అని ప్రార్థించవలెను ఆ విధముగా ప్రార్థించిన యజమానికి తేజస్వియు బ్రహ్మవర్చస్సు గల పుత్రుడు కలుగుచున్నాడు

("ఇది అగ్నేగృహపతే" అను 16వ మంత్రమునకు వివరణ )

## తొమ్మిదవ అనువాకము

(అగ్ని ఉపస్థానమునకు అగ్ని అంగము అను విషయము వివరించబడుచున్నది )

**1.** యజమాని పాలు, పెరుగులతో 'అగ్నిహోత్రము' అను హోమము చేయవలెను ఆ విధముగా హోమము చేసిన క్షీరాదులు నశించవు అవి ఆ యజమానికే చెందినవై ఉండును

**2.** యోని యందుంచిన వీర్యము సంతానము కలిగించును నశించదు. అగ్ని యోని వంటివాడు. కావున అగ్నియందు హుతమైనది నశించదు - వర్ధిల్లును

**3.** గ్రీష్మమున చెలరేగిన దావాగ్ని ఓషధులను దగ్ధము చేయును ఇది నిజము వర్షము వచ్చినంత ఆ ఓషధులే మరిన్నిగా మొలచి పెరుగును ఇది నిజము

(2 మంత్రమునకు ఇది దృష్టాంతము )

**4.** యజమాని చేయు సాయంకాల హోమము రేతస్సు ఉంచుటవంటిది ప్రాతః కాలమున చేయు హోమము సంతానోత్పత్తి వంటిది

**5.** యోని యందు రేతస్సు చేరుచున్నది కాని త్వష్ట అట్లు చేరిన రేతస్సు నంతటిని సంతానముగా పుట్టించుటలేదు ఏ రేతస్సు ఎంత ఎరూపములుగ సృష్టించవలెనో త్వష్ట నిర్ణయించుచున్నాడు దానిని అనుసరించి సంతానము పుట్టుచున్నది

ఇచట యజ్ఞకర్త దేవతలచే నియమించబడిన త్వష్ట అయి ఉన్నాడు అతడు అనేక ఋక్కులచే అగ్నిని సేవించుచున్నాడు అతడు రేతస్సునుండి అనేక రూపములను కలిగించుచున్నాడు.

**6.** అది తెలిసికొని అగ్నిని సేవించు యజమానికి సంతానము కలుగుచున్నది నిత్యము అభివృద్ధి కలుగుచున్నది

**7.** రాత్రింబవళ్లు రెండు భాగములైనవి పగళ్లు దేవతలవి - రాత్రులు రాక్షసులవి అయినవి దేవతలకు పశువులు సంపద అయి ఉండెను రాత్రులందు రాక్షసులు దేవతల పశువులను అపహరించినారు. అంధకారమున ఎచటనో దాచినారు

దేవతలు ధనహీనులు అయినారు వారు పశువులను రప్పించదలచినారు ఆలోచించినారు అగ్ని రాత్రులందు అధికముగా ప్రకాశించును కావున ఆగ్నేయమగును పశువులు అగ్ని దేవతాకములు కావున ఆగ్నేయములు దేవతలు ఆ విషయము తెలిసికున్నారు అగ్నిని స్తుతించినారు అగ్ని రాత్రిపూట పశువులను తెచ్చినది పగటిపూట దేవతలకు ఇచ్చినది దేవతలు పశువులను పొందినారు భోగములు అనుభవించినారు.

"య ఏవం విద్వా నగ్నిముపతిష్ఠతే పశుమాన్భవతి" ఈ విషయమును తెలిసి అగ్నిని స్తుతించినవాడు పశువులు కలవాడు అగుచున్నాడు.

**8.** ఆదిత్యుడు భూలోకమునుండి స్వర్గలోకమునకు చేరినాడు అక్కడ అతడు భూలోకమును గురించి ఆలోచించినాడు భూమికి దిగి వచ్చినాడు అక్కడ అతడు మృత్యోరభిభిబేత్ - మృత్యువునకు దడుచుకున్నాడు

భూలోకము మృత్యుసంయుతము కదా అనుకున్నాడు 'అగ్నిని స్తుతించిన అగ్ని నన్ను స్వర్గలోకమునకు పంపించును' అనుకున్నాడు అగ్నిని స్తుతించినాడు స్తుత్యుడగు అగ్ని ఆదిత్యుని స్వర్గలోకమునకు చేర్చినారు

య ఏవం విద్వా నగ్నిముపతిష్ఠతే సువర్గమేవ లోకమేతి సర్వమాయురేతి - స్వర్గమునకు చేరును పరిపూర్ణ ఆయువును పొందును

**9.** అగ్నిని రాత్రియందే సేవించవలెను ప్రాతః కాలమున సేవించరాదు రాత్రులందు చేసిన వ్రతములు సంకీర్ణములు అగును

కర్మలు శాస్త్రీయములు అశాస్త్రీయములు అయి ఉన్నవి

అగ్ని తేజస్సు అగును రాత్రి అంధకారము అగును రాత్రి పూట అగ్నిని సేవించిన తేజస్సు అంధకారమును తరిమివేయును ఇది ఒక పూర్వపక్షము

**11.** అగ్ని పూజనీయుడు అగునా? కాదా? ఈ విషయము ఆలోచనీయము - చర్చనీయము

రాజు మానవమాత్రుడు అగును ఒకడు అతని వద్దకు ప్రతిరోజు వచ్చును ఫలాదికములు కానుకగా ఇచ్చును. తనకు కావలసినది యాచించును ఇచట యాచన రాజునకు బాధాకరము అగునుకదా!

అట్లయిన మహామహిమాన్వితులైన దేవతలను ఎవడు బాధించగలడు? అందువలన అగ్ని పూజనీయుడు కాడని మరొక పూర్వపక్షము.

**12.** యజమాని తన కోరికలు తీరుటకే అగ్నిని యజించుచున్నాడని విద్వాంసులు వక్కాణించుచున్నారు

అగ్నిని సేవించుట యజమాని ఆహితాగ్నిని మంత్రపూర్వకముగ ప్రార్థించుటయే కదా! తస్మాత్ ఉపస్థేవ్యః - అందువలన అగ్ని సేవింప తగిన వాడే అగును

11 మంత్రమునందలి ఉదాహరణ యందువలె బాధించుట దోషమగును కాని స్తుతించి సంతోషపెట్టి యాచించుట దోషము కాదు కదా! కావున అగ్ని ప్రాతః సాయంత్రములందు సేవనీయుడు పూజనీయుడు అగునని సిద్ధాంతము

**13.** ప్రజాపతి పశువులను సృష్టించినాడు వానిని అహోరాత్రులు దాచిపెట్టినవి. ప్రజాపతి ఛందోబద్ధములైన ఋక్కుల వలన మరల వానిని సాధించినాడు

యజమాని ఋక్కులచే ప్రార్థించి తన వస్తువులను సాధించ వచ్చును

**14.** నిత్యము అగ్నిని సేవించు యజమాని ప్రార్థనలకు జాగు ఉండదు వెంటనే ఫలితము కలుగునని పెద్దలు చెప్పుచున్నారు

**15.** పడమటి ముఖముగా సేవించువానిని అగ్ని దహించుచున్నాడు పెడముఖముగా సేవించు వానిని సంతానము పశువులు లేనివానిని చేయుచున్నాడు కొంచము అడ్డముగా ఉన్నవాని వలె సేవించువాని దహించుట లేదు - పశు సంతాన వియుక్తుని చేయుట లేదు

## పదవ అనువాకము

(పూర్వార్ధమున ప్రవాసము చేయబోవు యజమానికి సంబంధించిన అగ్నిని సేవించు మంత్రములు చెప్పబడినవి. ఉత్తరార్ధమున దర్శపూర్ణమాసాంగ భూత మంత్రములు కొన్ని చెప్పబడినవి )

**1.** అగ్నీ! నాకు తల్లిదండ్రులు ఒక పేరు పెట్టినారు నేను తిరిగి వచ్చువరకు నీవు నాపేరు ధరించుము నేను నీపేరు ధరించి తిరిగివత్తును

( అగ్ని యజమాని రూపమున ఇంటిని కాపాడును యజమాని అగ్ని రూపమున నిర్విఘ్నముగ కార్యము నిర్వర్తించును )

**2.** అగ్నీ! మనము ఉభయులము - బట్టలు మార్చుకున్నట్లు - పేర్లు మార్చుకున్నాము కదా' ఇక మార్చుమాని ఎవరిపేర్లను వారలము ధరింతము అందువలన జీవనము ఆయువు కలుగుచున్నవి

**3.** అగ్నిని ఎవ్వరును బాధించజాలరు తిరస్కరించజాలరు అగ్ని ప్రకాశమానుడు అతనిని సహించుట అసాధ్యము అపరిమిత అన్నము కలవాడు విశ్వజిత్తు సహనశీలి శ్రేష్ఠగంధర్వుడు అట్టి అగ్నికి నమస్కరించుచున్నాను

**4.** అగ్నీ' నీవు దేవతలను పాలించుచున్నావు దేవతల ఆహుతులు నీయందే ఉన్నవి దేవతలకు నీవే ప్రకటన కర్తవు

"సం మాయుషా సంగోపత్యేన సుహితే మాధాః." - నన్ను ఆయుష్యముతో సంధానము చేయుము నన్ను గోపతిగా సంధానము చేయుము నన్ను మంచి హితము నందు స్థాపించుము

5. ఈ అగ్ని శ్రేష్ఠతముడు ఈ అగ్ని భగవత్తముడు ఈ అగ్ని శ్రేష్ఠతమ దాత ఇతడు నాకు సువీర్యమును ప్రసాదించును గాత

6. అగ్ని తేజస్సు పూజనీయము అది ఈ హోమపు ఘృతమును సేవించును గాత ఈ ఆహుతులు ప్రాతః, సాయంకాలములకు సంబంధించినవి ఇతర యజమానులచే విధివిహితముగ అనుష్ఠించబడినవి నేను ప్రస్తుతము అనుష్ఠించుచున్నవి. నేను ఈ ఆజ్యహవిస్సులను అవిచ్ఛిన్నము చేయుచున్నాను

7. ఓషధులు సారము కలవి లతలు సారము కలవి పాలు సారము కలవి నన్ను వాటన్నింటి సారములతో చేర్చుము

8. అగ్నీ! నీవు కర్మలకు అధిపతివి నేను కర్మలు ఆచరించువాడను నన్ను కర్మలు చేయుటకు సమర్థుని చేయుము

(యజమాని సముద్రమును ధ్యానించవలెను)

9. అగ్ని యజ్ఞములందు దేవతలను ఆహ్వానించువాడు నేను అట్టి అగ్నిని ఆహ్వానించుచున్నాను యజ్ఞము ఎవరిని ఉద్దేశించినదో ఆ దేవతలను ఆహ్వానించుచున్నాను ఆ దేవతలు మంచి మనసుతో విచ్చేయవలెను నేను సమర్పించు హవిస్సులను ఆరగించవలెను

(హవిస్సును అభిమంత్రించవలెను)

10. యజ్ఞమా! ఏ ప్రజాపతి నిన్ను అంతటను యోగ్యముగా చేయుచున్నాడో - ఆ ప్రజాపతియే నిన్ను ఇచట సహితము యోగ్యముగా చేయును గాత

(యాగస్థలమును చూడవలెను)

11. ఋత్విజులు బ్రహ్మసమానులు పోషకులు వారు యజ్ఞమందు పాత్రలను అగ్నియందు ఉంచినారు యజ్ఞము పూర్తి అయినంత ఇంద్రవాయువులు ఆ పాత్రలను అగ్ని నుండి తీయుదురుగాక

(అధ్వర్యు యజమానులు జపించవలెను)

12. కాలిన భాండము జీవమును ఇచ్చును కాలినందున వేరుగా కనిపించును అయినను మంత్రప్రభావమున అది భిన్నము కాదు వేరే అని భావించినను మట్టి రూపమే అగును కదా!

సమిధలు వేది పరిధులు యజ్ఞపు ఆయువును అనుసరించి నిలిచిఉండును

**13.** దారములచే బట్ట ఎర్పడుచున్నది. ముప్పది మూడు యజ్ఞతంతువులచే ఈ యజ్ఞము విస్తరించుచున్నది ఋత్విగాదులు హవిస్సుచే యజ్ఞము చేయుచున్నారు

యజ్ఞాంగములందు ఎది విచ్ఛిన్నమైనను మరొక దానిని సమకూర్చుచున్నాడు **స్వాహా.**

కాలిన కలశము దేవతలను చేరును గాత

(1 - 6 వరకు గల మంత్రములు అగ్ని ఉపస్థానవిషయికములు )

**పదకొండవ అనువాకము**

(యాజ్య పురోనువాకములు )

**1.** వైశ్వానరాగ్ని వచ్చును గాక దిగ్గున లేచి వచ్చును గాక దూరదేశము నుండి వచ్చునుగాక మా కొరకు వచ్చును గాత మమ్ము రక్షించును గాత

**2.** వైశ్వానరాగ్ని సత్యసంధుడు అభీష్టఫలప్రద యజ్ఞ పాలకుడు నిత్యప్రకాశకుడు ఆ అగ్ని మాయందు చేరుచున్నాడు

**3.** ఒక బుద్ధిమంతుడగు యజమాని సత్కర్మలచే వైశ్వానర వ్రతము అవలంబించినాడు - మహాఫలమును పొందినాడు

ద్యావాపృథ్వులు ప్రభూత రేతస్కులు వారు అగ్నికి తల్లిదండ్రులయినారు - లోకపూజ్యులు అయినారు

**4.** ఈ అగ్ని ద్యులోకమున ఆదిత్యరూపమున ఉన్నాడు. భూలోకమున దహనరూపమునను పక్వము చేయువాడుగను ఉన్నాడు సమస్త ఓషధులందు ఉన్నాడు

వైశ్వానరాగ్ని సాహసవంతుడు - బలవంతుడు అతడు మమ్ము పాపములనుండి రాత్రింబవళ్లు రక్షించవలెను

**5.** అగ్నీ! నీవు అన్నవంతుడవు సర్వత్రగామివి గొల్లలు తమ పశువులను గుర్తించిన రీతి నీవు పుట్టుకతోనే సమస్త లోకములను - నీ తేజస్సున గుర్తించినావు

వైశ్వానరాగ్నీ! ఈ కర్మకొరకు మార్గమును ఎర్పరచుము మమ్ము సదాశుభములందు రక్షించుము

**6.** అగ్నీ! నీవు ఎంతో ప్రకాశించువాడవు పుట్టినంతనే నీ కాంతులను లోకములందంతను నింపినావు లోకములను తెలిసికున్నావు

వైశ్వానరాగ్నీ! నీవు మహిమాన్వితుడవు ఋత్విజులను పాపములనుండి విముక్తులను చేసినావు

**7.** అగ్నీ! మాకు ఇంద్రుని వంటి పాలకుని ప్రసాదించుము. అతడు తలవంచనివాడు - జరారహితుడు - సామర్థ్యము కలవాడు కావలెను.

అగ్నీ! నీపాలనమందు మేము వేల అన్నములను పొందగలము.

**8.** వైశ్వానరుడు సర్వలోక ప్రకాశకుడు. పుట్టినంతనే విశ్వమును చాటిచెప్పినవాడు. అతడు పగలు సూర్యుడుగా ప్రకాశించుచున్నాడు. మేము ఆ వైశ్వానరాగ్ని అనుగ్రహము సంపాదింతుము.

**9.** వరుణదేవా! నీకు నమస్కరించుచున్నాము. నీ యజ్ఞములు చేయుచున్నాము. పురోడాశాది హవిస్సులు అర్పించుచున్నాము. నీ క్రోధమును శాంతింపచేయుచున్నాము.

వరుణదేవా! నీవు బలవంతుడవు. మా కొరకు ఇచట నివసించుము. మా పాపములను పోగొట్టుము.

**10.** వరుణదేవా! నీ పాశములు నా శిరస్సునందు, పాదములందు, శరీర మధ్యభాగమున ఉన్నవి. వానిని తొలగించుము. నాశనము చేయుము. అట్లు నీ మూడు పాశములు నాశనము చేసి మమ్ము పాపరహితులను చేయుము. నీ కర్మ చేయుటకు మాకు యోగ్యత కలిగించుము.

**11.** దధిక్రావనుడను అగ్ని దేవత జయశీలుడు. వ్యాప్తికలవాడు. అన్నవంతుడు. నేను అతని యజ్ఞము చేసినాను. అతడు మా ముఖములను సురభిళతములను చేయును గాత. మా ఆయువులు పెంచును గాత.

**12.** దధి క్రావనుడు శత, సహస్రసంఖ్యాక ధనములను ఇచ్చువాడు. అన్నవంతుడు. భూమి మీద సంచరించు వాడు. సూర్యుడు తన తేజస్సున నీటిని గ్రహించి వర్షము కలిగించినట్లు - పంచజనులకు అన్నము కల్పించి పెంచినవాడు. అతడు మధురములగు మాస్తుతులను స్వీకరించును గాత.

**13.** అగ్ని భువనములకు శిరోభూతుడు.

**14.** దేవతలారా! మేము సుఖములను ఆశించుచున్నాము. మిమ్ము స్వర్గమునుండి ఆహ్వానించుచున్నాము. మీరు మావద్దకు విచ్చేయండి.

**15.** దేవతలారా! మిమ్ము సేవించు వారికి సుఖములు కలిగించు చున్నారు. యజ్ఞములందు హవిస్సులు అర్పించువారికి సుఖములను కలిగించుచున్నారు అట్టి సుఖములనన్నింటిని మాకు కలిగించండి. మీరు కోరిన వరములు ఇచ్చువారుకదా! మాకు ధనమును సుపుత్రులను ప్రసాదించండి

**16.** అదితి మమ్ము రక్షించును గాత. అదితి మాకు సుఖములను ఇచ్చును గాత. అదితి పాపములనుండి మమ్ము కాపాడును గాత.

**17.** మా రక్షణకు అదితినే ఆహ్వానించుచున్నాము. ఆమె మంచి పనులు చేయువారికి తల్లివలె హితము కూర్చును.

అదితి సత్య సంరక్షిణి. అనేకులగు రాజులచే పాలించ బడినది. జరారహిత. విశాలధాత్రి. సుఖములు కలది. సుఖములు కలిగించునది.

**18.** భూదేవి విశాల. ప్రకాశమాన. కాలస్వరూప. కర్మలకు వీలు కలిగించునది. మనిషి చేసిన నావ నీట తేలియాడును. భూమి దేవనిర్మిత నౌక. అది మహాజలముపై తేలి యాడుచున్నది

భూదేవి శత్రువులనుండి రక్షించును. పాపరహిత. ఛిద్రరహిత.

మేము మాక్షేమము కొరకు అదితిని - భూమిని ఆశ్రయించుచున్నాము.

**19.** భూమి నావవంటిది. దానిని నేను పొందుచున్నాను. భూమి వద్ద శత్రువునుండి రక్షించగల ఆయుధములు ఉన్నవి. తేలుటకు తరణ దండములు ఉన్నవి.

భూమి రంధ్రములేనిది. అభీష్ట ఫలములను ఇచ్చునది.

శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ
తైత్తిరీయ సంహిత మొదటి కాండము నందలి
అయిదవ ప్రపాఠకము సమాప్తము.

యస్తేస్తన: శశయో యోమయో భూర్యోరత్నధా వసువిద్వా: సుదత్ర: ।
యేనవిశ్వాపుష్యసి వీర్యాణి సరస్వతి తమిహదాతవోఽక: ఉర్వ స్తరిక్షమన్వేమి ॥

## ఆరవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

(ఆజ్య గ్రహణాది మంత్రములు చెప్పబడినవి)

**1.** సన్నాజ్యమా! నాకు బృహస్పతి ప్రేరణ కలిగిఉన్నది. నేను ఆయువును, ధనమును ఆర్జించుచున్నాను. ఈ మంత్రమున నిన్ను పాత్రకు ఎత్తుచున్నాను. ఈ యజ్ఞమున యజమానిని హింసించకుము.

(1. పాత్రలో పోయునపుడు క్రిందపడినది సన్నాజ్యము. 2. ఆయువును ఆర్జించవచ్చును అనుచున్నాడు.)

**2.** ఆజ్యమా! నీవు ప్రాపకమవు. సత్యమవు. సత్యాధ్యక్షవు. హవివి. వైశ్వానరమవు. వైశ్వదేవమవు. ఉద్దీపిత బలము కలదానవు. సత్యబలవు. సహమవు. **పహమానమసి.**

ఆజ్యమా! నీవు శత్రువులను పరాభవింపుము. శత్రుత్వము కోరువారిని పరాభవింపుము. శత్రుసేనలను పరాభవింపుము. సహస్రవీర్యవు. నాకు సుఖములు కలిగించుము.

ఆజ్యమా! నీవు ఆజ్యమునకు ఆజ్యమవు - సత్యమునకు సత్యమవు - సత్యాయుష్యవు - సత్యజలవు అగుచున్నావు. అట్టి నిన్ను సత్యరూపమగు ఆజ్యముచే అభిఘరించుచున్నాను. నేను నిన్ను అందుకొనుచున్నాను.

**3.**. ఆజ్యమా! అయిదు ప్రాణములను నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! అయిదు ఋతువులను నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! అయిదు దిశలను నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! పంచజనులను నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! పంచబిలములను నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! బ్రహ్మవర్చస్సును నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! క్షాత్ర ఓజస్సును నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! కృషి, గోరక్ష, వాణిజ్యాదులను నియంత్రించుటకును, జగములను ధరించుటకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! మంచి బలము కొరకును, మంచి సంతానము కొరకును, ధనసమృద్ధి కొరకును, బ్రహ్మవర్చస్సు కొరకును నిన్ను గ్రహించుచున్నాను.

ఆజ్యమా! మాకు శ్రేయస్సువు అగుము. దేవతలకు హవిస్సువగుము. యజమానికి ఆశీర్వాదమవగుము. దేవతలకు తృప్తి కలిగించుము. ఇన్ని కలిగించు నిన్ను గ్రహించుచున్నాను.

**కామాయ త్వా గృహ్ణామి.** నాకోరికల కొరకు నిన్ను గ్రహించుచున్నాను.

## రెండవ అనువాకము

(హవిర్హోమానుమంత్రణము చెప్పబడుచున్నది.)

**1.** మధ్యమ పరిధీ! నిన్ను రాక్షసులు కదిలించజాలరు. అందువలన స్థిరమైన దానవు. నిన్ను అభిమంత్రించుట వలన నేను బంధువులందు స్థిరుడను - ధీరుడను. రాక్షస హననము తెలిసిన వాడను సంపన్నుడను అగుచున్నాను.

దక్షిణ పరిధీ! రాక్షస వధ విషయమున నీవు ఉగ్రమైన దానవు. నిన్ను అభిమంత్రించుటచే నేను బంధువులందు ఉగ్రుడను - ధీరుడను - రాక్షసవధ తెలిసినవాడను - సంపన్నుడను అగుచున్నాను.

ఉత్తర పరిధీ! నీవు రాక్షసులను పరాభవించు దానవు - నిన్ను అభిమంత్రించుట వలన నేను జ్ఞాతులను పరాభవించువాడను - ధీరుడను - రాక్షస వధ తెలిసిన వాడను - సంపన్నుడను అగుచున్నాను.

**2.** నిన్ను దేవతలకు యోగ్యమగు మంత్రములచే అర్చించుచున్నాను. దేవతలకు హవ్యవాహుని చేయుచున్నాను.

3. అగ్నీ! నిన్ను జ్వలింప చేయుచున్నాము. నిన్ను పూజించుచున్నాము. అట్లు చేయుటవలన మేము సంతానవంతులము, భృత్యవంతులము, చిరంజీవులము అగుదుము గాక

(సమిధలను వెలిగించ వలెను.)

4. అగ్నీ! నేను యజ్ఞము చేయుచున్నాను ఇందలి ఏ దర్భలు నశించునో, జుహువు మున్నగు వానినుండి ఏ ఆజ్య బిందువు క్రిందపడునో వానితోనే అంతము చేయరాని శత్రువును వధించుచున్నాను. వానిని పాప దేవత వడిలో పడవేయుచున్నాను.

(వేది మధ్యనున్న హవిస్సులను అభిమంత్రించవలెను.)

5. ఈ హవిస్సులు భూలోక, భువర్లోక, సువర్లోకమునకు చెందినవి.

(వీనిచే అగ్నిని ఆసాదనము చేయవలెను)

6. అగ్నీ! నిన్ను దేవతలు ప్రజ్వలింపచేసినారు. మనువు ప్రజ్వలింపచేసినాడు. నీవు వాచిన నాల్కలు - జ్వాలలు - హర్షదాయకములు. నీ బలమును యజమానికి వ్యక్తపరచుము. వర్ధిల్లుము క్షీణించుచున్న బలముగల శత్రువునకు నీ బలము వ్యక్తపరచ వలసిన పనిలేదు. ఏధి - వర్ధిల్లుము.

7. హోతాగ్నీ! నీవు మరణము ఎరుగని వాడవు. నీతల మీద నేయి పారించుచున్నాను. యజమానికి మంచిసంతానము, ధనము, భటులను కలిగించుము.

8. స్రువము నందలి ఆఘార ఆజ్యమా! నీవు మనస్సువు. ప్రజాపతి సంబంధివి. ప్రజాపతి యజ్ఞముతోను - నీ మనస్సుతోను నన్ను ఆవహింపుము.

(స్రువము యజ్ఞసాధనము. అందలి ఆజ్యమునకు ఆఘార ఆజ్యమని పేరు.)

9. స్రుచమునందలి ఆఘారాజ్యమా! నీవు ఇంద్ర సంబంధివి. శత్రుక్షయ కారిణి వగు వాక్కువు. నీవు నీ వాక్కుతోను, చక్షురాది ఇంద్రియముల తోడను నన్ను ఆవహింపుము.

10. **ఋతూనామ్ వసన్తమ్ ప్రీణామి** - ఋతువులందు వసంతమును సంతోషపెట్టుచున్నాను. **సమాప్రీతః ప్రీణాతు.** అట్లు సంతోషపడినది నన్ను సంతోషింప చేయవలెను.

**గ్రీష్మమృతూనాం ప్రీణామి సమాప్రీతాః ప్రీణాతు.**

**వర్షాఋతూనాం ప్రీణామి తామాప్రీతాః ప్రీణన్తు.**

**శరద మృతూనాం ప్రీణామి. సామాప్రీతాప్రీణాత.**

**హేమన్త శిశిరా మృతూనాం ప్రీణామి తౌమా ప్రీతౌప్రీణీతా.**

**11.** ఆజ్యభాగములు అగ్నిషోమ దేవతాకములు. యజమానిని అగు నేను సమంత్రకముగా ఆజ్యాహుతులు ఇచ్చుచున్నాను. నేను నేత్రవంతుడను అగుదునుగాక.

(యజమాని ఇష్టియందు ఆజ్య భాగములను అభిమంత్రించవలెను.)

**12.** నేను అగ్నికి సమంత్రకముగ ఆజ్యాహుతులు ఇచ్చుచున్నాను. నేను అన్నభోక్తను అగుదును గాక.

(అగ్నిని అభిమంత్రించవలెను.)

**13.** ఉపాంశు యాగదేవా! మేము ద్వేషించు శత్రువును నీవు హింసించు చున్నావు. ఇక నన్ను శత్రువులు హింసించ జాలరు. నన్ను ద్వేషించు శత్రువును నేను సంహరించగలవాడనగుదును.

(ఉపాంశు యాజను అనుమంత్రించవలెను.)

**14.** అగ్ని షోమ మందు సమంత్రకముగ ఆహుతులు అర్పించుచున్నాను. నేను శత్రుహంతను అగుచున్నాను.

(అగ్ని షోమమును అనుమంత్రించవలెను.)

**15.** ఇంద్రాగ్ని యజ్ఞమందు సమంత్రకముగ ఆహుతులు అర్పించుచున్నాను. నేను ఇంద్రియోపేతుడను అన్నాదుడను అగుచున్నాను.

**16.** ఇంద్ర యజ్ఞమందు సమంత్రకముగ ఆహుతులు అర్పించుచున్నాను. ఇంద్రియవంతుడను అగుచున్నాను.

**17.** మహేంద్ర యజ్ఞమున సమంత్రకముగ ఆహుతులు అర్పించుచున్నాను. జయశీలుడను, మహిమాన్వితుడను అగుచున్నాను.

**18.** అగ్ని యాగము నందలి దోషములను పరిహరించినాడు. యాగమును చక్కగా జరిపించినాడు. అట్టి అగ్నికి యజ్ఞమున సమంత్రకముగ ఆహుతులు అర్పించుచున్నాను. ఆయుష్మంతుడను అగుచున్నాను. యజ్ఞము విధివత్తు పూర్తి అయినందున ప్రతిష్ఠగలవాడను అగుచున్నాను.

(అగ్నిని అనుమంత్రించవలెను.)

**మూడవ అనువాకము**

(భక్షింపదగిన ఇడాది భాగమునకు అనుమంత్రణ చెప్పబడుచున్నది.)

**1.** అగ్ని దూషితముల నుండి నన్ను రక్షించును గాత. సవిత పాపవర్తనులనుండి నన్ను కాపాడును గాత.

**2.** నాపై శత్రుత్వము వహించిన వాడు దూరపు వాడయినను, దగ్గరివాడైనను - వారిని ఇడాది హవిభాగమున జయింతును.

(యజమాని ఇడాది భాగమును అందుకొనవలెను.)

**3.** ఇడా దేవతా! నీవు శృంగ పుచ్ఛాదులు కలదానవు. నీరు, నేయి రెండు వానల దానవు. శుక్ల, కృష్ణ, కపిల వర్ణవు. మా గృహములు శాస్త్రోక్త యజ్ఞగృహములు. నీవు వానికి అనుకూలవగుచు విచ్చేయుము. నీవు స్నేహ పూర్వక ఆఘ్రాణాదులు గల దానవు. వానిచే నా తలను శోధించుము.

**హే ఇడే ఏహి** - రమ్ము. **హే అదితేః ఏహి. హే సరస్వతిః ఏహి. హే రన్తే ఏహి. హే రమతే ఏహి. హే సూనః ఏహి.** నిన్ను ఆహ్వానించినాము. నీ అనుగ్రహము పొందినాము. నీ అనుజ్ఞ లభించినది.

మాకు ఈ యజ్ఞపు ఫలము లభించవలెను. యజ్ఞమునందలి ఆశీస్సులు సత్యములు కావలెను. ఆదరపూర్వక మనసు కలిగి యజ్ఞఫలము సాధించుటకు సమర్థుడను కావలెను.

నేను చేసిన యజ్ఞము స్వర్గమునకు చేరును గాక. చేరిన యజ్ఞము హవిర్భోక్తలగు దేవతలు ఉన్న చోటునకు పోవునుగాక. పోయిన హవిస్సు దేవతల భోజనశాలకు చేరునుగాక - దేవతలు దానిని అందుకొందురుగాక.

ఇంద్రుడు ఈ యజ్ఞమునకు సంతుష్టుడు అగును గాత. మరొక యజ్ఞము చేయుటకు మాకు అవయవ పాటవము కలిగించును గాత. చేయనున్న యజ్ఞములకు గాను మాకు ధనాదికములు లభించునుగాక. మాకు యజ్ఞఫలరూపమగు ఆశీస్సులు లభించును గాత.

ఇడా దేవతా! నీవు మాకు ప్రీతి పాత్రమవు. మాకొరకు శత్రువులను ఎంతో హింసించుము. నీవు ధనవతివి అగుము.

(ఇడను అనుమంత్రించ వలెను.)

**4.** అవాంతర ఇడా! నీవు ప్రీతి స్వరూపమవు. మమ్ము సంతోష పరచుము. మేము నిన్ను సేవించుచున్నాము. నీవు మమ్ము అనుగ్రహింపుము.

(1. భుజింప తగిన ఇడలోని ఒకభాగము అవాంతర ఇడ అగును. 2. అవాంతర ఇడను అనుమంత్రించవలెను.)

**5.** అగ్ని పూజనీయుడు. అతడు ఆహూతులందరి ఘృతమును సేవించును గాత. యజ్ఞదోషములను నివారించును గాత. యజ్ఞమును యోగ్యము చేయును గాత. బృహస్పతి ఈ యజ్ఞమును విస్తరించును గాత. ఈ యజ్ఞము వలన దేవతలందరు సంతృప్తులు అగుదురు గాత.

(వేది మధ్యభాగమును జలముచే మార్జనము చేయవలెను.)

6. యజ్ఞపురుషా! మమ్ము సంతోష పరచుము. మేము ధనమును ఇమ్చు వారలము. మా ధనమును క్షీణింప చేయకుము. మేము యజ్ఞము చేయుచున్నాము. మా శక్తిని క్షీణింప చేయకుము

7. అన్వాహార్యమా! నీవు ప్రజాపతి భాగమవు. బలము కలదానవు. పాల వంటి రుచిగలదానవు. నీవు నా ప్రాణాపానములను కాపాడుము. సామానవ్యానములను కాపాడుము. ఉదాన వ్యానములను కాపాడుము. నీవు అక్షయమవు. నాకు క్షయము కలుగకుండుటకు నిన్ను దానము చేయుచున్నాను పరలోకమందు నాకు కలుగబోవు భోగములను తరగనీయకుము. అచట నేను నిన్ను పరిపూర్ణముగ అనుభవించు వాడను కావలెను.

(పితృయజ్ఞము తరువాత చేసిన కర్మయందు దక్షిణాగ్నిలో వండిన అన్నము అన్వాహార్యము అగును.)

## నాలుగవ అనువాకము

(శేషాహుతులగు అనుయాజాదుల అనుమంత్రణము.)

1. బర్హి అను అగ్నికి సమర్పిత ఆజ్యాహుతులు అర్పించుచున్నాను. సంతానవంతుడను అగుచున్నాను. నరాశంసమను అగ్నికి సమర్పిత ఆజ్యాహుతులు ఇచ్చుచున్నాను. పశువంతుడను అగుచున్నాను.

(అనుయాజాదుల హోమద్రవ్యములను అనుమంత్రించవలెను.)

2. నేను అగ్నికి ఆహుతులు అర్పించినాను. వానివలన అగ్ని రాక్షసాదులను జయించినాడు. అగ్నివలెనే నేను సహితము విజేతను అయినాను.

నేను సోమమునకు ఆహుతులు అర్పించినాను. వాని వలన సోమము రాక్షసాదులను జయించినది. సోమము వలెనే నేను సహితము విజేతను అయినాను.

నేను అగ్నిషోమమునకు ఆహుతులు అర్పించినాను. వాని వలన అగ్నిషోమము రాక్షసాదులను జయించినాడు. అగ్నిషోమము వలెనే నేను సహితము విజేతను అయినాను.

నేను ఇంద్రాగ్నులకు ఆహుతులు అర్పించినాను. వాని వలన ఇంద్రాగ్నులు రాక్షసాదులను జయించినారు. ఇంద్రాగ్నుల వలెనే నేను సహితము విజేతను అయినాను.

నేను ఇంద్రునకు ఆహుతులు అర్పించినాను. వాని వలన ఇంద్రుడు రాక్షసాదులను జయించినాడు. ఇంద్రుని వలెనే నేను సహితము విజేతను అయినాను.

నేను మహేంద్రునకు ఆహుతులు అర్పించినాను. దానివలన మహేంద్రుడు రాక్షసాదులను జయించినాడు. మహేంద్రుని వలె నేను సహితము విజేతను అయినాను.

నేను స్విష్ట కృదగ్నికి ఆహుతులు అర్పించినాను. వానివలన స్విష్ట కృదగ్ని రాక్షసాదులను జయించినాడు. స్విష్ట కృదగ్ని వలెనే నేను సహితము విజేతను అయినాను.

3. ఇంద్రుడు అన్నమును ఉత్పత్తి చేయవలసి ఉన్నది. అందుకు నేను స్రువమును ఎత్తినాను. అప్పుడు ఇంద్రుడు నన్ను ఉత్కృష్ట వంతుని చేసినాడు. స్రువమును క్రిందకు దించినాను. అప్పుడు ఇంద్రుడు నా శత్రువులను పరాభూతులను చేసినాడు.

స్రువమును ఎత్తుట, దించుటచేత దేవతలు, బ్రహ్మయు నన్ను వర్ధిల్ల చేసినారు.

ఇంద్రాగ్నులు నా శత్రువులను పారద్రోలి, నశింపచేయుదురు గాత.

4. ఈ యజ్ఞమునందలి ఆశీస్సులు మమ్ము చేరును గాత. మేము ఆయురారోగ్యములు కోరుచున్నాము. ఇంద్రవంతులము అగుచున్నాము ఇంద్రుని సేవించు చున్నాము. మాకు సంతానము, ఆయురారోగ్యములు కలుగుచున్నవి.

5. ప్రస్తరమా! అగ్ని రోహిత అశ్వమునెక్కి నిన్ను చేరును గాత. ఇంద్రుడు హర్యశ్వము నెక్కి నిన్ను చేరును గాత. సూర్యుడు ఏతశ అశ్వమును ఎక్కి నిన్ను చేరును గాత.

(ప్రస్తరమును అనుమంత్రించవలెను)

6. అగ్నీ! నీవు పరిధులను ధరించినావు. అట్టి నీ యొక్క రశన - గుర్రపు నడుమునను కట్టుతాటి - నుండి నిన్ను విముక్తుని చేయుచున్నాను. రశ్మి - ముఖమునకు తొడిగించు కళ్లెము- నుండి నిన్ను విముక్తుని చేయుచున్నాను. యోక్త్ర - గుర్రపు పగ్గము - నుండి నిన్ను విముక్తుని చేయుచున్నాను. కావున మాకు ధనములను సుఖములను ప్రసాదించుము. మేము దేవతలకు హవిర్భాగములు ఇచ్చుచున్నాము కదా! అందును గురించి దేవతలకు మిక్కిలిగా తెలియ పరచుము.

7. సర్వవ్యాపకుడగు శంయునకు సమంత్రక ఆహుతులు అర్పించుచున్నాను. యజ్ఞమును పూర్తి చేయుట వలన నేను ప్రతిష్ఠ గలవాడను అగుచున్నాను.

(శంయు పరిధిని అనుమంత్రించవలెను.)

8. నేను సోమ దేవతకు సమంత్రక ఆహుతులు అర్పించుచున్నాను. అందువలన ఫలవంతమగు రేతస్సు కలవాడను అగుచున్నాను. త్వష్టకు సమంత్రక ఆహుతులు అర్పించుచున్నాను. అందువలన పశువులు కలవాడను అగుచున్నాను. దేవపత్నులకు, గృహపతియగు అగ్నికి - యజ్ఞమిధునమునకు సమంత్రక ఆహుతులు అర్పించుచున్నాను. అందువలన బిడ్డలు కలవాడను అగుచున్నాను.

(హవిస్సును అనుమంత్రించవలెను.)

**9.** దర్భగుచ్ఛమా! నీవు వేదనామకవు. ద్రవ్యలాభ సాధనమవు. నీవు అనుగ్రహించుము. నేను ధనము పొందగలవాడను.

నీవు కర్మనామకవు. వేదిని సమ్మార్జనము చేయుసాధనమవగుచున్నావు. ధవదాతవు అగుచున్నావు. నీవు అనుగ్రహింపుము. నేను ఋత్విగాదులకు ధనదానము చేయగలవాడను అగుదును.

నీవు వేదస్వరూపవు. నాకు ఆజ్యాది సమృద్ధిని ప్రసాదించుము. గృహాది వసతులు కలిగింపుము. అన్న సమృద్ధిని కలిగింపుము.

(వేది మధ్యమున దర్భగుచ్ఛమును ఉంచవలెను.)

**అయిదవ అనువాకము**

(ఆప్యాయనాది మంత్రములు చెప్పబడుచున్నవి.)

**1.** ఋత్విజులు ప్రతి ఆహుతికి దేవతలను ఆహ్వానించుచున్నారు. వారు ధ్రువమను హోమసాధనమును పట్టినారు. ఆ ధ్రువము - సూర్య పత్నియు, గోరూపధారిణియగు ఉషయొక్క పాలునిండిన చన్నువలె - నేతితో నిండవలెను.

ఈ యజ్ఞమున పృథివి వేది రూపమున ఉన్నది. ఆమె వడిలో ధ్రువమను పాత్ర ఉన్నది. అది మాటి మాటికి నేతితో నింపబడుచున్నది. అదియే ఆజ్యమహాధారయై వేది రూపమున ఉన్న భూమిని నింపును గాత.

**2.** ధ్రువమా! నీవు ప్రజాపతి సంబంధివి. యజమానిని అగు నేను - నిన్ను విభాన్నామ లోకమున ఉంచుచున్నాను.

(యజమాని హవిశేషమును భుజించవలెను.)

**3.** జలపూర్ణపాత్రమా! నీవు శోభించుదానవు. నాకు అనుకూలవు అగుము. నీవు సర్వదిశలందు వ్యాపించి ఉన్నదానవు. నన్ను సర్వకార్య సమర్థుని చేయుము. నీటితో నిండిన దానవు నన్ను పరిపూర్ణుని చేయుము. నీవు క్షయము లేని దానవు. నన్ను అక్షయుని చేయుము.

**4.** **ప్రాచ్యాం దిశి దేవా ఋత్విజో మార్జయన్తామ్.** తూర్పుదిక్కును దేవతలు, ఋత్విజులు పావనము చేయుదురు గాక.

దక్షిణాయాం దిశి మాసాః పితరో మార్జయాన్తామ్.

ప్రతీచ్యాం దిశి గృహాః పశవో మార్జయన్తామ్.

ఉదీచ్యాం దిశ్యాప ఓషధయో వనస్పతయో మార్జయన్తామ్.

ఉర్ధ్వాయాం దిశి యజ్ఞస్సంవత్సరో యజ్ఞపతి ర్మార్జయన్తామ్.

5. మొదటి పాద విన్యాసమా! నీవు నరకమును నశింపచేయువాడగు విష్ణువు యొక్క పాదమవు. ఈ పృధ్వి గాయత్రీ ఛందమును అభిమానించునది. దాని మీద నాతొలి అడుగువేయుచున్నాను. మేము ద్వేషించు పాపములు తొలగిపోయినవి.

రెండవ పాదవిన్యాసమా! నీవు అపవాదులు పోగొట్టునట్టి విష్ణువు యొక్క పాదమవు అగుచున్నావు. త్రిష్టుభ ఛందమును అభిమానించునది అంతరిక్షము. దాని మీద నా రెండవ అడుగు వేయుచున్నాను. మేము ద్వేషించు అపవాదులు తొలగిపోయినవి.

మూడవ పాదవిన్యాసమా! నీవు శత్రుహంతయగు విష్ణువు పాదమవు అగుచున్నావు. ద్యులోకము జగతీ ఛందమును అభిమానించునది. దానిమీద నా మూడవ అడుగు వేయుచున్నాను. మేము ద్వేషించు శత్రువు తొలగి పోయినాడు.

నాలుగవ పదవిన్యాసమా! నీవు హింసించకోరు శత్రువును హతమార్చు విష్ణువు యొక్క పాదమవు అగుచున్నావు. దిశలు అనుష్టుప్ ఛందమును అభిమానించునవి. దానిమీద నాలుగవ అడుగును ఉంచుచున్నాను. మేము ద్వేషించు హింసక శత్రువు తొలగిపోయినాడు

(వేది మధ్యమున యజమాని వేయు అడుగులను విష్ణుపాదములుగ భావించి వేయవలెను. మూడు అడుగులు మంత్రసహితముగను - నాలుగవ అడుగు మంత్ర రహితముగను వేయవలెను.)

### ఆరవ అనువాకము

(ఇందు సూర్య ప్రార్థన చెప్పబడినది.)

1. ఆహవనీయాగ్నీ! నీ అనుగ్రహము కలిగినది. అందువలన తొలిభోగములు అనుభవించదగిన భూమిని పొందినాము. తదుపరి ఆదిత్యలోకమును పొందినాము నీ అనుగ్రహమున మాకు భంగము వాటిల్లలేదు. మేము చేయు తపములకు సహితము భంగము కలుగకున్నది.

2. ఆదిత్యా! నీవు చక్కని వాడవు. కిరణ్మంతములగు చంద్రాదిగ్రహములందు శ్రేష్ఠుడవు. ఆయువును ఇవ్వగలవాడవు. నాకు ఆయువును ఇమ్ము. వర్చస్సునిచ్చు వాడవు. నాకు వర్చస్సునిమ్ము.

3. మేము ద్వేషించు శత్రువును సమస్త దిశల నుండి - దివినుండి - అంతరిక్షమునుండి - భూమినుంచి తొలగించు చున్నాను. మేము ఏశత్రువును ద్వేషించుచున్నామో అతడు తొలగించబడినాడు.

4. నేను సూర్యునంతటి తేజస్సు కలవాడను అగుదును గాత.

5. ఆదిత్యుని ఆవృతమును అనుసరించి నేనును పరిభ్రమింతును గాత.

(యజమాని కుడివైపునకు తిరుగవలెను.)

6. నేను సంతానముతో కలసి ఉందును గాత. సంతానము నాతో కలసి ఉండును గాత నేను ధనసమృద్ధితో కలసి ఉందును గాత. ధనసమృద్ధి నాతో కలసి ఉండును గాత. (ఉత్తరమునకు తిరుగవలెను.)

7. అగ్నీ! నీవు సమిధచే జ్వలించుచున్నావు. నా కొరకు మరింత జ్వలించుము. నేను సహితము ప్రకాశవంతుడను అగుదును గాక - స్వాహా.

(ఆహవనీయాగ్ని యందు సమిధ వేయవలెను.)

8. యజ్ఞము వసుమంతము అగునుగాక. అగ్నీ! నేను ధనవంతులందు అధికుడను అగుదును గాత.

(ఆహవనీయాగ్నిని ప్రార్థించవలెను.)

9. అగ్నీ! నీవు ఆయుష్యములను పోషించుచున్నావు. మాకు సర్వత్ర బలమును, అన్నమును కలుగచేయుము. శత్రుసేనను దూరముననే నివారింపుము.

అగ్నీ! నీవు చక్కని కర్మములవాడవు. మమ్ము పవిత్రులను చేయుము. వర్చస్సు నిమ్ము సామర్థ్యము కలిగించుము. పుష్టినిమ్ము. ధనము ప్రసాదించుము.

(గార్హపత్యాగ్నిని సేవించవలెను.)

10. అగ్నీ! నీవు గృహపతివి. నీవలన నేను సుగృహపతిని అగుదును. గృహపతినగు నా వలన నీవు సుగృహపతివి అగుదువు.

నాకు శతహిమముల ఆయువు కలుగునట్లును, సంతానము కలుగునట్లును, నా బుద్ధి ప్రకాశించునట్లును ఆశీర్వదించమని ప్రార్థించుచున్నాను.

(గార్హపత్యాగ్నిని సేవించవలెను.)

**11.** యజ్ఞమా! ఏ ప్రజాపతి నిన్ను నియమించినాడో - అతడే నిన్ను విముక్తను చేయును గాత.

(యజ్ఞమునకు ఉద్వాసన చెప్పవలెను.)

**12.** అగ్నీ! నీవు యజ్ఞమునకు అధిపతివి నేను యజ్ఞమును ఆచరించినాను. అందుకు సమర్థుడను అయినాను. ఆ యజ్ఞము నాకు సమృద్ధి ప్రసాదించినది.

(ఆహవనీయాగ్నిలో సమిధ వేయవలెను.)

**13.** యజ్ఞము ముగిసినది అది మరల మరల జరుగును గాత. యజ్ఞము మమ్ము గుర్తించినది అది వర్ధిల్లును గాత.

యజ్ఞము దేవతలకు అధిపతి అగునుగాక. అది మమ్ము అధిపతులను చేయును గాత మేము ధనపతులము అగుదుముగాక.

(యజమాని ఈ మంత్రమును జపించవలెను.)

**14.** అగ్నీ! ఈ యజ్ఞము గోమంతము, అజవంతము, అశ్వవంతము, ఋత్విగ్వంతము అగును గాత. ఈ యజ్ఞము ఎన్నడును తిరస్కరింపబడకుండును గాత

ఈ యజ్ఞము అన్నవంతము, బహుధనోపేతము, అవిఘ్నము, విద్యుద్యుక్తము అగునుగాక

బలవాన్ అగ్నీ! ఈ యజ్ఞము మరల మరల జరుగుచుండును గాత.

(యజమాని తూర్పుదిశగా ముందుకు జరిగి ఈ మంత్రమును జపించవలెను.)

**ఏడవ అనువాకము**

(దేవతా పరిగ్రహాదికము వివరించబడినది.)

**1.** ఒకే కాలమందు జరుగు సోమయాగములెట్లో అట్లే ఏక కాలమున జరుగు యజ్ఞములు అగుచున్నవి. దర్శపూర్ణమాస యాగములను అనేకులగు యజమానులు ఒకే సమయమున చేయుదురు. అప్పుడు ఏ యజమాని యజ్ఞమునకు దేవతలు వచ్చెదరు? ఏ యజమాని యజ్ఞమునకు రాకుందురు?

ఏ యజమాని - ఇతరులకన్న - ముందు యాగము ప్రారంభించి దేవతలను ఆహ్వానించునో అతడు ఆ దేవతలను మరుసటి రోజు యజించవచ్చును.

(దేవతలు వివిధ రూపములు ధరించి అనేక యజ్ఞములకు ఒకేసారి రాగలరు అనునది ఒక పక్షము.)

2. ఆహవనీయాగ్ని దేవతల పరిగ్రహార్థ ప్రదేశమగును. ఆహవనీయ, గార్హపత్యాగ్నుల మధ్య స్థానము పశువుల పరిగ్రహార్థ ప్రదేశమగును. గార్హపత్యము మానవుల పరిగ్రహార్థ ప్రదేశమగును దక్షిణాగ్ని పితృ దేవతల పరిగ్రహార్థ ప్రదేశమగును.

3. యజమాని తొలుత ఆహవనీయ, గార్హపత్య, దక్షిణాగ్ని స్థానములందు అగ్నిని స్థాపించవలెను తదుపరి దేవతల పరిగ్రహణ స్థానము నందు దేవతలను ఆహ్వానించవలెను. మరుసటి రోజు ఆ దేవతలను ఉద్దేశించి యాగము చేయవలెను.

4. అగ్ని వ్రతపతి. వ్రతమున అతడు వ్రతయోగ్యుడు అగుచున్నాడు. యజమాని వ్రతముననే వ్రతవంతుడు అగుచున్నాడు.

5. యజమాని వ్రతమును అవలంబించదలచును. అప్పుడు అతడు 'అగ్నీ! నేను వ్రతము అవలంబించుచున్నాను' అని చెప్పవలెను.

6. దేవతలందరిలో అగ్నియే వ్రతపతి యగును. కావున అగ్నిని ఉద్దేశించియే యజ్ఞము చేయవలెను

7. బర్హిరాహరణము - దర్భలను సేకరించుట - పూర్ణిమ యందు చేయవలెను. వత్సాపాకరణము- గోవుల నుండి దూడలను విడదీయుట - అమావాస్యనాడు చేయవలెను.

ఈ తిథులు యాగమునకు గాను నిర్ణయించబడినవి.

8. అగ్నిని దర్భ పరిస్తరణమునకు పూర్వుడుగను. అపరుడుగను యజించదగిన వాడని చెప్పబడినది.

9. మానవులు గడ్డికప్పుగల ఇంటిని కోరుచుందురు. దేవతలు అది లేని దానిని కోరరు కదా! దేవతల అనుగ్రహమున - అప్పుడప్పుడు - అక్కడక్కడ - నూతన నివాస గృహములు ఏర్పడుచున్నవి అది తెలిసిన యజమాని అగ్నిని యజించవలెను. అప్పుడు యజమాని వద్దకు దేవతలు వచ్చెదరు. మరుసటి రోజున అతడు యాగము చేయవలెను.

10. యజమానియగువాడు గ్రామ్య, అరణ్య పశువులను సంపాదించవలెనని చెప్పబడినది. గ్రామ్యములగు ధాన్యాదులను భుజించక ఉపవసించినచో గ్రామ్య పశువులు లభించును. అరణ్య ధాన్యములగు నీవారాదులు భుజించుట వలన అరణ్య పశువులు లభించును. ఉభయ విధి ధాన్యములు వర్జించి ఉపవసించిన పితృ దేవతాకమగును.

**11.** ఆరణ్యాక ధాన్యము ఇంద్రియాభివృద్ధి హేతువగును. యజమాని ఆ ధాన్యమును భుజించి ఇంద్రియాభివృద్ధిని పొందవలెను.

**12.** యజమాని భుజించకున్న ఆకలిగొన్న వాడగును. భుజించినచో రుద్రుడు అతని పశువులను వధించును.

**13.** అట్లగుట వలన యజమాని నీరు త్రాగవలెను. అందువలన భోజనము చేసినట్లుగాని చేయనట్లుగాని కాకుండును. ఆకలిగొన్నవాడు కాకుండును. ఆ విధముగ చేసిన రుద్రుడు యజమాని పశువులను వధించడు.

**14.** యజ్ఞము వజ్రాయుధము వంటిది కాగా ఆకలి శత్రువు వంటిది అగును. ఉపవసించిన యజమాని వజ్రాయుధము అగుచున్నాడు. తన శత్రువగు ఆకలిని సంహరించుచున్నాడు.

### ఎనిమిదవ అనువాకము

(జల ప్రణయనము, యజ్ఞాయుధ సంభృతి చెప్పబడుచున్నది.)

**1.** శ్రద్ధవహింపక యజ్ఞము చేసినట్లయిన దేవతలు అట్టి యజ్ఞమును అంగీకరించరు.

**2.** ఉదకములు శ్రద్ధా స్వరూపములు. కావున ఉదకములను ప్రణయనము చేయవలెను. అట్లయిన యజ్ఞమున శ్రద్ధ వహించినట్లగును. ఆ యజ్ఞము నందు దేవతలు, మానవులు సంతసింతురు.

**3.** ఉదకములు శరీర ధర్మములను, వాక్కును కూడ అతిక్రమించుచున్నవి మనసును మాత్రము అతిక్రమించజాలవని పెద్దలు చెప్పుచున్నారు.

**4.** యజమాని మనసుతో పృథ్విని ధ్యానించుచు జల ప్రణయనము చేయవలెను.

**5.** పృథివియే మనస్సగును. కావున పృథివిని ధ్యానించి అపాంప్రణయనము చేసిన యజమాని పృథివి చేతనే అపాంప్రణయనము చేసినవాడు అగుచున్నాడు.

**6.** అది తెలిసికొనిన యజమాని హవిస్సు లుప్తము కాకుండును.

**7.** అధ్వర్యుడు యజ్ఞ పరికరములను సాధించవలెను. యజ్ఞ సాధనములే యజ్ఞమగును. కావున యజ్ఞ సాధనములను ఆర్జించినచో యజ్ఞమును ఆర్జించినట్లగును.

**8.** యజ్ఞ సాధనములను ఒక్కొక్క దానిని ఉపయోగించిన పితృ దేవతాకమగును. ఒకేమారు అన్నింటిని ఉపయోగించిన మానవ సంబంధమగును.

**9.** యజ్ఞ సాధనములను జంటలుగా ప్రయోగించవలెను. అట్టి ప్రయోగమునకు 'యాజ్యా పురోవాక్యల రూపము' స్త్రీ పురుషాత్మక మిథునత్వము సిద్ధించును.

**10.** యజ్ఞపు మొదటనే యజ్ఞ సంబంధములగు పది విధములగు పరికరములను తెలిసికొని సంపాదించిన యజమాని యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగగలదు.

**11.** 1. స్ఫ్య 2 కపాలిని 3. అగ్నిహోత్ర హవణి 4. శూర్పము 5. కృష్ణాజినము 6. శమ్య 7. రోలు 8 రోకలి 9. దృషద్ అను శిల 10. ఉపల అను రాయి. ఈ పది యజ్ఞ సాధనములు అగును.

**12.** దేవతలు వినునట్లు యజ్ఞము చేసిన యజమాని యొక్క హవ్యమును దేవతలు స్వీకరించుచున్నారు.

**13.** ఈ యజ్ఞమునకు దేవతలను ఆహ్వానించువాడు అగ్ని. నేను అటువంటి అగ్నిని ఆహ్వానించుచున్నాను. అని పాత్ర యందుంచిన హవిని అభిమంత్రించవలెను.

**14.** ఈ అభిమంత్రణము యజ్ఞమునకు స్వీకార స్వరూపము అగును. దీనిని గ్రహించి యాగము చేయవలెను.

**15.** అట్టి అభిమంత్రణము యజ్ఞపు స్థిరత్వమునకని చెప్పవలెను. వాక్కును నియంత్రించవలెను.

(మంత్రము చెప్పి మౌనము వహించవలెను.)

**16.** శబ్దోచ్చారణమున మనసు యజ్ఞము నుండి తొలగును. కావున మనసుతోనే ప్రజాపతి యజ్ఞమును ప్రారంభించినాడు. రాక్షస సంచార పరిహారార్థమై యజమానియు మౌనము వహించి మనసుచే యజ్ఞమును ఆచరించవలెను.

**17.** యోగము కలిసినపుడు యజమాని యాగము చేయవలెను. అట్టివాడు యజమానులందు ప్రసిద్ధుడు అగుచున్నాడు.

**18.** ఎ ప్రజాపతి నిన్ను యజ్ఞమునకు యోగ్యునిగా చేయవలసినవాడో - ఆ ప్రజాపతియే నిన్ను యజ్ఞ యోగ్యుని చేయును అని చెప్పబడినది. కావున ఆ ప్రజాపతియే ఈ యజ్ఞమును యోగ్యము చేయుచున్నాడు. యోగకాలమున యాగము చేయువాడే యాగము చేయువాడు అగుచున్నాడు.

## తొమ్మిదవ అనువాకము

(ద్వాదశ ద్వంద్వసంపత్తి వివరించబడినది)

**1.** ప్రజాపతి అగ్ని హోత్రాది యాగములను సృష్టించినాడు. వానిలో అగ్నిహోత్రము అగ్నిష్టోమము ఒక ద్వంద్వము అగును. పౌర్ణమాసి - ఉక్థము ఒక ద్వంద్వము అగును. అమావాస్య అతిరాత్రము ఒక ద్వంద్వము అగును.

ప్రజాపతి వానిని సరిసమానముగా ఏర్పరచినాడు. అగ్నిష్టోమము ఇచ్చినంత ఫలమునే అగ్నిహోత్రయాగము కలిగించును. పూర్ణమాసి అంతటి ఫలమునే ఉక్థము కలిగించును. అమావాస్య అంతటి ఫలమునే అతిరాత్రము కలిగించును.

**2.** ఏ యజమాని ఈ విషయమును తెలిసికొని అగ్నిహోత్రయాగము చేయునో అతనికి అగ్నిష్టోమ యాగమంతటి ఫలము కలుగును.

ఏ యజమాని ఈ విషయము తెలిసినవాడై పౌర్ణమాసి యాగము చేయునో అతనికి ఉక్థ యాగమంతటి ఫలము లభించును.

ఏ యజమాని ఈ విషయమును తెలిసినవాడై అమావాస్య యాగము చేయునో అతనికి అతిరాత్రయాగమంతటి ఫలితము దక్కును.

**3.** పరమేష్ఠి కన్న మున్నే దర్శపూర్ణమాస యజ్ఞము ఏర్పడినది. ఆ యజ్ఞమును అనుష్ఠించిన యజ్ఞకర్త పరమేష్ఠిత్వ పదవిని చేరుకున్నాడు.

ఆ యజ్ఞము ప్రజాపతిని ప్రోత్సహించినది. ప్రజాపతి దర్శపూర్ణమాస యజ్ఞము చేసినాడు. ఉత్తమ పదవిని పొందినాడు.

అది ఇంద్రుని ప్రోత్సహించినది. ఇంద్రుడు దర్శపూర్ణమాస యజ్ఞము చేసినాడు. ఉత్తమ పదవిని పొందినాడు.

అది అగ్నిషోమ దేవతలను ప్రోత్సహించినది. వారు దర్శపూర్ణమాస యజ్ఞమును అనుష్ఠించినారు. ఉత్తమ పదవిని పొందినారు.

ఏ యజమాని ఈ విషయములను తెలిసికొన్నవాడై దర్శపూర్ణ మాస యజ్ఞమును అనుష్ఠించునో అట్టివాడు నిశ్చయముగ పరమపదమును పొందుచున్నాడు.

**4.** దశ పూర్ణమాస యజ్ఞములను విశేషముగా చేసిన యజమానికి సంతానము, పశువులు, మిధునములు కలిగి వర్ధిల్లుచున్నాడు. సంవత్సరమునందు గల పన్నెండు నెలలలోనూ దశ పూర్ణమాసయాగము, ద్వాదశ ద్వంద్వములు చేయవచ్చునని చెప్పుచున్నారు.

**5.** 1. అధ్వర్యుడు ఆవుపాలు పితుకుటకు దూడను విడువవలెను. 2. ఉఖ యను పాత్రను గార్హపత్య అగ్ని మీద పెట్టవలెను. 3. ధాన్యమును దంచవలెను. 4. దృషద ఉపల శిలలచే పోటు వేయవలెను. 5. దృషత్తునందు పిండి చేయవలెను. 6. పురోడాశమును వండుటకు పాత్రను నిప్పు మీద పెట్టవలెను. 7. ఉడికించవలెను. 8. నేయి పోయవలెను. 9. వేదిని అమర్చబోవు స్థలమున స్తంభయజువును హరించవలెను. 10. గడ్డి, దుమ్మును దోసిలితో ఎత్తి పోయవలెను. 11. వేదిని ఏర్పరచవలెను. 12. యజమానపత్ని నడుమునకు త్రాడు కట్టవలెను. 13. స్ఫ్య చే గీయబడిన గీతయందు ప్రోక్షణీ పాత్రను ఉంచవలెను. 14. గీచిన గీతలో నేయి వేయవలెను.

**6.** ఇవియే దశ పూర్ణమాస యాగమునందలి ద్వంద్వ ప్రక్రియలు. వీనిని అనుష్ఠించి యాగము చేసిన యజమాని **"ప్రప్రజయా పశుభిర్మిథునైర్జాయతే"**

(5వ మంత్రమున చెప్పివవి 14. అనగా 7 ద్వంద్వములు అగును. 8వ అనువాకము నందలి 11వ మంత్రమున చెప్పబడిన 10 - 5 ద్వంద్వములు అగును. 7 + 5 = 12 అనగా ద్వాదశ ద్వంద్వములు అగును.)

## పదవ అనువాకము

(హవిస్పాదనము వివరించబడుచున్నది.)

**1.** ధ్రువోఽసి ఇత్యాది మంత్రము జ్ఞాతుల స్థిరత్వమును చెప్పుచున్నది. ఉగ్రోఽసి ఇత్యాది మంత్రములు జ్ఞాతులు ప్రతివాదులు కారు అని చెప్పుచున్నది. యజమానికి ప్రతికూలుడై, అతనిని నశింప చేయగోరు జ్ఞాతి విషయముననే యజమాని ఉగ్రుడు అగుచున్నాడు అని **"అభిభూరసి"** అను మంత్రము చెప్పుచున్నది.

**2.** యజమాని అగ్నిని **"యునజ్మిత్యాది"** మంత్రములచేతనే నియమించుచున్నాడు అని చెప్పబడినది.

**3.** యజ్ఞము సమృద్ధమైనప్పుడు దేవతలు స్వర్గమును పొందినారు. యజ్ఞము సమృద్ధము కానప్పుడు దేవతలు రాక్షసులను పరాభవించినారని **"యన్మే అగ్నే"** అను మంత్రము చెప్పుచున్నది.

అందువల్ల యజమాని యజ్ఞమును సమృద్ధము చేసినపుడే స్వర్గమునకు చేరుచున్నాడు. యజ్ఞము సమృద్ధము కాకున్న శత్రువులను పరాభవించుచున్నాడు.

**4.** యజమాని 'భూః' 'భువః' 'సువః' అను వ్యాహృతులచే హోత్రకర్మ అగ్నియందు హవిస్సులను చేర్చవలెను.

**5.** అగ్నిహోత్ర కర్మ యజ్ఞములకు ముఖము వంటిది అగును. భూర్భువాది వ్యాహృతులు బ్రహ్మ స్వరూపములు. వీనివలన యజ్ఞముఖమునందు బ్రహ్మ స్వరూపములగు వ్యాహృతులు చేసినట్లగును.

**6.** అగ్నిహోత్ర కర్మ చేసిన సంవత్సరము తరువాత సహితము ఈ వ్యాహృతులచేతనే హవిని అర్పించవలెను.

**7.** అగ్ని హోత్ర క్రతువు యొక్క ఆద్యంతదినములందు వ్యాహృతులను బ్రహ్మయే ఏర్పరచినాడు. కావున యజమాని ఆ సంవత్సరమును బ్రహ్మ రూపముగనే పరిగ్రహించుచున్నాడు.

**8.** దశపూర్ణమాస, చాతుర్మాస్య క్రతువులు చేయు యజమాని ఈ వ్యాహృతులతోనే అగ్నియందు హవిస్సులు సమర్పించవలెను.

దశపూర్ణమాస, చాతుర్మాస్యములు యజ్ఞములకు ముఖము వంటివి. వ్యాహృతులు బ్రహ్మస్వరూపములు. కావున వీనివలన యజ్ఞముఖమునందు బ్రహ్మస్వరూపములగు వ్యాహృతులు చేసినట్లగును. సంవత్సరము తరువాత కూడ ఈ వ్యాహృతులచేతనే హవిని అర్పించవలెను. అందువలన బ్రహ్మస్వరూపమైన సంవత్సరమును గ్రహించినట్లగును.

**9.** సామవేద మంత్రములచేత అనుష్ఠించబడిన యజ్ఞముయొక్క ఫలితము దేశమునకు చెందును. ఋగ్వేద మంత్రముల చేత అనుష్ఠించబడిన యజ్ఞము యొక్క ఫలితము దేశప్రజలకు చెందును అందువలన యజమాని ఫలితము లేని యజ్ఞము చేసినవాడు అగును.

కావున మంత్రములకు ముందు వ్యాహృతులను చేర్చవలెను. అందువలన బ్రహ్మస్వరూప వ్యాహృతులు ఆదిగా మంత్రము చదివినట్లగును. అందువలన యజమాని ఫలసహితమగు యజ్ఞము చేసినవాడగును.

**10.** హోత యజమాని కొరకు యజ్ఞము చేయించును. ఒకప్పుడు హోత యజమానికి వ్యతిరేకి కావచ్చును. అట్లయినపుడు హోత యజ్ఞ ఫలమును యజమాని శత్రువులకు అందించదలచును. అట్టితరి పురోనువాక్యయందు వ్యాహృతులను ప్రయోగించవలెను. పురోనువాక్య శత్రుదేవతాకము కదా! అందువలన యజ్ఞఫలము శత్రువునకు చెందును.

(ఇది హేయము. నీచము. యజమాని సొమ్మును, అతని శత్రువునకు ఫలము నందించకోరుట ద్రోహమగును. ఇది హోత యజమానిని వప్పగించినట్లగును. ఏ సభ్య సమాజము ఈ పద్ధతి అంగీకరించదు. ఇందు ఒకరి ఆధిక్యత స్పష్టము!)

**11.** పెక్కురు యజమానులు చేయు యజ్ఞములు ఉండును. ఆ యజ్ఞ ఫలము అందరకు సమానముగా అందవలెనన్నచో హోత పురోనువాక్యలోని ఋక్కుయొక్క అర్ధభాగము ఉచ్చరించిన వెంటనే మొదటి వ్యాహృతిని - యాజ్య ప్రారంభమునకు ముందు రెండవ వ్యాహృతిని - యాజ్యలోని ఋక్కు యొక్క సగభాగము ఉచ్చరించగనే మూడవ వ్యాహృతిని ప్రయోగించవలెను. అందువలన యజ్ఞ ఫలము యజమానులందరకు సమానముగా లభించును.

**12.** పర్జన్యుడు వర్షము - అందరి కొరకు సమముగా వర్షించును. అట్లే యజ్ఞము యజమానులందరకు సమాన ఫలమును ఇచ్చుచున్నది. నదీ తీరపు జనులందరు నీరు తీసుకుందురు. అట్లే యజమానులు యజ్ఞ ఫలమును అనుభవించుచున్నారు.

**13.** స్రువము నందలి ఆఘారాజ్యమా! నీవు మనసువు. మనసు ప్రజాపతి సంబంధి. యజ్ఞము సహితము ప్రజాపతి సంబంధియే. కావున నీవు వానితో కూడి నన్ను ఆవహించుము. 'మనో౽సి' అను మంత్రము ఈ విషయమునే చెప్పినది.

**మనో వై ప్రాజాపత్యం ప్రాజాపతో యజ్ఞో** మనసు ప్రజాపతియే. యజ్ఞము ప్రజాపతియే. కావున మనసు తనయందే యజ్ఞమును ధరించుచున్నది.

ఆఘారాజ్యమా! నీవు ఇంద్ర సంబంధివి. శత్రు నాశకమగు వాక్కువు. నీవు నన్ను ఆవహించుము. 'వాగసి' అను మంత్రము ఈ విషయము చెప్పినది.

వాక్కు ఇంద్ర సంబంధము. అందువలన వాక్కు తనయందే ఇంద్రుని ధరించుచున్నది

**పదకొండవ అనువాకము**

(ఆశ్రావణాది మంత్రములు విధింపబడుచున్నవి.)

**1.** ప్రజాపతి సర్వ యజ్ఞములను అనుసరించి ఉండువాడు. అతడు సప్తదశనామకుడు. ఈ విషయము తెలిసిన యజమాని సంపూర్ణ యజ్ఞము చేసినవాడు అగుచున్నాడు. అతని యజ్ఞము భ్రష్టము కాకున్నది.

(ఆశ్రావణాది మంత్రములు 17 అక్షరములవి. కావున ప్రజాపతి సప్తదశనామకుడు )

**2.** ఆశ్రావయ 4 అక్షరములది + అస్తుశ్రౌషట్ 4 అక్షరములది + యజ 2 అక్షరములది +. యే యజామహే 5 అక్షరములది + వౌషట్ 2 అక్షరములది. ఈ 17 అక్షరముల అయిదు మంత్రముల గుచ్ఛము ప్రజాపతి అగును. ఆ ప్రజాపతి అన్ని యజ్ఞములందు ఉన్నాడు. ఈ విషయము తెలిసిన యజమాని సంపూర్ణ యజ్ఞము చేసిన వాడగుచున్నాడు. అతని యజ్ఞము భ్రష్టము కాకున్నది.

**3.** యజ్ఞపు ఆరంభమును - మధ్యను - సమాప్తిని తెలిసిన యజమాని సాంగము, వైకల్య రహితమగు యజ్ఞము చేసినవాడు అగుచున్నాడు. అతనికి సకల యజ్ఞ ఫలము లభించుచున్నది.

**4.** మంత్ర పంచకమునందలి తొలి మంత్రము యజ్ఞపు ఆరంభము. 2,3 4 మంత్రములు మధ్యమం - 5వది సమాప్తి అగుచున్నవి.

**5.** సత్యవాక్కు యొక్క ఫలితమును తెలిసికొనిన యజమాని సూనృత వాక్కు యొక్క ఫలితమును పొందుచున్నాడు.

**6.** 'యజ్ఞో వై సూనృతా' - యజ్ఞమే సత్యవాక్కు. ఈ సూనృతమను గోవును "ఆశ్రావయ" అను మంత్రముచే పిలుచుచున్నాడు. "అస్తుశ్రౌషట్" అను మంత్రముచే దూడను విడుచుచున్నాడు 'యజ' అను మంత్రమున పాలు పితుకు పాత్రను అందుకొనుచున్నాడు. 'యే యజామహే' అను మంత్రమున పాలు పితుకువాడు ఆవు వద్ద కూర్చొనుచున్నాడు. 'వషట్' అను మంత్రము వలన పాలు పితుకుచున్నాడు.

ఈ విషయములు తెలిసిన యజమాని వాస్తవముగా సూనృత గోవు పాలు పితుకుచున్నాడు

**7.** ఒకప్పుడు దేవతలు యజ్ఞమునందు ఆసీనులు అయినారు. అప్పుడు దిశములు రిక్తములుగా అగుపించినవి. అంతట దేవతలు మంత్ర పంచకమును కనుగొన్నారు. వారు తొలి మంత్రమున వాయువును, రెండవ మంత్రమున ఆకాశమును, మూడవ మంత్రమున విద్యుత్తును, నాలుగవ మంత్రమున ఉరుమును, అయిదవ మంత్రమున వర్షమును కల్పించినారు. అప్పుడు దిశలు ఆప్యాయములు అయినవి

ఈ విషయములు తెలిసి కొనిన యజమానికి దిశలు ఆప్యాయములు అగును.

**8.** ఒక యజమాని సప్తదశాక్షరమయ ప్రజాపతిని గ్రహించినాడు. అంతట ప్రజాపతి ఆ యజమానిని అనుగ్రహించినాడు. ప్రజాపతి అనుగ్రహము పొందిన యజమాని ఇతర యజమానులందు శ్రేష్ఠుడు అయినాడు.

**9.** మంత్ర పంచకమునందలి సప్తదశాక్షర ప్రజాపతియే తెలియదగినవాడు. ఆ ప్రజాపతిని ఎరిగిన యజమాని ఉత్కృష్టుడు అగుచున్నాడు.

**10.** వసంతమును సంతోష పెట్టుచున్నాను అనుట వలన రుతువులే ప్రయాజ మంత్రములైనవి యజమాని రుతువులను సంతోష పెట్టుట వలన రుతువులు అతనికి అనుకూలములు అగుచున్నవి.

ఈ విషయము తెలిసికొన్న యజమానికి రుతువులు అనుకూలములు అగుచున్నవి.

**11.** అగ్నిషోమ సంబంధ దేవయజ్యచే నేను నేత్రవంతుడనగుదును. అట్లని అగ్నిషోమాభ్య మంత్రమునుడివినది.

నేత్రవంతులగు అగ్నిషోమాది దేవతల యజ్ఞము చేసినవాడు నేత్రవంతుడు అగుచున్నాడు.

**12.** **అగ్నిర్వైదేవానామన్నాదో** - అగ్నియే దేవతలకు అన్నము అందించుచున్నాడు. అగ్ని యందే అన్నమిచ్చుట చేరి ఉన్నది. అట్లని **'అగ్నేరహం'** అను మంత్రాదులు చెప్పినవి.

**13.** ఉపాంశు యాజముననే దేవతలు రాక్షసులను సంహరించినారు. దానిచేతనే శత్రువులను వధించినారు. అట్లని **'దబ్ధిరస్యదబ్ధో'** అను మంత్రము వచించినది.

**14.** అగ్నిషోమ దేవతల దేవయజ్యము వలననే నేను వృత్రహంతను అయినాను. అని అగ్ని షోమాది మంత్రము చెప్పుచున్నది.

ఇంద్రుడు వృత్రహంతయగు అగ్నిషోమముల వలననే శత్రువులను హింసించి, వధించ గలిగినాడు.

**15.** ఇంద్రాగ్నుల దేవయజ్య వలననే నేను ఇంద్రియపటుత్వము కలవాడను. అన్నాదుడను అగుదును అని చెప్పబడినది.

ఇంద్రియ పటుత్వము కలవాడే అన్నాదుడు అగుచున్నాడు.

**16.** ఇంద్రుని దేవయజ్య వలన నేను ఇంద్రియ పటుత్వము కలవాడను అగుదును అని **'ఇంద్రస్వాహ'** ఇత్యాది మంత్రములు చెప్పుచున్నవి.

అందువలన యజమాని **'ఇంద్రవ్యైవభవతి'** ఇంద్రియ పటుత్వము కలవాడు అగుచున్నాడు

**17.** మహేంద్ర దేవయజ్యవలన నేను విజేతను, మహిమాన్వితుడను అగుదును అని **'మహేంద్రస్వాహ'** ఇత్యాది మంత్రములు వచించుచున్నవి.

అట్లగుటచే యజమాని విజేతయు, మహిమాన్వితుడును అగుచున్నాడు.

**18.** స్విష్టకృత అగ్ని దేవయజ్య వలన నేను ఆయుష్యమును, ప్రతిష్ఠను పొందుచున్నానని **'అగ్నేస్స్విష్టకృతో'** ఇత్యాది మంత్రములు చెప్పినవి.

కావున యజమానికి ఆయువు, ప్రతిష్ఠ కలుగుచున్నవి.

## పన్నెండవ అనువాకము

(యాజ్యా పురోను వాక్యలు.)

**1.** పృత, భృత్యాదుల కొరకు ఇంద్రుని ఆహ్వానించుచున్నాము. అతడు కేవలము మావాడు అగును గాత.

**2.** నరులు ఇంద్రుని అర్ధ హవిస్సు వహించుటకు ఆహ్వానించుచున్నారు. పారమును ఎరిగిన యజమానులు కర్మలను అనుష్ఠించుచున్నారు.

ఇంద్రా! నీవు శూరుడవు, ధనదుడవు, బలములను పెంచువాడవు. మాకు గోవ్రజమును ఇమ్ము.

**3.** ఇంద్రా! నీవు శత్రక్రతువవు. నీ అనుగ్రహము వలన నేను పంచ జనుల సామర్థ్యమును సంపూర్ణముగా తెలియుచున్నాను.

**4.** ఇంద్రా! నీవు యాగోద్దేశ్యుడవు. యాగములందు దేవతలందరి కన్న గొప్పవాడవు. నీవు వృత్రుని వధించినావు. క్షత్రియ జాత్యభిమానము కలవాడవు. బలయుతుడవు. శత్రువును తిరస్కరించ గలవాడవు. అందువలన నీకు హవిస్సులు - దేవతలతో క్రమముగా అందించ బడుచున్నవి.

**5.** సూర్యుని అశ్వములు ఏడును రథమున తమంత తాముగా తగులుచున్నవి. సూర్యుడు అతీంద్రియజ్ఞాని. కీర్తిమంతులందు కీర్తిమంతుడు. ప్రకాశవంతుడు. అంతటివాడు ఇంద్రునకు అతిథి యగుచున్నాడు. ఇంద్రుని మహిమ అంతటిది!

**6.** ఇంద్రా! చెట్లకు కాయగసరు లేకుండెను. వర్షము కలిగించినావు. వాటికి కాయలను, ఫలములను కలిగించినావు. సూర్యుని ఆకాశమునందు స్థాపించినావు.

యజమానులు ఇంద్రునకు ప్రియమగు పురోడాశాదులను - భక్తియుక్తముగ, సామములచేత - చక్కగా కాల్చుదురు గాత. చక్కని స్తుతులచే స్తుతింతురు గాత.

**7.** సామగాయకులు బృహత్ సామమున ఇంద్రుని స్తుతించుచున్నారు. అర్కిణులు ఋక్కులచే ఇంద్రుని స్తుతించుచున్నారు. అన్యవచనము సహితము ఇంద్రుని నుతించుచున్నది.

**8.** శతక్రతూ! ఉద్గాతలు నిన్ను కీర్తించుచున్నారు. అర్కిణులు నిన్ను భజించుచున్నారు అధ్వర్యులు వంశమును వలె నిన్ను ఉన్నతుని చేయుచున్నారు.

**9.** ఇంద్రా! గ్రీష్మకాలమున దావాగ్నిచే భూములు పరితప్తములు అగుచున్నవి. వర్షము కలిగించి వానిని నీవు పునరుజ్జీవింప చేయుచున్నావు. నిన్ను మేము సంతోషపెట్టదలచినాము. స్తుతించు మంచి మనసు కలిగి ఉన్నాము. నీవు ఈ హవిస్సును స్వీకరించుము. అందువలన యజమాని కోరికలు ఫలించును గాత.

**10.** ఇంద్రా! నిన్ను ఆనంద పరచ దలచినందున మేము సుబుద్ధులము అయినాము కావున మరణము వరకు నిన్నే స్తుతింతుము. నది దాటించుమని ఉభయతీరముల జనులు నావికుని ఆహ్వానింతురు. అట్లే పాపవిముక్తులమైన మమ్ము ఉభయవంశజులు ఆహ్వానించుచున్నారు.

**11.** ఇంద్రుడు ప్రకాశించువాడు. యాగములకు ముఖ్యుడు. పాపములను విడిపించువాడు. యజ్ఞఫలములను ఇచ్చువాడు. వర్షమును తరుగనీయని వాడు. ఋత్విజులారా! అట్టి ఇంద్రుని మరింతగా స్తుతించండి.

అశ్వినులారా! ఇతనికి ఇంద్రియ పాటవమును - బలమును కలిగించండి.

**12.** ఇంద్రా! మా శత్రువులను హింసింపుము. మమ్ము చంపదలచి సేనను కూర్చువాని తలవంచుము. మమ్ము అంతటను నశింప చేయు శత్రువును పాదా క్రాంతుని చేయుము.

**13.** ఇంద్రా! మమ్ము క్షతినుండి రక్షించు బలము కలిగి జన్మించినావు. నీవు నరుల కోర్కెలు తీర్చువాడవు. శత్రుభావము గలవారిని తిరస్కరించినావు. దేవతలకు హవిస్సులు అర్పించువారికి సకల భోగములు కల్పించినావు.

**14.** ఇంద్రా! నీవు భయంకరమైనదియు, ప్రాణులను భక్షించునదియు, పర్వతము లందు ఉన్నదియునగు సింహము వలె, మా విరోధిని పరిమార్చుటకు, దూర దేశము నుండి వచ్చినావు. నీ వజ్రము వైరులను చీల్చునది. తీక్ష్ణమైనది. దానికి పదును పెట్టుము. శత్రువును కొట్టుము. యోధులను తలదన్నుము.

**15.** ఇంద్రా! నీవు శత్రుయోద్ధలను రాల్చుము. వృత్రుని దవడలు పగులగొట్టుము. ఉగ్రుడవగుము. మమ్ము క్షీణింపచేయువాని కోపమును పోగొట్టుము.

**16.** రక్షించు వాడగు ఇంద్రుని **హువేమ** - ఆహ్వానించుచున్నాను. అవరోధముల నుండి రక్షించువాడగు ఇంద్రుని **హువేమ**. శూరుడగు ఇంద్రుని **హువేమ**. సర్వ యాగములందు ఆహ్వానించదగిన ఇంద్రుని **హువేమ**. సర్వకార్య సమర్థుడగు ఇంద్రుని **హువేమ**.

మఘవుడు మాకు శుభములను కలిగించును గాత.

**17.** ఇంద్రా! నీవు బలశాలివి. మా రక్షణ కొరకు ఈ యాగము చేయుచున్నాము. ఇందు మేము లోపములు చేయకుండునట్లు అనుగ్రహింపుము. హర్యశ్వఇంద్రా! ఏనాటికిని మేము నిన్ను అవమానించకుందుముగాక. మాకు బాధలు లేని ఇల్లు ప్రసాదించుము. విద్వాంసులగు యజమానులందు మేము నీకు ప్రీతిపాత్రులము అగుదుము గాక.

**18.** పురుహూత ఇంద్రా! నీ రథమున గుర్రములు కట్టుటకు నరులు ఏర్పాట్లు చేయుదురుగాక. త్వష్ట నీ వజ్రాయుధమునకు పదును పెట్టును గాత. ఋత్విజులు మంత్రములచే నిన్ను భజింతురుగాక. పాపములను నశింప చేయుటకు ఇంద్రుని వర్ధిల్ల చేయుదురు గాత.

**19.** ఇంద్రా! నీ యాగము కోరికలు తీర్చునట్టి దగును. ఆ యజ్ఞ సాధనములగు దృషదుపలాదులను అలంకరించు చున్నాము. అవి నిన్ను, అదితిని సంతోష పరచును గాత. ఇంద్రుని వజ్రాయుధాదులు - రథాశ్వములతో నిమిత్తము లేకుండగనే అసురులను సంహరించును గాత.

శ్రీమదాంధ్రవచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత

మొదటి కాండము నందలి ఆరవ ప్రపాఠకము సమాప్తము.

యస్తేస్తన: శశయో యోమయో భూర్యోరత్నధా వసువిద్యా: సుదత్ర: ।
యేనవిశ్వాపుష్యసి వీర్యాణి సరస్వతి తమిహదాతవో౽క: ఉర్వ్యన్తరిక్షమన్వేమి ॥

# ఏడవ ప్రపాఠకము

## మొదటి అనువాకము

(ఇడా ప్రశంస చెప్పబడుచున్నది.)

1. ఆహితాగ్ని యొక్క పాక యజ్ఞమును అనుసరించి పశువులు లభించుచున్నవి. ఇడయే పాక యజ్ఞము అగుచున్నది. అది యజమాని యజ్ఞమందు ప్రయాజ - అనుయాజల మధ్యమున వ్యవస్థితమైనది.

2. హోతృ సమీపమునకు తీసికొనివచ్చు ఇడను 'హేసురూపవర్షవర్ణే: ఏహి' అని అభిమంత్రించవలెను. ఇడయే పశువులు అగుటవలన యజమాని పశువులనే ఆహ్వానించినట్లగును

3. పూర్వము దేవతలు యజ్ఞములు చేసినారు. అన్ని యజ్ఞ ఫలములను పిండుకున్నారు. ఆ యజ్ఞము అసురులను బలరహితులను చేసినది. యజ్ఞము వలన నిస్సారులైన అసురులు పరాభూతులు అయినారు.

యజ్ఞమును దేవతలు రిక్తపరచుట - యజ్ఞము అసురులను రిక్తపరచుట తెలిసికొన్న యజమాని ఇతర యజమానులను రిక్త పరచుచున్నాడు.

4. ఈ యజ్ఞము యొక్క ఆశీస్సులు సత్యములు అగునుగాక. ఈ ఆశీస్సులే యజ్ఞఫలము అగును. దీనివలననే నేను ఇతర యజమానుల బలమును గ్రహించుచున్నాను.

5. తొలుత దూడ ఆవుపాలు త్రాగును. అప్పుడు ఆవు చేపును. పాలిచ్చును. అట్లే ఇడ చేపి యజమానికి ఫలములను ఇచ్చుచున్నది. 'ఇడోపహూతా:' అను మంత్రభాగము ఇడకు స్తనములు అగుచుండగా వాయువు వత్సము అగుచున్నది.

6. హోత ఇడను ఆహ్వానించును. అప్పుడు యజమాని హోతను చూచుచు వాయువును మనసునందు ధ్యానించవలెను. ఆ విధముగా చేసిన తల్లి ఆవు వద్దకు దూడను విడిచినట్లగును.

7. దేవతలు అందరు సంపూర్ణ దర్శపూర్ణమాస యజ్ఞమును ఆచరించియే స్వర్గమును పొందినారు. కాని మనువు మాత్రము పాక యజ్ఞము మాత్రమే చేసినాడు. ఇడయు మనువు నందు చేరినది.

ఆ ఇడా దేవతను దేవాసురులు ఆహ్వానించినారు. దేవతలు ప్రతీచీ పద్ధతిని అనుసరించినారు. **'ఇడోపహూతా'** అని ఆహ్వానించినారు. అసురులు పరాచీ పద్ధతిని అనుసరించినారు. **'ఉపహూతేడా'** అని ఆహ్వానించినారు. ఇడ దేవతల ఆహ్వానమును మన్నించినది. వారిని చేరినది. పశువులు ఇడా స్వరూపము కదా! అందువలన పశువులు దేవతలను చేరినవి. అసురులను విడిచినవి.

**8.** అధ్వర్యుడు ఒకనిని పశుహీనుని చేయదలచినపుడు పరాచీ పద్ధతిన ఇడను ఆహ్వానించవలెను. అట్లయిన అధ్వర్యు ఎవనిని ఉద్దేశించినాడో వాడు పశు విహీనుడు అగును.

(ఇది 1 - 10 - 10 వంటి హేయమైనది.)

**9.** ఎవడు ఇడా దేవతను ప్రతీచీ పద్ధతిన ఆహ్వానించి ఇడా దేవత యందు తనను లీనము చేయునో అతడే ఇడను ఆహ్వానించిన వాడు అగుచున్నాడు. అట్లని వేదవేత్తలు చెప్పుచున్నారు.

**10.** ఇడా దేవతా! నీవు ఎంతో ప్రియమవు. మా శత్రువులను సంహరించు దానవు. ధనవతివి. అని **'పావః ప్రియే'** అను మంత్రమున ఇడను ఆహ్వానించి, ఇడ మనసున ప్రతిష్ఠించినవాడు ఇడను ఆహ్వానించిన వాడు అగుచున్నాడు.

**12.** ప్రధానయాగము పూర్తి అగును. అనూయాజాది యాగములు ప్రారంభము కావలసి ఉండును ఆ రెండింటి మధ్యభాగమున ఋత్విజులు పురోడాశలేశమును భక్షింతురు. ఉదక లేశమును తలలపై చల్లుకుందురు. ఈ రెండును యాగరూపములు కావు. అందువలన యజ్ఞము విచ్ఛిన్నము అయినట్లు అగును. వీనివలననే రాక్షసుల యజ్ఞము విచ్ఛిన్నము అయినది. అట్లగుట వలన దేవతలు జాగ్రత్తపడినారు. ఒక సమర్థుని చేత విచ్ఛిన్న యజ్ఞమును సంధానము చేయించినారు.

**13.** **'బృహస్పతిస్తనుతామిమం'** అనుమంత్రమున యజ్ఞమును సంధానము చేయవలసినదని బృహస్పతిని కోరినారు. బృహస్పతియే దేవతలకు బ్రహ్మ కదా! అందువలన బ్రహ్మయే యజ్ఞమును సంధానము చేసినట్లయినది.

**14.** ఒక యజ్ఞము విచ్ఛిన్నమైనపుడు దానిని సంధానము చేయవలెననియు, అవిచ్ఛిన్నము చేయవలెననియు ప్రార్థించుటకే **'విచ్ఛినమిత్యా'** ది మంత్రములు వచించబడినవి.

**15.** **'విశ్వేదేవా ఇహమాదయన్తామ్'** అను మంత్రము విశ్వేదేవతలకు తృప్తి కలిగించుటకు చెప్పబడినది. యజ్ఞము అవిచ్ఛిన్నముగ కొనసాగవలెనని ఆదేశించుచున్నది.

**16.** యజ్ఞకర్త ఋత్విజులకు ఇచ్చిన దక్షిణలో అతని పశువులు కూడ చేరును. అందువలన యజ్ఞకర్త పశుహీనుడు కాగలడు. కావున దేవతారూపులైన ఋత్విజులకు ఇచ్చిన దక్షిణ వారికి చెందునట్లును - పశువులు తనవద్దనే ఉండునట్లును యజమాని ఏర్పాటు చేయవలెనని పెద్దలు చెప్పుదురు.

**17.** "బభ్నషిష్వస్వ" అను మంత్రము ఋత్విజులను సంతృప్తి చెందించుమని యజ్ఞపురుషుని ప్రార్థించుచున్నది. యజ్ఞము బభ్నశబ్ద వాచ్యము. కావున యజమాని యజ్ఞమును గౌరవించినట్లు - పూజించునట్లు అయినది. ఆ ప్రకారము యజమాని ఋత్విజులకు ఇచ్చిన దక్షిణ దేవతలకు చెందినట్లును, పశువులు అతని వద్ద ఉండునట్లును అగుచున్నది.

**18.** నేను ఇచ్చినది క్షీణించకుండును గాక అనుట వలన అది అక్షయము అగుచున్నది.

**19.** యజ్ఞము చేయుచున్న నా శక్తి సామర్థ్యములు క్షీణించకుండు గాక అని యజమాని ప్రార్థించుచున్నాడు. అందువలన అతడు మరింత వర్ధిల్లుచున్నాడు.

(16 వ మంత్రమున పశువులను ఇచ్చి మరల నామమాత్రపు వెలకు తిరిగి తీసికొనుట కావచ్చును.

17 వ మంత్రమున దేవతలకు సమర్పించుట వరకే - పదార్థములు వ్యక్తుల వద్దనే ఉండుటను - చెప్పుచున్నట్లున్నాడు. ఇది నాకు తోచినది మాత్రమే.)

**రెండవ అనువాకము**

(ఇది ప్రశ్నోత్తర రూప ఇడా ప్రశంస.)

**1.** సువర్చనసుని పుత్రుడు సంశ్రవసుడు. ఉపోదితి పుత్రుడు తుమింజుడు. మొదటివాడు రెండవ వానిని అడిగినాడు.

**2.** తుమింజా! నీవు యాగకర్తలకు హోతవు అయినావు కదా! ఎట్టి గుణములు కల ఇడను ఆహ్వానించినావు?

**3.** ప్రాణవాయువున దేవతలను నిలుపునదియు - వ్యానమున నరులను బ్రతికించునదియు - అపానమున పితృదేవతలను భరించునదియునగు ఇడాదేవిని ఆహ్వానించినాను. అని తుమింజుడు బదులు పలికినాడు.

**4.** ఇడ గోరూపకదా! దానిని దక్షిణగా గ్రహించిన వారిని నశింప చేయుచున్నదా? నశింపచేయుట లేదా? అని అడిగినాడు.

**5.** నశింపచేయుచున్నది అని బదులు చెప్పినాడు.

**6.** నీవు ఇడాదేవత దేహమునే కదా ఆహ్వానించినావు. అట్లయిన గ్రహీత నాశనమెందుకు?

**7.** గోవ్యయే ఇడయొక్క శరీరమగును. ఇది తెలిసిన వారే ఇందును గురించి వాదులాడుకున్నారు.

**8.** యజ్ఞములందు గోవు దక్షిణగా ఇవ్వబడుచున్నది. ఆ గోవు ప్రాణవాయువున దేవతలను నిలిపినది. ఆ గోవు వ్యానవాయువున నరులను జీవింపచేయుచున్నది. పితరుల కొరకు హింసించ బడునట్టి ఆ గోవు పితరులను భరించుచున్నది.

ఈ విషయములు తెలిసికొన్నవాడు పశువులు గలవాడు అగుచున్నాడు.

(అష్టకా శ్రాద్ధమున గోవును వధించుట కలదు. అదియే గోవును హింసించుట.)

**9.** ఇంకను ప్రభువు కల ప్రజకు అభిముఖముగా ఉన్న ఇడా దేవిని ఆహ్వానించినాను అని చెప్పినాడు.

**10.** ఇడ యొక్క అన్నమునే కదా ఆహ్వానించినావు? అని అడిగినాడు.

**11. ఓషధయో వా అస్యా అన్నం.** ఓషధులే ఇడకు అన్నములు. కావున ఓషధులు ప్రభువు గల ప్రజల కొరకు అగుచున్నవి.

**12. య ఏవం వేదాన్నాదో భవతి** - ఇది తెలిసికొన్నవాడు అన్నాదుడు అగుచున్నాడు.

**13.** లేదా ఏ ఇడాదేవత వ్యాధి పీడితులను అనుగ్రహించుచున్నదో - పరాభూతులను కరుణించుచున్నదో అట్టి ఇడను ఆహ్వానించుచున్నాను అన్నాడు.

**14.** అట్లయిన ఇడయొక్క భూరూప ప్రతిష్ఠను కదా ఆహ్వానించినావు? అని అడిగినాడు.

**15.** ఈ భూమియే ఇడ యొక్క ప్రతిష్ఠ అగుచున్నది. భూరూపమైన ఇడయే వ్యాధి పీడితులను అనుగ్రహించుచున్నది. పరాభూతులను కరుణించుచున్నది.

**16. య ఏవం వేద ప్రత్యేవ తిష్ఠతి** - ఇది తెలిసికొన్నవాడు ప్రతిష్ఠకలవాడు అగుచున్నాడు.

**17.** లేదా ఇడ వృష్టిరూపయగుచున్నది కురిసిన వాన ఏరులుగా పారుచున్నది. ఆ నీరు త్రావి జనులు జీవించుచున్నారు. అట్టి ఇడను ఆహ్వానించుచున్నాను అన్నాడు.

**18.** వృష్టిరూపమగు ఇడ జనులను నశింపచేయుచున్నదా? చేయకున్నదా? అడిగినాడు.

**19.** నశింపచేయుట లేదు. అంతేకాదు. పుట్టించుచున్నది. పెరిగించుచున్నది అన్నాడు.

**20.** వృష్టిరూప ఇడను ఆహ్వానించినాను అన్నావు కదా! అందువలన నీవు నిజమైన ఇడను ఆహ్వానించిన వాడవు అయినావు అన్నాడు.

**21.** వర్షమే ఇడ యగును. వాన కురియును. ఏరులు పారును. ఆ నీరు త్రాగి జనులు జీవించుచున్నారు.

**య ఏవం వేద ప్రైవజాయతేఽన్నాదో భవతి.** అది తెలిసికొన్నవాడు సంతానవంతుడు, అన్నాదుడు అగుచున్నాడు.

## మూడవ అనువాకము

(అన్వాహార్యవిధి - దాని ప్రశంస చెప్పబడుచున్నది.)

**1.** యాగము నందు ఇంద్రాది దేవతలు కంటికి కనిపించువారు కారు. వారు యాగములందు పరోక్షముగ ఉద్దేశించ బడినవారు. ఇతర దేవతలు - ఋత్విజాదులు - ప్రత్యక్షముగ ఉద్దేశించబడినవారు. పరోక్షదేవతలను యజించిన వాడే యాగము చేసినవాడు అగుచున్నాడు.

**2.** అన్వాహార్యము క్షీరాన్నమగును. యజమాని ఋత్విజులకు అన్వాహార్యమును ఇచ్చును. వీరే దేవతలకు ప్రత్యక్షరూపులు అగుచున్నారు. కావున యజమాని అన్వాహార్య దానము చేత వారినే సంతోషపెట్టుచున్నాడు.

**3.** అన్వాహార్యదానము యజ్ఞపు దక్షిణ కూడ అగును. ఇది యజ్ఞమునందలి లోపమును తీర్చును.

**4.** యజ్ఞవిధులందు తక్కువలు, ఎక్కువలు జరుగవచ్చును. అన్వాహార్యదానమున అవి పరిహరింపబడుచున్నవి. అందువలన అన్వాహార్యమునకు 'సరిచేయుట' అను అర్థము ఏర్పడినది.

**5.** ఋత్విజులు దేవదూతలు. వారికి అన్వాహార్యము దానము చేసిన దేవదూతలనే సంతోష పెట్టినట్లగుచున్నది.

**6.** పూర్వము ప్రజాపతి దేవతలకు యజ్ఞములను పంచి ఇచ్చినాడు. అప్పుడు ప్రజాపతి తనకు యాగము లేదని గుర్తించినాడు. అన్వాహార్యము దేవతలకు ఇవ్వనందున తన కొరకు ఉంచుకున్నాడు.

ఈ విషయము తెలిసిన యజమాని అన్వాహార్యమునిచ్చి ప్రజాపతినే సంతుష్టుని చేసినవాడు అగుచున్నాడు.

**7.** ప్రజాపతికి పరిమితులులేవు. అతడు సర్వయజ్ఞములందు వ్యాపించినవాడు. కావున అన్వాహార్యము ప్రజాపతి కొరకే అగుచున్నది.

**8.** దేవతల వలెనే అసురులు యజ్ఞములు చేసినారు. కాని దేవతలు మాత్రమే అన్వాహార్యమును కనుగొన్నారు - సంపాదించినారు. అందువలన వారు విజయులు అయినారు. అన్వాహార్యమును కనుగొనక పోవుటవలన అసురులు పరాజితులు అయినారు.

యజమాని ఈ విషయము తెలిసికొనవలెను. అన్వాహార్యమును దానము చేయవలెను. అందువలన అతడు ధైర్యవంతుడు, శత్రుంజయుడు అగుచున్నాడు.

**9.** యజ్ఞము వలన ఇష్టకర్మలు చేసినట్లును - అన్వాహార్యమున పూర్తి కర్మలు చేసినట్లును అగుచున్నది. ఈ విషయము తెలిసి అన్వాహార్య దానము చేసినవాని కోరికలు తీరుచున్నవి.

**10.** అన్వాహార్యము ప్రజాపతి భాగమని చెప్పబడినది. అందువలన అది ప్రజాపతికే సమర్పించినట్లగును.

**11.** అన్వాహార్యము బలము కలదనియు, ప్రాయము కలదనియు చెప్పబడినది. అన్వాహార్య దానము వలన బలము ప్రాయము కలుగుచున్నవి.

**12.** అన్వాహార్యమా! నాయొక్క ప్రాణాపానములను రక్షించుము - సమానవ్యానములను రక్షించుము అని యజ్ఞకర్త ప్రార్థించుచున్నాడు. అందువలన అతనికి ప్రాణ, అపాన, వ్యాన, సమాన ప్రాణముల రక్షణ లభించుచున్నది.

**13.** "అన్వాహార్యమా! నీవు క్షయము లేనిదానవు. కావున నాకు క్షయము కలుగకుండుటకై నిన్ను దానము చేయుచున్నాను. పరలోకమునందు నేను అనుభవించవలసిన భోగములు క్షీణించకుండునుగాక. అట్లగుటచే నిన్ను పరలోకమున స్వేచ్ఛగా అనుభవించగలను" అని అన్వాహార్యమంత్రము చెప్పుచున్నది.

భూలోకమున చేసిన అన్నదానాదుల ఆధారముననే జనులు పరలోకమునందు జీవించుచున్నారు. కావున అభిమంత్రించి దానము చేసిన అన్వాహార్యము పరలోకమునందు క్షీణించకుండును - **"నాస్యాముష్మిల్లోకేఽన్నంక్షీయతే"**

## నాలుగవ అనువాకము

(శేషాహుత్యనుమంత్రణ, అనూయాజానుమంత్రణ మంత్రములు వ్యాఖ్యానించబడుచున్నవి.)

**1.** బర్హిష, దేవయజ్యలచేత నేను సంతాన వంతుడను అగుదును గాక అని మంత్రము చెప్పుచున్నది. బర్హిషాదుల వలననే ప్రజాపతి ప్రజలను సృష్టించినాడు - సృష్టించుచున్నాడు.

నరాశంస దేవయజ్యల చేత నేను పశుమంతుడను అగుదును గాక అని మంత్రము చెప్పుచున్నది. నరాశంసాదుల వలననే ప్రజాపతి పశువులను సృష్టించినాడు - సృష్టించుచున్నాడు.

స్విష్టకృత దేవయజ్యచేత నేను ఆయుష్మంతుడను అగుదునుగాక. యజ్ఞము యొక్క సంపూర్ణ ప్రతిష్ఠను పొందుదునుగాక అని మంత్రము చెప్పుచున్నది. ఆ విధముగ ప్రార్థించిన వానికి ఆయువు, సంపూర్ణయజ్ఞ ప్రతిష్ఠ లభించుచున్నది.

**2.** దేవతలు దర్శపూర్ణమాస యాగమును సంపూర్ణముగ అనుష్ఠించినారు. మహాబలమును పొందినారు. గెలిచినారు. దర్శపూర్ణయాగముల చేతనే దేవతలు రాక్షసులను పరాజితులను చేసినారు.

యజమాని దేవతా సంబంధమగు దర్శపూర్ణమాస యజ్ఞమున సంపూర్ణముగ అనుష్ఠించవలెను. అందువలన అతనికి మహాబలము కలుగును. దర్శపూర్ణ మాసమున అతడు శ్రతువులను జయించును.

**3.** వాజశబ్ద ఘటిత ఋక్కులచేత అధ్వర్యుడు చేయుచున్న వ్యూహనమును యజమాని అనుమంత్రణము చేయవలెను. వాజశబ్దమే అన్నము అయినందున యజమానికి అన్నము లభించుచున్నది - ఇది నిశ్చయము.

**4.** యజమాని తనకు స్థిరత్వము కలుగుటకు రెండు మంత్రములచే ప్రార్థించవలెను. 1. యజ్ఞఫలరూపమగు ఆశీస్సులు సత్యములు అగునుగాక. 2. యజ్ఞఫలరూపమగు ఆశీస్సులు నాయందు చేరును గాత.

**5.** యజ్ఞమునందు రెండు మంత్రములచే ప్రార్థించుటను యజమాని తెలియవలెను. ఆ విధముగ తెలిసి యజ్ఞము చేసిన వానికి రెండు ప్రార్థనల ఫలము లభించుచున్నది.

ఈ రెండింటియందు 'ఏమాఅగ్మన్' నన్ను చేరును గాత అనునది మరొక దోహము "సతాఽశీః" ఆశీస్సులు సత్యములు అనునది ఇంకొక దోహము.

**6.** హోత యజమాని పేరు పలుకును. అప్పుడు యజమాని 'ఏమా అగ్నన్నాశిషోదోహకామా' అను మంత్రమును పలుకవలెను. ఆ విధముగా పలికినచో హోతస్తుతించిన దేవతలందరి ఫలితమును యజమాని పొందును.

అంతేకాక మొదటి, రెండవ మంత్రముల ఫలమును కూడ పొందును.

(ఈ రెండు మంత్రములు 4వ మంత్రమున పేర్కొనబడినవి.)

**7.** ప్రస్తరమా! అగ్ని నిన్ను రోహిత అశ్వముపై సూక్తమునందు చెప్పిన దేవతల వద్దకు చేర్చును గాత అని మంత్రము చెప్పినది. ఆ మంత్రము నందు చెప్పిన రోహిత, హరి ఏతశ, అశ్వములే అగ్ని, ఇంద్ర, సూర్య దేవతలవి.

యజమాని ఎంతటి యజ్ఞసాధనమో ప్రస్తరము అంతటి యజ్ఞసాధనము అగుచున్నది దేవాశ్వములు ప్రస్తరమును దేవతల వద్దకు చేర్చినచో - ప్రస్తరము యజమానిని స్వర్గమునకు చేర్చును.

(1. ప్రస్తరము - దర్భలకట్ట. 2. ఇందు వ్యంగ్యము ధ్వనించుచున్నది. దేవతాశ్వములు ప్రస్తరమును దేవతల వద్దకు చేర్చుట, నిజమైన ప్రస్తరము యజమానిని స్వర్గమునకు చేర్చును.)

**8.** అగ్నీ! నీ రశనలగు పరిధులను తొలగించుచున్నాను అనునది మంత్రము. అదియే అగ్ని విమోకము అగును. దాని వలననే అగ్నికి విమోచనము కలుగుచున్నది.

**9.** నేను వ్యాపకుడగు శంయుని యజ్ఞము చేసి కీర్తి పొందుదును అనునది మంత్రము. యజ్ఞమే విష్ణుస్వరూపము. కావున యజ్ఞపరిసమాప్తి యందు యజమానికి కీర్తి కలుగుచున్నది.

**10.** నేను సోముని యజించుచున్నాను. నేను సురేతుడనై రేతస్సును ధరింతును అనునది మంత్రము.

సోముడే రేతస్సు కలిగించువాడు. కావున యజమానికి అతని వలననే రేతస్సు కలుగుచున్నది.

**11.** నేను త్వష్ట దేవతను యజించుచున్నాను. నేను పశువంతుడనై వానిని పోషింతును గాత అనునది మంత్రము.

త్వష్టయే మిథునాత్మకములగు పశువులను కల్పించుచున్నాడు. కావున అతని వలననే యజమానికి పశువులు కలుగుచున్నవి.

**12.** గృహపతియగు అగ్నియు దేవపత్నులును మిథునము. నేను ఆ మిథునమును యజించుచున్నాను. నేను కొడుకులు, కూతుళ్లచే వర్ధిల్లుదునుగాక అనునది మంత్రము.

ఈ మిథునము నుండియే ప్రజాపతి స్త్రీపురుష మిథునమును సృష్టించినాడు. ఆ మిథునము వలననే యజమానికి పుత్రీ, పుత్రులు కలిగి వర్ధిల్లుచున్నాడు.

**13.** ప్రస్తరమా! నీవు వేదనామము కలదానవు - ధనదాతవు అగుచున్నావు. నాకు ధనము ప్రసాదించుము అనుచున్నది మంత్రము.

దేవతలు వేదమను పేరుగల దర్భల కట్టచేతనే అసురుల పూర్వ, పరధనమును పొందినారు. అందువలననే దర్భల కట్టకు 'వేద' శబ్దము సార్థకమైనది.

(విత్తమవేవేతి - దీనివలన విత్తము పొందుచున్నాడు అను వ్యుత్పత్తిచే 'వేద' శబ్దము అని వ్యాఖ్యానము.)

**14.** యజమాని తన శత్రువునకు సంబంధించినది ఏదికోరుచున్నాడో దానిని మంత్రమధ్యమున చేర్చిచెప్పవలెను. అందువల్ల శత్రువుకు సంబంధించిన 'దానిని' పోగొట్టినవాడు అగుచున్నాడు.

(అది యజమానికి చేరుటలేదు. శత్రువు పోగొట్టుకొనుచున్నాడు. ఇది ఇతరుల బాధచూచి సంతోషించుట - SADISM.)

**15.** ఘృతవంతము - బహుగృహోపేతము - అన్నసమృద్ధము - సహస్రసంఖ్యాక ధనమును నాకొసంగుమని మంత్రము వేదమును దర్భల కట్టను ప్రార్థించుచున్నది. అందువలన యజమానికి సహస్రసంఖ్యాక పశుసంపద కలుగుచున్నది.

(పశుసంపద కలిగిన పైన పేర్కొన్న వన్నియు కలిగినట్లేకదా!)

**16.** ఈ విధమగు మంత్రార్థమును తెలిసికొన్న యజమాని సంతానములో అన్నసమృద్ధికల పుత్రులు జన్మించుచున్నారు.

**అయిదవ అనువాకము**

(ఆప్యాయనాది మంత్రముల వ్యాఖ్యానము.)

**1.** ధ్రువము హోమము నందలి పాత్రయగును. దానిని నేతితో నింపనిదే యజ్ఞము సంపూర్ణము కానేరదు. యజ్ఞము సంపూర్ణము కాకున్న యజమానికి యజ్ఞఫలము లభించదు. యజ్ఞకర్త సంతానము అన్నములేనిది అగును.

ధ్రువమును నేతితో నింపిన యజ్ఞము సంపూర్ణమగును. యజ్ఞము సంపూర్ణమైనందున యజమానికి యజ్ఞఫలము లభించును. యజ్ఞకర్త సంతానమునకు అన్నసమృద్ధి కలుగును.

**2.** 'ధ్రువము ఘృతముచే నింపబడునుగాక' అన్నది మంత్రము. కావున ధ్రువమును ఘృతముచే నింపవలెను. ఆజ్యపూర్ణమగు ధ్రువమును అనుసరించి యజ్ఞము సంపూర్ణమగు చున్నది. అందువలన యజమానికి యజ్ఞఫలము - సంతానము - అన్నసమృద్ధి కలుగుచున్నది.

**3.** 'నేను యజమానిని. నాకు చెందిన హవిర్భాగమా! నాతో పాటు నిన్ను విభాన్నామలోకమునకు చేర్చుచున్నాను' అనునది మంత్రము.

అందువలన యజమాని తనభాగమును భూలోకమునందే ఉంచినట్లయినది. ఏలననగా భూలోకమే కదా ప్రజాపతి యొక్క విభాన్నామలోకము - **"అయం వై ప్రజాపతే ర్విభాన్నామలోకః"**

**4.** యజమాని యజ్ఞము చేయును. అందువలన ద్రవ్యము వ్యయము అగును. అతడు రిక్తునివలె కనిపించును. హోమశేష హవిర్భాగము స్వీకరించుట వలన యజమాని సంపూర్ణుడు అగుచున్నాడు.

**5.** హవిస్సు యజ్ఞమునందు హోమము చేయబడును. మిగిలినది హవిశేషమగును. అందులో కొంత భాగము యజమాని భుజించును - కొంత ఋత్విజులు భుజింతురు. యజమాని భుజించినది అతనికి ఇహలోకము నందు పనికి వచ్చునది. ఋత్విజులది దేవభాగము కావున అది యజమానికి ఉపకరించదు. హవిశ్శేషభాగ సేవనము వలన యజమాని యజ్ఞమును తనయందే చేర్చుకొనుచున్నాడు.

**6.** వేదిమీద దర్భలు పరచబడి ఉదకములు కూడ చేర్చబడును. అందువలన వేది తృణయుక్తము ఉదకయుక్తము అగును. అట్టి తృణజలోపేతమగు వేదియే యజ్ఞకర్తకు స్థానము అగుచున్నది.

**7.** వేది మధ్యభాగమున జలపూర్ణపాత్రను ఉంచవలెను. అందువలన యజమాని తనస్థానమునందు తృణసమృద్ధిని, ఉదక సమృద్ధిని కలిగించిన వాడగుచున్నాడు.

**8.** 'పూర్ణకుంభమా! నీవు శోభనమైన దానవు నాకొరకు యోగ్యమైన దానవు అగుము' అని మంత్రము చెప్పుచున్నది.

ఉదకములు యజ్ఞసాధనములు. కావున యజ్ఞస్వరూపలు. అవి జీవన హేతువులు. కావున అమృతరూపములు. అందువలన యజమాని అమృతస్వరూపమగు యజ్ఞమును తనయందు చేర్చుచున్నాడు.

**9.** 'సర్వభూతములు యజ్ఞము చేయువానిని అనుసరించుచున్నవి. దేవతలు, ఋత్విజులు తూర్పుదిశను పావనము చేయుదురుగాక' అనునది మంత్రము.

ఏ భూతములు యజ్ఞము చేయువానిని అనుసరించుచున్నవో యజమాని వాని సహితముగ అవభృధమును పొందుచున్నాడు. ఇదియే దర్శపూర్ణమాస యాగముల అవభృధము అగుచున్నది.

**10.** దేవతలు విష్ణువును ప్రధాన దేవతగా చేసినారు. ఛందోభిమాన దేవతలతో కూడినారు ఈ లోకములను అజేయములను చేసినారు. సర్వత్ర జయించినారు. పాదక్షేపముల వలన యజమానియే విష్ణువు అగుచున్నాడు. ఛందోభిమాన దేవతల సహితుడు అగుచున్నాడు. ఈ లోకములను అజేయములను చేయుచున్నాడు. సర్వత్ర జయించుచున్నాడు.

**11.** 'ప్రధమపాదన్యాసమా! నరక ప్రదమగు పాపమును నశింపచేయునట్టి నీవు విష్ణుపాదన్యాసమవు అగుచున్నావు' అని మంత్రము.

గాయత్రి భూలోకస్వామి. త్రిష్టుప్ అంతరిక్షస్వామి. జగతి ద్యులోకస్వామి. అనుష్టుప్పు దిశలకు స్వామి. యజమాని ఈ ఛందస్సు అభిమాన దేవతల సహితుడై ఈ లోకములను అజేయము చేయుచున్నాడు. తాను సర్వత్ర జయించుచున్నాడు.

**ఆరవ అనువాకము**

(ఉపస్థానాది మంత్రముల వ్యాఖ్యానము.)

**1.** ఆహవనీయాగ్నీ! నీ అనుగ్రహమున మేము సువర్లోకమును, తదుపరి ఆదిత్యలోకమును పొందినాము అని చెప్పబడినది. అట్లగుట వలన యజమాని స్వర్గమునే పొందుచున్నాడు.

**2.** 'ఆహవనీయాగ్నీ! నీ అనుగ్రహమున నేను స్వర్గమును పొందుటకు భంగము కలుగలేదు. నీ కొరకు నేను చేయు తపస్సునకు భంగము కలుగలేదు' అన్నది మంత్రము. కావున మంత్రోక్త ప్రకారముగనే జరుగును.

**3.** 'సూర్యదేవా! నీవు సుభువువు. కిరణములు గల చంద్రాది దేవతలందు శ్రేష్ఠుడవు. ఆయువును ఇచ్చువాడవు. నాకు ఆయువు ప్రసాదించుము' అనునది మంత్రము. యజమాని ఇట్టి ఆశీస్సులనే కోరుచున్నాడు.

**4.** విష్ణుపాదన్యాసములను దాటిన వాడు ఈ లోకములను దాటుచున్నాడు. విష్ణుపాద విక్షేపములు స్వర్గమునకు మార్గములు అగుచున్నవని బ్రహ్మవాదులు చెప్పుచున్నారు.

శత్రువులను జయించి, ఈలోకమును అనుభవించి, స్వర్గము చేరి, తిరిగి ఈ లోకమునకు వచ్చిన యజమానియే వాస్తవముగా విష్ణుపదన్యాసములను అనుసరించినవాడు అగుచున్నాడు.

**5.** 'నేను శత్రువులను దిశలనుండియు, దివము నుండియు తొలగించుచున్నాను' అనునది మంత్రము. ఇదియే స్వర్గము నుండి ఈ లోకమునకు దిగివచ్చు విధము. ఈ మంత్రప్రభావమున యజమాని శత్రువులను జయించి, ఈ లోకమును అనుభవించి, స్వర్గము చేరి, ఈ లోకమునకు మరలి వచ్చుచున్నాడు.

**6.** 'నేను సూర్య తేజస్సును కలుసుకుందునుగాక' అనుటవలన యజమాని ఈ లోకమున కీర్తి ప్రతిష్ఠలు పొందుచున్నాడు.

**7.** 'నేను ఆదిత్య సంబంధమగు ఆవృతిని అనుసరించి తిరుగుచున్నాను' అని చెప్పబడినది. ఇంద్రుడు ఆదిత్యుడు అగును. కావునే యజమాని ఆదిత్యుని ఆవృతిని అనుసరించియే సంచరించుచున్నాడు.

**8.** ఆదిత్యుడు కుడివైపుగా తిరుగుచున్నాడు - ప్రదక్షిణ చేయుచున్నాడు. దానిని బట్టియే వ్యక్తియొక్క కుడిభాగము శక్తి కలది అగుచున్నది. అందువలన ఆదిత్యుని ప్రదక్షిణను అనుసరించియే నరుడు తిరుగవలెను.

**9.** 'నేను సంతానముతో కలసి ఉందునుగాక. సంతానము నాతో కలసి ఉండునుగాక' అని చెప్పబడినది. అట్లగుట వలన యజమాని అటువంటి ఆశీస్సులను అభిలషించువాడు అగుచున్నాడు.

**10.** 'అగ్నీ! సమిధచే వెలిగిన నీవు నాకొరకు ప్రకాశించుము. నిన్ను దీపింప చేసిన నేను నీ అనుగ్రహమున ప్రకాశించెదను' అనుటవలన మంత్రోక్త ప్రకారముగనే జరుగ గలదని తాత్పర్యము.

**11.** 'ఆహవనీయాగ్నీ! నీ అనుగ్రహమున యజ్ఞము ధనము కలది యగుచున్నది. నేను సహితము ధనవంతులందు అధికుడను అగుదునుగాక' అనుట యజమాని అట్టి ఆశీస్సులను అర్థించుట అగుచున్నది.

**12.** గార్హపత్యాగ్ని సన్నిధి యందు బహుపాతకములు జరుగుచుండును. కావున అగ్ని, పవమాన దేవతాకములైన **"అగ్న ఆయూగ్ంషి"** మున్నగు ఋక్కులచే గార్హపత్యాగ్నిని సేవించవలెను. అందువలన గార్హపత్యాగ్నిని పవిత్రము చేసినవాడగును. యజమాని ఆ ఋక్కుల వలన స్వయముగా పవిత్రుడు అగుచున్నాడు.

**13.** అగ్నీ! నీవు గృహపతివి. నీ అనుగ్రహమున నేను మంచి గృహపతిని అగుదునుగాక. నేను గృహపతినై నిన్ను పూజించుచున్నందున నీవు గృహపతివి అగుము. వంద హేమంతములు నిన్ను పూజించుచున్న నేను నాకు బుద్ధిమంతుడగు పుత్రుడు కలుగవలెనని ప్రార్థించుచున్నాను. అట్లనుట వలన బ్రహ్మవర్చస్సు గల పుత్రుడు కలిగినాడు.

**14.** యజ్ఞమును అనుష్ఠించి ఉద్వాసన చేయని యజమాని అప్రతిష్ఠ పాలగుచున్నాడు.

యజ్ఞమా! నిన్ను ఏ ప్రజాపతి నియమించినాడో అతడే నిన్ను విముక్తుని చేయును గాత అని మంత్రము.

ప్రజాపతి కిం శబ్దవాచ్యుడు. కావున యజమాని ప్రజాపతి చేతనే యజ్ఞము ప్రారంభించి ప్రజాపతి చేతనే ఉద్వాసన చేయవలెను. అందువలన అతనికి ప్రతిష్ఠ కలుగును.

**15.** ఉద్వాసన చేయని యజ్ఞము యజమానిని మరింత కాల్చుటకు సమర్థమగును. అగ్నీ! యజ్ఞమును ఆచరించినాను అని మంత్రము. ఆ మంత్రము యజ్ఞమునకు శాంతి కలిగించుచున్నది. మంటలను చల్లార్చుచున్నది.

**16.** యజ్ఞము యొక్క పునరావృతిని ఎరుగని యజమానికి యజ్ఞము విముఖము అగుచున్నది. పునరావృతము అగుటలేదు. పునరారంభము తెలిసి యజ్ఞము చేసినవానికి యజ్ఞము అభిముఖముగనే పునరావృతము అగుచున్నది.

**17.** యజ్ఞము పూర్తి అయినది. యజ్ఞము పునరావృతమగును గాక అని మంత్రము. ఆ మంత్రము వలననే యజమాని యజ్ఞమును పునరావృతము చేయుచున్నాడు.

**18.** ఆహితాగ్ని యగుచు సభలేని యజమానికి ఎన్నటికిని ప్రకాశవంతమగు సభ కలుగకున్నది. **పశవః ఖలు బ్రాహ్మణస్య సభా** - బ్రాహ్మణుని సభ పశువులదే అగును.

**19.** యజ్ఞకర్త యాగము చేసి తూర్పుదిశగా జరిగి అగ్నీ! పునరాగమనము కోరబడుచున్న యజ్ఞము బహుగోమంతము, అజవంతము, అశ్వవంతము కావలెనని ప్రార్థించవలెను. అందువలన యజమాని సభావంతుడు - బహు పశువంతుడు - సంతాన, అన్న సమృద్ధి కలవాడు అగును.

**ఏడవ అనువాకము**

(ఈ అనువాకము నుండి వాజపేయ మంత్రములు.)

**1.** సవితాదేవా! యజ్ఞమును ప్రవర్తింప చేయుము. యజ్ఞపతికి సంపద ప్రసాదించుము. దివ్య గంధర్వుడు జనులకు విజ్ఞానము కలిగించువాడు. అతడు మాకు విజ్ఞానము కలిగించును గాత. వాచస్పతి ఈ కర్మయందు మాకు వాక్కును కలిగించును గాత.

(అధ్వర్యుడు సావిత్రిహోమము చేయవలెను.)

**2.** రథమా! నీవు శత్రుంజయుడగు ఇంద్రుని వజ్రాయుధమవు. నీ సహాయమున ఇతడు తన శత్రువులను వధించును గాక.

(యజ్ఞపదార్థముల రథమును వేదివద్దకు తేవలెను.)

**3.** భూమి అన్నధాత్రి. అన్నము ఉత్పత్తి చేయుటకు గాను భూమిని అఖండమైన దానినిగా స్తుతించుచున్నాము. ఇది సమస్త భూజాతములకు నిలయమైన నేల. ఈ నేలమీద నివసించుటకు సవిత అనుమతించును గాత.

(రథమును వేది మధ్యకు తేవలెను.)

**4.** అన్నవంత అశ్వములారా! జలములందు అపమృత్యునివారక అమృతము ఉన్నదనియు, రోగనివారక ఓషధులు ఉన్నవనియు అందురు. మీరు అట్టి గుణవంతములగు జలములతో సంబంధము కలవారలు కండి.

(అశ్వములను నీటితో కడుగవలెను.)

**5.** అశ్వమా! వాయువు, మనువు, 25మంది గంధర్వులు మొత్తము ఇరువది యేడు మంది - నిన్ను నాకన్న ముందు రథమునకు కట్టినారు. వారు నీకు వేగమును కలిగించినారు.

(దక్షిణాశ్వమును రథమునకు కట్టవలెను.)

**6.** అశ్వమా! నీవు నీటిని క్షీణింపనీయని దానవు. ఈ తరంగము మూపురము వలె ఎత్తైనది, ఉపద్రవమును పోగొట్టునది, అన్నము ఇచ్చునది అగును. ఆ తరంగము వలన నీవు మాకు అన్నమును సాధించుము.

(గుర్రపు వీపును కడుగవలెను.)

7. యజమానినగు నా ప్రథమ పాదక్షేపమా! నీవు విష్ణువుయొక్క తొలి అడుగుపెట్టుట వలన జయించబడిన భూలోకమవు. రెండవ పాదక్షేపమా! నీవు విష్ణువు యొక్క రెండవ అడుగు పెట్టుట వలన జయించబడిన అంతరిక్షమవు. మూడవ పాదక్షేపమా! నీవు విష్ణువుయొక్క పర్యాకమమున జయించబడిన త్రివిష్టపమవు అగుచున్నావు.

(యజమాని అడుగులు వేయుచు రథమును చేరవలెను.)

8. రథచిహ్నములు కలవియు - వాయువు యొక్క ఉగ్రపుధ్వని కలవియు - సంచరించునవియు - ఇంద్రియవంతములును అగు 'దురేహేతి' 'పత్రతి' అను పేర్లు గల కోరికలు తీర్చునట్టి అగ్నులు మమ్ము పారము చేర్చును గాత.

**ఎనిమిదవ అనువాకము**

(రథధావన మంత్రములు చెప్పబడుచున్నవి.)

1. సవితృదేవుని అనుమతి కలుగవలెను. అన్నములను జయించు బృహస్పతి అనుగ్రహించవలెను. అప్పుడు నేను అన్నవిజేతను కాగలను.

(అధ్వర్యుడు రథమును ఎక్కవలెను.)

2. సవితృదేవుని అనుమతి లభించవలెను. అన్నములను జయించు బృహస్పతి అనుగ్రహించవలెను. నేను మిక్కిలి వర్ధిల్లుదును. స్వర్గమును అధిరోహింతును.

(బ్రహ్మ రథచక్రమును అధిష్ఠించవలెను. దానిని ప్రదక్షిణముగ మూడుసారులు త్రిప్పవలెను )

3. సభాసదులారా! ఈ యజమామి ఇంద్రుని వంటివాడు. అతనిని ఆశీర్వదించుడు. అతనికి అన్నవిషయిక జయము కలిగించండి. యజమాని అన్నములను గెలుచును గాత.

4. ఓ కొరడా! నీవు అన్నవతివి. అశ్వవతివి. యుద్ధమునందు అశ్వములను నడిపించుము

5. దక్షిణాశ్వమా! నీవు అశ్వజాతికి చెందినదానవు. మధ్యమాశ్వమా! నీవు సప్తి జాతి దానవు. ఉత్తరాశ్వమా! నీది వాజి జాతి యగుచున్నది.

(అధ్వర్యుడు అశ్వములను తోలవలెను.)

6. అశ్వములారా! మీరు అన్నము ఆర్జించవలసి ఉన్నది. వేగముగ పరుగెత్తండి. దేవతల అనుమతిచే అన్నము సంపాదించండి. ఎన్నో యోజనములు పరిగెత్తండి. కొన్ని యోజనములంత పరిగెత్తండి. త్వరగా గమ్యము చేరండి.

(అధ్వర్యుడు రథమును తోలుచు పై విధముగా అనవలెను )

7. అశ్వములారా! మా అన్నములను రక్షించండి. మా ధనములను రక్షించండి.

అశ్వాభిమాన దేవతలారా! మీరు బ్రాహ్మణులవలె స్నానమున పరిశుద్ధులు. అమరులు. శ్రమరహితులు. గమ్యమును ఎరిగినవారు. నీవారసంబంధమగు చరురసము మధుసమము పరిగెత్తుటకు ముందును - పరిగెత్తిన తరువాతను దానిని సేవించండి సంతృప్తులు కండి. దేవయానమార్గమున గమ్యమును చేరండి.

8. అశ్వములు గతికుశలములు. ఆహ్వానములు వినునవి. అన్నవంతములు. అవి మా పిలుపును విననుగాక.

9. అశ్వములు ఎంతటి దారినైన, కొంచెపు దారిని చేసి పోవును. అన్నరాశులు దానము చేయును. యజ్ఞప్రదలు. మాకు ధనమును ఇవ్వకోరునవి. యుద్ధములందు శత్రుధనములు హరించునవి. ప్రసిద్ధములు. అట్టి అశ్వములు మాకు సుఖప్రదములు అగును గాత.

10. అశ్వములు పాములు, తోడేళ్ల వంటి రాక్షసులను హతమార్చునవి. మావ్యాధులను చప్పున దూరము చేయునవి. దూరమార్గములను దగ్గర చేయునవి. అర్చింపదగినవి.

11. ఈ అశ్వము యొక్క మెడ, నడుము, ముఖములందు పటకాలు ఉన్నవి. ఇవి దారిలోని రాళ్లను దాటుచున్నవి. యజ్ఞకర్త అభిప్రాయమును అనుసరించి సాగుచున్నవి. ఎత్తుపల్లములను ఎరుగుచున్నవి. కొరడానే త్వరపెట్టుచున్నవి.

(కొరడాతో పనిలేకనే సాగుతున్నవని.)

12. ఈ అశ్వము గమ్యము చేరుటకు డేగవలె ఎగురుచున్నది. పర్వతాదులను లంఘించుచున్నది ఇది బలముగా సాగుచున్నది. వేగముగా సాగుచున్నది. ఆ విధముగా సాగుట వలన దీని అలంకారములైన వస్త్రాదులు అశ్వపు రెక్కలవలె తోచుచున్నవి.

(అగ్నీధుడు హోమము చేయవలెను.)

13. అన్నపు ఉత్పత్తి నావద్దకు చేరునుగాక. ద్యావాపృథ్వులు జగములకు సుఖకరములు అగుచు నా వద్దకు వచ్చెదరు గాక. నా తలిదండ్రులు - చిరకాలము ఉండుటకు - నా వద్దకు రావలెను సోమదేవత నాకు అమృతత్వము కలిగించుటకు నా వద్దకు విచ్చేయును గాత.

(హోమము చేయవలెను.)

14. అశ్వములారా! మీరు అన్నము జయించుటకు ఉద్యమించుచున్నారు. మీరు అన్నము కొరకే ఉరుకులు పెట్టుచున్నారు. అన్నమును జయింపనున్నారు. అట్టిమీరు - బృహస్పతి సంబంధమగు- చరుభాగమును ఆఘ్రాణించండి.

(అశ్వములచే చరుభాగము వాసన చూపించవలెను.)

**15.** అశ్వములారా! మీరు బృహస్పతి సంబంధ చరువును గ్రహించవలసి ఉన్నది. పరిశుద్ధులు కండి. మీరు అన్న సంపాదనకు ఉద్యమించినారు. అన్నములకై పరుగులు పెట్టినారు. అన్నములను జయించినారు.

(అశ్వములు గమ్యము చేరిన తరువాత చరువును వాసన చూపించవలెను.)

**16.** రథములారా! మీరు ఇంద్రుని అనుగ్రహమున బాగుగా పరిగెత్తినారు. ధావన ప్రతిజ్ఞను పూర్తి చేసినారు.

(గుర్రములను విప్పవలెను. రథమును అనుమంత్రించవలెను.)

**17.** చెట్టునుండి పుట్టిన దుందుభులారా! మీరు యజ్ఞకర్తచే అన్నము జయింపచేసినారు. ఇక మీ బంధముల నుండి విముక్తులు కండి.

(దక్షిణవేది అంచున కట్టిన 17 దుందుభులను విడదీయవలెను )

### తొమ్మిదవ అనువాకము

(యూపారోహణము చెప్పుచున్నాడు )

**1.** ఆజ్యమున తడిపిన వస్త్రమా! నీవు క్షత్రియ యజమాని దేహమును కప్పుచున్నావు. దర్భమయమైన వస్త్రమా! నీవు క్షత్రియ యజమానురాలిని చలినుండి కాపాడు దానవు అగుచున్నావు.

(నేతిబట్టను యజమానికి, దర్భబట్టను యజమాన పత్నికి కట్టించవలెను. 2. దర్భబట్ట నారబట్ట కావచ్చును.)

**2.** 'పత్నీ! మనము స్వర్గమును అధిరోహింతము రమ్ము' అని పతి ఆహ్వానించినాడు. 'స్వర్గమును అధిరోహించుచున్నాము' అని పత్ని అన్నది. నేను - మన ఉభయుల కొరకు - స్వర్గమును అధిరోహించుచున్నాను, అని యజమాని అన్నాడు.

**3.** అన్నము - అన్నపు ఉత్పత్తి - అన్నపు పునరుత్పత్తి - స్వర్గము చైత్రాది మాసములు సంతృప్తి చెందును గాక **ఆయుర్యజ్ఞేన కల్పతామ్** - ఆయువు యజ్ఞము నుండి ఏర్పడును గాక. **ప్రాణోయజ్ఞేన కల్పతామ్. అపానః యజ్ఞేన కల్పతామ్. వ్యానోయజ్ఞేన కల్పతామ్. చక్షుర్యజ్ఞేన కల్పతామ్. శ్రోత్రం యజ్ఞేన కల్పతామ్. మనో యజ్ఞేన కల్పతామ్. వాగ్యజ్ఞేన కల్పతామ్.**

**4.** **ఆత్మాయజ్ఞేన కల్పతాం. యజ్ఞో యజ్ఞేన కల్పతామ్.**

(12 ఆహుతులను హోమము చేయవలెను.)

5. మేము స్వర్గము నందలి దేవతలను చేరినాము. అమరులము అయినాము. ప్రజాపతికి ప్రీతిపాత్రులము అయినాము. ప్రజలము అయినాము.

(యజమాని రెండు చేతులెత్తి ఈ మంత్రమును ఉచ్చరించవలెను.)

6. నేను సంతానముతో కూడి ఉన్నాను. సంతానము నాతో కూడి యుండునుగాక. నేను ధనసమృద్ధితో కూడియున్నాను. ధనసమృద్ధి నాతో కూడి యుండును గాక.

(యజమాని ఈ లోకమును చూడవలెను.)

7. యజమానీ! నిన్ను సామాన్యుల అన్నము కొరకు కొట్టుచున్నానని అధ్వర్యుడు - రాజామాత్య అన్నము కొరకు కొట్టుచున్నానని బ్రహ్మ - అపూపాది అన్నము కొరకు కొట్టుచున్నానని హోత - సమస్త అన్నముల కొరకు కొట్టుచున్నానని ఉద్గాత - యూపము నుండి దిగుచున్న యజమానిని అసపుటములతో కొట్టవలెను.

(1. నలుగురు నాలుగు దిశల నుండి యజమానిని కొట్టవలెను. 2. రావి ఆకునందు చవితిని కట్టిన పొట్లము అసపుటము. 3. ఇది యజమాని మీదకు విసరుట. కొట్టుట సరికాక పోవచ్చును.)

8. బంగారమా! నీవు అమృతమవు. నీవు పుష్టివి. నీవే సంతానమును ఇచ్చుదానవు.

(యూపము దిగుచున్న యజమాని కొరకు మేకచర్మము పరచి, దానిమీద బంగారమును ఉంచవలెను.)

## పదవ అనువాకము

(అన్నహోమములు చెప్పబడుచున్నవి.)

1. అన్నములను సృష్టించినవాడు సృష్టి ఆది యందే జలములందును, ఓషధులందును సోమలత యొక్క దీప్తిని కలిగించినాడు. 'తా అస్మభ్యం మధుమతీర్భవన్తు' - అవి మాకు మధురములు అగునుగాక. మేము దేశమునందు పురోగాములము అగుదుము గాక.

(ఏడు హోమములందు ఇది మొదటిది.)

2. అన్నములను సృష్టించినవాడు ఈ కర్మలను కల్పించినాడు. ఈ జగములనన్నింటిని సర్వత్ర కల్పించినాడు. అతడు మాకు సంతానమును, పుష్టిని, అభివృద్ధిని కలిగించినాడు. అతడు మమ్ము తెలిసికొని, హోమమున సమర్పించబడుచున్న ఈ అన్నమును అంతటను అందుకొనునుగాక.

(ఇది రెండవ హోమము.)

3. అన్నములను సృష్టించువాడు ఈ స్వర్గమును, సమస్త భువనములను ఆశ్రయించినాడు. అతడు రాజాధిరాజు. నేను హవిస్సును అర్పించ కోరుట లేదని గ్రహించినాడు. అయినను అతడే నాకు వీరపుత్రులను, ధనమును ప్రసాదించునుగాక.

( ఇది మూడవ హోమము )

4. అగ్నీ! ఈ యజ్ఞమున మాకు అభిముఖుడవు అగుము. మాకు హితవు బోధించుము మా విషయమున మంచి మనసు కలవాడవు అగుము.

హే భూమిపతే! నీవు మాకు స్వామివి. ధనమును ఇచ్చువాడవు. కావున మాకు అధిక ధనము ప్రసాదించుము.

( ఇది నాలుగవ హోమము )

5. ఆర్యమ మాకు ధనము నొసంగవలెను. భగదేవత మాకు ధనము నీయవలెను. బృహస్పతియు, అన్య దేవతలును మాకు ధనము ప్రసాదించవలెను. సత్యదేవత మాకు ధనమునీయవలెను. వాగ్దేవియు మాకు మరింత ధనములను ప్రసాదించవలెను.

( ఇది అయిదవ హోమము.)

6. ప్రభూ! మాకు ధనము ప్రసాదించుటకు ఆర్యమను - బృహస్పతిని - ఇంద్రుని - సత్య దేవతను - ఇంద్రుని - విష్ణువును - సరస్వతిని - సూర్యుని ప్రేరేపించుము.

( ఇది ఆరవ హోమము.)

7. సోమరాజును - వరుణుని - అగ్నిని - ఆదిత్యులను - విష్ణువును - సూర్యుని - బ్రహ్మను - బృహస్పతిని అనుసరించి మేము యజ్ఞమును ఆరంభించుచున్నాము

( ఇది ఏడవ హోమము )

8. యజమానీ! నిన్ను సవితా దేవత ప్రేరణ వలనను - అశ్వినుల బాహువులతోనూ - పూష హస్తములతోను - సరస్వతి వాక్కుతోను - అంతర్యామి అగ్ని దేవత అనుమతి తోను - ఇంద్ర, బృహస్పతుల అనుజ్ఞతోను - సామ్రాజ్యము లభించునట్లు, స్వర్ణముచే అభిషేకము చేయుచున్నాను.

( అధ్వర్యుడు యజమానికి స్వర్ణాభిషేకము చేయవలెను )

## పదకొండవ అనువాకము

(ఉజ్జితి మంత్రములు చెప్పుచున్నాడు)

అగ్ని ఒక అక్షరమున వాక్కును జయించినాడు. అశ్వినులు రెండు అక్షరములచే ప్రాణ అపాన వాయువులను జయించినారు. విష్ణువు మూడు అక్షరముల చేత మూడు లోకములను జయించినాడు. సోమదేవుడు నాలుగు అక్షరములచేత నాలుగు కాళ్ళ జంతువులను జయించినాడు పూష అయిదు అక్షరములచేత పంక్తి ఛందస్సును జయించినాడు. ధాత ఆరు అక్షరముల చేత ఆరు రుతువులను జయించినాడు. మరుత్తులు ఏడు అక్షరములచేత ఏడు అక్షరముల శక్వరీ ఛందస్సును జయించినాడు. బృహస్పతి ఎనిమిది అక్షరములచేత ఎనిమిది అక్షరముల గాయత్రి ఛందస్సును జయించినాడు. మిత్రుడు తొమ్మిది అక్షరములచేత త్రివృత్ స్తోమమును జయించినాడు

**వరుణో దశాక్షరేణ విరాజ ముదజయత్. ఇంద్ర ఏకాదశాక్షరేణ త్రిష్టుభముదజయత్. విశ్వేదేవా ద్వాదశాక్షరేణ జగతీముదజయన్. వసవః త్రయోదశాక్షరేణ త్రయోదశగ్ం స్తోమ ముదజయన్. రుద్రాః చతుర్దశాక్షరేణ చతుర్దశగ్ం స్తోమముదజయన్. ఆదిత్యాః పంచదశాక్ష రేణ పంచదశగ్ం స్తోమ ముదజయన్. అదితిః షోడషాక్షరేణ షోడశగ్ం స్తోమ ముదజయత్. ప్రజాపతిః సప్తదశాక్షరేణ సప్తదశగ్ం స్తోమ ముదజయత్.**

(యజమాని ఈ మంత్రమును చదువవలెను.)

## పన్నెండవ అనువాకము

(అతిగ్రాహ్య మంత్రములు చెప్పబడినవి.)

**1.** ప్రథమాతిగ్రాహ్యామా! నీవు దారు నిర్మితవు. నదులలోను - వృక్షములందును భువనములలోను స్వామివి అయి ఉన్నావు. ఇంద్రునకు ప్రియమవు. ఈ ఖరప్రదేశము నీ స్థానము అగును. ఇంద్రుని కొరకు గాను నిన్ను ఖర స్థానమున ఉంచుచున్నాను.

(అతి గ్రాహ్యములలో ఒకదానిని ఖర ప్రదేశమున ఉంచవలెను.)

**2.** ద్వితీయాతిగ్రాహ్యామా! నీవు దారు పాత్రచే గ్రహించబడినావు. నీవు జలములందున్నావు ఘృతమునందున్నావు. ఆకాశమునందు ఉన్నావు. ఇంద్రునకు ప్రియమైన దానవు. ఈ ఖరము నీ స్థానమగును. ఇంద్రుని కొరకు నిన్ను ఖర స్థానమున ఉంచుచున్నాను.

(రెండవ దానిని ఖరమున ఉంచవలెను.)

**3.** **ఉపయామ గృహీతోఽసి పృథివిషదం త్వాఽన్తరిక్షసదం నాకసద మిన్ద్రాయజుష్టం గృహ్ణామ్యేషతే యోని రిన్ద్రాయత్వా**

**4.** అతిగ్రాహ్య పాత్రలు పంచజనులకు హితకరములు. ఆగ్నేయైంద్ర సౌర్యాఖ్యములగు అతిగ్రాహ్యములు వీనికి ప్రకృతులు. వీని ప్రభావముననే ద్యులోకమున పుట్టిన మేఘము వర్షాభిముఖము అగును. దవడలు వంటి అంచులు గల అతి గ్రాహ్యములు పూరించుటకు అన్నము వంటిదియు, బలము నిచ్చునదియునగు సోమమును గ్రహించుచున్నాను.

(నాలుగవ అతి గ్రాహ్యమును గ్రహించవలెను.)

**5.** చరమగ్రాహ్యమా! సోమము ఉదకరసము. ఉద్భూత అన్నము. సూర్యునిచే పక్వము చేయబడినది. గాయత్రి ద్యులోకము నుండి తెచ్చినది. సోమలత సారమైనది. అట్టిదానితో నిన్ను నింపుటకు - సోమమును - గ్రహించుచున్నాను. ఇది నీకు స్థానమగును. ఇంద్రుని కొరకు నిన్ను ఈ ఖర స్థానమునకు చేర్చుచున్నాను.

(అయిదవ అతిగ్రాహ్యమును గ్రహించవలెను.)

**6.** ప్రజాపతి ఇచట ఉన్నాడు. కర్మలను జరిపించుచున్నాడు. చక్కని కర్మఫలములకు విశాల ద్వారమగుచున్నాడు. ఆ ప్రజాపతి మాకు మధువు వంటి కర్మ ఫలమును కలుగచేయవలెను. మావద్దకు చేరుకొనవలెను. ప్రజాపతి తనను మాయందు చేర్చుచున్నాడు. కావున మేము కర్మ ఫలమును పొందుట నిశ్చయము.

**ఉపయామగ్రహీతో౽సి ప్రజాపతయే త్వా జుష్టం గృహ్ణామ్యేషతే యోనిః ప్రజాపతయేత్వా**

ప్రజాపతి దేవతాకమగు 17 గ్రహముల సముదాయమా! నీవు ప్రజాపతికి ప్రియమవు. ప్రజాపతి కొరకుగాను నిన్ను - నీ స్థానమగు ఖర ప్రదేశమున - ఉంచుచున్నాను.

## పదమూడవ అనువాకము

(యాజ్యా పురోనువాక్యలు)

**1.** చైత్రాది మాసములు ఇంద్రుని అనుసరించినవి. అవి మమ్ము అనుగ్రహించవచ్చినవి.

వనములు, ఓషధులు, పర్వతములు, మమ్ము అభిలషించు రోదసి, జలములు, ఇంద్రుని అనుసరించునవి. అవి మమ్ము అనుగ్రహించవచ్చినవి.

**2.** ఇంద్రా! నీవు యాగములందు ఉద్దేశించబడిన వాడవు. నీవు వృత్రుని వధించినావు. తదనంతరము నీకు బలము కలుగుటకు - క్షాత్రము కొరకు - వైరి తిరస్కార శక్తి కొరకు - గొప్పవాడైన నీ కొరకు యాగములందు హవిస్సులను అగ్ని మున్నగు దేవతల అనుక్రమమున సమర్పించుచున్నాము.

**3.** స్త్రీలలో ఇంద్రుని భార్య పతివ్రతయని విన్నాను. మరొక విషయము ఇంద్రాణి భర్తకు వార్ధక్యము మరణము లేకున్నవి.

**4.** ఇంద్రాణీ! సోమ పురోడాశాదులు నీట పుట్టినవి. అవి దేవతలకు అందించవలసి ఉన్నది కాని నేను నీకు ప్రియమైన ఇంద్రుని తప్ప ఇతర దేవతలను కీర్తించుటయే లేదు.

**5.** ఇంద్రుడు పుట్టినంతనే ముఖ్యుడు అయినాడు. ధైర్యవంతుడు అయినాడు. వృత్రుని వధించుట వంటి పనులు చేసినాడు. అగ్న్యాది దేవతలను అతిక్రమించినాడు. ఇంద్రుని బలమునకు ద్యావాపృథ్వులు గడగడలాడినవి. అటువంటి ఇంద్రుడు - తన బల మహిమచే - మిమ్ము రక్షించునుగాక.

**6.** ఇంద్రా! నీవు ఉగ్రుడవు. నీ రక్షణలు పటిష్ఠములు. నీ అనుగ్రహము కలిగినది. మా సేనలు శత్రువులతో యుద్ధము ప్రారంభించినవి. నీవు నరులతో చేరినపుడు నీ చేతులందలి కరవాలాదుల కాంతులు సర్వత్ర వ్యాపించుచున్నవి. నీ మనసు బహుముఖము కాకుండును గాత. మాయందే ఉండునుగాక.

**7.** ఇంద్రా! నీవు మమ్ము - మా ప్రజలను జగడాలమారులను చేయకుము. నీవద్ద - నీకు హవిస్సునిచ్చు - యజమానికి ఇచ్చుటకు కూడ పెట్టిన ధనమున్నది. దానిని తెచ్చి మా కొసంగుము ఈ యజ్ఞము నవీనము. నీకు దాన సాధనము. ప్రశస్తము. ఇందు మేము స్తోత్రములచే నుతించుచున్నాము. ప్రార్థించుచున్నాము.

**8.** ఇంద్రా! నీవు ధనవంతులకు ధనపతివని విన్నాము. కావున నీవు ధనముతో విచ్చేయుము ఈ ధనము అన్యులకు చేరరాదు. నీవు హర్యశ్వములమీద ధనము తెమ్ము. మాకిమ్ము.

**9.** ప్రదాత అయిన ఇంద్రుని హవియుక్తులమైన మేము ఆహ్వానించుచున్నాము.

ఇంద్రా! నీవు రెండు చేతులందు ధనము నింపుకొని రమ్ము. మాకు కుడి, ఎడమ రెండు చేతులతో ధనము నిమ్ము.

**10.** ఇంద్రా! నీవు దానగుణము కలవాడవు. వజ్రాయుధము కలవాడవు. వర్షించువాడవు శత్రుంజయుడవు. బలవంతుడవు. ప్రకాశించువాడవు. వృత్రహంతవు. సోమపాయివి. నీవు యజ్ఞమునకు విచ్చేయుము. వేది మీద దర్భలు పరిచినాము. ఆసీనుడవు అగుము. మాకు సుఖములను కలిగించుము. దుఃఖములు తొలగించుము.

**11.** ఇంద్రుడు మాకు గట్టి రక్షకుడు. ధనవంతుడు. సుఖదాయి. అతడు మా సపర్యలు మున్నగు వానిని గ్రహించవలెను. ఇంద్రుడు మమ్ము బాధించు శత్రువులను ద్వేషించును. అతడు మాకు అభయము నీయవలెను. మమ్ము శత్రు పరాభవ సమర్థులను చేయును గాత.

**12.** మేము ఇంద్రుని సుమతియందును, మంగళకరమగు సుమనస్సునందును నిలుతుము గాత. ఇంద్రుడు చక్కని రక్షకుడు, ధనవంతుడు. మేము అతనికి హవిస్సులు అర్పించు వారలము. అతడు మమ్ము ద్వేషించు శత్రువును దూరదేశముననే నిలిపి ఉంచును గాత.

**13.** జలములు సంపన్నములు. మాకు సంతసము కలిగించునవి. ఎంతో అన్నము కలవి. మేము అట్టి ఉదకములను స్తుతించుచున్నాము. ఆనందించుచున్నాము. మాకు స్వామియగు ఇంద్రునకు జలములు సుఖప్రదములు అగును గాత.

**14.** "ఇంద్రుడు అరిభయంకరుడు. యుద్ధములందు ఎదుటివానితో పోరును. వానిని హతమార్చనుంకించును. అయినను తడబడడు. స్థిరముగా నుండును. పారిపోడు"

అట్లని ఇంద్రుని రథము ఎదుట ఇంద్రుని అర్చించవలెను. ఆ విధముగ పూజింపబడిన ఇంద్రుడు మాకు ఇతర వ్యావృత్తికి ప్రేరకుడై సావధానుడు అగును గాత. శత్రువుల ధనుస్సుల అల్లెత్రాళ్లు తెగిపోవును గాక.

శ్రీమదాంధ్రవచన కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత
మొదటి కాండము నందలి ఏడవ ప్రపాఠకము సమాప్తము.

యస్తేస్తనః శశయో యోమయో భూర్యోరత్నధా వసువిద్యాః సుదత్రః ।
యేనవిశ్వాపుష్యసి వీర్యాణి సరస్వతి తమిహదాతవోఽకః ఉర్వ న్తరిక్షమన్వేమి ।

## ఎనిమిదవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

(ఈ ప్రపాఠకమున రాజసూయము విధించబడుచున్నది. 1 - 20 అనువాకములందు ప్రధాన కర్మలు - 21,22 అనువాకములందు సౌత్రామణి మంత్రములు, యాజ్యాపురోనువాక్యలు చెప్పబడినవి.)

**1.** అనుమతి దేవతకు అష్టకపాలములందు సంస్కరించబడిన పురోడాశ హవిస్సును ఉంచవలెను ధేనువును దక్షిణగా నీయవలెను. బియ్యము విసరుచుండగా శమ్యకు తూర్పుదిశన పడిన పిండిని పురోడాశము చేసి సంస్కరించి అష్టకపాలములందుంచి అనుమతి దేవతకు నిర్వాపము చేయవలెను ఇది ఒక కర్మ.

నిర్రుతి దేవతకు ఏక కపాలమున సంస్కరించబడిన పురోడాశ హవిస్సును ఉంచవలెను నల్లని బట్ట దక్షిణగా ఈయవలెను. బియ్యము విసరుచుండగా తూర్పు దిక్కున పడిన పిండిని పురోడాశము చేసి, సంస్కరించి ఏక కపాలమునందుంచి నిర్రుతి దేవతకు నిర్వాపము చేయవలెను ఇది రెండవ కర్మ.

**2.** గార్హపత్యాగ్నీ! నీకు హవిస్సు సమర్పించినాము. స్వీకరించుము. మేము దక్షిణమునకు వెళ్లదలచినాము. మమ్ము విడువుము.

నిర్రుతి దేవతా! ఈ ఏక కపాలమునందు సంస్కృత పురోడాశము నీకు సమర్పించినాము. సంతృప్తి చెందుము. నీవే మాసంపదకు కారణమవు. హవిస్సును అందుకున్నావు. కావున ఈ యజమానికి దారిద్ర్యము, పాపముల నుండి విముక్తి కలిగించుము.

గార్హపత్యాగ్నిని విడువమని ప్రార్థించినాము. అట్లే విడిచినాడు. అతనికి స్వాహా. అతనికి నమస్కారము.

(1. స్రువముతో గార్హపత్యాగ్నికి హోమము చేయవలెను. 2. నిర్రుతి దేవతకు అంగుష్ఠములచే హోమము చేసి నల్లని బట్ట సమర్పించవలెను. 3. స్రువముచే గార్హపత్యాగ్ని యందు హోమము చేయవలెను. నమస్కరించవలెను. ధేనువును దక్షిణగా ఇవ్వవలెను.)

3. ఆదిత్యునకు చరువనెడి హవిస్సును సమర్పించవలెను. గోవును దక్షిణగా ఇవ్వవలెను.

అగ్ని విష్ణువులకు పదకొండు కపాలములందు సంస్కృత పురోడాశమును సమర్పించవలెను. పొట్టిది, బరువులు మోయు ఎద్దును దక్షిణగా ఇవ్వవలెను.

అగ్ని షోమ దేవతకు పదకొండు కపాలములందు సంస్కృత పురోడాశమును సమర్పించవలెను. బంగారమును దక్షిణగా ఇవ్వవలెను.

ఇంద్రునకు పురోడాశమును అట్లే సమర్పించవలెను. దక్షిణగా బరువులు మోయు ఆబోతును ఇవ్వవలెను.

అగ్ని, ఇంద్రులకు ఎనిమిది కపాలములందు సంస్కరించబడిన పెరుగును సమర్పించవలెను. బరువులు మోయు ఆబోతును దక్షిణగా ఇవ్వవలెను.

ఇంద్రాగ్నులకు, విశ్వేదేవతలకు పన్నెండు కపాలములందు సంస్కరించబడిన చరువును సమర్పించవలెను. తొలిచూలు దూడను దక్షిణగా ఇవ్వవలెను.

సోమదేవతకు నల్లని ధాన్యపు చరును సమర్పించవలెను. వస్త్రము దక్షిణగా ఇవ్వవలెను.

సరస్వతికి చరు హవిస్సును సమర్పించవలెను. గోవుల జతను దక్షిణగా ఇవ్వవలెను.

(ఇంద్ర, అగ్ని, సోమ, వైశ్వ దేవయాగము ఒక్కటియే అగును. అప్పుడు యాగములు ఏడు అగును.)

## రెండవ అనువాకము

అగ్ని సోమ దేవతాకములకు ఎనిమిది పాత్రలందు చరు సమర్పించవలెను. సావిత్రి, సరస్వతీ దేవతాకమునకు పన్నెండు పాత్రలందు 'చరు' సమర్పించవలెను. పూష, మరుద్దేవతాకములకు ఏడు పాత్రలందు 'చరు' సమర్పించవలెను. విశ్వేదేవతాకము, ద్యావాపృథ్వీదేవతాకమునకు ఒకే పాత్రలో 'అమిక్ష' సమర్పింపవలెను.

## మూడవ అనువాకము

1. ఇంద్రాగ్ని దేవతాకమునకు పదకొండు పాత్రలందు పురోడాశమును - మరుద్దేవతాకమునకు అమిక్షను - వరుణ దేవతాకమునకు అమిక్షను సమర్పించవలెను. ప్రజాపతి దేవతాకమునకు ఒక పాత్రయందు పురోడాశము నిర్వాపము చేయవలెను.

2. మరుత్తులు వరుణ పాశములను త్రెంచగలవారు. యజ్ఞభారము వహించువారు. పెరుగు కలిపిన సత్తు నందు ప్రీతి గలవారు. అట్టి మరుత్తులను హవామహే ఆహ్వానించుచున్నాము.

(ప్రతి ప్రస్థాత యజమాన పత్నిని ఆహ్వానించవలెను.)

**3.** ఇంద్రా! మాతో యుద్ధములు చేయించకుము. నీవు బలవంతుడవు. వర్షము కలుగ చేయువాడవు. మా భూములు అన్ని పంటలకు అనుకూలమై ఉన్నవి. అందువలన మాకు అనిష్టము కలుగకుండునుగాక.

మాస్తుతి - కరంభ పాత్రరూప హవిర్యుక్తులైన - మరుత్తులకు నమస్కరించుచున్నది.

(1. యజమాని దంపతులు కరంభ పాత్ర గల శూర్పమును నెత్తికి ఎత్తుకొనవలెను. తదుపరి దక్షిణాగ్ని యందు కరంభమును హోమము చేయవలెను. 2. నేయి కలిపిన సత్తు కరంభము.)

**4.** కరంభ పాత్ర సముదాయమా! మేము గ్రామ, అరణ్య, ఇంద్రియ, శూద్ర, ఆర్య, వైశ్యుల విషయమున చేసిన పాపములను - దంపతుల మధ్య ధర్మ విషయమున చేసిన పాపములను నాశము చేయుము.

(హోమము చేయవలెను.)

**5.** అధ్వర్యుడు మున్నగు వారు మంత్రోచ్చారణ చేసినారు. సుఖములు కలుగుటకు కరంభపాత్ర హోమాంతము వరకు గల కర్మ ముగించినారు. హవిస్సులు అందించు అధ్వర్యాదులారా! కర్మ పూర్తి చేసి మీ ఇండ్లకు వెళ్లండి.

**నాలుగవ అనువాకము**

(సాకమేధము చెప్పబడుచున్నది.)

**1.** సూర్యోదయమున సైన్యవంతుడగు అగ్నికి ఎనిమిది పాత్రలందు పురోడాశమును సమర్పించవలెను. మరుద్దేవతలు అనిష్టనివారకులు. వారికి మధ్యాహ్నము చరు సమర్పించవలెను. గృహమేధులగు మరుద్దేవతలకు సాయం సమయమున, గోవులకు పాలు పితుకునపుడు - చరు నిర్వాపనము చేయవలెను.

(**ఓదనో హి చరుః** అని శతపథము, చరు అనగా అన్నము లేక వంటకము.)

**2.** దర్వీ! నీవు శరనిష్కాసముతో నిండుము. ఇంద్రుని వద్దకు చేరుము. అచట ఇంద్రుని అనుగ్రహమును నింపుకొనుము మరలి రమ్ము.

ఇంద్రా! మేము ధనము వంటి శరనిష్కాసము సమర్పించినాము. ధనమును, బలమును **క్రీణావహై** - కొనుచున్నాము.

(1. దర్వి - కొయ్యతో చేసిన గరిట వంటిది. 2. శర నిష్కాసము - చరు ఉడుకు చుండగా పైకి తేలిన గట్టి పదార్థము. 3. కొనుచున్నాము అనుట వలన వస్తువినిమయము అయినది.)

**3.** ఇంద్రా! నేను కోరినది నీవు నాకు ప్రసాదించుము. నీవు కోరినది నేను నీకు అర్పించెదను నీవు నాకు ప్రసాదించినది నావద్ద ఉంచుము. నేను నీకు అర్పించినది నీవద్ద ఉంచెదను. ఇది ఒక్కసారి కాదు. తేపతేప జరుగు చుండవలెను. నీవు తెచ్చినది నావద్ద ఉంచుము. నేను తెచ్చినది నీవద్ద ఉంచెదను.

**4.** క్రీడావంతులగు మరుద్దేవతాకము - సూర్యోదయమున ఏడు కపాలములందు - అగ్ని దేవతాకమునకు ఎనిమిది కపాలములందు పురోడాశమును సమర్పించవలెను. సోమదేవతాకమునకు చరును - సవితృ దేవతాకమునకు పన్నెండు కపాలములందు - సరస్వతి దేవతాకమునకు, పూష దేవతాకమునకు చరు సమర్పించవలెను. ఇంద్రాగ్నులకు పదకొండు కపాలములందు పురోడాశమును - ఇంద్రునకు చరును - విశ్వకర్మ దేవతాకమునకు ఒక కపాలమున పురోడాశమును సమర్పించవలెను.

(చాతుర్మాస్యమున ఇవి రెండవ దినపు మంత్రములు.)

### అయిదవ అనువాకము

(మహా పితృ యజ్ఞము చెప్పబడుచున్నది.)

**1.** పితృ స్వామి యగు సోమ దేవతకు ఆరు కపాలములందు పురోడాశమును - యజ్ఞము నందుండునట్టి పితృ దేవతలకు వేపిన యవలు - యజ్ఞ నిష్ఠులు కాని పితృ దేవతలకు దూడ చచ్చిన ఆవు పాల యందు యవల పిండి సమర్పించవలెను.

**2.** పితృదేవా! నీ కొరకు ఈ అన్న పిండమును - నిన్ను అనుసరించి ఉన్నవారి కొరకు అన్న పిండమును ఇచ్చుచున్నాను.

పితామహా! నీ కొరకు ఈ అన్న పిండమును - నిన్ను అనుసరించినవారి కొరకు ఈ అన్న పిండమును ఇచ్చుచున్నాను.

ప్రపితామహా! నీ కొరకు ఈ అన్న పిండమును - నిన్ను అనుసరించిన వారి కొరకు ఈ అన్న పిండమును 'దత్తమ్'

(ఒకటవ మంత్రము నందు వలె పైతృక హవిస్సులు మూడును హోమము చేయవలెను. మిగిలిన అన్నమును కలిపి పిండములు చేసి పితృ దేవతల కొసంగవలెను.)

**3.** పితృ, పితామహ, ప్రపితామహదేవతలారా! మీకు పిండములను ఇచ్చినాము. మీ భాగములు అందుకొనండి. సంతుష్టులు కండి.

(ఉత్తర దిక్కుగా నిష్క్రమించవలెను.)

**4.** ఇంద్రా! నీవు నన్ను కటాక్షించినావు. నేను నీకు హవిస్సులు ఇచ్చినాను. తృప్తి చెందించినాను. నీవు హర్యశ్వములను రథమునకు పూన్చుము. రథపు వెనుక భాగమును ధనముతో నింపుము. నిన్ను స్తుతించు చున్న మా వద్దకు తరచుగా వచ్చు చుండుము.

(ఆహవనీయాగ్నిని సేవించవలెను.)

**5.** పితరులు మేము సమర్పించిన హవిస్సులను ఆరగించినారు. ఆనందించినారు. తలలు ఊపినారు. తేజస్సుచే ప్రకాశించినారు. బ్రాహ్మణుల వలె భోజనమునకు సంతసించినారు. బాపల వలెనే కీర్తించినారు.

**6.** పితరులు హవిస్సులను ఆరగించినారు. పితరులు ఎంతో సంతోషించినారు. పితరులు మమ్మ సంతోష పరచినారు. పావనము చేసినారు.

**7.** పితృదేవతలారా! మీరు సౌమ్య మనస్కులు. మీ మార్గములు అన్న సమృద్ధములు. సనాతనములు. మీరు ఆ మార్గముననే మీ స్థానములకు చేరుకొనండి. అచట పూర్వ పితరులు ఉన్నారు. వారు యమునితో సహ స్థానమున ఉంటారు వారు ఆనందించు చుందురు. అచటి సంగతులు తెలిసి ఉందురు. మీరు వారిని కూడి ఉండండి.

(8 - 11 నాలుగు మంత్రములచే పితృ దేవతలను సేవించవలెను.)

**8.** మా మనస్సులు నరుల ప్రశంసాపాత్రములు కావలెను. పితృదేవతల మనసులను మురిపించునవి కావలెను. మేము అట్టి మనసులను ఆహ్వానించుచున్నాము.

**9.** కర్మానుష్ఠానము కొరకు - అందుకు వలసిన సామర్థ్యము కొరకు - మేము జీవించుకొరకు - చిరకాలము సూర్యుని సందర్శించు కొరకు యోగ్యమగు మనసు మరల మరల మమ్ము చేరును గాక.

**10.** పితృ దేవతలారా! దివ్య జనులు మాకు మంచి మనసులు ప్రసాదింతురుగాక. మేము ఎన్నో ఏండ్ల జీవితము గడుపుదుముగాక.

**11.** మేము అంతరిక్షము, భూమి, ద్యులోకమున బాధించకోరినను - తలిదండ్రులను బాధించ కోరినను - గార్హపత్యాగ్ని మమ్మ అట్టి పాపముల నుండి విముక్తులను చేయును గాత. ఏ ఇతర పాపములు చేసినను వాటి నుండి విముక్తి కలిగించునుగాక. నన్ను సర్వ పాప విముక్తుని చేయునుగాక.

(కొన్ని సందర్భములందు సంకల్పము కూడ పాపము అగుచున్నది. ఇచట చేయకోరిన, చేసిన పాపముల నుండి విముక్తి కోరబడుచున్నది.)

## ఆరవ అనువాకము

(త్ర్యంబక పురోడాశములు చెప్పబడుచున్నవి.)

1. ప్రతి పురుషుని ఉద్దేశించి ఏక కపాల పురోడాశమును అర్పించవలెను. ఏక కపాల పురోడాశము సమధికము.

2. ఆ విధముగా చేయుట వలన ఇంట నున్న యావన్మందికి సుఖము కలిగించిన వాడను అయినాను.

3. మూతమా! నీవు పశువులు తిను గడ్డి మున్నగు వాని కట్టవు. పశువులకు సుఖకరము అగుచున్నావు. యజమాని మరియు అధ్వర్యుడనగు నాకును సుఖకరమవగుము.

4. లోకములందు రుద్రుడు ఒక్కడే ఉన్నాడు. మరొక రుద్రుడు లేడు.

5. రుద్రదేవా! నీకు ఎలుక ప్రియమైనది. కావున ఎలుకను స్వీకరించుము.

(అధ్వర్యుడు తాను ద్వేషించువానిని తలచుకొని ఎలుక కన్నమున పురోడాశము వేయవలెను )

6. రుద్రదేవా! మోదుగు ఆకునందుంచిన ఈ పురోడాశము నీ భాగమగును. దీనిని - తోబుట్టువు వలె హితకారిణియగు - పార్వతి సహితుడవై సేవించుము.

(పురోడాశమును మోదుగు ఆకుతో కొద్దికొద్దిగా తీసికొని హోమము చేయవలెను )

7. మా గోవులకు, అశ్వములకు, మేషములకు, ప్రజలకు, మాకు తాత్కాలిక లేక శాశ్వత వ్యాధులకు ఉపశమనము కలిగించుము. ఆరోగ్యవంతులను చేయుము.

(నాలుగు బాటల కూడలి వద్ద అగ్నికి పరిషేచనము చేయవలెను.)

8. పార్వతీ! అంబే! రుద్రుడు మమ్ము అధ్యయనాదులచే శ్రేష్ఠులను - ధనవంతులను - గవాశ్వాది పశువువంతులను - జ్ఞానయుక్తులను చేయమని ప్రార్థించుచు ముక్కంటి రుద్రునకు పురోడాశము సమర్పించినాము.

(యజమాని జపించవలెను.)

9. రుద్రుడు ముక్కంటి. సుగంధి. ధనపుష్టిని, దేహపుష్టిని వర్ధిల్లచేయువాడు. తొడిమ నుండి దోసపండు స్వయముగనే విడిపోవును. అట్లే నేను మృత్యు విముక్తుడను అగుదునుగాక. మరణము లేని చిరంజీవిత్వము నుండియు, స్వర్గాదికములనుండియు విముక్తుడను కాకుందునుగాక.

(అగ్నికి మూడు ప్రదక్షిణలు చేయవలెను.)

**10.** రుద్రదేవా! చెట్టు మీద పురోడాశములు ఉంచినాము. అవి నీయొక్క భాగము అగును. అవి నీకు పాథేయము వంటివి. వానిని అందుకొనుము. 'మూతో' పర్వతము దాటుము. సాగిపొమ్ము.

**11.** ఇతడు పినాకపాణి. చర్మధారి. మమ్ము రక్షించుటకు అల్లెత్రాటిని లాగినాడు. బాణము సంధించినాడు.

## ఏడవ అనువాకము

(ఇంద్ర తూర్యము, ఇధ్మీయము, అపామార్గము చెప్పబడినవి.)

**1.** ఇంద్రాగ్ని దేవతాకమునకు 12 కపాలములందు పురోడాశము - విశ్వేదేవతాకమునకు చరు - వాయువు ఆదిత్యులతో కూడిన ఇంద్రునకు 12 కపాలములందు పురోడాశము - వాయు దేవతాకమునకు క్షీరము - సూర్య దేవతాకమునకు ఏక కపాలమున పురోడాశమును నిర్వాపము చేయవలెను. 12 ఎద్దులు లాగు నాగలిని దక్షిణగా ఇవ్వవలెను.

**2.** అగ్ని దేవతాకమునకు 8 పాత్రలందు పురోడాశము రుద్ర దేవతాకమునకు అరణ్యాధాన్య చరు - ఇంద్ర దేవతాకమునకు దధి - వరుణ దేవతాకమునకు యవ ధాన్య చరును సమర్పించవలెను. వీపున బరువు మోయు ధేనువును దక్షిణగా ఇవ్వవలెను.

**3.** తూర్పు దిక్కున అగ్ని ప్రముఖులగు దేవతలు రాక్షసులను సంహరించువారై ఉన్నారు దక్షిణ దిశన యమ ప్రముఖులగు దేవతలు రాక్షసులను సంహరించువారై ఉన్నారు. పశ్చిమ దిశన సవితృ ప్రముఖ దేవతలు రాక్షసులను సంహరించు వారై ఉన్నారు. ఉత్తర దిశన వరుణ ప్రముఖులగు దేవతలు రాక్షసులను సంహరించువారై ఉన్నారు. ఊర్ధ్వ దిశన బృహస్పతి ప్రముఖులగు దేవతలు రాక్షసులను సంహరించువారై ఉన్నారు.

ఆ దేవతలు రాక్షసులను నివారించి మమ్ము రక్షింతురుగాక. **తేభ్యః నమః తేభ్యః స్వాహా.** వారికి నమస్కారము. వారికి ఆహుతి.

**4.** రాక్షస సముదాయమునంతను ఏకముగా దగ్ధము చేయబడినది. నేను రాక్షసుల అనుచరులను సహితము పూర్తిగా తగుల పెట్టినాను.

**5.** రక్షోఘ్న - రాక్షస సంహారకుడగు అగ్నయే - అగ్నికి స్వాహా. రక్షోఘ్న యమాయ స్వాహా. రక్షోఘ్న సవిత్రే స్వాహా. రక్షోఘ్న వరుణాయ స్వాహా - రక్షోఘ్న దువస్వతే. పరిచర్యలందుకొను బృహస్పతయే స్వాహా.

**6.** అశ్వతయము లాగు రథము దక్షిణ యగును.

7. హవి పదార్థమా! రాక్షసవధ కొరకు నాకు సవిత ప్రేరణ కలిగించుచున్నాడు. అశ్వినుల బాహువుల తోను - పూష హస్తములతోను నిన్ను హోమము చేయుచున్నాను. రాక్షసులు హతులైనారు. రాక్షసులను సంహరించినాను.

8. హోమ కాలమున ఆచ్ఛాదనముగా ఉండిన వస్త్రములను దక్షిణగా ఇవ్వవలెను.

## ఎనిమిదవ అనువాకము

(ఏకదిన కర్తవ్యమగు కర్మషట్కము చెప్పబడినది.)

1. ధాతృ దేవతాకమునకు 12 పాత్రలందు పురోడాశమును - అనుమతి దేవతాకమునకు చరును - రాకా దేవతాకమునకు చరు - సినీవాలి దేవతాకమునకు చరు - కుహూ దేవతాకమునకు చరు నిర్వాపనము చేయవలెను. ఆబోతు, గోవు, విధునమును దక్షిణగా ఇవ్వవలెను.

2. అగ్ని విష్ణు దేవతాకమునకు 11 కపాలములందు పురోడాశము - ఇంద్ర విష్ణు దేవతాకమునకు 11 కపాలములందు పురోడాశము - విష్ణువునకు మూడు కపాలములందు పురోడాశమును సమర్పించవలెను. పొట్టిది బరువులు మోయు ఎద్దు దక్షిణ అగును.

అగ్ని సోమ దేవతాకమునకు 11 కపాలములందు ఇంద్ర సోములకు 11 కపాలములందు పురోడాశము అర్పించవలెను. సోమ దేవతాకమునకు చరు నిర్వాపనము చేయవలెను. కపిల వర్ణ గోవు దక్షిణ యగును.

సోమ పూష దేవతాకమునకు, ఇంద్ర పూష దేవతాకమునకు, పూష దేవతాకమునకు వేరు వేరుగా చరు సమర్పించవలెను. నల్లని ఎద్దు దక్షిణ అగును.

వైశ్వానర దేవతాకమునకు 12 పాత్రలందు పురోడాశమును సమర్పించవలెను. బంగారము దక్షిణ అగును.

వరుణ దేవతాకమునకు యవల చరు నిర్వాపనము చేయవలెను. అశ్వము దక్షిణ యగును.

## తొమ్మిదవ అనువాకము

(ప్రతిదినము ఆచరించవలసిన 'రత్ని' హవిస్సులు చెప్పబడినవి.)

1. i) 'బ్రహ్మ' అను ఋత్విజుని గృహమున బృహస్పతి దేవతాక చరును సమర్పించవలెను. తెల్లని వీపు గల గోవు దక్షిణ.

ii) రాజు గృహమున ఇంద్రునకు 11 కపాలములను సమర్పించవలెను. ఋషభః దక్షిణా.

iii) పట్టమహిషి ఇంట వద్ద అదితి దేవతాక చరును సమర్పించవలెను. ధేనుః దక్షిణా.

iv) ప్రేమలేని రాజు భార్య ఇంట నల్లని ధాన్యమును గోళ్లచే విడదీసి వండిన చరుసు నిర్బతి దేవతాకమునకు సమర్పించవలెను. నల్లని కొమ్ముల ఆవు దక్షిణ.

v) సేనాని గృహమున అగ్నికి అష్టకపాలములు అర్పించవలెను. హిరణ్యమ్ దక్షిణా.

vi) సారథి గృహమున వరుణ దేవతాకమునకు దశకపాలం నిర్వపతి. వట్టకొట్టిన ఎద్దు దక్షిణ.

vii) గ్రామాధికారి గృహమున మరుద్దేవతాకమునకు సప్త కపాలమ్ పురోడాశం నిర్వపతి. తెల్లని గోవు దక్షిణ.

viii) అంతః పురాధ్యక్షుని గృహమున సవిత్రు దేవతాకమునకు ద్వాదశ కపాలమ్ నిర్వపతి. కలగలుపు రంగు గోవు దక్షిణ.

ix) కోశాధ్యక్షుని గృహమున అశ్వినీ దేవతాకమునకు ద్వికపాలమ్ పురోడాశం నిర్వపతి. ఒకే ఆవుకు పుట్టిన రెండు దూడలు దక్షిణ.

x) పన్ను వసూలు చేయువాని గృహమున పూష దేవతాకమునకు చరుమ్ నిర్వపతి. నల్లని గోవు దక్షిణ.

xi) ద్యూతకారుని గృహమున రుద్ర దేవతాకమునకు గోధూమచరుమ్ నిర్వపతి. రంగుల రంగుల దేహము, పొడవైన తోక గల ఆవు దక్షిణ.

(ఇందు రాజ సూయమునకు సంబంధించిన పదకొండు హవిస్సులు - ఇష్టులు చెప్పబడినవి. ఇవి ఆయా వ్యక్తుల - అధికారుల గృహముల వద్ద ఇవ్వవలసినవి. ఇందు రాజ్యపు అధికారులు స్పష్టము. మంత్రులు లేకుండుట గమనించవలెను.

ఒక్కొక్కరి ఇంటి వద్ద హవిస్సులు ఇచ్చుట వలన ఆయా దేవతలు సంతుష్టులు అగుదురు. వారు రాజ్యమునకు మేలు కలిగింతురు.

ఇవి రత్న హవిస్సులు.)

2. ఇంద్రుడు చక్కగా పాలించువాడు. పాప విమోచకుడు. స్వగృహమున ఇంద్ర దేవతాకమునకు **ఏకాదశ కపాలమ్ పురోడాశం నిర్వపతి.**

3. **అయంనోరాజా వృత్రహారాజాభూత్వావృత్రం వధ్యాత్**

ఇతడు మా రాజు. ఇతడు వృత్ర హంతరాజగు ఇంద్రుడు కావలెను. శత్రువులను వధించవలెను. (అధ్వర్యుడు స్విష్టకృదగ్ని వద్ద ఈ మంత్రమును జపించవలెను.)

**4.** పాత్ర చతురస్రము కావలెను. దానిని రాలిపడిన రావి కొమ్మ నుండి మాత్రమే చేయవలెను - చెట్టును కొట్టరాదు. ఆ పాత్ర యందు తెల్లని దూడ గల తెల్లని ఆవు స్వయము ఇచ్చిన పాలను - తనకు తాను చిలుకగా వచ్చిన నేతిని ఉంచవలెను. అది మిత్ర, బృహస్పతి దేవతాకమగు హవిస్సు అగుచున్నది.

ఆ హవిస్సు కొరకు నూకలను, బియ్యమును వండవలెను. నూకలు పాలయందు పక్వము చేసిన చరు బృహస్పతి దేవతాకము అగును. బియ్యమును నేతియందు ఉడికించిన చరు మిత్ర దేవతాకము అగును.

ఇందు వేది స్వయంకృతము - బర్హిస్సు స్వయందినము - ఇధ్మము స్వయంకృతము అగుచున్నది.

తెల్లని దూడగల తెల్లని గోవు దక్షిణ అగుచున్నది.

(ఈ మంత్రమున 'స్వయం' అను పదము పలుమారులు వచ్చినది. స్వయం అనగా ఆంగ్లమున Auto అగును. తమంతట తాము చేసికొనిపోవు సాధనములు ఏవో ఉన్నట్లున్నవి. పాలు పిండుట, వెన్నతీయుట స్వయముగా ఈనాడు యంత్రములు చేయుచున్నవి. అట్టివి ఆనాడు ఉండెనా? అను విషయము పరిశోధించవలసి ఉన్నది.)

**పదవ అనువాకము**

(దేవసూ హవిస్సులు చెప్పబడినవి.)

**1.** i) **గృహపతియగు అగ్నయే అష్టకపాలమ్ వ్రీహీణామ్** - నల్ల ధాన్యమునకు సంబంధించిన - **పురోడాశమ్ నిర్వపతి.**

ii) **వనస్పతయే సోమాయ శ్యామాకమ్** - చామ ధాన్య సంబంధి - **చరుమ్ నిర్వపతి.**

iii) **సత్య ప్రసవాయ సవిత్రే ద్వాదశకపాలమ్ ఆశూనాం వ్రీహీణామ్** - అరువది దినముల పంట ధాన్యపు - **పురోడాశమ్ నిర్వపతి.**

iv) **పశుపతయే రుద్రాయ గోవీధుకమ్** - అడవి గోధుమల - **చరుమ్ నిర్వపతి**

v) **వాచస్పతయే బృహస్పతయే నైవారమ్** - నీవార సంబంధ - **చరుమ్ నిర్వపతి.**

vi) **జ్యేష్ఠాయ ఇంద్రాయ ఏకాదశ కపాలమ్ మహా వ్రీహీణామ్** - స్థూల బీజ ధాన్య సంబంధి - **పురోడాశమ్ నిర్వపతి.**

vii) **సత్యాయ మిత్రాయ అమ్బానామ్ చరుమ్ నిర్వపతి**

viii) **ధర్మ పతయే వరుణాయ యవమయమ్ చరుమ్ నిర్వపతి.**

**2.** **యజమానీ త్వామ్** - నిన్ను, సవితా, **ప్రసవానామ్** - భృత్యాదులకు, **స్వామిత్వేన** - ప్రభువుగా, **సువతామ్** - గుర్తించునుగాక.

**గృహనామ్ స్వామిత్వేన అగ్నిః సువతామ్. వనస్పతీనామ్ స్వామిత్వేన త్వాం సోమః సువతామ్. రుద్రః త్వాం పశూనాం స్వామిత్వేన సువతామ్. బృహస్పతిః వాచాం స్వామిత్వేన త్వాం సువతాం. ఇంద్రః జ్యేష్ఠానాం స్వామిత్వేన త్వాం సువతామ్. మిత్రః త్వామ్ సత్యానాం స్వామిత్వేన సువతామ్. వరుణః త్వామ్ ధర్మపతీనాం స్వామి త్వేన సువతామ్.**

దేవతలారా! మీరు దేవసువః యజమానికి ప్రేరణ కలిగించువారు. ఈ యజమానిని యజ్ఞదత్తుని పౌత్రునిగను, దేవదత్తుని పుత్రునిగను- శత్రురహితునిగను గుర్తించండి.

**మహతేక్షత్రాయ** - మహాక్షాత్రము కొరకును, **మహతే ఆధిపత్యాయ** - మహా ఆధిపత్యము కొరకును, **మహతే జాన రాజ్యాయ** - మహా సామ్రాజ్యము కొరకును గుర్తించండి.

**3.** వైశ్యాది సంపన్నులారా! ఇతడు మీకు రాజు.

**4.** **సోమాఽస్మాకం బ్రాహ్మణానాగ్ం రాజా** - బ్రాహ్మణులమగు మాకు సోముడు రాజు.

**5.** ఈతడు మహారాజ్యాదులందు వరుణునిచే ప్రతిష్ఠించబడినాడు. వరుణుడే దానిని ఆశ్రయించునుగాక.

మమ్ము మిత్రుడు అనుమతించినాడు. మేము పావనులము అయినాము. కర్మ యోగ్యులము అయినాము. అందువలననే మేము రాజసూయ యాగమును తలచుకొనువారము అయినాము.

ఋత్విజులెల్లరు వరుణుని అనుమతిచే కర్మయోగ్యులు అయినారు. మిత్ర దేవుడు విచ్చేసి మేము శత్రువులను పారద్రోలునట్లు చేసినాడు. ఋత్విజులు యజ్ఞము చేత మమ్ము రక్షించినారు. ఈ అగ్ని బ్రాహ్మణాది వర్ణత్రయము చేత విస్తరింపచేయబడినది. ఇతడు మాకు - వార్ధక్య దోషములను పోగొట్టి - ఆయువును కలిగించినాడు.

**6.** **విష్ణోఃక్రమోఽసి విష్ణోఃక్రాన్తమసి, విష్ణోర్విక్రాన్తమసి**

1 - 7 - 7 - 7 చూడండి.

## పదకొండవ అనువాకము

(అభిషేకార్థ జలమంత్రములు చెప్పబడినవి.)

సరస్వతీ నదీ జలములారా! మీరు ఏదో ప్రయోజనార్థము ప్రవహించుచున్నారు. సముద్రుడా! నీవు జలములకు పతివి అగుచున్నావు. జలతరంగమా! నీవు నీరు పారించు దానవు అగుచున్నావు జలరాశియను సేన గలదానవు అగుచున్నావు.కూపము నందలి జలములారా! మీరు బావి యందు నిలిచి ఉన్నారు. వంకర నడకల ఉదకములారా! మీరు వాయువులకు బలరూపములు అగుచున్నారు. (గాలికి నీరు వంకర నడక సాగించును.) ఎండా వానలు కూడిన జలమా! మీరు సూర్య తేజస్సు కలవారు అగుచున్నారు. సూర్యుడు ప్రతిబింబించు జలములారా! మీరు సూర్య త్వచారూపులు అగుచున్నారు. కదలిక లేని జలములారా! మీరు మందరూపులు అగుచున్నారు. మంచునందలి జలమా! మీరు వశవర్తులు అగుచున్నారు. గోవు గర్భాశయమందున్న జలమా! నీవు గర్భ రక్షకమవు అగుచున్నావు.

క్షీరమందలి నీరమా! మీరు జగములను పోషించువారలు అగుచున్నారు. పెరుగు నందలి నీరమా! నీవు జనులను పోషించుదానవు అగుచున్నావు. నేతియందలి నీరా! నీవు అగ్ని తేజస్సున పుట్టినదానవు అగుచున్నావు. మధు ద్రవ రూప జలమా! మీరు ఓషధులందలి రసరూపులు అగుచున్నారు.

రాజసూయమును గురించి తలచుచున్న ఋత్విజాదులు దీప్యమానములు, మధురములు, బలప్రదములునగు జలములను తీసికొన్నారు. వానితో మిత్రా వరుణులను అభిషేకించినారు శత్రువులను అతిక్రమించినారు. ఇంద్రుని సాధించినారు.

జలములారా! మీరు రాజ్యమును ఇచ్చువారు. రాజ్యమును ప్రసాదించండి - స్వాహా. మీరు రాజ్యమును ఇచ్చు వారు. ఈ యజమానికి రాజ్యము నివ్వండి స్వాహా.

## పన్నెండవ అనువాకము

(ఇవి జలసంస్కార మంత్రములు )

**1.** జల దేవతలారా! మీరు అనేక పాత్రలందు గ్రహించబడినారు. మీరు మధురములు. రాజునకు వర్చస్సు కలిగించండి. మధుర, జలములను కలిసికొనండి.

**2.** జలములారా! మిమ్ము తిరస్కరించగలవారు లేరు. బలవంతులు కండి. రాజునకు బలము సమకూర్చండి.

(హోతృ, బ్రాహ్మణచ్ఛంసి స్థానముల మధ్య నీటిని ఉంచవలెను.)

**3.** బంగారమా! నిప్పులో వేసినను పేలాల వలె నీవు రూపు మార్చవు. నీవు మాటకు చుట్టమవు. నిప్పునందు పుట్టియు సోమమునకు ఈయబడుదానవు.

(**వాచో బన్ధుః** మాటకు చుట్టమవు. అనగా పసిడికలవాని మాటచెల్లును అని.)

**4.** జలమా! నీవు దీప్తిమంతవు. చంద్రుని యందు చంద్రుడవు. అమృతమునందు అమృతమవు. స్వాహాకార రాజసూయము కొరకు తేబడిన వారు. నిన్ను బంగారముచే పవిత్రము చేయుచున్నాము

(బంగారమున దర్భతో కట్టి నీటియందు కదిలించవలెను.)

**5.** వరుణుడు జలములకు శిశువు వంటివాడు. జలములు తల్లుల వలె వరుణుని తమయందు ఉంచుకొని లాలించుచున్నవి.

జలములు దీప్తివంతములు. బలహేతువులు. పేల్చరానివి. కర్మలు కోరునవి. వస్త్రము వలె వ్యాపించి ఉండునవి.

(నాలుగు నీటి పాత్రలందు మోదుగు, అత్తి, రావి, మర్రి కొమ్మలను వేయవలెను.)

**6.** క్షాత్రమునకు బలమవు. క్షాత్రమునకు స్థానమవు అగుచున్నావు.

**7.** అగ్ని కర్మచేతనే గృహపతి అయినాడు. ఇంద్రుడు కర్మచేతనే ఎంతో కీర్తిమంతుడు అయినాడు. పూష కర్మచేతనే విజ్ఞానవంతుడు అయినాడు. మిత్రా వరుణులు కర్మచేతనే సత్య ప్రవర్ధకులు అయినారు. అదితి కర్మచేతనే విశ్వరూపి అయినది.

ఇతడు - ఈ యజమాని - రాజేంద్రుని పుత్రుడో, పౌత్రుడో అగును. అతడు కర్మ వలననే ప్రజలు కలవాడు - రాజ్యము కలవాడు అయినాడు. క్షాత్రము, ఆధిపత్యము సార్వభౌమత్వము కలవాడు అయినాడు.

**8.** మీకు భరతుడు రాజగును. బ్రాహ్మణులమగు మాకు సోముడే రాజగును.

**9.** ధనువా! నీవు ఇంద్రుని వజ్రమవు అగుదువు. దెబ్బతీయు దానవగుదువు. నిన్ను పట్టిన ఈ యజమాని శత్రువును వధించునుగాక.

**10.** శరములారా! మీరు శత్రువును హింసించండి.

(యజమానికి ధనువు, మూడు బాణములు ఇవ్వవలెను.)

**11.** బాణములారా! ఎదురుగా వచ్చు బాణముల నుండి నన్ను రక్షించండి. అడ్డముగా వచ్చు బాణముల నుండి నన్ను రక్షించండి. వెనుక నుండి వచ్చు బాణముల నుండి నన్ను రక్షించండి. అన్ని దిక్కుల నుండి వచ్చు బాణముల నుండి నన్ను రక్షించండి. సకల శస్త్రముల నుండి నన్ను రక్షించండి.

**12.** శత్రు నివారక వామ హస్తమా! శత్రుమారక దక్షిణ హస్తమా! మీరు బంగారు కవచము ధరించి ఉన్నారు. ఇనుప స్తంభముల వలె గట్టిగా ఉన్నారు. ఉషోదయ, సూర్యోదయములందు గర్తసదృశ రథమును అధిరోహించండి. అనంతము, అఖండితమగు స్వసేనను అనుగ్రహ దృష్టితో వీక్షించండి. శత్రు సేనను ఆగ్రహ దృష్టితో చూడండి.

**పదమూడవ అనువాకము**

(దిగ్వ్యాపస్థాపన మంత్రములు చెప్పబడుచున్నవి)

**1.** యజమానీ! నీవు తూర్పున ఉండుము. ఛన్దసామ్ ఛందస్సులలో, గాయత్రీ - త్వా - నిన్ను, అవతు- రక్షించును గాత. త్రివృత్స్తోమః త్వా అవతు. రథన్తర సామః త్వా అవతు. అగ్నిదేవతా త్వా అవతు. బ్రహ్మద్రవిణం - ధనమును, అవతు.

**2.** యజమానీ! దక్షిణ దిశన ఉండుము. త్వా ఛన్దసాం త్రిష్టుప్ అవతు. పంచదశస్తోమః అవతు. బృహత్సామః అవతు. ఇన్ద్ర దేవతా అవతు. ద్రవిణమ్, క్షత్రమ్ - క్షత్రియుడు అవతు.

**3.** యజమానీ! నీవు పశ్చిమ దిశన ఉండుము. త్వాఛన్దసామ్ జగతీ అవతు. సప్తదశస్తోమః అవతు. వైరూపంసామ అవతు. మరుతః దేవతా అవతు. ద్రవిణమ్విట్ - వైశ్యుడు, అవతు.

**4.** యజమానీ! ఉత్తర దిశన నిలువుము. త్వాఛందసాం జగతీ అవతు. ఏకవింశః స్తోమః అవతు. వైరాజసామ అవతు. మిత్రావరుణా అవతామ్. బలమ్ద్రవిణం అవతు.

**5.** యజమానీ! నీవు ఊర్ధ్వదిక్కును చూడుము. త్వాం ఛన్దసాం పంక్తిః అవతు. త్రిణవః త్రయస్త్రింశౌ అవతు. శాక్వర రైవతే సామినీ అవతామ్. బృహస్పతిః దేవతా అవతు. వర్చః ద్రవిణమ్ అవతు.

**7.** అగ్నయే స్వాహా. సోమాయస్వాహా. సరస్వత్యై స్వాహా. పూష్ణేస్వాహా. బృహస్పతయే స్వాహా. స్వాహేన్ద్రాయ. ఘోషాయస్వాహా. శ్లోకాయస్వాహా. అగ్ంశాయ స్వాహా. భగాయ స్వాహా. క్షేత్రస్యపతయే స్వాహా. పృథివ్యై స్వాహా. అంతరిక్షాయ స్వాహా. దివే స్వాహా. సూర్యాయ స్వాహా. చన్ద్రమసే స్వాహా. నక్షత్రేభ్యః స్వాహా. అద్భ్యః స్వాహా. ఔషధీభ్యః స్వాహా. వనస్పతిభ్యః స్వాహా. చరాచరేభ్యః స్వాహా. పరిప్లవేభ్యః స్వాహా. సరీసృపేభ్యః స్వాహా.

(ఈ మంత్రమునందు 24 హోమములు ఉన్నవి. మొదటి 12 పార్థములు. వీనిలో మొదటి ఆరు అభిషేచనకు పూర్వము 'ఇంద్రాయస్వాహా' తరువాతి ఆరు అభిషేచానంతరపువి.

మిగిలిన 12 'అవేష్టులు'. వీనిలో మొదటి ఆరు అభిషేచనకు పూర్వపువి. 'అద్భ్యః స్వాహా' నుండి ఆరు అభిషేచనానంతరపువి.)

## పదునాలుగవ అనువాకము

1. శార్దూలచర్మమా! నీవు సోమమునకు దీప్తివి. నీవలెనే నాకు దీప్తి కలుగునుగాక.

2. హిరణ్యమా! నీవు అమృతమవు. నన్ను మృత్యువు నుండి రక్షించుము.

(శార్దూల చర్మము మీద నూరు హిరణ్యములు ఉంచవలెను.)

3. సువర్ణపాత్రమా! నీవు నన్ను రక్షింపుము.

(ఇది నూర్లచిల్లుల పాత్ర. దీనిలోని నీటితో యజమానిని అభిషేచింతురు.)

4. సర్పములను నాశనము చేసినాము.

(సర్పముగా భావించిన సేసమును నపుంసకుని మీదకు విసరవలెను.)

5. నముచి రాక్షసుని తల నరుక బడినది.

(యజమాని రాగి వస్తువును ఎడమపాదమున వేది బయటికి త్రోయవలెను.)

6. యజ్ఞకర్తా! ధర్మము తెలిసిన సోమ, వరుణ, అగ్ని మున్నగు దేవతలు నీ వాక్కును గ్రహింతురుగాక. నీ ప్రాణమును తెలిసికొందురుగాక. నీ కన్నులను - చూపును - గ్రహింతురు గాత. నీ చెవులను - వినికిడిని - గ్రహింతురు గాక.

7. యజమానీ! నిన్ను సోముని దీప్తిచే అభిషేకము చేయుచున్నాను. అగ్నితేజస్సుతోను - సూర్యుని వర్చస్సుతోను - ఇంద్రుని బలముతోను - మిత్రావరుణుల శక్తితోను - మరుత్తుల ఓజస్సుతోను అభిషేకము చేయుచున్నాను.

8. యజమానీ! నీవు క్షత్రియులకు స్వామివి అగుచున్నావు.

(అభిషిక్త యజమానిని అభిమంత్రించవలెను.)

9. యజమానీ! నీవు ఇతర రాజులను అతిక్రమించుము. రక్షించుము.

(పై పూతలున్న బట్టలను విడువవలెను.)

10.. లేపముల మీదినుంచి నీరు పైనపడుచున్నది. క్రిందపడుచున్నది. సుళ్లు తిరుగుచున్నది. ఆపాదమస్తకము సాగుచున్నది.

ఆ నీరు పర్వతము వంటి మేఘమునందలి నీటివలెను - జలములందు నావ వలెను సాగుచున్నది.

**11.** రుద్రదేవా! నీకు శర్వుడను నామము కలదు. భక్తులు ఆ నామమును జపింతురు. ఆ నామము వారికి ఫలప్రదమగును. ఆ నామమునకు ఈ శేషజలము హుతము అగును గాత.

(అభిషేక శేషజలముతో హోమము చేయవలెను.)

**12.** ప్రజాపతే! పుట్టిన ఈ లోకములను రక్షించుటకు నిన్ను మించిన వాడు లేడు. మేము ఏ ఫలము కోరి నీకు హోమము చేయుచున్నామో ఆ ఫలము మాకు సిద్ధించునుగాక. మేము ధనవంతులము అగుదుముగాక.

పుత్రుని, భార్యను తాకి హోమము చేయవలెను.

**పదిహేనవ అనువాకము**

**1.** రథమా! నీవు శత్రుహంతయగు ఇంద్రుని వజ్రమవు. నీ సాయమున ఈ యజమాని శత్రువులను వధించును గాత.

**2.** దక్షిణాశ్వమా! మిత్రావరుణులు అనుమతించినారు. నిన్ను యజ్ఞమునకని రథమునకు కట్టుచున్నాను.

(రథపు దక్షిణమునకు కట్టవలెను.)

**3.** విష్ణువు యొక్క అడుగు పడిన భూలోకమవు. రెండవ అడుగు పెట్టిన అంతరిక్షమవు. మూడవ అడుగు మోపిన త్రివిష్టపమవు అగుచున్నావు.

(యజమాని రథమును ఎక్కవలెను )

**4.** మరుత్తుల ఆశీస్సుల వలన ఈ జైత్రయాత్ర యందు గెలుపొందగలను.

(రథమును నడిపించవలెను.)

**5.** మనసు కోరినది లభించినది.

(యజమాని ధనువును పట్టవలెను. తూర్పులేక ఉత్తర దిశన నిలువవలెను. బాణము సంధించి విడువవలెను.)

**6.** నేను అవయవములందు శక్తి కలవాడను అయినాను.

(1. ఇతర రాజులను జయించినట్లు ప్రదక్షిణ చేయవలెను 2. ప్రదక్షిణ భూమండలము జయించినట్లు.)

**7.** పాదరక్షలారా! మీరు చర్మనిర్మితలు. పశువు యొక్క కోపస్వరూపలు అయి ఉన్నారు. నేను సహితము మీ వలెనే శత్రువు పై కోపము కలిగి ఉన్నాను.

(పాదుకలను విడువవలెను.)

**8.** మాత్రే పృథివ్యైనమః భూమాతకు నమస్కారము. భూమి నాకు తల్లి. ఆమెను నేను బాధించను. తల్లి భూదేవి నన్ను బాధించకుండును గాక.

**9.** వెండి పతకమా! పరిమిత పరిమాణవు అగుచున్నావు. ఆయుః స్వరూపమువు అగుచున్నావు. మే ఆయుః ధేహి నాకు ఆయువును ప్రసాదించుము.

రాగి పతకమా! నీవు బలస్వరూపమువు. మే ఊర్జం దేహి - నాకు బలమును ప్రసాదించుము.

బంగారు పతకమా! నిన్ను ధరించవచ్చును. నీవు వర్చస్సు కలదానవు. మయి వర్చః ధేహి - నాయందు వర్చస్సు కలిగించుము.

**11.** అగ్నయే గృహపతయే స్వాహా. సోమాయ వనస్పతయే స్వాహా. ఇన్ద్రస్య బలాయ స్వాహా.

**12.** రథము శుచియైనది. అడ్డంకులులేని అంతరిక్షమున ఉండునది. హోతృసమానమైనది. యజ్ఞవేదియందు ఉండునది. అతిథి వంటిది. ఇంటియందు, మనుష్యులవద్ద - రాజుల ఇండ్లయందు ఉండునది. యజ్ఞములందు ఉండునది. ఆకాశమున ఉండునది. అది గోవులనుండి పుట్టినది యజ్ఞమున పుట్టినది. పర్వతములందు పుట్టినది.

అట్టి రథము రాజసూయము కొరకు సమార్జించబడును గాత.

(రథమును రథవాహనము నందు ఉంచవలెను.)

**పదహారవ అనువాకము**

(విజయానంతరము సమస్త రాజులు సేవించుట.)

**1.** కుడిభుజమా! నీవు మిత్రదేవతా స్వరూపమువు. ఎడమ భుజమా! నీవు వరుణ దేవతా స్వరూపమువు.

(ఎత్తిన బాహువులు దించవలెను.)

**2.** నేను సకల దేవతలను కలిసి కొందునుగాక.

(అమిక్షయందు చేతులను ఉపావహరణము చేయవలెను.)

**3.** చర్మపటమా! నీవు క్షత్రియుడు కూర్చుండు స్థానమవు అగుచున్నావు. క్షత్రియునకు మూలస్థానము అగుచున్నావు.

**4.** నా శరీరమా! సుఖమగు ఆసనమునకు చేరుము. సుఖముగా కూర్చుండ యోగ్యమగు స్థానమునకు చేరుము. ఈ ఆసనము నిన్ను, నన్ను హింసించకుండును గాక.

(ఆసనము మీద కూర్చుండవలెను. 2. నిన్ను శరీరమును, నన్ను మనసును - ఆత్మను )

**5.** ఈ యజమాని దీక్షవహించి ఉన్నాడు. అనిష్ట నివారకుడు అయి ఉన్నాడు. ఆసనమునందు ఆసీనుడై ఉన్నాడు. ఇతడు నానారాజ్యములు గెలిచి సామ్రాజ్యము పాలించుటకు సంకల్పించును గాక.

(యజ్ఞకర్తను అట్లు అనుమంత్రించవలెను.)

**6.** రాజా! నీవు బ్రాహ్మణ ధర్మములను పాలించుచున్నావు. బ్రాహ్మణులమగు మాకు అనుజ్ఞనిచ్చుచున్నావు. అమోఘ అనుజ్ఞ కలవాడవు. అందువలన నీవే బ్రాహ్మణుడవు.

రాజా! నీవు పరమ ఐశ్వర్యవంతుడవు. అమోఘవీర్యుడవు. కావున నీవే బ్రాహ్మణుడవు.

రాజా! నీవు శిష్టపాలనకు దేవతలే మిత్రులుగా కలవాడవు. సేవింపదగిన వాడవు. కావున నీవే బ్రాహ్మణుడవు.

రాజా! నీవు అనిష్ట నివారకుడవు. ధర్మయుక్తుడవు. కావున నీవే బ్రాహ్మణుడవు.

(దిగ్విజయమొనర్చిన సామ్రాట్టును ప్రజలు, ఋత్విజులు అట్లు స్తుతించవలెను.)

**7.** హేస్ఫ్య! నీది వజ్రస్వరూపము. నీవు శత్రువులను వధించు దానవు. నాకు రధ్యవగుము.

**8.** ఈ రాజు పైదిక్కుతో కూడ అయిదు దిశలను అభిలషించి ఉన్నాడు.

**9.** సచ్చరిత్ర గల కోశాధ్యక్షులను, మంగళకరులై పన్నులు వసూలు చేయువారిని, అంతః పురమును రక్షించు కంచుకులను ఆహ్వానించుచున్నాను.

( ఇది యజమాని ఆశయము )

**10.** జలములను ఆవిరిచేయు అగ్నికి **స్వాహా**. బలములు క్షీణింపచేయు అగ్నికి **స్వాహా**. గృహపతి యగు అగ్నికి **స్వాహా**.

**పదిహేడవ అనువాకము**

(పది సంసృప హవిస్సులు చెప్పబడినవి.)

**1.** ఆగ్నేయమ్ అష్టకపాలమ్ నిర్వపతి. హిరణ్యమ్ దక్షిణా.

**2.** సారస్వతమ్ చరుమ్ నిర్వపతి. వత్సతరీ - పాలు మానిన దూడ - దక్షిణా.

**3.** సావిత్రమ్ ద్వాదశ కపాలమ్ నిర్వపతి. ఉపధ్వస్తః - సంకీర్ణవర్ణముల దూడ - దక్షిణా.

**4.** పౌష్ణమ్ చరుమ్ నిర్వపతి. శ్యామః - నల్లని దూడ - దక్షిణా.

**5.** బార్హస్పత్యమ్ చరుమ్ నిర్వపతి. శితిపృష్ఠః - తెలుపు వీపు దూడ - దక్షిణా.

**6.** ఐన్ద్రమ్ ఏకాదశకపాలమ్ నిర్వపతి. ఋషభః దక్షిణా.

7. వారుణమ్ దశకపాలమ్ నిర్వపతి. మహానిరష్టః. వట్టకొట్టిన ఎద్దు - దక్షిణా.

8. సౌమ్యమ్ చరుమ్ నిర్వపతి బభ్రువః - కపిల వర్ణగోవు - దక్షిణా.

9. త్వాష్టరమ్ - త్వష్టదేవతాకమునకు - అష్టాకపాలమ్ నిర్వపతి. శుణ్ఠః. తెల్లనిఆవు దక్షిణా.

10. విష్ణుదేవతాకమునకు త్రికపాలమ్ నిర్వపతి. పొట్టి ఆవు దక్షిణ అగును.

**పద్దెనిమిదవ అనువాకము**

(దశపేయము చెప్పబడినది.)

1. దీక్షవహించిన వెంటనే సోమమును కరీదు చేయవలెను.

(సోమ క్రయము ఒక్కొక్క యాగమునకు ఒక్కొక్క తీరుగా ఉండును. రాజసూయమున దీక్షవహించినపుడే కొనవలెను.)

2. తామర పూవుల మాలను - జలమునకు - సమర్పించవలెను.

3. పాలు మానిన పది దూడలను ఇచ్చి సోమము కొనవలెను.

4. పది చమసములందు పానము చేయగల సోమము గలది దశపేయక్రతువు అగును.

5. పది చమసములందలి సోమమును నూరుగురు బ్రాహ్మణులు సేవించుచున్నారు.

6. దశపేయ క్రతువు సప్తదశ స్తోమము కలది అగుచున్నది.

7. యజమాని అధ్వర్యునకు రెండు బంగారు అద్దములు దానము చేయవలెను.

8. బంగారు దండను ఉద్గాత అను ఋత్విజునకు ఇవ్వవలెను.

9. హోతకు బంగారపు గుండ్రని బిళ్లను దానము చేయవలెను.

10. ప్రస్తోత, ప్రతిహర్తలు ఇద్దరకు అశ్వమును ఇవ్వవలెను.

11. బ్రహ్మకు పన్నెండు పెయ్యలను ఇవ్వవలెను.

12. మిత్రావరుణులకు వంధ్యగోవును అర్పించవలెను.

13. బ్రాహ్మణాచ్ఛంసి ఋత్విజునకు ఆబోతును ఇవ్వవలెను.

14. నేష్ట, పోతలకు రెండు వస్త్రములను ఇవ్వవలెను.

15. అచ్ఛావాకుడను ఋత్విజునకు యవలు నింపిన పెద్దపాత్ర నీయవలెను.

**16.** అగ్నీధ్రునకు ఎద్దును ఇవ్వవలెను.

**17.** ఈ దశపేయ క్రతువునందు భార్గవుడు - భృగుగోత్రజుడు - హోత యగును. శ్రావస్తీయము బ్రహ్మసామము అగును. వారస్తీయము అగ్నిష్టోమసామము అగుచున్నది.

సరస్వతీ నదీజలమును సేకరించవలెను.

**పందొమ్మిదవ అనువాకము**

**1.** **ఆగ్నేయమ్ అష్టాకపాలమ్ నిర్వపతి. హిరణ్యమ్ దక్షిణా. ఐన్ద్రమ్ ఏకాదశకపాలమ్ నిర్వపతి. ఋషభః దక్షిణా. వైశ్వదేవమ్ చరుమ్ నిర్వపతి.** పచ్చరంగు గోవు **దక్షిణా. మైత్రావరుణమ్ ఆమిక్షామ్ నిర్వపతి.** గొడ్డుబోతు గోవు దక్షిణ. **బార్హస్పత్యమ్ చరుమ్ నిర్వపతి.** తెల్లని వీపు గల గోవు దక్షిణ.

(రాజసూయమున రాజు సకల దిక్కులను జయించుటకు సాగును. అతని శ్రమ నివారణార్థమైన ఈ అయిదు హవిస్సులు అవేష్టులు అనబడును.)

**2.** అదితి దేవతాకమునకు చూడిగోవును వధించవలెను. మరుద్దేవతాకమునకు తెల్లనిదియు, బాల్యముననే గర్భిణి అయిన గోవును వధించవలెను.

**3.** అశ్వినులు, పూషదేవతాకమునకు పన్నెండు గిన్నెలందు పురోడాశమును - సత్యవాక్కు గల సరస్వతీ దేవతాకమునకు చరుహవిస్సును - సవితా దేవతాకమునకు పన్నెండు గిన్నెలందు పురోడాశమును సమర్పించవలెను.

**ఇరువదవ అనువాకము**

(ప్రయుక్కుల హవిస్సులు చెప్పబడినవి.)

**1. ఆగ్నేయమ్ అష్టాకపాలమ్ నిర్వపతి. 2. సౌమ్యమ్ చరుమ్ నిర్వపతి. 3. సావిత్రమ్ ద్వాదశ కపాలమ్ నిర్వపతి. 4. బార్హస్పత్యం చరుం నిర్వపతి. 5.** త్వష్టదేవతాకమునకు **అష్టా కపాలమ్ నిర్వపతి. 6. వైశ్వానరమ్ ద్వాదశ కపాలమ్ నిర్వపతి.**

ఇది పూర్వ షట్కము.

**1. సారస్వతమ్ చరుమ్ నిర్వపతి. 2. పౌష్ణమ్ చరుమ్ నిర్వపతి. 3. మైత్రమ్ చరుమ్ నిర్వపతి. 4. వారుణమ్ చరుమ్ నిర్వపతి. 5.** క్షేత్రపతి దేవతాకమునకు **చరుమ్ నిర్వపతి. 6. ఆదిత్యమ్ చరుమ్ నిర్వపతి.**

ఇది ఉత్తరషట్కము

ఈ రెండు షట్కములకు ఒకొక్క దానికి రథవాహనవహము దక్షిణ యగును. (ఒక బండిని మరొక బండికి కట్టినపుడు రెండు బండ్లను లాగు ఎద్దు రథవాహన వహము అగును )

### ఇరువది ఒకటవ అనువాకము

(సౌత్రామణీ మంత్రములు, పశువులు, హవిస్సులు చెప్పబడినవి.)

**1.** సురా! నీవు మధురమవు. తీవ్రమవు. అమృతమవు. నిన్ను సోమాత్మకమగు లేత గరికతో కలుపుచున్నాను. అది మధురము, తీవ్రము, అమృతము అగును. నీవు అశ్వినుల కొరకు పక్వమగుము సరస్వతి కొరకు పక్వమగుము. చక్కని రక్షణల ఇంద్రుని కొరకు పక్వమగుము.

(1. సురయందు లేత గరికను కలుపవలెను. 2. ఇంద్రుడు సోమాభిషవము చేసినాడు. అందువలన అతనికి పాపము కలిగినది. అది పది ముక్కలుగ విడిపోయినది. తలనుండి వచ్చినది 'సోమము' పాయు గుహ్యము నుండి వచ్చినది 'సుర' అయినవి.)

**2.** ఇంద్రా! నీ కొరకు సూర్యుని కూతురు వంటి దీప్తి కలదియు, ద్రవరూపమును అగు సోమము శాశ్వతమును, విస్తృతమైనదియునగు వాలజన్య పవిత్రమున పావనము అగునుగాక.

ఈ సోమము పవిత్రమున పావనమైనది. ఇంద్రునకు యోగ్యమైనది. అది ఆవిరియై గాలిలో కలిసిపోయినది.

(వాలజన్య పవిత్రము. గొర్రెబొచ్చుచే చేయబడినది.)

**3.** పంటలుగల కర్షకులు పంటయందు పండినది పండనిది అని విచక్షణచేసి కోయుదురు

అశ్విని సరస్వతీ సుత్రామేంద్రులారా! అట్లే యజ్ఞాలందు నమస్కరించువారలు, నమస్కరించని వారలందు విచక్షణ చేసి ఈ పాత్రయందలి హవిస్సులను ఆరగించండి.

(మరొక ఖరస్థానమునందలి సురాపాత్రను అందుకొనవలెను.)

**4.** అశ్వినీ దేవతాకమునకు ధూమ్రవర్ణ పశువును బలి ఇవ్వవలెను. సరస్వతీ దేవతాకమునకు మేకను బలి ఇవ్వవలెను. ఇంద్ర దేవతాకమునకు ఆబోతును బలి ఇవ్వవలెను.

**5.** **ఐన్ద్రమ్ ఏకాదశ కపాలమ్ నిర్వపతి. సావిత్రమ్ ద్వాదశ కపాలమ్ నిర్వపతి. వారుణమ్ దశకపాలమ్ నిర్వపతి. సోమప్రతీకలగు పితృదేవతలు సంతృప్తులు అగుదురు గాక.**

**6.** ఆడుగుర్రము దక్షిణ యగును.

## ఇరువది రెండవ అనువాకము

(యాజ్యా పురోను వాక్యలు.)

1. అగ్నా, విష్ణువులారా! మీ మహత్వము పూజనీయము. ఘృతమునకు అనేక గోప్య నామములు ఉన్నవి. అట్టి ఘృతమును మీరు ప్రతి ఇంట పొందగలరు. జ్వాలారూపములగు మీ నాలుకలు ఏడు. అవి రత్నసదృశములు. వానితో మీరు ఘృతమును సేవింతురు గాక.

2. అగ్నా విష్ణుదేవతలారా! యజ్ఞశాల మీకు ప్రియమైన ధామము. అది పూజనీయము. ప్రతి ఇంట శుభప్రదములగు స్తోత్రములచే వర్ధిల్లు ఘృతము ఉన్నది. దానిని జ్వాలారూపములు, రత్న సన్నిభములగు మీ నాలుకలతో సేవించండి.

3. సరస్వతి అన్నప్రద. జ్ఞానరక్షిణి. ఆమె మాకు ఎంతో అన్నమును అందించునుగాక.

4. మేము సరస్వతిని యజించుచున్నాము. ఆమె మా యజ్ఞమునకు దివినుండి వచ్చుగాక. పర్వతముల నుండి వచ్చును గాక. మా ఆహ్వానమును మన్నించి, ఘృతమును సేవించ వచ్చిన చదువుల తల్లి మాస్తుతులను ఆశించుచు, వినును గాత.

5. బృహస్పతీ! నీవు సర్వదేవతలకు హితకరుడవు. మాహవిస్సులను సేవింపుము. యజమానికి రత్నములు ప్రసాదించుము.

6. బృహస్పతీ! నీవు మమ్ము తండ్రివలె కాపాడువాడవు. దేవతలందరకు ఆచార్యుడవు. మాకు వరదుడవు. అట్టి నీ కొరకు యాగములు చేయుదుము. నమస్కరింతుము. హవి సమర్పింతుము సేవింతుము.

7. బృహస్పతీ! రాజుల వద్ద ఉన్న ధనము మిన్న అయినది. అది అతడు అనుభవించ యోగ్యమైనది. ధనము అమాత్యాదుల వద్ద భూషణ రూపముగ ఉన్నది యజమాను వద్ద యజ్ఞయాగాది ధనము ఉన్నది. ధనము సైన్యరూపమున కూడ ఉన్నది. అది విచిత్రము. సత్యజాతము. అట్టి ధనమును మాకు ప్రసాదించుము.

8. మిత్రావరుణులారా! మా ఆవుల గుంపులను నేతులతో తడపండి. మీరు శోభనక్రతుయుక్తులు. మహారాజులు. దుమ్ము రేగు మాక్షేత్రములను నీటితో తడపండి.

9. మిత్రావరుణులారా! మేము జీవించు కొరకు మీ చేతులనిండుగ మరింత ధనము కొనిరండి. విచ్చేసి మా గోవుల గుంపులను నేతులతో తడపండి. మీరు పరస్పరము కలసి ఉన్నవారు. జనుల సభలందు మమ్ము గురించి తెలియ పరచండి.

మిత్రావరుణులారా! మేము మిమ్ము పిలుచుచున్నాము. మా పిలుపులు ఆలకించండి.

**10.** అగ్నిదేవుడు వసువులందు తొలివాడు. పురోడాశప్రియుడు. మిత్రుని వంటివాడు. మా క్షేత్రములను కాపాడువాడు.

అట్టి అగ్నిని యాగపరిసమాప్తి వరకు ఉండునట్టి నేను వేదవాక్కులచే స్తుతించుచున్నాను.

**11.** దేవతలను గూర్చి యాగము చేయువాని మనసు - కొన్ని యుద్ధములందు శూరుని వలెను, రథము వలెను సాగుచున్నది.

దేవతల మనసులను ఆరాధించువాడు యాగరహితులను దాటిపోవుచున్నాడు.

**12.** యజమానీ! యజ్ఞము చేసిన నీవు నాశనము లేనివాడవు అగుచున్నావు. సోమయాజీ! పాకయాజీ! మీరును నాశనము లేని వారలగుచున్నారు.

**13.** ఈ యజమానికి చక్కని సామర్థ్యము కలుగును గాత. శీఘ్రగాములగు అశ్వసంబంధ సామర్థ్యము కలుగును గాత.

**14.** కర్మ సహితుడైన యజమానిని రాక్షసాదులు నాశనము చేయకుందురు గాత. యజ్ఞవిరోధి పాపము యజమానికి అంటకుండును గాక. అతనిని ఇతర పాపములు అంటకుండునుగాక.

దేవతల మనసులను ఆరాధించు వాడు యాగరహితులను దాటిపోవుచున్నాడు.

**15.** ధేనువులు నదులవంటివి. సుఖదాయినులు. అవి ఇంతకు ముందు యజ్ఞము చేసిన - ఇకముందు యజ్ఞము చేయనున్న వానికి మరిన్ని పాలిచ్చుచున్నవి.

ఇప్పుడు జుహూవును నింపువాడును - ఇకముందు నింపబోవువాడగు యజమాని స్తుతులు వినుటకా అన్నట్లు ఆజ్యధారలు అంతటను వ్యాపించుచున్నవి - అంతటి నుండి వచ్చి చేరుచున్నవి.

**16.** సోమ, రుద్రులారా! మా ఇంట చేరిన రోగరూపమగు నిర్ృతిని అన్ని దిక్కులనుండి అవతలికి పంపండి. తలవంచిన ఆ నిర్ృతిని దూరమున ఉండగనే హింసించండి. అది మాకు కలిగించిన రోగరూప పాపములనుండి మమ్ము విముక్తులను చేయండి.

**17.** సోమ రుద్రులారా! మీరు మా యందు సమస్త ఓషధులను ఏర్పరచండి. ఆ ఔషధముల చేత అనిష్టములను నశింపచేయండి. నిర్ృతి మాకు కలిగించిన రోగరూప పాపములను మా నుండి తొలగించండి.

**18.** సోమ, పూష దేవతలారా! మీరు ద్యావా పృథ్వులను సృష్టించినారు. ధనమును కలిగించినారు. పుట్టినంతనే సకల లోకములను రక్షించినారు. మీరు కర్మఫలమునకు ముడివేసినారు.

**19.** సోమ పూషదేవతలను - వారు పుట్టిన నాటినుండియే - సమస్త దేవతలు సేవించుచున్నారు. వీరు - అప్రియమగు - బుద్ధి మాంద్యమును నశింపచేయుదురు గాక. ఇంద్రుడు - పూష సోములచేత - వయసులో ఉన్న గోవులందు మంచి పాలను కలుగచేయుచున్నాడు.

దాశరథి లక్ష్మణాచార్య బుచ్చమాంబల పౌత్రుండును - విద్వాన్ దాశరథి వేంకటాచార్య వేంకటాంబల పుత్రుండును, ఆంధ్రప్రదేశ ఆస్థానకవి దాశరథి కృష్ణమాచార్య అనుజుండును - కమలానామ్ని ధర్మపత్నీ సమేతుండును "వివేకానందుడు" "శకుంతల" "మాళవిక - అగ్నిమిత్రుడు" "విక్రముడు - ఊర్వశి" "మహాత్ముడు" "బాలాజీ" మున్నగు బాలల గ్రంధరచయితయు అయిన దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత యందలి మొదటి కాండము సమాప్తము.

సర్వే భవన్తు సుఖినః

యస్య నిఃశ్వసితం వేదాః యోవేదేభ్యోఽఖిలం జగత్ ।
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థ మహేశ్వరమ్॥

# రెండవ కాండము

## మొదటి ప్రపాఠకము

### మొదటి అనువాకము

1. సంపదకోరువాడు వాయువును దేవతగా వరించవలెను. యాగార్థము తెల్లని పశువును ఏర్పరచవలెను. అతడు ఆ పశువును దర్భ, జువ్వికొమ్మలచే తాకవలెను. వాయువు అతివేగవంతుడు. తన భాగమును అందుకొనగలవాడు. కావున యజమాని వాయువునే సేవించవలెను. అందువలన యజమానికి ఐశ్వర్యము లభించును. అతడు ఐశ్వర్యవంతుడు అగుచున్నాడు.

2. అభిజ్ఞులు వాయువు త్వరగా ఇచ్చువాడని చెప్పుదురు. గుణదోషజ్ఞులు వాయువు యజమానిని దహించ సమర్థుడు అని చెప్పుచున్నారు.

అట్లగుట వలన తెల్లని పశువును - నియుత్తులు అను అశ్వములు గల వాయువునకు - ఆలంబనము చేయవలెను. నియుత్తులే కదా వాయువున వహించునవి! కావున వాయువును యజించిన యజమానికి ఐశ్వర్యము లభించుచున్నది. అతనిని వాయువు దహించుటలేదు.

3. గ్రామాధికారము కోరువాడు నియుత్వంతుడైన వాయువునకు శ్వేత పశువును ఆలంభనము చేయవలెను. వాయువే - ముకుదాడు వేసిన పశువును వలె - ప్రజలను అదుపు నందు ఉంచుచున్నాడు.

అట్లగుట వలన యజమాని వాయుదేవతను - తన భాగధేయమున - యజింపవలెను అప్పుడు వాయువు ముకుతాడు వేసిన పశువు వలె - ప్రజలను యజమానికి వప్పగించును. అతడు గ్రామాధికారి అగుచున్నాడు.

4. నియుత్వంతుడైన వాయువును యజించిన వానికి ప్రజలు వశవర్తులు అగుదురు. వారు ఎన్నటికిని అతని వశము తప్పరు.

5. సంతానము కోరువాడు నియుత్వంతుడగు వాయువునే యజించవలసి ఉన్నది.

నాసారంధ్రము నుండి వెడలునది ప్రాణము. వాయువు సహితము అట్టిదియే అగును ముఖమునకు దిగువన ఉదరాంతమున చరించునది అపానము. నియుత్తునకు కూడ అట్టి అర్థము కలదు.

ఒకడు సంతానము కలిగించుటకు సమర్థుడు అయ్యు సంతానము కలిగించలేక పోవుచున్నాడు. అట్లగుట వలన అతనికి కలుగవలసిన సంతానమునకు ప్రాణాపానములు తొలగి పోవుచున్నవి కదా!

అట్టితరి అతడు నియుత్వంతుడగు వాయుదేవతను స్వకీయ భాగధేయమున యజించవలెను. అప్పుడు వాయువే అతని సంతానమునకు ప్రాణాపానములను కలిగించుచున్నాడు. అందువలన సంతానము లేని వాడు సంతానవంతుడు అగుచున్నాడు.

**6.** దీర్ఘ రోగియైన వాడు నియుత్వంతుడైన వాయువునే యజించవలెను. వాయువు ప్రాణము నియుత్తు అపానము అగుచున్నది కదా!

దీర్ఘరోగికి ప్రాణాపానములు సరిగా పనిచేయకున్నవి. అతడు నియుత్వంతుడగు వాయువును - స్వకీయ భాగధేయమున - యజించవలెను. వాయువే అతని ప్రాణాపానములు సరిగా పనిచేయించును. అట్లు యజించిన వానికి ఇసుమంత ప్రాణమున్నను తప్పక జీవించుచున్నాడు.

**7.** ఈ లోకమున ప్రజాపతి ఒక్కడే ఉండెను. అతడు ప్రజలను, పశువులను సృష్టించదలచినాడు. అట్లు తలచినవాడు తన ఉదరము నుండి వపను ఖండించి తీసినాడు. దానిని అగ్నిలో పడవేసినాడు. అందునుండి కొమ్ములు లేని మేకలు ప్రభవించినవి. ఆ ప్రజాపతి తనరూపమైన ఆ మేకను దేవతకు బలి ఇచ్చినాడు. తదుపరి అతడు సమర్థుడు అయినాడు. ప్రజలను, పశువులను సృజించినాడు.

**8.** ప్రజలను, పశువులను కోరునట్టివాడు ఆ ప్రజాపతికి కొమ్ములులేని మేకను బలి చేయవలెను. అతడు ప్రజాపతిని స్వకీయ భాగధేయమున యజించవలెను. అప్పుడు ఆ ప్రజాపతియే అతనికి ప్రజలను, పశువులను కలిగించుచున్నాడు.

**9.** మీసములు పురుషలక్షణము. కొమ్ములు లేకుండుట అశ్వరూపమగును. క్రింది వరుసలో మాత్రము దంతములుండుట గోరూపము అగును. గొరిసెలుండునది గొర్రెలరూపమగును. మేకలకు గొర్రల రూపము సహజాతి లక్షణము. ఈ అయిదు - పురుషుడు, అశ్వము, గోవు, గొర్రె, మేక - గ్రామ పశువులు. యజమాని ఆ రూపముగల పశువులను యాగము కొరకు సము పార్జించవలెను.

**10.** పశువులను కోరువాడు సోమపూష యుగళ దేవతాకమునకు ఒకేసారి పుట్టిన మూడింటిలో ఒక దానిని బలి ఇవ్వవలెను.

మేకకు రెండు చన్నులు ఉండును. చన్ను కుడుచుటకు రెండు పిల్లలు పుట్టును. తల్లి మేక యందలి బలమున మూడవ పిల్ల పుట్టుచున్నది.

యజమాని సోమ పూషదేవతలకు - స్వకీయభాగధేయమున మూడవ మేక పిల్లను బలిఇచ్చి యజించవలెను. వారు ఆ యజమానికి పశువులను కలిగింతురు.

సోముడు రేతస్సు నిలుపువాడు, పూష పశువులను పుట్టించువాడు అగుచున్నాడు. కావున సోముడు యజమాని కొరకు రేతస్సు నిలుపును. పూష పశువులను కలిగించును.

**11.** యూపము ఔదుంబరము - మేడి సంబంధము కావలెను. ఖాదిరము - తినతగిన పండ్లచెట్టు కారాదు. ఫలబాహుళ్యమున ఉదుంబరము రసరూపమగును. అట్లే పశువులు క్షీర రసస్వరూపలు అగును. కావున యజమానికి రసరూపమగు ఉదుంబరమే - రసరూపములగు పశువులను ఇచ్చుచున్నది.

**ఆలోచనామృతము**

**1.** ఆలోచనము మాత్రమే ప్రాణులందు మానవుని విలక్షణత - విశిష్టత - మహత్తత. అతడు తాను గెలిచినాను అనుకున్నది. ఓటములకు ఒప్పుకున్నది - సాధించినది - సాధించనున్నది - సాధించలేనిది వీటి అన్నింటికి యోని - మూలము - ఆలోచనమే.

ఆలోచనమే అర్థము అగుచున్నది- అనర్థము అగుచున్నది. న్యాయమగుచున్నది - అన్యాయమగుచున్నది. సత్యమగుచున్నది - అసత్యమగుచున్నది. క్రమమగుచున్నది - అక్రమము అగుచున్నది. జగత్తులకు కళ్యాణకరమగుచున్నది - వినాశకరమగుచున్నది. అన్నింటికి మూలము ఆలోచనమే కదా!

ఆలోచనమే శాస్త్రము. ఆలోచనమే విజ్ఞానము. ఆలోచనమే సైన్సు. ఆలోచనమే దృష్టి. ఆలోచనమే ఆలోచనము.

ఆలోచనము శాస్త్రము. వేదము ఆలోచన మాత్రము కాదు. 'శాస్త్రయోనిత్వాత్' వేదము శాస్త్రములకు తల్లి వంటిది. తల్లి ఎందరినైన పిల్లలను ఈయగలదు. ఎందరు పిల్లలయినను ఒక తల్లిని ఇవ్వజాలరు!

**2.** మానవుడు వాస్తవములపై జీవించుట లేదు. అతడు వాస్తవముల మాత్రము మీద జీవించుటలేదు. హిందువుల పంచాంగము ప్రకారము సృష్టి ప్రారంభమై 195 కోట్ల సంవత్సరాలు దాటిపోయినది. ఇంత సుదీర్ఘ కాలమున శాస్త్రము, సైన్సు, వల్లకాడు కోట్లు కనుగొన్నానని మానవుడు విర్రవీగుచున్నాడు.

కాని నాటినుండి నేటివరకు మనిషికి 'జీవితము' అనుపదము అర్థము కాలేదు. అర్థము చేసుకొనుటకు ఎంతో కాలము పరుగులు సాగినవి. నేడు అవి ఆగినవి!

ఆగుట ఏల? అని అడుగుదురు కదా! ఈ యాంత్రిక నాగరికత మనకు వర్తకము, వాణిజ్యము, వ్యాపారము వంటివాటిని ఎన్నింటినో నేర్పినది. జీవించుట మాత్రము నేర్పలేదు - కాదు నేర్పుటను నిలిపివేసినది!

జీవితము గొప్ప విషయము. అది విలక్షణము. విశుద్ధము. విశ్వాత్మకము. బ్రతుకును గురించి తెలిసిన వాడులేడు. మనము గాలివలన బ్రతుకుచున్నామా? నీటి వలన బ్రతుకుచున్నామా? కుటుంబము వలన బ్రతుకుచున్నామా? సమాజము వలన బ్రతుకుచున్నామా? ఏమో? ఏమిటో? ఏదో?

అన్నింటికలయిక - కూడిక - సమాహారము వలన బ్రతుకుచున్నామా? అట్లయిన మనము పోయినను అవన్నియు పోవుట లేదు కదా?

ఆధునిక సైన్సు సామాన్యుని ఆలోచనలను అంతమొందించినది. తాను చెప్పిందే నమ్మమన్నది. సామాన్యునిలో సైన్సు మూఢనమ్మకాలను కలిగించింది. ఏలనన నేటి సైన్సు సైన్సుగా లేదు. సైన్సు వ్యాపారమైనది. వాణిజ్యమునకు ప్రచార సాధనమైనది. అది సామాన్యుని ముంచినది ఆస్తులే జీవితము అని భ్రమింపచేసినది.

మనము ఆ భ్రమలోనే భ్రమించుచున్నాము.

**3.** మనిషి గాలి, నీరు, ఆహారము మీద మాత్రము జీవించుట లేదు. అతడు 'విశ్వాసము' మీద జీవించుచున్నాడు. విశ్వాసమునకు హేతువు ఉండదని కాదు. కాని దానిని వెదుకుటకు ఈ ముష్టిబతుకు చాలదు.

భర్త భార్య మీద - భార్య భర్త మీద విశ్వాసంతో జీవిస్తున్నారు. వాస్తవం వేరుకావచ్చు. బిడ్డలు తన వారు అనే విశ్వాసంతో తండ్రి జీవిస్తున్నాడు. వారి కొరకు జీవితం అర్పిస్తున్నాడు. వాస్తవం వేరు కావచ్చు. ప్రభుత్వం మనది అనే విశ్వాసం వలన ప్రభుత్వాలు బ్రతుకుతున్నాయి. వాస్తవం వేరు కావచ్చు.

మనిషి వీటిని అన్నింటిని గురించి ఆలోచించి నిర్ణయించాలనుకుంటే అతని జీవితం చాలదు. ఉన్నది నరక ప్రాయం అవుతుంది.

కావున మనిషి విశ్వాసం మీద జీవిస్తున్నాడు. ప్రఖ్యాత ప్రేమగాధయగు లైలా, మజ్నులో లైలా అందకత్తె కానేకాదట! మరి అతడు అన్ని బాధలు ఎందుకు పడినట్లు? విశ్వాసమే కదా!!

**4.** వేదము విశ్వాసము. వేదము అపౌరుషేయము. భగవంతుడు ప్రసాదించినది. ఆ విశ్వాసమే ఈ జాతి సంస్కృతిని - నాగరికతను - సభ్యతను ఇన్ని లక్షల సంవత్సరాలు నిలిపి ఉంచినది. అంత మాత్రమున అర్థము తెలిసికొనరాదను నియమము లేదు.

జ్ఞానము సూర్య తేజము వంటిది. దానిని మూసి ఉంచు శక్తి ఎంతటి వానికిని లేదు. గ్రహణము తాత్కాలికము కదా!

"నైషస్థాణో రపరాధః యదేనమ్ అంధోనపశ్యతి । పురుషాపరాధః సభవతి" అన్నాడు యాస్కుడు. చూడక పోవడం గుడ్డివాని దోషము. పదార్థదోషము కాదు

5. ఇంత ఏల చెప్పవలసి వచ్చినదనిన ఈ అనువాకమున కార్య కారణముల వివరణ జరిగినది కాదనుట సులభము. అందుకు ఆలోచనముతో నిమిత్తము లేదు. అవుననుట - నిరూపించుటకు ఆలోచనము పరిశీలనము అవసరము. అందుకు అవగాహన, సంయమము, సమ్యక్ దృష్టి అవసరము

ఈ అనువాకపు తొలి మంత్రమున సంపద కొరకు వాయువును ఆరాధించమన్నాడు. వాస్తవముగా వాయువేగదా సకల సంపదలకు కారణము! వాయువు మాత్రమే కాకపోవచ్చును. వాయువు కూడ అగును. వాయువే అని ఒక పరిశీలన.

సత్యము అగోచరము కదా!

5వ మంత్రమున ప్రాణ, అపానములను గురించి చెప్పినాడు. ప్రాణము అయిదు అని పూర్వముచెప్పినాడు కదా అని ఆక్షేపణ తగదు. ఈ రెండు ప్రధాన ప్రాణములు కావచ్చును పిండోత్పత్తికి అవి కారణము అనుచున్నాడు. అదే సత్యమా?

సత్యము అగోచరము కదా!

6వ మంత్రమున దీర్ఘరోగములకు వాయువే కారణము అనుచున్నాడు. చికిత్స కూడ వాయువునందే చూపినాడు. యోగవైద్యము నందు చాల వరకు శ్వాసను నియంత్రించి రోగము నివారించబడుచున్నది. జల చికిత్స వంటివి ఆధునిక వైద్యమునందున్నవి. ఇది వాయు చికిత్స కావచ్చును. ఇది మాత్రమే చికిత్సయా? అనిన

సత్యము అగోచరము కదా!

7వ మంత్రమున బలిని గురించి చెప్పబడినది. బలి మానవుని విశ్వాసము. అరిషడ్వర్గముల బలి జ్ఞానమార్గము.

మానవుడు తొలిగా నరబలితో ప్రారంభము అయినాడు. అది మాన్పిన తీరు అన్ని మతములందు ఉన్నది.

క్రైస్తవ, ఇస్లాం మతములందు ఇబ్రాహం గాథ ఉన్నది. అతడు తనపుత్రుని బలి ఇవ్వబోయినాడు. భగవంతుడు పుత్రుని స్థానమున గొర్రెను ఉంచినాడు. నాటినుండి ఆ మతస్థులకు గొర్రె బలి జంతువు అయినది. మహమ్మదీయులకు ఆ పేర ఒక పండుగ ఉన్నది.

రామాయణమున విశ్వామిత్రుడు, శునశ్శేఫుని వృత్తాన్తమున్నది. అంబరీషుడను రాజు యజ్ఞపశువుగా శునశ్శేఫుని కరీదుచేసినాడు. శునశ్శేఫుడు తన మేనమామ అయిన విశ్వామిత్రుని ఆశ్రయించినాడు. విశ్వామిత్రుడు మంత్రమును కల్పించి ఇంద్రుని ప్రసన్నుని చేసినాడు. శునశ్శేఫుని రక్షించుట నరబలిని మాన్పుట అగును.

ఈ మంత్రమున ప్రజాపతి తన వపనుండి సృష్టించిన మేకను - తనరూపమైన దానిని - దేవతలకు బలి ఇచ్చినాడని చెప్పబడినది.

బుద్ధ భగవానుడు ప్రాణిబలిని నిరోధించినాడు! అహింసామూర్తి - కరుణాసముద్రుడు అయినాడు.

బలి త్యాగమునకు సంకేతమా! నరబలి నుండి నారికేళ బలి వరకు మనము ఎంత దూరము పయనించినాము!!!

9వ మంత్రమున గ్రామ జంతువులు - యాగయోగ్యములగు - అయిదింటిలో పురుషుని చేర్చుట నరబలి స్వరూపమే!

**రెండవ అనువాకము**

**1.** ప్రజాపతి ప్రజలను సృష్టించినాడు. ప్రజలు ప్రజాపతికి విముఖులు అయినారు. వరుణుని వద్దకు చేరినారు. ప్రజాపతి వరుణుని వద్దకు వెళ్లినాడు. తన ప్రజను తనకు ఇవ్వవలసినదని వరుణుని అడిగినాడు. వరుణుడు అందుకు అంగీకరించలేదు. అప్పుడు ప్రజాపతి ప్రజలందు శ్రేష్ఠమును తనవద్ద ఉంచుకొని మిగిలిన వారిని తనకు ఇమ్మని వరుణుని అడిగినాడు. అందుకు వరుణుడు అంగీకరించినాడు. అతడు శ్రేష్ఠము అన్నదానిని తాకినాడు. అది నల్లనిది - ఒక పాదము తెల్లనైనది అయినది.

**2.** జలోదరమున బాధపడుచున్నవాడు వరుణునకు నల్లనిదియు, ఒకపాదము తెల్లనిదియు అయిన పశువును బలి ఇవ్వవలెను. అతడు తన భాగధేయమున వరుణుని యజించవలెను. అప్పుడు వరుణుడే అతనిని వరుణ పాశము నుండి విముక్తుని చేయును.

**3.** నల్లనిదై, ఒక పాదము తెల్లగా ఉన్న జంతువు వరుణదేవతాకము అగును. అది యజమానికి ఆరోగ్యము కలిగించును.

**4.** సువర్భానుడు రాక్షసుడు. అతడు భూమి రూపము దాల్చినాడు. నల్లని వాడు అయినాడు. నల్లని అంధకారమున సూర్యుని కప్పివేసినాడు.

దేవతలు అదిచూచినారు. అంధకారమును వదిలించదలచినారు. వారు తొలిసారి ఆ చీకట్లను పోగొట్టినారు. ఆ విధముగా పోగొట్టిన చీకట్లు నల్లని గొర్రె అయినవి.

మరల చీకట్లు ముసిరినవి. దేవతలు రెండవసారి చీకట్లను తరిమినారు. అప్పుడు ఆ చీకట్లు రాగి రంగు గొర్రెగా మారినవి.

మరల చీకట్లు క్రమ్మినవి. దేవతలు మూడవసారి చీకట్లను పోగొట్టినారు. ఆ చీకట్లు తెల్లని గొర్రెగా మారినవి.

మరల చీకట్లు క్రమ్మినవి. దేవతలు శవము నుండి ఒక ఎముకను తీసినారు. దానితో నాలుగవసారి చీకట్లను వెళ్లగొట్టినారు. అదియే వంధ్య పశువు అయినది.

ఈ వంధ్య పశువు ఎముక నుంచి కదా పుట్టినది. అందువలన దేవతలు దానిని దేవపశువుగా భావించినారు. దీనిని ఏ కార్యము కోరి బలి ఇవ్వవలెను అని దేవతలు తమలో తాము ఆలోచించినారు.

వారు ఆ విధముగా ఆలోచించుచున్నంత భూమి చిన్నది అయినది. భూమి మీద ఓషధులు మొలవకున్నవి. అప్పుడు దేవతలు ఆ వంధ్యగొర్రెను ఆదిత్యులకు బలి ఇచ్చినారు.

దేవతలు ఆ విధముగా బలి ఇచ్చినంతనే పృథివి విశాలమైనది. ఓషధులు మొలకలెత్తినవి.

5. పశు సమృద్ధియు, పుత్ర పౌత్రాది సమృద్ధియు కోరువాడు వంధ్యగొర్రెను ఆదిత్యులకు బలి ఇవ్వవలెను. అతడు - తన భాగధేయముచే - ఆదిత్యులను ఆరాధించవలెను. అప్పుడు ఆదిత్యులే అతనికి పశుసమృద్ధి ప్రజాసమృద్ధి కలిగింతురు.

6. ఆదిత్యుడు చీకట్లనుంచి బయట పడినాడు. అయినను అప్పుడప్పుడు అతడు మసక బారినాడు. దేవతలు ఆ ప్రకాశమాంద్యమును తొలగించ దలచినారు.

దేవతలు మెడకు చన్నులు గల జంతువును గురించి ఆలోచించినారు. 1. అగ్ని దేవతాకమగు నల్లని మెడ దానిని 2. ఇంద్రదేవతాకమగు వేరువేరు రంగులు గల దానిని 3. బృహస్పతి దేవతాకమైన తెల్లని దానిని. ఆ మూడింటిని బలి ఇచ్చినారు.

**"తాభిరేవాస్మిన్నుచ మదధుః"** వానితోనే వారు సూర్యుని యందు వెలుగును ప్రవేశపెట్టినారు

7. బ్రహ్మవర్చస్సును కోరువాడు ఆ మూడు మేకలను బలి ఇవ్వవలెను. అగ్ని దేవతాకమగు నల్లని మెడ దానిని - ఇంద్ర దేవతాకమగు రంగురంగుల దానిని, బృహస్పతి దేవతాకమగు తెల్లని దానిని ఆలంభనము చేయవలెను - అతడు ఆ ముగ్గురు దేవతలను - తనభాగధేయము చే అర్చించవలెను. అప్పుడు ఆ ముగ్గురు ఆతనికి బ్రహ్మవర్చస్సు కలిగింతురు.

**8.** వసంతకాలపు ఉదయమున అగ్ని దేవతాకమగు నల్లని మేకను వధించవలెను. గ్రీష్మకాల మధ్యాహ్నమున ఇంద్ర దేవతాకమగు రంగురంగుల మేకను వధించవలెను. శరత్కాలపు అపరాహ్ణమున బృహస్పతి దేవతాకమగు తెల్లని మేకను వధించవలెను.

ఆ విధముగా చేసినందున వసంతపు ఉదయపు సూర్యతేజస్సు, గ్రీష్మమధ్యాహ్నపు సూర్య తేజస్సు, శరత్కాలపు అపరాహ్ణపు సూర్యతేజస్సు యజమానియందు చేరుచున్నవి.

**9.** సంవత్సర కాలము నియమము గ్రహించిన యజమాని ఆ యా కాలములందు పశువులను వధించవలెను. సంవత్సరమే కదా బ్రహ్మవర్చస్సు నిచ్చునది! సంవత్సరమే యజమానికి బ్రహ్మవర్చస్సును ఇచ్చును. యజమాని బ్రహ్మ వర్చస్సు కలవాడు అగుచున్నాడు.

**10.** ఇంతకు ముందు చెప్పిన మూడు పశువులు గర్భిణులు కావలెను. ఇంద్రియమే కదా గర్భము. అందువలన యజమాని ఇంద్రియవంతుడు అగుచున్నాడు.

**11.** వాక్కు పలుకుటకు సమర్థుడయిన ఎవడు పలుక జాలడో వాడు సరస్వతీ దేవతాకమగు ఆడు మేకను వధించవలెను. వగ్వైసరస్వతీ - వాక్కే సరస్వతి కదా! అతడు సరస్వతిని - తన భాగధేయముచే యజించవలెను. సరస్వతి అతనికి వాక్కు కలిగించును. అతడు చక్కగా పలుకువాడగును.

**12.** అట్టి ఆడమేక దంతములు లేనిది కారాదు. అందువలన మానవులు సమస్త వాక్కులు పలుకగలరు.

**13.** దీర్ఘరోగము కలవాడు అగ్నిదేవతాకమగు నల్లని మెడ దానిని, సోమ దేవతాకమగు పింగళవర్ణము గల దానిని బలి ఇవ్వవలెను. అందువల్ల దీర్ఘరోగి దేహమున అగ్నియు, సోమసంబంధి రసమును ప్రవేశించుచున్నది. అతని దేహము అగ్ని నుండి తేజమును, సోముని నుండి రసమును పొందుచున్నది. అతడు పోయిన ప్రాణము గలవాడు అయినను జీవించుచున్నాడు.

**14.** సంతానము కోరువాడు సోమదేవతాకమైన పచ్చని పశువును, అగ్ని దేవతాకమగు నల్లని మెడ పశువును ఆలంభనము చేయవలెను. సోముడు యజమాని రేతస్సును నిలుపును. అగ్ని సంతానము కలిగించును. కావున అతడు సంతాన వంతుడు అగుచున్నాడు.

**15.** ఒకప్పుడు బ్రాహ్మణుడు విద్యనేర్చును. కాని సభను రంజింపచేయజాలడు. అట్టివాడు అగ్ని దేవతాకమగు కృష్ణగ్రీవను, సోమదేవతాకమగు పింగళ వర్ణపశువును బలి సమర్పించవలెను. కృష్ణగ్రీవము అగ్ని దేవతాకము. అగ్ని తేజోరూపము. అందువలన అతనికి సభను రంజింపచేయగల తేజస్సు లభించును. పింగళవర్ణ సోమదేవతాకము. సోముడు బ్రహ్మవర్చస్సును ఇచ్చువాడు. అందువలన అతనికి బ్రహ్మవర్చస్సు కలుగును.

నల్లని మెడగలది అగ్ని దేవతాకము. అట్లగుట వలన అది యజమాని బుద్ధిమాంద్యమును పోగొట్టును. మెడతప్ప తక్కిన దేహము తెల్లని దగుట వలన యజమానికి తేజస్సు కలుగును. సోమ దేవతాకము పింగళవర్ణమగుట వలన యజమాని యందు బ్రహ్మవర్చస్సు చేరుచున్నది.

**16.** పౌరోహిత్యము నందు స్పర్థకలవాడు ఆగ్నేయమగు కృష్ణగ్రీవమును, సౌమ్యమగు పింగళవర్ణములను రెండింటిని తదుపరి కృష్ణగ్రీవమును, ఆలంభనము చేయవలెను.

బ్రాహ్మణుడు అగ్ని సంబంధి. క్షత్రియుడు సోమసంబంధి. సోమదేవతాకమునకు ఇరువైపుల అగ్ని దేవతాకములు ఉండుట వలన బ్రాహ్మణ తేజస్సుచే రాజ్యమును వశపరచుకొనును. అప్పుడు ఒకే మాటతో ప్రత్యర్థిని జయించును. అతనిని రాజు, అమాత్యులు పురోహితునిగా చేసికొందురు.

### మూడవ అనువాకము

**1.** దేవదానవులు ఈలోకము విషయమున వివాదపడినారు. అప్పుడు విష్ణువునకు వామనము - పొట్టి పశువు - కనిపించినది. అతడు దానిని తనదిగా చేసుకున్నాడు. అది విష్ణుదేవతాకమయినది. విష్ణువు దానిని ఆలంభనము చేసినాడు. అందువలన ఆతడు ఈ లోకములను జయించినాడు.

**2.** గృహక్షేత్రాది విషయములందు వివాదములు కలవాడు పొట్టి పశువును వధించవలెను. విష్ణు ప్రియమగు హవిస్సును దానము చేయవలెను. అప్పుడు అతడు విష్ణువు వలె లోకములను జయించును.

**3.** ఈ లోకములు ఎత్తుపల్లములు కలవి. ఎత్తుపల్లములు సమృద్ధికి కారణము అగుచున్నవి.

**4.** యుద్ధము కలుగును. అప్పుడు నొసట నామము, ముఖము వైపు తిరిగిన కొమ్ములు గల పశువును ఇంద్రుని కొరకు బలి ఇవ్వవలెను. అవయవ పటుత్వము, ఆగ్రహము, ధైర్యము వలననే కదా జయము లభించునది!

జయము కోరువాడు స్వభాగధేయమున ఇంద్రుని యజించవలెను. ఇంద్రుడే అతనికి అవయవ పటుత్వమును, ఆగ్రహమును ధైర్యమును కలిగించును. అతడు యుద్ధమున జయించును.

**5.** గ్రామము కోరువాడు మరుత్తులతో కూడిన ఇంద్రునకు తెల్లని తొడగల పశువును వధించవలెను. మరుత్వంతుడగు ఇంద్రుని స్వభాగధేయమున యజించవలెను. ఇంద్రుడే అతనికి సోదరులను మిత్రులను ఇచ్చును. అందువలన అతడు నిశ్చయముగ గ్రామాధిపతి అగును.

**6.** ఆబోతు ఇంద్రసంబంధి, తెల్లని తొడగలది, మారుత సంబంధి, రెండును సమృద్ధి కలిగించునవి అగుచున్నవి.

7. పశువు తొడల వెనుక భాగము తెల్లగా ఉండవలెను. అందువలన యజమానిని ప్రజలు అనుసరింతురు.

8. అన్నము కోరువాడు పింగళవర్ణ పశువును - సోమ దేవతాకమును వధించవలెను. అన్నము సోమదేవతాకము కదా! స్వభాగధేయమున సోముని సేవించవలెను. అప్పుడు సోముడే అతనికి అన్నము ఇచ్చును. అతడు అన్నము తినువాడు అగును.

9. పశువు పింగళవర్ణపుది కావలయును. అది అన్నరూపమగును. యజమానికి సమృద్ధి కలుగును.

10. ఒకడు సమర్థుడు అగును. కాని రాజ్యము లభించదు. అప్పుడు అతడు సోమదేవతాకమగు పశువును బలి ఇవ్వవలెను. రాజ్యము సోమదేవతాకము కదా!

అతడు స్వభాగధేయమున సోముని భజించవలెను. సోముడే అతనికి రాజ్యము ప్రసాదించును. అతడు రాజ్యము కలవాడు అగును.

పింగళపశువు సోముని రూపమగును. అది అతనికి సమృద్ధి కలిగించును.

11. ఒకడు సంపద కోల్పోవును. మరల ప్రతిష్ఠ సాధించతలచును. అట్టివాడు ఇంద్రదేవతాకమగు నొసట నామము, ముఖము వైపునకు తిరిగిన కొమ్ములు గల పశువును ఆలంభనము చేయవలెను. అందువలన నరకమునకు పోవు పాపము చేసిన వాడైనను ప్రతిష్ఠనొందుచున్నాడు.

12. ఎవడు పాపములచే బాధించబడువాడు - తనకు హాని తలపెట్టు శత్రువు కలవాడు అగునో అతడు శత్రుంజయుడగు ఇంద్రుని స్వభాగధేయమున యజించవలెను. ఆ ఇంద్రుడే, అతని పాపములను, హానితలపెట్టు శత్రువును దూరము చేసినవాడు అగును.

13. రాజ్యమునకు సమర్థుడయ్యు రాజ్యము లభించని వాడు వజ్రియగు ఇంద్రుని కొరకు నొసట నామము, ముఖము వైపు తిరిగిన కొమ్ముల పశువును వధించవలెను. అతడు స్వభాగధేయమున వజ్రియగు ఇంద్రుని యజించవలెను. అట్లయిన ఇంద్రుడే అతనికి వజ్రాయుధమును ప్రదానము చేయును. ఆ వజ్రము శత్రువులను వధించును. అతనికి రాజ్యము లభించును.

లలాటమున నామము, ముఖమువైపు తిరిగిన కొమ్ములు గల పశువు వజ్రరూపమగును. వంగిన కొమ్ములు పదునుకలవి. అందువలన వానిని వజ్రరూపముగ చెప్పబడినది.

## నాలుగవ అనువాకము

1. అతడు ఆదిత్యుడు. అతని వెలుగు సన్నగిల్లినది. దేవతలు అందుకు పరిహారము చేయదలచినారు. పది వృషభముల గుంపును వధించినారు. అందువలన ఆదిత్యునకు కాంతి కలిగినది.

**2.** బ్రహ్మవర్చస్సు కోరువాడు ఆదిత్యునకు పది వృషభముల గుంపును బలి ఇవ్వవలెను. ఆదిత్యుని స్వభాగధేయమున పూజించవలెను. అప్పుడు ఆదిత్యుడు అతనికి బ్రహ్మవర్చస్సు ప్రసాదించును. అతడు బ్రహ్మవర్చస్సు కలవాడు అగును.

**3.** వసంతకాలపు ఉదయమున నొసట నామము గల మూడు పశువులను వధించవలెను. గ్రీష్మ కాలపు మధ్యాహ్నమున తెల్లని వెనుక భాగము గల మూడు పశువులను వధించవలెను. శరత్కాలపు అపరాహ్ణమున తెల్లని తోకలు గల మూడు పశువులను వధించవలెను.

**4.** సూర్యునకు మూడు తేజస్సులు కలవు. ఆ తేజస్సులన్నియు యజమాని యందు చేరును.

**5.** మూడు మూడు పశువుల వధ వలన యజమానికి తేజస్సు కలిగినది కదా! అది అతనికి తరువాత కాలమందున కూడ కలుగును.

**6.** సంవత్సరమున - ఋతువులననుసరించి - పశువులను వధించవలెను.

**సంవత్సరోవై బ్రహ్మ వర్చసస్య ప్రదాతా సంవత్సర ఏవాస్మై బ్రహ్మ వర్చసం ప్రయచ్ఛతి బ్రహ్మ వర్చస్యేవభవతి.**

అర్థమునకు 2 - 1 - 2 - 9 చూడండి.

**7.** సంవత్సరము తరువాత ప్రజాపతి దేవతాకమైన పింగళ వర్ణ పశువును వధించవలెను. **ప్రజాపతి ప్సర్వాదేవతా.** కావున దేవతలందరు యజమాని యందు ప్రవేశింతురు.

**8.** చర్మము చెడుచున్నదని - కుష్ఠు కావచ్చును - అని భయపడువాడు సోమ, పూష దేవతాకమగు నల్లని పశువును బలి ఇవ్వవలెను. దేవతలందు సోముడు, నరస్వరూపుడు. పూష పశు స్వరూపుడు. సోముడు తన ప్రభావముననను, పూషయొక్క పశు ప్రభావముననను అతని చర్మమును బాగు చేయును. **దుశ్చర్మా వభవతి.** చెడు చర్మపు వాడు కాకుండును.

**9.** దేవతలకు, యమునకు ఈ లోకము విషయమున వివాదము ఏర్పడినది. యముడు దేవతల బలమును విడదీసినాడు. అందువలననే అతనికి యమత్వము. దేవతలు యముడే అధిపతి అనుకున్నారు.

ఆ దేవతలు ప్రజాపతి వద్దకు వెళ్లినారు. ప్రజాపతి తన నుండి వృషభమును, వంధ్య పశువును రెండింటిని ఏర్పరచినాడు. దేవతలు విష్ణు, వరుణ దేవతాకమగు వంధ్య పశువును ఇంద్ర దేవతాకమగు వృషభమును రెండెంటిని వధించినారు. ఆ విధముగా యముని వరుణ పాశమున కట్టించి యజ్ఞరూపుడగు విష్ణువుచే వెడలగొట్టించినారు.

ఇంద్రుని వలననే యముని బలమును నశింపచేసినారు.

**10.** శత్రువులు గలవాడును, వివాదములు గలవాడును విష్ణు వరుణ దేవతాకమగు వంధ్య పశువును - ఇంద్ర దేవతాకమగు వృషభమును బలి ఇవ్వవలెను. వరుణుడు తన పాశముల చేత శత్రువును కట్టివేయును. యజ్ఞ స్వరూపుడగు విష్ణువు శత్రువును వెళ్లగొట్టును. ఇంద్రుడు శత్రు బలమును నశింపచేయును. యజమాని విజయవంతుడు అగును. శత్రువు పరాభూతుడు అగును.

**11.** ఇంద్రుడు వృత్రుని వధించినాడు. హతుడైన వృత్రుడు పదునారు శరీరముల వాడయినాడు. ఇంద్రుని పదునారు పాశముల వంటి తన దేహముతో బంధించినాడు.

హతుడైన వృత్రుని తల నుండి గోవులు పుట్టినవి. ఆ విధముగా అవతరించిన గోవులు విశిష్ట దేహములు కలవి అయినవి. ఆ గోవుల వెనుక ఒక ఎద్దు పైకి లేచినది. ఇంద్రుడు ఆ వృషభమును తన ఆత్మగా భావించి పూజించినాడు. ఈ వృషభమును బలి ఇచ్చినాడు. ఇందువలన పాప పాశ బంధముల నుండి విముక్తుడు అగుదును అని భావించినాడు.

ఆ విధముగా భావించిన ఇంద్రుడు అగ్ని దేవతాకమగు నల్లని మెడ పశువును వృషభమును వధించినాడు. ఇంద్రుడు స్వభాగ ధేయమున చేసిన పూజలకు అగ్ని సంతోషించినాడు. వృత్రుని పదహారు దేహములను, వృత్రుని కూడ కాల్చివేసినాడు.

తన సంబంధ యాగము చేసిన ఇంద్రుడు మరల తన బల వీర్య సామర్థ్యములను పొందినాడు.

**12.** పాపముల పాలైన వాడు అగ్ని దేవతాకమగు కృష్ణ గ్రీవమును ఇంద్ర దేవతాకమగు వృషభమును వధించవలెను. స్వభాగ ధేయమున అగ్నిని పూజించవలెను. అందుకు సంతృప్తుడైన అగ్ని అతని పాపములను దహించును. ఇంద్రయాగము చేసిన అతడు బలవీర్యములు కలవాడగును. పాపముల నుండి విముక్తుడు అగును.

**13.** రాజ్యము కోల్పోయిన వాడు ద్యావాపృథ్వీ దేవతాకమగు ధేనువును వధించవలెను. ఏదో కారణముల వలన ఈ లోకము నందును, స్వర్గమునందును ప్రతిష్ఠ కోల్పోయినవాడు "జ్యోగపరుద్ధః" చిరకాలము రాజ్యము కోల్పోయినవాడు అనబడును. అతడు స్వభాగ ధేయమున ద్యావాపృథ్వులను పూజించవలెను. ఆ ద్యావాపృథ్వులే అతనికి సుప్రతిష్ఠ కలిగించును. అతడు ప్రతిష్ఠ పొందినవాడు అగుచున్నాడు.

**14.** ఒక గోవు గర్భము దాల్చును. ప్రసవ కాలము వచ్చినను ప్రసవించదు. తరువాత ప్రసవించును. అట్టి గోవును 'పర్యారిణి' అందురు.

చిరకాలము రాజ్యము కోల్పోయిన వాని రాజ్యము 'పర్యారి' అగును.

ఈనిన తరువాత గోవునకు వలె యజమానికి రాజ్యము కలిగినంత సమృద్ధి కలుగును.

**15.** చిరకాలము రాజ్యము కోల్పోయినవాడు వాయు దేవతాకమగు దూడను వధించవలెను. వాయువు ద్యావాపృథ్వులకు దూడయగును కదా!

దేశము విముఖము, ప్రజలు విముఖులు అయినట్టివాడు "జ్యోగపరుద్ధుడు" అనబడును. అతడు వాయువును స్వభాగధేయమున పూజించవలెను. అప్పుడు వాయువే దేశమును, ప్రజలను అతనికి సుముఖులను చేయును. అతనికి దేశము, ప్రజలు మణిముక్తాది ధనములను సమర్పింతురు. అతడు ఇతర ప్రజను సహితము పాలించు ప్రతిష్ఠ కలవాడగును.

### అయిదవ అనువాకము

**1.** 'బలుడు' అనువాడు రాక్షసుడు. అతడు పెక్కు గోవులను దొంగిలించినాడు. ఒక గుహయందు దాచినాడు.

ఇంద్రునకు ఆ విషయము తెలిసినది. అతడు వానిని విడిపించదలచినాడు. అతడు బిలమునకు అడ్డము పెట్టిన రాతిని తొలగించినాడు. బిలమునందలి శ్రేష్ఠపశువు వెనుక భాగము పట్టుకొని పైకి లేపినాడు. బయటికి తెచ్చినాడు. ఆ వచ్చినది యూధపతి. అందువలన పశువులన్నియు బయటకు వచ్చినవి.

ఆ యూధపతి పశువు మొదలే గొప్పది. ఇంద్రుడు లేవనెత్తుట వలన అది మరింత ఉన్నతము అయినది.

**2.** పశువులను కోరువాడు ఇంద్ర దేవతాకమగు ఉన్నత పశువును బలి ఇవ్వవలెను. అతడు స్వభాగ ధేయముచే ఇంద్రుని సేవించవలెను. **పః అస్మై పశూన్ ప్రయచ్ఛతి. అయమ్ పశూమాన్ భవత్యేవ.**

**3.** ఉన్నత పశువు ఆలంభన యోగ్యము అగును. పశువు ఉన్నతమగుట వలన అది వేల పశువులసంపదరూపలక్ష్మి అగుచున్నది. అందువలన యజమానికి పశుసంపదరూపలక్ష్మి లభించుచున్నది.

**4.** యజమానికి పశు సంపద రూపలక్ష్మి లభించినదికదా! తదనంతరము అతడు విష్ణు దేవతాకమగు పొట్టి ఆవును ఆలంభనము చేయవలెను. ఆ పొట్టి పశువు వేల గోవుల మీదిది అగును కదా! అందువలన అది పశువులకు, పశు సంతానమునకు గడ్డి, నీరు సమృద్ధిగా గల ప్రదేశమును కలిగించును.

**5.** వేయి పశువుల పొందుటకు ఎవడు అర్హుడు అను విషయము అభిజ్ఞులు చెప్పుచున్నారు:-

అహోరాత్రుల కొరకు వేయి పశురూపమైన వామన పశువును వధించవలెను. ఏలనన అహోరాత్రులే పశువులు కదా! ఆ విధముగా చేయుట వలన పశువులకు, పశు సంతానమునకు తృణ, జల సమృద్ధిగల ప్రదేశము కలుగును.

**6.** సంతానము కోరువాడు ఓషధులకు గర్భవినాశిని అగు గోవును బలి ఇవ్వవలెను.

సంతానము కలిగించుటకు సమర్థుడయ్యు సంతానము లేనివాడు అగుచున్నాడో అతనిని ఓషధులే బాధించుచున్నవి. ఓషధులు గోవునకు గర్భనాశనము కలిగించుచున్నవి. ఆ ఓషధులే గర్భనాశనమును పరిహరించుచున్నవి.

సంతానార్థ ఓషధులను స్వభాగధేయమున యజించవలెను. ఓషధులే అతని వీర్యము వలన సంతానమును కలిగించుచున్నవి. అతడు సంతానము కలిగినవాడు అగుచున్నాడు.

**"ఆపోవా ఓషధయః"** - జలములే ఓషధులగును. యజమానికి కలుగు పుత్రుడు - ఏర్పడకముందు - 'అసత్' అగుచున్నాడు. ఓషధులే అతనికి 'అసత్' నుండి 'సత్' ను ప్రసాదించుచున్నవి. అందువలనను - ఈ విషయము తెలిసినవాడును - తెలియని వాడును జలమే 'అసత్' నుండి 'సత్'ను కలిగించును అని తెలియవలెను.

('అసత్' లేనిది. 'సత్' ఉన్నది. జలములే లేనిదాని నుండి ఉన్నది కలుగుటకు కారణములు అగుచున్నవి అని చెప్పుట.)

**7.** ఐశ్వర్యము కోరువాడు - ఒకసారి ఈనిన గొడ్డుమోతుదైన గోవును వధించవలెను.

సంపద సంపాదించు సామర్థ్యము కలిగియు సంపన్నుడు కాకున్నాడో వాడు పుట్టియు పుట్టనివాడు అగుచున్నాడు. ఆ గోవు తొలుత ఇంద్ర సమమైన గోవును కని కదా వంధ్య అయినది!

కావున సంపద ఆశించువాడు - స్వభాగధేయమున ఇంద్రుని యజించవలెను. అందువలన ఇంద్రుడు అతనికి ఐశ్వర్యము కలిగించును. అతడు నిశ్చయముగా ఐశ్వర్యవంతుడు అగుచున్నాడు.

**8.** ఏ గోవు - ఒక దూడను కని వంధ్య అయినదో ఆ దూడనే ఆలంభనము చేయవలెను. ఆ దూడ ఇంద్ర స్వరూపము అగును. అందువలన యజమాని ఇంద్రియము కలవాడు అగుచున్నాడు.

**9.** తాత, తండ్రి, తాను వరుసగా సోమపానము చేయనివాడు విచ్ఛిన్నుడు అగుచున్నాడు. ఆ దోష నివారణమునకు ఇంద్రాగ్ని దేవతాకమగు ఎద్దును ఆలంభనము చేయవలెను.

విచ్ఛిన్నుడైన బ్రాహ్మణుడు ఇంద్రాగ్నులను - స్వభాగధేయమున - యజించవలెను. ఆ విధముగా చేయుట వలన ఇంద్రాగ్నులే అతనిని సోమపానము చేసినవానిని చేయుదురు.

**10.** పశువు ఇంద్ర దేవతాకము. సోమము వీర్యవృద్ధి హేతువు. సోమపానము ఇంద్రియ వృద్ధిహేతువు అగుట వలన ఇంద్రియ రూపముగా చెప్పబడినది. సోమపానము వలన ఇంద్రియ రూపమును పొందును. పశువు అగ్ని దేవతాకము. బ్రాహ్మణుడు అగ్ని సంబంధి కదా! కావున అతడు తన రూపమునే కొనసాగించినవాడు అగుచున్నాడు.

**11.** కొంతకాలము పొలము దున్నుట మొదలగు పనులు చేసి మానిన ఎద్దు 'పునరుత్సృష్ట' అనబడును. పితరులు సహితము సోమపానము చేసి మానినందున పునరు త్సృష్ట పశువధ వలన యజమానికి సమృద్ధి కలగును.

(ఇది సాదృశ్యము.)

**12.** శత్రువునకు హాని తలపెట్టిన వాడు బ్రహ్మణస్పతి దేవతాకమగు కొమ్ములు లేని పశువును వధించవలెను. బ్రహ్మణస్పతిని స్వభాగధేయమున యజించ వలెను. బ్రహ్మణస్పతి అతని శత్రువునకు హాని కలిగించును. వెంటనే శత్రువు మరణించును.

**13.** కొమ్ములు లేని పశువు లక్ష్మీసహితమగును. ఆ లక్ష్మి మంగలి కత్తి వలె పదునైన వజ్రము అగును. అందువలన అది యజమాని సమృద్ధికి కారణము అగుచున్నది.

**14.** యూపము స్ఫ్య కావలెను. స్ఫ్య వజ్రమగును. వజ్రమే యజమాని శత్రువును సంహరించును.

**15.** బర్హిస్సు రెల్లుకావలెను. అది యజమాని శత్రువును నిశ్చయముగా వధించును.

**16.** ఈ శత్రువును తాండ్ర చెట్టు సమిధ వధించుట నిశ్చయము.

**ఆరవ అనువాకము**

**1.** ఎవడు సమానులందు అధికుడు కాదలచునో, ఎవడు గ్రామాధికారము కోరునో అతడు బృహస్పతి దేవతాకమగు తెల్లని వెనుక భాగము కల పశువును ఆలంభనము చేయవలెను. బృహస్పతిని స్వభాగధేయమున యజించవలెను. బృహస్పతియే అతనిని సమానులందు అధికుని చేయును.

**2.** తెల్లని పృష్ఠభాగము కల పశువు బృహస్పతి దేవతాకము అగును. కావున బృహస్పతి సమృద్ధి కలిగించును.

**3.** అన్నము కోరువాడు పూషదేవతాకమగు నల్లని పశువును వధించవలెను. అన్నము పూషదేవతా స్వరూపము. అతడు పూషను స్వభాగధేయమున అర్చించవలెను. పూషదేవతయే అతనికి అన్నము కలిగించును. అతడు అన్నవంతుడు అగును.

**4.** పశువు నల్లనిది కావలెను. నలుపు అన్నపు రూపము అగును. కావున అది యజమానికి అన్న సమృద్ధి కలిగించును.

**5.** అన్నము కోరువాడు మరుద్దేవతాకమగు తెల్లని పశువును బలి ఇవ్వవలెను. **అన్నం వైమరుతః** అన్నము మరుత్తులు అగుచున్నది.

యజమాని మరుత్తులను స్వభాగధేయమున యజించవలెను. మరుత్తులే అతనికి అన్నము కలిగింతురు. అతడు అన్నవంతుడు అగును.

**6.** పశువు తెల్లనిది కావలెను. తెలుపే అన్నపు రూపమగును. అది యజమానికి అన్న సమృద్ధి కలిగించును.

**7.** బలము కోరువాడు ఇంద్ర దేవతాకమగు ఎర్రని పశువును వధించవలెను. యజమాని ఇంద్రుని స్వభాగధేయమున యజించవలెను. ఇంద్రుడే అతనికి బలము కలిగించును. అతను బలశాలి యగును.

**8.** పశువు దట్టమైన కనుబొమలు కలదికావలెను. దట్టపు కనుబొమలు ఇంద్రుని రూపమగును. ఆ పశువు యజమానికి సమృద్ధి కలిగించును.

**9.** ఇతరులు చేయు దానమును తాను కోరువాడు సవితృ దేవతాకము, కలగలపు రంగుగల పశువును వధించవలెను. సూర్యుడు ప్రేరణ కలిగించువాడు అగును అతడు దానము చేయువానికి ప్రేరణ కలిగించును. దానము కోరువాడు సవితృదేవుని స్వభాగధేయమున కొలువవలెను. సవితా దేవతయే ఇతనికి దానమిచ్చు దాతకు ప్రేరణ కలిగించును. ప్రజలు అతనికి భూరి దానములు చేయుదురు.

**10.** పశువు కలగలుపు రంగుది కావలెను. అప్పుడు అది సవితృదేవతాకమగును. యజమానికి సమృద్ధి కలిగించును.

**11.** అన్నము కోరువాడు విశ్వేదేవతాకమైన అనేక రంగుల పశువును వధించవలెను. అన్నము విశ్వేదేవతాకమగును. యజమాని విశ్వేదేవతలను స్వభాగధేయమున పూజించవలెను. ఆ దేవతలే అతనికి అన్నము కలిగింతురు. అతడు అన్నవంతుడు అగును.

**12.** పశువు బహురూపము అనేక రంగులది కావలెను. అన్నము కూడ - భక్ష్య భోజ్య, లేహ్య, చోష్య - బహురూపములు కలదికదా! ఆ పశువు యజమానికి సమృద్ధి కలిగించును.

**13.** గ్రామము కోరువాడు విశ్వేదేవతాకమగు బహువర్ణ పశువును వధించవలెను. విశ్వేదేవతలు అనేకులు అయినందున అనేక బంధువుల సామ్యులు అగుదురు కదా!

యజమాని విశ్వేదేవతలను, తన భాగధేయమున యజించవలెను. వారే అతనికి సకల బంధువులను కలిగింతురు. అతడు గ్రామాధిపతి అగును.

**14.** బహువర్ణ పశువు బహుదేవతాకము అగుచున్నది. అది యజమానికి సమృద్ధి కలిగించుచున్నది.

**15.** రోగలక్షణములు కనిపించవు. బలహీనమగుచుండును. అది దీర్ఘకాలము కొనసాగును. అట్టి వ్యాధిగ్రస్తుడు ప్రజాపతి దేవతాకమైన, కొమ్ములు లేని ఎద్దును వధించవలెను. దీర్ఘరోగము వైద్యునికి తెలియక పోయినను ప్రజాపతికి తెలియును కావున రోగి ప్రజాపతిని తన భాగధేయమున అర్చించవలెను. ప్రజాపతియే అతనికి అజ్ఞాత రోగము నుండి విముక్తి కలిగించును.

**16.** పశువు కొమ్ములు లేనిది కావలెను. అట్లగుటచే అది ప్రజాపతి దేవతాకము అగును. అది యజమానికి సమృద్ధి కలిగించును.

## ఏడవ అనువాకము

**1.** వషట్కార దేవత గాయత్రి శిరమును ఖండించినాడు. ఆ శిరము నుండి జలము, రక్తము బయల్వెడలినది. దానిని తొలుత బృహస్పతి గ్రహించినాడు. అది వెనుక భాగము తెల్లగా ఉన్న వంధ్య పశువు అయినది. రెండవసారి పడిన దానిని మిత్రావరుణులు సేకరించినారు. అది రెండు రంగుల వంధ్యపశువు అయినది. మూడవసారి విశ్వేదేవతలు సేకరించినారు. అది బహువర్ణ వంధ్య పశువు అయినది. నాలుగవసారి పడిన దానిని భూమి గ్రహించినది. ఇది తన అనుభవమునకు అగుగాక అని బృహస్పతి అనుకున్నాడు. అది వ్యర్థవీర్యమగు వృషభము అయినది. ఆ విధముగా పడిన ఎర్రని రక్తమును రుద్రుడు తీసికొన్నాడు. అది రుద్రదేవతాకమగు ఎర్రని వంధ్య పశువు అయినది.

**2.** బ్రహ్మవర్చస్సు కోరువాడు బృహస్పతి దేవతాకమగు తెల్లని వీపుగల పశువును ఆలంభనము చేయవలెను. యజమాని స్వకీయ భాగధేయమున బృహస్పతిని ఆరాధించవలెను. బృహస్పతియే అతని యందు బ్రహ్మవర్చస్సు కలిగించును. యజమాని బ్రహ్మవర్చస్సు కలవాడు అగును.

**3.** వంధ్య పశువు ఛందస్సుల రసరూపమగును. ఛందస్సుల రసరూపమే కదా బ్రహ్మవర్చస్సు. అందువలన అది బ్రహ్మవర్చస్సు కలిగించుచున్నది.

**4.** వర్షము కోరువాడు మిత్రావరుణ దేవతాకమగు రెండు రంగుల పశువును వధించవలెను. పగలు మిత్ర దేవతాకము - రాత్రి వరుణ దేవతాకము. మేఘుడు పగలు, రాత్రి వర్షించునుకదా!

యజమాని మిత్రావరుణులను స్వభాగధేయమున యజించవలెను. మిత్రావరుణులే అతని కొరకు రాత్రింబవళ్లు వర్షము కలిగింతురు.

వంధ్య పశువు ఛందస్సుల రసరూపమగును. వర్షము రసము వంటిది కదా! కావున యజమానికి వర్షము కలుగుచున్నది.

**5.** సంతానము కోరువాడు మిత్రావరుణ దేవతాకమగు రెండు రంగుల పశువును వధించవలెను. పగలు మిత్రసంబంధి. రాత్రి వరుణసంబంధి. రాత్రింబవళ్లు జననములు జరుగుచున్నవి.

వంధ్య పశువు ఛందస్సుల రసరూపమగును. రసమే సంతానము కదా! కావున యజమానికి సంతానము కలుగును.

**6.** అన్నము కోరువాడు విశ్వేదేవతాకమగు బహువర్ణ పశువును ఆలంభనము చేయవలెను. అన్నము విశ్వేదేవతా సంబంధియగును. యజమాని స్వభాగధేయమున విశ్వేదేవతలను యజించవలెను. విశ్వేదేవతలే అతనికి అన్నము కలిగింతురు. అతడు అన్నము కలవాడు అగును.

వంధ్య పశువు ఛందస్సుల రసరూపమగును. రసమే అన్నము అగును. అందువలన అన్నముగలవాడు అగుచున్నాడు.

**7.** గ్రామము కోరువాడు విశ్వేదేవతాకమగు బహువర్ణ పశువును బలి ఇవ్వవలెను. బంధుమిత్రులు విశ్వేదేవ సంబంధులు. యజమాని స్వభాగధేయమున విశ్వేదేవతలను పూజించవలెను. వారే అతనికి బంధుమిత్రులను సమకూర్చుదురు - అతడు గ్రామాధిపతి యగును.

వంధ్య పశువు ఛందస్సుల రసరూపమగును. రసమే బంధు మిత్రులగుదురు. అందువలన గ్రామాధిపత్యము కలుగును.

**8.** బ్రహ్మవర్చస్సు కోరువాడు బృహస్పతి దేవతాకమగు వ్యర్థవీర్య వృషభమును ఆలంభనము చేయవలెను. యజమాని స్వభాగధేయమున బృహస్పతిని అర్చించవలెను. బృహస్పతియే అతనికి బ్రహ్మవర్చస్సు కలిగించును. అతడు బ్రహ్మవర్చస్సు కలవాడు అగును.

**9.** ఆవులతో అడవులకు పోయి వానివెంట తిరిగి వచ్చునది వశః అగును. బ్రహ్మవర్చస్సు వశము వంటిది కదా! కావున అతడు బ్రహ్మవర్చస్సును పొందుచున్నాడు.

**10.** శత్రుసంహారము కోరువాడు రుద్ర దేవతాకమగు ఎర్రని పశువును వధించవలెను. యజమాని రుద్రుని స్వభాగధేయమున యజించవలెను. రుద్రుడే యజమాని శత్రువులను సమూలముగ ఖండించును. శత్రువు వెంటనే చచ్చును.

ఎర్రని పశువు రుద్ర సంబంధమైనది. అందువలన అది సమృద్ధి కలిగించుచున్నది.

**11.** యూపము స్ఫ్య కావలెను. స్ఫ్య వజ్రరూపము అగుచున్నది. యజమాని దీనినే శత్రువు మీద ప్రయోగించును. బర్హిసు రెల్లు కావలెను. అది శత్రువును అణచి తీరును.

సమిధ తాండ్ర చెట్టుది కావలెను. అది శత్రువును ఖండించి తీరును.

## ఎనిమిదవ అనువాకము

**1.** ఒకప్పుడు సూర్యుడు ప్రకాశింపకుండినాడు. దేవతలు సూర్యునకు ప్రకాశము కలిగించదలచినారు. వారు - సూర్య దేవతాకమైనదియు, తెల్లనిదియునగు, గొడ్డుటావును వధించినారు. దాని వలన దేవతలు సూర్యుని యందు కాంతిని స్థాపించినారు.

**2.** బ్రహ్మవర్చస్సును కోరువాడు - సూర్యదేవతాకమైనదియు, తెల్లదియునగు - గొడ్డుటావును వధించవలెను. అతడు తన భాగధేయమున సూర్యుని యజించవలెను. అప్పుడు సూర్యుడే అతని యందు బ్రహ్మవర్చస్సును ఏర్పరచును. అతడు బ్రహ్మవర్చస్సు కలవాడు అగుచున్నాడు.

**3.** యూపస్తంభము బిల్వ - మారేడు - సంబంధి కావలెను. సూర్యుడు పుట్టిన చోటునుండియే బిల్వము పుట్టినది. సూర్యుడు, బిల్వము ఒకే యోనినుండి పుట్టినారు. కావున - మారేడు యూపము వలన యజమానికి బ్రహ్మవర్చస్సు కలుగుచున్నది.

**4.** శత్రువధ కోరువాడు - బ్రహ్మణస్పతి దేవతాకమును, పింగళవర్ణపు చెవులు కలదియునగు పశువును ఆలంభనము చేయవలెను.

**5.** అతడు వరుణదేవతాకమగు దశ కపాలమును తొలుత నిర్వాపము చేయవలెను. అందువలన వరుణుడు శత్రువును బాధించును. బ్రహ్మణస్పతి శత్రువును పీడించును.

**6.** పశువు బభ్రుకర్ణి కావలెను. అది బ్రహ్మస్వరూపము అగును. అది యజమానికి సమృద్ధి కారణము అగుచున్నది.

**7.** యూపము దారుఖడ్గాకారము కావలెను. అది వజ్రాయుధమగును. శత్రువును వజ్రాయుధము వలె వధించును.

బర్హిస్సు రెల్లుకావలెను. అది శత్రువును నిశ్చయముగా హింసించును.

సమిధ తాండ్రసంబంధి కావలెను. అది శత్రువును ఛేదించి తీరును.

**8.** యజ్ఞమును చేయనివాడు - విష్ణుదేవతాకమును, పొట్టిదియునగు - పశువును బలి ఇవ్వవలెను. **విష్ణుర్వైయజ్ఞః.** విష్ణువే యజ్ఞము అగుచున్నాడు. యజమాని స్వభాగధేయమున విష్ణువును యజించవలెను. అప్పుడు విష్ణువే అతనికి యజ్ఞము కలిగించును. అతడు యజ్ఞము చేసినవాడు అగుచున్నాడు.

**వామనో భవతి వైష్ణవో** - పొట్టిది విష్ణుసంబంధి అగును. అది యజమానికి సమృద్ధి కలిగించును.

**9.** పశువులను కోరువాడు త్వష్టదేవతాకమగు వడబను వధించవలెను. **త్వష్టావై పశూనాం మిథునానామ్ ప్రజనయితా** - త్వష్టయే పశుమిథునమును సృష్టించుచున్నాడు. అతడు స్వభాగధేయమున త్వష్టను యజించవలెను. ఆ త్వష్టయే అతనికొరకు పశుమిథునములను కలిగించును.

**10.** ఒక పశువు మగది అయ్యు ఆడుదాని లక్షణములు కలిగి యుండును. దానిని చూచి ప్రజలు, పశువులు ఆడది అనుకొందురు. అట్టి ఆడదని భ్రమ కలిగించు సహజ పురుష పశువు వడబ అగును. అది యజమానికి వెంటనే పశువులను కలిగించు చున్నది.

**11.** **సంగ్రామే సంయత్తే సమయకామో** - సంగ్రామమునకు ఆయత్తమై సంధికోరువాడు - మిత్ర దేవతాకమగు, తెల్లని పశువును వధించవలెను. స్వభాగధేయమున మిత్రుని సేవించవలెను అప్పుడు మిత్రదేవతయే అతనికి మిత్రుని సమకూర్చును.

**12.** యూపము విశాలము కావలెను. అది సంధి కోరువానికి ధైర్యము కలిగించును.

**13.** వర్షము కోరువాడు ప్రజాపతి దేవతాకమగు నల్లని పశువును వధించవలెను. **ప్రజాపతిర్వై వృష్ట్యాఈశే** - ప్రజాపతియే వృష్టి కలిగించ సమర్థుడు అగును. **ప్రజాపతిమేవ స్వేన భాగధేయేనో ధావతి** - అతడు ప్రజాపతిని తన భాగధేయమున యజించవలెను. అతడే యజమానికి వర్షము కలిగించును.

**14.** పశువు నల్లనిది కావలెను. అదియే వర్షపు రూపము అగును. ఆ రూపముననే యజమానికి వర్షము కలుగుచున్నది.

**15.** పశువు కలగలుపు రంగులది అయినపుడు యజమానికి మెరుపుతో కూడిన వర్షము కలుగుచున్నది.

**16.** పశువు ముఖము వైపు వంగిన కొమ్ములు కలది అయినపుడు, అది యజమాని కొరకు వర్షమును నియంత్రించుచున్నది.

### తొమ్మిదవ అనువాకము

**1.** వరుణుడు సోమాభిషవము చేసినాడు. అయినను అతనికి అన్నాదులు లభించలేదు అప్పుడు అతనికి నల్లనిగొడ్డుటావు కంటపడినది. అతడు దానిని స్వ దేవతాకము చేసికొన్నాడు. దానిని ఆలంభనము చేసినాడు. అప్పుడే అతనికి అన్నాదులు లభించినవి.

**2.** ఒకడు అన్నాదులు ఆర్జించుటకు సమర్థుడు అగును. అట్లయ్యు అతడు అన్నాదులు ఆర్జించలేకపోవును. అట్టివాడు వరుణ దేవతాకమగు నల్లని పశువును వధించవలెను. వరుణుని స్వభాగధేయమున అర్చించవలెను. వరుణుడే అతనికి అన్నము ప్రసాదించును. అతడు అన్నము కలవాడు అగుచున్నాడు.

పశువు నల్లనిది కావలెను. అది వరుణ దేవతాకము అగును. దానివలన యజమానికి సమృద్ధి కలుగుచున్నది.

**3.** అన్నము కోరువాడు జలములు, ఓషధుల మధ్య మిత్రదేవతాకమగు తెల్లని పశువును - వరుణదేవతాకమగు నల్లని పశువును వధించవలెను. ఓషధులు మిత్ర దేవతాకములు. జలములు వరుణ దేవతాకములు. మనము జలముల, ఓషధుల రసముపై జీవించుచున్నాము.

అన్నము కోరువాడు మిత్రావరుణులను స్వభాగధేయమున యజించవలెను. వారే అతనికి అన్నము ప్రసాదింతురు. అతడు అన్నము కలవాడు అగుచున్నాడు.

**4.** జలములను ఓషధులను పొందుటకు జలముల ఓషధుల మధ్య ఆలంభనము చేయవలెను.

**5.** యూపము - **విశాఖః** - వివిధ శాఖలు కలది కావలెను. ఆ ఇరువురు దేవతలు యజమానికి సమృద్ధి కలిగింతురు.

**6.** దీర్ఘరోగము కలవాడు మిత్ర దేవతాకమగు తెల్లని పశువును, వరుణదేవతాకమగు నల్లని పశువును వధించవలెను. పశువు మిత్ర దేవతాకము. అందువలన మిత్రుని చేతనే వరుణుని శాంతింపచేయును. పశువు వరుణ దేవతాకము అయినందున వరుణుడు స్వయముగనే అతనిని వరుణ పాశముల నుండి విముక్తి కలిగించును. **యదీతాసుర్భవతి జీవత్యేవ** - గతాసువైనను జీవించును.

**7.** దేవతలు పుష్టిని పొందలేకపోయినారు. మానవ మిధునమునందు వారికి పుష్టి గోచరించినది. అయినను వారు పుష్టిని పొందలేక పోయినారు. అప్పుడు అశ్వినులు ఈ పుష్టి తమకు సంబంధించినదనియు ఇందును గురించి దేవతలు మాట్లాడరాదనియు అన్నారు. అందువలన ఆ పుష్టి అశ్వినీదేవతల వశము అయినది.

**8.** పుష్టిని కోరునట్టివాడు అశ్వినీ దేవతాకమగు కవలలుగా పుట్టినవానిలో ఆడ గొడ్డుటావును వధించవలెను. అశ్వినీ దేవతలను స్వభాగధేయమున సేవించవలెను. అశ్వినులు అతనికి పుష్టిని ప్రసాదింతురు. అతడు - **పుష్యతి ప్రజయా పశుభిః** - అతడు సంతానము, పశువులు కలిగి పుష్టికలవాడు అగును.

### పదవ అనువాకము

**1.** ఒకడు దుర్బ్రాహ్మణుడు. అట్లయ్యు సోమమును అభిషవించకోరును. అతడు నొసట తెల్లని మచ్చ కలిగి, మిగిలిన దేహము ధూమ్రవర్ణమైన పశువును వధించవలెను.

దేవతలందు అశ్వినులే సోమపానము చేయనివారై ఉండిరి. తదనంతరము వారు సోమపానమునకు అధికారము కలవారు అయినారు.

దుర్బ్రాహ్మణులకు అశ్వినులు దేవతలు అగుదురు. అతడు అశ్వినులను స్వభాగధేయమున అర్చించవలయును. అశ్వినులే అతనికి సోమపాన అధికారమును ప్రసాదింతురు. అతడు సోమపానమునకు అధికారి అగును.

పశువు ధూమ్రవర్ణము కలది అయినందున దుర్బ్రాహ్మణుని నుండి దౌర్బ్రాహ్మణ్యమును తొలగించును. పశువు నొసట తెల్లని మచ్చ అతనికి ముఖ్య తేజస్సును కలిగించును.

**2.** అతడు బ్రాహ్మణుని వధించడు. అయినను వధించినాడని అపవాదు కలుగును. అట్టివాడు వాయు దేవతాకమగు గోమృగమును వధించవలెను. హత్యచేయని వానిని చేసినాడని అపవాదు కలిగిన - అట్టిదానిని అపవిత్ర వాక్కు ఆక్రమించుచున్నది.

ఈ గోమృగము గ్రామమున సంచరించునది కాదు. అరణ్యమున సంచరించునది కాదు. అట్లే హత్యాపవాదమునకు గురియైనవాడు గ్రామమున ఉండడు. అరణ్యమున ఉండడు.

వాయువు దేవతలందు పవిత్రుడు. కావున స్వభాగధేయమున వాయువును పూజించవలెను. వాయువే అతనిని పవిత్రుని చేయును.

**3.** ఒకడు అశ్వినులను స్తుతించుచుండును. అప్పుడు సూర్యుడు ఆవిర్భవించును. జగమునకు తెల్లవారినను అతనికి తెల్లవారకుండును. అట్టివాడు సూర్యదేవతాకమగు పలు రంగుల పశువును వధించవలెను. అతడు స్వభాగధేయమున సూర్యుని అర్చించవలెను. సూర్యుడే అతని చీకటిని, పాపమును పోగొట్టును. రాత్రి అతనికి తెల్లవారును. చీకట్లను, పాపములను తరిమివేయును.

### పదకొండవ అనువాకము

**1.** ఇంద్రుడు మాకు విశ్వతస్పరీంద్రుడు, మరుత్తులు నరులు అగుదురు గాక.

**2.** హవిస్సులు సముపార్జించుచున్నాము. ఇంద్రుడు, అగ్ని మున్నగు దేవతలను - యజమానికి శ్రేయస్సు కలిగించమని హవిస్సులు అందుకొనమని ఆహ్వానించుచున్నాము.

ఇంద్రుడు సుముఖముగా ఆహ్వానించదగినవాడు. పాప విమోచనుడు. హితంకరుడు, స్వయంభువు. వర్షము కలిగించి పంటలు పండించువాడు. ఇంద్రుని, అగ్నిని, మిత్రుని, వరుణుని, భగుని, ద్యావాపృధ్వులను, మరుత్తులను, ఇతర దేవతలను యజమానికి శ్రేయస్సు కలిగించుటకు హవిస్సులు అందించుచు ఆహ్వానించుచున్నాను.

**3.** అగ్ని సర్వభక్షకుడు. అతడు మమ్ము సంతోషపెట్టును గాత. దినావసానము కలిగించు సూర్యుడు మమ్ము సంతోషపెట్టును గాత. వాయువు మమ్ము సంతోష పెట్టును గాత. నీటిని వర్షించు పర్జన్యుడు మమ్ము సంతోషపెట్టును గాత. ఇంద్ర, పర్వతములారా! మా పాపములను దూరము చేయండి. మేము హవిస్సులను ఇచ్చుచున్నాము. దేవతలందరు మమ్ము కరుణింతురు గాత.

**4.** మరుత్తులారా! మీరు హవిస్సుల కొరకు ఆతురులు అగుచున్నారు. మీరు తృప్తిని కోరుచున్నారు మిమ్ము - మాకు ప్రియములగు నామములతో ఆహ్వానించుచున్నాము.

**5.** మరుత్తులు పురోవాతరూపులు. జనులకు సుఖమును, శ్రేయస్సును కలిగించువారు. వారు తమ ప్రకాశమాన కిరణములచే భూమిని తడుపవలెను అనుకొనుచున్నారు. వారు మంత్ర సహిత హవిస్సును ఆరగించినారు. అందువలన వారు ఉత్సాహవంతులు అయినారు. కేకలు వేయుచున్నారు. తమ ఇండ్ల వైపు సాగుచున్నారు. నిర్భయముగా మరుత్తుల స్థానమునకు చేరుచున్నారు.

**6.** అగ్ని మమ్ము రక్షించును గాత. రుద్ర సహిత సోముడు మమ్ము స్వయముగా రక్షించును గాత. మరుత్సహిత ఇంద్రుడు మాకు ఋతువులకు తగిన భోగములు కలిగించును గాత ఆదిత్య సహిత వరుణుడు మమ్ము యజ్ఞములు చేయువారిని చేయును గాత.

**7.** వసువులతో కూడిన అగ్ని మాకు అనుష్ఠానము తెలుపును గాత. రుద్ర సంబంధ తనువులతో కూడిన సోముడు మాకు అనుష్ఠానమును తెలుపును గాత. యజ్ఞయోగ్యులైన మరుత్తులతో కూడిన ఇంద్రుడు మాకు అనుష్ఠానమును తెలుపును గాత. ఆదిత్య సహిత వరుణుడు మాకు అనుష్ఠానము తెలుపును గాత.

**8.** ఆదిత్యులు వసువులతో సంగతులగుదురు. మరుత్తులు రుద్రులతో సంగతులగుదురు. అగ్నీ! అట్లే నీవు విశ్వేదేవతలతో సంగతుడవు అగుము. సకల దేవతలు - శత్రువు అపహరింపజాలని ఐశ్వర్యవంతులు అగుదురుగాక. సమాన మనస్కులు అగుదురుగాక.

**9.** స్విష్టకృద్దేవుని అనుగ్రహమున మానవులు ఎచ్చటెచ్చటనో ఆనందించుచున్నారు. ఆ దేవునకు యజమానులు సమంత్రకముగా ఆహుతులు సమర్పించుచున్నారు. ఇంధనములు ప్రజ్వలింప చేయుచున్నారు. ఫలములు పొందుచున్నారు. అట్టి స్విష్టకృద్దేవత ప్రసన్నుడు అగును గాత.

**10.** స్విష్టకృద్దేవర అనుగ్రహమున కోరిన అన్నములను పొందుచున్నాము. యజమానులము హోమ యోగ్యములగు ద్రవ్యములు పొందుచున్నాము. అందువలన ధన, బల, యజ్ఞ ప్రకాశములు పొందుచున్నాము. అట్లు మమ్ము అనుగ్రహించిన స్విష్టకృద్దేవుని భజించుచున్నాము.

**11.** ఈ యజ్ఞము దేవతల సుఖము కొరకు జరుగుచున్నది. ఆదిత్యులారా! మీరు మాకు సుఖములు ప్రసాదించండి మీ అనుగ్రహము మాకు మరల మరల కలుగును గాత. పాపములను నశింపచేయునది యగు మీ అనుగ్రహబుద్ధి మా పరిచర్యలను గుర్తించును గాక.

**12.** యజమాని అన్న, భోగాదులు కలవాడు. శత్రువును ధిక్కరించగలవాడు. దీర్ఘాయువు, ఉత్తమ పుత్ర, భృత్యవంతుడు. అతడు శుచిమంతుడై యజ్ఞ ఫలమును శీఘ్రముగ పొందుచున్నాడు. ఆదిత్యులను సేవించునట్టి ఆ యజమానికి శత్రువులు దూరమునుండి గాని దగ్గర నుండి గాని నష్టము కలిగింపజాలరు.

**13.** ఆదిత్యులు తొలగిన వానిని తమ దేశమున స్థాపింతురు. జగత్తును అనుగ్రహింతురు. జగత్పాలనకు నిశిత బుద్ధి కలవారు. ప్రకాశించువారు. జగద్రక్షకులు. అసుర్యమును రక్షించువారు. సత్యవాక్కులు, శత్రువునకు రుణాది బాధలు కలిగించువారు. అట్టి ఆదిత్యులు మా కోరికలను తీర్చుదురు గాక.

**14.** అర్యమ, వరుణ, మిత్రాది నామములు గల ఆదిత్యులారా! మీ మహిమ గొప్పది రమణీయము. ఆ మహిమచే మీరు స్వర్గ, మర్త్య, పాతాళములను సూర్య, చంద్ర, వహ్నులను యజమాని యజ్ఞమునందలి మనో వాక్కాయ కర్మలను సత్యవచనులై పాలించుచున్నారు.

**15.** అభీష్టసిద్ధి కలిగించుటకు సమర్థులైన క్షతియులవంటివారును, మరిన్ని సుఖములు ప్రసాదించువారును అగు ఆదిత్యులను మమ్ము రక్షించుమని ప్రార్థించుచున్నాము.

**16.** ఆదిత్యులారా! మీరు వసతి ప్రసాదించువారు. నేనో బాలుని వంటి వాడను. బుద్ధిపండని వాడను. కాతర చిత్తుడను. ఉత్తర, పశ్చిమ, తూర్పు, పడమర దిక్కులు సహితము తెలియనివాడను. శత్రు భయరహితమగు మీ అభయ జ్యోతిని అర్థించుచున్నాను.

**17.** మేము యజమానులము. ఆదిత్యులు మాకు నూతన రక్షణలు కల్పించినారు. శాంత, సుఖయుక్త సంపద కలిగియున్నాము.

ఆదిత్యులారా! మీరు మా నిరపరాధత్వమును నిలిపి ఉంచండి. మా స్తుతులు ఆలకించండి. మా యజ్ఞమును శీఘ్రముగా రక్షించండి.

**18.** వరుణదేవా! నా పిలుపును ఆలకింపుము. మాకు సుఖములు కలిగించుము. నేను నీ పాలన కోరుచున్నాను. నిన్ను మిక్కిలిగా ప్రార్థించుచున్నాను.

**19.** యజమాని రక్షణల కొరకని నిన్ను సమంత్రకముగ నమస్కరించి ప్రార్థించుచున్నాను. యజమాని హవిస్సులు అర్పించి అట్టి రక్షణలు వేడుకొనుచున్నాడు.

విశాలస్తుతిమంతా! వరుణదేవా! మా విన్నపముల నెరుంగుము. మా ఆయువును తగ్గించకుము.

శ్రీమదాంధ్రవచన కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత
రెండవ కాండమునందలి మొదటి ప్రపాఠకము సమాప్తము.

## రెండవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

1. ప్రజాపతి ప్రజలను సృష్టించినాడు. ఆ విధముగా సృష్టించబడిన ప్రజలను ఇంద్రాగ్నులు దాచినారు. ప్రజలను ఇంద్రాగ్నులు దాచిన విషయము ప్రజాపతి గ్రహించినాడు. అతడు పదకొండు పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేసినాడు. అప్పుడు ఇంద్రాగ్నులు ప్రజలను ప్రజాపతికి సమర్పించినారు.

2. ఒకడు సంతానము కలిగించుటకు సమర్థుడు అగును. అయినను అతనికి సంతానము కలుగదు. అతని సంతానమును ఇంద్రాగ్నులు దాచిపెట్టుచున్నారు. అట్లగుట వలన సంతానము కోరువాడు ఇంద్రాగ్ని దేవతాకమగు పురోడాశమును పదకొండు పాత్రలందు నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున ఇంద్రాగ్నులను సేవించవలెను. అప్పుడు ఇంద్రాగ్నులే సంతానార్థికి సంతానము అనుగ్రహింతురు. అతడు సంతానవంతుడు అగును.

3. భూమి, బంధు విషయములందు స్పర్ధ కలవాడు ఇంద్రాగ్ని దేవతాకములైన పదకొండు పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున ఇంద్రాగ్నులను సేవించవలెను. ఇంద్రాగ్నులు శత్రువును నిర్వీర్యుని చేయుదురు. యజమాని ఎంతటి పాపిష్ఠి శత్రువులనైనను గెలిచి విజయవంతుడు అగును.

4. యుద్ధమునకు తరలు వాని ఇంద్రియగత వీర్యము తొలిగిపోవును. అందువలన యుద్ధము చేయపోవువాడు ఇంద్రాగ్ని దేవతాకమగు పదకొండు పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున ఇంద్రాగ్నులను సేవించవలెను. వారే అతని యందు ఇంద్రియగత వీర్యమును చేర్చెదరు. అతడు ఆ వీర్యమున యుద్ధమునకు తరలును. యుద్ధమునందు విజయము సాధించును.

5. యుద్ధము నందు జయించినవాడు ఇంద్రియగత బలము పోగొట్టుకొనువాడు అగుచున్నాడు అందువలన అతడు ఇంద్రాగ్ని దేవతాకమగు పదకొండు పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను. అతడు స్వభాగధేయమున ఇంద్రాగ్నులను సేవించవలెను. అప్పుడు ఇంద్రాగ్నులే అతనికి శక్తి సామర్థ్యము కలిగింతురు. అతడు ఇంద్రియగత సామర్థ్యము గలవాడు అగుచున్నాడు.

6. సభను జయించకోరువాని ఇంద్రియగత వీర్యము తొలిగిపోవును. అందువలన అతడు ఇంద్రాగ్ని దేవతాకమగు పదకొండు పాత్రలందు పురోడాశము నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున ఇంద్రాగ్నులను సేవించవలెను. అప్పుడు ఇంద్రాగ్నులు అతనికి ఇంద్రియ గత సామర్థ్యము కలిగింతురు. ఆ సామర్థ్యమున అతడు సభను జయించును.

7. ఇంకను అతడు పూష దేవతాకమగు చరువును నిర్వాపము చేయవలెను. పూషదేవతయే ఇంద్రియగత సామర్థ్యము కలిగించగలవాడు. అందువలన స్వభాగధేయమున పూషదేవతను సేవించవలెను. అప్పుడు పూషదేవతయే అతనికి ఇంద్రియగత సామర్థ్యము కలిగించుచున్నాడు.

8. సభకు చేరువాడు క్షేత్రపతి దేవతాకమగు చరువును నిర్వాపము చేయవలెను. భూమియే క్షేత్ర భాగములకు ప్రభువు. కావున అతడు భూమి మీద సుప్రతిష్ఠితుడు అగుచున్నాడు.

9. ఇంతకు ముందు చెప్పిన చరునిర్వాపనము అయినంత యజమాని ఇంద్రాగ్ని దేవతాకమగు పదకొండు పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను. అందువలన అతడు భూమి మీద ప్రతిష్ఠ పొందును. తదుపరి ఇంద్రియగత సామర్థ్యము గలవాడగుచున్నాడు.

10. ఒకడు దర్శపూర్ణమాస యజ్ఞము చేయును. కాని అందు అమావాస్య, పూర్ణిమలందు చేయవలసిన కర్మలను చేయకుండును. అట్టివాడు పథికృత అగ్ని కొరకు ఎనిమిది పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను.

ఒకడు దర్శపూర్ణ మాస యజ్ఞము చేయును. కాని అందు అమావాస్య, పూర్ణిమలందు చేయవలసిన ఇష్టులను చేయకుండును. అట్టివాడు మార్గము నుండి అపమార్గమునకు పోయినవాడగు చున్నాడు. అట్టివాడు స్వభాగధేయమున పథికృత అగ్నిని సేవించవలెను. అప్పుడు పథికృత అగ్నియే అతనిని అపమార్గమునుండి మార్గమునకు చేర్చుచున్నాడు.

భారము వహించు ఎద్దు దక్షిణ యగును. అది యజమానికి ఫల సమృద్ధి కలిగించును.

2. ఆహితాగ్నియై ఉండి అపత్యయమును ఆచరించినవాడు ఎనిమిది పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున వ్రతస్వామి యగు అగ్నిని సేవించవలెను. అగ్నియే అతనిని వ్రతము కలవానిని చేయును. అప్పుడు అతడు వ్రతయోగ్యుడు అగుచున్నాడు.

3. రాక్షసుల వలన బాధలు పడువాడు - రాక్షస సంహారి యగు అగ్నికి ఎనిమిది పాత్రలందు పురోడాశమును నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున అట్టి అగ్నినే అర్చించవలెను. ఆ అగ్నియే అతనిని రాక్షసుల నుండి రక్షించును.

4. నిర్వాపము రాత్రియందు చేయవలెను. ఏలనన రాక్షసులు రాత్రులందు సంచరింతురు కదా! అగ్ని - ఎక్కువ సంచరించు - రాక్షసులను నిశ్చయముగా సంహరించుచున్నాడు. రాక్షసులు ప్రవేశించకుండునట్టి ప్రదేశమున యజ్ఞము చేయవలెను.

రాక్షసుల నాశనమునకగు యాజ్యానువాక్యలు రాక్షస నాశకములు అగుచున్నవి.

5. శత్రువును సంహరించగోరువాడు రుద్రవత అగ్నికి ఎనిమిది పాత్రలందు పురోడాశము నిర్వాపము చేయవలెను. రుద్ర విశేషణము అగ్నికి భీకర తనువు అగును. అట్టి భయంకర దేహము గల అగ్ని యజమాని శత్రువును నశింపజేయును. శత్రువు వెంటనే నశించును.

6. ఎవని గోవులు, భృత్యాదులు మరణించునో, ఎవనికి అపమృత్యు భయము కలుగునో, అతడు సురభి విశేషణము గల అగ్నికి ఎనిమిది పాత్రలందు పురోడాశము నిర్వాపము చేయవలెను. సుగంధ విశేషణమే అగ్నికి ఆరోగ్యవంతమగు శరీరము. ఆ శరీరము చేతనే అగ్ని యజమానిని ఆరోగ్యవంతుని చేయుచున్నాడు.

సుగంధ అగ్ని కొరకు చేసిన నిర్వాపము శవగంధ పరిహారకము అగుచున్నది.

7. యుద్ధమునకు సిద్ధమై జయము కోరువాడు ఆకలిగొన్న అగ్నికి ఎనిమిది పాత్రలందు పురోడాశము నిర్వాపము చేయవలయును. స్వభాగధేయమున అగ్నిని శాంతింపచేసి అగ్నిని శత్రువునకు అభిముఖముగా ప్రదర్శించవలెను.

తన సేన నడుమ ఉన్నవాడు శత్రువు బాణములు తగిలియు జీవించును. శత్రుసేన నడుమ తనవారి బాణములు తగిలిన వాడు మరణించును.

జయతి సంగ్రామమ్ - యుద్ధమున యజమాని విజయుడు అగును.

8. తనకన్న పెద్దవారు, తన కన్న చిన్నవారు తనముందు మరణింతురు. అట్లయినపుడు అగ్ని వారిని కలిసికొనును. ఆ అగ్నికి పురుషాహుతియే ప్రియము. కావున బంధు మరణ నివారణ కోరువాడు ఆకలిగొన్న అగ్నికి అష్టాకపాల పురోడాశము నిర్వాపము చేయవలెను. యజమాని స్వభాగధేయమున అగ్నిని శాంతింపచేయవలెను. అనంతరము బంధువులందు ఎవరును అకాలమరణము పొందరు.

9. ఏ యొక్క ఆహితాగ్ని గృహములను అగ్ని దహించునో వానిని అగ్ని కలిసికొనుచున్నాడు. అందువలన యజమాని ఆకలిగొన్న అగ్నికి అష్టా కపాల పురోడాశము నిర్వాపము చేయవలెను. స్వభాగ ధేయమున అగ్నిని శాంతింపచేయవలెను. తదుపరి అగ్ని అతని గృహములను దహించడు.

### మూడవ అనువాకము

1. కోరిన కోరిక తీరని వాడు "అగ్నయే పురోడాశమష్టా కపాలమ్ నిర్వపేద్యం." కోరికలు తీర్చునట్టి అగ్నిని స్వేనభాగధేయేనోపధావతి. ఆ అగ్నియే కామేన సమర్థయతి. అతని కోరికలను తీర్చునది.

**2.** భూమి విషయమున కాని, బంధువుల విషయమున కాని స్పర్థ కలవాడు వియోగకారియైన **"అగ్నయే పురోడాశమష్టాకపాలమ్ నిర్వపేద్యం"** నియోగకారియైన అగ్నిని **"స్వేనభాగధే యేనోపధావతి"** ఆ అగ్నియే పగవాని సామర్థ్యమును తొలగించును. అప్పుడు యజమాని శత్రువు మీద విజయము సాధించుచున్నాడు.

**3.** అన్యుల అభిచారాదుల వలన బాధలు పడుచున్నవాడు బాధలను దూరము చేయు **'అగ్నయే పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యం'** బాధలు బాపు అగ్నిని **'స్వేన భాగధేయేనోపధావతి'** అట్లయినపుడు అగ్నియే అతనిని రాక్షసాదుల నుండి రక్షించును. యజమానిని బాధింపదలచిన శత్రువు నిర్వీర్యుడు అగుచున్నాడు.

**4.** సంపూర్ణ ఆయువు కోరునట్టివాడు ఆయువు ప్రసాదించు **'అగ్నయే పురోడాశమష్టా కపాలమ్ నిర్వపేద్యం'** ఆయుష్ప్రదుడగు అగ్నిని. **'స్వేన భాగధేయేనోపధావతి'** అగ్నియే అతని యందు ఆయువును స్థాపించును. అతడు పరిపూర్ణ ఆయుష్మంతుడు అగుచున్నాడు.

**5.** సంపదలు కోరువాడు సంపద కలిగించు **"అగ్నయే పురోడాశ మష్టాకపాలమ్ నిర్వపేద్యం.** ధనప్రదుడగు అగ్నిని **'స్వేన భాగధేయేనోపధావతి. సఏవైనం భూతిం గమయతి'.** ఆ అగ్నియే అతనికి సంపదలు కలిగించును. యజమాని నిశ్చయముగా సంపన్నుడు అగుచున్నాడు.

**6.** కాంతిని కోరువాడు కాంతి ప్రదుడగు **'అగ్నయే పురోడాశమష్టాకపాలమ్ నిర్వపేద్యం.** కాంతి ప్రదుడగు అగ్నిని **'స్వేన భాగధేయేనోపధావతి' సఏవాస్మిన్రుచం దధాతి. రోచతయేవ.** అతడు నిశ్చయముగా కాంతిమంతుడు అగుచున్నాడు.

**7.** తేజస్సు కోరువాడు తేజోవంతుడైన **'అగ్నయే పురోడాశమష్టాకపాలమ్ నిర్వపేద్యం. అగ్నిమేవ తేజస్వన్తగ్ం స్వేనభాగధేయేనోపధావతి. సఏవాస్మిన్తేజోదధాతి. తేజస్వ్యేవభవతి.** తేజస్సు కలవాడు అగుచున్నాడు.

**8.** శత్రువును పరాభవించు కోరిక కలవాడు సహనశీలుడగు **"అగ్నయే పురాడాశమష్టా కపాలమ్ నిర్వపేద్యం. అగ్నిమేవ సాహన్త్యగ్ం స్వేన భాగధేయేనోపధావతి".** ఏ శత్రువును అతడు పరాభవించదలచినాడో వానిని అతడు పరాభవించుచున్నాడు.

## నాలుగవ అనువాకము

**1.** అన్నవంతుడు కాదలచినవాడు **'అగ్నయేఽన్నవతే పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యం. అగ్నిమేవాన్నవన్తగ్ం స్వేన భాగధేయేనోపధావతి. స ఏవైన మన్నవన్తంకరోతి.** అతడు **అన్నవానేవ భవతి.**

**2.** అన్నము తినువాడు కాదలచినవాడు 'అగ్నయేఽన్నాదాయ పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యః అగ్నిమే మన్నాదగ్ం స్వేనభాగధేయేనోపధావతి. సఏవైనమన్నాదం కరోతి. అతడు అన్నాద ఏవ భవతి.

**3.** అన్నములకు స్వామి కాదలచినవాడు అగ్నయేఽన్నపతయే పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యః అగ్నయేవాన్న పతిగ్ం స్వేన భాగధేయేనోపధావతి. సవైవ మన్న పతిం కరోతి. అతడు అన్నపతిర్యేవభవతి.

**4.** దీర్ఘరోగము కలవాడు, పాపములను ప్రక్షాళించు అగ్నయే పురోడాశమష్టాకపాలమ్ నిర్వపేద్యః పావకుడగు అగ్నయే పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యః దీప్తి గల అగ్నయే పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యః

పాపములను ప్రక్షాళించు అగ్నికి నిర్వాపనము చేయుట వలన అతడు ప్రాణములను రక్షించుచున్నాడు.

పావక అగ్నికి నిర్వాపనము చేయుట వలన అగ్ని వాక్కును కాపాడుచున్నాడు.

దీప్తికారకుడగు అగ్నికి నిర్వాపనము చేయుట వలన అగ్ని యజమాని యందు ఆయువును చేర్చుచున్నాడు.

**5.** నేత్రములు కోరువాడు పవమాన అగ్నిని యజించ వలెను. అందువలన అతడు ప్రాణములను రక్షించును.

పావకాగ్నికి నిర్వాపనము చేయవలెను. అప్పుడు అగ్ని వాక్కును రక్షించును.

దీప్తికారకుడగు అగ్నికి నిర్వాపనము చేయుట వలన అగ్ని నేత్ర పాటవమును ప్రసాదించును. యద్యన్ధోప్యేవ పశ్యతి - గ్రుడ్డివాడయినను చక్కగా చూడగలడు.

**5.** సంతానము కోరువాడు పుత్రులను కలిగించు శక్తి గల అగ్నయే పురోడాశమష్టాకపాలం నిర్వపేత్, పుత్రవృద్ధి కారకుడగు ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలం నిర్వపేత్. అగ్నిరేవాస్మై ప్రజాం ప్రజనయతి - అతనికి అగ్నియే సంతానము కలిగించును. వృద్ధామిన్ద్రః ప్రయచ్ఛతి - ఇంద్రుడు పుత్రపౌత్రాభివృద్ధిని కలిగించును.

**6.** క్షీర దధ్యాది రసోపేతుడు కాదలచినవాడు అగ్నయే రసవతేఽజక్షీరే చరుం నిర్వపేద్యః - రసప్రదుడగు అగ్నికి మేకపాల చరును, నిర్వాపనము చేయవలెను. రసవన్త్యామగ్నిమేవ స్వేన భాగధేయేనోపధావతి, సఏవైనం రసవన్తం కరోతి. యజమాని రసవానేవ భవతి.

మేకపాలు అగ్నిదేవతాకమగుచున్నవి. అందువలన యజమానికి క్షీరదధ్యారసములు శీఘ్రముగా కలుగుచున్నవి.

8. ధనవంతుడు కావలెనని కోరుకొనువాడు '**అగ్నయే వసుమతే పురోడాశమష్టా కపాలం నిర్వపేత్. అగ్నిమేవ వసుమన్తగ్ం స్వేన భాగధేయేనోపధావతి. సఏవైనం వసుమన్తం కరోతి. యజమాని వసుమానేవ భవతి.**

9. యుద్ధము కలిగినపుడు ఎవడు శత్రువు యొక్క అన్నమును హరించగోరునో, మరియు యుద్ధమున జయించకోరునో అట్టివాడు **అగ్నయే వాజస్వతే పురోడాశమష్టా కపాలం నిర్వపేత్.** అగ్నియే కదా దేవతలందరిలో శత్రువు యొక్క అన్నమును హరించగలవాడు! **అగ్నిమేవ వాజస్వతగ్ం స్వేన భాగేనోపధావతి.** యజమాని అన్నముల కొరకు పరువెత్తును. శత్రువును హతమార్చును. అగ్నివలె అందరిని ధిక్కరించువాడగుచున్నాడు.

**10.** ఎవడు ఆహవనీయాగ్నిని ఉద్ధరించ దలచునో అట్టివాడు '**అగ్నయేఽగ్నివతే పురోడాశమష్టా కపాలం నిర్వపేత్'** ఈ అగ్నులందు ఒకటి నిర్దిష్ట భాగము కలది. మరొకటి అనిర్దిష్ట భాగము కలది. ఈ రెండును కలిసి యజమానిని రక్షించుచున్నవి. యజమాని బాధలను ఈశ్వరుడు నివారించుచున్నాడు. అగ్నికి నిర్వాపము చేయుట - స్వభాగ ధేయమున ఈ అగ్నులను - శాంతింప చేయుట అగుచున్నది. అందువలన యజమానికి బాధలు కలుగవు. శాంతి లభించును.

**11.** గార్హపత్యము నుండి తెచ్చిన అగ్ని హోమము నందు చేర్చుచుండగా చల్లారినపుడు **అగ్నయే జ్యోతిష్మతే పురోడాశమష్టా కపాలం నిర్వపేత్.**

**12.** రెండవ అగ్నిని ప్రజ్వలించి పూర్వోద్ధరణమును అనుసరించి గ్రహించదగినది అని కొందరు చెప్పుచున్నారు. కాని దేనిని అనుసరించి అగ్ని తొలుత గ్రహించబడినదో దాని కొరకు మరొకదానిని ఏల ఉద్ధరించవలెను? చల్లారగా మిగిలిన అగ్ని కణికలను ఉంచి అరణులచే అగ్నిని మథించ వలెను.

**13.** **ప్రథమం జజ్ఞే అగ్ని స్స్వాద్యోనే రధి జాతవేదాః** అగ్ని సర్వజ్ఞుడు. అతడు స్వస్థానమగు ఇచటి నుండియే తొలుత ఆవిర్భవించినాడు. మరల అచటి నుండియే జన్మించును. అతడు గాయత్రి, త్రిష్టుప్, జగతి ఛందస్సులచే - దేవతలకు ఇవ్వదగిన భాగములను ఎరిగి - హవిస్సులు వహించుచున్నాడు.

**14.** యజమాని ఛందస్సులచే అగ్నిని అతని జన్మస్థలము నుండియే పుట్టించ వలెను **ఏషవాశసోఽగ్నిరిత్యాహుః** ఇదియే ఆ అగ్ని అగునని పెద్దలు చెప్పుచున్నారు.

**15.** అగ్ని యొక్క జ్యోతిస్సే నష్టమైనదని వారు హేతువు చెప్పుదురు.

**16.** యజమాని జ్యోతిష్మంతుడగు అగ్నికి నిర్వాపము చేయవలెను. అందువలన నష్టమైన అగ్ని జ్యోతిస్సును అతడు పొందును.

**అయిదవ అనువాకము**

**1.** పాపము చేయకపోయినను చేసినట్లు దూషింపబడువాడు వైశ్వానరాగ్ని దేవతాకమగు పన్నెండు పాత్రల పురోడాశమును - వరుణ దేవతాక చరును, దధిక్రావన్ దేవతాక చరువును నిర్వాపము చేయవలెను.

ద్వాదశ కపాల పురోడాశము వైశ్వానర దేవతాకమగును. అతడే సంవత్సరాభిమాని దేవత అగుచున్నాడు. యజమాని సంవత్సరము వలననే బంధువులకు అనుకూలుడు అగుచున్నాడు. ఆరోపించబడిన పాపము నుండి విముక్తుడు అగుచున్నాడు.

వరుణ యాగమున వరుణ పాశ విముక్తుడు అగుచున్నాడు. దధిక్రావన యాగమున పవిత్రుడు అగుచున్నాడు.

**2.** ఈ కర్మ యందు బంగారము దక్షిణయగును. బంగారము పవిత్రమైనందున అది యజమానిని నిశ్చయముగా పవిత్రుని చేయును.

సంతానము కోరువాడు పూర్వము చెప్పిన ఇష్టినే ఆచరించవలెను. ఒకడు సంతానము కలిగించ సమర్థుడు అగును. అతనికి సంతానము కలుగదు. అట్లగుట వలన సంవత్సరాధి దేవత యగు అగ్ని శాంతి పొందకున్నాడు. అందువలన అతడు గర్భధారణ శక్తిని దహించివేయుచున్నాడు. కావున అతనికి సంతానము కలుగకున్నది.

ద్వాదశ కపాల పురోడాశము వైశ్వానరము. అతడే సంవత్సరాధిదేవత. యజమాని సంవత్సరాధి దేవతను స్వభాగధేయమున శాంతింపచేయవలెను. అప్పుడు ఆ దేవత శాంతుడగును. భార్య గర్భధారణ స్థానమున నిలుచును. సంతానము కలిగించును.

అతడు వరుణ యాగమున వరుణ పాశ విముక్తుడు అగుచున్నాడు. దధిక్రావన యాగమున పవిత్రుడు అగుచున్నాడు. ఈ కర్మయందు బంగారము దక్షిణ. బంగారము పవిత్రమైనందున అది యజమానిని నిశ్చయముగా పవిత్రుని చేయును.

**3.** పుత్రుడు కలుగగనే తండ్రి వైశ్వానర దేవతాకమగు ద్వాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను.

అష్టా కపాలము గాయత్రీ ఛందము అగును. అది ఆ శిశువునకు బ్రహ్మ వర్చస్సు కలిగించును. నవ కపాలము త్రివృత్ స్తోత్రమగును. అది శిశువునకు తేజస్సు కలిగించును. దశ కపాలము విరాట్ ఛందము అగును. అది శిశువును అన్నాద్యుని చేయును. ఏకాదశ కపాలము త్రిష్టుప్ అగును. అది పుత్రునకు ఇంద్రియ సామర్థ్యము కలిగించును. ద్వాదశ కపాలము జగతీ ఛందము అగును. అది పుత్రునకు పశు సంపద కలిగించును.

పుత్రుడు కలుగగానే ఈ ఇష్టిని చేయువాడు పవిత్రుడు, తేజస్వి, అన్నాదుడు, సామర్థ్యము కలవాడు, పశువంతుడు అగుచున్నాడు.

**4.** దశపూర్ణమాస యాగములను చేయునపుడు అమావాస్య ఇష్టిని గాని, పూర్ణిమనాటి ఇష్టిని గాని అతిక్రమించిన వాడు స్వర్గ భ్రష్టుడు అగుచున్నాడు. అందువల ఆ ఇష్టులను అతిక్రమించినపుడు వైశ్వానర దేవతాకమగు ద్వాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అందువలన అతడు సంవత్సరాధి దేవతయగు వైశ్వానరాగ్నిని సంతోష పెట్టిన వాడగును. సంవత్సరాధి దేవతయగు వైశ్వానరాగ్ని యజమానిని దేవతలకు సన్నిహితుని చేయును. తరువాత అతడు దేవతలను ఆశ్రయించి స్వర్గమును పొందును.

**5.** అగ్నిని ఉద్వాసన చేయువాడు అగ్నిని హత్య చేసినవాడు అగుచున్నాడు. పూర్వము సత్యవచనులగు బ్రాహ్మణులు అట్టివాని అన్నమును బహిష్కరించినారు. కావున అగ్నిని ఉద్వాసన చేయువాడు అగ్ని దేవతాకమగు అష్టా కపాల పురోడాశమును వైశ్వానరాగ్ని దేవతాకమగు ద్వాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను.

అష్టాకపాల పురోడాశము అష్టాక్షర గాయత్రి అగుచున్నది. అగ్ని గాయత్రి స్వరూపము కావున యజమాని సమగ్ర స్వరూపుడగు అగ్నికి ఆతిధ్యము ఇచ్చినవాడు అగుచున్నాడు. అట్టి ఆతిధ్యము దూరదేశమునకు వెళ్లువారికి అతని ఆప్తులు పాథేయము ఇచ్చినరీతి యగును.

వైశ్వానర దేవతాకమగు ద్వాదశ కపాల పురోడాశము పన్నెండు నెలల సంవత్సర రూపము అగును. సంవత్సరమే అగ్నికి జన్మస్థానము. అందువలన యజమాని అగ్నిని స్వస్థానమునకు చేర్చినట్లు అగును. అందువలన యజమానికి తగిన అన్నము కలుగుచున్నది.

**6.** గ్రామమును కోరువాడు వైశ్వానరం 'ద్వాదశ కపాలం నిర్వపేత్ మారుతం సప్తకపాలం నిర్వపేత్

**7.** మరుత్తులు ఉగ్రదేవతలు. కావున వారికి సంబంధించిన హవిస్సు పాపాధిక్యము కలది. అందువలన ఆ హవిస్సుల విభజన కొరకు యజమాని వైశ్వానరమగు ద్వాదశ కపాలమును ఆహవనీయమందును - మరుద్దేవ తాక సప్త కపాలమును గార్హపత్యమందును పచనము చేయవలెను వైశ్వానర దేవతాక ద్వాదశ కపాలము పన్నెండు మాసముల సంవత్సరము అగుచున్నది కావున సంవత్సరము చేతనే వైశ్వానరాగ్ని యజమాని బంధుమిత్రులను అతనికి వశవర్తులను చేయును

**8.** మరుద్దేవతాకమగు పురోడాశము సప్త కపాలము అగును. దేవతలందు మరుత్తులే పన్ను చెల్లించు ప్రజలు. మరుత్తులు దేవతలకు ప్రజలు. వారే యజమానికి అతని ప్రజను వశవర్తులను చేయుదురు.

**9.** సప్త కపాలములు గల మరుత్తులు సప్త గణముల వారు. వారు గణములుగానే యజమానికి అతని ప్రజను వశవర్తులను చేయుదురు.

**10.**. మంత్రములు చదువబడుచుండగనే యజమాని పురోడాశమును వేదియందు ఉంచవలెను. అది ప్రజను యజమానికి వశవర్తుని చేయును.

**ఆరవ అనువాకము**

**1.** యుద్ధమునకు వెళ్లగోరువాడు **ఆదిత్యం చరుం నిర్వపేత్.** ఇది అదితి శబ్ద వాచ్యము పూర్వులు ఈ భూమి యందే ప్రతిష్ఠావంతులు అయినారు.

**2.** యుద్ధభూమికి చేరినవాడు **వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్. సంవత్సరోవా అగ్నిర్వైశ్వానరః** సంవత్సరమే దేవతలకు స్థానము అగును. ఈ భూమి మీద ఉండియే దేవతలు రాక్షసులను గెలిచినారు. వైశ్వానర ద్వాదశ కపాల నిర్వాపనము వలన యజమాని దేవతల స్థానమునందే ప్రయత్నము చేయుచున్నాడు. అందువలన అతడు యుద్ధమునందు విజయుడు అగుచున్నాడు.

**3.** పరస్పరము చంపు కొనుటకు సిద్ధమగు శత్రువుల అన్నము తినువానికి ఆ ఉభయుల పాపము సంక్రమించుచున్నది. అందువలన **అతడు వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్. సంవత్సరోవా అగ్ని ర్వైశ్వానరః** అప్పుడు సంవత్సర దేవతచే నిర్దోషీకృతమగు అన్నమునే యజమాని భక్షించును. కావున యజమానికి ఆ పాపము సంక్రమించదు.

**4.** ఇద్దరు వ్యక్తులు శపథము చేసినప్పుడు వారు సంవత్సర దేవత పేర శపథము చేసినవారు అగుచున్నారు. ఆ ఇద్దరిలో తొలిసారి శపథమునకు ద్రోహము చేయువానిని వరుణుడు తన పాశములచే కట్టివేయును. శపథము చేసినవారిలో మొదట ద్రోహము చేసినవాడు, **వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్. సంవత్సరోవా అగ్నిర్వైశ్వానరః** రోగ నివారకమగు సంవత్సర దేవత అనుగ్రహము పొందిన యజమాని ద్రోహ పరిహారము పొందినవాడై వరుణపాశములచే బంధించ పడకుండును.

**5.** ఒకడు దానము చేసిన గొర్రెను మరొకడు గ్రహించిన అట్టివానికి శ్లేష్మ రోగ రూపమగు పాపము కలుగుచున్నది. అట్టివాడు **వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్. సంవత్సరోవా అగ్నిర్వైశ్వానరః** ఆ విధముగా చేసిన యజమాని సంవత్సర దేవతచే దోష రహితముగా చేసిన దానిని గ్రహించినట్లగును. అతనికి శ్లేష్మ రోగ రూప పాపము సంక్రమించదు.

**6.** రెండువైపుల దంతములు గల అశ్వమును గాని పురుషుని గాని ప్రతిగ్రహించిన వాడు ఆత్మ హింసకు లోనగుచున్నాడు. రెండు వైపుల దంతములు కలవానిని ప్రతిగ్రహించినవాడు **వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్ - సంవత్సరోవా అగ్ని ర్వైశ్వానరః** అందువలన యజమాని సంవత్సర దేవతచే దోష రహితముగా చేయబడిన దానిని ప్రతి గ్రహించి నట్లగును. అతడు ఆత్మహింసకు లోనుకాడు.

**7.** ధనము కోరువాడు **వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపేత్. సంవత్సరోవా అగ్నిర్వైశ్వానరః** ధనహీనుడు సంవత్సర కాలము సంపన్నుల సముదాయములందు సంచరించునో అప్పుడు అతడు ధనవంతుడు అగును.

**8.** సంవత్సరాధి దేవతను ప్రయోగించి ఉపసంహారము చేయని వాడు ప్రతిష్ఠను కోల్పోవుచున్నాడు. అతడు మరల ఇంటికి వచ్చి వైశ్వానర పురోడాశమును నిర్వాపము చేయవలెను. అతడు మొదట ఏ అగ్నిని ప్రయోగించినాడో ఆ అగ్నినే స్వప్రతిష్ఠ కొరకు విముక్తుని చేసినవాడు అగుచున్నాడు.

**9.** దాతలు ఇచ్చిన గోవులలో చివరి దానిని ఏ త్రాటితో కట్టునో ఆ త్రాటిని శత్రువు కొట్టమునకు పంపవలెను. అందువలన శత్రువునకు పాప దేవతను పంపినట్లగును.

### ఏడవ అనువాకము

**1.** పశువులను కోరువాడు ఇంద్రం చరుం నిర్వపేత్. ఇంద్రావై పశవః - పశువులు ఇంద్ర సంబంధములు. ఇన్ద్ర మేవ స్వేన భాగధేయేనోపధావతి. సవాస్మై పశూన్ప్రయచ్ఛతి అతడు **పశుమానేవ భవతి.**

**2.** చరు ఇంద్రునిది అగుచున్నది. అతడు పశువులను యోని నుండియే పశువులను కలిగించును.

**3.** పశువులను కోరువాడు ఇంద్రియ బలోపేతుడైన ఇన్ద్రాయ పురోడాశ మేకాదశ కపాలం నిర్వపేత్. ఇన్ద్రియం వై పశవః ఇన్ద్రమే వేన్ద్రియావన్తగ్ం స్వేన భాగధేయేనోపధావతి. సః ఏవాస్మా ఇన్ద్రియం పశూన్ప్రయచ్ఛతి. అతడు నిశ్చయముగా పశువులు కలవాడు అగుచున్నాడు.

**4.** బ్రహ్మ వర్చస్సు కోరువాడు బ్రహ్మవర్చస్సు కల **ఇంద్రాయ పురోడాశమేకాదశం నిర్వపేత్.** బ్రహ్మ వర్చసమే దీప్తియగుచున్నది. కావున దీప్తిమంతుడగు ఇంద్రుని **స్వేన భాగధేయేనోపధావతి. సఏవాస్మిన్బ్రహ్మ వర్చసం దధాతి.** అతడు బ్రహ్మ వర్చసీ భవతి.

**5.** అన్నము కోరువాడు అన్నవంతుడగు **ఇన్ద్రాయ పురోడాశమేకాదశమ్ నిర్వపేత్. అర్కోవై దేవానామన్నమ్.** అర్క శబ్దమే దేవతలకు అన్నము అగుచున్నది. కావున **ఇన్ద్రమే వార్క వంతగ్ం స్వేన భాగధేయేనోపధావతి. సఏవాస్మా అన్నం ప్రయచ్ఛతి.** అతడు అన్నాదుడు అగుచున్నాడు.

**6.** సంపద కోరువాడు దీప్తవంతుడగు **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలమ్ నిర్వపేత్.** ఇంద్రుడే సంపద అగుచున్నాడు. బ్రహ్మవర్చస్సు గల ఇంద్రునకు నిర్వాపము చేయుట వలన యజమాని ఉన్నతుడు అగుచున్నాడు. బ్రహ్మవర్చస్సు గల ఇంద్రునకు నిర్వాపము చేయుట వలన యజమానికి దేహపుష్టి కలుగుచున్నది. బ్రహ్మవర్చస్కుడగు ఇంద్రునకు నిర్వాపము చేయుటవలన యజమాని సంపద గలవాడు అగుచున్నాడు. అన్నములందు ప్రతిష్ఠితుడై నిశ్చయముగ ఐశ్వర్యవంతుడు అగుచున్నాడు.

**7.** ఎవనిని పాపములు పట్టుకొనునో అతడు పాపములు పోగొట్టు **ఇంద్రాయ పురోడాశమేకాదశ కపాలం నిర్వపేత్.** నిషిద్ధ కర్మాచరణమే పాపము. పాపములు పోగొట్టు ఇంద్రునే **స్వేన భాగధేయేనోపధావతి.** ఆ ఇంద్రుడే అతనిని నిషిద్ధ కర్మాచరణము వలన కలిగిన పాపముల నుండి విముక్తుని చేయుచున్నాడు.

**8.** ఎవనిని శత్రువులు భయపెట్టుదురో లేక దేశమును నాశనము చేయనుంకింతురో, అట్టివాడు **శత్రునాశక ఇన్ద్రాయ పురోడాశమేకాదశకపాలం నిర్వపేత్.** శత్రు నాశకుడగు ఇంద్రుని **స్వేన భాగధేయేనోపధావతి.** ఆ ఇంద్రుడే అతనినుండి శత్రువులను తొలగించుచున్నాడు.

**9.** సంకెలలు వేయబడినవాడు కాని, భటులచే నిరోధింపబడినవాడు కాని **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలమ్ నిర్వపేత్. ఇన్ద్రమేవ స్వేన భాగధేయేనోపధావతి.** ఆ ఇంద్రుడే అట్టివానిని రక్షించుచున్నాడు.

**10.** ఎవనికి అశ్వమేధాది మహాయజ్ఞములు ఫలములను ఇవ్వకున్నవో అట్టివాడు అశ్వమేధ సాధనమగు అగ్ని - అశ్వ మేధ ఫలభూతుడగు ఆదిత్యుని కూడిన **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలమ్ నిర్వపేత్.** ఆదిత్య, అగ్నులే మహా యజ్ఞములకు ప్రారంభ సమాప్తములందు ఉండువారలు. కావున అగ్ని, ఆదిత్యులతో కూడిన **ఇంద్రమేవ స్వేన భాగధేయోనోపధావతి.** ఇంద్రుడే యజమాని వద్దకు మహా యజ్ఞమును చేర్చును. అతడు మహా యజ్ఞ ఫలమును పొందుచున్నాడు.

## ఎనిమిదవ అనువాకము

**1.** గ్రామాధిపత్యము కోరువాడు అనుకూలుడు, రుజుత్వము గల **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలమ్ నిర్వపేత్.** అనుకూలుడు, రుజుత్వముగల **ఇన్ద్రాయ స్వేన భాగధేయేనోపధావతి,** ఇంద్రుడే అతనికి భ్రాతృమిత్రాదులను అనుకూలురను చేయును. అతనికి తప్పక గ్రామాధిపత్యము లభించుచున్నది.

**2.** ఎవని సేన మందగతి కలది అగునో యుద్ధమును ఎదుర్కొన జాలకుండునో అతడు ఇంద్రుని భార్య కొరకు చరును నిర్వాపము చేయవలెను. ఇంద్రాణియే సేనకు దేవత. యజమాని ఇంద్రాణినే స్వభాగధేయమున అర్చించవలెను. ఆమెయే యజమానిసేనకు వాడికలదిగను, యుద్ధమును ఎదుర్కొను దానిగను చేయును.

**3.** సమిధలందు తృణ విశేషములను కూడ చేర్చవలెను. గోవులు మూత్ర పురీషములు విడిచిన చోటనే తృణాదులు మొలుచుచున్నవి. అట్లగుటచే యజమాని గోవుల మార్గమును అనుసరించినట్లగును. అతనికి గోవులు కలుగును.

**4.** సంగ్రామము సంభవించినవాడు, రోషము ధైర్యము గల **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలమ్ నిర్వపేత్.** ఆ విధముగా చేసినవాడు రోషము, ధైర్యము కలవాడై యుద్ధమున విజయము సాధించును. కోపము, ధీరత్వము గల **ఇన్ద్రమేవ స్వేన భాగధేయేనోపధావతి.** ఆ ఇంద్రుడే యజమాని యందు రోషమును, ధైర్యమును ప్రవేశపెట్టును. అందువలన యజమాని యుద్ధమున గెలుచుచున్నాడు.

**5.** ఎవడు వ్యాధులు ద్రవ్యహానుల వలన మనసు చితికినవాడై ఇది తన స్వయంకృత పాపమని క్రుంగుచుండునో, అతడు పైన చెప్పిన ఇష్టినే ఆచరించవలెను. అతని నుండి ఇంద్రియాదులు తొలుగుట వలన చిత్త భ్రమ కలవాడు అగుచున్నాడు. అతడు రోషము, ధీరత్వము గల **ఇన్ద్రమేవ స్వేన భాగధేయేనోపధావతి.** ఇంద్రుడే అతని యందు వీర్యమును, రోషమును, ధైర్యమును ప్రవేశపెట్టును. అప్పుడు అతడు నష్టచిత్తుడును, భ్రాంతుడును కాకుండును.

**6.** ప్రజలు తనకు దానము చేయవలెనని కోరుకొనువాడు దాతయగు **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలం నిర్వపేత్.** అతడు దాత అయిన **ఇన్ద్రమేవస్వేన భాగధేయేనోపధావతి.** ఇంద్రుడే ప్రజలను అతనికి దానము చేయువారినిగ చేయును. ప్రజలు అతనికి దానము చేయవలెననుకొందురు.

**7.** ఒకనికి దానము అందినట్లుగును. కాని అందదు. అతడు ప్రదాతయగు **ఇన్ద్రాయ పురోడాశమేకాదశ కపాలం నిర్వపేత్.** ప్రదాతయగు **ఇన్ద్రమేవస్వేన భాగధేయేనోపధావతి.** అతనికి ఇంద్రుడే దానములు ఇప్పించును.

**8.** చిరకాలముగ రాజ్యభ్రష్టుడు గాని, రాజ్యభ్రష్టుడు అగుచున్నవాడు గాని చక్కని రక్షణలు గల **ఇన్ద్రాయ పురోడాశమేకాదశకపాలమ్ నిర్వపేత్.** చక్కని రక్షణలనిచ్చు **ఇన్ద్రమేవ స్వేనభాగధేయేనోపధావతి.** ఇంద్రుడే అతనిని రక్షించును. అతడు రాజ్యభ్రష్టుడు కాదగినవాడు కాకుండును.

**9.** ఇంద్రుడు దేవతలందరి యందు సమానుడై ఉండెను. అతనికి ఆధిక్యత లేకుండెను అందుకు ఇంద్రుడు ప్రజాపతిని సేవించినాడు. ప్రజాపతి ఇంద్రుని కొరకు ఇంద్రదేవతాకమగు ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేసినాడు. ఈ నిర్వాపము నందే శక్తిని చేర్చినాడు. శక్వరీ ఛందస్సునకు చెందిన యాజ్యా పురోవాక్యలను నిర్మించినాడు. శక్వరి వజ్రరూపమగును అది వజ్రమై ఇంద్రుని ప్రకాశింపచేసినది.

ఇంద్రుడు ఐశ్వర్యవంతుడు అయినాడు. అట్లయి అది తనను కాల్చునేమోయని భయపడినాడు. మరల ప్రజాపతిని సేవించినాడు. ప్రజాపతి శక్వరిని మించినదియు, రేవతీ శబ్ద ఘటితమైనదియునగు ఛందస్సును శాంతి కొరకును, దహించకుండుటకును కల్పించినాడు.

**10.** సంపద సంపాదించుటకు సమర్థుడయ్యు సంపదయందు సామాన్యులతో సమానుడగునో అతడు **'ఐన్ద్రమ్ ఏకాదశకపాలమ్ నిర్వపేత్'.** అతడు **'ఇన్ద్రమేవ స్వేనభాగధేయేనోపధావతి.'** ఇంద్రుడే అతనికి ఇంద్రియ బలము కలిగించును.

రేవతీ శబ్ద ఘటిత ఛందస్సు శాంతి కొరకును, దహింపబడుకుండుటకును పురోనువాక్యయగును. శక్వరి యాజ్యయగును. శక్వరి వజ్రమగును. అది యజమానిని ఐశ్వర్యముచే ప్రకాశింపచేయును. అతడు నిశ్చయముగ ధనవంతుడు అగుచున్నాడు.

### తొమ్మిదవ అనువాకము

**1.** శత్రువధ కోరువాడు **"అగ్నావైష్ణవ మేకాదశ కపాలం నిర్వపేత్."** అందు సరస్వతిది ఆజ్యభాగము. చరుబృహస్పతికి సంబంధించినది. ఏకాదశకపాలము అగ్ని, విష్ణు దేవతాకము. అగ్ని సర్వదేవతాస్వరూపుడు. విష్ణువు సర్వయజ్ఞ స్వరూపుడు. అందువలన యజమాని తన శత్రువును దేవతలచేతను, యజ్ఞముల చేతను హింసించువాడగుచున్నాడు. ఆజ్యభాగము గల సరస్వతి వాక్కు అగును. అందువలన అతడు శత్రువును మాటచే హింసించును. చరుకు సంబంధించిన బృహస్పతి దేవతలకు బ్రహ్మ. కావున శత్రువును బ్రహ్మశక్తిచే హింసించును.

**2.** తనను హింసించు వానిని హింసించుటకును, తన శత్రువును హింసించుటకును అధిక ప్రయోగార్థము రెండు పురోనువాక్యలను చేయవలెను. హింసింపబడువాడు ఈ ఇష్టినే యజించవలెను. అందువలన అతడు దేవతలచే దేవతలను, యజ్ఞముచే యజ్ఞమును, వాక్కుచే వాక్కును, బ్రహ్మచే బ్రహ్మను, నివారించిన వాడగుచున్నాడు. అతడు దేవతలకు, యజ్ఞములకు నడుమ మసలిన వాడగును. అందువలన అతనికి ఎచటినుండియు హాని కలుగదు. అతనిని హింసించగోరువాడు హింసించజాలడు.

**3.** యజ్ఞఫలము పొందనట్టివాడు **అగ్నావైష్ణవ మేకాదశకపాలం నిర్వపేత్. అగ్నిస్సర్వాదేవతాః. విష్ణుర్యజ్ఞః అగ్నించైవ విష్ణుం స్వేనభాగధేయేనోపధావతి.** వారే అతనికి యజ్ఞఫలమును ప్రసాదింతురు. అతడు యజ్ఞఫలము కలవాడు అగుచున్నాడు.

**4.** చూపు కోరువాడు అగ్ని, విష్ణు దేవతాకమగు చరును నేతియందు నిర్వాపము చేయవలెను. మానవులు అగ్నినేత్రముతోను, దేవతలు యజ్ఞనేత్రముతోను చూచుచున్నారు. అగ్నా విష్ణువులను స్వభాగధేయమున సేవించవలెను. వారే అతనికి చూపు కలిగింతురు. అతడు చూపు కలవాడు అగుచున్నాడు.

**5.** ఘృతము ధేనువు బీజము. బియ్యము ఎద్దు యొక్క బీజము. ఈ మిధునము వలననే యజమానికి దృష్టి పాటవము కలుగును. ఘృతము తేజస్సు అగును. నేత్రము తేజస్సు అగును. తేజోరూపమగు ఘృతమున, తేజోరూపమగు నేత్రము కలుగుచున్నది.

**6.** యజించు వాడు శత్రువైనప్పుడు అతడు యజించని వాని బలవీర్యములను లాగుకొనును దానికి ప్రతీకారము చేయదలచినవాడు అధ్వర ప్రాయమగు ఇష్టిని నిర్వాపము చేయవలెను. అందువలన ఇతని బలవీర్యములు యజించు శత్రువునందు చేరవు. వాక్కునకు ముందు నిర్వాపము చేయవలెను. అప్పుడు అతని వాక్కు ఇతని వాక్కునందు చేరును. ఇతని వాక్కును ఇతర వాక్కులు అనుసరించును. అవి యజమాని యందు వీర్యబలశక్తులను చేర్చును.

**7.** ప్రాతఃకాల యజ్ఞము సమాప్తమగునంత కాలమున అగ్నావిష్ణువుల అష్టాకపాలమును నిర్వాపము చేయవలెను. ఆజ్యభాగము సరస్వతిది. చరు బృహస్పతిది. అష్టాకపాలము గాయత్రి అష్టాక్షరి యగును. ప్రాతః కాలయజ్ఞము గాయత్రి సంబంధి. ఈ అష్టసంఖ్యచే ప్రాతస్సవనము పరిపూర్ణమగును.

**8.** మధ్యాహ్న సవనము సమాప్త మగునంత కాలమున అగ్నావిష్ణువుల ఏకాదశకపాలమును నిర్వాపము చేయవలెను. ఆజ్యభాగము సరస్వతిది. చరు బృహస్పతిది. ఏకాదశ కపాలము త్రిష్టుప్ యొక్క ఏకాదశాక్షరమగును. మధ్యాహ్నసవనము త్రిష్టుప్ సంబంధి. ఈ ఏకాదశ సంఖ్యచే మధ్యాహ్న సవనము పరిపూర్ణమగును.

**9.** సాయంకాల సవనము సమాప్తమగు నంత కాలమున అగ్నావిష్ణువుల ద్వాదశ కపాలమును నిర్వాపనము చేయవలెను. ఆజ్యభాగము సరస్వతిది. చరు బృహస్పతిది. ద్వాదశకపాలము జగతీ ఛందస్సు యొక్క ద్వాదశాక్షరి అగును. సాయంసవనము జగతీ సంబంధి. ద్వాదశ సంఖ్యచే సాయంసవనము పరిపూర్ణము అగును.

**10.** దేవతలచే దేవతలకు యజ్ఞముచే యజ్ఞమునకు వాక్కుచే వాక్కునకు బ్రహ్మచే బ్రహ్మకు ప్రతీకారము చేయనగును. కపాలములు ఛందస్సును - పురోడాశము సవనములకు చేరును.

**11.** గోవు యొక్క కాలమందు మిత్రావరుణ దేవతాకమగు ఏకకపాల పురోడాశమును నిర్వాపనము చేయవలెను. ఈ గోవు శత్రువినాశము చేయునది అగును. ఇదియే ఇతని ఏకకపాల పురోడాశము అగును. **న హి కపాలైః పశుమర్హత్యాప్తుమ్** - కపాలమునిచ్చి పశువును పొందుటకు అర్హత లేకున్నది.

## పదవ అనువాకము

**1.** ఒకప్పుడు ఈ సూర్యుడు ప్రకాశింపకుండెను. అప్పుడు దేవతలు సూర్యుని ప్రకాశింప చేయదలచిరి. వారు సోమ రుద్ర దేవతాకమగు చరు నిర్వాపము చేసిరి. అట్లుచేసి సూర్యునకు ప్రకాశము కలిగించినారు.

**2.** బ్రహ్మవర్చస్సు కోరువాడు సోమరుద్ర దేవతాకమగు చరు నిర్వాపము చేయవలెను. సోమరుద్రులను స్వభాగధేయమున పూజించవలెను. అప్పుడు వారే అతనికి బ్రహ్మవర్చస్సు కలిగింతురు. **బ్రహ్మవర్చసీ భవతి.**

**3.** ఆ చరును పుష్యమాష పూర్ణిమ నాడు నిర్వాపము చేయవలెను. రుద్రుడు పుష్యము, సోముడు పూర్ణిమ అగుదురు. వారు అప్పుడు పరిపూర్ణులై ఉందురు. అందువలన యజమానికి - నిశ్చయముగా బ్రహ్మవర్చస్సు కలుగుచున్నది.

**4.** బ్రహ్మవర్చస్సు పరిగ్రహించుటకు ఆవరణ గల వేదియందు యజించవలెను. తెల్లని దూడగల ఆవుపాలు మధించి ఆజ్యము చేయవలెను. ఆజ్యము ప్రోక్షించుటకు ఉపయోగపడును. ఋత్విగాదులు ఆజ్యము ప్రోక్షించుకొని పవిత్రులు అగుదురు. అది బ్రహ్మవర్చస్సునంతను కలిగించుననియు మరింత బ్రహ్మవర్చస్సు కలిగించుననియు చెప్పుదురు.

చర్మము చెడు సంశయము కలవాడు, మానవీ ఋక్కులను ధ్యానించవలెను. ఏదిఏది మనువు చెప్పినాడో అదెల్ల ఔషధము అగుచున్నది. అదియే యజమానికి ఔషధము అగుచున్నది

5. చర్మము చెడునను భయము కలవాడు, కుష్ఠురోగము వచ్చునని భయము కలవాడు, సోమ పూషదేవతాకమగు చరు నిర్వాపము చేయవలెను. మానవుడు దేవతా సంబంధమున సోమ సంబంధియగుచున్నాడు. పశువులు పూష సంబంధులు అగుచున్నవి. స్వయముగా దేవతల చేతను, పశువుల చేతను యజమాని చర్మము రోగములేనిది అగుచున్నది. **దుశ్చర్మా న భవతి.** అతడు చెడుచర్మము గలవాడు కాకుండును.

6. సంతానము కోరువాడు సోమరుద్ర దేవతాక చరు నిర్వాపము చేయవలెను. సోముడు రేతస్సునుంచువాడు, అగ్ని ప్రజలను పుట్టించు వాడు అగుచున్నారు.

సోముడు ఇతని రేతస్సును గర్భాశయమందుంచును. అగ్ని సంతానము కలిగించును. అతడు సంతానవంతుడు అగును.

7. శత్రువును వధించదలచిన వాడు సోమరుద్ర దేవతాక చరు నిర్వాపము చేయవలెను. పురుషుడు సోమసంబంధి. అగ్ని రుద్రుడగును. యజమానిని తన దేవతనుండి తీసికొని రుద్రునకు వప్పగించును. అట్లగుటచే శత్రువు సత్వరమే నశించును.

8. దీర్ఘరోగి సోమరుద్ర దేవతాక చరు నిర్వాపము చేయవలెను. దీర్ఘరోగి శక్తి సోముని, శరీరము రుద్రుని చేరుచున్నవి. నిర్వాపము చేయుట వలన అతడు సోముని నుండి శక్తిని, రుద్రుని నుండి దేహమును పొందుచున్నాడు. **ఇతాసుః భవతి యది జీవతి** - గతాసువైనను జీవించును.

9. సోమరుద్రులచే గ్రహించబడిన వానిని హోతవిముక్తుని చేయును. సోమ రుద్రుల చేతబడి నశింపనున్న వాడు హోతకు ఎద్దును దానము చేయవలెను. హోత అగ్నియే. ఎద్దు అగ్నియే. హోత వహ్నిరూపుడై, వహ్నిరూపమగు ఎద్దు వలన తృప్తి నొందుచున్నాడు.

10. శత్రువు గృహమునందే శత్రువునకు శత్రువును కలిగించ దలచినవాడు వేదిని స్వీకరించి దక్షిణార్ధమును మాత్రమే త్రవ్వవలెను. మిగిలిన సగము త్రవ్వరాదు. బర్హిస్సు సగము పరచరాదు. సమిధలందు సగము అగ్నిలో వేయవలెను. సగము వేయరాదు. అందువలన శత్రువునకు అతని గృహమునందే శత్రువు కలుగుచున్నాడు.

### పదకొండవ అనువాకము

1. గ్రామాధికారము కోరువాడు ఇంద్రదేవతాక ఏకాదశకపాలపురోడాశమును, మరుద్దేవతాకమగు సప్తకపాలపురోడాశమును నిర్వాపము చేయవలెను. ఇంద్రుని మరుత్తులను స్వభాగధేయమున సేవించవలెను. వారే అతనికి భ్రాతృమిత్రాదులను సమకూర్తురు. అతడు గ్రామస్వామి అగును

2. మరుత్తులు ఉగ్రరూపులు. కావున ఇంద్ర పురోడాశమును, మరుత్తుల పురోడాశమును వేరు వేరు అగ్నులందు ఉంచవలెను. పాపాధిక్యము కలదానిని విడదీయవలెను. అందుకు ఇంద్రపురోడాశమును ఆహవనీయాగ్ని యందును, మరుత్తుల పురోడాశమును గార్హపత్యాగ్ని యందును ఉంచవలెను. మరుత్తులు సప్తగణములు వారు వారి పురోడాశము సప్తకపాలాత్మకము. మరుత్తులు గణములుగనే యజమానికి పుత్ర, భాతృ, మిత్రాదులను ఏర్పరచుదురు.

యజమాని - మంత్రము ఉచ్చరించబడుచుండగనే వేదియందు పురోడాశమును ఉంచవలెను అందువలన ప్రజలు అతనికి అనువర్తులు అగుదురు.

3. పాలకులకు, ప్రజకు కలహము కలిగించదలచిన వాడు ఈ ఇష్టినే ఆచరించవలెను. ఇంద్రదేవతాకమగు పురోడాశమును వేరుచేసి తీసికొనవలెను. ఇంద్రుని కొరకు "అనుబ్రూహి." అను మంత్రమును ఉచ్చరింపుము అనవలెను. అగ్నీధుని శ్రేషట్ మంత్రము పఠింపుమని కోరి మరుత్తులను గూర్చి యాజ్యా మంత్రము ఉచ్చరించుము అనవలెను.

మరుద్దేవతాకమగు పురోడాశమును వేరుచేసి తీసికొనవలెను. మరుత్తుల కొరకు 'అనుబ్రూహి' అను మంత్రము ఉచ్చరించుమని కోరవలెను. ఇంద్రుని గూర్చి యాజ్యామంత్రము ఉచ్చరించుము అనవలెను.

అందువలన స్వభాగధేయము కొరకని పాలకులకు ప్రజలకు మధ్య కలహము కలుగును. వారలు ఒకరి నొకరు బాధించుకొనుచుందురు.

4. పాలకులను ప్రజలను పరస్పరము అనుకూలురను చేయదలచినప్పుడు ఈ ఇష్టినే ఆచరించవలెను. దేవతానుగుణమున పురోడాశమును వేరుచేయవలెను. వానిని తీసికొని దేవతాను గుణముగ యజించవలెను. ఆ పురోడాశ భాగముల వలననే పాలకులు, ప్రజలు కలసిమెలసి ఉందురు. వారి సమైక్యత నిశ్చయము.

5. గ్రామాధికారము కోరువాడు ఇంద్రదేవతాకమగు ఏకాదశకపాల పురోడాశమును విశ్వేదేవతాకమగు ద్వాదశకపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అతడు ఇంద్రుని, విశ్వేదేవతలను స్వభాగధేయమున సేవించవలెను. వారే అతనికి భ్రాతృ, మిత్రాదులను సమకూర్తురు. అతడు నిశ్చయముగ గ్రామస్వామి అగును.

6. ఇంద్ర పురోడాశమును, విశ్వేదేవపురోడాశమును వేరు వేరు చేయవలెను. తదుపరి ఇంద్ర పురోడాశమును అందుకొనవలెను. అందువలన అతనికి ఒకవంక బలవీర్యములు, మరొక వంక భ్రాతృ, మిత్రజనులు లభింతురు.

**7.** భ్రాతృ, మిత్రాదులు యజమానిని సేవించు సందర్భమున అంచున్న వస్త్రము దక్షిణ అగును.

**8.** గ్రామాధికారము కోరుకొనువాడు గోవు పాలయందు ప్రియంగు సంబంధమగు చరును మరుత్తుల కొరకు నిర్వాపము చేయవలెను. మరుత్తులు మచ్చలుగల ఆవు పాలనుండి పుట్టినారు. ప్రియంగువులు మచ్చల ఆవునుండి పుట్టినవి. భ్రాతృ, మిత్రాదులగు వారు దేవతా విషయమున మరుత్సంబంధులు. యజమాని మరుత్తులను స్వభాగధేయమున యజించవలెను. వారే అతనికి ప్రజను సమకూర్చురు. అతడు నిశ్చయముగా గ్రామస్వామి అగును.

**9.** యాజ్యా పురోనువాక్యలు ప్రియవతులు అగుచున్నవి. అందువలన యజమానిని సమానులలో ప్రీతిపాత్రుని చేయును. పురోనువాక్య రెండుపాదములది. అందువలన అతనికి రెండు పాదముల ప్రాణులు లభింతురు. యాజ్య నాలుగు పాదములది. దాని వలన అతనికి నాలుగు పాదముల ప్రాణులు లభించును.

**10.** దేవతలు, అసురులు యుద్ధమునకు సిద్ధమైనారు. అప్పుడు దేవతలు పరస్పరము కలహించుకున్నారు. వారు ఏ ఒక్కని ప్రాధాన్యతను అంగీకరించలేదు.

అగ్ని వసువులు ఒకటిగను - సోమరుద్రులు ఒకటిగను - ఇంద్ర మరుత్తులు ఒకటిగను వరుణ ఆదిత్యులు ఒకటిగను నాలుగు విధములుగా విడిపోయినారు.

అప్పుడు ఇంద్రుడు ప్రజాపతిని సేవించినాడు. ప్రజాపతి ఇంద్రునిచే సంజ్ఞానేష్టిని చేయించినాడు. వసువులతో కూడిన అగ్ని కొరకు అష్టాకపాల పురోడాశమును - రుద్రునితో కూడిన సోముని కొరకు చరును, మరుత్తులతో కూడిన ఇంద్రునకు ఏకాదశ కపాల పురోడాశమును, ఆదిత్యులతో కూడిన వరుణునకు చరును నిర్వాపము చేసినాడు.

అప్పుడు దేవతలు ఇంద్రుని పెద్దరికమును అంగీకరించినారు.

**12.** సమానులందు భేదభావము కలవాడైనపుడు ఈ సంజ్ఞానేష్టిని యజించవలెను. అగ్నితో కూడిన వసువుల కొరకు అష్టాకపాల పురోడాశమును, రుద్రునితో కూడిన సోముని కొరకు చరును, మరుత్తులతో కూడిన ఇంద్రుని కొరకు ఏకాదశకపాల పురోడాశమును, ఆదిత్యులతో కూడిన వరుణునకు చరును నిర్వాపము చేయవలెను. అప్పుడు యజమాని ఇంద్రుడగును. సమానులు అతని పెత్తనమును అంగీకరింతురు.

**సమానానామ్ వశిష్ఠః భవతి.** అతడు సమానులందు విశిష్టుడు అగును.

## పన్నెండవ అనువాకము

1. ప్రజాపతీ! నీవే విశ్వములందు వ్యాపించి ఉన్నావు.

2. ప్రజాపతియే హిరణ్యగర్భుడు. ప్రజాపతి రూపుడగు ఆ పుత్రుడు, తండ్రిని ఎరుగును. తల్లిని ఎరుగును. ప్రజాపతి అభిజ్ఞుడు. అతడు ఆ మాతా పితరులకు పుత్రుడు అగును. కావుననే అతడు వారిని ఎరిగియున్నాడు. అతడు యజమానికి తిరిగి ధనమును ఇచ్చుచున్నాడు. అతడు ద్యులోకమును, అంతరిక్షమును, స్వర్గలోకమును ఆవరించినాడు. అతడు భువనముల నన్నింటిని ఆచ్ఛాదించినాడు.

3. అగ్ని వంటి సూర్యుని కిరణములు లోకములను చూచుటకుగాను ఆకసమున పెరుగుచున్నవి. ఎరుపు తెలుపు మున్నగు రంగులు గల, సకల ప్రాణి జాలములకు నేత్రము వంటి కిరణ పుంజము వెలువడుచున్నది.

4. అగ్నీ! పూర్వులు ఉదారులు, ధనికులై ధనమును విస్తరింపచేసినారు. మాకు పూర్వుల సంపాదనలేదు. నీవే మాకు మలినరహితమును, ప్రకాశమానమును అగు ధనమును కలిగించుము పెంపొందించుము.

5. అగ్ని మానవుల కొరకని హస్తములందు ధనము ధరించి ఉండువాడు. అతడు సమస్త ధనములకు అధిపతి. సమస్త హిరణ్యములను కూర్చగలవాడు. అతడు తనశక్తిచే యజమానులను నిరంతర అనుష్ఠాతలను - బ్రహ్మసదృశులను చేయును గాత.

6. సవితృదేవత చేతులనిండ బంగారము ఉన్నది. మేము అతనిని సమీపింతుము. మమ్ము రక్షించుమని ఆహ్వానింతుము. అతడు దేవతా స్వరూపుడు. మాకు యోగ్యమగు స్థానమును ఎరుంగును.

7. సూర్యదేవా! మాకు ఇప్పుడు అనుభవయోగ్యమగు కర్మఫలమును ప్రసాదించుము. రేపు మరియు ప్రతి దినము మాకు అట్టి కర్మఫలమునొసంగుము.

దేవా! అనుభవయోగ్యమును, విశాలమును అగు స్వర్గము సిద్ధించుటకు తగిన కర్మను మేము చేయుదుము గాత.

8. భూదేవీ! నీవు అభిముఖము కలదానవు. మహిమాన్వితవు. నీ మహిమచే పర్వతములను సంతోషపెట్టుచున్నావు. అదే మహిమచే పర్వతముల దుఃఖమును భరించుచున్నావు.

**9.** జనసంచారము కల భూమీ! ప్రాణులు, నానావిధసస్యములు నిన్ను ఆశ్రయించి ఉన్నవి సకిలించు గుర్రమువలె జనులకు భోగ వస్తువులు ప్రసాదించుచున్నావు.

**10.** సేవించిన హింసించనదియు - మిత్రుని వలె హితము కూర్చునదియు, వాంతి కలిగించనదియు, ఉదరమునకు ఆరోగ్యకరమైనట్టిదియు అగు సోమమును సేవించుచున్నాను. ఆ సోమము నా ఉదరమున చేరినది. అది జీర్ణమగుటకును, వాంతి కలిగించకుండుటకును ఇంద్రుని పూజించుచున్నాను.

**11.** సోమము కోపమును పూర్తిగా విడిచినది. మూడు సవనములందు రాళ్లచే దంచబడునది దంచుట వలన అటునిటు కదలునది. అభిషవించబడినది. రాళ్ల రాపిడికి చితికిన అవయవములు కలది. రసము పిండుట వలన నీరసము అయినది. అటువంటి సోమము విశ్వము నందలి సకల వనములందు వర్ధిల్లును గాత.

ఇన్ద్రం ప్రతిమానాని దేభుః - నీచ ఉపమానములు ఇంద్రుని కించ పరచజాలవు.

**12.** యాజమాని జమదగ్ని వంటివాడు. యజ్ఞము చేయగోరుచున్నవాడు. స్తుతులచే పూజించుచు ఇంద్రుని కొరకని సోమమును దంచుచున్నాడు.

ఇంద్రా! నీవు ఫలములను వర్షించువాడవు ఉదరమున చేరి వమనమునకు తొందరపెట్టు సోమమును నియంత్రించు వాడవు. ఉదరమున చేరిన సోమమును జీర్ణమగునట్లు శాసించుము నిన్ను భజించు యజమానికి సోమము జీర్ణమగు శక్తి ప్రసాదించుము.

**13.** సోమమా! ఋత్విజులు ఇష్టిరూపమగు బృహత్కర్మనాచరించుచున్నారు. అందుకని నిన్ను రాళ్లతో దంచి బాధించుచున్నారు. వారే నీకు శ్యామాక చరు రూప హవిస్సును అర్పించుచున్నారు. నీవు సోమ శబ్ద వాచ్య సూర్యుడవు. నా ఉదరమునందలి నిన్ను ఇంద్రుడు యుద్ధమునందువలె బయటపడకుండ నిలుపును.

**14.** విష్ణువా! నేను యజమానిని. నన్ను దేవతలు, విధి ప్రేరేపించుచున్నారు. ఆ ప్రేరణచే నేను నీకు హవిస్సులు అర్పించుచున్నాను.

పశుసాధ్యమగు యజ్ఞమా! నేను సమర్పించిన హవిస్సును అనుభవించుము. నా వాక్కులు శోభనములు. స్తుతి రూపములు. అవి నిన్ను వర్ధిల్ల చేయును గాత. నీవు పూజ్యుడవు. నాకు నిత్యము శుభములు కలిగించుము. నన్ను రక్షింపుము.

**15.** యజ్ఞరూప విష్ణువా! ఈ యజ్ఞమందు నీ నామ నిర్వచనమును తెలిసికొన్నాను. స్వామివగు నిన్ను ఆ నామములచే స్తుతించుచున్నాను. నీవు దృశ్యమానమగు ఈ లోకమునకు దూరమున ఉన్నవాడవు. తపస్వివి. అట్టి నిన్ను తపస్విని కానట్టి నేను స్తుతించుచున్నాను.

**16.** విష్ణూ! నేను 'శిపివిష్ఠుడను' అని నీవు చెప్పినావు. అది ఏ మాత్రము గర్హణీయము కాదు. అట్లనుకొని ఆ నామమును మాకు దూరము చేయకుము. యుద్ధములందు నీవు నానా రూపములు ధరింతువు కదా! అట్లే ఈ నామము మా మనములందు నిలుచును గాక!

**17.** అగ్నీ! యజమాని హవిస్సు నిచ్చుచున్నాడు. అతనికి ధనము నిమ్ము. వీరులగు భృత్యులు కలిగి, కను ముక్కు తీరు చక్కగా ఉన్న పుత్రులను ఇమ్ము. నీవు ప్రసాదించిన పుత్రుల వలన మేము అగ్రగణ్యులము అగుదుముగాక.

**18.** అగ్నీ! నాకు వాకిళ్లవంటి వందల పశువులను ఇమ్ము - వేల పశువులను ఇమ్ము. యజ్ఞము కొరకు ఆటంకములు తొలగించి అన్నమును వృద్ధిచెందించుము. మాస్తుతులచే సంతృప్తుడవు అగుము. ద్యావాపృథ్వులను మాకు అనుకూలములను చేయుము. ఉషస్సులు, స్వర్గమును వలె నా గృహమును ప్రకాశవంతము చేయును గాత.

**19.** అగ్ని ధనమును ఇచ్చును గాత. అగ్ని వీరులగు పుత్రుల పాలకుడు. అతడు మాకు వేయి విధములుగ ఋషితుల్యులగు పుత్రులను ఇచ్చును గాత. ఈ అగ్ని స్వర్గమందంతటను మా హవ్యమును వ్యాపింపచేసినాడు. అట్టి అగ్నికి అనేక స్థానములు ఉన్నవి.

**20.** అగ్నీ! మమ్ము భాధించకుము. రక్షింపుము. మమ్ము భరించుము. వదిలివేయకుము.

**21.** అన్నవంతుడవైన ప్రజాపతీ! దర్భపూరిత ఆజ్యము వలె నీవు పవిత్రుడవు. చొక్కపు బంగారము వలెను, ఆభరణముల వలెను, నీవు ప్రకాశింతువు గాత.

**22.** ఆనందము కలిగించు అగ్నీ! నీనోరు రెండు దర్వుల నేతితో నిండి ఉన్నది. యజ్ఞములందు మాకు ఉత్సాహము కలిగించుము. నిన్ను స్తుతించు యజమానులకు అన్నము కల్పించుము.

**23.** వాయువా! నీవు పుష్టిమంతములగు వంద గుర్రములను నీ రథమునకు కట్టుము. మా ఇంటికి విచ్చేయుము.

కాకున్న వేల అశ్వములను కూర్చుము. ఆ రథము వేగముగా మా ఇంటికి వచ్చును గాత.

**24.** వాయువా! యజ్ఞగృహమున యజ్ఞము జరుగుచున్నది. దానికి నీవు సిద్ధి కలిగించ వలసి ఉన్నది. కావున నియుత్తులతో నీవు హవిస్సునందించు యజమాని వద్దకు వెళ్లుదువు. ఈ యజ్ఞమునందు మాకు పుత్రులు, గోవులు, అశ్వములతో కూడిన ధనము ప్రసాదించుము.

**25.** జలములు సంపన్నములు. మాకు సంతోషము కలిగించునవి. అధిక అన్నవంతములు వానితో మేము ఇంద్రుని స్తుతించి ఆనందింతుము. అట్టి జలములు మా స్వామియైన ఇంద్రునకు సుఖవంతములు అగును గాక.

**26.** ఇంద్రా! యజమాని ధనవంతుడు. అతడు ధనవంతుడవు, అన్నవంతుడవు, దేవతలందు ప్రసిద్ధుడవైన నిన్ను ఎంతో శ్రద్ధగా స్తుతించుచున్నాడు.

శ్రీ మాదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత
రెండవ కాండమునందలి రెండవ ప్రపాఠకము సమాప్తము.

అగ్నేనయ సుపథారాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్।
యుయో ధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాతే నమ ఉక్తిం విధేమ॥

## మూడవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

**1.** ఐశ్వర్యము కోరువాడు - వరదులును, సంపన్నులును అగు ఆదిత్యులకు చరు హవిస్సును నిర్వాపము చేయవలెను. ఆదిత్యులే యజమానికి ఐశ్వర్యములు కలిగించుచున్నారు. ఒకడు ఐశ్వర్యమునకు అర్హుడు అగును. అట్లయ్యు ఐశ్వర్యవంతుడు కాకుండును. అట్టివాడు సంపన్నులైన ఆదిత్యులను స్వభాగధేయమున సేవించవలెను. ఆ ఆదిత్యులే అతనికి ఐశ్వర్యము కలిగింతురు. అతడు నిశ్చయముగా ఐశ్వర్యవంతుడు అగుచున్నాడు.

**2.** పూర్వము శత్రువుచే తన దేశము నుండి తొలగించబడిన వాడును, ప్రస్తుతము శత్రువుచే స్వదేశము నుండి తొలగించబడిన వాడును స్వస్థానమునందు నిలుపు సమర్థులగు ఆదిత్యులకు చరు హవిస్సును నిర్వాపము చేయవలెను. అతడు స్వభాగధేయమున ఆదిత్యులను సేవించవలెను. అట్లయిన ఆదిత్యులే అతనిని స్వదేశమునకు చేర్చెదరు. అప్పుడు శత్రువులు అతనిని తొలగించజాలరు

**3.** స్వదేశచ్యుతుడు 'అమ్మా భూమీ! నన్ను ప్రవేశించుటకు అనుమతించుము' అను మంత్రమును ఉచ్చరించవలెను. శత్రువు కాలుపడిన మట్టిని పట్టవలెను. అందువలన అదితి శబ్దవాచ్యమగు ఈ ధరిత్రియే అతనిని స్వదేశమునకు అనుమతించును.

**4.** **సత్యాఽశీరిత్యాహ సత్యమేవాశిషం కురుత.** నా కోరిక ఫలించును గాత అనుట వలన వాస్తవముగనే కోరికలు తీరుచున్నవి.

**5.** రాజ్యచ్యుతుడైన వాడు ప్రజలమనస్సు నాకు అనుకూలమగును గాత, అను '**ఇహమనః**' మంత్రమును ఉచ్చరించవలెను. ఆ మంత్రము ప్రజలను అతనికి అనుకూలమనస్కులను చేయును.

**6.** మరుత్తులారా! మీరు రాజ్యమున ప్రవేశము కలిగించ గలవారలు. దేశచ్యుతుడగు ఇతడు రాజుతో యుద్ధము చేసి జయించ తలచినాడు. మీరు రాజ్యచ్యుతుడగు రాజునకు అభిముఖముగా అతని దగ్గరకు వెళ్లుడు అని "**ఉపప్రేత మరుతః సుదానవః ఏనా విశ్పతినాఽభముగ్ం రాజానమ్**" మంత్రము చెప్పుచున్నది.

ఈ మంత్రము మరుత్సంబంధము. అందువలన మంత్రము చదివిన వానికి అది రాజ్యమును, ప్రజలను సమకూర్చి సమృద్ధము చేయును.

**7.** అతడు గ్రామ్యవాది. సభలోనకాక రహస్యముగా హితము చెప్పువాడు. అతని వలన కలుగు హానిని నివారించుటకు అతని ఇంటినుండి ధాన్యమును తీసికొనవలెను. వానిలో నల్లని, తెల్లని ధాన్యమును వేరుచేయవలెను. ఆ తెల్లని ధాన్యముచే ఆదిత్యులకు చరు హవిస్సును నిర్వాపము చేయవలెను. ప్రజ ఆదిత్య సంబంధి అగును. అందువలన ప్రజలు యజమానిని చేరుకొందురు.

**8.** రాజ్యచ్యుతునకు ప్రజ అనుకూలమైనంత మాత్రమున రాజ్యము కలుగదని వచింతురు. కావున రాజ్య ప్రాప్తి కొరకు వరుణ సంబంధమగు చరు హవిస్సును నిర్వాపము చేయవలెను. ప్రజకు ఆదిత్యులవలె రాజ్యమునకు వరుణుడు అధిదేవత అగును. ఆదిత్యవరుణుల సంతృప్తి వలన రాజ్యచ్యుతునకు ప్రజయు, రాజ్యము ఉభయము లభించును.

**9.** అప్పటికి అతనికి ప్రజ, రాజ్యము లభించకున్నచో 'నేను నా ప్రజను రాజ్యమును పొందుటకు గాను శత్రువునుండి తెచ్చిన హవిర్భాగమును ఆదిత్యుల కొరకు నిర్వాపము చేయుదును,' అని నిర్వాపము చేయవలెను. ఆ విధముగా నిర్వాపము చేయుటవలన ఆదిత్యులే హవిర్భాగమును అపేక్షించుచున్న వారై అతనికి స్వకీయ ప్రజను సమకూర్తురు.

**10.** అప్పటికి అతనికి ప్రజయు, రాజ్యము లభించకున్నచో ఈ ఆదిత్యచరునే నిర్వాపము చేయవలెను. ఇధ్మమునందు శంకువులను బంధించవలెను. అప్పుడు అతడు తనను విడిచిన ప్రజను మరల పొందును.

**11.** అప్పటికి ప్రజను పొందనిచో మరల ఆదిత్యదేవతాకమగు చరు హవిస్సునే నిర్వాపము చేయవలెను. ఇధ్మము నందు కూడ శంకువులను బిగించవలెను. అప్పుడు నిశ్చయముగ అతడు తన ప్రజను పొందును.

**12.** శంకువు రావిచెట్టునకు సంబంధించినది కావలెను. రావి మరుత్తుల ఓజస్సు అగును. మరుత్తుల ఆ ఓజస్సుతోనే అతడు తన ప్రజను పొందును.

**13.** శంకువులు ఏడు కావలెను. మరుత్తులు సప్తసంఖ్యాకులు కదా! అందువలన ప్రజలు గుంపులు, గుంపులుగా అతనిని చేరుకొందురు.

**రెండవ అనువాకము**

**1.** దేవతలు మృత్యువునకు భయపడినారు. వారు ప్రజాపతిని అర్థించినారు. అతడు వారికి ప్రజాపతి దేవతాకమగు శతకృష్ణలఇష్టిని సూచించినాడు. నిర్వాపము చేసినాడు. అందువలన దేవతలకు అమృతత్వము కలిగించినాడు.

(కృష్ణల గురివిందగింజ. వంద గురువిందలంత బంగారముతో చేయు ఇష్టి శతకృష్ణల అగును.)

**2.** అపమృత్యు భయము కలవాడు ప్రజాపతి దేవతాకమగు శతకృష్ణలఇష్టిని ఆచరించవలెను. అతడు స్వభాగధేయమున ప్రజాపతిని సేవించవలెను. ఆ ప్రజాపతియే యజమానికి సంపూర్ణ ఆయువును కలిగించును.

**3.** ఇష్టి శతసంఖ్యాక కృష్ణల కావలెను. ఏలనన మానవుడు శతాయుష్కుడు. నూరు ఇంద్రియములు కలవాడు. నూరు ఇంద్రియములందు ఆయువు నిలిచి ఉండవలసివాడు.

**4.** ఈ ఇష్టియందు బంగారమును ఘృతమునందు ఉంచవలెను. ఆయువు ఘృతము, హిరణ్యము అమృతమగును. కావున ప్రజాపతి అతనికి ఆయువును, అమృతత్వమును సమానములుగా కలిగించును.

**5.** నాలుగు నాలుగు కృష్ణల చొప్పున అవదానము చేయవలెను. అందువలన చతురవత్త ప్రాప్తి కలుగుచున్నది.

**6.** **ఏకధా బ్రహ్మణ ఉపహరత్యేకధైవ యజమాన ఆయుర్దధాత.** ఋత్విగ్భాగము లన్నింటిని ఒకటిచేసి బ్రహ్మకు అర్పించవలెను. అందువలన యజమానికి సర్వావయములందు ఒకే తీరుగ ఆయువు కలుగుచున్నది.

**7.** ఒకానొకప్పుడు సూర్యుడు ప్రకాశించకుండెను. దేవతలు సూర్యునకు ప్రకాశము కలిగించదలచినారు. సూర్యదేవతాక చరు హవిస్సును నిర్వాపము చేసినారు. అందుచే సూర్యునకు ప్రకాశము కలిగించినారు.

కావున బ్రహ్మవర్చస్సును అభిలషించువాడు సూర్యదేవతాక చరు హవిస్సును నిర్వాపము చేయవలెను. స్వీయభాగధేయమున సూర్యుని అర్చించవలెను. సూర్యుడే యజమానికి బ్రహ్మవర్చస్సు కలిగించుచున్నాడు యజమాని బ్రహ్మవర్చసి అగుచున్నాడు.

**8.** హవిస్సునకు పైభాగమునను, క్రింది భాగమునను హిరణ్యములను ఉంచవలెను. అట్లుచేసిన సూర్యుడు యజమానికి కాంతిని కలిగించుచున్నాడు.

**9.** ప్రతి ప్రయాజము నందును గురవిందఎత్తు బంగారమును హోమము చేయవలెను. అందువలన యజమానికి సర్వదిశలనుండి బ్రహ్మవర్చస్సు చేరుచున్నది.

**10.** **హిరణ్యం విన్దేయ హిరణ్య మోపనమేదితి** - బంగారము నాకు అందవలెను, నన్ను బంగారము చేరవలెనను కోరికగలవాడు, అగ్ని దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును, సవితృ దేవతాకమగు ద్వాదశ కపాల పురోడాశమును, భూదేవతాకమగు చరు హవిస్సును నిర్వాపము చేయవలెను.

అష్టాకపాల పురోడాశము అగ్నిదేవతాకము. బంగారము అగ్ని సంబంధి. అందువలన యజమాని హిరణ్యస్వామి అగ్ని చేతనే హిరణ్యమును పొందును.

ద్వాదశ కపాల పురోడాశము సవితృదేవతాకము. అందువలన యజమాని సవితృదేవుని వలన హిరణ్యము పొందును.

చరు హవిస్సు భూదేవతాకము. కావున యజమాని భూమినుండియే బంగారము పొందును.

**11.** ఒకనికి హిరణ్యము కలుగును. అందువలన చోరాది భయములు కలుగును. భయమున బలము లేనివాడగును. అతడు ఇంద్రియ బలవిహీనుడు అగును. అట్టివాడు ఇంతకు ముందు చెప్పిన మూడు హవిస్సుల ఇష్టిని చేయవలెను. అందువలన యజమానికి ఇంద్రియ బలహీనత కలుగకుండును.

**12.** బంగారము పోగొట్టుకున్న వాడును ఈ మూడు హవిస్సుల ఇష్టినే ఆచరించవలెను

నిర్వాపము చేయబడిన పురోడాశము అగ్ని దేవతాకము. హిరణ్యము అగ్ని సంబంధి. హిరణ్యము ఏ అగ్నికి సంబంధించినదో ఆ అగ్నియే యజమానికి పోయిన బంగారమును తిరిగి ఇప్పించును.

నిర్వాపము చేయబడిన పురోడాశము సవితృదేవతాకము. కావున సవితృనిచే ప్రేరితుడై యజమాని పోయిన బంగారమును తిరిగి అందుకొనుచున్నాడు.

నిర్వాపము చేయబడిన పురోడాశము భూమి దేవతాకము. ఈ భూమియందే కదా బంగారము దాగి ఉన్నది! అందువల్ల యజమాని ఈ భూమియందే నష్టపోయిన బంగారము కనుగొనుచున్నాడు.

**13.** ఇంద్రుడు సోమపానము చేసినాడు. తృష్టను చూచినాడు. భయపడినాడు. నానాదిక్కులకు పరుగులు పెట్టినాడు. ఆ విధముగా పరుగులెత్తి, బడలిక కలిగి, ఆరోగ్యము కలిగించు సోమము లేనివాడు అయినాడు. అతడు సోమమును వాంతి చేసుకున్నాడు. ఆ వాంతి పడిన నేల మీద శ్యామాక ధాన్యము ఏర్పడినది.

అంతట ఇంద్రుడు ప్రజాపతిని సేవించినాడు. ప్రజాపతి ఇంద్రుని కొరకని సోమేంద్ర దేవతాకమగు శ్యామాక చరు నిర్వాపము చేసినాడు. అందువలన ఇంద్రునకు బలమును, సోమపానమును ఏర్పరచినాడు.

**14.** సోమమును వాంతి చేసికొన్నవాడే ఆరోగ్యప్రదమగు సోమము లేనివాడు అగుచున్నాడు. అట్టి వాడు సోమేంద్ర దేవతాకమగు శ్యామాక చరుహవిస్సును నిర్వాపము చేయవలెను. అతడు సోమ, ఇంద్రులను స్వభాగధేయమున అర్చించవలెను. సోమేంద్రులే అతని యందు బలకారకమగు సోమమును నిలుపుదురు. యజమాని బలకరమగు సోమము నుండి వియుక్తుడు కాడు.

**15.** చరు సోమదేవతాకమగును. అందు వలన నిర్వాపకర్తకు సోమము ప్రయోజనము కలిగించును.

చరు ఇంద్ర దేవతాకము. ఇంద్రుడు ఇంద్రియ బలకారకుడు. కావున యజమానికి బలకరమగు సోమపానము ప్రయోజనకారి అగును.

**16.** పశువులను కోరువాడు పశుప్రదాత అగు అగ్ని కొరకు అష్టాదశ కపాల పురోడాశమును - అధిక ఫలప్రదాత యగు ఇంద్రుని కొరకు ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను.

అగ్ని యజమానికి పశువులను కలిగించును. ఇంద్రుడు వానిని వృద్ధిపొందించును.

**17.** 1. పెరుగు 2. తేనె 3. నేయి 4. నీరు 5. వేపుడు బియ్యము హవిస్సులగును. ఈ అయిదు పశురూపములు. వాని వలననే పశువులను పొందవచ్చును.

**18.** పంచద్రవ్యములందు ఒక్కొక్క దానిని గ్రహించుట పంచగృహీతత్వము అగును. పశువులు పంక్తి ఛందస్సునకు సాధ్యములు. హవిస్సులు బహురూపములు. అందువలన పశువులు బహురూపములవి. వాని వలన సమృద్ధి కలుగుచున్నది.

**19.** పంచద్రవ్యరూపహవిస్సు ప్రజాపతి దేవతాకమగును. పశువులు ప్రజాపతి సంబంధులు కావున ప్రజాపతియే యజమాని కొరకు పశువులను కలిగించును.

**20.** మధువు పురుషునకు ఆత్మయగుచున్నది. మధువును అగ్నియందు హోమము చేయుటవలన యజమాని తన్ను తాను అగ్నికి సమర్పించినట్లు అగుచున్నది. ఇవి పంక్తి ఛందస్సు నందలి యాజ్య పురోనువాక్యలు అగుచున్నవి.

పురుషుడు పాంక్తుడు - రెండు చేతులు + రెండు కాళ్లు + ఒక తల వలన అయిదింటివాడు- అగుచున్నాడు. పశువులు పంక్తి ఛందో సాధ్యము లైనందున పాంక్తములు.

ఇందువలన యజమాని మృత్యువును తప్పించుకున్నవాడై, సమృద్ధి కలవాడు అగుచున్నాడు.

## మూడవ అనువాకము

**1.** దేవతలు యశస్సు కోరినారు. యశస్సు కలిగించు సత్రమును అనుష్ఠించినారు. అందువలన రాజగు సోమునకు యశస్సు కీర్తి లభించినవి.

రాజగు సోముడు కీర్తిసహితుడై పర్వతమును ఆరోహించినాడు. అగ్ని సహితము అతనిని అనుసరించినాడు. పర్వతమును ఆరోహించినాడు. అక్కడ అగ్నియు సోముడును ఐకమత్యము నొందినారు.

ఇంద్రుడు యజ్ఞభ్రష్టుడు అయినాడు. ఫలరహితుడు అయినాడు. చిరకాలమునకు అతడు సోమాగ్నులను కలిసినాడు. నాకు ఫలము కలుగునట్లు యజింపచేయుడని వారిని కోరినాడు.

అగ్నిసోములు అగ్నిదేవతాకమగు అష్టాకపాల పురోడాశమును, ఇంద్ర దేవతాకమగు ఏకాదశ కపాల పురోడాశమును, సోమదేవతాకమగు చరు గల ఇష్టిని నిర్వహించినారు. అందువలన ఇంద్రునకు తేజస్సు, బలము, బ్రహ్మవర్చస్సు కలిగినవి.

**2.** యజ్ఞభ్రష్టుడైన వాడు అగ్ని దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును, ఇంద్రదేవతాకమగు ఏకాదశ కపాల పురోడాశమును, సోమ దేవతాకమగు చరు గల ఇష్టిని అనుష్ఠించవలెను. అగ్ని దేవతాకము యజమానికి తేజస్సు కలిగించును. ఇంద్ర దేవతాకము బలము కలిగించును. సోమదేవతాకము బ్రహ్మవర్చస్సు కలిగించును.

**3.** అగ్నిదేవతాక, సోమదేవతాక భాగములను ఇంద్రదేవతాకము నందు కలుపవలెను. అందువలన తేజస్సు, బ్రహ్మవర్చస్సు కలిసి యజమాని యందు చేరును

**4.** కోరిన కోరిక నెరవేరనివాడు అగ్ని సోమ దేవతాకమగు ఎకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను.

బ్రాహ్మణుడు అగ్నికి సంబంధించినవాడు. అతడు సోమము త్రాగును. అగ్నిసోములు బ్రాహ్మణునకు దేవతలగుదురు. అతడు వారిని స్వభాగధేయమున సేవించును. ఆ దేవతలే అతని కోరికలను తీర్చెదరు. అతడు కోరికలు నెరవేరిన వాడు అగును.

**5.** బ్రహ్మవర్చసము కోరువాడు అగ్ని సోమ దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అతడు అగ్ని సోములను తన భాగధేయమున సేవించవలెను. వారే అతనికి బ్రహ్మవర్చస్సు కలిగింతురు. అతడు బ్రహ్మవర్చసి అగును.

అష్టా కపాల పురోడాశము అగ్నిదేవతది. శ్యామాకము సోమదేవతది. ఇవి రెండును యజమానికి సమృద్ధి కలిగించును.

**6.** నపుంసకత్వ భయము కలవాడు ప్రజనన సమర్ధమగు అన్నరసము గల సోమునకు శ్యామాక చరును నిర్వాపము చేయవలెను. ప్రజనన సమర్థ అన్నరూప రేతస్సు కొరవడినందున నపుంసకత్వము సంభవించును. అందువలన అతడు ప్రజనన సమర్థమగు అన్నరసము గల సోముని స్వభాగధేయమున అర్చించవలెను. ఆ సోముడే అతని యందు ప్రజనన సమర్థమగు అన్న రసరూపమగు రేతస్సును ఉంచును. అప్పుడు అతడు నపుంసకుడు కాకుండును.

**7.** గ్రామాధికారము కోరువాడు బ్రహ్మణస్పతి దేవతాకమగు ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అతడు బ్రహ్మణస్పతిని స్వభాగధేయమున సేవించవలెను. బ్రహ్మణస్పతియే అతనికి జనులను సమకూర్చును. అతడు నిశ్చయముగ గ్రామాధిపతి అగును.

**8.** యాజ్యా పురోనువాక్యలు గణశబ్దవంతములు. అవి అతనిని జన సముదాయము కల వానిని చేయును.

**9.** ధనగర్వమున వైశ్యుడు బ్రాహ్మణుని అవమాన పరచదలచినచో బ్రాహ్మణుడు ఈ ఇష్టినే అనుష్ఠించవలెను.

**10.** యాజ్యా పురోనువాక్యలను మరుత్సంబంధులను చేయవలెను. మరుత్తులు దేవతలకు ప్రజలు అగుదురు. వారి అనుగ్రహమున యజమానికి ప్రజ అధీనము అగును.

**నాలుగవ అనువాకము**

**1.** స్వర్గము కోరువాడు అర్యముని కొరకు చరు నిర్వాపము చేయవలెను. **అసౌవై ఆదిత్యః.** అర్యముడే ఆదిత్యుడు. అతడు స్వభాగధేయమున అర్యముని సేవించవలెను. అర్యముడే అతనికి స్వర్గము కలిగించును.

**2.** జనులు తనకు దానము చేయవలెనను కోరిక గలవాడు అర్యముని కొరకు చరునిర్వాపము చేయవలెను. **అసౌ వై ఆదిత్యః.** దానము ఇచ్చువాడు అర్యముడు - తేజోవంతుడు. అతడు అర్యమునే స్వభాగధేయమున సేవించవలెను. ఆ అర్యముడే ప్రజలు అతనికి దానము ఇచ్చునట్లు చేయును. ప్రజలు అతనికి దానము ఇచ్చువారు అగుదురు.

**3.** ప్రజాసమూహములు నిరాటంకముగా తన పక్షము వహించవలెనని కోరువాడు అర్యముని కొరకు చరు నిర్వాపము చేయవలెను. **అసౌ వై ఆదిత్యః.** అతడు అర్యముని స్వభాగధేయమున అర్చించవలెను. అర్యముడే అతనిని గమ్యమునకు చేర్చును.

**4.** ఒకప్పుడు ఇంద్రుడు తన తమ్ముల కన్న తక్కువ వానిగా చూడబడినాడు. అప్పుడు అతడు ప్రజాపతిని అర్చించినాడు. ప్రజాపతి ఇంద్రుని కొరకు ఇంద్రదేవతాకమగు ఆనుషూకమగు ఏకాదశకపాల పురోడాశమును నిర్వాపము చేసినాడు. ఆ హవిస్సుచేతనే ఇంద్రునకు దేవతలందు అగ్రగణ్యత్వము లభించినది.

ఇంద్రుడు బుధ్న, అగ్రశబ్దముల గల యాజ్యా పురోనువాక్యలను చేసినాడు. అందువలననే ఇంద్రునకు మొదటినుంచి చివరి వరకు అగ్రత్వము కలిగినది.

(పంట కోసి తరువాత మరల వేరునుంచి మొలిచినది అనూషూకము. దానినుండి మొలిచినది ఆనుషూకము.)

**5.** తమ్ముల కన్న తక్కువగా చూడబడునట్టివాడు ఇంద్రదేవతాకమగు ఆనుషూకమును ఏకాదశ కపాలములందు నిర్వాపము చేయవలెను. అతడు ఇంద్రుని స్వభాగధేయమున యజించవలెను. ఇంద్రుడే అతనిని సమానులందు అగ్రుని చేయును.

అతడు బుధ్న, అగ్ర శబ్దములు గల యాజ్యపురోను వాక్యలు చేయవలెను. అవి అతనిని తొలి నుండి చివరి వరకు అగ్రగణ్యుని చేయును.

తమ్ముల కన్న కొంచెముగా చూడబడు అనుజా వరునకు ఆనుషూక అధిదేవతయే సమృద్ధి కలిగించును.

**6.** అనుజావరుడగు బ్రాహ్మణుడు బృహస్పతి దేవతాకమగు ఆనుషూక చరును నిర్వాపము చేయవలెను. అతడు బృహస్పతిని స్వభాగధేయముగ అర్చించవలెను. బృహస్పతియే అతనికి సమానులందు అగ్రస్థానము కలిగించును.

అతడు బుధ్న, అగ్ర శబ్దములు గల యాజ్యాపురోను వాక్యలు చేయవలెను. అవి అతనిని మొదటినుండి ఆసాంతము అగ్రస్థానము గల వానిని చేయును.

అజావరునకు ఆనుషూక అధిదేవతయే సమృద్ధి కలిగించును.

## అయిదవ అనువాకము

**1.** ప్రజాపతికి ముప్పది ముగ్గురు పుత్రికలు. అతడు వారినందరిని రాజగు సోమునకు ఇచ్చినాడు. సోముడు రోహిణిని మాత్రము పరిగ్రహించినాడు. మిగిలిన ముప్పది ఇద్దరు అది సహించలేక పోయినారు. వారందరు మరల ప్రజాపతి దగ్గరకు వెళ్లినారు.

సోముడు వారిని అనుసరించినాడు. ప్రజాపతి వద్దకు వెళ్లినాడు. వారిని మరల తనకు ఇవ్వవలసినదని కోరినాడు. ప్రజాపతి అందుకు సమ్మతించలేదు. తన కూతుళ్లను అందరను సమానముగ చూచెదనని శపథము చేయమన్నాడు. సోముడు అట్లే శపథము చేసినాడు.

శపథము చేసిన సోమునకు ప్రజాపతి తన పుత్రికలను వప్పగించినాడు. సోముడు శపథమును ఉల్లంఘించినాడు. ఎప్పటివలె రోహిణి విషయముననే అనురక్తుడు అయినాడు. అందువలన అతనికి యక్ష్మ - క్షయ కలిగినది.

రాజగు సోమునకు కలిగినందున అది రాజయక్ష్మ అయినది. పాపము చేయుటవలన కలిగినందున పాపయక్ష్మ అయినది. భార్య నిమిత్తము కలిగినందున అది 'జాయేన్య' అయినది. ఈ మూడు పేరులు గల యక్ష్మరోగపు పుట్టు పూర్వోత్తరములు తెలిసిన వానికి ఈ వ్యాధులు కలుగవు.

అప్పుడు సోమదేవత మిగిలిన వారిని సమానముగా చూచెదనని వారితో అన్నాడు. వారు సహితము 'మమ్ము సమానముగ చూచునట్టి వరము కోరుచున్నాము' అన్నారు. వారు సోముని కొరకు ఆదిత్య దేవతాకమగు చరును నిర్వాపము చేసినారు. ఆ విధముగా చేసి సోముని రోగము నుండి విముక్తి కలిగించినారు.

**2.** పాపయక్ష్మము వలన బాధపడువాని కొరకు ఆదిత్య దేవతాకమగు చరును నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున ఆదిత్యులను అర్చించవలెను. ఆదిత్యులే అతనికి ఆ రోగము నుండి విముక్తి కలిగింతురు.

**3.** అమావాస్య నాడు ఈ చరును నిర్వాపము చేయవలెను. శుక్లపక్షమున వృద్ధిచెందు చంద్రుడు ఈ వ్యాధిగ్రస్తునకు అభివృద్ధి కలిగించును.

**4.** **నవోనవో భవతి జాయమానః** - నవనవోన్మేషముగా జన్మించినవాడు అగుచున్నాడు. అను పురోను వాక్యము వలన అతనికి దీర్ఘాయువు కలుగుచున్నది. **ఆదిత్యా అగ్ంశు మాప్యాయన్తి** - ఆదిత్యులు వర్ధిల్లచేయుచున్నారు అను యాజ్య వలన అతనికి అభ్యుదయము కలుగుచున్నది.

### ఆరవ అనువాకము

**1.** ప్రజాపతి దేవతలు ఆరగించుటకు యోగ్యమగు అన్నమును వారికి పంచి ఇచ్చినాడు. ఈ లోకము లందు అభివ్యాపించి అతిరిక్తమగునది తనకొరకు అగునని నిర్దేశించినాడు. ఆ అన్నము ఈలోకములను అభివ్యాపించి అతిరిక్తమయినది. అవి ఇంద్రరాజము, ఇంద్రాధిరాజము, ఇంద్రస్వరాజ్యము అయినవి. అప్పుడు ప్రజాపతి ఈ లోకములను మూడు విధములుగా పితికినాడు. అందువలన త్రిధాతు యాగమునకు త్రిధాతుత్వము కలిగినది.

**2.** అన్నము తినువాడు కావలెనని కోరువాడు త్రిధాతుయాగము చేయవలెను. రాజగు ఇంద్రుని కొరకును, అధిరాజగు ఇంద్రుని కొరకును, స్వరాట్టయిన ఇంద్రుని కొరకును, ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. భూలోకాధిపతి యగు ఇంద్రుడు రాజు. అంతరిక్షాధిపతియైన ఇంద్రుడు అధిరాజు. స్వర్గలోకాధిపతియగు ఇంద్రుడు స్వరాట్టు. ఆ ఇంద్రులను అతడు స్వభాగధేయమున అర్చించవలెను. వారే అతనికి అన్నము ప్రసాదింతురు. అతడు అన్నాదుడు - అన్నము తినువాడు అగును.

దూడ కుడుచుట వలన ఆవు చేపును. జనులు అట్టి ఆవుపాలను పిండుకొందురు. అట్లే ప్రజలు అనుభవించినంత ఈ లోకములు దేవతలచే వర్ధిల్లచేయబడుచున్నవి. అట్టి లోకములందు యజమాని అన్నాద్యత నొందును.

**3.** సారము పోకుండుటకు గాను ఊర్ధ్వముఖములైన కపాలములందు పురోడాశమును ఉంచవలెను.

**4.** పురోడాశములు మూడు కావలెను. అవి మూడు లోకములు పొందుటకు సాధనములు అగును.

5. పురోడాశము ఒకదానికన్న మరొకటి పెద్దది కావలెను. అదెందుకనగా భూలోకమున కన్న అంతరిక్షము, అంతరిక్షము కన్న స్వర్గలోకము పెద్దది కదా! అది సమృద్ధి కలిగించును.

6. అన్ని పురోడాశములందును చేయిపెట్టవలెను. ఒకదానిని కూడ విడువరాదు. అన్నిటినుండి అవదానము చేయవలెను.

7. అవినాశము కొరకు యాజ్యాను వాక్యల వ్యత్యాసము చెప్పవలెను.

**ఏడవ అనువాకము**

1. దేవతలకు అసురులకు యుద్ధము జరిగినది. ఆ యుద్ధమున రాక్షసులు దేవతలను జయించినారు. పరాజయము పొందిన దేవతలు రాక్షసులకు సేవకులు అయినారు. అందువలన దేవతల ఇంద్రియ సామర్థ్యమును, శరీర సామర్థ్యమును తొలగిపోయినవి.

ఇంద్రుడు ఆ విషయము గ్రహించినాడు. వానిని సంపాదించుటకు ప్రయత్నించినాడు. కాని సఫలుడు కాలేక పోయినాడు. అప్పుడు అతడు వానిని సాధించుటకు ప్రజాపతిని సేవించినాడు.

ప్రజాపతి ఇంద్రుని చేత 'సర్వపృష్ఠ' యాగము చేయించినాడు. ఆ యాగము వలననే ప్రజాపతి ఇంద్రునకు ఇంద్రియ, శరీర ఉభయసామర్థ్యములు కలిగించినాడు.

2. ఇంద్రియ సామర్థ్యము, శరీరసామర్థ్యము కోరుకొనువాడు సర్వపృష్ఠ ఇష్టిని యజించవలెను. ఈ దేవతలనే అతడు స్వభాగధేయమున యజించవలెను. వారే అతనికి ఇంద్రియ, శరీరసామర్థ్యములు కలిగింతురు.

3. రథాంతర ఇంద్రునకు నిర్వాపము చేసినవాడు అగ్ని యొక్క తేజస్సును పొందును.
బార్హత ఇంద్రునకు నిర్వాపము చేయువాడు ఇంద్రుని తేజస్సును పొందును.
వైరూప ఇంద్రునకు విర్వాపము చేయువాడు బ్రహ్మతేజస్సును పొందును.
శాక్వర ఇంద్రునకు నిర్వాపము చేయువాడు మరుత్తుల తేజస్సును పొందును.
రైవత ఇంద్రునకు నిర్వాపము చేయువాడు బృహస్పతి తేజస్సును పొందును.

**ఏతావన్తి వై తేజాగ్ంసి తాన్యేవావరున్ధ** - తేజస్సులు ఇన్నియే. అతడు వానిని అన్నింటిని పొందును.

4. సారము పోకుండుటకు గాను ఊర్ధ్వ ముఖములైన కపాలములందు పురోడాశమును ఉంచవలెను.

5. విశ్వేదేవతల ప్రీతి కొరకు ద్వాదశ కపాల పురోడాశము అగుచున్నది.

6. అన్ని పురోడాశముల నుండి అవదానము చేయవలెను. అందువలన యజమాని యందంతటను సామర్థ్యము కలుగును.

7. అవినాశము కొరకు యాజ్యానువాక్యల వ్యత్యాసము చెప్పవలెను.

8. యజమాని పుంస్త్వాధిక్యత కొరకు అశ్వము, ఎద్దు, గొర్రెపోతు, మేకపోతు దక్షిణ అగును

9. విధ్యాపవాదము కలిగినవాడు ఈ ఇష్టినే యజించవలెను. అందువలన దేవతలు యజమాని పురోడాశములను స్వీకరింతురు. వారు యజమానికి పురోడాశము వంటి అన్నమును ప్రసాదింతురు.

**ఎనిమిదవ అనువాకము**

1. కుణి కుమారుడు రజనుడు. అతనికి దృష్టిదోషము. జనకుని పుత్రుడగు క్రతుజిత్తు కంటివైద్యుడు. రజనుడు కంటి చికిత్స కొరకు క్రతుజిత్తు వద్దకు వెళ్లినాడు. క్రతుజిత్తు రజనుని కొరకని భ్రాజస్వంతుడగు అగ్ని కొరకు అష్టాకపాల పురోడాశమును, సూర్యదేవతాకమగు చరును, భ్రాజస్వంతుడగు అగ్ని కొరకు అష్టాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేసినాడు. త్రిహవిష్కమగు ఇష్టిని యజించినాడు. అందువలన రజనుని దృష్టి దోషము నివారణమై కళ్లకు శక్తి కలిగినది.

2. కంటి చూపునకు పాటవము కోరువాడు. భ్రాజస్వంతుడగు అగ్నికి అష్టాకపాల పురోడాశమును, సూర్య దేవతాకమగు చరును, భ్రాజస్వంతుడగు అగ్నికి అష్టా కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. త్రిహవిష్కమగు ఈ ఇష్టిని యజించవలెను.

అగ్ని యొక్క నేత్రముచే మానవులు చూచుచున్నారు. కంటి రెప్ప వాలుట లేచుట వలన మానవుని దృష్టి అనిత్యమగుచున్నది. అగ్ని జ్వలించుట చల్లారుటచే అనిత్యము అగుచున్నది. ఈ అనిత్యసామ్యమున మానవుని దృష్టికి అగ్నికి సంబంధము.

దేవతలు సూర్యుని దృష్టితో చూతురు. సూర్యుని వలె దేవతల దృష్టి అనిమేషము. అయినందున దేవతల దృష్టి సూర్య సంబంధమగును.

యజమాని అగ్ని, సూర్యులను స్వభాగధేయమున అర్చించవలెను. అగ్ని, సూర్యులు అతని దృష్టికి పాటవము కలిగింతురు. అతడు చక్షుష్పాటవము కలవాడు అగును.

3. అగ్ని దేవతాకములగు రెండు పురోడాశములు చెప్పబడినవి. అందువలన యజమాని రెండు నేత్రములకు బలము చేకూరును. సూర్య దేవతాకమగు చరు నాసికకు బలము కలిగించును.

సూర్యదేవతాకమునకు రెండు ప్రక్కల అగ్ని దేవతాకములు అయినవి. అందువలన నాసికకు ఇరువైపుల నేత్రములయినవి. కావున ముక్కు వలన రెండు నేత్రములు నిలిచి ఉన్నవి.

**4.** యాజ్యాను వాక్యలు సమానములైనట్లు కన్నులు సమానములు అగుచున్నవి. కావున అది సమృద్ధి కొరకు అగుచున్నది.

**5.** 1. ఉదుత్యం 2. చిత్రం దేవానాం 3. సప్తత్వాహరితః రథే అను మూడు మంత్రములచే పిండ ప్రదానము చేయవలెను. అందువల్ల వ్యాధి కలుగకముందున్న చక్షుష్పాటవము మరల కలుగుచున్నది.

(మూడు మంత్రములు సూర్య సంబంధములు.)

**తొమ్మిదవ అనువాకము**

**1.** మధ్యమ పరిధీ! నీవు స్థిరమైన దానవు. నేను జ్ఞాతులందు స్థిరుడను, ధైర్యవంతుడను, ధనవంతుడను అగుదును గాక.

దక్షిణ పరిధీ! నీవు స్థిరమవు. నేను జ్ఞాతులందు స్థిరుడను, ధీరుడను, సంపన్నుడను అగుదును గాక.

ఉత్తర పరిధీ! నీవు స్థిరమవు. నేను జ్ఞాతులందు స్థిరుడను, ధీరుడను, సంపన్నుడను అగుదును గాక.

**2.** హుతమగుచున్న ఆజ్యమా! నీవు పుత్రమిత్రాదులను కోరుదానవు. నేను పుత్రమిత్రాదులు సుమనస్కులు కావలెనని కోరుచున్నాను. దేవతలారా! వారిని నేను మనసున నిలుపుచున్నాను. వారు నన్ను మనసున నిలుపుదురు గాత. వారికి నాయందు అభిమానము కలుగునట్లు చేయండి.

హుతమగుచున్న ఆజ్యమా! నీవు సజాతులను కోరుదానవు. నేను సజాతులను కోరువాడను. ఏ స్త్రీలు నాకు మనసా అనుకూలురు అగుచున్నారో నేను వారికి మనసా అను కూలుడను అగుచున్నాను. దేవతలారా! వారు నాకు మనసా అనుకూలురు అగుదురు గాక. వారిని నాకు మనసా అనుకూలురను చేయండి. **స్వాహా.**

**3.** గ్రామాధికారము కోరువాడు విశ్వేదేవతాకమగు సాంగ్రహిణీ ఇష్టిని నిర్వహించవలెను. బంధువులు విశ్వేదేవతా సంబంధులు. విశ్వేదేవతలను స్వభాగధేయమున అర్చించవలెను. వారే అతనికి బంధుజనులను సమకూర్తురు. అతడు నిశ్చయముగ గ్రామస్వామి అగును.

**4.** ఈ ఇష్టి సంగ్రహిణీ అగును. బంధువుల మనసులను స్వాధీన పరచుకొనుటయే సంగ్రహణము దానివలన బంధువుల మనసులను యజమాని స్వాధీనము చేసికొనును.

**5.** **ధ్రువోఽసి ధ్రువోహగ్ం సజాతేషు భూయాసం** - నీవు స్థిరమవు నన్ను జ్ఞాతులందు స్థిరపరుచుము అను మంత్రము చదువుచు పరిధులను చుట్టు ఉంచవలెను. ఇది ఆశీస్సుగా కోరబడునది. తదుపరి పరిధులు చుట్టు ఉంచబడుచున్నవి. ఈ విషయము తెలిసిన విద్వాంసులకు బంధువుల విషయమున కోరినదంతయు అధికముగ సంభవించును.

(పరిధి మేడిపుల్ల. హోమాగ్నికి రక్షణగా నాలుగువైపుల ఉంచునది. ఇది మొదటి మంత్రమునకు వినియోగము.)

6. జ్ఞాతులందు 1. ఎక్కువవారు. 2. తక్కువ వారు 3. స్త్రీలు ఈ మూడు వర్గముల వారేకదా కావలసినవారు! ఈ ఇష్టి వలన యజమాని వారిని స్వాధీన పరచుకొనును. వారు యజమానికి స్వాధీనులై సేవింతురు.

**పదవ అనువాకము**

1. పెరుగు నుండి తీయబడిన నూతన పదార్థమైనందున వెన్న నవనీతము అయినది. అగ్ని సంపర్కము కలుగగా కరిగినందున 'సర్పి' అయినది. గడ్డ కట్టినందున ఘృతము అయినది.

2. యజమానీ! నీవు అశ్వినులకు ప్రాణమవు. ఎవరికి నీవు ప్రాణమవు అగుదువో ఆ అశ్వినులు నీకు ప్రాణమును, ఆయువును ప్రసాదింతురుగాక. **స్వాహా.**

నీవు ఇంద్రునకు ప్రాణమవు. ఎవరికి నీవు ప్రాణము అగుచున్నావో ఆ ఇంద్రుడు ఆయువును ప్రసాదించును గాత. **స్వాహా.**

నీవు మిత్రావరుణులకు ప్రాణమవు. నీవు ఎవరికి ప్రాణము అగుచున్నావో వారు నీకు ఆయువును కలిగింతురు గాత. **స్వాహా.**

నీవు విశ్వేదేవతః కు ప్రాణమవు. వారు నీకు ఆయుష్యమును ఇచ్చెదరు గాక. **స్వాహా.**

3. ఆజ్యము అమృత మార్గము. ఇంద్రునిచే ప్రసాదించ బడినది. మరుత్తులచే నిలువ ఉంచబడినది. అట్టి ఆజ్యధారను యజమాని చూడవలెను.

ఆజ్యమా! నిన్ను విష్ణు సమానుడగు యజమాని చూచుచున్నాడు. ఇడ పశువుల అధిదేవత. ఆమె నిన్ను గోవుల యందు నిలుపుచున్నది.

4. పావమాన స్తోమము, గాయత్రి మార్గము, ఉపాంశు సామర్థ్యముల వలన దీర్ఘాయువు - అందుకు తగిన ఓషధులు లభించును గాత. సవితా దేవత దీర్ఘ రోగముల నుండి విముక్తి కలిగించును గాత.

బృహద్రథంతర సామము చేతను, త్రిష్టుభ మార్గము చేతను, శుక్ర గ్రహ సామర్థ్యము చేతను సవితా దేవత దీర్ఘ రోగము నుండి విముక్తి కలిగించును గాత.

అగ్నిని స్తుతించు గీతము చేతను, జగతి మార్గము చేతను ఆగ్రయణగ్రహ సామర్థ్యము చేతను సవితా దేవత దీర్ఘాయువును, అందుకు అవసరమగు ఓషధులను ప్రసాదించి దీర్ఘ వ్యాధి నుండి విడిపించును గాత.

5. అగ్నీ! ఈ యజమానికి దీర్ఘాయువును, తేజస్సును కలిగించండి.

వరుణ, సోములారా! ఇతనికి పుత్రోత్పాదకమగు రేతస్సు కలిగించండి.

భూదేవీ! ఇతనికి తల్లివలె సుఖములను కలిగించుము.

విశ్వేదేవతలారా! ఇతనికి అకాల జర కలుగకుండ చేయండి.

6. అగ్ని ఆయుష్మంతుడు. ఆ అగ్ని వనస్పతులచే ఆయుష్మంతుడు. అట్టి ఆయుష్మంతుడగు అగ్ని ఆయుస్సుచే నిన్ను ఆయుష్మంతుని చేయుచున్నాను.

సోమము ఓషధులచే ఆయుష్మంతమగును. యజ్ఞము దక్షిణలచే వర్ధిల్లును. వేదము బ్రాహ్మణుల వలన ఆయుష్మంతమగును. దేవతలు అమృతము వలన ఆయుష్మంతులు అగుదురు పితృ దేవతలు 'స్వధయా' పిండాదులచే ఆయుష్మంతులు అగుదురు.

వారి ఆయువుచే నిన్ను ఆయుష్మంతుని చేయుచున్నాను.

### పదకొండవ అనువాకము

1. దీర్ఘ వ్యాధి పీడితుని దేహము అగ్ని యందును, బలము సోమము నందును చేరును ఇతనిని వరుణుడు తన పాశములచే బంధించును. ఇతని వాక్కు సరస్వతిని, జీవాత్మ అగ్నా విష్ణువులందు చేరును.

2. దీర్ఘ వ్యాధి నుండి విముక్తి కోరువాడును, పరిపూర్ణ ఆయువు కోరువాడును, అగ్ని దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును, సోమదేవతాకమైన చరును, వరుణ దేవ తాకమగు దశ కపాల పురోడాశమును, సరస్వతీ దేవతాకమగు చరును, అగ్ని విష్ణు దేవతాకమగు ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేసి ఇష్టిని అనుష్ఠించవలెను.

ఆ విధముగా చేయుట వలన అతడు అగ్ని నుండి దేహమును, సోమము నుండి బలమును పొందును. వరుణుని పాశము నుండి విముక్తి కలుగును. సరస్వతినుండి వాక్కు లభించును.

**అగ్నిస్సర్వా దేవతా విష్ణుర్యజ్ఞః** అగ్ని సర్వదేవతలు, విష్ణువు యజ్ఞము అగుచున్నారు. వారు అతనికి దేవతలచేతను, యజ్ఞము చేతను చికిత్స చేయుదురు. అందువలన విగత జీవుడైనను నిశ్చయముగా జీవించును.

3. నూతన రూపము పొందినందున అది నవనీతము అయినది. అట్లని ఆజ్యమును చూడవలెను ఆజ్యమే మంత్ర స్వరూపము. మంత్రమే ఆజ్యపు మహిమను చాటుచున్నది.

4. నీవు అశ్వినులకు ప్రాణమవు అని చెప్పబడినది. అశ్వినులే దేవతలకు వైద్యులు. వారే నీకు చికిత్స చేయుదురు.

ఇంద్రునకు ప్రాణమవని చెప్పబడినది. అందువలన ఇంద్రుడు నీకు ఇంద్రియ శక్తిని కలిగించును.

మిత్రావరుణులకు ప్రాణమవని చెప్పబడినది. అందువలన వారు ప్రాణాపానములను కలుగచేసెదరు.

విశ్వేదేవతలకు ప్రాణము అగుదువని చెప్పబడినది. అందువలన వారు వీర్యశక్తిని కలిగింతురు.

5. అమృతమార్గమగు ఘృతధారను చూడవలెనని యజుర్మంత్రము చెప్పిన దానినే గ్రహించవలెను.

6. పవమాన స్తోమమున అనుటచే అది అతనియందు ప్రాణమును చేర్చును.

బృహద్రథంతర స్తోమము అనుట వలన అతని యందు బలమును చేర్చును.

అగ్నిని స్తుతించు గీతము అనుట వలన అతని యందు జీవాత్మను చేర్చును.

(పదవ అనువాకము 4వ మంత్రపు వివరణ.)

7. ఋత్విజులు చుట్టు కూర్చుని మంత్రమును ఉచ్చరింతురు. ఎంతమంది ఋత్విజులు ఉందురో అంతమంది అతనికి చికిత్సకులు అగుదురు.

8. బ్రహ్మ చేతిని పట్టుకొని చుట్టు కూర్చున్నవారు మంత్రములు ఉచ్చరింతురు. ఋత్విజులందరు ఒక్కటిగనే యజమానికి ఆయుష్యము కలిగింతురు.

9. బంగారము నుండి ఆజ్యమును సేవించవలెను. **ఆయుర్వై ఘృతమ్** - ఆయువే ఘృతమగును. **అమృతగ్ం హిరణ్యం** - బంగారము అమృతమగును. కావున అతడు అమృతము నుండియే ఆయువును స్వీకరించును.

10. హిరణ్యము వంద గురిగింజలంత కావలెను. మనిషి నూరేండ్ల ఆయువు కలవాడు. నూరు ఇంద్రియములు కలవాడు. నూరు ఇంద్రియములందు స్థిరమగు ఆయువు కలవాడు.

గడచినవి కాక ముందు ఎన్ని సంవత్సరములు జీవించనున్నాడో అన్ని గురువిందలు ప్రమాణమగును. అందువలన సమృద్ధి కలుగును.

11. అగ్నీ! ఇతనికి దీర్ఘాయువును, బలమును ప్రసాదించుము అనుట వలన అతనికి నిశ్చయముగా ఆయుష్యము, బలము కలుగుచున్నవి. విశ్వేదేవతలారా! ఇతనికి అకాల వార్ధక్యము కలిగించకండి అనుట వలన ఇతనికి నిశ్చయముగా అకాల వార్ధక్యము కలుగకున్నది.

12. అగ్నిరాయుష్మాన్ అని చేతిని పట్టుకొనవలెను. ఈ దేవతలందరు దీర్ఘాయుష్మంతులు. దీర్ఘాయుష్మంతులగు దేవతలే ఇతనిని దీర్ఘాయుష్మంతుని చేయుదురు. సర్వమాయురేతి - అతడు పరిపూర్ణ ఆయుష్మంతుడు అగును.

## పన్నెండవ అనువాకము

**1.** ప్రజాపతి వరుణునకు అశ్వమును ఇచ్చినాడు. అందువలన అతడు దేవత్వము కోల్పోయినాడు. ప్రజాపతి దీర్ఘరోగగ్రస్తుడు అయినాడు. అప్పుడు ప్రజాపతికి నాలుగు పాత్రల పురోడాశమే సాధనముగా కనిపించినది. అతడు దానిని నిర్వాపము చేసినాడు. దానితో ప్రజాపతి వరుణ పాశముల నుండి విముక్తుడు అయినాడు.

(**'ప్రాజాపత్యోవా అశ్వఇతి శ్రుతేః ప్రజాపతిరేవ పూర్వమశ్వస్య దేవతా'** అని సాయణాచార్యులు. అశ్వములు ప్రజాపతి సంబంధములని శ్రుతి. పూర్వము ప్రజాపతియే అశ్వములదేవత.)

(తాను అశ్వదేవతారూపుడు. దానిని ఇచ్చినందున దేవత్వము కోల్పోయినాడు.)

**2.** అశ్వమును ఇచ్చువానిని వరుణుడు పట్టుకొనును. అతడు రోగగ్రస్తుడు అగును. అతడు ఎన్ని గుర్రములను ఇచ్చునో అన్ని చతుష్కపాల పురోడాశములను నిర్వాపము చేయవలెను. వరుణుని స్వభాగధేయమున అర్చించవలెను. అప్పుడు వరుణుడే అతనిని వరుణ పాశముల నుండి విముక్తుని చేయును.

**3.** గుర్రము నాలుగు పాదములది. కావున కపాలములు నాలుగు కావలెను. అవి సమృద్ధి కలిగించును.

**4.** ఒక అశ్వమును ఇచ్చుట - ఎప్పుడో ఇచ్చిన దానిని మరచుట జరిగినపుడు అదనముగా ఒక పురోడాశమును నిర్వాపము చేయవలెను. అందువలన వరుణ పాశ విముక్తుడు అగును

**5.** మరొక అశ్వమును ఇచ్చినపుడు సూర్యదేవతాకమగు ఏక కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అందువలన ఆదిత్యునే ఆకాశమున సంచరింపచేసినట్లగును.

**6.** జలములందు అవభృథ స్నానము చేయవలెను. వరుణుడే జలము. అందువలన సాక్షాత్తు వరుణునే నిరాకరించినట్లగును.

**7.** ఆపోనప్త్ర దేవతాకమగు చరును అవభృథ స్థానము నుండి యజ్ఞ భూమికి తెచ్చి నిర్వాపము చేయవలెను. అశ్వము జలములందు పుట్టినది. కావున అశ్వము - ఈ నిర్వాపము వలన స్వస్థానమునకు చేరును. అది యజమానిని శాంతముగ సేవించును.

(**ఉచ్చైశ్రవసోఽశ్వస్య సముద్రాదుత్పత్తిః** - ఉచ్చైశ్రవము సముద్రము నుండి పుట్టినదని పురాణ ప్రసిద్ధము.)

## పదమూడవ అనువాకము

**1.** ఇంద్రావరుణులారా! మీరు పాపవిముక్తి కలిగించు వారు. ఈ యజమానికి పాప విముక్తి కలిగించండి.

**2.** ఇంద్రావరుణులారా! మీరు సాహసవంతులు. ఇతనికి పాప విముక్తి కలిగించండి. ఇంద్రా వరుణులారా! మీరు రక్షించగలవారు. ఇతనిని పాప విముక్తుని చేయండి. ఇంద్రావరుణులారా! మీరు తేజోవంతులు. ఇతనిని పాప విముక్తుని చేయండి.

**3.** ఇంద్రా వరుణులారా! యజ్ఞమునందు యజమాని మీ విషయమున అపరాధము చేసి ఉండవచ్చును. అట్టి అపరాధమును ఈ హోమమున దహించుచున్నాను.

**4.** ఇంద్రా వరుణులారా! ద్విపాత్తులందు, చతుష్పాత్తులందు, గోశాలలందు, గృహము లందు, జలములందు, ఓషధులందు, వనస్పతులందు మీకు సంబంధించి చేసిన పాపముల నన్నింటిని ఈ కర్మముచే నాశము చేయుచున్నాను.

**5.** ఇంద్రుడైనను పాపము చేసినచో అతని ఇంద్రియ బలము తొలిగి పోవును. వరుణుడు అతనిని తన పాశములచే బంధించును.

పాపగ్రస్తుడగు వాడు ఇంద్రవరుణదేవతాకమగు పాలవిరుగుడు - అమిక్షను - నిర్వాపము చేయవలెను. అప్పుడు ఇంద్రుడే అతనికి ఇంద్రియ బలము కలిగించును. వరుణుడే అతనిని తన పాశముల నుండి విముక్తి కలిగించును.

**6.** పాల విరుగుడు నందు పాలు ఆక్రమించును. అట్లే యజమానిని పాపములు ఆక్రమించును. కావున పాలవిరుగుడు హవిస్సుగా అర్పించినందున పాలే యజమానికి పుణ్యము కలిగించును.

**7.** పాల విరుగుడు పురోడాశము కావలెను. అది యజమానికి బలము కలిగించును. గృహాదులు కలవానిని చేయును.

**8.** హవిస్సును నాలుగు భాగములు చేయవలెను. అందువలన యజమానికి నాలుగు దిశలందు ప్రతిష్ఠ కలుగుచున్నది.

**9.** విభజించిన హవిస్సును తిరిగి కలుపవలెను. అట్లగుటచే దిక్కులే అతనికి చికిత్స చేయును.

**10.** పురోడాశ - అమిక్షలను కలిపి అవదానము చేయవలెను. అది శత్రువు విడిచిన బాణము గుచ్చుకున్న దేహము నుండి పెరికి వేయుట వంటిదగును.

**11.** ఇంద్రావరుణులారా! యజ్ఞమునందు మీకు సంబంధించి చేసిన అపరాధమును ఈ హోమముచే నాశనము చేయుచున్నాను అనవలెను. అప్పుడు యజమాని అపరాధము దూరమగును.

**12.** ఇంద్రావరుణులారా! ద్విపాత్తులు, చతష్పాత్తులు మున్నగు వానియందు మీ విషయమున జరిగిన పాపమును ఈ హోమమున నశింపచేయుచున్నాను అనవలెను. జీవనమునకు కావలసినవి జలములు, ఓషధులు, వనస్పతులు, ప్రజలు, పశువులే కదా! యజమానికి సంబంధించిన అవన్నియు వరుణ పాశముల నుండి బయటపడును.

**పదునాలుగవ అనువాకము**

**1.** 'ఇంద్రం వో విశ్వతస్పరి' ఇత్యాది అనువాక్య. 'ఇంద్రంనరో నేమధితా ఇత్యాది యాజ్య.

**2.** సోమరాజా! నీవు సమస్త పాపముల నుండి మమ్ము కాపాడుము. నీ వంటి ప్రభువునకు మిత్రుడు - సమర్థుడయ్యు - మమ్ము హింసించడు.

**3.** సోమరాజా! నీవు స్వర్గము, భూమి, పర్వతములు, ఓషధులు, జలములందు స్థానము కలవాడవు. నీవు చల్లని మనసు గలిగి, కోపము విడిచి మా హవిస్సులను స్వీకరించుము.

**4.** అగ్ని సోములారా! మీ జ్ఞానము సమానము. మీ ఆహ్వానములు సమానములు. దేవతలందు మీరు కలసి ఉన్నవారు. మీరు మాస్తుతులను స్వీకరించండి.

**5.** సోముడా! నీవును అగ్నియు సమాన సంకల్పము గలవారు. మీరు కలిసి ఆకసమునందు నక్షత్రాదులను స్థాపించినారు

సోమాగ్నులారా! నదులు పిల్లకాలువలు, బురద మున్నగు వానిచే దూషితములు కాగా మీరు వానిని దోషరహితములను చేసినారు.

**6.** అగ్నిసోములారా! మీరు కోరికలు తీర్చువారు. మీరు మా ఆహ్వానములు వినండి. స్తోత్రములు గ్రహించండి. హవిస్సులు అర్పించిన యజమానికి సుఖములు కలిగించండి

**7.** మీలో ఒకరగు అగ్నికి వాయువు ఆదిత్యుని నుండి తెచ్చినారు. మరొకరగు సోముని గాయత్రి పక్షిరూపము దాల్చి కొండలపైనుండి సోమరక్షకులను ఓడించి తెచ్చినది.

అగ్నిసోములారా! మంత్రములచే వర్ధిల్లండి. యజ్ఞముల కొరకు ఈ లోకమును విస్తారము చేయండి.

**8.** అగ్ని సోములారా! మీరు కోరికలను తీర్చువారు. మేము హవిస్సులు అర్పించుచున్నాము. వాటి సారమును గ్రహించండి. సేవించండి. శోభన సుఖయుక్తులు, శోభన రక్షణోపేతులు కండి యజమానికి సుఖమును, పుత్రాదులతో కలయికను కలిగించండి.

**9.** **'ఆప్యాయస్వ సమేతుతే' పురోనువాక్య. సంతేపయాగ్ంసి, ఇత్యాది యాజ్య.**

(ఏతే ఉభే చతుర్ధ కాండస్య ద్వితీయ ప్రపాఠకే వ్యాఖ్యాస్యేతే. ఈ రెండును నాలుగవ కాండపు రెండవ ప్రపాఠకమున వ్యాఖ్యానించబడును )

**10.** బ్రహ్మణాం బ్రహ్మణస్పతే! నీవు విద్వాంసులకు విద్వాంసుడవు. ఉపమానముచే కీర్తించబడు వారిలో ఉపమ శ్రవుడవు. రాజులందు జ్యేష్ఠుడవు. గణములకు స్వామివి. అటువంటి నిన్ను 'హవామహే' ఆహ్వానించుచున్నాము. నీవు రక్షణ సహితుడవై విచ్చేయుము. ఆసనము గ్రహింపుము

**11.** ఏ యజమాని శ్రద్ధగల మనస్సుతో దేవతలకు పాలకుడగు బ్రహ్మణస్పతికి హవిస్సులు సమర్పించి పరిచర్యలు చేయునో, అతనికి సేవకులతో కూడిన అన్నము కలుగును. అతని ప్రజలు పన్నులు ఇచ్చువారు అగుదురు. అతనికి బ్రాహ్మణులు, పుత్రులతో కూడిన అన్నము లభించును అతడు బంధువులు, ధనముతో కూడినవాడు అగును.

**12.** అతడు - ఆ దేవత - సుష్టుభులు, ఋక్కులు, ధ్వనియుక్త మంత్రములచే సంతృప్తిచెందినాడు యజమానికి బలము కలుగుటకు గల అవరోధములను తొలగించినాడు.

బృహస్పతి హవిస్సును ఆరగించువాడు. ఆరగించి ఆనందమున కేకలు వేయువాడు అతడు యజమానికి - పాలు చేపుటచే దూడలను అంబారావములచే పిలుచునట్టి - ఆవులను కలిగించును.

**13. 'మరుతో యద్ధవః, అనునది అనువాక్య. 'యూవః శర్మ' యాజ్య**
**ఏతచ్చోభయం ప్రథమ కాండస్య పంచమ ప్రపాఠకే వ్యాఖ్యాతమ్.**

**14.** ఆర్యమాऽऽయాతి - ఆదిత్యుడు వచ్చుచున్నాడు. అతడు కోరికలు తీర్చువాడు మహాబలుడు. ధనదాతః. పురుహూతుడు. స్వర్గము నివ్వగలవాడు. సహస్రాక్షుడు. పర్వతములను భేదించువాడు. వజ్రబాహువు. ఆ దేవుడు మాకు ధనములు ప్రసాదించును గాత.

**15.** రాజువగు ఆదిత్యా! నీయొక్క దేవయానము పెక్కు దారులది. అవి స్వర్గపర్యంతము సాగును. దేవా! ఆ మార్గములందే మాకు మహా సుఖములు ప్రసాదించుము. మా మనుష్యులకు సుఖకరుడవు అగుము. మా పశువులకు సుఖంకరుడవు అగుము.

**16.** కర్మారంభము నుండి పూర్తియగు వరకు ఇంద్రుడు అంగిరులచే స్తుతించబడినాడు. ఈ రాజు పర్వతము వంటివాడు. సకలమునకు ఆధారభూతుడు. అతనికి సమానులు అతనికి ద్రోహము తలపెట్టినారు. బలవంతముగా ఆర్జించిన అడ్డంకులు కలిగించినారు. ఇంద్రుడు వాటిని అన్నింటిని తొలగించినాడు. సోమపానమున మదించిన ఇంద్రుడు ఆ ద్రోహనివారణాది కార్యములను నిర్వహించినాడు.

**17.** ఇంద్రుడు నదుల మొదలు నుంచి చివరి వరకు కొలబద్దచే కొలిచినాడు. నదుల ప్రవాహమునకు అడ్డువచ్చు పర్వతములను వజ్రముచే బద్దలు కొట్టినాడు. నదులకు ప్రవాహ మార్గమును కల్పించినాడు. వీనిని అన్నింటిని అనాయాసముగ చేసినాడు. సోమపానము వలన మదించి ఆ కార్యములను చేసినాడు.

**18.** బృహస్పతి విద్వాంసుడు. అతడు బ్రాహ్మణ యజమానిని అతని బంధువులందరిలో గుర్తించును. ఆ దేవుడు సర్వప్రాణుల పుట్టుకను గురించి తేపతేప చెప్పును. అతడు వేదము మధ్య నుండియు, క్రిందినుండియు, పైనుండియు పరివ్యాప్తమైన కర్మను ఉద్ధరించినాడు. అమృతము అందుకొని యజమానిని గూర్చి ప్రస్థాన మొనరించినాడు.

**19.** బృహస్పతి సామర్థ్యమున మహామహుడు. అతడు పృథివి, అంతరిక్షములను ద్యులోకమును, గృహములను, నేల మీది ధూళిని పుట్టినంతనే స్తంభింపచేసినాడు. స్వామాట్టు అగు బృహస్పతి దేవతగా కలవాడు జన్మచేతనే ఆజన్మాంతము వ్యాపించిన వాడగును

**20.** బృహస్పతి ఆమూలాగ్రము స్వబలమున వర్ధిల్లినవాడు. అన్యదేవతలు అతని వద్దకు వత్తురు విశేషముగ పరిచర్యలు చేయుదురు. బృహస్పతి యజమానికి ప్రతికూలముగ ఉండు ప్రబల తముని సహితము తొలగించును. యజమానిని వ్యతిరేకించు పురములను భేదనమొనరించినాడు.

బృహస్పతి ఉత్సాహమున కేకలు పెట్టుచు జలక్షేత్రాదికములను జయించినాడు.

**శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత**

**రెండవ కాండమునందలి మూడవ ప్రపాఠకము సమాప్తము.**

అగ్నేనయ సుపథారాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్।
యుయో ధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాతే నమ ఉక్తిం విధేమ॥

## నాలుగవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

1. దేవతలకు రాక్షసులకు యుద్ధము జరిగినది. ఒకవైపు దేవతలు, మానవులు, పితృదేవతలు ఉన్నారు. మరొక పక్షమున అసురులు, రాక్షసులు, పిశాచములు ఉన్నారు. యుద్ధమున దేవతలకు చిన్న చిన్న గాయములు తగిలినవి. రాత్రులు రాక్షసులు గాయములు తగిలిన దేవతలకు విషప్రయోగము చేసినారు. తెల్లవారు వరకు గాయపడిన దేవతలు మరణించుచున్నారు.

దేవతలు ఈ విషయము ఆలోచించినారు. ఇది రాక్షస కృత్యమని గ్రహించినారు. దేవతలు రాక్షసులతో రాయబారము సాగించినారు. ఉభయులు కలిసి అసురులతో యుద్ధము చేయునట్లును - గెలిచినంత రాక్షసులకు భాగము ఇచ్చునట్లు ఒప్పందము కుదిరినది. ఉభయులు కలసి అసురులను ఓడించినారు. దేవతలు రాక్షసులకు భాగము ఇవ్వలేదు. పైగా రాక్షసులను పారద్రోలినారు.

దేవతలు అసత్యమాడినారని రాక్షసులు కోపించినారు. దేవతలను సంహరించుటకు రాక్షసులు నలువైపుల నుండి ముట్టడించినారు.

అప్పుడు దేవతలు అగ్నిని యాచించినారు. త్రిహవిష్క ఇష్టిని అనుష్ఠించినారు. అందు అష్టాకపాల పురోడాశ రూప ప్రథమ హవిస్సును 'ప్ర' శబ్ద ఘటిత మంత్రవాదుడగు అగ్ని కొరకు నిర్వాపము చేసినారు. అందువలన తమను తూర్పు నుండి ముట్టడి చేసిన రాక్షసులను పారద్రోలినారు.

ద్వితీయ హవిస్సును 'విబాధ' శబ్ద ఘటిత మంత్ర ప్రతి పాద్యుడగు అగ్ని కొరకు నిర్వాపము చేసినారు. అందువలన దక్షిణ, ఉత్తర దిక్కుల నుండి ముట్టడించిన రాక్షసులను తరిమి వేసినారు.

మూడవ హవిస్సును 'ప్రతీక' శబ్ద ఘటిత మంత్రప్రతిపాద్యుడగు అగ్ని కొరకు నిర్వాపము చేసినారు. అందువలన పడమటి దిక్కునుండి ముట్టడించిన రాక్షసులను తరిమి కొట్టినారు.

అప్పుడు దేవతలకు విజయము - రాక్షసులకు పరాజయము కలిగినది.

2. శత్రువులను ఓడించ దలచిన వాడు ఈ త్రిహవిష్క ఇష్టిని అనుష్ఠించవలెను.

'అగ్నయే ప్రవతే పురోడాశమష్టా కపాలం నిర్వపేత్' ఇది ప్రథమ హవిస్సు మంత్రము. ఇందువలన యజమాని కన్న బలము గల శత్రువు తొలగిపోవును.

'అగ్నయే విబాధవతే అష్టాకపాలం పురోడాశం నిర్వపేత్' ఇది రెండవ హవిస్సు మంత్రము. ఇందువలన యజమాని సమాన బలము గల శత్రువు తొలగిపోవును.

'**అగ్నయే ప్రతీకవతే అష్టా కపాలం పురోడాశమ్ నిర్వపేత్**' ఇది మూడవ హవిస్సు మంత్రము. ఇందు వలన యజమాని కన్న దుర్బల శత్రువు తొలగిపోవును.

**3.** త్రిహవిష్య ఇష్టిని గ్రహించి, అనుష్ఠించిన యజమాని తన ప్రబల శత్రువును ప్రకర్షముగ తొలగించును. సమబల శత్రువును అతిక్రమించును. అల్పబల శత్రువు అతని దాపులకే రాడు.

**ఆలోచనామృతము**

**1.** విధించిన ప్రతికర్మకు కారణము చూపుచున్నాడు. ఫలితము లభించు విషయమున సాదృశ్యములు చూపుచున్నాడు. శాసనముగా విధించుట లేదు. నచ్చచెప్పి చేయమని చెప్పుచున్నాడు.

ఒకహేతువును తప్పక చెప్పుచున్నాడు. ఈ హేతువు అందరకు ఆమోదయోగ్యమగునా? అని. అది విశ్వాసము మీద ఆధారపడి యుండును. నిర్దిష్టములైన హేతువులు నేటికి కనిపించుట లేదు.

హేతువాదము మరొక వాదమును వ్యతిరేకించుటకు వచ్చినదే కాని అది మూలవాదము కాదు.

హేతువాదము నిలువజాలదు. ఏలనన ప్రకృతి హేతుబద్ధము కాదు.

**2.** రాక్షసులు, అసురులు, పిశాచములు ఒకే జాతికాదు. వారివి వేరువేరు జాతులు. రావణుడు అసురుడు కాడు. రాక్షసుడు. మనము రావణాసురుడు అనుట సరికాదు.

దేవ, మానవ పితరులు ఒకరిని గెలుచుటకు ఏకమైనారు. అట్లే అసుర, రాక్షస, పిశాచులు.

ఎదుటి వాని బలము ఎక్కువైనపుడు భేదనీతి ప్రయోగించుట నేటికి యుద్ధనీతియే. నేటి రాజకీయములందు ఈ నీతియే ప్రబలముగా ఉన్నది.

బలహీనులు అగుచున్న దేవతలకు భేదనీతి ఉపకరించినది. అసురులను రాక్షస, పిశాచముల నుండి విడదీసినారు.

శత్రువునకు శత్రువు మన మిత్రుడు అన్నట్లు రాక్షసులు దేవతలతో కలసినారు. అసురుల ఓటమితో రాక్షసులధ్యేయము నెరవేరినది.

గెలుపు కొరకు మాత్రమే రాక్షసులతో కలసిన దేవతలు విజయము లభించగనే వారిని కాదన్నారు.

ఇటువంటి ఉదాహరణలు చరిత్రలో కో కొల్లలు.

చంద్రుని జయించినామను ఈ రోజులలో కూడ నాటినీతినే అనుసరించుచున్నాము! నేటి ప్రగతి దృశ్యమే కాని మౌలికము కాదు.

వేదనీతి మౌలికము. అది మానవ సంక్షేమమును గురించి ఆలోచించినది!

## రెండవ అనువాకము

1. దేవాసురులు యుద్ధమునకు సిద్ధపడినారు. దేవతలు తమలో బలవంతుని నాయకునిగా చేసికొని యుద్ధము చేయదలచినారు. వారందరు ఇంద్రుని తమలో అత్యధిక బలవంతుడని నిర్ణయించినారు.

ఇంద్రుడు తనకు మూడు రూపములు ఉన్నవి అన్నాడు. దేవతలు ఇంద్రుని ఒక్కొక్క రూపమున ఏకాదశ కపాలహవిస్సు చొప్పున ముప్పదిమూడు కపాల పురోడాశ నిర్వాపమున ఇంద్రుని సంతృప్తుని చేసినారు.

ఇంద్రుని ఒక రూపము పాప విమోచకము. వారు దానికి నిర్వాపము చేసినారు. పాప విమోచకులు అయినారు.

రెండవ రూపము శత్రుఘాతకము. దేవతలు దానికి నిర్వాపన చేసినారు. శత్రు ఘాతకులు అయినారు.

మూడవది అత్యంత సామర్థ్యము కలది. దేవతలు దానికి నిర్వాపము చేసి అత్యంత సమర్థులు అయినారు.

మొత్తము హవిస్సుల సంఖ్య 33. దేవతలు ముప్పది ముగ్గురు. అందువలన ఈ హవిస్సులు అందుకున్న ఇంద్రుని యందు దేవతలందరు చేరినారు.

ఆ విధముగా దేవతలు 1. పాపవిమోచనులై 2. శత్రుఘాతకులై 3. అత్యంత సామర్థ్యము కలవారై అసురులతో యుద్ధమునకు వెడలినారు.

(ఏ కార్యమునకు పూనుకున్నను ముందు పాప విమోచనము చేసికొనవలెనని చెప్పుచున్నాడు. మలిన మనస్సు ఏదిచేయజాలదు. నిర్మల మనస్సు అన్నింటిని సాధించగలదు. ఇది సందేశము.)

2. శత్రువులు కలిగి, శత్రువును జయించ వలెనను కోరిక గలవాడు ఈ ఇష్టిని యజించవలెను.

'ఇంద్రాయ అంహోముచే' అను మంత్రమున ఇంద్రుని కొరకు ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. యజమాని కన్న శత్రువు బలవంతుడైనచో యజమానిని పాపము గ్రహించినదని అర్థము. పాపవిమోచకమగు ఇంద్రరూపము కొరకు నిర్వాపము చేసినందున అతనికి పాపవిముక్తి కలుగును. అందువలన అతడు శత్రువున కన్న బలవంతుడగును.

(బలమునకు పాపగ్రహణము పట్టినది. అది తొలగినంత అతడు బలవంతుడు అయినాడని అర్థము)

'వైమృధాయ ఇంద్రాయ' అను మంత్రమున ఇంద్రుని కొరకు ఏకాదశ కపాల పురోడాశము నిర్వాపము చేయవలెను. యజమానితో సమానుడైన శత్రువు అతనికి మించినవాడైనను, శత్రువు లేని వాడైనను యజమాని శత్రువుచే తిరస్కరించ బడుచున్నాడని అర్థము. శత్రుఘాతుకమగు ఇంద్రరూపమునకు ఏకాదశ కపాల పురోడాశ నిర్వాపనము చేసినందున యజమాని శత్రుఘాతి అగుచున్నాడు. అతడు శత్రువును తొలగించుచున్నాడు.

'ఇంద్రియావతే ఇంద్రాయ' అను మంత్రమున ఇంద్రుని కొరకు ఏకాదశ కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అత్యంత సామర్థ్యము గల ఇంద్రరూపముకు ఏకాదశ కపాల పురోడాశము నిర్వాపము చేసినందున యజమానికి సామర్థ్యము కలుగుచున్నది.

దేవతలు ముప్పది ముగ్గురు. పురోడాశ కపాలములు ముప్పది మూడు. అందువలన యజమానికి సంపద కలిగించుటకు ముప్పది ముగ్గురు దేవతలు యజమాని యందు ప్రవేశించుచున్నారు.

**3.** ఇది విజితి నామక ఇష్టి. ఈ ఇష్టిని గ్రహించిన యజమాని శత్రువులతో యుద్ధము చేసి పాప విముక్తుడై విజయము సాధించును.

## మూడవ అనువాకము

**1.** దేవాసురులు యుద్ధమునకు సన్నద్ధులు అయినారు. గాయత్రీదేవి దేవాసురులు - ఉభయుల- ఓజస్సును, బలమును, ఇంద్రియపాటవమును, వీరత్వము, సంతానాదులను పశువులను తీసికొని వెళ్లిపోయినది.

దేవాసురులు ఆ విషయము గ్రహించినారు. గాయత్రిని ప్రసన్నము చేసికొనిన వారికి సంపదలు కలుగునని వారు గ్రహించినారు. దేవతలు 'విశ్వకర్మా' అనియు అసురులు 'దాభీ' అనియు సగౌరవముగా గాయత్రిని ఆహ్వానించినారు. కాని గాయత్రి ఉభయులలో ఏ ఒక్కరిని అనుగ్రహించలేదు.

అప్పుడు దేవతలు ఈ యజుమంత్రమును కనుగొన్నారు.

**2.** **"ఓజోఽసి సహూఽసి బలమసి భ్రాజోఽసి దేవానాం ధామ నామాసి విశ్వమసి విశ్వాయు రభిభూః"**

నీవే ఓజస్సువు. సాహసమవు. బలమవు. దీప్తివి. దేవతలకు స్థానమగు స్వర్గమవు. విశ్వమవవు. విశ్వాయువవు. సర్వాయువవు. సమస్తవు. నీవే శత్రువులను పరాభవించు దానవు.

**3.** ఈ మంత్ర ఉపాసన చేత దేవతలు గాయత్రిని ప్రసన్నము చేసికొన్నారు. అసురుల **ఓజో బలమిన్ద్రియం ప్రజాం పశూన్** దేవతలు వశపరచుకున్నారు.

**4.** గాయత్రి తొలగిపోయినందున దీని **'గాయత్రి ఇష్టి'** అన్నారు.

**సంవత్సరోవై గాయత్రీ** - గాయత్రియే సంవత్సరము కదా! సంవత్సరమే గాయత్రి రూపమున తొలగిపోయినది. దేవతలు ఈ ఇష్టిని చేసి అసురుల బలాదులను తీసుకున్నారు. అందువలన దీనిని "సంవర్గఇష్టి" అన్నారు.

**5.** ఎవనికి శత్రువులు ఉందురో మరియు ఎవడు శత్రువులను ఓడించదలచునో అతడు శత్రువుల ఓజోబలములను తొలగించునట్టి సంవర్గఇష్టిని అనుష్ఠించ వలెను. **అగ్నయే పురోడాశమష్టా కపాలం నిర్వపేత్.**

**6.** అష్టా కపాల పురోడాశమును ఆరిన వేదిక మీద ఉంచవలెను. **ఓజోఽసి** అనుమంత్రమున దానిని తాకవలెను. అందువలన శత్రువు యొక్క ఓజస్సు, బలము, ఇన్ద్రియము, వీర్యము, ప్రజలు పశువులు తొలగి యజమాని యందు చేరుదురు. అతడు తన శత్రువులను పరాభూతులను చేయును.

## నాలుగవ అనువాకము

**1.** ప్రజాపతి ప్రజలను సృష్టించినాడు. ప్రజలు ప్రజాపతిని విడిచివెళ్లిపోయినారు. ఆ విధముగ వెళ్లివారు నివసించిన చోట 'గర్ముత్' అను అరణ్యాధాన్యము మొలచినది.

బృహస్పతియు, ప్రజాపతియు ప్రజలను అనుసరించినారు. 'ప్రజాపతీ! నిన్ను గర్ముత ధాన్య సంపదయందు ప్రతిష్ఠితుని చేయుదును. అందువలన ప్రజలు నిన్ను చేరుదురు' అని బృహస్పతి ప్రజాపతిని ధాన్యవంతుని చేసినాడు. అందువలన ప్రజలు తిరిగి ప్రజాపతిని చేరుకున్నారు

**2.** సంతానము కోరువాడు సంతానఫలప్రాప్తి కొరకు ప్రజాపతి దేవతాకమగు గర్ముత్ ధాన్య చరును నిర్వాపము చేయవలెను. స్వభాగధేయమున ప్రజాపతిని సేవించవలెను. అందువలన ప్రజాపతి యజమానికి సమృద్ధ సంతానము కలిగించును.

**3.** ప్రజాపతి పశువులను సృష్టించినాడు. పశువులు ప్రజాపతిని విడిచివెళ్లి పోయినవి. ఆ విధముగా వెళ్లి పశువులు నివసించిన చోట **'గర్ముత్'** అను అరణ్యాధాన్యము మొలిచినది.

పూషదేవతయు ప్రజాపతియు ఆ పశువులను అనుసరించినారు. 'ఈ గర్ముద్ధాన్యమున నన్ను ప్రతిష్ఠించుము. పశువులు నిన్ను చేరగలవు' అని పూష అన్నాడు. 'నన్ను ప్రతిష్ఠించుము. గర్ముద్ధాన్యము నాకు సంబంధించినది అగును' అని సోమదేవత అన్నాడు.

ప్రజాపతి 'మీ ఉభయులను ప్రతిష్ఠింతును' అన్నాడు. ప్రతిష్ఠించినాడు. అందువలన పశువులు తిరిగి ప్రజాపతిని చేరినవి.

4. పశువులు కావలెనను కొనువాడు సోమపూష దేవతాకమగు గార్ముత చరును నిర్వాపము చేయవలెను. అతడు స్వభాగధేయమున సోమపూషదేవతలను అర్చించవలెను. అప్పుడు ఆ దేవతలే అతనికి పశువులను కలిగింతురు. సోమదేవత రేతస్సు కలిగించును. పూష దేవత పశువులను కలిగించును.

## అయిదవ అనువాకము

1. అగ్నీ! గోవులను తీసికొని మావద్దకు విచ్చేయుము. చంద్రుడా! పశువులకు పుష్టి కలిగించుము. మమ్ము సంతుష్టులను చేయుము. ఇంద్రుడు మా ఇండ్లలో పశువులను చేర్చును గాత.

2. సూర్యుడు పశుసహస్రములు కలవాడు. అతడు మా ఇంట ఆనందించును గాత. పూష పశుపోషకుడు. అతడు ధనము చేతబట్టి మా ఇంటికి వచ్చును గాక.

3. విధాతయు, జగత్పతియు, ఈశానుడును అగువాడు మాకు ధనములను ఇచ్చును గాత. అతడు మాకు పరిపూర్ణ రక్షణలను కలిగించును గాత.

4. ప్రజాపతి శ్రేష్ఠుడు. కోరికలు తీర్చువాడు. అతడు మా ఇండ్లలో వేల, పదుల వేల పశువులతో విహరించును గాక.

5. ధనపోషక దేవా! దేవతలు నీచేత అమృతమును, అనంత కీర్తిని స్వర్గమునందు స్థాపింపచేసినారు. మా జీవనమునకు గాను నీవు ఆలమందలను తెచ్చిఇమ్ము.

6. అగ్ని గృహపతి. చంద్రుడు జగత్పాలకుడు. సూర్యుడు మేధాశక్తి కలవాడు. వారికి **స్వాహా.**

7. గృహపతివగు అగ్నీ! నీ ఘృతభాగము ఉన్నది. దానితో కూడిన ఓజస్సు ఉన్నది. యజమాని నిన్ను అనుసరించి ఉన్నాడు. వానిని అతనికి సమకూర్చుము.

నేను గొప్పవారు ఏర్పరచిన మార్గమునుండి తొలగను. యజమానులందు తలమానికమును అగుదును గాక. **స్వాహా.**

## ఆరవ అనువాకము

1. పశువు కావలెననుకొనువాడు 'చిత్రాయాగము' చేయవలెను. ఇయంవై చిత్రా - ఈ భూమియే చిత్ర కదా! అదికాక ఈ భూమి మీద సర్వభూతములు పుట్టుచున్నవి. అందువలన ఈ ధరిత్రియే 'చిత్ర' అయినది.

ఈ విషయమును గ్రహించి పశువులను కోరువాడు చిత్రాయాగము చేయవలెను. అందువలన అతనికి పశుసమృద్ధి, సంతాన సమృద్ధి, మిథునములును కలుగుచున్నవి.

**2.** చిత్రాయాగము నందు సప్తహవిస్సులు కలవు. తొలి హవిస్సు అగ్నిదేవతాకము. ఆ హవిస్సుచే పశూత్పత్తి బీజమును ఉంచినట్లగును. రెండవది సోమదేవతాకము. ఈ హవిస్సుచే రేతస్సు చేర్చినట్లుగును. మూడవది త్వష్టదేవతాకము. ఈ హవిస్సున చేర్చిన రేతస్సు నానా రూపములు దాల్చును. నాల్గవది సరస్వతీ దేవతాకము. అయిదవది సరస్వద్దేవతాకము. వీరిరువురు స్త్రీ పురుష దేవతలు. ఇది సప్తమిథునములందు మధ్యమము. దీనివలన యజమాని గృహము నందు దైవ్య మిథునము చేరినట్లగును. అందువలన పుట్టిన బిడ్డలకు, పశువులకు పుష్టి కలుగును.

ఆరవది సినీవాలి దేవతాకము. సినీవాలి వాక్ స్వరూపము కలది. ఆ దేవతాకమగు హవిస్సు వలన మాటకు పుష్టి కలుగును. ఏడవది ఇంద్ర దేవతాకమగును. ఇంద్ర దేవతాక చరు ఉత్తమ చరు అగును. సినీవాలి స్త్రీ ఇంద్రుడు పురుషుడు అయినందున ఇది మిథునము అగుచున్నది.

**3.** ఈ హవిస్సులు, సప్తసంఖ్యాకములు. గ్రామ్య పశువులు సప్తసంఖ్యాకములు. అరణ్యా పశువులు సప్త సంఖ్యాకములు. ఛందస్సులు సప్తసంఖ్యాకములు. కావున ఈ సప్తసంఖ్యాక హవిస్సు వలన పశువులు, ఛందస్సులు లభించుచున్నవి.

**4.** కావున యజమాని సప్తహవిస్సుల హోమము చేయవలెను. అందలి దేవతలు పుష్టికి అధిదేవతలు. వారు యజమానికి పుష్టి కలిగింతురు. అతడు 'పుష్యతి ప్రజయా పశుభిః' అతనికి సంతానపుష్టి, పశుపుష్టి కలుగును. ఈ ఆహుతులు కీర్తి ప్రతిష్ఠలు కలిగించును.

**ఏడవ అనువాకము**

**1.** నల్లని వస్త్రమా! నీవు మరుత్సంబంధివి. నీవే మరుత్తులకు బలము అగుచున్నావు. జలధరము నందలి జలధారను భేదించుము.

(యజమాని అగ్న్యన్వాదానము చేసి, ఆహవనీయాగ్నిని దక్షిణ దిశన అతిక్రమించి నల్లని వస్త్రము ధరించవలెను.)

**2.** మరుత్తులారా! రండి. మనోవేగమున రండి. వర్షము కలిగించు పడమటి గాలిని వెంట తీసికొనిరండి. డేగవలె వేగముగ రండి. ఆనందించండి.

అశ్వినులారా! మేఘము సాగినది. వానకురిపించినది: అది ధారలుగా కురియుచున్నది. దాని వలన క్షేమము - శుభము - కలుగునట్లు చేయండి.

**3.** ఎదురుగాలి వానకురిపించి జనులను మురిపించును గాత. తస్మై స్వాహా.

పెనుగాలితో కూడి, వర్షము కలిగించుచు, తీవ్ర ధారాపాతమై మరలును గాక. స్వాహా.

ఉరుముచు, కురియుచు, భయము కలిగించుచు మరలును గాత. స్వాహా.

పిడుగుపాటు లేకుండ, తడుపు చప్పుడు చేయుచు, మెరుపులతో కురియుచు, పొలములను ప్రకాశింప చేయుచు మరలునుగాక. స్వాహా.

రాత్రింబవళ్లు కురియుచు, భూములను అన్నింటిని నింపుచు మరలును గాత స్వాహా.

ఈ వర్షము ఎంతో కురిసినదని జనులు చెప్పుకొనునట్లు కురిసి మరలును గాత. స్వాహా.

ఎండావానలు కలిసి వెలుగులు చూపి మరలును గాక స్వాహా.

ఉరుముచు, మెరయుచు వర్షించు పురోవాతము మరలి వచ్చునుగాక. స్వాహా.

**4.** జలములారా! మీరు వర్షహేతువులు. వానపడినపుడు చప్పుడు చేయువారు. ప్రవహించి సాగువారు. తెల్లని వారు. సూర్యుని కప్పివేయువారు. భూమిని తడుపువారు. నురుగు గలవారు. జగన్మిత్రులగు ఓషధులను పోషించువారు. రాజులను పోషించువారు. దేశమున పంటలు పండించువారు. మీరు నన్ను ఈ యజ్ఞమునందు రక్షించండి.

**5.** కృష్ణాజినము సేచన సమర్థమగు అశ్వము వంటిది. రజ్జువా! నీవు దానిని బంధించుదానవు అగుచున్నావు.

(కృష్ణాజినమును త్రాటితో కట్టవలెను.)

### ఎనిమిదవ అనువాకము

**1.** అగ్ని, సోమ, సూర్యులారా! మీరు జనులకు నివాసము కలిగించువారు. మాకు జలము ప్రసాదించండి. దివి, భువి, అంతరిక్షముల వలన కలిగిన మేఘములను భేదించండి. మేఘము నుండి వర్షము కలిగించండి. మమ్ము రక్షించండి.

మిత్ర, వరుణ, ఆర్యములారా! మాకు జలమును ప్రసాదించండి. దివి, భువి, అంతరిక్షము వలన కలిగిన మేఘములను భేదించండి. మబ్బులను కురిపించండి. మమ్ము రక్షించండి.

సమాన సోమపానము గల అపాంనపాత్, ఆశు హేమ దేవతలారా! మాకు ఉదకములు ప్రసాదించండి. దివి, భువి, అంతరిక్షము వలన కలిగిన మేఘములను భేదించండి. మబ్బులను కురిపించండి. మమ్ము రక్షించండి.

**2.** వర్షము నేలను తడిపి వేయుచున్నది. మబ్బులు పగటిపూటనే చీకట్లు ముసిరించుచున్నవి. రాత్రుల విషయము చెప్పపనిలేదు కదా!

**3.** ఋత్విజులు చక్కని హవిస్సును అర్పించుచున్నారు. యజమాని కొరకు జలధరములను దివినుండి దించుచున్నారు. అవి బహు మేఘములై దివిని, భువిని ముంచు వర్షము కలిగించుచున్నవి. ఇవి నీరులేని మరుభూమి మీద సహితము కురియుచున్నవి.

**4.** మరుత్తులారా! మీరు సముద్రమంతటి మబ్బునుంచి వానను పుట్టించండి. పాంసు యుక్తములగు నేలలను తడపండి. మీరు భూమి తాపమును చల్లార్చువారు. మేఘములు లోకోపకారములు. మంగళ కరములు. ధేను సదృశములు. ఇవి మీకు సంబంధించినవి. క్షీణించుటయే లేదు. ఇతర దేవతల రథములు మిమ్ము అనుసరించి వచ్చును గాత.

**5.** మరుత్సంఘమా! ద్యులోకము నుండి వర్షము కలిగించండి. ఈ కుండ సముద్ర సదృశము. దీనిని నీటితో నింపండి.

**6.** గొర్రె గారూ! మీరు జలమునుండి పుట్టినారు. మొదట పుట్టినారు. సముద్రమంతటి మేఘము నుండి వర్షము కలిగించగలవారు.

**7.** పునర్నవమా - గలిజేరుమొక్కా! నేలను పూర్తిగా తడుపుము. దివినుండి పుట్టిన ఆకాశమంతటి మేఘమును భేదించుము. మాకు వర్షము కలిగించుము. ఈశానుడవై నీరు నిండిన మేఘద్వారములను తెరువుము.

**8.** ద్యులోకము నందలి దేవతలును, అంతరిక్షలోకపు దేవతలును, భూలోకపు దేవతలును ఈ యజ్ఞమును రక్షింతురు గాక. వారు ఈ క్షేత్రమును ఆవేశింతురు గాక. ప్రవేశింతురు గాక.

## తొమ్మిదవ అనువాకము

**1.** కారీరీష్టి కర్త **"మారుతమసి మరుతామోజః"** అను మంత్రముల చేత నల్లని అంచుగల నల్లని వస్త్రమును ధరించవలెను. ఇదియే వర్షరూపమగును. అందువలన అతడు వర్షముతో సమాన రూపుడు అగును. మేఘమును వర్షింపచేయును.

**2.** **"రమయత మరుతః"** అను మంత్రమున యజమాని పడమటి గాలిని ప్రతిబంధించుచున్నాడు వర్షము కలిగించుటకు తూరుపుగాలి వీచునట్లు చేయుచున్నాడు.

**3.** ఏడవ అనువాకపు మూడవ మంత్రముచే హోమము చేయవలెను. **వాయుర్వై వృష్ట్యాఈశే** వాయువే వర్షమునకు ప్రభువు అగుచున్నాడు. కావున యజమాని **వాయుమేవ స్వేన భాగధేయేనో పధావతి.** ఆ వాయువే అతని కొరకు వర్షము కురిపించును.

**4.** ఏడవ అనువాకము నందలి **'పురోవాతో'** మున్నగు ఎనిమిది మంత్రములచే యజమాని హోమము చేయవలెను. దిక్కులు నాలుగు. అవాంతర ఆగ్నేయాది దిక్కులు నాలుగు. కావున ఈ ఎనిమిది మంత్రములు ఎనిమిది దిక్కులందు ఎంతో వర్షము కురిపించును.

**5.** కృష్ణాజినమునందు ఎదురు బియ్యపు పిండిని నల్లని తేనెచే కలుపవలెను. అది హవిస్సు అగును.

**6.** హవిస్సునకు సిద్ధి కలుగుటకు గాను వేది మధ్యమునందు సక్తు మిశ్రణము చేయవలెను.

**7.** యతులను సాలవృకాదులు భక్షించినవి. అప్పుడు రాలిపడిన వారి తలలు ఖర్జూర వృక్షములు అయినవి. ఆ ఖర్జూర రసము పైనుండి పడినది. అవియే కరీరములు అయినవి. అవి సోమ లతాంకుర సదృశములు అయినవి. కరీర శబ్దవాచ్యములగు ఆహుతులు సోమసదృశ ద్యులోకము నుండి వర్షము కురిపించుచున్నవి.

(యతులను సాలవృకాదులు భక్షించుట ఏమి అనుసంశయము కలుగకమానదు. **పారమహంస్యరూపం చతుర్థాశ్రమం ప్రాప్తానాం యతీనాం ముఖే బ్రహ్మాత్మ ప్రతిపాదకో వేదాన్త శబ్దో నాస్తి తాన్యతీంద్రా నింద్రో ఆరణ్యేభ్యః శ్వభ్యః ప్రాయచ్ఛత్** అని సాయణభాష్యము పరమహంసరూపమగు నాలుగవ ఆశ్రమము అవలంబించిన యతులనోట బ్రహ్మాత్మప్రతిపాదితమగు వేదాంత శబ్దము వెడలని వారిని ఇంద్రుడు ఆరణ్యక పశు పక్షులకు వేసినాడు.

**"నిత్య కర్మ పరిత్యజ్య వేదాంత శ్రవణం వినా వర్తమానస్తుసన్యాసీ పతత్యేవ న సంశయః"** అని స్మృతి వాక్యము.

సాయణాచార్యులను కాదనునంత వారము కాము. కాని ఇంతవరకు 'వేదాంత' మను పదము వేదమున రాలేదు. బ్రహ్మ ఉపనిషత్తులందు ప్రతిపాదించబడినవాడు. సాయణుడు ఇచ్చిన ఉదాహరణము కౌషీతకి బ్రాహ్మణ ఉపనిషత్తు నందలిది.

**'యతీనామ్ శీర్షాణామ్'** అను దానికి వేద పరమగు మరొక అర్థము ఉండవచ్చును.

సాయణాచార్యులు ఋగ్వేదము 10వ మండలము 73వ సూక్తము నందలి 7వ మంత్రపు భాష్యమున **"యతయో మేఘాః"** అని అర్థము చెప్పినాడు.

**"యద్దేవా యతయో యథా భువనాన్య పిన్వంత"** దేవతలు మేఘముల వలె లోకములందు వ్యాపించినారు అనునది మంత్రార్థముగా చెప్పినాడు.

ఇచట సహితము తలలు రాల్చినది మేఘములవి కావచ్చును.

యతుల తలలు నక్కలకు, తోడేళ్లకు వేయుట అసభ్యము, అనాగరకము, అత్యాచారము అగును. ఇది ఆలోచనామృతము. మీరు ఆలోచించుటకే.)

**8.** కరీరసక్తువు హవిస్సు కావలెను. అది సోమసదృశ ఆహుతి అగును. అందువలన ద్యులోకము నుండి వర్షము కురియును.

**9.** కరీరసక్తును తేనెతో కలుపవలెను. నీరు ఓషధుల రసమే మధువు అగును. వర్షము, నీరు ఓషధులనుండియే కదా కలుగునది! కావున జలము ఓషధుల వర్షము కలిగించుచున్నది.

**10.** **'మాన్దావాశా'** మున్నగు మంత్రముల చేత సక్తుతేనె కలుపవలెను. ఇవి జలములకు పేర్లు జలములు తమ పేరు విని దిగివచ్చుచున్నవి.

యజమాని జలములను పేర్లతో పిలిచి రమ్మన్నంత జలములు ఆ పేర్లు గలవిగనే వర్షము కురిపించుచున్నవి.

**11.** అశ్వము సేచన సమర్థము. మేఘమును అట్లే అగును. నీరు త్రాగిన మబ్బు నల్లని కారు మబ్బై వర్షించును. రూపము నల్లనిదైనందున మేఘము మరింత వృష్టి కలిగించుచున్నది.

**పదవ అనువాకము**

**1.** **"దేవా వసవ్యాః, దేవా శర్మణ్యాః, దేవా సపీతయః"** అను మూడు మంత్రభాగములచే కలిపిన సక్తును ముద్దలు చేయవలెను. ఆ విధముగా చేయుటవలన ఆ మంత్రమునందలి దేవతలు నిత్యము వర్షము కలిగింతురు.

**2.** ముద్దలు చేసినంత వర్షము కురిసిన హోమము చేయవలెను. కురువనిచో మరుసటి రోజు హవి పురోడాశమును నిర్వాపము చేయవలెను.

**3.** మిత్రావరుణులు రేయింబవళ్ల ప్రతీకలు. మేఘము పగలును, రాత్రియు వర్షించునదే కదా!

యజమాని స్వభాగధేయమున మిత్రావరుణులను సేవించవలెను. ఆ మిత్రావరుణులే అతని కొరకు అహోరాత్రులచే వర్షము కలిగింతురు.

**4.** (2వ మంత్రమున వర్షము కురియకున్న మరునాడు పురోడాశము నిర్వాపము చేయవలెను అన్నాడు. దానిని వివరించుచున్నాడు.)

దామశబ్దఘటిత ప్రతిపాద్యుడైన **అగ్నయే పురోడాశ మష్టాకపాలం నిర్వపేత్. మారుతగ్ం సప్తకపాలగ్ం సౌర్యమేక కపాలం నిర్వపేత్.**

అగ్ని ఈ భూలోకము నుండి వర్షము కలిగించును. మరుత్తులు వర్షమును వివిధ ప్రదేశములకు చేర్చెదరు. సూర్యుడు తన కిరణముల చేత తాపము కలిగించునపుడు వర్షించును. లోకములను కప్పివేయుచు మబ్బులను చేర్చుకొని వర్షించును.

ఈ అగ్ని, మరుత్తులు, ఆదిత్యులే వర్షము కలిగించు శక్తులు కలిగి ఉన్నారు. యజమాని స్వభాగధేయమున ఆ దేవతలనే యజించవలెను. వారే యజమాని కొరకు మేఘములచే వర్షింపచేయుదురు. **అవర్షిష్య స్వర్షతేవ** - అంతకు వర్షించని దైనను మేఘము వర్షించును.

**5.** మరుత్సంఘములారా! దివి నుండి వర్షమును తెండి. సముద్రము వంటి కుండను నింపండి. అని చెప్పబడినది. (8వ అనువాకము 5వ మంత్రము.)

అందు భూలోక, స్వర్గలోకజలముల వర్షమును గురించి చెప్పబడినది. ఇంక ఏమి అనగా భూలోక జలములే స్వర్గలోకమునకు చేరుచున్నవి.

6. **'అబ్జాసి ప్రథమజా బలమసి సముద్రి యమి త్యాహ'** (ఇది 8వ అనువాకపు 6వ మంత్రము.) దీనిని యజుర్వేద మంత్రముగా గ్రహించవలెను.

7. **'ఉన్నమ్భయ పృథివీం'** అను మంత్రము చేత గలిజేరు మొక్కకు హోమము చేయవలెను. ఈ గలిజేరు ఓషధులన్నింటిలో వర్షము కలిగించునది. అదియే సర్వత్ర వర్షము కలిగించును.

8. **'యేదేవా దివిభాగా'** అను మంత్రమున కృష్ణాజినమును విదిలించ వలెను. అందువలన పృధివ్యంతరిక్ష ద్యులోకములు ప్రీతులగును. యజమాని కోరికలను తీర్చును.

**అథ సప్తమారభ్య దశమాం త్రైశ్చతుర్భిరనువాకైః కారీరిష్టిః ప్రతిపాద్యతే.** ఏడు నుంచి పదవ అనువాకము వరకు కారీర ఇష్టి చెప్పబడినది.

### పదకొండవ అనువాకము

1. ఇది త్రైధాతవీ ఇష్టి. ఇందు సర్వఛందస్సులు అనుసరించబడినవని చెప్పుదురు.

కకుచ్ఛందస్సు త్రిష్టుప్ ఛందస్సు సారమగును. ఉష్ణిక్కు జగతికి సారమగును. ఉష్ణిక్కకుచ్ఛందము లందు సర్వ ఛందస్సులు చేరి ఉన్నవి.

2. ఉష్ణిక్ఛందస్సు గాయత్రి ఛందస్సు అగుచున్నది. మిగిలిన నాలుగు అక్షరములు చతుష్పాద పశుస్వరూపములు. ఈ త్రైధాతవీ ఇష్టియందు పురోడాశము మీద మరొక పురోడాశము ఉంచబడును. అట్టివే ఉష్ణిక్ఛందస్సు నందలి అధిక అక్షరములు.

(ఉష్ణిక్ఛందమునకు 28 అక్షరములు. గాయత్రికి 24. 28 - 24 = ఎక్కువయిన నాలుగు చతుష్పాదస్వరూపములని చెప్పినాడు.)

3. జగతీ ఛందస్సుచే సామిధేని ఋక్కును పూర్తి చేసినచో యజమాని యజ్ఞమును నాశనము చేసినవాడగును. కావున త్రిష్టుప్ఛందముచే సామిధేని ఋక్కును సమాప్తము చేయవలెను. త్రిష్టుప్ఛందస్సు ఇంద్రియ సామర్థ్యము కలిగించునది యగును. అందువలన యజమాని యజ్ఞమునకు సామర్థ్యము కలిగించినవాడు అగును. యజ్ఞము నశింపకుండును.

4. "అగ్నేత్రి" అనుటచే అగ్ని త్రిశబ్దవాచ్యుడు. కావున అగ్ని త్రిష్టుప్‌కు సారూప్యమగును. అందువల్ల త్రిష్టుప్ఛందస్క ఋక్కుచే పరిసమాప్తి చేయవలెను.

5. త్రైధాతవీ యజ్ఞము సర్వయజ్ఞస్వరూపము అగుచున్నది. కోరికలకు కోరికలే ఈ యజ్ఞమున ప్రతిపాదించబడును. కావున ఈ యజ్ఞము సమస్త కోరికలు తీర్చునది అగును.

**6.** శత్రువును హింసించ దలచినవాడు త్రైధాతవీయ యాగమును చేయవలెను. ఇది సర్వయాగ స్వరూపము. కావున ఇది శత్రువును హింసించును. యజమాని తన శత్రువును నిశ్చయముగ నాశనము చేయును.

**7.** అభిచార హోమమునకు గురియైనవాడు ఈత్రైధాతవీ ఇష్టిని చేయవలెను. ఇది సర్వయజ్ఞ స్వరూపము. అందువలన యజమాని సర్వయజ్ఞ స్వరూపమగు ఈ ఇష్టిని అనుష్ఠించవలెను. ఇందువలన అభిచార హోమము యజమానిని హింసించదు.

**8.** సహస్ర దక్షిణాక యాగము చేయ తలపెట్టినవాడు ఈ త్రైధాతవీయేష్టిని ఆచరించవలెను. అందువలన అతనికి సహస్ర దక్షిణలు ఇచ్చు శక్తి కలుగును.

**9.** గో సహస్ర దక్షిణాక యాగము చేసిన వాని పశువులు నశించును. కావున ఆ యాగము చేయనున్నవాడు త్రైధాతవీయ యాగము చేయవలెను. ప్రజాపతి త్రైధాతవీయ యాగము చేసియే పశువులను సృజించినాడు. పశువులను కోరువాడు ఈ విషయము గ్రహించవలెను. త్రైధాతవీయ యాగము చేయవలెను. ప్రజాపతి ఈ యాగమున పశువులను సృజించిన రీతి యజమానికి పశువులు కలుగును.

ఉత్తర క్రతువునందు ఇవ్వదగిన గో సహస్రము ఈ యజమానికి చెందును.

**10.** యజ్ఞము చేయసంకల్పించి చేయనివాడు దేవతలకు ద్రోహము చేసినవాడగును. ఆ దోషపరిహారమునకుగాను సర్వయజ్ఞ స్వరూపమగు త్రైధాతవీయేష్టిని చేయవలెను. అప్పుడతడు దేవతలకు దోషము చేసినవాడు కాకుండును.

**11.** ఈ యజ్ఞమునందు ద్వాదశ కపాల పురోడాశము కావలెను. అవి మూడు చతుష్క పాలములు అగును. మూడింతలు యజమానికి మూడింతల సమృద్ధి సమకూర్చును.

**12.** లోకములు మూడు. మూడులోకముల ప్రాప్తికి మూడు పురోడాశములు అగుచున్నవి.

**13.** ముందు చెప్పిన పురోడాశములందు తరువాత చెప్పినవి శ్రేష్ఠములు. ఏలననగా పృథివి, అంతరిక్ష ద్యులోకము ఒకదాని కన్న మరొకటి శ్రేష్ఠము కదా!

**14.** ఈ యాగము నందు పురోడాశము యవలది కావలెను. ఇది సమృద్ధి కొరకు అంతరిక్షలోక సదృశము.

**15.** పురోడాశము లన్నింటిని వ్యర్థము కాకుండ అవదానము చేయవలెను.

**16.** ఈ యాగము నందు యజమాని హిరణ్యమును దక్షిణగా ఇవ్వవలెను. అందువలన అతనికి తేజస్సు కలుగును. ఘృతాక్త వస్త్రమును దక్షిణగా ఇచ్చుట వలన పశువులు కలుగును. పాలిచ్చు ఆవును దక్షిణగా ఇచ్చుట వలన ఆశీస్సులు లభించును.

హిరణ్యము సామవేద రూపము. ఘృతాక్త వస్త్రము యజుర్వేదరూపము. ధేనువు ఋగ్వేదరూపము. మూడింటిని దక్షిణగా ఇచ్చినవారికి సర్వరూపములు కలుగుచున్నవి.

### పన్నెండవ అనువాకము

**1.** ఇంద్రుడు త్వష్టపుత్రుని వధించినాడు. త్వష్ట కోపించినాడు. సోమయాగము చేయుటకు ఉద్యమించినాడు. ఇంద్రుడు తనను యాగమునకు ఆహ్వానించుమని త్వష్టను అడిగినాడు. 'నీవు నా కొడుకును చంపినావు. నిన్ను పిలువను' అని త్వష్ట సోమయాగమునకు ఇంద్రుని ఆహ్వానించలేదు. అందుకు ఇంద్రుడు యజ్ఞమును విఘ్నము చేసినాడు. బలాత్కారముగా సోమరసము సేవించినాడు.

(ఇది 5వ ప్రపాఠకపు మొదటి అనువాకమున వివరించబడినది.)

**2.** ఇంద్రుడు బలాత్కారముగా పానము చేసిన సోమపు శేషభాగమును త్వష్ట అందుకున్నాడు. ఇంద్రుని వధించుటకు హోమము చేసి అగ్నిని కల్పించినాడు. "స్వాహేన్ద్రశత్రుర్వర్ధస్వ" అను మంత్రమున వైర్యుత్పాదనకై అగ్నిని ప్రవృత్తుని చేసినాడు. అప్పుడు ఊర్ధ్వ జ్వాలారూపుడై జ్వలించుచున్న అగ్నిజ్వాలలు క్రుంగి చల్లారి పోయినవి. ఇది మంత్రోచ్చారణలో లోపము వలన జరిగినది. అగ్నినుంచి మరొకడు జన్మించినాడు. అతడు హోమాధారమగు అగ్నిని, ఆహ్వానించబడిన సోమదేవుని ఆక్రమించినాడు.

**3.** ఆ పుట్టినవాడు ఒక్కొక్క బాణము పడునంత మేరకు వ్యాపించినాడు. వృద్ధిచెందినాడు. ఈ లోకములను అన్నింటిని ఆక్రమించినాడు. **ఇమాన్ లోకాన్ ఆవృణోత్ యత్‌తత్ వృత్రస్య వృత్రత్వమ్ అభూత్** - ఈ లోకములను ఆవరించిన వాడు అగుటవలన అతనికి 'వృత్రుడు' అను పేరు కలిగినది. అదియే అతని వృత్రత్వము.

**4.** ఆ వృత్రుని వలన ఇంద్రుడు భయపడినాడు. వృత్రుడు సర్వలోకములను ఆవరించినాడు. అందువలన ఇంద్రునివలె తనకు కూడ స్థానము లేదని త్వష్ట భయపడినాడు. అప్పుడు వృత్రుని వధించుటకు త్వష్ట ఇంద్రునితో స్నేహము చేసినాడు. అతడు వజ్రాయుధమును ప్రోక్షించి ఇంద్రునకు ఇచ్చినాడు. **తపో వై ప వజ్ర ఆసీత్.** వజ్రమే తపస్సు అయినది.

**5.** ఇంద్రునకు ఆ వజ్రము ప్రయోగించు సామర్థ్యము లేకపోయినది. అప్పుడు ఇంద్రుని ఎదుట విష్ణువు అను మరొక దేవత ప్రత్యక్షమైనాడు. 'విష్ణూ! వృత్రుని చూచి నేను భయపడుచున్నాను. వజ్రాయుధమును ఎత్తలేకున్నాను. వృత్రుడు ఏ బలమున విశ్వములను ఆవరించెనో ఆ బలమును తొలగింతము రమ్ము' అని ఇంద్రుడు ప్రార్థించినాడు.

**6.** ఇంద్రుడు వృత్రుని రూపము చూచి భయపడినాడు. అతని భయమును తొలగించుటకు గాను విష్ణువు తన రూపమును మూడుగా విభజించినాడు. వానిలో ఒక రూపమును భూలోకమున రెండవ దానిని అంతరిక్షమున, మూడవ దానిని ద్యులోకమున స్థాపించినాడు.

**7.** పృథివి మీద మూడవ భాగముగా ఉన్న విష్ణువు ఇంద్రుని ముందు నిలిచినాడు. వజ్రాయుధమును ఎత్తినాడు. అప్పుడు వృత్రుడు గడగడలాడినాడు. 'నన్ను వధించకుము. పృథివిని ఆక్రమించ తగిన నా సామర్థ్యమును నీకు ఇచ్చెదను' అన్నాడు. ఇంద్రునకు తన సామర్థ్యమును ఇచ్చినాడు. ఇంద్రుడు ఆ సామర్థ్యమును తీసికొన్నాడు. "నాకు ఈ సామర్థ్యము కలిగించుము" అని ఇంద్రుడు దానిని విష్ణువునకు అందించినాడు. మనలో ఇంద్రునకే ఈ సామర్థ్యము కలుగును గాత, అని విష్ణువు ఇంద్రుని కొరకు ఆ సామర్థ్యమును గ్రహించినాడు.

**8.** విష్ణువు యొక్క మరొక మూడింట ఒకభాగము అంతరిక్షమున ఉంచినాడు కదా! ఇంద్రుడు ఆ భాగపు విష్ణువు వెనుక నిలిచి వజ్రాయుధమును ఎత్తినాడు. అప్పుడు వృత్రుడు గడగడలాడినాడు. 'నన్ను వధించకుము. అంతరిక్షము ఆక్రమించగల నా సామర్థ్యమును నీకిచ్చెదను' అన్నాడు. ఇచ్చినాడు. ఇంద్రుడు దానిని తీసికొన్నాడు. 'నాకు ఈ సామర్థ్యము కలిగించుము అని ఇంద్రుడు దానిని విష్ణువునకు ఇచ్చినాడు. మనలో ఇంద్రునకే ఈ సామర్థ్యము కలుగును గాత' అని ఇంద్రుని కొరకు విష్ణువు ఆ సామర్థ్యమును గ్రహించినాడు.

**9.** విష్ణువు యొక్క మరొక మూడింట ఒకభాగము స్వర్గమున ఉంచినాడు కదా! ఇంద్రుడు ఆ భాగపు విష్ణువు వెనుక నిలిచి వజ్రాయుధమును ఎత్తినాడు. అప్పుడు వృత్రుడు గడగడలాడినాడు. 'నన్ను వధించకుము. ద్యులోకమును ఆక్రమించగల సామర్థ్యమును నీకు ఇచ్చెదను' అన్నాడు. ఇంద్రుడు అందుకు తన అంగీకారము తెలియపరచినాడు.

**10.** 'ఇంద్రా! మనము ఒక సంధి చేసికొందము. దానిని అనుసరించి నేను నీలో ప్రవేశింతును.' అన్నాడు వృత్రుడు.

ఇంద్రుడు: - వృత్రా! అట్లు ప్రవేశించి నీవు నన్ను తినివేయుదువా?

వృత్రుడు: - నిన్ను భుజించను. నీ భోగము కొరకే నీ ఉదర పాటవమును దీపింప చేయుదును. అందుకొరకే నీయందు ప్రవేశింతును.

అట్లని వృత్రుడు ఇంద్రుని యందు ప్రవేశించినాడు. అతడు ఉదరము అయినాడు.

**క్షుత్ఖలువై మనుష్యస్య భాతృవ్యో** - ఆకలియే కదా మానవునకు శత్రువు!

**యః ఏవం వేద హన్తి క్షుధం భాతృవ్యం** - ఈ విషయము తెలిసికొనిన వాడు ఆకలి అను శత్రువును గెలుచును.

**11.** వృత్రుడు అట్లని తన ద్యులోకమును ఆక్రమించు సామర్థ్యమును ఇంద్రునకు ఇచ్చినాడు. మూడవసారి నాకు ఈ సామర్థ్యము కలిగించుము, అని దానిని విష్ణువునకు ఇచ్చినాడు. మనలో ఇంద్రునకే సామర్థ్యము కలుగును గాక అని ఇంద్రుని కొరకు విష్ణువు ఆ సామర్థ్యమును గ్రహించినాడు.

**12.** వృత్రుడు మూడు మారులు ఇచ్చినాడు. ఇంద్రుడు మూడు మారులు తీసికొన్నాడు. అట్లగుట వలన త్రిధాతురూప పురోడాశ హవిస్సునకు త్రిధాతుత్వము ఏర్పడినది.

**13.** విష్ణువు ఇంద్రునకు అనుకూలుడు అయినాడు. అందువలన ఇంద్రుడు విష్ణువునకు ఇచ్చినాడు. అందువలన ఈ పురోడాశము ఇంద్రావిష్ణుదేవతాకమైనది.

**14.** వృత్రుడు ఇంద్రునకు మూడు పర్యాయములు ఇచ్చిన సామర్థ్యము ఋగ్యజుస్సామ సామర్థ్యము అగును.

**15.** వృత్రుడు ఇంద్రునకు వేలరూపములను ఇచ్చినాడు. అందువల్ల ఈ క్రతువు సహస్రదక్షిణలు కలది అగుచున్నది.

**ఆలోచనామృతము**

**1.** ఒక వ్యక్తిని చూచినంత మనకు అతడు అర్థమగునా? అతనితో మాట్లాడినంత అర్థమగునా? స్నేహము చేసిన అర్థమగునా? దశాబ్దాలు కలసి కాపురము చేసి కలసి బాధ్యతలు నిర్వహించిన దంపతులు ఒకరిని ఒకరు అర్థము చేసికోలేకున్నారు. ఈ అర్థము చేసికొనుట దుస్తరాతి దుస్తరము. అసంభవమని సహితము చెప్పవచ్చునేమో!

ఎందుకు ఈ చిన్నప్రాణికి ఇంతక్లిష్టత? ఎందుకు అతనికి అంత దురవగాహ్యత? ఎందుకు ఎవడును తనకోటను భేదించనివ్వడు?

ఇది దురవగాహ్యమైన అనంత ప్రకృతి సత్యము. సత్యము నిజము చెప్పుట మాత్రము కాదు. సత్యము వాస్తవము మాత్రము కాదు.

అట్లయిన సత్యము ఏమి? అదియే అనంత రహస్యము. సత్యము భగవత్ స్వరూపము. భగవంతుడు ఎంతటి అందనివాడో సత్యము అంతటి అందనిది.

సత్యము అందదు. అదొక సత్యము. ఆ సత్యము తెలిసిన వారే సత్యాన్వేషకులు! ఎంతటి విచిత్రము! అది అందదని తెలియును. అయినను అన్వేషణ! అదెందుకు? ప్రశ్న అతి సులభము సమాధానము అసాధ్యము!!

అన్వేషణమే జీవితము కదా! అన్వేషణ ఒక జీవితముతో ముగియదు. ఇది దేహాంతరములకు సహితము మారును. ఇదివట్టి విశ్వాసము కాదు. నిశ్చయము.

**2.** ఇంతటి చర్చ ఏలనన ఒకవ్యక్తిని అర్థము చేసికొనుటకు ఈర్ష్యాద్వేషములకు అతీతమైన నిరంతర అన్వేషణము అవసరము. అయినను అర్థమగుట నిశ్చయము కాదు.

ఇది వ్యక్తి విషయము. పరమ పవిత్రము, సనాతనము, అపౌరుషేయమైన వేదమును గురించి వివరించుట దుస్తరము.

వేదము అక్షరము. స్వరము మాత్రము కాదు. దానికి ఒక ఆత్మ ఉన్నది. అందు పరమాత్మ ఉన్నాడు. కావున వేదపు బాహిర రూపమును చూచి అభిప్రాయము ఏర్పరచుకొనుట మూర్ఖత్వమునకు పరాకాష్ట!

వేదము ఆవిర్భవించిన నాటినుంచి దానిని అర్థము చేసికొనుటకు నిరంతర అన్వేషణ, ప్రయత్నములు కొనసాగుతున్నవి. కొనసాగనున్నవి. కొనసాగవలెను.

**3.** వేదము వైరాగ్యము అనుమాట అనంత అసత్యము. వేదము జీవించుటకు - సుఖజీవనమునకు సంబంధించినది మాత్రమే! మానవునికి సుఖశాంతులు కలిగించుటయే వేదపు పరమార్థమని నేను గ్రహించినాను!

**4.** ఈ అనువాకమున చెప్పిన కథకు సామాన్య జీవితమునకు ఎంత సామ్యము ఉన్నది!

i) త్వష్ట కొడుకును ఇంద్రుడు చంపినాడు. కొడుకును చంపిన వానిమీద పగ అతిసాధారణము కదా! హంతకుని పరిమార్చ దలచుట సహితము మానవ సహజము కదా! ఏలనన ఈ సమాజము మానవ సంబంధాల మీదకదా నిలిచి ఉన్నది!

ii) పగసాధించదలచిన వానికి బుద్ధి సరిగా పని చేయదు. త్వష్ట విషయమున అదే జరిగినది. అందరి విషయమున అదే జరుగుచున్నది!

iii) పగతో మండి పడుతున్న తండ్రి మంత్రమున తప్పు చదివినాడు.

"స్వాహేంద్రశత్రుర్వర్ధస్వ" ఇది మంత్రము. ఇందు స్వాహా అగ్నికి. కోరినది ఇంద్ర శత్రువు వర్ధిల్లవలెనని, కాని స్వరము మారి "స్వాహాఇంద్ర" "శత్రువర్ధస్వ" అయినది. ఇంద్రునకు స్వాహా. శత్రువు వర్ధిల్లునుగాక అయినది. అందువలన లోక శత్రువు జన్మించినాడు.

భాషకు యాస ప్రాణము. భాష పలుకు మీద ఆధారపడును. ఏ భాషకును పర్యాప్తములైన అక్షరములు లేవు. ఇందుకు ఆంగ్ల అక్షరమాల నిదర్శనము!

"వచ్చావా!" అనే దానికి పలుకుబడిని అనుసరించి సామాన్యము, ప్రశ్నార్థకము, ఆశ్చర్యార్థకము అగుచున్నవి.

త్వష్ట చేసినది స్వరదోషము. పలుకుటలో తప్పు. అది సాధారణము కదా!

కాని కోపమున ఉన్నప్పుడు ఆచితూచి పలుకుట అవసరము. అట్లు చేయకున్న అనర్థము కలుగును.

iv) అపస్వర దోషము వలన ఇంద్రునకు త్వష్టకు, లోకమునకు అపకారము కలిగించు వృత్రుడు పుట్టినాడు.

అన్యుని వధించబూనిన త్వష్టకు తన ఉనికికి హాని వచ్చినది. తనతోటిదే కదా లోకము! తాను లేకున్న లోకము లేదు కదా! తన ఉనికి కొరకు పుత్ర హంతకునితో సఖ్యము చేసినాడు!

జీవితము ఎంత విచిత్రమండీ! నిన్న కొడుకును చంపినాడని కసిగలవాడు తన ఉనికి కోసము వానితోనే స్నేహము చేసినాడు!

v) ఇంద్రుడు ఒకబాలుని హతమార్చిన పాపము చేసి ఉన్నాడు. పాపము అతని బలమును తిని వేసినది. త్వష్ట వజ్రము ఇచ్చినాడు. ఇంద్రుడు దానిని లేప లేక పోయినాడు. నిర్వీర్యుడైనాడు.

ధర్మమునకు వివక్షతలేదు. అది అందరకు సమానమే!

vi) త్వష్ట బలవంతుడే. పగబూని నిర్వీర్యుడు అయినాడు. ఇంద్రుడు బలవంతుడే. పాపము చేసి నిర్వీర్యుడు అయినాడు. వజ్రము బలము కలదే! వాడగలవాడు లేడు.

vii) వృత్రుడు పగకు పుట్టినవాడు. ముల్లోకములను ఆవరించినాడు. ప్రజాశ్రేయస్సు కొరకు వృత్రుడు పోవలసి ఉన్నది. అందుకు ఒక మహాత్ముడు విష్ణువు అవతరించినాడు.

విష్ణువు ఇంద్రుడు కలసి శత్రుత్వరూప ఇంద్రుని వధించలేదు. శత్రుత్వము వధించరానిది. వృత్రుని సామర్థ్యమును సహించలేనంతటి దుర్బలుడైనాడు ఇంద్రుడు. కల్మష రహితుడైన విష్ణువు దానిని ధరించినాడు!

ఇది జీవితమునకు సంబంధించిన కథ కాదా! మానవ తత్త్వమును పరిశీలించినది వేదము. ఏనాటి - ఈనాటి - రేపటి మానవుడు ఇంతకు మించి ప్రవర్తించునా?

ఇచట ఒక రామాయణ వృత్తాంతము. భరతుడు మంథర కుటిలబుద్ధిని చంపతలచినాడు. చంపలేదు - లేడు!

ఇది వాస్తవ మానవ మనస్తత్వ చిత్రణ!

5. ఒక కథ చెప్పి నీతి బోధించుట ప్రచారము చేయుట వేదము నేర్పినది. ఇది మౌలికము.

ఎంతో ప్రగతి సాధించినామనుకొనుచున్న నేడు సాహిత్యము, సినీమాలు, టి.వీలు, పత్రికలు మున్నగునవి అన్నియు అదేపని చేయుచున్నవి కదా!

## పదమూడవ అనువాకము

**1.** దేవతలు క్షత్రియుల వలన భయపడినారు. కావున గర్భము నందున్నప్పుడే క్షత్రియుని శక్తిని బంధించినారు. కావున క్షత్రియుడు బలహీనుడై పుట్టుచున్నాడు. శక్తి కోల్పోక పుట్టిన క్షత్రియుడు శత్రువులను సంహరించుచు లోకమున సంచరించినాడు.

**2.** క్షత్రియుడు అప్రతిరుద్ధక శక్తి కలిగి జన్మించి శత్రువులను సంహరించుచు సంచరించవలెనన్న యజమాని ఇంద్ర బృహస్పతి దేవతాకమగు చరును నిర్వాపము చేయవలెను. క్షత్రియుడు ఇంద్రుని అంశము వాడు కాగా బ్రాహ్మణుడు బృహస్పతి అంశమువాడు అగును. ఆ చరు నిర్వాపము వలన బృహస్పతి సామర్థ్యమున ఇంద్రాంశ గల క్షత్రియుడు దేవతాప్రతి బంధమునుండి విముక్తుడు అగును.

**3.** ఈ యాగమునందు బంగారు త్రాడు దక్షిణ అగును. అందువలన దేవతా ప్రతిబంధము నుండి విముక్తుడు అగును.

## పదునాలుగవ అనువాకము

**1.** ఆదిత్యుడు చంద్రుని వృద్ధి క్షయములకు కారకుడు. అతడు నిత్యము నవనవోన్మేషముగ వెలుగుచున్నాడు. ఆదిత్యుడు పగటికి గుర్తు. అతడు ఉషః కాలమున తూర్పున ఉదయించుచున్నాడు. దేవతలకు హవిర్భాగములు కల్పించుచున్నాడు. ఆదిత్యుడు దీర్ఘాయుష్షును ఇచ్చును గాత.

**2.** ఆదిత్యులు చంద్రునకు రోజుకు ఒకకళను చేర్చుచు వృద్ధిచెందించుచున్నారు. పున్నమినాటి చంద్రుని - స్వయముగా క్షీణరహితులగు ఆదిత్యాది దేవతలు రోజుకు ఒక కళచొప్పున తగ్గించుచున్నారు. ఆ చంద్రుడును, ఆదిత్యులును, బృహస్పతియు, దేవతలును మాకు అభ్యుదయము కలిగింతురు గాక.

**3.** ఇంద్రుడా! నీవు తూర్పుదిశకు అధిపతివి. ఉత్తర దిక్కున శత్రుఘాతకుడవు. నదులు ప్రవహించు ప్రదేశములను అన్నింటిని జయించిన వాడవు. కోరికలను తీర్చువాడవు. హోమార్హుడవు. ఆహవనీయమునకు దక్షిణమున ఋత్విక్కులు నీకు హవిస్సును ఇచ్చుచుందురు. కావున అచట నిలుపుము.

**4.** ఇంద్రుడు సర్వత్ర జయించుచున్నాడు. పరాజయము ఎరుగడు. అతడు రాజులందరిలో అధికుడు. రాజ్యము లేని రాజులకు రాజ్యము సంపాదించి ఇచ్చువాడు.

ఇంద్రా! నీవు రాజులందరకు శరణ్యుడవు. నమస్కరించ తగినవాడవు. పరకీయ సేనలన్నింటిని ఓడించుటకు సిద్ధపడుము.

**5.** ఇంద్రుడు మహిమాన్వితుడు. అతని మహిమ పృధివి, అంతరిక్షము, ద్యులోకములందు వ్యాపించి ఉన్నది. ఇంద్రుడు యుద్ధములందు తన సేనను అభిముఖముగా నడిపించును. అతడు స్వతంత్ర ప్రభువు. ఎంతటివానికిని పరతంత్రుడు కాడు. యుద్ధమునకు సత్వరమే బయలుదేరుటకు ఇంటియందే ఆయుధములు కలవాడు. శత్రుసేన మీద దూకు స్వభావము ఉన్నవాడు.

**6.** ఇంద్రా! నీవు శూరుడవు. స్థావర, జంగమాత్మక విశ్వమునకు ప్రభువువు. స్వర్గమును చూపగలవాడవు. పాలు చేపిన ఆవు వలె నిన్ను మాటిమాటికి పిలుచుచున్నాము.

**7.** ఇంద్రా! మేము కర్తలము. అయినను అన్నములను ఇమ్మని నిన్ను పిలుచుచున్నాము. మేము మానవులము. శత్రుసేనల అశ్వములను చూచి నిన్ను పిలుచుచున్నాము. మాకు తగిన శక్తి నిమ్ము. మమ్ము కాపాడుము.

**8.** ఇంద్రా! ద్యులోకములు వందలు అగుగాక. భూలోకములు వందలు అగునుగాక. అయినను నీకు సరిరావు. నీవు ద్యావాపృధ్వులకు అల్లుడవు. అయినను నిన్ను వారు అనుకరించజాలరు. సూర్యులు సహస్ర సంఖ్యాకులైనను వజ్రివగు నీకు సరికాలేరు.

**9.** హర్యశ్వములు గల ఇంద్రా! ఋత్విజుల బాహువులచే అభిషవము చేయబడినదియు కల్మషరహితమును నీ కొరకు రాళ్లచే అభిషుతమగు సోమమును సేవించుము. ఆనందించుము.

**10.** జలములు ధనము కలవి. మమ్ము కలసి మురిసి పోవునవి. ఎన్నో అన్నములు కలవి. అవి మాస్వామియగు ఇంద్రుని యందు చేరును గాత. ఆ జలములు, మాస్తుతులు ధ్వనులందు మేము ఆనందింతుము గాత.

**11.** **"ఉదగ్నే శుచయస్తవశుక్రాః"** ఇత్యాది పురోనువాక్యకు ఇదిప్రతీక. ప్రథమకాండపు ప్రపాఠకమున వివరించబడినది. **"విజ్యోతిషాబృహతా భాత్యగ్నిః"** ఇత్యాది యాజ్యకిది ప్రతీక. మొదటికాండపు రెండవ ప్రపాఠకమున వివరించబడినది.

**12.** **'ఉదుత్యం జాతవేదం'** ఇత్యాది పురోనువాక్యకు ఇది ప్రతీక. 1వ కాండము 4వ ప్రపాఠకమున వ్యాఖ్యాతము.

**13.** సూర్యదేవా! నీవు గొప్పగా పలుకువాడవు. నీవు కిరణ కేశివి. నిన్ను సప్తాశ్వరధము వహించుచున్నది.

**14.** ఆ మండలము మిత్ర, వరుణ, అగ్నుల ఉపలక్షితము. సకల ప్రాణిజాలమునకు నేత్రప్రాయము. నానా వర్ణములది. అది కిరణ సేనా యుక్తమై ఉదయించుచున్నది. ఆ మండల స్థితుడగు సూర్యుడు సకల స్థావరజంగములకు ఆత్మ అయినవాడు. అతడు ద్యావాపృధివ్యంతరిక్షములందు వ్యాపించినాడు.

**15.** విశ్వేదేవతలు సత్యమును వర్ధిల్లచేయువారు. ఋతువులను అనుసరించి చేయు కర్మలకు ఆహ్వానించబడువారు. వారు క్షీరసారమగు హవిస్సును సేవింతురు గాక.

**16.** విశ్వేదేవతలారా! మీరు మా ఆహ్వానములను వినండి. మీరు అంతరిక్షమున ఉన్నారు. పృధివియందు ఉన్నారు. ద్యులోకమున ఉన్నారు. అగ్ని జిహ్వలై ఉన్నారు. యాగ ఉద్దేశ భూతులయి ఉన్నారు. మీరందరు ఈ యజ్ఞమున ఆసీనులు కండి. ఆనందించండి.

శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత
రెండవ కాండము నందలి నాలుగవ ప్రపాఠకము సమాప్తము.

అగ్నేనయ సుపథారాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్ ।
యుయో ధ్యస్మజ్జుహు రాణమేనో భూయిష్ఠాతే నమ ఉక్తిం విధేమ ।

# అయిదవ ప్రపాఠకము

## మొదటి అనువాకము

(4 - 12 నందలి త్వష్ట కథకు ఇది పూర్వభాగము )

**1.** త్వష్ట పుత్రుడు విశ్వరూపుడు. అతడు దేవతలకు పురోహితుడు అయినాడు. అతడు అసురులకు మేనల్లుడు. విశ్వరూపునకు మూడు తలలు కలవు. అతడు ఒక దానితో సోమపానము చేసినాడు. రెండవ దానితో సురాపానము చేసినాడు. మూడవ దానితో అన్నము తినువాడు

విశ్వరూపుడు ప్రత్యక్షముగా దేవతలకు హవిస్సు అర్పించమని చెప్పినాడు. పరోక్షముగా అసురులకు హవిర్భాగము అందించమని చెప్పినాడు. అందరి ముందు ఒకమాట చాటుగా ఒకమాట చెప్పువాని విషయము నమ్మకము కలుగకుండును.

విశ్వరూపుడు అట్లు చెప్పుటవలన ఇంద్రునకు అనుమానము కలిగినది. అతడు స్వామి ద్రోహము చేయుచున్నాడనియు, దేశమును అన్యులకు వప్పగించగలడనుకున్నాడు. ఇంద్రుడు తనవజ్రాయుధముతో విశ్వరూపుని మూడుతలలు నరికినాడు.

అట్లు నరుకబడిన తలలో సోమము త్రావినది కముజు పిట్ట కల్లుత్రాగినది పిచ్చుక - అన్నము తినునది తీతువు అయినవి.

**2.** ఇంద్రుడు విశ్వరూపుని హత్య చేసినాడు. ఆ బ్రహ్మహత్యాపాతకమును తన దోసిట పట్టి సంవత్సరకాలము భరించినాడు. సకల ప్రాణులు ఆ ఇంద్రుని బ్రహ్మహన్త అని ఆక్రోశించినవి.

**3.** ఇంద్రుడు భూమి వద్దకు పోయినాడు. తన బ్రహ్మహత్యా పాపపు మూడవభాగము తీసికొనవలసినదని కోరినాడు.

ఇంద్రుడా! జనులు నన్ను స్వేచ్ఛగా త్రవ్వుచున్నారు. అందువలన నేను బాధలు పడుచున్నాను. కావున అట్లు జనులు త్రవ్విన గుంతలు సంవత్సరము లోపల నిండవలెను. అందువలన నా బాధలు తగ్గును అని భూమి అన్నది.

సంవత్సరమున కన్న పూర్వపువి అయినను జనులు త్రవ్విన గుంతలు నిండునట్లు వరము ఇచ్చుచున్నాను అన్నాడు ఇంద్రుడు. ఆ వరము పొందిన భూమి ఇంద్రుని పాపమునుండి మూడవ భాగమును తీసికొన్నది.

ఆ విధముగా ఇంద్రుని నుండి భూమి గ్రహించిన బ్రహ్మహత్య పాతకపు మూడవభాగము భూమి మీద ఊషరక్షేత్రమైనది. కావున శ్రద్ధగల ఆహితాగ్ని పరుడు తనంతటతాను ఊషరక్షేత్రమున నివసించరాదు. అది బ్రహ్మహత్యారూపము అగును కదా!

**4.** ఇంద్రుడు వృక్షముల వద్దకు పోయినాడు. తన బ్రహ్మహత్యాపాపము యొక్క మూడవభాగము తీసికొనవలసినదని కోరినాడు.

ఇంద్రుడా! మమ్ములను కొట్టిన చోట మాకు బాధకలుగుచున్నది. మాకు అట్టి బాధకలుగకుండునట్లు వరము ప్రసాదించుము అని చెట్లు కోరినవి.

ఇంద్రుడు ఆ వరము ఇచ్చినాడు. చెట్టును కొట్టిన చోట మరిన్ని మొలకలు మొలుచును అని చెప్పినాడు. చెట్లకు వరము లభించినందున-అవి ఇంద్రుని బ్రహ్మహత్యా పాతకము నందలి మూడవ భాగమును తీసికొన్నవి. ఆ బ్రహ్మహత్యా పాతకము చెట్లనుండి వెడలి ఘనీభూతమగు రసము అయినది.

అందువలన చెట్టు నుండి రసముగా ప్రవహించి ఘనీభవించిన భాగమును భుజించరాదని నిషేధము. అది బ్రహ్మహత్యారూపము అగును కదా!

కాని అట్లు ఛిన్నప్రదేశము నుండి వెలువడి ఘనీభవించిన లోహిత వర్ణ పదార్థము మాత్రమే తినరానిది. ఇతర విధముగు నిర్యాసము నిషేధము కాదు.

**5.** ఇంద్రుడు స్త్రీల వద్దకు వెళ్లినాడు. తన బ్రహ్మహత్యా పాపము యొక్క మూడవ భాగము తీసికొనవలెనని కోరినాడు.

ఇంద్రుడా! మేము ఋతుసంబంధమగు వీర్యము వలన సంతానమును పొందుచున్నాము. మాకోరికననుసరించి ప్రసవము వరకు పురుషుని కలుసుకొనునట్లు వరము ఇమ్ము అని అడిగినారు.

ఇంద్రుడు ఆ వరము ఇచ్చినాడు. అందువలననే స్త్రీలకు ఋతు సంబంధ వీర్యము వలన సంతానము కలుగుచున్నది. వారు ప్రసవ పర్యంతము పురుషునితో సంగమించుచున్నారు. అప్పుడు స్త్రీలు బ్రహ్మహత్య యొక్క మూడవ భాగమును తీసుకొన్నారు.

బ్రహ్మహత్య యొక్క మూడవభాగము స్త్రీల రజస్వల అయినది. అందువలన రజస్వల అయిన స్త్రీతో మాట్లాడరాదు. ఆమెతో సహ కూర్చుండరాదు. ఆమెతో అన్నము తినరాదు. స్త్రీ యొక్క రజస్వల బ్రహ్మహత్యకదా!

కొందరు దీనికి పక్షాంతరము చెప్పుదురు. స్త్రీలకు స్నానము అన్నము వంటిది. కావున స్నానము చేయరాదనియు, మిగిలినవి వారి ఇష్టమని నిర్ణయించినారు.

**6.** రజస్వలయైన స్త్రీ సంభోగము వలన ఆమెకు మిథ్యాపవాదు కలవాడు పుట్టును.

రజస్వలయై అరణ్యము నందు సంభోగించిన దానికి దొంగ పుట్టును.

రజస్వలయై సిగ్గుచే మాట్లాడు దానికి సంభోగము వలన సిగ్గుపడు వాడు పుట్టును.

రజస్వలయై స్నానము చేయు దానికి సంభోగము వలన మరణశీలుడు పుట్టును.

రజస్వలయై తైలాభ్యంజనము చేయుదానికి సంభోగము వలన కుష్ఠురోగి పుట్టును.

రజస్వలయై బొమ్మలు గీయు దానికి సంభోగము వలన కేశశూన్యుడు, అపమరణ యుక్తుడు జన్మించును.

రజస్వలయై కంటికి కాటుక పెట్టుకొను దానికి సంభోగము వలన గ్రుడ్డివాడు పుట్టును

రజస్వలయై పండ్లుతోము కొను దానికి సంభోగము వలన మలినదంతుడు పుట్టును.

రజస్వలయై గోళ్లను కత్తిరించుకొను దానికి సంభోగము వలన పిప్పిగోళ్ల వాడు పుట్టును.

రజస్వలయై గడ్డి కోయుచున్న దానికి సంభోగము వలన నపుంసకుడు పుట్టును.

రజస్వలయై త్రాడు పేనుచున్న దానికి సంభోగము వలన ఉరిపెట్టుకొని చచ్చువాడు పుట్టును.

రజస్వలయై ఆకుతో నీరు త్రాగు దానికి సంభోగము వలన పిచ్చివాడు పుట్టును.

రజస్వలయై కాలిన మట్టి మూకుడులో నీరుత్రాగు దానికి సంభోగము వలన పొట్టివాడు పుట్టును.

రజస్వలయై సంతాన రక్షణకోరు స్త్రీ మూడు రాత్రులు వ్రతమును ఆచరించవలెను. దోసిలితో గాని, పచ్చిమట్టి మూకుడుతో గాని నీరు త్రాగవలెను.

**ఆలోచనామృతము**

**1.** మానవుడు స్వేచ్ఛాజీవి. స్వార్థపరుడు. నిరంకుశుడు. తమ తమ స్థాయిలలో ఇది అందరకు వర్తించునది.

మానవుడు సంఘజీవి. అతని బ్రతుకునకు ఎంతమంది సాయమో కావలెను. నీరు త్రాగుటకు మాత్రమునకు 1. నీటి వనరు ఏర్పరచువాడు 2. నీరుతెచ్చువాడు. 3. పాత్ర చేయువాడు 4. నీరు అందించువాడు కావలసి ఉన్నారు.

మానవులందరు కొంత స్వేచ్ఛవదులు కొని నిబంధనలకు లొంగి ఉండునట్లు చేసిననే మానవుడు జీవించగలడు. ఈనాటి మనిషి - తనకు తెలియకనే - కొన్ని నిబంధనలకు కట్టుబడి ఉన్నాడు.

మానవుని ఈ దశకు తెచ్చుటకు ఎన్ని యుగములు, ఎన్ని పరిశోధనలు, ఎందరు మహానుభావుల త్యాగములు అవసరమైనవో! ఇందుకు వేదము ఎంతగానో తోడ్పడినది అనుట నిర్వివాదాంశము.

ఎంతటి పరిశ్రమ వలననో మానవ సంబంధములు, కుటుంబము స్థిరపడినవి. ఈ యాంత్రిక నాగరకత మానవ సంబంధములను కకావికలు చేసి మనిషిని మొదటికి తెచ్చుచున్నది. ఈ విషయము ఎల్లరు గ్రహించుచున్నారు. అయినను అందరు నిస్సహాయులైనారు.

2. ఈ కథ ఎంత సొగసుగా చెప్పినాడు! మానవుని బలహీనతలను ఎంత సూక్ష్మముగా పరిశీలించినాడు! చెప్పవలసినది చాలా ఉన్నది. స్థలము సమయము నియంత్రించుచున్నవి.

మానవ సమూహములు మంచి కొరకు ఏర్పడినవి. సామూహిక జీవనము, పరస్పర అవగాహనకు అవి ఏర్పడినవి. మానవులు, దేవతలు, రాక్షసులు ఇట్టి తెగలు.

విశ్వరూపుడు త్వష్టయను దేవత పుత్రుడు. అతడు అసురులకు మేనల్లుడు అయినాడు. అతడు ఉభయుల పక్షము వహించ వలసి వచ్చినది. అదియే ప్రమాదమునకు దారి తీసినది.

మన పూర్వులు ఆంతరసామూహిక సంబంధములనే కాని బాహిరసామూహిక సంబంధములను నిషేధించుట ఎంతో ఆలోచించి చేసిన నిర్ణయము. అనాలోచితముగా దానిని మనము విడిచినాము. అనుభవించుచున్నాము.

ఏది చేసినను నేరుగా చేయవలెను. చాటుగా చేయరాదు. విశ్వరూపుడు చాటుగా చేసినాడు. ఇంద్రుని వలన శిక్ష అనుభవించినాడు.

శిక్షించిన ఇంద్రుడు శిక్ష ఎందుకు అనుభవించినట్లు? ఇంద్రుడు తన సమూహపు రక్షణకు విశ్వరూపుని వధించినాడు. ఇది విశ్వశ్రేయస్సు కాదు. అందువలన సంవత్సరము శిక్ష అనుభవించినాడు. అపఖ్యాతి పాలైనాడు.

ఇంద్రుడు తన తెగను రక్షించుటకు శిక్ష విధించినది నిజము. కాని అతడు వంచనను శిక్షించినాడు. ఇది విశ్వశ్రేయకము. అందువలననే భూమి, వృక్షము, మాతృమూర్తి అతనికి సహకరించినారు!

వరములు ఎంతబాగున్నవి! భూమిలో ఏర్పడిన గుంతలను పూడ్చవలెను. నేడు సహితము గనులు త్రవ్వినపుడు పూడ్చవలెనను శాసనము ఉన్నది. అది చేయనందుకే భూకంపము.

కొట్టిన చెట్టునకు కోకొల్లలుగ పిలకలు మొలవకున్న ప్రాకృతిక సంపద నిలువజాలదు నేటి సైంటిస్టు చెట్లన్నింటిని కొట్టి చెట్టు విలువ తెలుసుకున్నాడు. కాని సమాజము సైంటిస్టు అధీనమున లేదు. స్వప్రయోజన పరులు చెట్లను ఎదగనీయుట లేదు.

**3.** స్త్రీ మాతృస్వరూపిణీ. ఆమెకు సంబంధించిన ప్రధాన విషయములు ఇచట చెప్పబడినవి.

ఆధునిక పరిశోధన వెర్రితలలు వేయుచున్నది. పాలపొడి పెత్తందార్ల కింద నలిగిన పరిశోధన దశాబ్దముల తరువాత తల్లిపాలు మంచివని తేల్చినది. కుక్క, పిల్లి, పంది వంటి జంతువులకు సహజముగా తెలిసిన దానికి పరిశోధనలు! "మాతృస్తనావివశిశోరమృతాయమానౌ" శ్రీ వేంకటేశ్వరుని పాదద్వయము శిశువులకు స్తన్యము వలె అమృతాయమానమగును.

సంభోగ సమయమున స్త్రీ యొక్క మానసిక పరిస్థితి మీద సంతానము భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందువలన స్త్రీ జాతి సంతోషముగా ఉండవలెననియే **"యత్ర నార్యస్తు పూజ్యంతే"** అను ఆర్యోక్తి. ఇందుకు సంబంధించి ఒక భారత వృత్తాంతము ఉన్నది.

భరతవంశము అంతరించుచున్నది. సత్యవతి వ్యాసుని తలచినది. అతను వచ్చినాడు. ఆమె వ్యాసుని తన కోడండ్లకు సంతానము కలిగించమన్నది. అతడు అంగీకరించినాడు. ఆమె వ్యాసుని అంబిక వద్దకు పంపినది. వ్యాసుని చూచి అంబిక భయమున కనులు మూసుకున్నది. ఆమెకు గ్రుడ్డి ధృతరాష్ట్రుడు పుట్టినాడు. అంబ వ్యాసుని కూడినపుడు భయమున పాలిపోయినది. పాండు రాజు పాండు రోగముతో పుట్టినాడు.

సంతానమునకు స్త్రీల మనసు ఎంతో ముఖ్యమని గమనించవలెను.

## రెండవ అనువాకము

**1.** ఈ లోకములను ఆక్రమించినందున వృత్రునకు ఆ పేరు కలిగినది.

**2.** ఇంద్రుడు ప్రజాపతి వద్దకు వెళ్లినాడు. నాకు శత్రువు పుట్టినాడు అని విన్నవించినాడు. ప్రజాపతి మంత్రజలమున వజ్రమును తడిపినాడు. ఈ వజ్రము చేత శత్రువును వధించుము అని ఇంద్రుని చేతికి ఇచ్చినాడు. ఇంద్రుడు ఆ వజ్రమును అందుకొని బయలు దేరినాడు.

**3.** వజ్రముతో ఉన్న ఇంద్రుని చూచి "ఇంద్రా! మేము వృత్రుని ముఖమునందున్నాము. వృత్రుని వధించకుము" అన్నారు అగ్ని సోములు.

"మీరు నాకు సంబంధించిన వారు. నావద్దకురండి" అని ఇంద్రుడు అన్నాడు.

"అట్లయిన మాకు హవిర్భాగములను ఏర్పరుచుము" అని అగ్ని సోములు ఇంద్రుని అడిగినారు.

పూర్ణమాసి యాగమందు అగ్ని సోములకు కూడా దశకపాల పురోడాశమును ఇంద్రుడు ఏర్పరచినాడు.

4. 'ఇంద్రా! మేము వృత్రుని నోటిలో ఉన్నాము. అతని దంతముల క్రింద నలుగుచున్నాము రాలేకున్నాము' అన్నారు అగ్ని సోములు.

అది విన్న ఇంద్రుడు చలిజ్వరమును, తరువాత కలుగు తాపమును పుట్టించినాడు. ఇది శీతజ్వర, తాపముల జన్మవృత్తాంతము. ఈ విషయములు తెలిసిన వానికి శీతజ్వర తాపములు ఉండవు.

ఇంద్రుడు ఈ శీతజ్వర తాపములను వృత్రుని మీద ప్రయోగించినాడు. శీతజ్వర బాధలో ఉన్న వృత్రుని ముఖము నుండి అగ్ని సోములు బయటపడ్డారు.

5. అప్పుడు వృత్రుని ప్రాణ, అపానములు విడిచినవి. ప్రాణము దక్షశబ్దవాచ్యము. అపానము క్రతుశబ్ద వాచ్యము. కావున యజమాని క్రతువునందు 'నాకు దక్షక్రతువులు కలుగును గాత' అను మంత్రమును ఉచ్చరించవలెను. అందువలన యజమానికి ప్రాణ, అపానములు, దీర్ఘఆయువు కలుగును.

6. ఇంద్రుడు ఆ విధముగా అగ్ని సోములను వృత్రుని నోటినుండి విడిపించినాడు. పూర్ణిమనాడు వృత్రహనన హేతువగు ఆజ్యభాగ హవిస్సును ఆర్జించినాడు. ఈ వృత్రాంధకారమును పూర్ణిమ ధ్వంసము చేయుచున్నది. అమావాస్యనాడు అంధకారము తిరిగి ఆవరించుచున్నది. అందువలన పూర్ణిమనాడు వృత్ర హనన సంబంధమగు "**అగ్నిర్వృత్రాణి......**" అను ఋక్కును - అమావాస్యనాడు "**కవిర్విప్రేణ........**" అను ఋక్కును పఠించవలెను.

7. ఇంద్రుడు వృత్రహనన హేతువగు ఆజ్యరూపమును సంపూర్ణము చేసినాడు. వజ్రమును అందుకున్నాడు. వృత్రుని మీదకుసాగినాడు.

"వృత్రుడు పృథివి నుండి దివి వరకు వ్యాపించియున్నాడు. అతనిని వధించవలదు" అని ద్యావాపృథ్వులు అన్నవి. అందుకు ఇంద్రుడు సుముఖుడుగా లేడని గ్రహించి వరములు అడిగినవి. నేను నక్షత్రములతో కూడుకొని ఉండవలెనని దివి కోరినది. నేను మనుష్య, పశు, వృక్ష, నగ, నదీ, సముద్రాది విచిత్ర అలంకారము కలదానిని కావలెనని భువి కోరినది. ఇంద్రుడు వారికి ఆ వరములను ఇచ్చినాడు. అందువలననే దివి నక్షత్రాలంకృతమును, భువి చిత్ర, విచిత్ర అలంకృతయు అయినవి.

ద్యావాపృథ్వులకు ఇంద్రుడు వరములు ఇచ్చిన విషయము తెలిసికొన్న వానికి వరములు లభించును.

ద్యావాపృథ్వుల అనుగ్రహముననే ఇంద్రుడు వృత్రుని సంహరించినాడు.

**8.** వృత్రుని వధించిన ఇంద్రుని చుట్టు దేవతలు కూడినారు. వారు తమకొరకు హవిస్సు వహించవలసినదని అగ్ని సోములను అర్థించినారు.

"మేము చిరకాలము వృత్రుని దంతముల క్రింద నలిగినాము. మాతేజస్సును కోల్పోయినాము. ఆ తేజస్సు వృత్రుని వద్దనే ఉన్నది" అన్నారు అగ్నిసోములు.

వృత్రుని నుండి ఆ తేజస్సు తేగల సమర్థులెవరు? అని దేవతలు తమలో తాము చర్చించుకున్నారు. గోవు అందరకు మిత్రము. అదియే వృత్రుని లోనికి చొచ్చి తేజస్సుకొని రాగలదని నిశ్చయించినారు. వారు గోవును అర్థించినారు.

"నేను వృత్రుని నుండి అగ్నిసోముల తేజస్సు తెచ్చెదను. కాని ఆ తేజస్సు నాయందే నిలువవలెను. ఆ ఉభయ తేజస్సులు నాయందలి ఆహారములందు చేరవలెను" అను వరమును గోవు కోరినది.

దేవతలు ఆ వరమును ఇచ్చినారు. గోవు వృత్రుని నుండి తేజస్సు తెచ్చినది. ఆ వరము వల్లనే గోవు నందలి పాడి పదార్థములు ఆహారపదార్థములు అయినవి.

ఆజ్యము అగ్నియొక్క తేజస్సు. పాలు సోముని యొక్క తేజస్సు. అగ్ని సోముల తేజస్సును ఈ విధమని తెలిసికున్నవాడు తేజస్వంతుడు అగును.

**9.** పౌర్ణమాస కర్మకు దేవత ఎవరు? అని విద్వాంసులు చర్చించినారు. అది ప్రజాపతి దేవతాకమని నిర్ణయించినారు.

ఇంద్రుడు ప్రజాపతికి జ్యేష్ఠపుత్రుడు. ప్రజాపతి ఈ కర్మచేతనే తన పుత్రుడగు ఇంద్రునకు స్థిరనివాసము కల్పించినాడు. అందువలననే లోకము నందలి తండ్రులందరు తమ జ్యేష్ఠ పుత్రునకు ఆజీవన పర్యంతమునకు ధనము చేకూర్చుచున్నారు.

**నాలుగవ అనువాకము**

**1.** ఇంద్రుడు వృత్రుని సంహరించినాడు. వృత్ర సంబంధులు కోపించినారు. ఇంద్రుని ముట్టడించినారు. ఇంద్రుడు భయపడినాడు. గడగడలాడినాడు.

ఇంద్రుడు అప్పుడు వైమృధకర్మను గుర్తించినాడు. పూర్ణిమనాడు ప్రధానకర్మ తదుపరి వైమృధ పురోడాశమును నిర్వాపము చేసినాడు. ఆ పురోడాశము చేతనే ఇంద్రుడు శత్రువులను దూరము చేసినాడు.

**2.** అది పూర్ణిమ కావలెను. ప్రధాన కర్మ పూర్తి కావలెను. అప్పుడు వైమృధమును నిర్వాపము చేయవలెను. అందువలన యజమాని శత్రువును దూరము చేయును.

**3.** ఇంద్రుడు వృత్రుని వధించినాడు. భయపడినాడు. పారిపోయినాడు. అందువలన తనతోటి దేవతలను, తన సామర్థ్యమును దూరము చేసికొన్నాడు.

అప్పుడు ఇంద్రుడు అగ్ని దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును - ఇంద్ర దేవతాకమగు దధిని నిర్వాపము చేసినాడు. అందువలన ఇంద్రుడు తనదేవతలను, తన సామర్థ్యమును తిరిగి పొందినాడు.

**4.** అమావాస్యనాడు అగ్ని దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును, ఇంద్రసంబంధమగు దధిని నిర్వాపము చేయవలెను. అందువలన దేవతల అనుగ్రహము, సామర్థ్యము కలుగును.

**5.** ఇంద్రుడు వృత్రుని వధించినాడు. అప్పుడు అతని సామర్థ్యము భూమి మీద వివిధ ఓషధుల, లతల రూపము దాల్చినది.

ఇంద్రుడు ప్రజాపతికి తన సామర్థ్యము ఓషధులు గను, లతలుగను రూపుదాల్చుటను గురించి చెప్పినాడు. ప్రజాపతి ఆ సామర్థ్యమును తెచ్చి ఇంద్రునకు ఇవ్వవలసినదని పశువులను ఆజ్ఞాపించినాడు.

పశువులు ఓషధుల, లతల సామర్థ్యమును తనలో చేర్చుకున్నవి. దానికి 'సాంనాయ్య' మని పేరు. దానిని గోవుల నుండి ఇంద్రుని కొరకు పితుకుట వలన అది 'ప్రతిధుక్' అయినది.

**6.** "ప్రజాపతీ! నీ ఆజ్ఞవలన పశువులు వృక్షలతాదుల నుండి సామర్థ్యమును ధరించినవి. క్షీరరూపమున నాకు అందించినవి. నాకు ఆ సామర్థ్య రూపక్షీరము జీర్ణముకాలేదు" అని ఇంద్రుడు అన్నాడు.

సామర్థ్యరూపక్షీరమును ఇంద్రునియందు పక్వము చేయుడని ప్రజాపతి పశువులను ఆజ్ఞాపించినాడు. అందు ననుసరించి పశువులు ఇంద్రుని యందు క్షీరములు పక్వము చేసినవి. ఆ ఇంద్రియ సామర్థ్యరూప క్షీరమే ఇంద్రునియందు నిలిచి ఉన్నది.

**7.** పశువులు ఇంద్రియ సామర్థ్యము తెచ్చినవి. పితికినవి. పక్వము చేసినవి. అయినను తనకు తృప్తి కలుగలేదని ఇంద్రుడు ప్రజాపతితో చెప్పినాడు. పిండిన పాలను పెరుగు చేయమని ప్రజాపతి చెప్పినాడు. వారు పాలను దధిగా మార్చినారు. పెరుగువలన ఇంద్రునకు తృప్తి కలిగినది. సంతృప్తి నిచ్చినందువ దానికి 'దధి' అను సార్థక నామము కలిగినది.

**8.** పెరుగు క్రితపు రాత్రి కూర్చబడును. కావున పాలకన్న ముందు పెరుగును జుహువులోనికి అవదానము చేయవలెనని పెద్దలు చెప్పుచున్నారు.

**9.** తొలుత పెరుగును అవదానము చేయుటమాని ముందు పిండిన పాలనే అవదానము చేయవలెను. అందువలన యజమానికి ఇంద్రియ సామర్థ్యరూప క్షీరములను ఇచ్చినట్లగును తదుపరి దధినిచ్చినందున సంతోషము కలిగించినట్లగుమ. అందువలన 'ముందు పాలు' తదుపరి పెరుగు అను ఉత్పత్తి క్రమమును పాటించినట్లగును.

**10.** పూతీకాదులను తీవలచే తోడుపెట్టిన పెరుగు సోమాదులకు ప్రియమగును. పాలలో పెరుగు తోడు పెట్టినది ఇంద్రునకు ప్రియము. కావున ఇంద్రుని కొరకు పాలలో తోడుపెట్టి పెరుగు చేయవలెను.

**11.** యజ్ఞము అవిచ్ఛిన్నముగ సాగుటకు అగ్ని హోత్రయాగమునందు మిగిలిన 'యవాగు' తో పాలలో తోడు పెట్టవలెను.

**12.** ఇంద్రుడు వృత్రుని వధించినాడు. అసురులకు అపరాధము చేసినాను అనుకున్నాడు. భయపడి చాల దూరము వెళ్లిపోయినాడు. ఇంద్రుని వెదకి మొదలు తెచ్చినవారికి ప్రథమ హవిర్భాగము నిత్తునని ప్రజాపతి ప్రకటించినాడు. పితృదేవతలు ఇంద్రుని వెదకి మొదట తెచ్చినారు. అందువలన యజ్ఞమునకు పూర్వ దినమున పితృదేవతలకు పిండపితృయజ్ఞము చేయబడుచున్నది.

**13.** పితృదేవతలు వెదకి తెచ్చిన ఇంద్రుడు అమావాస్య నాడు మరలి వచ్చినాడు. దేవతలు ఇంద్రునకు ఎదురేగినారు. మనకు శ్రేష్ఠమగు ధనము లభించినది అనుకున్నారు. ఇంద్రుడే కదా దేవతలకు ధనము! అందువలన అమా అనగా ఇంద్రుడనెడి శ్రేష్ఠధనము వసతి ఉంటున్నది అను అమావాస్యార్థము అయినది.

**14.** సాంనాయ్యమను హవిస్సునకు దేవత ఎవరు అని శాస్త్రజ్ఞులు చర్చించినారు. విశ్వేదేవతలు ఆ భాగధేయమును అభిలషించి వచ్చిరి కదా! అందువలన అది విశ్వేదేవతాకమని పెద్దలు చెప్పినారు.

మరొకపక్షము ఏమనగా:

ఇంద్రునకు గల భయము పోగొట్టి అతనిని సమాధాన పరచి తీసికొని వచ్చుటకే దేవతలందరు అతనికి ఎదురేగినారు. కాని సాంనాయ్య హవిస్సునందలి కోరికతో కాదు. కావున ఈ హవిస్సు ఇంద్ర దేవతాకమనియే చెప్పవచ్చును.

**నాలుగవ అనువాకము**

**1.** దర్శపూర్ణమాస యాగములను ఇంద్రసహితముగ చేసిన వాస్తవముగా దర్శపూర్ణమాస యాగము చేసినవాడు అగును అని బ్రహ్మవాదులు చెప్పుచున్నారు. పూర్ణిమనాడు ప్రధానకర్మ తరువాత విమృద్దేవతాక ఏకాదశ కపాలపురోడాశమును నిర్వాపము చేయవలెను. ఆ విధముగా నిర్వాపము చేసినందున పూర్ణమాస యాగము ఇంద్రసహితము అగును. అమావాస్య నాడు ఇంద్రదేవతాకమగు దధిని నిర్వాపము చేయవలెను. అందువలన దర్శపూర్ణయాగము ఇంద్రసహితము అగును. ఆ విధముగా చేసిన యజమానికి ఉత్తరోత్తర ధనాధిక్యత కలుగును.

**2.** దేవతలు అనుష్ఠించిన యజ్ఞములనే అసురులు కూడ అనుష్ఠించినారు. అందువలన దేవాసురులు సమానముగా ఉన్నారు. అందుకని దేవతలు పూర్ణమాస యాగమునందు మరొక ఇష్టిని చేర్చినారు. అందువారు అగ్ని, విష్ణు దేవతాకమగు ఏకాదశ కపాల పురోడాశమును, సరస్వతీ, సరస్వద్దేవతలకు చరు హవిస్సును నిర్వాపము చేసినారు. ఇందువలన దేవతలు విజయులు అయినారు. అసురులు పరాజితులు అయినారు.

**3.** శత్రువులున్న వాడు పూర్ణమాస యాగమును అనుసరించి అగ్ని వైష్ణవ ఇష్టిని ఆచరించవలెను. అనగా ప్రధానకర్మ తరువాత అగ్నావైష్ణవ హవి నిర్వాపము చేయవలెను. పూర్ణమాస యాగము వలన శత్రువు మీద వజ్రప్రహారము జరుగును. అగ్నావైష్ణవము వలన శత్రువు యొక్క దేవతలు, వారి యజ్ఞము, సరస్వతీ, సరస్వద్దేవతలకు సంబంధించిన పశుమిధునములు నశించును. శత్రువు యొక్క ధనము సొంతము నశించును.

**4.** శత్రువులు కలవాడు పూర్ణమాస యాగమునే చేయవలెను. అమావాస్యనాడు దర్శయాగము చేయరాదు. అందువలన శత్రువును సంహరించినట్లును - దర్శయాగ పరిత్యాగము చేత శత్రువు ఆప్యాయమును పరిత్యజించినవాడగును.

**5.** పశువులు కోరువాడు 'సాకంప్రస్థాయి' యాగము చేయవలెను.

రాజునకు స్వల్పద్రవ్యము ఇచ్చుటవలన అతడు తృప్తి చెందడు. ఇతరులకు ఇవ్వజాలడు. రాజునకు అధిక ద్రవ్యము పన్నుగా చెల్లించిన రాజు తృప్తిచెందును. ఇతరులకు ఇవ్వజాలును.

అట్లగుట వలన ఇంద్రునకు అధికక్షీరద్రవ్య యుక్తమగు హవిస్సును హోమము చేయవలెను. అందువలన ఇంద్రుడు తృప్తి చెందును. యజమానికి సంతృప్తి కరమగు సంతానమును, పశువులను ప్రసాదించును.

**6.** చెక్క పాత్రతో హోమము చేయవలెను. మట్టి పాత్ర ఆహుతులను అందుకొనదు.

**7.** దారుపాత్ర మేడి కర్రది కావలెను. మేడి బలస్వరూపము. పశువులు బలస్వరూపములు. కావున ఔదుంబర పాత్రవలన యజమానికి బలము గల పశువులు లభించును.

**8.** సంపద లేనివాడు మహేంద్ర యాగము చేయరాదు.

వేదత్రయము తెలిసినవాడు, గ్రామాధ్యక్షుడు, రాజు ఈ ముగ్గురే సంపద కలవారు.

తన దేవతను విడిచి ఇతర దేవతకు యాగము చేయువాడు తనదేవత అనుగ్రహమును కోల్పోవును. అన్యదేవతల అనుగ్రహము పొందజాలడు. అతడు సంపద లేనివాడు అగును.

**9.** సంవత్సర కాలము ఇంద్రుని యాగము చేయవలెను. అంతకు మించి చేయరాదు. అందువలన తనదేవతయే యజమానికి యాగములకు అవసరమగు సంపదను చూపును. అతడు మిక్కిలి ధనవంతుడు అగును.

**10.** సంవత్సర కాలపు యజ్ఞము పూర్తి అయినంత వ్రతపతి యగు అగ్ని కొరకు అష్టాకపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. అందువలన యజమాని సంవత్సర ఇంద్ర అనుష్ఠానము వలన వృత్రుని సంహరించినట్లగును. అందువలన యజమానికి మహేంద్ర యాగానుష్ఠాన అర్హత కలుగును.

**11.** వ్రతపతి ఇష్టి చేసిన తరువాత యజమాని ఇంద్ర, మహేంద్ర యాగములలో దేనినైన చేసికొనవచ్చును.

### అయిదవ అనువాకము

**1.** దర్శయాగము చేసిన యజ్వ సోమయాగము చేయక ముందు సాం నాయ్యము చేయరాదు. సోమయాగము చేయక ముందు అతని పయస్సు సరిపోదు. సోమ యాగము చేయకముందు సాంనాయ్యము చేసినవాడు దొంగతనము చేసిన వాడు - అన్యాయము చేసినవాడు అగును కావున అతడు నశించును.

అందువలన సోమయాజియే సాంనాయ్యము చేయవలెను. పయస్సే సోమము. పయస్సు సాంనాయ్యము అగును. కావున సోమయాజి పయోరూప సోమము చేతనే పయస్సును తనయందు ధరించును.

**2.** దర్శయాగము చేయువాడు అమావాస్యనాడే ప్రాతరగ్ని హోత్రాదికమును నిర్వర్తించవలెను. కృష్ణచతుర్దశినాడు అమావాస్యయను భ్రాంతిచే నిర్వర్తించరాదు. ఒకవేళ ఆ విధముగా చేసి రాత్రి తూర్పున చంద్రుడు కనిపించినచో - చంద్రుడు అమావాస్య కానినాడు యాగము నిర్వర్తించిన వానిని పశుశూన్యుని చేయును.

ఒకవేళ ఈ స్థితి కలిగినచో తన అభ్యుదయము కోరిన యజమాని తండులములను తీసికొనవలెను. వానిని స్థవిర, మధ్యమ, అణిష్ఠములు అని మూడుగా విభజించవలెను. వానిలో మధ్యమములను అష్టాకపాల పురోడాశముగ చేసి ప్రదాతయగు అగ్ని కొరకు నిర్వాపము చేయవలెను స్థవిర తండులములతో చరును చేసి ప్రదాతయగు ఇంద్రునకు నిర్వాపము చేయవలెను. అణిష్ఠ తండువులతో చరువును పక్వము చేసి - కిరణములచే వ్యాపించి ఉన్న విష్ణువునకు నిర్వాపము చేయవలెను.

అప్పుడు యజమానికి అగ్ని సంతానము నిచ్చును. ఇంద్రుడు సంతానమును వృద్ధి చెందించును విష్ణువు పశుసమృద్ధి కలిగించును.

**3.** దర్శపూర్ణమాస యాగములు రెండేసి పర్యాయములు చేయరాదు. చేసిన యెడల పూర్వయాగము చక్కగా అనుష్ఠించబడిన రెండవ యాగము వ్యర్థమగును. ఉత్తరయాగము బాగుగా అనుష్ఠింపబడినచో మొదటి యాగము వ్యర్థమగును. ఇష్టి అధికావృతము కావలెనను నియమము లేదు. కావున దీనిని ఇష్టి అనుటకు వీలులేదు. అగ్ని ష్టోమాదికముల వలె దీనిని యాగము అనుటకు వీలులేదు.

రెండేసి పర్యాయములు చేసిన వానికి లజ్జాముఖుడు, ధైర్యహీనుడగు పుత్రుడు కలుగును కావున దర్శపూర్ణ యాగము ఒక పర్యాయమే చేయవలెను. ఆ విధముగా చేసిన వానికి ధీరుడగు పుత్రుడు కలుగును.

**4.** పూర్వము చెప్పిన పద్ధతిని ఆదరించనక్కరలేదు. యజమాని రెండు పర్యాయములు చేయవచ్చును. పూర్వము అనుష్ఠించిన దానివలన యజ్ఞమును, ఉత్తరమున చేసిన దానివలన ప్రకృతి యాగ సంపూర్తిని చేసిన వాడగును. పూర్వేష్టి వలన దేవతలను, ఉత్తరేష్టి వలన ఇంద్రియ సామర్థ్యమును పొందుచున్నాడు. పూర్వేష్టివలన మానవ లోకమును - ఉత్తరేష్టి వలన దేవలోకమును జయించును. రెండు ఇష్టులను ఆచరించుట వలన యజమాని బహు యజ్ఞఫలమును పొందును పెరుగుచున్న చంద్రుడు సౌమనస్యతకు ప్రతీక. అందువలన పూర్వఇష్టి 'సుమనస్' అగుచున్నది ఉత్తరేష్టియందు చంద్రుడు అభివృద్ధి చెందును. కావున యజమానికి ఈ లోకమునందే ధనసమృద్ధి కలుగుచున్నది.

5. స్వర్గము కోరువాడు దాక్షాయణ యజ్ఞము చేయవలెను.

6. పూర్ణమాస యాగము నందు సాంనాయ్యమును నిర్వాపము చేయవలెను. అమావాస్యయందు మిత్రావరుణ దేవతాక అమిక్షయాగము చేయవలెను.

7. పూర్ణమాస యాగమున దేవతలకు సోమము అభిషుత మగుచున్నది. పూర్ణమి నుండి అమావాస్య వరకు సోమము నిత్యము అభిషుతమగుచున్నది.

8. ఉత్తర దర్శేష్టి యందు అనుష్ఠితమైన అమిక్ష దేవతలకు వశము, అనుబంధితము అగుచున్నది. అది ఎట్లన: -

యజమాని శుక్లపాద్యమి నాడు వేదిని ఏర్పరచును. ఆనాడే వత్సాపాకారణ హవిర్ధాన మంటపము నిర్మించును. ద్వితీయనాడు ప్రాతః కాలమున ఆగ్నేయము, పురోడాశము, దేవతలు కోరునట్టి సుత్యను సంపాదించును.

అందువలన ఆ యజమాని ఈ పక్షము రోజులు దేవతలతో కూడి సంతోషముగా సోమము సేవించిన వాడగును.

అమావాస్యనాడు మిత్రావరుణ దేవతాకమగు అమిక్షాయాగము చేయును. ఆ అమిక్షయే దేవతలకు వశమైనదియు, అనుబంధమైనదియు అగును. ఆ అమిక్షయే యజమానికి వశమగును.

9. ఈ యజ్ఞమును చేసిన వానికి దేవతల సాక్షాత్కారము లభించును. గొప్పపదవులు అధిష్ఠించును. కోరుకున్నవి కోరుకున్నట్లుగా జరుగును.

10. యజమాని చేసిన యజ్ఞములందు లోపము జరిగిన అతడు ఇతర యజమానుల కన్న తక్కువ వాడగును. లోపము లేనిచో ఇతర యజమానులతో సమానుడు అగును. ఇతరుల కన్న అధికుడు కాదలచినవాడు ఈ దాక్షాయణ యజ్ఞమును చేయవలెను. ఈ యజ్ఞము కరవాలము వలె పదునైనది. అది ఈ యజమానిని అందరిని మించిన వానిచేయును. చేయనివాడు తక్కువ వాడగును.

11. దాక్షాయణ యజ్ఞకర్త అబద్ధమాడరాదు. మాంసము తినరాదు. స్త్రీ సంగమము చేయరాదు బట్టలు ఉతుకు సాధనముల చేత ఉతుకరాదు. ఇది దాక్షాయణ కర్త వ్రతము.

దేవతలు అబద్ధమాడుట మున్నగునవి చేయరు కదా! (దీక్షలో ఉన్నప్పుడు అతడు దేవత అగునని అర్థము.)

## ఆరవ అనువాకము

**1.** దర్శపూర్ణ యాగము దేవతల రథము వంటిది. దర్శపూర్ణయాగము చేసి, సోమయాగము చేసిన వానికి దేవతల రథముల నడకలచే స్పష్టమై, నిశ్చయముగా కనిపించు మార్గము కలుగును.

**2.** సంవత్సరమునకు దర్శపూర్ణమాసములు అవయవముల వంటివి. ఈ విషయమును తెలిసికొని దర్శపూర్ణ మాసయాగములు చేయువాడు సంవత్సరపు అన్ని అవయవములను అనుష్ఠించిన వాడగును.

**3.** దర్శపూర్ణయాగములు సంవత్సరములకు నేత్రముల వంటివి. అది తెలిసికొని దర్శపూర్ణ యాగము చేసిన వాడు దర్శపూర్ణ యాగమనెడి నేత్రములచే స్వర్గమును దర్శించును.

**4.** దర్శపూర్ణ యాగములు దేవతల పరాక్రమ స్వరూపములు. అది తెలిసి కొని దర్శపూర్ణ యాగము చేసినవాని యందు దేవతల పరాక్రమము చేరుచున్నది.

**5.** దర్శపూర్ణ యాగములు దేవమార్గములు. ఈ విషయము తెలిసి దర్శపూర్ణయాగము చేసిన యజమాని దేవమార్గమున పయనించగలడు.

**6.** దర్శపూర్ణ యాగములు దేవతల అశ్వముల వంటివి. ఈ విషయము తెలిసి దర్శపూర్ణ యాగము చేసినవాడు అశ్వముల చేతనే దేవతల కొరకు హవ్యము వహించును.

**7.** దర్శపూర్ణ యాగములు దేవతలకు నోళ్లవంటివి. ఈ విషయము తెలిసి దర్శపూర్ణ యాగము చేసినవాడు వ్యవధానము లేకుండనే దేవతల నోళ్లయందు హోమము చేసిన వాడగును.

**8.** ఉదయ, సాయంత్రములందు అగ్నిని గూర్చి హోమము చేసిన దర్శపూర్ణయాజి సోమయాజి అగును. అగ్ని హోత్ర - దర్శపూర్ణముల వలన దేవతలకు సోమాభిషవము జరుగును. తాను సోమయాజిని అగుచున్నానని జ్ఞానము కలిగి అగ్నిహోత్ర యుక్త దర్శపూర్ణయాగము చేసిన యజమాని అన్ని యాగము లందును ఇవ్వదగిన వాడు అగుచున్నాడు.

**9.** దేవతలు పూర్వము దర్శమాసము చేయవలసిన తిథిని తెలసికొనలేకపోయినారు. తరువాత పరిశోధించి పూర్ణిమ, అమావాస్యలందు యాగము చేయవలెనని నిర్ణయించినారు. ఈ విషయము తెలిసికొని, దర్శపూర్ణ మాసయాగములు చేసినవాడు శోధితములు, యజ్ఞార్హములగు పూర్ణిమ, అమావాస్యలందు ప్రవేశించి యజ్ఞము చేసినవాడు అగును.

**10.** దర్శపూర్ణమాసయాజి పూర్ణిమ, అమావాస్యలందు స్త్రీసంగమము చేయరాదు. చేసినచో అతడు ఇంద్రియ రహితుడు అగును.

**11.** చంద్రుడు రాజు. అతనికి ఉభయ - శుక్ల, కృష్ణ - పక్షముల రాత్రులు భార్యలు అయినవి. చంద్రుడు అమావాస్య, పూర్ణిమ రాత్రులను కూడలేదు. ఆ రాత్రులే చంద్రుని తమతో సంభోగము జరుపుటకు నిర్బంధించినవి. ఆ నిర్బంధ సమాగమము వలన చంద్రునకు క్షయవ్యాధి కలిగినది. చంద్రుడు రాజు. అతనికి యక్ష్మకలిగినది. అందువలన అది రాజయక్ష్మ అయినది. చంద్రుడు ఒక శపథము చేసినాడు. దానిని ఉల్లంఘించినాడు. ఆ పాపము వలన అతనికి యక్ష్మవచ్చినది కావున అది పాపయక్ష్మ అయినది. చంద్రునకు అది జాయవలన కలిగినది. అందువలన అది జాయేక్ష్మ అయినది.

ఈ వ్యాధులు, అవి కలిగిన విధము తెలిసికొనవలెను. ఆ విధముగా తెలిసికొనిన వానికి ఈ వ్యాధులు కలుగవు.

ఆ విధముగా యక్ష్మ వ్యాధి గల చంద్రుడు అమావాస్య పూర్ణిమ రాత్రులు వద్దకు వెళ్లినాడు. వాటికి నమస్కరించినాడు.

"మేము ఉభయులమే దేవతల హవిస్సులు వహింతుము. మమ్ము ఆశ్రయించియే దేవతల యాగములు జరుగవలెను. మాకు ఈ వరము ప్రసాదించుము" అని ఆ రాత్రులు కోరినవి.

అందువలననే అమావాస్య పూర్ణిమలందు మాత్రమే దేవతలను ఉద్దేశించిన యాగములు జరుగుచున్నవి. అమావాస్య, పూర్ణిమలే కదా దేవతలకు హవిస్సులు అందించునవి!

ఈ విషయములు తెలిసిన వారందరు దేవతలకు హవిస్సులు అర్పించినవారు అగుచున్నారు.

**12.** మనుష్యాది ప్రాణి జాలములన్నియు ఆకలిని తీర్చుకొనుచున్నవి.

మానవులు నిత్యము ఆహారము భుజించుచున్నారు. ఆకలిని చంపుచున్నారు.

దేవతలు పక్షమునకు ఒకసారి భుజించుచున్నారు. దర్శపూర్ణమాస యాగములందలి హవిస్సులే కదా దేవతలకు ఆహారము! ఆ విధముగా వారు ఆకలిని చంపుచున్నారు.

పితృదేవతలు మాసమునకు ఒకసారి భుజించుచున్నారు. నెలకొకసారి చేయు పిండపితృ యజ్ఞమే కదా వారికి ఆధారము. ఆ విధముగా వారు ఆకలిని చంపుచున్నారు.

మామిడి, పనస మున్నగు చెట్లు సంవత్సరమునకు ఒకసారి ఫలించి భుజించుచున్నవి. ఆ విధముగా అవి ఆకలిని చంపుచున్నవి.

**య ఏవం వేద హన్తి క్షుధం భాతృవ్యమ్** - ఇది తెలిసినవాడు ఆకలి అను శత్రువును చంపినవాడు అగుచున్నాడు.

## ఏడవ అనువాకము

**1.** పూర్వము దేవతలు ఋక్కులకు సంతోషించలేదు. యజుస్సులకు సంతోషించలేదు. సామమునందే వారికి సంతోషము కలిగినది. అందువలన హోత మూడుమార్లు 'హిం' శబ్దమును ఉచ్చరించవలెను. అందువలన సామమును పఠించిన వాడగును.

మొదటి 'హిం' శబ్దమున సామగానము చేసినట్లు అగును.

రెండవ 'హిం' శబ్ద ఉచ్చారణ వలన దేవతలను సంతోషపెట్టును.

మూడవ 'హిం' శబ్ద ఉచ్చారణము సోమాశ్రయమైన ఋగ్రూప వాక్కునకు సంబంధించినది అగును.

మూడవ హుంకారమున యజమానికి సంతానము కలుగుచున్నది.

**2.** మొదటి సామిధేనీ ఋక్కును మూడు మారులు ఉచ్చరించవలెను. చివరి సామిధేనీ ఋక్కును మూడు మారులు ఉచ్చరించవలెను. అందువలన యజ్ఞమును జారిపోకుండునట్లు బంధించిన వాడు అగును.

**3.** నిరంతరము సామిధేనీ ఋక్కు ఉచ్చారణ వలన ప్రాణరక్షణ, భోజ్యవస్తు ప్రాప్తి, సంతాన ఫలము కలుగును. ఇంకను రాక్షస వినాశము అగును.

**4.** మొదట రథంతరి ఋక్కును మూడుమారులు చదవవలెను. ఈ లోకము రథంతరము అగును. కావున యజమాని ఈ లోకమంతటిని జయించును.

**5.** మూడవ సామిధేనీ ఋక్కును మూడు మారులు జపించవలెను. ఈ లోకములు మూడు. అందువలన యజమాని మూడు లోకములను జయించును.

**6.** బార్హతి పేరిటిది ఉత్తమ ఋక్కు. దానిని ఉచ్చరించవలెను. ద్యులోకమునకు బార్హతమని పేరు. అందువలన యజమాని స్వర్గలోకమునే జయించినట్లగును.

**7.** విశేషదేవనామము గల '**ప్రవోవాజా ఇతి**' అను ప్రజాపతి దేవతాకమగు సామిధేని ఋక్కును అనుసంధానము చేయవలెను. యజ్ఞము ప్రజాపతి రూపము. అందువలన ప్రజాపతి యజ్ఞమును ప్రారంభించిన వాడగును.

**8.** **అన్నం వై వాజః** - అన్నమే వాజ శబ్దమగును. "**ప్రవోవాజాః**" ఋక్కును ఉచ్చరించుట వలన యజమాని అన్నవంతుడు అగును.

**9.** '**ప్రవోవాజాః**' ఇత్యాది ఋక్కులను పఠించవలెను. అందువలన ప్రముఖరేతో వర్తియగు యోషిచ్ఛరీరమునకు పోవునట్టి రేతస్సు గర్భాశయమునందు స్థాపించబడును.

**10.** '**అగ్న ఆయాహి వీతయే**' అనునది ప్రథమ సామిధేని ఋక్కు. చరమ పాదముతో కూడ ఆ యాహివీతయే పఠించవలెను. అందు "**ఆయాహి**" అను పదము ఉండుటవలన ప్రత్యఙ్ముఖ సదృశులగు ప్రజలు జన్మింతురు.

**11.** దేవతలారా! యజమానులు యజ్ఞములు చేయుచున్నారు. మాసములు, పక్షములు, హవిష్మంతులగు దేవతలు, ఘృతమును అందించు గోవులు అనుకూలురు అగుదురు గాక. ఈ యజ్ఞము దేవతలను చేరును గాక. యజమానికి సుఖములు కలుగును గాత.

'**ప్రవోవాజాః**' అను ఋక్కును ఉచ్చరించవలెను. మాసములు వాజశబ్దవాచ్యములు. పక్షములు అభిద్యవ శబ్దవాచ్యములు. హవిష్మంతులు దేవతలు. గోవు ఘృతాచీ శబ్ద వాచ్యము. యజ్ఞము దేవతలను చేరవలెను. యజమాని సుఖించవలెను.

**12.** సామధేని ఋక్కులచే ప్రజ్వరిల్లుచున్న అగ్నీ! నీవు మాసముల, పక్షముల, దేవతల స్వరూపము అగుచున్నావు. అదియే "**ప్రవోవాజాః**" యొక్క తాత్పర్యము. అందువలన యజమాని ప్రజ్వరిల్లుచున్న అగ్నియొక్క ఆహుతి స్థానమును సాధించినవాడు అగును.

**13.** ఒకడు పరిపూర్ణాయువు కోరును. అందుకు "**ప్రవోవాజాః**" అను ప్రథమ సామిధేనీ ఋక్కును పఠించవలెను. వెంటనే - విరామము లేకుండ '**అగ్న ఆయాహి వీతయే**' అను ఋక్కు యొక్క ప్రథమ భాగమును ఉచ్చరించవలెను. అవిచ్ఛిన్న పఠనము వలన యజమాని ప్రాణవాయువుతో అపాన వాయువును ధరింపచేసిన వాడు అగును.

**14.** సామధేని ఋక్కుల అరత్నిని తెలిసికొన్న వాడు శత్రువును తనచేత ఉంచుకొనును.

ఋక్కుల రెండు భాగములను సంధానము చేయవలెను. దీనినే సామిధేని ఋక్కుల అరత్ని అందురు. ఈ విషయము తెలిసిన వాని చేతనే శత్రువు ఉండును.

**15.** సామిధేని ఋక్కులు ఋషి ప్రోక్తములు. ఆ సామధేనీ ఋక్కులను సంధించకున్నచో యజమానికి ప్రజా, పశునష్టము కలుగును.

కావున ఋక్కుల అర్ధభాగములను సంధానము చేయవలెను. అట్లు సంయోజనము చేసిన యజమానికి సమస్త ఆశీస్సులు లభించుచున్నవి.

## ఎనిమిదవ అనువాకము

**1.** సామము లేని యజ్ఞము యజ్ఞము కానేరదు. 'అగ్న ఆయాహి వీతయే' అను రెండవ సామిధేనీ ఋక్కు రథంతర సామమునకు వర్ణము.

"తంత్వా సమిద్భిరఙ్గిరః" అను మూడవ సామిధేనీ ఋక్కు వామదేవ్య సామమునకు వర్ణము.

'బృహదగ్నే సువీర్యమ్' అను నాలుగవ సామిధేనీ ఋక్కు బృహత్సామమునకు వర్ణము.

ఈ మంత్ర సముదాయమును పఠించవలెను. అందువలన యజ్ఞము సామవంతము అగును.

**2.** పూర్వము అగ్ని ద్యులోకము నందు ఉండెను. సూర్యుడు భూలోకమున ఉండెను. అందువలన ఉభయ లోకములందు శాంతి కొరవడినది. దేవతలు ఈ స్థితిని చూచినారు. వారిలోవారు ఆలోచించినారు. అగ్ని, ఆదిత్యులను ఒకరి స్థానమున మరొకరిని ఉంచవలెనని నిశ్చయించినారు.

అగ్ని ఆయాహివీతయే అను సామిధేనీ ఋక్కును ఉచ్చరించినారు. అందువలన అగ్నిని ద్యులోకము నుండి రప్పించి భూలోకమున స్థాపించినారు.

బృహదగ్నే సువీర్యమ్, బృహదగ్నే సూవీర్యమ్ అను సామిధేనీ ఋక్కును ఉచ్చరించినారు. అందువలన సూర్యుని భూలోకము నుండి ఎత్తి ద్యులోకమున స్థాపించినారు.

ఆ మార్పు వలన ఉభయ లోకములకు శాంతి కలిగినది.

ఆ విధముగా పఠించుట వలన రెండు లోకములకు శాంతి కలుగును. ఈ విషయము గ్రహించిన యజమానికి ఉభయలోకములు శాంతిని ప్రసాదించును.

**3.** సామిధేని ఋక్కులు పదిహేను. వానిని పఠించవలెను. పక్షమునకు రాత్రులు పదిహేను. సామిధేనీ ఋక్కులు ఆ సంఖ్యకు సరిపోవుచున్నవి. పక్షముల లెక్కననే సంవత్సరము అగుచున్నది.

**4.** సామిధేనీ ఋక్కులు పదిహేను. వీనిది గాయత్రీ ఛందస్సు. గాయత్రికి ఇరువది నాలుగు అక్షరములు. అందువల్ల $15 \times 24 = 360$ అగుచున్నది. ఇది సంవత్సరము నందలి దినముల సంఖ్య అగుచున్నది.

**5.** నృమేధుడు, పురుచ్ఛేపుడు అను ఋషులు మంత్ర సామర్థ్యమును గురించి వాదించుకున్నారు. తమలో ఎవరు సామిధేనీ మంత్రమున అత్యంత కుశలుడో నిశ్చయించదలచినారు. సామిధేనీ మంత్రమును జపించుచు తడి కట్టెయందు నిప్పు పుట్టించువాడు అత్యంత కుశలుడు అనుకున్నారు.

నృమేధుడు తడిసిన కట్టె మీద సామిధేని మంత్రమును ప్రయోగించినాడు. ఆ కట్టె నుండి పొగపుట్టినది. కాని అగ్ని పుట్టలేదు.

పురుచ్ఛేపుడు తడికట్టె మీద సామిధేని మంత్రమును ప్రయోగించినాడు. అందువల్ల తడి కట్టె నుండి అగ్ని పుట్టినది.

"పురుచ్ఛేదా! నీవు అతీంద్రియ ద్రష్టవైనావు. మన ఉభయుల సామిధేనీ మంత్రము సమానమే కదా! నేను పుట్టించలేని అగ్నిని నీవెట్లు పుట్టించినావు?" అని అడిగినాడు

"నృమేధా! నేను సామిధేని మంత్రపు రహస్య తేజస్సును తెలిసికున్నాను. ప్లుతశబ్దోపేతమైన మంత్రపాదము ఆ తేజస్సు అగును. ఆ పాదము '**తంత్వాసమిద్భిరఙ్గిరః**' అను మంత్రము నందు ఉన్నది.

"**సామధేనీష్వేవ తజ్జ్యోతి ర్జనయతి** - ఆ మంత్రము సామధేనులకు జ్యోతిని కలిగించుచున్నది" అన్నాడు.

**6.** ఋక్ఛబ్దము స్త్రీలింగము. గాయత్రి స్త్రీలింగము. సామిధేనీ శబ్దము స్త్రీలింగము. కావున 'వృషన్' శబ్దమును పఠించవలెను. ఆ పాదము వలన పురుషవంతములు, ఇంద్రియవంతములు, మిథునములు ఏర్పడును.

**7.** దేవతలు తమకు దూతగా అగ్నిని ఏర్పరచినారు. రాక్షసులు శుక్రుని పుత్రుడగు ఉశనసుని తమకు దూతనుగా నియమించినారు. అగ్ని, ఉశనసులు ప్రజాపతి వద్దకు వెళ్లినారు. 'మా ఉభయులలో ఎవరి దూతము సరియైనది' అని అడిగినారు. ప్రజాపతి '**అగ్నిం దూతం వృణీమహే**' - అగ్నిని దూతగా వరించుచున్నాను అన్నాడు. ఉశనసుని నుండి మరలినాడు. అగ్నికి అభిముఖుడు అయినాడు. అందువలన దేవతలు గెలిచినారు. రాక్షసులు ఓడినారు.

ఈ విషయము తెలిసికొని '**అగ్నిం దూతం వృణీమహే**' ఇత్యాది మంత్రములు చదివిన యజమాని విజయవంతుడగును. అతని శత్రువునకు పరాజయము కలుగును.

**8.** అధ్వర శబ్దోపేతమైన '**సమిధ్యమానే అధ్వరే**' ఇత్యాదికమగు ఋక్కును పఠించవలెను. అందువలన యజమానికి గల శత్రువు నశించును.

**9.** '**శోచిష్కేశస్తమీమహే**' అను మూడవ పాదమును చదువలెను. అందువలన యజమాని పవిత్రుడు అగును.

(శోచిష్కేశ - శుచిమంతములగు కిరణములను కేశములు కలవాడని అర్థము. అందువలన అది పావనము చేయును.)

**10.** '**సమిద్ధో అగ్ని ఆహుత**' దశమసామిధేని అగును. ఈ మంత్రము చదువుట వలన నాశము అంటకుండుటకు పరిధి ఏర్పరచినట్లగును. ఆ మంత్రము చదివిన తరువాత '**ఆజుహోత దువస్యత**' అని మంత్రము చదువుచు సమిధను వేయవలెను. అందువలన పరిధికి అవతల హవిస్సు ఉంచినట్లు అగును.

**11.** అగ్నులు ముగ్గురు. ఒక అగ్ని దేవతలకు హవిస్సు చేరవేయువాడు. రెండవ అగ్ని పితరులకు కవ్యము చేరవేయువాడు. మూడవ అగ్ని అసురులకు సహరక్షస్సు. ఈ ముగ్గురు అగ్నులును యజ్వ తననంటే తననే కోరుకొనును అనుకుందురు. కావున దేవతలారా! హవ్యవాహనుని వరించుడు అనిపదకొండవ సామిధేని మంత్రము వచించినది. దేవతలకు ఎవడు అగ్ని అగుచున్నాడో యజ్వ ఆ అగ్నినే వరించవలెను.

**12.** యజమాని తన ఋషిగోత్ర సంతతిని చెప్పుకొనవలెను. అందువలన అతడు బంధువులకు దూరము కాడు.

(ప్రవర చెప్పునపుడు ఆయాగోత్రముల ఋషులను చెప్పుట విధి.)

**13.** యజమాని అపత్య పరంపరగా అర్వాచీనులను వరించవలెను. అందువలన పూర్వపితరులు, అర్వాచీన మనుష్యులను చెప్పినట్లగును.

(అపత్య పరంపర అనగా తొలినుండి తండ్రి కొడుకులను పేర్కొనుట - భృగుపుత్రుడు చ్యవనుడు. చ్యవన పుత్రుడు అప్నవానుడు ఇత్యాదులు.)

### తొమ్మిదవ అనువాకము

1. "**అగ్నే మహాఁ అసి బ్రాహ్మణ భారత । అసావసౌ ॥**" అనునది మంత్రము.

అగ్ని సర్వహవిస్సులు ధరించువాడు. అందువలన అగ్ని మహానుడు.

అగ్ని బ్రాహ్మణుడు.

దేవతలకు హవిస్సు వహించుట వలన భారతుడు.

**అసౌ అసౌ**, భృగ్వాది మహర్షుల నామ నిర్దేశమును సూచించు చున్నది.

2. దేవతలు ఈ అగ్నిని ప్రజ్వలింపచేసినారు. కావున ఈ అగ్ని 'దేవేద్ధుడు' అయినాడు.

3. తరువాత అగ్నిని మనువు ప్రజ్వలింప చేసినాడు. అందువలన ఈ అగ్ని 'మన్విద్ధః' అయినాడు

4. ఋషులు స్తుతించినందున అగ్ని "ఋషిష్టుతుడు" అయినాడు.

వేదాధ్యయన సంపన్నులు విప్రులు. విప్రులచే సంతోషపరచబడిన వాడు అయినందున అగ్ని 'విప్రానుమదితుడు' అయినాడు.

వేదాధ్యయన సంపన్నులు కవులు. కవులచే ప్రశంసించ బడుటచే అగ్ని 'కవిశస్తుడు' అయినాడు.

మంత్రములచే తీక్ష్ణముగా చేయబడినవాడు అగుటవలన 'బ్రహ్మసంశితుడు' అయినాడు.

అగ్నికి ఘృతాహుతి ఇష్టమైనందున అగ్ని ఘృతావహనుడు అయినాడు.

5. అగ్ని యజ్ఞములకు నేత. అందువలన "ప్రణీర్య జ్ఞానామ్" అయినాడు.

అగ్ని యజ్ఞములకు రథము. కావున 'రథీరధ్వరానామ్' అయినాడు.

ఏ దేవతయు అగ్నిని అతిక్రమించుట లేదు. **"అతూర్తః హోతా"** అయినాడు.

అగ్ని సర్వదేవతల హవిస్సును అందుకొనును. కావున **'తూర్ణిః హవ్యవాట్'** అయినాడు.

6. అగ్ని దేవతలకు ఘృతము అందించు జుహువు వంటివాడు. కావున అగ్నిని **'ఆస్పాత్రం జుహుః దేవానామ్'** - లోహపాత్ర వంటి దృఢమైన జుహువు అన్నారు.

అగ్ని దేవతలు పానము చేయుటకు ఉపయోగపడు చమసము వంటివాడు. అందువలన 'చమసోదేవపానః' అనబడుచున్నాడు.

అగ్ని దేవతల యందు అంతటను వ్యాపించి ఉండువాడు. అగ్నీ రథనేమి వలె నీవు దేవతల యందంతటను వ్యాపించి ఉన్నావు అని చెప్పబడినది.

దేవతలను అభిలషించువాడు. హే అగ్నీ! అనుటవలన అతనికి శత్రువులు కలుగుచున్నారు. అందువలన యజమాని కొరకు దేవతలను **ఆహవ** అని మంత్రము చెప్పినది.

**'ఆహవదేవాన్య జమానాయ'** అనుట వలన యజమానికి అభ్యుదయము కలుగును.

7. **అగ్నిమగ్న ఆవహ** - అగ్నీ అగ్నిని ఆవహింపుము. **సోమమావహ** - సోమమును ఆవహింపుము. అనుటవలన దేవతలను క్రమముగా ఆజ్యభాగములకు ఆహ్వానించినట్లగును.

8. జాతవేద అగ్నీ! దేవతలను ఆవహింపుము. యజ్ఞమును చక్కగా నిర్వహింపుము. అట్లని ఆవాహన మంత్రము పఠించినందున అగ్ని తీక్షత కలవాడు అగును. ఆ విధముగ తీక్ష్ణ కృతుడగు అగ్ని యజమాని హవిస్సులను దేవతలకు అందించును.

9. అగ్ని దేవతలకు హోత. దేవతల హోతయగు అగ్నినే మానవహోత వరించుచున్నాడు.

**10. స్మోవయమ్** - మేము అనుచున్నాము అనుట వలన మానవ హోత తనయందు దైవ్యహోత యగు అగ్నిని ప్రవేశపెట్టు కున్నవాడు అగుచున్నాడు.

**11.** యజమానీ! నీవు అగ్నిని హోతగా వరించినావు. కావున దేవతలు హవి స్వీకరించుచున్నారు. 'వారు మంచి ఫలమును ఇచ్చెదరు గాత' అనునది యజమానికి ఆశీస్సు అగుచున్నది. ఇది **'సాధుతే యజమాన దేవతా'** అను ఆవాహన మంత్రము.

**12.** 'సాధుతే' మంత్రమునకు **'యో౽అగ్నిగ్ం హోతారమవృథా'** అను శాఖాంతర పాఠమును చేర్చి చదివిన యజమానికి రెండుప్రక్కల అగ్ని అంటుకొని మరణించును.

**13.** జుహువు యజమాని దేవతగా కలది. ఉపభృత్ శత్రువు దేవతగా కలది. ఈ రెంటికి సమాన ప్రాధాన్యమిచ్చి - ద్వివచన 'స్రుచౌ' - గా చదివిన యజమానికి శత్రువులు పుట్టుదురు. 'స్రుచమ్' అని ఏకవచనముగ **'ఘృతవతీ'** మంత్రము వలె ఉచ్చరించిన యజమాని వర్ధిల్లును.

**14.** జుహువు దేవతలను కాపాడుచున్నది. అందువలన అది **'దేవాయువ'** అయినది. జుహువు రాక్షసులు చేయు విఘ్నములను నివారించుచున్నది. అందువలన దానికి **విశ్వవారామ్** అను పేరు వచ్చినది.

**15.** మానవులు స్తుతి ప్రియులు. పితరులు నమస్కార ప్రియులు. దేవతలు యజ్ఞప్రియులు. అందువల్ల యజమాని దేవతల కొరకు యజించుచున్నాడు. పితరులకు నమస్కరించుచున్నాడు. మానవులను తగు రీతిన స్తుతించుచున్నాడు. ఆ విధముగా అతడు అనుష్ఠించుచున్నాడు.

## పదవ అనువాకము

**1.** పట్టాభిషిక్తుడగు రాజునకు **"ప్రవోవాజాః" 'అగ్న ఆయాహివీతయే' 'త్వం వరుణ'** అనుమూడు సామిధేని మంత్రములు పఠించవలెను.

క్షత్రియులు కాక బ్రాహ్మణ, వైశ్య, శూద్రులు మూడు వర్ణముల వారు కదా! ఆ పఠనము వలన ఆ మూడు వర్ణముల వారు రాజునకు అనుకూలురు అగుదురు.

**2.** రాజు కొరకు పంచదశస్తోమమును అవిచ్ఛిన్నముగ చదువవలెను. రాజు పంచదశస్తోమ సంబంధి అగును. అందువలన రాజును స్వస్తోమమున చేర్చినట్లగును.

**3.** హోత రాజు కొరకు త్రిష్టుప్ ఛందస్కమగు **'త్వంవరుణ'** అను సామిధేని మంత్రముచే పరిధానము చేయవలెను. త్రిష్టుప్ఛందము ఇంద్రియ సంబంధి. రాజు ఇంద్రియ బలము కోరుచుండును. అందుకే అతడు యాగము చేయును. అతనికి త్రిష్టుప్ ఛందస్కమగు మంత్రముచేతనే ఇంద్రియ సామర్థ్యము కలుగును.

**4.** రాజు బ్రహ్మవర్చస్సు కోరినచో గాయత్రీ ఛందస్కమైన **'ఆజుహోత దువస్యతా'** అను సామిధేని మంత్రముచే పరిధానము చేయవలెను. గాయత్రి బ్రహ్మవర్చో రూపము కదా! కావున రాజునకు బ్రహ్మవర్చస్సు కలుగును.

5. వైశ్యుని కొరకు సప్తదశస్తోమమును ఉచ్చరించవలెను. వైశ్యుడు సప్తదశస్తోమ స్వరూపుడు. అందువలన వైశ్యుని అతని స్తోమము నందే చేర్చినట్లగును.

6. పశువులను కోరు వైశ్యుని కొరకు జగతీ ఛందస్కమైన 'సమిధ్యమానో అమృతస్య రాజసి' అను మంత్రమున పరిధానము చేయవలెను. పశువులు జగతీ ఛంద సంబంధులు. వైశ్యుడు పశువులను కోరి యజ్ఞము చేయుచున్నాడు. అతనికి జగతీ ఛందస్క మంత్రమే పశువులను కలిగించును.

7. గౌరవ ప్రతిష్ఠలు కోరువాని కొరకు ఏకవింశతి స్తోమములను పఠించవలెను. ఏక వింశతి సంఖ్య సోమముల యందు ప్రతిష్ఠావహమగును. దానివలన గౌరవ ప్రతిష్ఠలు కలుగును.

8. బ్రహ్మ వర్చస్సు కోరువాని కొరకు హోత ఇరువది నాలుగు స్తోమములను ఒకదానివెంట ఒకటి అవిచ్ఛిన్నముగా పఠించవలెను. ఇరువది నాలుగు అక్షరములు గల గాయత్రి బ్రహ్మవర్చోరూపమగును. కావున యజమానికి గాయత్రీ ఛందస్సు బ్రహ్మవర్చస్సు ప్రసాదించును.

9. అన్నము కోరువాని కొరకు హోత ముప్పది స్తోమములను అవిచ్ఛిన్నముగ చదువవలెను. విరాట్ ఛందస్సు ముప్పది అక్షరములు కలది. దాని అనుష్ఠానమున అన్నము లభించును. విరాట్టు అన్న స్వరూపము. విరాట్ ఛందము గల మంత్రము వలననే యజమానికి శ్రేష్ఠమగు అన్నము కలుగును.

10. ప్రతిష్ఠ కోరువాని కొరకు హోత ముప్పది రెండు స్తోమములను అవిచ్ఛిన్నముగ చదువవలెను. అనుష్టుక్ ఛందము ముప్పదిరెండు అక్షరములది. అనుష్టుక్ ఛందస్సులలో ప్రతిష్ఠావహము. దాని వలన ప్రతిష్ఠ కలుగును.

11. పశువులను కోరువాని కొరకు హోత ముప్పదియారు స్తోమములను వెంట వెంట చదువవలెను. బృహతి ముప్పది ఆరు అక్షరముల ఛందస్సు. బృహతిని అనుష్ఠించుట వలన పశువులు లభ్యమగును. బృహతి అను ప్రవచనము వలన యజమానికి పశువులు కలుగును.

12. ఇంద్రియసామర్థ్యము కోరు యజమాని కొరకు హోత నలుబదినాలుగు స్తోమములను అనుప్రవచనము చేయవలెను. త్రిష్టుప్ ఛందస్సు నలుబదినాలుగు అక్షరములు కలది. ఆ ఛందస్సు ఇంద్రియ సామర్థ్య స్వరూపము. యజమానికి త్రిష్టుప్ ఛందస్క మంత్రము ఇంద్రియ సామర్థ్యము కలిగించును.

13. పశువులు కోరువాని కొరకు హోత నలుబది యెనిమిది సామిధేనీ మంత్రములను అనుప్రవచనము చేయవలెను. జగతీ ఛందస్సు నలువది ఎనిమిది అక్షరములది. పశువులు జగతీ ఛందస్సు అనుష్ఠించుట వలన లభించును. కావున యజమానికి పశువులు కలుగును.

**14.** బహుయాజి అగువాని నిమిత్తము హోత ఛందస్సు లన్నింటిని చదువవలెను. అందువలన బహుయాజి సర్వఛందస్సులను పొందుచున్నాడు.

**15.** బహుయాజి యగు సోమయాజికి అపరిమిత ఫలము కలుగుటకు గాను సంఖ్యాపరిమితి లేకుండ ఛందస్సులను అనుప్రవచనము చేయవలెను.

**పదకొండవ అనువాకము**

**1.** యజ్ఞోపవీతము మానవ కార్యములందు వినీతము - మెడలో దండవలె - ఉండవలెను. పితృకార్యములందు ప్రాచీనావీతిగా - కుడి భుజము మీద ఉండవలెను. దేవ కార్యములకు ఉపవీతముగా - ఎడమ భుజము మీద ఉండవలెను.

**2.** యాగకర్తకు యజ్ఞోపవీతము ఉపవీతముగా ఉండవలెను. ఉపవీతము దేవచిహ్నము అగును.

**3.** సామిధేని మంత్రములను నిలుచుండి ఉచ్చరించవలెను. అందువలన చాలాదూరము వరకు వినిపించును.

**4.** కూర్చున్న వాని కన్న నిలుచున్న వానికి స్వర్గము ప్రత్యాసన్నమగును. కావున హోత నిలుచుండి సామిధేని మంత్రములు చదువవలెను.

**5.** యాజ్యను హోత కూర్చుండియే చదువవలెను. అందువలన ప్రతిష్ఠ కలుగుచున్నది.

**6.** క్రౌంచము బిగ్గరగా అరుచును. అది రాక్షసప్రియము. మెల్లగా చదివిన మానుషము అగును. ఆ రెంటికి మధ్యమ స్వరము దేవతలకు ప్రియమగును. కావున దేవతల ప్రీతి కొరకు మధ్యమ స్వరమున మంత్రములు చదువవలెను.

**7.** పూర్వము విద్వాంసులే హోతలు అయినారు. అప్పుడు మార్గములు సంకీర్ణములు కాకుండినవి. విశాలములుగా ఉండినవి. విద్వాంసులగు హోతలు కుడికాలును వేదిబయట ఎడమపాదమును వేది మధ్యన ఉంచలేదు. కావున హోతలు కుడికాలు వేదిలోనను, ఎడమకాలు వేది బయటను పెట్టి సామిధేనీ మంత్రములు చదువవలెను.

**8.** కుడికాలు వేదిలోన ఉంచుటవలన భూతకాలిక ఫలము లభించును. ఎడమకాలు వేదిబయట పెట్టుటవలన భవిష్యత్కాలిక ఫలము కలుగును. మొదటి దానివలన పరిమిత ఫలమును, రెండవ దానివలన అపరిమిత ఫలితమును పొందును. అంతేకాక గ్రామ పశువులను, అరణ్య పశువులను పొందును. ఇంకను మొదటిదాని వలన దేవలోకమును - రెండవ దానివలన మానవలోకమును జయించును.

**9.** దేవతలు సామిధేనీ మంత్రములను పఠించినారు. అయినను వారికి యజ్ఞము దర్శనమీయలేదు. అప్పుడు ప్రజాపతి మంత్రోచ్చారణ లేకయే అఘారహోమము చేసినాడు. అప్పుడు దేవతలకు యజ్ఞదర్శనమైనది.

మంత్రోచ్చారణ లేకుండ మౌనముగా అఘారహోమము చేసినట్లయిన యజ్ఞగత కార్యము నిర్వహించినట్లగును.

**10.** సామిధేని సమిధలను నేతిలో ముంచవలెను.

**11.** ఆ విధముగా సమిధను నేతిలో ముంచినవాడు కరినాత్ముడు కాకుండును.

**12.** అంతేకాక అతడు సామిధేని దేవతలను సంతృప్తులను చేసినవాడగును.

**13.** ఈ విధముగా ఎరిగిన వానికి సంతానము, పశువులు సంతృప్తి కలిగింతురు.

**14.** ఒక బుక్కుచేత అఘారము చేసిన ఒక దేవతకు ప్రీతి కలిగించినట్లగును. రెండు బుక్కుల చేత అఘారము చేసిన ఇద్దరు దేవతలకు ప్రీతికలిగించినట్లగును. మూడు బుక్కులచే అఘారము చేసిన ఎంతో చేసిన వాడు అగును. కావున మనసుచే అఘారము చేయవలెను.

మనసా హ్యనాప్త మాప్యతే - అందనిది కూడ మనసునకు అందగలదు.

**15.** అధ్వర్యుడు - వైయర్థ్యము లేకుండునట్లు దక్షిణ దిక్కునుంచి ఆజ్యస్రావమును ఆరంభించి ఉత్తర దిక్కున సమాప్తినొందించవలెను.

**16.** మాట - మనసు రెండును స్వాతిశయమును చాటినవి.

దేవతలకు హవ్యము వహించుచున్నాను అని వాక్కు పలికినది. 'దేవతలకు హవ్యము వహించుచున్నాను' అని మనసు పలికినది.

అవి తమ ఆధిక్యకతను గూర్చి ప్రజాపతిని అడిగినవి.

'మనిషి తొలుత మనసులో అనుకున్న దానిని నోటితో చెప్పుచున్నాడు. కావున వాక్కు మనసునకు దూతి అగును' అని ప్రజాపతి పలికినాడు.

'అటులైనచో ప్రజాపతీ! నీకు మాటచే హోమము జరుగకుండును గాత' అన్నది వాక్కు.

అందువలన ప్రజాపతికి మనసుతోనే హోమము జరుగుచున్నది. మన ఇవ హి ప్రజాపతిః ప్రజాపతి మనసు వంటివాడు కదా! అందువలన ప్రజాపతి ప్రాప్తి కలుగుచున్నది.

**17.** అగ్నీధుడు పరిధులను దర్భలతో సమ్మార్జనము చేయవలెను. అందువలన వాటిని పవిత్రము చేసినట్లగును.

**18.** మధ్యమ పరిధిని మూడు మారులు సమ్మార్జనము చేయవలెను. అందువలను మూడు ప్రాణములను సర్వతి జయించును.

దక్షిణార్ధపరిధిని మూడు మారులు సమ్మార్జనము చేయవలెను. అందువలన అతడు భూలోక, అంతరిక్షలోక, స్వర్గలోకములను మూడింటిని జయించును.

ఉత్తరార్ధపరిధిని మూడు మారులు సమ్మార్జనము చేయవలెను. అందువలన దేవయానములు మూడింటిని జయించును.

(స్వర్గలోక యమలోక బ్రహ్మలోక విషయాస్త్రయః పన్థానః అని సాయణాచార్యులు. "త్రయోవై దేవయానా పన్థానః" గోపథ ఉత్తర బ్రాహ్మణము.)

**19.** దర్భకట్టచేత అగ్నిని మూడు పర్యాయములు చుట్టు త్రిప్పవలెను. అందువలన దేవలోకములు మూడింటిని జయించును.

**20.** మధ్యమ, దక్షిణ, ఉత్తరపరిధులు, అగ్ని ఈ నాలుగింటికి మూడు సార్లు చుట్టు త్రిప్పుట వలన మొత్తము సంఖ్య పన్నెండు అగును. అవి పన్నెండు మాసములు. అట్లు ఒక సంవత్సరము అగుచున్నది. అందువలన సంవత్సరము యజమానికి అనుకూలము అగుచున్నది. అది స్వర్గ ప్రాప్తికి కారణము అగుచున్నది.

**21.** అధ్వర్యుడు తిర్యంచముగ ఆఘారహోమము చేయవలెను. స్వర్గము తిర్యక్కుగా ఉన్నది. అందువలన యజమానికి స్వర్గము ప్రకాశించును.

**22.** ఆఘార హోమము వంకరలేని సూటి దానిగ చేయవలెను. విచ్ఛిత్తి లేకుండ చేయవలెను. అది ప్రాణము, అన్నము. సంతతి కలుగుటకును, రాక్షస వినాశనమునకును అగుచున్నది.

**23.** ఒకని చావు కోరువాడు వంకర ఆఘారహోమము చేయవలెను. అందువలన ప్రాణవాయువు వంకర అగును. అతడు వెంటనే మరణించును.

**24.** ఆఘారము యజ్ఞమునకు మకుట ప్రాయము. ధ్రువము యజ్ఞమునకు ఆత్మ. ఆఘారమును, ధ్రువమును అంటించవలెను. అప్పుడు అధ్వర్యుడు తనయందే యజ్ఞ మకుటమును దాల్చినవాడగును.

**25.** మానుషాగ్ని దేవతలకు దూత అయినాడు. దేవలోకము నందు ఉండు 'నాక' అగ్ని అసురులకు దూత అయినాడు.

వారిద్దరు ప్రజాపతి వద్దకు వెళ్లినారు. "మాలో దూతగా ఎవరు అర్హులు?" అని అడిగినారు.

"మానుషాగ్నీ! నీవే దూతగా అర్హుడవు. యజమానికి సంబంధించిన హవిర్దానమును దేవతలకు వినపడునట్లుగా చెప్పుము. యాజ్యపారము మూలమున నీవే హోతృకృత్యము నంతను దేవతలకు చెప్పుము" అని ప్రజాపతి మానుషాగ్నిని దూతగా అంగీకరించినాడు. అందువలన దేవతలకు గొప్పదనము అసురులకు పరాభవము కలిగినది.

ఈ విషయములను తెలిసికొని యజమాని ప్రవరను వరించినచో అతనికి శ్రేష్ఠత్వము కలుగును. అతడు శత్రువులను పరాభవించును.

**26.** బ్రాహ్మణ, అబ్రాహ్మణ విషయము చర్చకు వచ్చినపుడు విజ్ఞుడగు వాడు బ్రాహ్మణుడు అధికుడని చెప్పవలెను. అందువలన తన ఆధిక్యమును చెప్పుకున్నట్లగును.

బ్రాహ్మణుని తక్కువ వానిగా చెప్పినచో తననే తక్కువ వానిగా చెప్పుకున్నట్లగును. **తస్మాద్బ్రాహ్మణో నపరోచ్యః** - కావున బ్రాహ్మణుని పరాభవించరాదు.

**పన్నెండవ అనువాకము**

**1.** అగ్ని సంబంధమైన దానికి '**ఆయుష్యేవిశ్వతో దధత్**' పురోనువాక్య, '**ఆయుర్దా అగ్నేహవిషో జుషాణః**' యాజ్య.

సోమదేవతాకమునకు '**ఆప్యాయస్వ సమేతుతే**' పురోనువాక్య. "**సంతే పయాగ్ంసి సముయన్తు వాజాః**" యాజ్య.

వరుణ దేవతాకమునకు "**అవతేహేడః**" పురోను వాక్య. '**ఉదుత్తమమ్**' యాజ్య.

సరస్వతీ దేవతాక చరుకు '**ప్రణోదేవీ**' అనువాక్య. "**ఆనోదివో బృహతః**" యాజ్య.

అగ్నివిష్ణు దేవతాకమునకు '**అగ్నా విష్ణూమహి తద్వామ్,** అనువాక్య. '**అగ్నావిష్ణూ మహిధామ్న**' యాజ్య.

వారుణ చతుష్కపాలమునకు '**ఇమంమే వరుణ**' పురోనువాక్య. '**తత్త్వాయామి**' యాజ్య.

సూర్య దేవతాకమునకు '**ఉదుత్యంజాతవేదసమ్**' అనువాక్య. '**చిత్రం దేవానామ్**' యాజ్య.

**2.** '**అపాం న పాత్'** దేవత వక్రగతి గల జలముల మీద వర్తించువాడు. అతడు మెరుపులు బట్టలుగా గలవాడు. అతడు తన ఉపవేశన స్థలమును పొందును. భారీ వర్షము అతని ప్రశస్త మహత్తును ప్రకటించును. మెరుపుల నడుమ బంగరు రంగు పులుముకున్న జలములు ఆ దేవుని చుట్టు వ్యాపించి ఉండును.

**3.** కాలువలు ఒకదానితో ఒకటి కలసి ప్రవహించును. కొన్ని జలములు పారవు. నిలిచి ఉండును. నిలిచిన, పారునట్టి జలములకు అపాంనపాత్తుడు సమానుడు. సముద్రుడు బడబాగ్ని కలవాడు. నదులు అతనిలో చేరి అతనికి ప్రీతి కలిగించును. అపాంనపాత్తుడు బడబాగ్నికి జననస్థానము. అతడు జలములను నశింపచేయనివాడు. అతనిని పరిశుద్ధ జలములు చుట్టుకొని ఉండును.

**4.** అపాంనపాత్తు నిత్యయవ్వనుడు. జలములు అతనికి అనుకూలములు. నిత్యయవ్వనలు శోధించబడునవి. అవి అతనిని చుట్టుకొని ఉండును.

అపాంనపాత్తు ప్రకాశయుతుడు. ధనవంతుడు. నేతిని కరిగించి శోభించువాడు. అతడు కర్రలు లేకుండగనే జలము అందు తేజరిల్లును.

**5.** ఇంద్రావరుణులు ఎంతగానో ప్రకాశించువారు. మమ్ము రక్షించుమని వారిని ప్రార్థించు చున్నాము. వారు మాకు రక్షణలు కలిగించి మమ్ము సుఖవంతులను చేయవలెను.

**6.** ఇంద్రావరుణులారా! మాకు ఆపదలను బాపు సుఖములను ప్రసాదించండి. అది మాకు యాగానుష్ఠానమును, పరివారక్షేమమును, ప్రజాసమృద్ధిని కలిగించును. మమ్ము దీర్ఘకాలము పీడించునట్టి పాపాత్ముని మేము పీడించగలము. మేము బాధారహితులము కాగలము.

**7.** 'ఆనో మిత్రా వరుణా' పురోనువాక్య. 'ప్రబాహవా' యాజ్య.

అగ్నిని ఉద్వాసన చేయువాడు అగ్నిని హింసించిన వాడు అగును. అతనిని వరుణుడు జలోదరమున పీడించును.

**8.** అగ్నీ! మా భక్తిశ్రద్ధలను గుర్తింపుము. వరుణునకు మాపై గల కోపమును తొలగించుము. నీవు యాగ నిష్పాదకుడవు. దేవతలకు హవ్యవాహనుడవు. ఎంతో ప్రకాశించువాడవు. సర్వద్వేషముల నుండి మమ్ము విముక్తులను చేయుము.

**9.** అగ్నీ! నీవు ఉషః కాలము దాటిన ప్రాతః కాలమున అవతరింతువు. నీ రక్షణలచే మాకు రక్షకుడవు అగుము. మాకు వరుణుని వలన కలిగిన పాపాదికముల నుండి విడిపించుము. ఆటలాడుచు సుఖప్రదమగు మా హవిస్సును స్వీకరించుము. మాకు ఆహ్వాన సులభుడవు అగుము.

**10.** యజమాని హవిస్సు అందించువాడు. అగ్ని అతని ఆహ్వానములను శ్రద్ధగా ఆలకించును గాక.

అగ్ని సూర్యుని వలె తేజరిల్లువాడు. యుద్ధములందు సర్వత్ర జయము కలిగించువాడు. దేవతలకు హితుడు. శుభప్రదుడు. అతడు మావద్దకు అతిథివలె వచ్చును గాత.

**11.** అగ్నీ! నిన్ను ఎంతో యజించున్నాము. నీ అనుగ్రహము ఎంతో పొందుచున్నాను. యాగములందు నమస్కరించ వలసిన రీతిన నమస్కరించుచున్నాను. నీవు సనాతనుడవు. తేజోవంతుడవు. యజమాని నిన్ను యజించవలెననుకొనుచున్నాడు. హవిస్సులు అర్పించ దలచుచున్నాడు. అతనికి సంతోషము కలిగించుము. అతని ఎడారియందు ఒయాసిస్సువు అగుము.

**12.** ఇవి అగ్నికి యాజ్యా, పురోనువాక్యలు: -

**"విపాజసా పృథునా శోశుచానః"** పురోనువాక్య. **"విజ్యోతిషా బృహతా"** యాజ్య.

**13.** అగ్నీ! యాగశాల విశాలము. అందు నీవు జ్వలించుచున్నావు. కర్మ ప్రారంభమైనంతనే సర్వ రాక్షస జాతులను దహించుము.

**14.** అగ్ని శుభారంభము కలవాడు. మమ్ము మంగళవీక్షణముల చూచువాడు. మా యాగములకు విచ్చేయువాడు. భక్తుల భావములు తెలిసినవాడు. మేము అతని మహిమలు ఎరుగము. అయినను అతడు మమ్ము అనుగ్రహించినాడు. అతనిని యజించ గోరువారందరి అభిప్రాయములను తెలిసికొనును. అగ్ని మా హవ్యములను గూర్చి దేవతలకు చక్కగా చెప్పును గాత.

**15.** మూడు హవిస్సుల యాజ్య పురోనువాక్యలు: -

**'అగ్ం హోముచే ప్రభరేమ'** ఇది ప్రథమ హవిస్సునకు పురోనువాక్య. **'వివేషయన్మ'** యాజ్య

**"విన ఇంద్ర మృధః"** రెండవ హవిస్సునకు పురోనువాక్య. **"ఇంద్ర క్షత్ర మభివామమ్"** యాజ్య.

**'ఇన్ద్రియాణి శతక్రతో'** మూడవ హవిస్సునకు పురోనువాక్య. **"అనుతే దాయిమహే"** యాజ్య.

**శ్రీమదాంధ్ర వచన కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత**
**రెండవ కాండము నందలి అయిదవ ప్రపాఠకము సమాప్తము.**

అగ్నేనయ సుపథారాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్ ।
యుయోధ్యస్మజ్జుహు రాణమేనో భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ ॥

## ఆరవ ప్రపాఠకము

### మొదటి అనువాకము

1. యజమాని 'సమిత్' యాగమును చేయవలెను. అందువలన అతనికి వసంతర్తువు అనుకూలము అగును.

'తనూనపాత్' యాగము చేయవలెను. అందువలన అతనికి గ్రీష్మము అనుకూలము అగును.

'ఇట్' యాగము చేయవలెను. అందువలన అతనికి వర్షరుతువు అనుకూలము అగును.

'బర్హి' యాగము చేయవలెను. అందువలన అతనికి శరత్తు అనుకూలము అగును.

'స్వాహాకార' యాగము చేయవలెను. అందువలన అతనికి హేమంతము అనుకూలము అగును. హేమంతము పశుపక్ష్యాదులను బాధించునది కదా!

2. 'సమిత్' యాగము చేయవలెను. ఉషోదేవి అనుగ్రహము పొందును.

తనూనపాత యాగము చేయవలెను. యజ్ఞపు అనుగ్రహము కలుగును.

'ఇట్' యాగము చేయవలెను. పశువులు కలుగును.

'బర్హి' యాగము చేయవలెను. సంతానము కలుగును.

3. ఉపభృత్తునుండి జుహువులోనికి సగము ఆజ్యము తీసికొనవలెను. 'బర్హి' యాగము ప్రజారూపము. ఆజ్యము తేజోరూపము. అందువలన యజమాని ప్రజలకు తేజస్సు కలిగించినవాడు అగును.

4. యజమాని 'స్వాహాకార' యాగము చేయవలెను. అతనికి 'వాక్కు' లభించును.

5. ఒకటవ మంత్రమున చెప్పిన అయిదు + రెండవ మంత్రమున చెప్పిన అయిదు = పది అగును. విరాట్ ఛందస్సు పది అక్షరములు కలది. అన్నము 'విరాట్' స్వరూపము అందువలన యజమానికి మృష్టాన్నము కలుగును.

6. సమిధో యజత్యస్మిన్నేవలోకే ప్రతి తిష్ఠతి - సమిత్ యాగము చేసిన వాడు ఈలోకమున ప్రతిష్ఠ కలవాడు అగును.

తనూన పాతం యజతి యజ్ఞఏవాన్తరిక్షే ప్రతితిష్ఠతి.
ఈడోయజతి పశుష్వేవ ప్రతితిష్ఠతి.
బర్హిర్యజతి యఏవ దేవయానాః పన్థానస్తేష్వేవ ప్రతి తిష్ఠతి.
స్వాహా కారం యజతి సువర్గ ఏవలోకే ప్రతి తిష్ఠతి.

ఇవియే దేవలోకములు. పూర్వము చెప్పినట్లు ఆ లోకములందు ప్రతిష్ఠావంతుడగును.

**7.** దేవతలు, అసురులు ఈ లోకముల కొరకు జగడము లాడినారు. దేవతలు - పైన చెప్పిన ప్రయాజయాగములు చేసినారు. ఈ లోకముల నుండి అసురలను పారద్రోలినారు. అందువలన 'ప్రయాజ' లకు పారద్రోలుట అను సార్థకనామము కలిగినది.

సమిధాది పంచప్రయాజలు అనుష్ఠించిన వాడు శత్రువులను పారద్రోలును.

(**ఋతవో హి ప్రయాజాః - ప్రాణావై ప్రయాజాః పశవోవై ప్రయాజాః** అని బ్రాహ్మణములు.)

**8.** ఉత్తరోత్తరాభివృద్ధికి అభిక్రమణ పూర్వకముగ ప్రయాజ హోమములు చేయవలెను.

(అగ్నికి అభిముఖముగా ఉండి హోమము చేసి తదుపరి పాదము ముందుకు జరిపి హోమము చేయుట అభిక్రమణ అగును.)

**9.** జంటల వంటి ప్రయాజలను తెలిసి కొన్నవాడు **ప్రజయా పశుభిః ప్రజాయతే** - పుట్టుకతోనే ప్రజలు, పశువులు కలవాడు అగును.

'**సమిత్**' యాగమును అనేక స్త్రీలను వలె యజించవలెను. '**తనూనపాత్**' యాగమును ఒకే పురుషుని వలె యజించవలెను. అవి మిధునము అగును.

'**ఇట్**' యాగమును అనేక స్త్రీలను వలె యజించవలెను. '**బర్హి**' యాగమును ఒకే పురుషుని వలె యజించవలెను. అవి మిధునము అగును.

ఈ విధమగు ప్రయాజ మిధునములను తెలిసి కొనినవాడు **ప్రజయా, పశుభిః ప్రజాయతే.**

**10.** దేవతలు, ఆజ్యభాగ దేవతలు విముఖులు అయినారు. అప్పుడు అసురులు దేవతల యజ్ఞములను ధ్వంసము చేయ తలపెట్టినారు.

దేవతలు ఆ విషయమును గ్రహించినారు. గాయత్రీ మంత్రమును వ్యూహముగా తీర్చినారు. గాయత్రి యందలి అయిదు అక్షరములను ఒక వ్యూహముగను, తరువాతి మూడు అక్షరములను ఒక వ్యూహముగను ఏర్పరచినారు. అది యజ్ఞమునకు కవచము వంటిది అయినది. రాక్షసులు దహనము చేయలేకపోయినారు.

యజమాని ప్రయాజ అనుయాజలను అనుష్ఠించును. అప్పుడు ఆ ప్రయాజ అనుయాజలకు గాయత్రి కవచముగా ఏర్పడును. అందువలన సైన్యము ముందు భాగమున పెద్దదిగా ఉండి చివర చిన్నదిగా ఉన్నట్లు అగును.

(గాయత్రి యందలి అక్షరములందలి వ్యూహములందు ఒకటి పెద్దది, ఒకటి చిన్నదిగా అయిన సాదృశ్యము.)

**11.** రాక్షసులు రాకముందు దేవతలు స్వాహా కారమను పంచమ ప్రయాజతో యజ్ఞము సమాప్తము చేయదలచినారు. అనుకున్నట్లే స్వాహాకార పంచమ ప్రయాజతో యజ్ఞమును పూర్తిచేసినారు.

స్వాహాకారమున ప్రయాజయజ్ఞము సమాప్తము చేసినందున యజ్ఞమునకు విచ్ఛిత్తి కలిగించిన వారు అగుచున్నారు. ప్రయాజలను అనుష్ఠించి యజ్ఞము నిరంతరము సాగుటకు హవిస్సులను అభిఘరించవలెను. అందువలన పురోడాశాది హవిస్సును చేసినట్లగును. మరియు యజ్ఞమునకు విఘ్నములు కలుగవు.

**12.** ప్రయాజ, అనుయాజలందు ప్రయాజలు ముందు అనుష్ఠించ తగినవి. కావున అవి తండ్రి వంటివి. అనుయాజలు తరువాత చేయదగినవి. కావున పుత్రుని వంటివి.

ప్రయాజల పిదప హవిస్సును అభిఘరించుట వలన తండ్రి పుత్రుని చేరినట్లగును.

**13.** ఒకడు - ముందుచెప్పిన ప్రయాజ వృత్తాంతమును తెలిసికున్నాడు. ఒకడు తెలిసికొనలేదు. అటువంటి ఉభయరీతుల వారు ఉన్న సభ జరిగినది. అచట ఆ తెలియని వారు తండ్రి వృత్తాంతము సాధారణము - పుత్రుని వృత్తాంతము సాధారణమే కదా! అన్నారు.

తెలిసిన వారు ఆ వృత్తాంతపు ప్రాశస్త్యమును వివరించినారు.

**14.** ప్రయాజ యాగములు జరుగుచుండగా జారి క్రింద పడిన ఆజ్యము అస్కన్నమేవ - జారినష్టపడినది కాకుండును.

**15.** గాయత్రి తదభిఘారమున గర్భము దాల్చినట్లు అగును. ఆమె యజమాని కొరకు ప్రజలను, పశువులను పుట్టించును.

**రెండవ అనువాకము**

**1.** ఆజ్యభాగ హోమములు యజ్ఞమునకు నేత్రముల వంటివి. ఆ హోమములు చేసినవాడు యజ్ఞమునకు నేత్రములు కూర్చినవాడు అగును.

**2.** ఆహవనీయాగ్నికి పూర్వార్ధమున ఆజ్యభాగ హోమములు చేయవలెను. నేత్రములు తలకు ముందు భాగమున ఉండును కదా!

**3.** ఆజ్య భాగహోమములు తిన్నగా - వంకర లేనట్లు - చేయవలెను.

**4.** యజ్ఞకర్త అగ్ని ద్వారా దేవలోకములను, సోమదేవత ద్వారా పితృలోకమును చూచును. కావున ఉత్తరార్ధము నందు అగ్నిని, దక్షిణార్ధమున సోమదేవతకు హోమము చేయవలెను. దేవ, పితృలోకములు ఆ దిశలందే ఉన్నవి కదా! అందువలన యజమానికి ఆ ఉభయలోకముల అభిజ్ఞానము కలుగుచున్నది.

**5.** అగ్ని సోములు దేవతలందు రాజులు. అగ్ని సోమదేవతల ఆజ్యభాగ హోమస్థానముల మధ్య ప్రధాన దేవతలకు హోమము చేయవలెను. రాజులచే కదా ప్రజలు పోషించబడుట!

**6.** యజమానికి దిగువ దంతములున్న గోవులు మున్నగునవి కలిగించు యజ్ఞాంగము ఏది? పైన, క్రింద దంతములున్న అశ్వాది పశువులను కలిగించు యజ్ఞభాగము ఏది? ఈ విషయము వేదవిదులు వివరించినారు: -

ఆజ్యభాగ హోమమున ఋక్కును చదివి జుషాణ ఇత్యాది యజుస్సుల చేత యాగము చేయవలెను. అందువలన క్రింది దంతములు కల జంతువులు కలుగును.

ప్రధాన హవిస్సు యొక్క ఋక్కును చదివి యాజ్యారూప ఋక్కుచేత యజించవలెను. అందువలన క్రిందను, మీదను దంతములుండు అశ్వాదులు కలుగును.

**7.** 'అగ్నిర్మూర్ధా దివః కకుత్' ఇత్యాది ఋక్కు 'మూర్ధన్' అను శబ్దము కలిగి ఉన్నది. ఇది పురోనువాక్య. అధ్వర్యుడు ఈ ఋక్కు చదివి హోమము చేయవలెను. అందువలన యజమాని సాటివారిలో శీర్షము వంటివాడు అగును.

"భువో యజ్ఞస్య రజస్య నేతా యత్రా నియుద్భిః సచసే శివాభిః" ఇత్యాది ఋక్కు 'నియుత్' అను శబ్దము కలిగి ఉన్నది. ఆ ఋక్కుచే హోమము చేసినచో శత్రువును పశువుల నుండి దూరము చేసినవాడు అగును.

**8.** సత్య కామ పుత్రుడు కేశి. అతడు దర్భపుత్రుడగు కేశితో అన్నాడు: -

దర్భకుమారా! రేపు నీవు యజ్ఞము చేయనున్నావు. అందు నీవు సప్తపద శక్వరీ ఛందస్సును ఉపయోగింతువు. శక్వరి వలన యజమాని పుట్టిఉన్న తన శత్రువును తిరస్కరించును. అది పుట్టనున్న శత్రువును కూడ నిరోధించును.

శక్వరి శక్తి వలన యజమాని ఉభయలోకము లందు జ్యోతిని పొందును.

శక్వరి శక్తి వలన ఎద్దుయొక్క ముందు భాగమును - బరువులు మోయుట, నాగలిలాగుటలు- కలుగును. అట్లే ఆవు యొక్క అధోభాగము - పాలు మున్నగునవి - కలుగును. ఇది తెలిసిన వానికి రెండును కలుగును.

**9.** మొదట దేవత పేరున్నది పురోను వాక్య. 'అగ్నిర్మూర్ధా దివః కకుత్'. ఇందు అగ్ని దేవత మొదట చెప్పబడినాడు. అందువలన అది పురోను వాక్య. ఈ ఋక్కు అప్పటికి పుట్టియున్న శత్రువును దూరము చేయును.

ఉత్తరార్థమున దేవత పేరుగలది యాజ్య. 'జిహ్వామగ్నే చకృషే హవ్య వాహమ్' ఇందు 'హవ్యవాహమ్' అనునది చివరన ఉన్నది. కావున ఇది యాజ్య. ఇది పుట్టబోవు శత్రువును నిరోధించును.

**10.** పురోనువాక్య యందు దేవతపేరు ప్రథమార్థమున వచ్చినది. భూలోకము స్వర్గమున కన్న ముందుది కదా! ఆ సాదృశ్యమున యజమానికి పురోనువాక్య వలన భూలోకమున ప్రతిష్ఠ కలుగును.

యాజ్య యందు దేవతపేరు ఉత్తరార్థమున ఉండును. స్వర్గము పైన ఉండునది కదా! ఆ సాదృశ్యమున యజమానికి యాజ్య వలన స్వర్గలోకము నందు ప్రతిష్ఠ కలుగును.

ఈ విషయములు గ్రహించిన వానికి ఉభయ లోకములు జ్యోతిష్మంతములు అగును.

**తస్మా త్పూర్వార్థేవావద్యా మ్యనక్స్య పదిష్టాల్లక్ష్మా యాజ్యా తస్మాజ్జఘనార్ధేన ధేనుర్య ఏ వం వేద భుక్త్యా ఏవమేతా**

(8వ మంత్రపు చివరి పరిచ్ఛేదము దీని అర్థము.)

**11.** ఆజ్యము వజ్రము. ఆజ్యభాగములు వజ్రము. వషట్కారము వజ్రము. ఈ త్రిగుణాత్మకమగు వజ్రమును ఆర్జించి అవిచ్ఛిన్నముగా శత్రువు మీద ప్రయోగించవలెను.

**12.** శత్రువును హింసించవలెనన్న వషట్కారమును బిగ్గరగా చదువవలెను.

**13.** 'అగ్నిర్మూర్ధా' గాయత్రి ఛందస్సు. ఇది పురోనువాక్య. 'భువోయజ్ఞస్య' త్రిష్టుప్ ఛందము. ఇది యాజ్య.

గాయత్రి బ్రాహ్మణునితో పుట్టినది. త్రిష్టుప్ క్షత్రియునితో పుట్టినది. కావున బ్రాహ్మణుని తరువాతనే క్షత్రియుడు అగుచున్నాడు. **"తస్మాద్బ్రాహ్మణో ముఖ్యో"** అందువలన బ్రాహ్మణుడు ముఖ్యుడు - మొదటివాడు - అగుచున్నాడు.

**14.** ఈ విషయములను గ్రహించిన వాడు ముఖ్యుడు - శ్రేష్ఠుడు - అగును.

**15.** పురోను వాక్య పఠించిన వాడు యజమానిని గురించి దేవతలకు వివరించి చెప్పినవాడు అగును.

యాజ్య పఠించిన వాడు యజమానికి దేవతల వద్దకు చేరు సరియైన మార్గము చూపిన వాడు అగును.

'వషట్' పఠించిన వాడు యజమానిని దేవతల వద్దకు చేర్చిన వాడగును.

**16.** పురోనువాక్య, యాజ్య, వషట్కారములు చదివిన అధ్వర్యుడు యజమానిని చేయిపట్టుకొని దేవతలకు అప్పగించి, అతనిని అక్కడ స్థిరపరచినవాడు అగును.

**17.** పురోనువాక్య మూడు పాదములు కలది. ఈలోకములు మూడు. దానిని అనుష్ఠించిన వాడు ముల్లోకములందు ప్రతిష్ఠ కలవాడు అగును.

యాజ్య నాలుగు పాదములది. దానిని అనుష్ఠించిన వానికి నాలుగు పాదముల జంతువులు కలుగును.

'వౌషట్' రెండు అక్షరములు కలది. యజమాని రెండు కాళ్లు కలవాడు. అతనికి పశువులు కలిగిన తరువాతనే ప్రతిష్ఠావంతుడు అగును.

**18.** పురోను వాక్య గాయత్రి ఛందస్సుది. యాజ్య త్రిష్టుప్ ఛందస్సుది. ఈ రెండు కలిసి సప్తపదాత్మక శక్వరి ఛందస్సు అగుచున్నది. దేవతలు ఈ శక్వరీ ఛందోయుక్త ఋక్కు వలననే సాధించదలచిన కార్యమును సాధించినారు.

ఈ విషయమును గ్రహించిన వాడు సాధించదలచిన కార్యమును సాధించగలడు.

**మూడవ అనువాకము**

**1.** ప్రజాపతి దేవతలకు యజ్ఞద్రవ్యములను పంచి ఇచ్చినాడు. ఆజ్యమును తన వద్ద ఉంచుకున్నాడు. అప్పుడు దేవతలు ప్రజాపతితో అన్నారు: -

"ఆజ్యమే యజ్ఞము అగుచున్నది. మాకు కూడ ఆజ్య యజ్ఞ భాగమును ఏర్పరచుము"

అప్పుడు ప్రజాపతి ఇట్లు అన్నాడు: -

"దేవతలారా! మిమ్ములను ఉద్దేశించి యజ్ఞము చేయువారు ఆజ్యభాగహోమములు చేయుదురు గాక. ప్రధాన హవిస్సు క్రింద ఉపస్తరణ చేసి పైన అభిఘారము చేయుదురు గాక."

**2.** 'హవిస్సులందు ఆజ్యము కాక ఇతరములు సారహీనములు అగుటకు కారణమేమి? ఆజ్యము సారవంతమగుటకు గల కారణమేమి?' అని వేదవిదులు చర్చించినారు. వారిలో ఒకడు ఆజ్యము ప్రజాపతి దేవతాకమనియు, ప్రజాపతి సారము క్షీణించని వాడనియు చెప్పినాడు.

**3.** గాయత్రి మున్నగు ఛందస్సులు 'మేము భాగరహితులమై మీకు హవిస్సులు పలుకము' అని దేవతల నుండి తొలగి పోయినవి. అప్పుడు హవిర్దానులగు దేవతలు ఛందసుల కొరకు 'చతురవత్తము'ను ఏర్పరచినారు.

పురోనువాక్య, యాజ్య, వషట్కార దేవతలకు చతుర వత్తమును హోమము చేయవలెను. అందువలన ఛందోదేవతలను సంతోషపెట్టిన వాడు అగును. సంతోషించిన ఛందస్సులు యజమాని హవిస్సులను దేవతలకు చేర్చును.

**4.** అంగిరోనామక ఋషులు స్వర్గమునకు వెళ్లుచుండిరి. వారు యజ్ఞమునకు అభిముఖముగ వచ్చినారు. అక్కడ వారికి పురోడాశము కూర్మరూపము దాల్చి పాకుచుండుట కనిపించినది అప్పుడు వారు "కూర్మరూపము దాల్చిన పురోడాశమా! నిన్ను ఇంద్రాది దేవతలలో ఒకరికి ఇత్తుము. నిలువుము" అన్నారు. కూర్మము వారి మాటలు విన్నది. కాని నిలువలేదు.

"కూర్మమా! నిన్ను అగ్ని దేవతకు ఇత్తుము. నిలువుము" అన్నారు ఋషులు. కూర్మము వారి మాటలు విన్నది. నిలిచినది. కావున అగ్ని దేవతాకమగు అష్టాకపాల పురోడాశమును అమావాస్య, పూర్ణిమలందు అచ్యుతముగా చేయవలెను. ఆ పురోడాశము స్వర్గలోక ప్రాప్తి కలిగించును

**5.** "పురోడాశమా! నీవు యజ్ఞభూమిని విడిచి ఏల పోవుచుంటివి?" అని ఋషులు పురోడాశమును అడిగినారు.

"ఋషులారా! నన్ను కాటుకచే అలంకరించలేదు. కందెనలేని బండివలె కాటుక లేని నేను నశించుచున్నాను" అని సమాధానము చెప్పినది.

కావున అగ్ని దేవతాకమగు పురోడాశమును హోమము చేయుటకు ముందు దాని పైనను, క్రిందను ఆజ్యముచే అలంకరించవలెను.

**6.** అన్ని కపాలములందలి పురోడాశమును యజమాని - తన చేయిచాచి - తాకవలెను. ఆ విధముగా చేసిన యజమానికి స్వర్గమునందు అన్ని పురోడాశములు లభించును.

**7.** పురోడాశము ఎక్కువ ఉడికిన రాక్షసులకు ప్రియమగును. ఉడకకున్న రుద్రునకు ప్రియమగును. చక్కగా ఉడికినది దేవతలకు ప్రియము అగును. కావున పురోడాశమును ఎక్కువ ఉడికించక ఉడుకకుండ ఉంచక చక్కగా ఉడికించవలెను. అది దేవతలకు ప్రియమగును.

**8.** నిప్పుల మీద కాల్చిన పురోడాశము గట్టిగా ఉండును. నిప్పులపై కాల్చి బూడిద కప్పిన పురోడాశము మాంసముగల ఎముకవలె ఉండును.

తదనంతరము దానిని దర్భలచే కప్పివేయవలెను. అప్పుడది కేశములతో కూడిన తలవలె ఉండును.

**9.** పురోడాశ హవిస్సు మంత్ర పూర్వకముగ పక్వమైనపుడు అది ఈ లోకమునకు చెందినది కాకుండును. పక్వమైన పురోడాశము మీద నేయి రాయకున్న దానికి స్వర్గప్రాప్తి కలుగదు. కావున ఉద్వాసన కాలమునందు సహితము పురోడాశమును ఆజ్యముచే అభిఘరించవలెను అందువలన అది దేవతలకు చేరును.

**10.** పురోడాశము ఉంచిన పాత్రలలో ఒకటి నశించినచో యజమానికి సంవత్సరమునకు ఒక మాసము చొప్పున ఆయుష్యము క్షీణించును. అతడు మరణించును. పురోడాశము ఉంచిన పాత్రలలో రెండు నశించినచో యజమానికి సంవత్సరమునకు రెండునెలల చొప్పున ఆయుష్యము క్షీణించును. అతడు మరణించును. కావున - యజమాని రక్షణకు గాను - కపాలములను చక్కగా లెక్కించి ఉద్వాసన చేయవలెను.

**11.** ప్రమాద వశమున ఉద్వాసన కాలమున కపాలములు నశించిన ప్రాయశ్చిత్తముగ అశ్వినీ దేవతాకమగు ద్వికపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. ద్యావా పృథ్వీదేవతాకమగు ఒక కపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను.

అశ్వినులు దేవతలకు వైద్యులు కదా! వారే యజమానికి చికిత్స చేయుదురు.

ద్యావాపృథ్వి సంబంధమగు కపాలము నశించినచో నిర్వాపము చేసిన ఏకకపాల పురోడాశము వలన యజమానికి ప్రతిష్ఠ కలుగును.

**నాలుగవ అనువాకము**

**1.** ఇది అనుమతి కోరునది. **'దేవస్యత్వాసవితుః ప్రసవే'** అనుచు 'స్ఫ్య' అను పని ముట్టును చేబట్టవలెను.

**'అశ్వినోర్బాహుభ్యామ్'** అశ్వినుల బాహువులతో అని చెప్పబడినది. ఏలననగా అశ్వినులు దేవతలకు అధ్వర్యులు కదా!

**'పూష్ణోహస్తా భ్యామ్'** పూషచేతులతో అనిచెప్పబడినది.

(ఇది తొలి కాండలోనే చెప్పినాము. త్రవ్వుగోల మున్నగు వానిని తీసికొనినప్పుడు అది అందుకున్న వానిని దేవతలు ఆవేశించినారని చెప్పుట.)

**2.** **'స్ఫ్యమా!** నీవు వందల పగవారలను వధించు దానవు. చెట్టునుంచి పుట్టిన దానవు. వైరి వధకు కారణమవు' అని చెప్పబడినది.

శత్రువును సంహరించ గోరుచు స్ఫ్యను వజ్రముగా భావించి వాడియగునట్లు పదును పెట్టవలెను

**3.** అధ్వర్యుడు పారక వంటి దర్భల కట్టను దుమ్ము సహితముగా పారవేయవలెను.

వేది ఎంతపరిమాణము గలదియో, నేల అంత మాత్రమే ఉపయోగించవలెను. దర్భల కట్టను పారవేయుట చేత వేది ఉన్నంత చోటునుండి శత్రువును తొలగించి నట్లగును. అందువలన భాగము కోరు శత్రువు తొలగిపోవును.

**4.** దర్భల కట్టను మూడుసారులు తీసివేయవలెను. ఏలననగా లోకములు మూడు కదా! అందువలన ముల్లోకముల నుండి శత్రువులను తొలగించినట్లు అగును.

**5.** అధ్వర్యుడు దర్భల కట్టను నాలుగవసారి కూడ తీసివేయవలెను. అందువలన ముల్లోకములకు ఆవలి ప్రదేశము నుండియే శత్రువులను తొలగించి నట్లగును.

**6.** అధ్వర్యుడు వేది కొరకు మట్టిని త్రవ్వును. ఆ మట్టిని తొలగించవలెను.

**7.** అధ్వర్యుడు నేలను త్రవ్వి మట్టి తీయును. అందువలన అచట మొలచిన గడ్డిగాదము తొలగిపోవును.

**8.** అధ్వర్యుడు త్రవ్వి మట్టి తీసిన చోట ఉన్న వ్రేళ్లను పెకిలించివేయవలెను. అందువలన శత్రువును పెకిలించినట్లగును.

**9.** వేదికి అవసరమగు స్థలమును మించి త్రవ్వరాదు. అట్లు త్రవ్వినఅది పితృదేవతాకమగును.
యజ్ఞమునకు సరిపోవునంత మాత్రము త్రవ్విన ఆది ప్రజాపతి స్వరూపమగును.
(అవసరమును మించి భూమిని కష్టపెట్టరాదని, నష్టపెట్టరాదని చెప్పుచున్నాడు.)

**10.** గట్టి నేలవరకు త్రవ్వవలెను. అందువలన యజమానికి ప్రతిష్ఠ కలుగును.
(గట్టినేల అంటకున్న కూలుటకు అవకాశమున్నది.)

**11.** భూమిని త్రవ్వునపుడు దక్షిణదిశ ఎత్తుగను, మిగిలినది పల్లముగను ఉండునట్లు త్రవ్వవలెను. అందు వలన అది దేవయజన రూపమగును.

**12.** వేద - యజ్ఞ - భూమిని మెత్తగా ఉండునట్లు చేయవలెను. అందువలన యజమాని సంతానవంతుడు, పశుమంతుడు అగును.

**13.** ఉత్తర పరిగ్రాహము చేయునపుడు వేది ఎంత పరిమాణముది అగునో నేల అంత పరిమాణముదే అగును. అందువలన ఆ ప్రదేశము నుండి శత్రువు తొలిగిపోవును. అప్పుడు ఉత్తర పరిగ్రాహము చేయవలెను.

(వేదికి హద్దులను ఏర్పరచుట ఉత్తర పరిగ్రాహము అగును.)

**14.** రాక్షసులు దూరమగుటకు గాను ప్రోక్షించు ఉదకములను స్ఫ్య యొక్క పై భాగమున ఉంచవలెను. ఆపః రక్షోఘ్నాః వై - నీరు రాక్షస సంహారకము కదా! యజ్ఞము నిర్విఘ్నముగా జరుగుటకు స్ఫ్య రేఖమీద నీరు చల్లవలెను.

**15.** నీరు చల్లునపుడు తాను ద్వేషించు పాపమును తలచుకొనవలెను. అందువలన యజమాని శుచివంతుడు అగును.

## అయిదవ అనువాకము

**1.** 'హవిస్సును జలముచేత ప్రోక్షించితివి కదా! ఎట్లు ప్రోక్షించితివి?' అని వేదవిదులు అడిగినారు.

'మంత్రముచేత' అని అధ్వర్యుడు చెప్పినాడు.

కావున జలముచేతనే హవిస్సును ప్రోక్షించవలెను. మంత్రముతోనే హవిస్సును ప్రోక్షించవలెను.

**2.** ఇధ్మా బర్హిస్సును ప్రోక్షించవలెను. అందువలన అవి రెండు పరిశుద్ధములు అగును.

**3.** వేది కఠినమైనది. లోమరహితము. అపరిశుద్ధము. అందువలన వేదిని నీటితో ప్రోక్షించవలెను. అప్పుడు అది పరిశుద్ధము అగును.

**4.** అధ్వర్యుడు వేది మీద బర్హిస్సు, దర్భలను పరచవలెను.

**'దివేత్వా'** అని దర్భల అగ్రభాగములను ప్రోక్షించవలెను.

**'అంతరిక్షాయత్వా'** అని మధ్యభాగమును ప్రోక్షించవలెను.

**'పృథివ్యైత్వా'** చివరలను ప్రోక్షించవలెను.

అందువలన ఈ బర్హిస్సును ముల్లోకములందు ప్రోక్షించి నట్లగును.

**5.** అధ్వర్యుడు భూమిని త్రవ్వుచున్నాడు. అందువలన అది క్రూరము ఎత్తుపల్లములు కలది అగుచున్నది. అందు వలన దానిని శాంతింప చేయుటకు నీరు పోయవలెను - చల్లుటకాదు.

**6.** బ్రహ్మ కాని యజమాని కాని వేదికి పూర్వభాగమున ప్రస్తరమును పెట్టవలెను. అది యజమానిని ముఖ్యమైన వానినిగా చేయును.

(ప్రస్తరము - దర్భలకట్ట.)

**7.** యజమాని ప్రజాపతి స్వరూపుడు అయినాడు. అధ్వర్యుడు యజమాని ముఖపు పరిమాణము గల ప్రస్తరమును వేది యొక్క పూర్వభాగమున పెట్టవలెను.

**8.** అధ్వర్యుడు వేది మీద దర్భలను పరచవలెను. పృథివి వేది. ప్రజలు దర్భలు. కావున భూమి మీద ప్రజలను ఏర్పరచినట్లగును.

**9.** అధ్వర్యుడు వేదిమీద బర్హిస్సును దట్టముగా పరచవలెను. అందువలన యజమానిని అత్యంత ప్రజావంతుని, పశువంతుని చేసిన వాడగును.

**10.** అధ్వర్యుడు వేదిమీద పరచిన బర్హిస్సు అగ్రభాగమున ప్రస్తరము ఉంచవలెను. ప్రజలు బర్హిస్సు, యజమాని ప్రస్తరము అగుచున్నాడు. అట్లు చేయుట వలన యజమానిని యజ్ఞము చేయని వానికన్న శ్రేష్ఠుని చేయుచున్నాడు.

అప్పుడు యజమాని అయజమానిని మించినవాడు అగును.

**11.** బర్హి, ప్రస్తరముల మధ్య రెండు దర్భలను - వ్యవధానము కొరకు - అడ్డముగా వేయవలెను

**12.** అధ్వర్యుడు ప్రస్తరమును నేతిలో తడుపవలెను. అందువలన అది హవిస్సు అగును. అది స్వర్గమునకు చేరును.

**13.** అధ్వర్యుడు ప్రస్తరమును మూడు మారులు నేతిలో ముంచవలెను. ఈ లోకములు మూడు కదా! అందువలన మూడు లోకములను ఘృతమున ముంచినట్లగును.

**14.** ఆహవనీయ అగ్ని యందు నిప్పు కణికలు ఉన్నప్పుడు ప్రస్తరమును నిప్పుకణికలందు కొట్టరాదు. అందువలన అది యజమానికి స్వర్గసాధకము కాకుండును. స్వర్గము పైన ఉన్నది కదా! అధ్వర్యుడు ప్రస్తరమును తనచేతి పైకి ఎత్తి అగ్ని పై భాగమును తాకించవలెను.

**15.** తాకించిన తరువాత అధ్వర్యుడు తనచేతిని కిందకు వంచవలెను. అందువలన యజమాని కొరకు అధోముఖ వర్షము కలిగించినవాడు అగును.

**16.** అధ్వర్యుడు ప్రస్తరాగ్రమును ఆహవనీయాగ్నిని అతిక్రమించునట్లు కొట్టరాదు. ప్రస్తరాగ్రమును ఆహవనీయాగ్నికి ఉత్తరమున ఉంచవలెను. అత్యగ్రప్రహరణము వలన అతివృష్టి కలిగి అధ్వర్యునకు వినాశకము అగును.

**17.** అధ్వర్యుడు ప్రస్తరమూలమును తూర్పుదిక్కున ఉంచి అగ్నిని కొట్టరాదు. అందువలన యజమానిని స్వర్గము నుంచి పడద్రోసినవాడగును.

**18.** అధ్వర్యుడు ప్రస్తరమును ప్రాచీనాగ్రముగ ఉంచి అగ్నిని తాకించవలెను. అందువలన యజమానికి స్వర్గము కలిగించినవాడు అగును.

**19.** అధ్వర్యుడు ప్రస్తరాగ్రములను చిందరవందరగా చేసి అగ్ని ప్రహారము చేయరాదు. అందువలన అధ్వర్యునకు స్త్రీ సంతానము (మాత్రమే) కలుగును.

**20.** అగ్నీధుడు ప్రస్తరమును దండాకారముగ ఉండునట్లు మెలిపెట్టవలెను. పురుషవ్యంజనము ఊర్ధ్వాకారము. అందువలన అతనికి పురుష సంతానము కలుగును

**21.** యజ్ఞాంగములందు ఏది యజమాన స్థానీయము? ఏది స్వర్గ ప్రాప్తి సాధకము? అని బ్రహ్మవాదులు అడిగినారు.

ప్రస్తరమను యజ్ఞాంగము యజమాని స్థానీయము. ఆహవనీయము స్వర్గము అని చెప్పబడినది.

కావున ప్రస్తరమును ఆహవనీయమున కొట్టవలెను. అది యజమానికి నిశ్చయముగ స్వర్గమును కలిగించును.

**23.** ఆహవనీయాగ్ని యందు ప్రస్తరముచే కొట్టునపుడు ప్రస్తరమూలము పైభాగమునకు ఎత్త బడును. దానివలన యజమాని అల్పుడగును. లేదా వ్యాధులచే కృశించును. కావున నేతితో తడిసిన ప్రస్తరము నుండి ఒక దర్భను తీయవలెను. శాంతి కొరకని దానితో ఆహవనీయాగ్ని యందు అనుప్రహరణము చేయవలెను.

**24.** యజమాని ప్రస్తరరూపుడు. ప్రస్తరప్రహరణ జరిగినది. అందువలన అతడు స్వర్గమునకు చేరినాడు. అప్పుడు అధ్వర్యుడు ఏకాకి అయినాడు. అతడు భయమున వడకినాడు.

కావున అధ్వర్యుడు 'ధ్రువాஉసి' అను మంత్రము చదివి భూమిని తాకవలెను. భూమి స్థిరమైనది కదా! అందువలన అధ్వర్యుడు భూమి మీద స్థిరపడును. భయము లేనివాడు అగును

**25.** అగ్నీ ధ్రుడా! అగాஉన్? యజమాని స్వర్గమునకు చేరినాడా? అనునది ప్రశ్న.

**"అగన్నగ్నిః"** అగ్నిస్వర్గమునకు చేరినాడు, అను సమాధానమైనచో స్వర్గరూపమగు అగ్నియందు అగ్నిని చేర్చినట్లు అగును. అప్పుడు యజమాని స్వర్గము నుండి తొలగించబడిన వాడు అగును.

కావున 'అగన్' వెళ్లెను అనియే సమాధానము చెప్పవలెను. అప్పుడు యజమానికి స్వర్గలోకము కలిగించినట్లగును.

**ఆరవ అనువాకము**

**1.** అగ్నికి ముగ్గురు అన్నలు ఉండిరి. వారు దేవతల కొరకు హవిస్సు వహించుచు మరణించినారు. దేవతలకు హవిస్సు వహించువాడు మరణించును అనుకున్నాడు అగ్ని. దేవతలకు కనిపించవలదు అనుకున్నాడు. వారికి కనిపించకుండ నీటిలో దాగినాడు.

దేవతలకు అగ్ని కనిపించలేదు వారు ఎంతో వెదికినారు. నీటిలోని చేప దేవతలకు అగ్ని ఉనికిని గురించి చెప్పినది.

చేప చెప్పిన విషయము అగ్ని తెలిసికొన్నాడు. 'చేపా! నా ఉనికి తెలియపరచినావు. నిన్ను జాలరులు పట్టి చంపుదురు గాక' అని శపించినాడు. అందువలన జాలరులు తమ ఇచ్చవచ్చినపుడెల్ల చేపలను పట్టుచున్నారు. చంపుచున్నారు.

అంతట దేవతలు అగ్నిని తమకొరకు హవిస్సులు వహించవలసినదని కోరినారు. అప్పుడు అగ్ని 'స్రుక్కులోనికి తీసికొనబడి' హుతము కాని హవిస్సు పరిధి బయట పడినప్పుడు అది మరణించిన తన అన్నల భాగము కావలెనని దేవతలను కోరినాడు. దేవతలు అగ్నికి ఆ వరమును ప్రసాదించినారు. అప్పటినుంచి హవిస్సు స్రుక్కులోనికి గ్రహించబడి హుతము కాక పరిధి బయటపడినది అగ్ని యొక్క అన్నల భాగము అయినది.

ఆ హవిర్భాగమున యజమాని అగ్ని భ్రాతలను సంతోషపెట్టినవాడు అగుచున్నాడు.

**2.** పరిధులకు ఆవలి భాగము అగ్ని అన్నలకు చెందినది అగును. కావున రాక్షస నాశనమునకు పరిధులను ఏర్పరచవలెను.

**3.** రాక్షసుల సంచారమును నిరోధించుటకై పరిధులను ఒకదానికి మరొకటి తాకునట్లు పరచవలెను.

**4.** తూర్పున పరిధులను పరచరాదు. సూర్యుడు తూర్పున ఉదయించి రాక్షసులను సంహరించును.

**5.** దక్షిణ, ఉత్తర భాగ పరిధులపైన రెండు సమిధలను ఉంచవలెను. అందువలన ఊర్ధ్వదిశన సహితము రాక్షసులను తొలగించినట్లగును.

**6.** ఉంచిన రెండు సమిధలందు ఒక దానిని సమంత్రకముగను, మరొక దానిని అమంత్రకముగను ఏర్పరచవలెను. అందువలన అవి స్త్రీ, పురుష సంకేతములై మిథునములు అగును.

**7.** యజమాని రెండు కాళ్లవాడు. కావున అతని ప్రతిష్ఠకు గాను రెండు సమిధలను వేయవలెను.

**8.** యజ్ఞకర్త హోమము చేయుచుండును. అప్పుడు హవిస్సు జారును. అగ్నికి ఇవతల పడును. అందువలన యజ్ఞమునకు విఘాతము ఏర్పడినట్లగును. అట్లగుట వలన యజమాని వినాశము వైపునకు సాగును. యజమాని ఆ విఘాతము నుండి ఎట్లు తప్పు కొనును? అతడు ధనవంతులందు ఎట్లు శ్రేష్ఠుడు అగును? అని కొందరు వేదవిదులు అడిగినారు. దానికి ఒక విద్వాంసుడు సమాధానము చెప్పినాడు: -

యజమాని 'భూపతయే స్వాహా' "భువనపతయే స్వాహా" 'భూతానాం పతయే స్వాహా' అను మూడు మంత్రములచే జారిపడిన హవిస్సును అభిమంత్రించవలెను. అందువలన యజ్ఞపు విఘాతము దూరమగును. యజమాని గొప్ప దేవతలను తృప్తి చెందించిన వాడు అగును.

**9.** అనుక్రమాగతములగు అగ్ని, అగ్నిసోమీయ పురోడాశములు కలవు. వాని వలన యజ్ఞమునకు ఆలస్యము జరుగుచున్నది. ఆలస్యనివారణార్థము - మిథునత్వ సాధనకును ఆగ్నేయ, అగ్నీషోమీయ పురోడాశములకు మధ్య ఉపాంశుయాగము చేయవలెను.

**10.** ఒకప్పుడు అగ్ని స్వర్గమునందు ఉండెను. యముడు భూమిపై ఉండెను. అందువలన భూలోకపు నరులకు వంటలు జరుగకుండెను. పితృదేవతలకు రాజు లేకుండ అయినాడు.

అప్పుడు దేవతలు అగ్ని యములకు స్థానవిపరివర్తన చేయ సంకల్పించినాడు. అన్నాద్యము నిత్తుమని వారు అగ్నిని భూమికి పిలిచినారు. పితృరాజ్యము ఇత్తుమని యముని స్వర్గమునకు పిలిచినారు. ఆ విధముగా ఉభయులకు స్థాన విపరివర్తనము జరిగినది.

యజమానులు స్విష్టకృదగ్ని కొరకు హవిర్భాగమును అవదానము చేయుదురు. దేవతలు ఆ హవిర్భాగమును అగ్నికి ఇచ్చినారు. స్విష్టకృదగ్ని కొరకు అవదానము చేసిన యజమాని రుద్రుడైన అగ్నిని సమృద్ధుని చేయును.

**11.** రుద్రుడు ఒక్కడే కదా! అందువలన అన్ని హవిస్సుల నుండి కొంచెము, కొంచెము అవదానము చేయవలెను. రుద్రునిది ఉత్తరదిశ. కావున హవియొక్క ఉత్తర భాగము నుండి అవదానము చేయవలెను. అందువలన యజమాని రుద్రుని అతని దిశయందే సంతోషపెట్టిన వాడగును.

**12.** చతురవత్త ప్రాప్తికి హవిస్సునందు రెండు సారులు అభిఘారము చేయవలెను.

**13.** పూర్వాహుతులు పశురూపలు. అగ్ని క్రూరస్వభావుడు. పూర్వాహుతులతో కలసినట్లు హోమము చేసిన పశువులను - వినాశమునకు - రుద్రునకు అర్పించినట్లగును. అప్పుడు యజమాని పశు శూన్యుడు అగును.

కావున పూర్వాహుతులను విడిచి కొంచెము దూరముగ యజ్ఞము చేయవలెను. అది పశురక్షణ కొరకు అగును.

## ఏడవ అనువాకము

**1.** మనువు భూమి మీద యజ్ఞద్రవ్యముల కొరకు అన్వేషించినాడు. అతనికి గోవు అడుగు పెట్టిన చోట ఆజ్యము కనిపించినది. ఈ ఘృతమును యజ్ఞమునందు కూడ వినియోగించుటకు ఎవడు అర్హుడు? అని మనువు అడిగినాడు.

గోవునకే యజ్ఞాంగత్వము కలిగించుటకు మేము సమర్థులము అని మిత్రావరుణులు అన్నారు. అట్లని వారు గోవును భూలోకమునకు తెచ్చినారు. ఆ గోవు అడుగుపెట్టిన చోటనల్ల ఘృతము వెడలినది. అందువలన గోవునకు 'ఘృతపది' అను పేరు కలిగినది.

ఇది ఇడారూపగోవు జన్మవృత్తాంతము.

**2.** పృథివితో సహ రథంతర సామము ఆహ్వానించబడినదని చెప్పబడినది. ఈభూమియే రథంతర సామము అయినది. ఈ భూమిని అన్నాద్యయుక్తముగా ఆహ్వానించుచున్నారు.

**3.** అంతరిక్షముతో సహ వామదేవ సామము ఆహ్వానించబడినదని చెప్పబడినది. పశువులే వామదేవ సామములు . అంతరిక్షముతో కూడ పశువులను ఆహ్వానించుచున్నారు.

**4.** ద్యులోకముతో కూడ 'బృహత్' సామము ఆహ్వానించబడినదని చెప్పబడినది. 'బృహత్' సామము వృష్టి సంబంధము. ద్యులోకముతో సహ వృష్టిని ఆహ్వానించుచున్నారు.

5. సప్తహోతలు ఆహ్వానించబడినారు అని చెప్పబడినది. అట్లగుటచే హోతలనే ఆహ్వానించుచున్నారు.

(1. హోత 2. ప్రశాస్త 3. బ్రాహ్మణాచ్ఛంసి 4. పోత 5. నేష్ట. 6. అగ్నీధ్రుడు. 7 అచ్ఛావాకుడు వీరు హోతలని అశ్వలాయనుడు చెప్పినాడు.)

6. ధేనువు సహితముగ వృషభము ఆహ్వానించబడినదని చెప్పబడినది. కావున మిథునమును ఆహ్వానించుచున్నారు.

7. సోమము భోజనమునకు మిత్రము. అది ఆహ్వానించబడినదని చెప్పబడినది. కావున సోమ పానమును ఆహ్వానించుచున్నారు.

8. ఆహ్వానించబడినది అని చెప్పబడుట వలన తననే - 'ఆత్మానమేవ' - ఆహ్వానించుచున్నారు.

9. ఆహ్వానించబడిన వాని నన్నింటిలో **ఆత్మావసిష్ఠః హి** - ఆత్మయే విశిష్టమైనది కదా!

10. ఇడను ఆహ్వానించుచున్నారు అన్నారు. ఇడ పశువులే అగును. కావున పశువులనే ఆహ్వానించినట్లయినది. పశువులు చతుష్పాత్తులు. కావున ఇడను నాలుగు సార్లు ఆహ్వానించవలెను.

11. తొలుత గోరూప ధారిణియైన ఇడను మనువు చూచినాడు. అందువలన అది 'మానవి' అయినది.

గోవు పాదము పెట్టిన చోట ఘృతము వెడలినది. అందువలన అది 'ఘృతపది' అయినది.

12. దేవతలు బ్రహ్మ ఉపాహ్వానము చేసినారని చెప్పబడినది. అందువలన బ్రహ్మ ఉపాహ్వానము చేయుచున్నారు.

13. దేవసంబంధ అధ్వర్యులు - మానవసంబంధ అధ్వర్యులు ఆహ్వానించబడినారు అని చెప్పబడినది. అందువలన దేవ, మానవ అధ్వర్యులను ఆహ్వానించుచున్నారు.

14. దేవాధ్వరులు, మానవాధ్వరులు ఈ యజ్ఞమును రక్షింతురు గాక. యజ్ఞకర్తకు అభ్యుదయము ప్రసాదింతురు గాక అని చెప్పబడినది. అది యజ్ఞమునకును, యజమానికిని ఆశీర్వాదము అగుచున్నది.

15. ద్యావాపృథ్వులు ఆహ్వానించబడినవి అని చెప్పబడినది. కావున ద్యావా పృథ్వులనే ఆహ్వానించుచున్నారు.

16. ద్యావాపృథ్వులు తొలుత పుట్టినవి అని చెప్పబడినది. అట్లనుట వలన ద్యావా పృథ్వులు ప్రాణిజాలము కన్న పూర్వము పుట్టినవి అగుచున్నవి.

ద్యావా పృథ్వులు దేవతా స్వరూపులనియు, దేవతలు పుత్రులుగా కలవనియు చెప్పబడినది. అట్లనుట వలన అవి దేవతాస్వరూపములు అయినవి. దేవతలు వాటికి పుత్రులు అయినారు.

**17.** **'ఉపహూతోఽయం యజమానః'** అనుట వలన యజమానినే ఆహ్వానించుచున్నారు.

**18.** ఉత్తర దేవయాగమునకు - అధిక హవిష్కరణమునకు - దేవతాస్థానములకు ఆహ్వానించబడినారని చెప్పబడినది. ఉత్తర దేవయాగము ప్రజ యగును. హవిష్కరణము పశువులు అగును. దేవతాస్థానము స్వర్గమగును.

**19.** ఈ కర్మను చేయ సంకల్పించినావు. సోమయాగ రూప కర్మను చేయ నిచ్చగించినావు అనుటవలన యజమాని యజ్ఞపు ప్రియధామమును ఆహ్వానించినట్లయినది.

**20.** ఈ యజమానికి ఇష్టమైన వారందరు ఆహ్వానించబడినారు అని చెప్పబడినది. కావున వైయర్థము లేని విధముగ యజమాని ఆహ్వానించబడినవాడు అగుచున్నాడు.

**ఎనిమిదవ అనువాకము**

**1.** పశువులు ఇడా స్వరూపలు. ఋత్విజులందు హోత మాత్రమే పశువులు కోరువాని కోరిక తీర్చగలడు. ఇతరులకు అది సాధ్యపడదు.

**2.** పురోడాశమా! నీవు వాచస్పతికై హుతమైనావు. నిన్ను నేను భక్షించుచున్నాను. అట్లనుట వలన వాచస్పతికి పురోడాశ భాగము ఇచ్చినట్లగును - సంతోషపెట్టినట్లగును.

సదస్పతికి హుతమైన నిన్ను స్వీకరించుచున్నాను. అట్లనుటవలన తన కొరకే స్వీకరించినట్లగుచున్నది.

**3.** హోత చేతియందు చతురవత్తము అగును. పశువు నాలుగు పాదములది. కావున హవిస్సును నాలుగు పర్యాయములు అవదానము చేయవలెను.

**4.** హోత దేవతారూపమగు ఇడను భక్షించరాదు. అందువలన అతడు మరణించును. అట్లుకాక ఇడా భాగమును అగ్నియందు హోమము చేయరాదు. అందువలన పశువులను రుద్రరూప అగ్నికి అందించినట్లగును. కావున పశు రహితుడు అగును.

ఆ దోష పరిహారమునకు **"వాచస్పతయేత్వాహుతమ్"** అని ముందు చెప్పవలెను. తరువాత భక్షించవలెను. అట్లనుట వలన ఇడ అగ్నియందు హుతమగుట లేదు. రుద్రునకు పశుసమర్పణ చేసినట్లు కాదు. యజమాని ఇతరులకై హుతమైన దానిని సేవించును. అందువలన అతనికి మరణ దోషము కలుగదు. ఈ భక్షించినది తన కొరకు అగుటకు **"సదస్పతయే త్వాహుతం ప్రాశ్నామి"** అనవలెను.

**5.** యాగోత్తరణ సమయమందు యజమాని సహితముగా అయిదుగురు ఋత్విజులు ఇడను భక్షించవలెను. అది ఋత్విజులకు దక్షిణ ఇచ్చుట వంటిది. యాగోత్తర సమయమునందే కదా దక్షిణ ఇచ్చునది!

**6.** యాగ మధ్యమందు ఇడను భుజించరాదు. అందు వలన యాగము విచ్ఛిన్నము అగును. ప్రస్తరమునందు నీళ్ళు చల్లి తుడువవలెను. **సత్యమాపస్సర్వా దేవతా ఆపః** - నీటి యందే సత్యము, నీటియందే సమస్త దేవతలున్నారు. అందువలన దేవతలే యజ్ఞమును విస్తరిల్లచేయుదురు.

**7.** దేవతలు యజ్ఞము చేసినారు. వారు యజ్ఞము నుండి రుద్రుని తొలగించినారు. అంతట రుద్రుడు యజ్ఞమును వికలము చేసినాడు.

అప్పుడు దేవతలు "మాయజ్ఞమును పరిపూర్ణము చేయించుము" అని రుద్రుని ప్రార్థించినారు. దేవతలలో కొందరు 'రుద్రుని ఆరాధించిన మన యజ్ఞము '**స్విష్టం భవిష్యతివై**' సంపూర్ణముగ 'ఆచరించనట్లగును' అన్నారు.

అందువలననే స్విష్టకృదగ్నికి 'సుష్ఠుగ చేయించువాడు' అను సార్థక నామధేయము కలిగినది. దేవతలు రుద్ర సంబంధియగు ఉపహత పురోడాశమును యవగింజంత మాత్రము అర్పించిరి.

**తస్మాద్యవ మాత్ర మవద్యేత్** - కావున యవ మాత్రమగు పురోడాశమును అవదానము చేయవలెను.

**8.** యవ గింజంతను మించి అవదానము చేయరాదు. అందువలన యజ్ఞమును భ్రాంతి కలిగించిన వాడగును.

**9.** పురోడాశ అవదానమునకు పూర్వము ఉపస్తరణ చేయరాదు. అభిఘారము చేయరాదు. అందువలన పురోడాశపు రెండు పక్కలకు సంశ్వాయి వ్యాధి కలిగించినవాడు అగును.

యజమాని రెండు కాళ్లవాడు. అట్లగుటవలన సకృదవదానము, సకృదభిఘారము **ద్విః సంపద్యతే** - ద్విత్వ సంపన్నము అగును.

**10.** అధ్వర్యుడు పురోడాశము నందలి ప్రాశిత్ర భాగమును బ్రహ్మకు అపమార్గముగా ఇవ్వరాదు. అందువలన యజ్ఞమందలి వికలము కాని భాగము సహితము వికలమగును. కావున దానిని ఎదుటనే ఇవ్వవలెను. అది స్వక్రమ మార్గమున ఇచ్చినట్లగును.

**11.** దేవతలు పూషదేవునకు ప్రాశిత్రమును ఇచ్చినారు. అతడు దానిని భక్షించినాడు. అందువలన అతని దంతములు రాలిపోయినవి. అప్పటినుండి పూషదేవతకు పిండితో చేసిన చరు భాగమైనది.

అప్పుడు దేవతలు పూష దంతరహితుడు - సమృద్ధిరహితుడు - ప్రాశిత్ర రహితుడు అనుకున్నారు. అట్లనుకొని దేవతలు ప్రాశిత్రము బృహస్పతికి అర్పించినారు. బృహస్పతి పూషవంటి పరిస్థితి తనకు కలుగునని భయపడినాడు.

(**లోకః** ప్రాశిత్రమ్ అని శతపథము. లోకములను తిను ప్రయత్నము ప్రమాదకరము కదా! ప్రాశిత్రమ్ అనగా తినదగినది కూడ అగును. తిను బండారము.)

**12.** అప్పుడు బృహస్పతి 'సూర్యస్య త్వా చక్షుషా ప్రతిపశ్యామి - సూర్యుని కంటితో నిన్ను చూచుచున్నాను - అను మంత్రమును ఆవిష్కరించినాడు. సూర్యుని కన్ను ఏదానిని హింసించదు కదా అనుకున్నాడు.

**13.** దేవతలనుండి ప్రాశిత్రమును స్వీకరించుచు బృహస్పతి భయపడినాడు. 'ప్రాశిత్రమా! నిన్ను సవితా దేవత అనుమతి వలనను, అశ్వినుల బాహువులతోను, పూష హస్తములతోను అందుకొనుచున్నాను' అన్నాడు.

సవితా దేవత అనుమతి వలన మంత్రపూర్వకముగ, దేవతలు అందించగా ప్రాశిత్రమును బృహస్పతి స్వీకరించినాడు.

**14.** బృహస్పతి ప్రాశిత్రము భక్షించు తనను బాధించునని భయపడినాడు. 'ప్రాశిత్రమా! నిన్ను అగ్ని ముఖముతో తినుచున్నాను. అగ్నిముఖము ఏదానిని హింసించదు కదా!' అన్నాడు.

ప్రాశిత్రము భక్షించు తనను అది బాధించునని బృహస్పతి భయపడినాడు. 'ప్రాశిత్రమా! నిన్ను బ్రాహ్మణుని ఉదరమున ఉంచుచున్నాను. బ్రాహ్మణుని ఉదరము ఏదానిని హింసించదు కదా! అన్నాడు.

బృహస్పతి వేదవిదుడు కదా!

**15.** ప్రాశిత్రము తిన్న వాని నుండి ప్రాణములు తొలగిపోవును. కావున శిరసు మొదలుకొని సర్వాంగములను నీటితో మార్జనము చేసికొనవలెను. ప్రాణాది స్థానములను తాకవలెను.

ప్రాణములు అమృతములు. ఉదకములు అమృతములు. కావున అవి యథాస్థానమున నిలిచి ఉండును. వదిలిపోవు.

**తొమ్మిదవ అనువాకము**

**1.** అగ్నీధ్రుడు అగ్నీధ్రము నందు సమిధను వేయవలెను. అందువలన అతడు ఋతువులను సంతోషపెట్టిన వాడగును.

**2.** తదుపరి అనుయాజాహుతులను ప్రతిష్ఠించవలెను. అందుకు అగ్నీధ్రుడు సమిధను అగ్ని యందు వేయవలెను. అది సమిధాగ్ని యందు హోమము చేసినట్లగును.

**3.** అగ్నీధ్రుడు పరిధులను శుభ్రముగా తుడువవలెను. అందువలన పరిధులను పునీతము చేసినట్లగును.

**4.** ఒక్కొక్క పరిధిని తుడువవలెను. అట్లయినచో యజ్ఞము పరాగ్భూతము వంటిది అగును కదా!

**5.** మూడు పరిధులను తుడిచి అగ్నిని కూడ తుడువవలెను. అప్పుడు సమ్మార్గములు నాలుగు అగును. పశువులు నాలుగు కాళ్లవి కదా! అందువలన యజమానికి పశువులు కలుగును.

**6.** బ్రహ్మన్ప్రస్థాస్యామః - బ్రహ్మ! బయలు దేరుచున్నాము అని మంత్రము చెప్పినది.

బ్రహ్మ నిలిచిన చోటినే యజ్ఞము ఆశ్రయించి ఉన్నది. యజ్ఞము ఆశ్రయించిన చోటునుండియే అనుయాజ యాగమును ఆరంభించవలెను.

**7.** అధ్వర్యుడు అనూయాజమునకు బ్రహ్మ అనుమతి కోరును. అప్పుడు బ్రహ్మనోటి మాటతో అనుమతినిచ్చిన అతనికి కంపనరోగము కలుగును. తలపంకించి అనుమతించిన శిరో రోగము కలుగును. మాట్లాడకున్న యజ్ఞము జరిగినట్లు కాదు. 'ప్రతిష్ఠేత్యేవ బ్రూయాత్' 'ప్రతిష్ఠ' అనియే అనుమతించవలెను. యజ్ఞము మంత్రమును ఆశ్రయించి ఉండును. అందువలన 'బ్రహ్మ' మంత్ర వాక్కు చేతనే యజ్ఞమునకు అనుమతించినట్లగును.

**8.** "బ్రహ్మన్ప్రత్యాస్యామః" అని అధ్వర్యుడు బ్రహ్మను అనుమతి అడుగును. అప్పుడు బ్రహ్మ 'సవితృదేవా! ఇతడు అనుమతి కోరినాడు' అని చెప్పవలెను. అట్లని మంత్రము చెప్పినది.

బృహస్పతి బ్రహ్మస్వరూపుడు. అతడు మంత్రవేత్తలందు శ్రేష్ఠుడు.

బృహస్పతీ! నీవు అటువంటి వాడవు. నీవు యజ్ఞమును రక్షింపుము. యజ్ఞపతిని రక్షింపుము. అని మంత్రము యజ్ఞము కొరకును, యజమాని కొరకును కోరినది.

అట్లనుట వలన బ్రహ్మ తనకొరకును, యజమాని కొరకును బాధలు కలుగనట్టి ఆశీస్సులు కోరినవాడు అగుచున్నాడు.

**9.** 'దేవతల కొరకు యాగము చేయుము' అని అందరు వినునట్లు చెప్పవలెను.

**10.** దేవతలు యాగము చేయుటకు సిద్ధపడినారు. 'అనుయాజ యాగమునకు దేవత ఎవరు?' అని బ్రహ్మవాదులు అడిగినారు.

గాయత్రి, త్రిష్టుప్, జగతీ ఛందస్సులని సమాధానము.

కావున ఛందోదేవతలను గూర్చి అధ్వర్యుడు యాగము చేయవలెనని చెప్పవలెను.

బ్రాహ్మణములే ఛందస్సులని చెప్పబడినవి. కావున బ్రాహ్మణముల నుద్దేశించియే యాగము చేయవలెను.

**11.** దేవతలు అగ్ని, ప్రజాపతి మొదలగు దేవతలను గూర్చి యాగములు చేసినారు. అంతట అగ్ని ప్రజ్వలించలేదు. అప్పుడు వారు అనుయాజన ఆహుతులందు అగ్నిని దర్శించినారు. కావున అనుయాజలను అనుష్ఠించవలెను. అది అగ్నిని చక్కగా ప్రజ్వలింప చేసినట్లగును.

12. ఏతదుడు అను అసురుడు ఉండెను. అతడు యజ్ఞపు సూక్త వాకమునందలి 'ఆయురాశాస్తే సుప్రజాస్త్వ మాశాస్తే' అను ఆశీస్సును తన పరము చేసికొన్నాడు.

'ఏతదు ద్యావాపృథివీ భద్రమభూత్' అను మంత్రమును ఆ విధముగా ఉచ్చరించినచో అధ్వర్యుడు యజ్ఞసంబంధ ఆశీస్సులను రాక్షసపరము చేసిన వాడగును.

కావున అధ్వర్యుడు 'ఇదం ద్యావాపృథివీ భద్రమభూత్' అనునది చదువవలెను. అందువలన యజ్ఞ సంబంధ ఆశీస్సు యజమానికి చెందును.

('ఏతద్' 'ఇదం' రెండింటి మధ్య భేదము గమనించవలెను.)

13. 'ఇదం ద్యావాపృథివీ' యందు 'ఆర్మసూక్తవాక' మును 'ఉతనమోవాకమ్' అను వాక్య ద్వయము నిక్షిప్తము. సమృద్ధి పొందితిని అని ఈ మంత్రము చెప్పుచున్నది.

('అయం యజమానః శ్రద్ధాలుః' వంటివి సూక్తవాకము. 'నమో దేవేభ్యః' అనునవి నమోవాకములు.)

14. 'ఉపశ్రితః ద్యావాపృథివీ' అను సూక్తవాకము నందు భూమి మీద అగ్నియు, ద్యులోకమున ఫలము ఉన్నవని చెప్పబడినది.

15. యజమానీ! నీవు చేయు ఈ యజ్ఞమునందు ద్యావా పృథ్వులకు రక్షణ కలుగును గాత అను దానిని ఆశీస్సుగనే కోరుచున్నాడు.

16. 'సూపచరణా'కు మారుగా 'సూపావసానా' అనియు 'స్వధిచరణా' కు బదులు 'స్వధ్యవసానా' అనియు పలుకరాదు. అట్లు పలికిన యజమానికి మరణము కలుగును. అప్పుడు అతడు భూమికి చెందినవాడు అగును.

కావున స్వధిచరణా - భూమి ఎంతో ఆశ్రయించ తగినది అనియు సూపచరణా - ద్యులోకము ఎంతో సేవించదగిన దనియు వచించవలెను. అందువలన అధ్వర్యుడు యజమానికి గోప్రచార భూమిని కోరిన వాడు అగును. యజమానికి మరణము కలుగదు.

17. ఇంతకు ముందు 'ద్యావాపృథ్వుల అనుమతి వలన అగ్ని హవిస్సును సేవించినది' అని చెప్పబడినది.

ఏ దేవతలను గురించి ఈ యాగము చేసినామో వారికి సమృద్ధి కలిగించినాము, అని ఇప్పుడు చెప్పబడుచున్నది.

18. ఆశీస్సులు కోరునపుడు యజమాని పేరు నిర్దిష్టముగ చెప్పకున్న ఆ ఆశీస్సులు ఇతరులకు చెందును.

ఈ యజమాని అని అతని పేరు చెప్పుట వలన అది ఆ యజమానికే చెందును. అతనికి స్వర్గ ప్రాప్తి కలుగును.

**19.** ఈ యజమానికి ఆయుష్యము కోరుచున్నాను. ఈ యజమానికి సంతానము కోరుచున్నాను అనుట వలన అది యజమాని కోరినట్లే అగును.

**20.** ప్రాణములు జీవాత్మకు సజాతీయములు. కావున "సజాతవనస్యామాశస్తే" అనుట వలన ప్రాణములకు అంతరాయము కలుగదు.

**21.** అగ్నిదేవుడు దేవతలనుండి తెచ్చి యజమానిని ఫలవంతుని చేయుచున్నాడు. హోత్రాదులమగు మేము అగ్ని అనుగ్రహమున మానవులకు ఫలము అందించుచున్నాము అనునది మంత్రార్థము. కావున అగ్ని దేవతల కొరకు యాచించుచున్నాడు. హోతలమగు మేము మనుష్యుల కొరకు యాచించుచున్నాము అన్నట్లయినది.

**22. ఇహగతిర్వామస్యేదంచ నమో దేవేభ్యః ఇత్యాహ యాశ్చైవ దేవతా యజతి యాశ్చన తాభ్య ఏ వోభయీభ్యో నమస్కరోత్యాత్మనోఽనార్త్యై.**

ఈ యజ్ఞకర్మయందు ధనమునకును, హవిస్సులు అందుకొను దేవతలకు నమస్కారము అని మంత్రము. అందువలన యాగమునందు ఉద్దిష్టులైన దేవతలకును ఉద్దిష్టులు కానివారికిని - బాధలు కలుగకుండుటకు - నమస్కరించుచున్నాను అన్నట్లు అయినది.

## పదవ అనువాకము

**1.** దేవతలు యజ్ఞము యొక్క హవిస్సును తమకు సొంతము చేయువానిని కానరైరి.వారు బృహస్పతి కుమారుడగు శంయుని - యజ్ఞమునందలి తమ హవిర్భాగములను "స్వగాకురు" మాకు స్వంతము చేయుము అని కోరినారు. శంయు అందుకు ప్రతిఫలము కోరినాడు: -

బ్రాహ్మణనియుక్తుడు కానివాడును, శ్రద్ధలేనివాడును చేయు యాగఫలము తనకు చెందవలెను అను వరము కోరినాడు. దేవతలు అతనికి ఆ వరము ఇచ్చినారు. కావున బ్రాహ్మణనియుక్తుడు కాని వాడును, శ్రద్ధలేని వాడును చేయు యాగ ఫలము శంయునకు చెందుచున్నది.

తదుపరి తన కుమారునకు ఏమి వరము ఇత్తురని దేవతలను అడిగినాడు. పాపము చేసిన వానిని దండించు అధికారమును శంయుని పుత్రునకు ఇచ్చినారు.

బ్రాహ్మణుని కొట్టుటకు నియుక్తుడగు వానికి శతనిష్క దండమగును. బ్రాహ్మణుని కొట్టిన వానికి సహస్ర నిష్క దండమగును. బ్రాహ్మణుని రక్తము వచ్చునట్లుగా కొట్టువాడు భూమి యందుగల పరమాణువులన్ని సంవత్సరములు భూమినంటియే ఉండును. పితృలోకమునకు చేరడు.

కావున బ్రాహ్మణుని అధిక్షేపించరాదు. కొట్టరాదు. రక్తము కారునట్లు చేయరాదు. అందువలన అతడు పాపము చేసినవాడు అగును.

**2.** యజ్ఞము యొక్క ప్రశస్త ఫలమును శంయుని నుండి కోరుచున్నాము అని **తచ్ఛంయోరావృణీమహే** అను మంత్రము చెప్పుచున్నది. అందువలన అధ్వర్యుడు యజ్ఞ ఫలమును దేవతలకు 'స్వగాకరోతి' స్వంతము చేయుచున్నాడు.

**3.** 'తచ్ఛంయో' మంత్రమున అధ్వర్యుడు బృహస్పతి కుమారుడగు శంయుని సమృద్ధుని చేయును.

**4.** **గాతుం యజ్ఞాయ గాతుం యజ్ఞపతయే ఇత్యాహ** - యజ్ఞగమనమునకును యజ్ఞపతి గమనమునకు అని మంత్రము చెప్పినది.

ఇది ఆశీర్వచనము అగును.

**5.** 1. సోమదేవతాక హోమము చేయవలెను. అందువలన సోముడు రేతోరూపము ధరించును. 2. త్వష్ట దేవత హోమము చేయవలెను. అందువలన అతడు రేతస్సును వివిధ రూపములు ధరించునట్లు చేయును. 3. దేవపత్నుల హోమము చేయవలెను. అందువలన మిధునత్వ లాభము కలుగును. 4. గృహపతియగు అగ్ని హోమము చేయవలెను. అందువలన ప్రతిష్ఠ కలుగును.

(ఇది పత్నీ సంయాజ విధాయక మంత్రము.)

**6.** ప్రయాజలు ఆజ్యముతోనే, పత్నీ సంయాజలు ఆజ్యముతోనే యజించబడును. అందువలన ఆలస్యము జరిగినట్లగును. ఆలస్య దోష నివారణార్థమును, మిధునత్వ సిద్ధి కొరకును ఋక్కును ఉచ్చరించి, ఋక్కుతో హోమము చేయవలెను.

**7.** దర్శపూర్ణయాగము పంచ సంఖ్యాత్మకము. ఆద్యంతము లందు పంచసంఖ్య కలది అగుచున్నది. ముందు అయిదు ప్రయాజ హోమములు చేయబడును. చివరన నాలుగు పత్నీసంయాజలు, అయిదవదగు సమష్టి యజువు యజించబడుచున్నవి. కావున పంచ సంఖ్యతో మొదలై పంచ సంఖ్యతో సమాప్తము అగుచున్నది.

## పదకొండవ అనువాకము

**1.** అగ్నీ! ఇది ప్రసిద్ధకర్మ. అశ్వస్వామి అశ్వములను సమకూర్చును కదా! అట్లే నీవు ఈ యజ్ఞమునకు ఆహ్వానించ దగిన దేవతలను చేర్చుము. నీవు ప్రాచీన హోతవుగా ఈ యజ్ఞప్రదేశమున ఆసీనుడవు అగుము.

**2.** అగ్నిదేవా! మా అభీష్టములను గ్రహించుము. దేవతలకు ఎదురేగుము. వారికి యజమాని హవిస్సులు అర్పించుచున్నాడని చెప్పుము. మా కోరికలన్నియు ఫలించునట్లు చేయుము.

**3.** అగ్నీ! నీవు యువతముడవు. బలప్లుతుడవు. దేవతలను ఆహ్వానించువాడవు. నీవే సత్యవంతుడవు. అందువలన యజ్ఞసాధనము అగుము.

**4.** జ్వలించుచున్న ఈ అగ్ని శత, సహస్ర అన్నములకు ప్రభువు. అతడు మకుటాయమానుడు. విద్వాంసుడు. ఈ అగ్ని ధనదాత అగును గాత.

**5.** అగ్నీ! నీవు అంగసౌష్ఠవము కలవాడవు. దేవతలను ఆహ్వానించు ఋత్విక్కులతో కూడినవాడవు. వ్రడంగి రథచక్రనేమిని - తన వశమున ఉంచుకొని - తిరుగునట్లు చేయును. అట్లే నీవు యజ్ఞమును స్వవశమున ఉంచుకొనుము. ఇచటికి చేర్చుము.

**6.** అగ్నీ! నీవు వివిధరూపములవాడవు. దేవతలు సర్వత్ర స్ఫురించువారు. కోరికలు తీర్చువారు. వారిని మేము వేద మంత్రములచే స్తుతించుచున్నాము. మాస్తుతులను ఆయా దేవతలకు చేర్చుము.

**7.** అగ్ని సర్వజ్ఞుడు - సర్వసేనాసమేతుడు. అతనికి తెలియక ఏ వ్యవహారమును నిర్వర్తించజాలము.

**8.** పాలు చేపుచున్న గోవులు దూడలను వీడవు కదా! అట్లే సమస్త దేవతలు మమ్ము విడువకుందురు గాత.

**9.** అతడు మాతో సమానుడు. దుష్టబుద్ధి కలవాడు. మమ్ము ద్వేషించువాడు. మాకు విరోధి. అయినను తరంగము వలన నావకు నష్టము కలుగనట్లు - మాకు అతని వలన హాని జరుగదు.

**10.** అగ్నిదేవా! మానవులు నీ శక్తికి నమస్కరించుచున్నారు. కావున అపకారము తలపెట్టిన వానికి వ్యాధులు కలిగించుము. నాశనము చేయుము.

**11.** అగ్నీ! మేము గోవులతో కూడిన ఇష్టిని చేయ తలపెట్టినాము. అందుకొరకు ధనమును వృద్ధి చెందించుము. నీవు అన్నింటిని పెంచగలవాడవు. మాకర్మ ఫలమును పెంపొందించుము.

**12.** అగ్నీ! నీవు మాకు అందించునట్టి మహాధనమున బరువులు మోయు ఎద్దులు ఉండవలెను. అంతే కాని పరాభవ కారణములు ఉండరాదు. నీవు మరల మరల ఎన్నో మారులు తెచ్చి మా ధనమును పెంచుచుండుము.

**13.** ఈ రోగబాధ లన్నింటిని మా శత్రువులకు కలిగించుము. వారిని కదలనివ్వకుము. వారి రోగములను పెంచినట్లు మా బలములను వర్ధిల్లచేయుము.

**14.** వికలము కాని యజ్ఞము నిర్వహించువాడును నమస్కరించువాడును అగు యజమాని హవిస్సును అగ్ని స్వీకరించును. అట్టి యజమానిని ఈ అగ్ని ధనాదికములను వృద్ధి చేసి రక్షించుచున్నాడు.

**15.** అగ్నీ! నీవు పవిత్ర యజ్ఞములకు అధిష్ఠాతవు. అట్లయ్యు మాకు ఎదురుగా విచ్చేయుము. మా దుఃఖములను తుడిచివేయుము. మా బంధువులను కూడ రక్షింపుము.

**16.** అగ్నీ! లోకమున ముందు తండ్రి రక్షణలు తెలిసికొన్న విధముగ నీ రక్షణలు తెలిసికొన్నాము. అందువలన నీవు సంపాదించిన సుఖములను అనుభవించుచున్నాము.

**17.** అగ్నీ! నీవు క్రూరుడగు రాజువలె హంతకులను హతమార్చువాడవు. వాడి కొమ్ముల మృగము వలె దావాగ్నివై వనములను కాల్చుచున్నావు. అందువలననే శత్రుపురములను దహించువాడవు అయినావు.

**18.** మిత్రులారా! అగ్ని మీకు అభీష్టములు ప్రసాదించును గాత.

అగ్నిక్షితులందు వరిష్ఠుడు. బలమును నశింపచేయని వాడు. స్వయముగా బలవంతుడు. మీరు కూడ అగ్నిని స్తుతించండి.

**19.** అగ్నీ! నీవు కోరికలు తీర్చువాడవు. ఫలములను ఆర్జించుచున్నావు. యజమానికి ఇచ్చుచున్నావు. నీవు ఈశ్వరుడవు. పృథివీరూపమగు వేదిమీద ప్రజ్వరిల్లుచున్నావు.

**20.** ప్రజాపతే అనుపదము **ప్రజాపతే నత్వ దేవతాన్యన్యః** అను ప్రజార్థ హవిస్సునకు పురోనువాక్య. సంతాన కామియైనవాడు ప్రజాపతి దేవతాకమగు చరును నిర్వాపము చేయవలెనని విధించుచున్నది.

**'పవేద'** అనునది **'పవేద పుత్రః పితరమ్'** అను యాజ్యకు ప్రతీక.

**'సోమాపూషణా'** యనునది పశ్వర్థమగు హవిస్సు యొక్క పురోనువాక్యకు ప్రతీక.

**'ఇమాదివా'** అనునది **'ఇమో దివా జాయమానా'** అను యాజ్యకు ప్రతీకము.

### పన్నెండవ అనువాకము

**1.** అగ్నీ! మేము పితృదేవతలను పూజించదలచినాము. నిన్ను ఆహ్వానించుచున్నాము. పితృదేవతలను పూజించదలచినాము. నిన్ను ప్రజ్వలింప చేయుచున్నాము. నీవు పితరులను యజింపుము. యజమాని పితృదేవతలను హవిస్సులు అందుకొనుటకు ఆహ్వానించుము.

**2.** సోమదేవా! నీవు మేధోవంతుడవు. సర్వము తెలిసిన వాడవు. చక్కని మార్గమును చూపువాడవు. పితృదేవతలు నిన్ను సేవించుచున్నారు. నీవలననే వారు దేవతల మధ్యన నిలిచినారు. రుచికర హవిస్సులను అందుకొనుచున్నారు.

3. సోమమా! నీవు పవిత్రము చేయువాడవు. నీవు మా పూర్వజులగు పితృదేవతలను అనుగ్రహించినావు. అందువలన వారు కర్మలను ఆచరించినారు. ఆ కర్మఫలములను అనుభవించుచు ధీరులై ఉన్నారు. నీవు సహితము వాయువును అపేక్షించకుము. హవిస్సులు ఆరగించుము. అశ్వసహితుడవై పరిధులవంటి ఆటంకములను పడగొట్టుము. మఘవాభవానః - మాకొరకు ధనపతివి అగుము.

4. సోమదేవా! నీవు పితృదేవతలతో ఉన్నవాడవు. వారితో సంభాషించువాడవు. ద్యావా పృథ్వులను విస్తారపరచిన వాడవు. "తస్మై తఇన్దో హవిషావిధేమ" అటువంటి సోమదేవతకు హవిస్సులు అర్పించుచున్నాము. మేము ధనపతులము అగుదుముగాక.

5. అగ్నిష్వాత్త పితరులారా! మేము మిమ్ము పూజించుచున్నాము. మా యజ్ఞమునకు విచ్చేయండి. ఆత్మీయమగు స్థానమును అలంకరించండి. మేము ఎంతో ప్రయత్నించి ఆర్జించిన హవిస్సులను స్వీకరించండి. తదుపరి ధనవంతుడు, కర్మకుశలుడగు పుత్రుని ప్రసాదించండి.

(ఇహలోకమున యాగాదులు చేయక పితృలోకమునకు చేరినవారు అగ్నిష్వాత్తులు.)

6. బర్హిషద పితరులారా! మేము మీ తరువాతి వారలము. మమ్ము రక్షించండి. మీ కొరకు హవిస్సులు సిద్ధము చేసినాము. రక్షణలతో రండి. హవిస్సులను ఆరగించండి. సుఖించండి. మాకు సుఖములు, దుఃఖరాహిత్యము, పాపరాహిత్యము కలిగించండి.

(ఇహలోకమున యాగములు చేసి పితృలోకమునకు చేరినవారు బర్హిషదులు.)

7. నేను యజమానిని. పితరుల విషయమున భక్తి శ్రద్ధలు కలవాడను. నాయజ్ఞము అంతట వ్యాపించి ఉన్నది. ఆటంకములు ఎరుగకున్నది. బర్హిషదులారా! ఈ యజ్ఞమునకు విచ్చేయండి. సోమముతో సమమగు రుచిగల హవిస్సును ఆరగించండి.

8. పితృదేవతలు మమ్ము అనుగ్రహించువారు. వారి కొరకు యాగార్హము, తృప్తికరములగు హవిస్సులు ఏర్పరచినాము. వారిని ఆహ్వానించుచున్నాము. వారు రావలెను. మాస్తోత్రములు వినవలెను. యజమానిని 'భేష్' అనవలెను. ఆ పితృ దేవతలు మమ్ము రక్షింతురుగాక.

9. తక్కువ పితరులు ఉత్తమ హవిస్సులు అందుకొందురుగాక. ఉత్తమ పితరులు ఉత్తమ హవిస్సులు అందుకొందురుగాక. మధ్యమ పితరులు ఉత్తమ హవిస్సులు అందుకొందురుగాక.

ఆ పితరులు మా మీద అనుగ్రహము కలవారు. తోడేళ్లవలె పీక్కొని తినువారుకారు. యజ్ఞము - సత్యమును బాగుగా ఎరిగిన వారు. వారు మా ప్రాణరక్షణకు విచ్చేసినారు. వారందరిని మేము ఆహ్వానించినాము. వారు మమ్ము రక్షింతురుగాక.

**10.** ఈ యజమాని పుట్టక ముందుండిన అన్నలు పితృపితామహులు పితృలోకము చేరినారు. ఇతడు పుట్టిన తరువాత తమ్ములు, స్వపుత్రాదులు పితృలోకము చేరినారు. వారందరు ఈ కర్మయందు హవిస్సులు అందుకొనుటకు విచ్చేసినారు. ధన సమృద్ధి కలిగిన బంధువులు పితృరూపులై వచ్చియున్నారు. వారలందరకు నమస్కరించుచున్నాను.

**11.** అగ్నీ! పూర్వకాలమున మా కన్న ఉత్కృష్టులు ఉండిరి. వారు పురాతనులు. మా పితరులు. వారు యజ్ఞఫలములను అనుభవించినారు. పరిశుద్ధమగు స్థానమునకు చేరినారు. మేము వారిని విశేష స్తోత్రములచే స్తుతించుచున్నాము. అందువలన మేము సహితము పరిశుద్ధమగు స్థానమును పొందగలముకదా!

ఆ పితృదేవతలు ఆకలిని జయించినారు. తేజోరూప దేవతలందు చేరినారు.

**12.** అగ్నీ! నీవు కవ్యవాహనుడవు. యజ్ఞ వర్ధకులగు పితృదేవతలకు కవ్యము వహించుచున్నావు. అట్లే దేవతలకును, పితరులకును హవిస్సులు వహించుము.

(హవ్యము దేవతలకు ఇచ్చునది. కవ్యము పితృదేవతలకు ఇచ్చునది.)

**13.** జాతవేద అగ్నీ! నిన్ను యజమాని స్తుతించినాడు. నీవు అతని హవిస్సులను పరిమళభరితము చేసినావు. తీసికొని పోయినావు. పితరులకు ఇచ్చినావు. ఆ పితృదేవతలు నీవు ఇచ్చిన స్వధాకార హవిస్సులను ఆరగింతురు గాక.

అగ్నీ! నీవు కూడ - మేము ఎంతో ప్రయత్నించి - సమకూర్చిన హవిస్సును స్వీకరించుము.

**14.** ఇంద్రుడు మాతలి రథసారధిగా కలవాడు. అతడు కవ్యయుతులగు పితృదేవతలతో కూడ వర్ధిల్లుచున్నాడు. యముడు అంగిరులను పితృదేవతలతో కూడ వర్ధిల్లుచున్నాడు. బృహస్పతి ఋక్కులచే ప్రతిపాదించబడిన పితృదేవతలతో కూడ వర్ధిల్లుచున్నాడు.

దేవతలు పితృదేవతలను - పితృదేవతలు దేవతలను వర్ధిల్లచేయుచున్నారు.

దేవతలు 'స్వాహా' కారముతోను, పితరులు 'స్వధా' కారముతోను తృప్తి చెందుచున్నారు.

**15.** యమదేవా! అంగిరులను పితృదేవతలతో కలసి ఈ యజ్ఞమునకు విచ్చేయుము. ఇచట ఆసీనుడవగుము. విద్వాంసులు మంత్రములు చదివి నిన్ను స్తుతించుచున్నారు. ఆలకించుము. గ్రహించుము.

యమరాజా! ఈ హవిస్సులు అందుకొనుము. ఆనందించుము. ఈ యజమానిని ఆనందపరచుము.

**16.** యమదేవా! అంగిరులు యజ్ఞయోగ్యులు. వివిధ రూపములవారు. వారితో కూడి విచ్చేయుః ఈ యజ్ఞము నందు యజమానిని సంతోషపరచుము.

యమరాజా! నీ తండ్రి యగు సూర్యుని ఈ యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాను. సూర్యు యజ్ఞమునకు వచ్చి, ఆసీనుడై యజమానిని సంతోషపరచును గాత.

**17.** మా పితృదేవతలు అంగిరసులగుదురు. అథర్వాణులగుదురు. భృగువులు అగుదురు. వా సోమార్హులు. యజ్ఞయోగ్యులు. వారు ఎల్లప్పుడు కొత్తవారివలె ప్రీతిని కలుగచేయుదురు.

వారి అనుగ్రహము మాకు కలుగును గాత.

వారు మాకు మంగళప్రదులు అగుదురు గాత.

**విద్వాంసుడు, బహుభాషావేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటకక బాలసాహిత్యకారుడు, విమర్శకుడు, చలనచిత్ర రచయిత, వ్యాసకర్త, అనువాదకుడు, ప కార్మికోద్యమనేత, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రగతిపథగామి, ప్రసన్నుడగు దాశరథి రంగాచా విరచిత శ్రీమదాంధ్ర వచన కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత యందలి రెండవకాండ సమాప్తము.**

94512